పింగళి సూరనామాత్యకృత

రాఘవ పాండవీయము

టీకా తాత్పర్య సహితము

వ్యాఖ్యాత :

అష్టావధాని

డా॥ రేవూరు అనంతపద్మనాభరావు

రాఘవ పాండవీయము

మలి ముద్రణ : 2018

వెల : రూ. 250/-

డి.టి.పి.

టి. రాజేంద్రప్రసాద్

సెల్: 9989890588

ముద్రణ:

అక్షయ గ్రాఫిక్స్

చిక్కడపల్లి, హైదరాబాద్

సెల్ : 9989890588

E-mail : rajendratammisetty1@gmail.com

విషయసూచిక

ఉపోద్ఘాతము

పింగళి సూరన కవితా కౌశలము

కాలనిర్ణయము : పింగళి సూరన క్రీ.శ. 1560 సం॥ ప్రాంతమువాడని కందుకూరు వీరేశలింగం పంతులు నిర్ణయించారు. సూరన కళాపూర్ణోదయమును క్రీ.శ. 1610 సం. ప్రాంతమున రచించి వుండవచ్చునని బ్రహ్మయ్యశాస్త్రి వాదము. ఈ కవి 1542–1600 మధ్య జీవించెనని పి. దక్షిణామూర్తి అభిప్రాయము. ఇతడు 16వ శతాబ్ది ఉత్తరార్థంవాడు కావడంవల్ల రాయల అష్టదిగ్గజ కవులలో ఒకడనుట పొసగదు. ఈ రాఘవ పాండవీయము క్రీ.శ. 1575 ప్రాంతములో రచించి యుండవచ్చునని ఆచార్య ఎస్.వి. రామారావు అభిప్రాయపడ్డారు.

పింగళి వంశము : సూరన గౌతమ గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు. తండ్రి అమరన. తల్లి అబ్బమ. ఇతనికి ఇద్దరు తమ్ములు – అమరన, ఎర్రన. వీరి పూర్వులు పింగళి గ్రామంలో నాలుగు తరాలుగా చిరకాలవాసం చేశారని "తరముల్ నాల్గయి" అనే ప్రభావతీ ప్రద్యుమ్న పీఠికలో పద్యంవల్ల తెలుస్తున్నది. గోదావరీ మాండలిక పదాల వాడుకను బట్టి ఈతడు మధ్యాంధ్ర మండలం నుంచి తరువాత దక్షిణానికి వచ్చి కృష్ణా జిల్లా నిడుమానూరు అగ్రహారంలో నివసించాడని "శిల్ప ప్రభావతి" అనే సిద్ధాంత గ్రంథంలో డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అభిప్రాయపడ్డారు.

సూరన తన చరమదశలో ఒకనాటి కడప మండలంలోని కృష్ణరాయ సముద్రములో నివసించెను. 1910లో కృష్ణరాయ సముద్రము (కానాల) కర్నూలు జిల్లాలోని కోయలకుంట్ల తాలూకాలో చేర్చారు. సూరన ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని ఇక్కడే వ్రాసి శేషజీవితము గడిపి వుండవచ్చు. కళాపూర్ణోదయమును కృతినందిన నంద్యాల తిమ్మరాజు విజయనగరాధిపతియైన సదాశివరాయల కాలము నాటివాడు.

పింగళి గొంకనామాత్యుడు 'పేకి' అనే ఒక గంధర్వకాంతను దాసిగా నేలాడని సూరన అవతారికలో వివరించాడు. గొంకనకు సంతానం లేదు. ఆయన భార్య సూర్యదేవతారాధన చేసింది. ఆమెకు కలలో ఒక బ్రాహ్మణుని రూపంలో సూర్యుడు వచ్చి ఒక దొండ చెట్టును ఇచ్చి, ఇది శాఖోపశాఖలైనట్లు మీ వంశం కూడ పెరుగుతుందని ఆశీర్వదించాడు. అదే విధంగా గోకనమంత్రి వంశమువారు నాలుగైదు తరములు 'పింగళి' గ్రామంలో నివసించారు. వారు గౌతమీ పరిసరాలలోను, కృష్ణా పరిసరాలలోను జీవించి తరువాత పాకనాటికి చేరారు.

రచనలు :

1) ప్రభావతీ ప్రద్యుమ్నము :

సూరన తన రచనలుగా ప్రభావతీ ప్రద్యుమ్నములో – గరుడ పురాణము, రాఘవ పాండవీయము, కళాపూర్ణోదయములను పేర్కొన్నాడు.

"జనముల్ మెచ్చగ మున్ రచించితి నుదంచద్వైఖరిన్ గారుడం
బును, శ్రీ రాఘవపాండవీయము, కళాపూర్ణోదయంబున్ మతిన్
దెనుఁగుం గబ్బము లెన్నియేనియును మత్పిత్రాదివంశాభివ
ర్ణన లేమిం బరితుష్టి నాకవి యొనర్పం జాల వత్యంతమున్"

ఈ నాలుగు రచనలేగాక గిరిజా కళ్యాణమును గూడ రచించినట్లు రంగరాట్ఛందములో ఒక పద్యము ఉదాహరింపబడినది. గరుడపురాణము, గిరిజా కళ్యాణము నేడు అలభ్యములు. ప్రభావతీ ప్రద్యుమ్నము ఒక ప్రబంధము. ఇది తండ్రి అయిన అమరనకు అంకితమిచ్చెను. ప్రభావతీ ప్రద్యుమమును – The Demon's daughter - A love story from South India – అనే పేర వెల్చేరు నారాయణరావు, డేవిడ్ షుల్మన్‌లు 2006లో ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించారు.

2) కళాపూర్ణోదయము :

ఈ ప్రబంధాన్ని సూరన నంద్యాల కృష్ణమరాజునకు అంకితమిచ్చాడు. కథాకథనంలో ఆధునిక నవలవలె కల్పన చేశాడు సూరన. కట్టమంచి రామలింగారెడ్డి వంటి విమర్శకులు దీనిని బహుధా ప్రశంసించారు. పాశ్చాత్య దేశాలలో 16వ

శతాబ్ది ఉత్తరార్థంలో ఇంగ్లండులో షేక్స్పియర్, ఫ్రాన్స్‌లో రబెల్లో, ఇటలీలో ఆర్లండో మొదలైనవారు సూరనకు సమకాలికులు. అత్యపూర్వ కథా సంవిధాన మహనీయము, శృంగారప్రాయము, పుణ్యవస్తు వర్ణనాకర్ణనీయము అయిన కళాపూర్ణోదయాన్ని సూరన రచించాడు. తాను రచించిన గ్రంథాలను గూర్చి ప్రభావతీ ప్రద్యుమ్నములో ఇలా ముచ్చటించాడు.

3) రాఘవ పాండవీయము :

రాఘవపాండవీయము అనే ద్వ్యర్థి కావ్యాన్ని సూరన యువకుడుగా ఉన్నపుడు రచించాడు. వేములవాడ భీమన ఇతః పూర్వము రెండర్థముల కావ్యము వ్రాసినాడని చెప్పెదరేగాని అది లభ్యము గాదు. ద్వ్యర్థి కావ్యరచనలో సూరనయే ప్రథముడు. ఆ తరువాత రామరాజభూషణుడు హరిశ్చంద్ర నలోపాఖ్యానమును రచించెను. నెల్లూరు వీరరాఘవకవి యాదవరాఘవపాండవీయమను త్ర్యర్థి (మూడు) కావ్యముగూడ ప్రసిద్ధము.

"వినయభయ భక్తికంబులగు మధురభాషణంబుల నిజాభిలాషంబు తెఱంగెఱింగించినఁ దాను దదీయంబులగు నతిమాత్ర గౌరవ సంభవనాది విశేషంబులం బ్రీతిచేతస్కుండై యునికింజేసి శక్యాశక్యవిచారంబు లేక యంగీకారభంగీ తరంగితంబగు నంతరంగంబుతో నతని నభివీక్షించి" అని సూరన పీఠికలో చెప్పుకొన్నాడు. (పీఠిక 14).

ఇందులో సూరన తన వినయభయభక్తులను ఆకువీటి తిమ్మరాజు నోట పలికించాడు. అతడు ప్రత్యక్ష నియామకుడు. ప్రోత్సహించినవాడు.

"చాటు ప్రబంధ రచనా
పాటవ కలితుడవు శబ్ద పరిచితియందున్
మేటివి దీనిందెనుఁగున
పాటించి రచింప నీవ ప్రౌఢుడ వరయన్" (పీఠిక. 12)

మరో మాట గూడ అన్నాడు : "నీకు దక్షత వుంది. మనస్సులో ఫలాపేక్ష

ఘనంగా లేదు. నీవు లలాటేక్షణభక్తశీలుడవు. ఈ కావ్యాన్ని శ్రీ విరూపాక్షుని కంకితంగా వ్రాయుమని కోరాడు – తిమ్మరాజు.

సూరన పూర్వ కవిస్తుతిలో వాల్మీకి వ్యాసులను, నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలను భారత రామాయణాలు వ్రాసిన ఆంధ్ర కవులను పేర్కొన్నాడు. తిమ్మరాజు ప్రోత్సహం తన వెన్నుతట్టగా రచన కుపక్రమించాడు.

"రాఘవ పాండవీయ కథ రమ్యముగా నొక కావ్యసృష్టి నా
హా! ఘటియింపగా వశమె యాంధ్ర కవీంద్రులకైన దావక
శ్లాఘనపూర్వకోక్తి యవిలంఘ్యము గావున కోవిదానుకం
పాఘన బుద్ధి జూపెదఁ జమత్కృతిమత్కృత్యమున్"

తాను ఒక ఘనకార్యాన్ని తలపెట్టాడు.

శ్లేష వైచిత్రి :

ఈ కావ్యంలో తాను ఎన్ని రకాల శ్లేషలను వాడబోతున్నాడో సూరన వివరించాడు. (1) ఆంధ్ర భాషా సంస్కృతాభిభాషాశ్లేష (2) ఉచిత శబ్దశ్లేష (3) అర్థశ్లేష (4) ముఖ్య గౌణవృత్తి శ్లేష (5) శబ్దాన్వయ శ్లేష (6) అర్థాన్వయ శ్లేష. ఈ ఆరు రకాల శ్లేషలను సూరన వాడుకొన్నాడు.

పాఠకులకు కవి మరొక నియమం పెట్టాడు.

"ఒక కథ వినియెడి తఱి వే
ఱొక కథపై దృష్టి యిడిన నొకయర్థముఁ దోఁ
పక పోవుఁగాక నేకా
ర్థక కావ్యమెట్లట్ల వినఁగఁదగు నొకటొకటిన్"

ఇది చక్కని వివరణ. కావ్యం చదివేటప్పుడు రామాయణార్థంలో చదువుకొంటూ వెళ్లాలి. ఆ తర్వాత భారతార్థం. రెండింటిని కలగాపులగం చేయగూడదు.

(1) ఆంధ్రభాషా సంస్కృతాభిభాషాశ్లేష :

ఒక భాషలోని పదం విరుపుతో తెలుగులో ఒక అర్థము, సంస్కృతంలో మరొక అర్థము కలుగుతాయి.

కం. వినియతనిందనపై నిడుకొని యే
గి నియమికి తగిన ఘోరార్తి యొన
ర్చిన వాడు మీకు దండ్యుడ
ననితను దెలుపుచు వారికప్పన సేసెన్ (ప్రథమా 28)

భారతార్థం : పాండురాజు – వినియత నిందనపైనిడుకొని=మిక్కిలి నియతమైన అపకీర్తిని తనపై నిడుకొని అని అర్థం.

రామాయణార్థం : విని, అతనిన్, తనపై నిడుకొని

(2) ఉచితశబ్ద శ్లేష :

ఇది సభంగ శ్లేష. మాటలను రెండు రకాలుగా విడగొట్టడం. ఒక భాషలోని మాటలను అదే భాషలో విరవడం.

"చలింపన సుతతోగ్రార్తి కోర్వకయతివరుండు

చలింపన్ అసు+తత్+ఉగ్రార్తి – అని భారతార్థం.

చలింపన్+అసుతతా+ఉగ్రార్తి అని రామాయణార్థం

మరొక ఉదా : ఏనుంగని కరమరయక

రామా : ఏనుంగు+అని, కరము+అరయక

భారత : ఏనున్+కనికరము+అరయక

ఏనుగు అని భావించి దశరథుడు ముని బాలకునిపై బాణం వేశాడు. నేను దయ లేకుండా మునిపై బాణం వేశానని పాండురాజు – ఇది భాషాద్వయ సభంగ శ్లేష.

(3) అర్థ శ్లేష :

నానార్థాలు వచ్చే పదాలను ప్రయోగించడం.

మునియుగము దుఃఖించె తుదన్ -

ఇక్కడ యుగము అంటే ఆయువు, మరొక అర్థము - రెండు ఆయువు రామాయణార్థంలో.

(4) ముఖ్యగౌణ వృత్తి శ్లేష :

ప్రసిద్ధమైన అర్థంతోబాటు, మరొక అర్థాన్ని సాధించడం.

'భీమ' అనే పదానికి భీముడు అని గాక భయంకర - అని చెప్పడం.

ధృతరాష్ట్ర - అనే పదానికి రామాయణార్థంలో ధృత=ధరించబడిన, రాష్ట్రుడు=రాష్ట్రముగలవాడని అర్థం. భారతార్థంలో ధృతరాష్ట్రుడు.

(5) అర్థాన్వయ శ్లేష :

అర్థాన్ని వేర్వేరుగా అన్వయించడం.

ఉదా : "కన్య కల ననవాలు దూపుల జయించె అలరారు అతను జయశ్రీల వరించి"

రామా : కన్య=అంటే ప్రౌఢ కానిది, కలనన=యుద్ధములో

భారత : కన్యకలన్=కన్యలను.

(6) శబ్దాన్వయ శ్లేష :

పదాలను వేర్వేరుగా అన్వయించడం.

"వాలుతూపుల జయించె - అలరారు నతను జయశ్రీల వరియించి"

రామా : జయించె అను పదం వరియించె - అనే పదంతో అన్వయం.

భారత : జయించె అను పదం అలరారుతో అన్వయం.

ఇప్పటి వరకు జరిగిన పరిశోధన :

పింగళి సూరన రచనలపై ఇంతవరకు ఎన్నో పరిశోధనలు జరిగాయి. "తెలుగులో అనేకార్థక కావ్యాలు – రాఘవ పాండవీయము" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి పర్యవేక్షణలో 1996లో పింగళి జగన్నాథరావు పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. "సూరన రచనల"పై ఆచార్య దివాకర్ల వెంకటావధాని పర్యవేక్షణలో 1977లో జి.ఆర్. రామకృష్ణ డాక్టరేట్ పొందారు. "అనేకార్థక కావ్యాలలో సూరన రామరాజభూషణుల తారతమ్య పరిశీలన"పై తూమాటి దొణప్ప పర్యవేక్షణలో నాగార్జున విశ్వవిద్యాలయంలో 1988లో పి. శ్రీనివాసాచారి పి.హెచ్.డి. పట్టా పొందారు. సూరన ఇతర రచనలపై పలువురు వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు గావించారు.

సూరన శైలీ పరిణామము :

ప్రభావతీ ప్రద్యుమ్నంపై పరిశోధన చేసిన డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి సూరన శైలీపరిణామాన్ని ఇలా విశ్లేషించారు :

"సాధారణముగ కవి నిశ్చేతనుడు కాడు. పరిణామశీలి. ఒరపిడి పెట్టిన కొలది కత్తి పదునెక్కినట్లు అభ్యాసము, అనుభవము, పరిశీలనము అనునవి వ్యక్తిలో క్రమవికాసమును కలిగించును. కవి, విమర్శకుడు అయిన సూరన మేధో సంస్కృతుల ప్రభావమున కవిత్వ కళ, శైలి తీగ పందిరిని ఆక్రమించుకొన్నట్లు అభివృద్ధి చెందినది" అన్నారు.

రాఘవ పాండవీయం భాషా కావ్యమని సూరన పేర్కొన్నాడు. చతుర్థాశ్వాసంలో కృష్ణాంగద రాయబారములకు సంబంధించిన పద్యాలు సులభ శైలీ శోభితాలు, నిశితభావ సమన్వితాలు. "కళాపూర్ణోదయము నాటికి సూరన శైలిలో స్పష్టమైన మార్పు వచ్చినది. అచ్చమైన కావ్యము గనుక కేవలశబ్దము నిరుపయోగము. కృత్రిమ పదజాలమునకు తావుండదు. భాషాసౌకుమార్యము, భావనైశిత్యము, ఊహావైచిత్రి, వాక్యచమత్కృతి అర్థసంపద మొదలైన లక్షణములు సూరన శైలిని అలంకరించినవి"

"ప్రభావతీ ప్రద్యుమ్నము నాటికి సూరన కవితా శైలి పండిన పసుపు వంటిదైనది. పదునారవ శతాబ్దపు శిల్పకళవలె చూడముచ్చటైనది. శబ్దప్రయోగము, నుడికారపు సొంపు, సంభాషణా చాతుర్యము, కథాకథనము – వీనిలోని ముడులు వీడి కావ్యము పులుగడుగంగబడ్డ "ముత్య"మైనది. సంపూర్ణ శ్లేషకావ్యమును రచించిన సూరన, కళాపూర్ణోదయములో తొంబది పాళ్లు తగ్గించి, ప్రభావతీ ప్రద్యుమ్నములో ఆ శ్లేషను దాదాపు అమావాస్యనాటి చంద్రుని చేసినాడు". అంటారు రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు.

విశ్వనాథ సత్యనారాయణగారు సూరనను ఇలా విశ్లేషించారు. ప్రభావతీ ప్రద్యుమ్న పీఠికలో (ఎమెస్కో ప్రతి) :

"ఆంధ్ర వాఙ్మయమున అంతకు పూర్వము కానరాని ద్వ్యర్థి కావ్య నిర్మితికి సూరన రాఘవ పాండవీయము తలమానికము. రెండవది యగు కళాపూర్ణోదయము అపూర్వ చిత్రశిల్పకల్పనలతో అలరారు 'నవల' అనదగిన చమత్కార కథాబంధుర ప్రబంధము. ఇక మూడవదగు ప్రభావతీ ప్రద్యుమ్నము రససమంచితమైన నాటక ముద్రగల ప్రబంధరాజము. "ఇందలి ఐదాశ్వాసములను ఐదంకము లనవచ్చును".

ఖండవల్లీ లక్ష్మీరంజనంగారు సూరనను గూర్చి లక్ష్మీరంజన వ్యాసావళిలో ఇలా విశ్లేషించారు.

"రాఘవపాండవీయము సూరనగారి కవితాప్రాహ్ణమునందును, కళాపూర్ణోదయమువారి కవితామధ్యాహ్నమునందును, ప్రభావతీప్రద్యుమ్నము కవితా పరాహ్ణమునందును రచింపబడినవి. మొదటి రెండు కావ్యములు నరాంకితములు. చివరి కావ్యము పితృపూజకై సమర్పింపబడినది".

వ్యాసుని ఆఖ్యాన వరిష్ఠతాలక్షణాన్ని సూరన ఆకళింపు జేసుకొన్నాడు. తెలుగులో స్వతంత్రంగా సంకీర్ణమైన బృహత్కథగా కళాపూర్ణోదయాన్ని చెప్పిన ఆంధ్ర ఆఖ్యావరిష్ఠుడు పింగళి సూరన. అందుకే కట్టమంచి రామలింగారెడ్డి వంటి విమర్శకుల ప్రశంసలను కళాపూర్ణోదయం అందుకొంది.

రాఘవపాండవీయములోని మృగయావర్ణన కాళిదాసు శ్లోకమునకు అనువాదమువలె కన్పించును.

“పరిచయం చలలక్ష్యనిపాతనే
భయరుషోశ్చ తదంగిత బోధనం
శ్రమజయాత్ ప్రగుణంచ కరోత్యసౌ
తనుమతోనుమతః సచివైర్యయౌ”

– కాళిదాసు

సూరన పద్యం – రాఘవ పాండవీయంలో –

చ. శ్రమ ముడుగుం దనూజడిమజారుఁ జలాచలలక్ష్యభేదన
క్రమము లెఱుంగ వచ్చు మదిఁ గాన బడుం బరజాతి భీతికో
పముల విచేష్టితంబు లవి భావమునం దలపోసి యన్నిచం
దములఁ బ్రియంబె యంచు నరనాధుడు వేఁటకు నుద్యతాత్ముడై –

(ప్రథమాశ్వాసం – 15)

అయోధ్యా హస్తినాపుర వర్ణనములను సూరన జోడించినాడు. అక్కడ నిరుపయోగములగు వర్ణనలను చేయలేదు.

రామాయణ భారతకథలలో సామాన్యాంశాలను స్వీకరించి సూరన శ్లేషార్థముతో కావ్యము నడిపినాడు. అవసరమగునపుడు కొన్ని వర్ణనలను సహజ సుందరముగా చేసినాడు. రామపాద పరాగము సోకినంతనే అహల్య నిజరూపంతో రాముని ముందు నిల్చున్నది. రామలక్ష్మణులను చూచుటతోడనే తన పూర్వ విషయము జ్ఞప్తికి వచ్చినది. అది ఆమె మనస్సును కలచివేసింది. రాముడు, విశ్వామిత్రుడు తన ముందున్నారు. అప్పుడామె స్థితిని సూరన ఇట్లు వర్ణించినాడు :

సీ. ఆలీల నలరుచు నరుగునప్పుడు తత్పు
రస్ఫూర్తి మిగులఁ జిత్రం బొనర్చె
రమణీయ మైనయా రామపాదపరాగ
మాశాపవారణ మాచరింప
నాయతివసుశోభ నాకృతియును సర
సీకృతమానస ప్రీకలనయు
ఘననవరత్నకాంచన ధామశోభన
వన్యాభరణవైభవస్ఫురితయు
తే. విపులతరపయోధర పదవ్యతిక్రమ
కరనవాంశుకాంతవరణ నిరతి
శయ సమున్నతియునునయి వారలందరు
గౌరవమున తన్ను గనుగొనంగ (ద్వితీయ. 38)

అహల్య అలా వారి ముందు నిలిచింది. ఆమె తొట్రుపాటును కవి వివరించాడు.

ఒకే పద్యంలో రౌద్ర కరుణరసాలను చూపడం సూరన ప్రతిభకు నిదర్శనం.

కం. తన కారుణ్యము మిక్కిలిఁ
గనుదా మరగమిఁ దలిర్పఁగా గ్రక్కున లే
చి నిజాసనార్ధ భాగం
బునఁ దనయున్నతగభీరమూర్తి నునుచుచున్. (తృతీయ. 84)

రామాయణార్థంలో రౌద్రరసము : రామలక్ష్మణులచే శూర్పణఖ పడిన భంగపాటును చూచిన తోడనే రావణుడు కనులెఱ్రనజేసి సింహాసనము నుండి లేచి తొట్రుపాటు గదురు శౌర్యోద్రేకమును చూపి అర్ధాసనమున కూర్చుండినాడు. భారతార్థమున ఇంద్రుడు తన కుమారుడగు అర్జునుని విజయవార్త విని దయ

తొంగలించు చూపులతో అతనిని గౌరవించి తన అర్ధాసన మతనికిచ్చినట్లు కరుణ రసోద్దీపనము చేయబడినది.

సూరనను గూర్చి బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు కళాపూర్ణోదయ పీఠికలో (ఎమెస్కో ప్రచురణ) ఇలా పేర్కొన్నాడు :

"సూరన, కవి, కథకుడు. చిత్రకారుడే కాదు. అసాధరణమైన సంస్కృతాంధ్ర పాండిత్యంతో 'రాఘవ పాండవీయ'మనే మొట్టమొదటి ద్వ్యర్థి కావ్యాన్ని తెలుగులో వ్రాసిన 'సాహిత్య ఫహిల్వాన్".

జాతీయముల ప్రయోగము : పాఠకుల ఆనందము కొరకు సూరన భాషా జాతీయములైన వాడుక పదాలను సందర్భోచితంగా వాడాడు. చతుర్థాశ్వాసములో ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే అందరు మూర్ఛిల్లారు. హనుమంతుడు సంజీవనిని తెచ్చి అందరినీ బ్రతికించి అస్త్రాన్ని వ్యర్థపరచాడు. ఈ సందర్భంలో –

"– ఏమని పొగడగ వచ్చు నారాయణ మహాస్త్ర వైభవము" అను చోట 'నారాయణ!' అనే సంబోధన వాడబడింది. జనసామాన్యంలో 'నారాయణ! నారాయణ!' అనే పదం వాడుకలో వుంది. అలానే 'శ్రీరామరామ' అనే పదము భారతార్థంలో రామరామ! అనే వాడుక పదంగా భావించాలి.

అలంకారాలు : క్లిష్టమైన ద్వ్యర్థి కావ్యమే అయినా అలంకారాలు కూడా సందర్భోచితంగా సూరన చిత్రించాడు. అట్టి వాటిలో వృత్త్యనుప్రాసము, ఛేకానుప్రాసము, ఉపమాలంకారము, సంబంధాతిశయోక్త్యను ప్రాణితహేతూత్ప్రేక్ష, సావయవ రూపకాను ప్రాణితవస్తూత్ప్రేక్ష, ఉల్లేఖాలంకారము, చపలాతిశయోక్తి, పర్యాయోక్తి, రూపకము, అనుజ్ఞ, అన్యోన్యాలంకారము, వినోక్తి, నిరుక్తి, అర్థాంతరన్యాసము, అనుగుణము ప్రధానములు.

వస్తు ధ్వని, కైశికాది వృత్తులు, ద్రాక్షాదిపాకములు ప్రకరణోచితముగా, రసోదయానుకూలముగా సహృదయహృదయైకవేద్యముగా కవి రచించాడు.

ఛందో వైవిధ్యము :

సూరన 4 ఆశ్వాసాల కావ్యంలో మొత్తం 638 గద్యపద్యాలు రచించాడు. అందులో చతుర్థాశ్వాసంలోనే 265 గద్యపద్యాలున్నాయి. శార్దూల, మత్తేభ, చంపక, ఉత్పలమాలలతో బాటు కంద, తేటగీతి, ఆటవెలదులను వాడాడు. విశేష వృత్తాలు – ఉత్సాహ 7, స్రగ్ధర 3, మహాస్రగ్ధర, మాలిని, రగడ, స్రగ్విణి, తరలము, మత్తకోకిల, కవిరాజ విరాజితము, కలహంస, వనమయూరము వంటి విశేష వృత్తాలు పొందుపరచాడు. 92 సీసాలు సమకూర్చాడు. సీసంలో ఎక్కువ భావం జొప్పించడానికి వీలు పడుతుంది. రాఘవ పాండవీయంలో పీఠిక 48, ప్రథమాశ్వాసము 79, ద్వితీయాశ్వాసము, 120 తృతీయాశ్వాసము 146, చతుర్థాశ్వాసము 265 గద్యపద్యాలున్నాయి. ద్వితీయాశ్వాసంలో వసంతాగమనాన్ని సుదీర్ఘమైన రగడ 'పొలిచె మధులక్ష్మి'లో వర్ణించాడు.

సమానాంశాలు :

భారత రామాయణ కథలను జోడించడం చాలా నేర్పుతో సూరన నిర్వహించాడు. కథలోని ఆయువు పట్టులైన భాగాలను ఏరి నాలుగు ఆశ్వాసాలలో 590 పద్యాలలో రామభారత కథలు జోడించడం కత్తి మీది సాము వంటిది.

భారతము	**రామాయణము**
1. పాండురాజునకు పుత్రులలేమి	1. దశరథునకు పుత్రుల లేమి
2. పాండురాజునకు శాపము	2. దశరథునకు శాపము
3. పాండవుల జననము	3. రామలక్ష్మణాదుల జననము
4. అర్జునుని మత్స్యయంత్ర ఛేదనము	4. రాముని శివధనుర్భంగము
5. పాండవుల అరణ్యవాసము	5. శ్రీరాముని అరణ్యవాసము
6. అర్జునునిపై ఊర్వశిమోహము	6. రామునిపై శూర్పణఖ మోహము
7. కృష్ణరాయబారము	7. అంగద రాయబారము
8. పాండవ కౌరవ యుద్ధము	8. రామరావణ యుద్దము
9. ధర్మరాజు పట్టాభిషేకము	9. శ్రీరామ పట్టాభిషేకము

ఈ విధంగా సమాన ఘట్టాలు జోడించి కథను నడిపించాడు కవి.

రాఘవ పాండవీయ ముద్రణలు

1895 సంవత్సరంలో దీని తొలిముద్రణ జరిగింది. "పారావార రాకాసుధాధామ ముద్దరాజు గణపయామాత్య పుత్ర పెదరామధీమణి ప్రణీతంబగు రాఘవ పాండవీయాదర్శంబను టీకా సహితంబుగ నుండు నియ్యది శ్రీమాన్ భ.తి. పంచాంగం నరసింహాచార్యులవారిచే పరిష్కరింపబడి ఆదివిద్యాతరంగిణీ ముద్రాక్షరశాల చెన్నపురిలో ప్రచురింపబడియె - 1895" అని గ్రంధాంతంలో పేర్కొనబడింది.

వావిళ్లవారు 1857లో పింగళ నామసంవత్సరం ఒక ముద్రణ చేశారు. దాని చక్కని ప్రతినొకదానిని సేకరించి పిఠాపురం సంస్థానాధీశులు శ్రీరాజారావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూరు వారి ధన సహాయంతో 1963లో మళ్లీ ముద్రించారు. దానికి ముందు 1910లో శ్రీ కాళహస్తికి చెందిన శతఘంటము వేంకటరంగశాస్త్రి వ్యాఖ్యానంతో వావిళ్లవారు ముద్రించారు. ఆ గ్రంథం ఆధారంగా పూర్వమున్న టీకా వ్యాఖ్యానములకు తాత్పర్యమును గూడ జోడించి నేను ఈ బృహత్ ప్రయత్నమునకు పూనుకొన్నాను.

ఈ వ్యాఖ్యాన రచన 2014లో ప్రారంభించాను. దానికి మూలకారకులు వావిళ్ల సంస్థకు చెందిన శ్రీ అల్లాడి స్వామినాధన్‌గారు, వ్యాఖ్యానం వ్రాసిన తర్వాత డి.టి.పి. చేయడానికి మూడేళ్లు పట్టడం దురదృష్టం. శిష్ట వ్యావహారికంలో ఈ తాత్పర్యాలు సమకూర్చాను. మారుతున్న భాషా పరిణామం దృష్ట్యా ఇది యువతీయువకులకు అందుబాటులోకి రావడం ముదావహం.

హైదరాబాదు
29.12.2017
వైకుంఠ ఏకాదశి

డా॥ రేవూరు అనంత పద్మనాభరావు
వ్యాఖ్యాత, అష్టావధాని
9866586805

శ్రీరస్తు

శ్రీ రామచంద్రపరబ్రహ్మణే నమః

పూర్వ వ్యాఖ్యానకర్తృకృతమంగళాచరణము

శా. శ్రీ లీలాజలజంబుఁ జేకొని దరస్మేరాస్యుఁ డై గోపికా
జాలం బద్భుతవార్ధిఁ దేలఁగ నిజేచ్ఛన్ నైజసౌందర్యధు
ర్యాలోకద్యుతిధారతన్ ముకుళనవ్యాకోచముల్ సేయుగో
పాలస్వామి మనోహరాకృతి మదిన్ భావించి సేవించెదన్

చ. అమరయసూరయార్యరచితాంచితరాఘవపాండవీయకా
వ్యమహితమాధురీమదుభయార్థవిబోధక టీకఁ జేసెదన్
గమలనివాసినీచరణ కాంచననూపురశింజితార్భటిన్
సమమతి సంస్కృతాంధ్రకృతిసాధనలక్షణలక్షితంబుగన్

శతఘంటము వేంకటరంగశాస్త్రి

ఉ. భారత రామగాథల నపారవచోవిభవాస్పదాఖ్య వి
స్తారము జేసినట్టి ఋషిసత్తము మాన్యుని ద్వ్యర్థికావ్యగం
భీరుని నవ్యభావనకవీంద్రుని శబ్దమయాంధ్రు గొల్చెదన్
సారకవిత్వతత్త్వగుణసాంద్రుని పింగళిసూరనార్యునిన్ 1

ప్రస్తుత వ్యాఖ్యాత **రేవూరు అనంత పద్మనాభరావు** ప్రణుతి

రాఘవ పాండవీయము

సవ్యాఖ్యానము

పీఠిక

శ్రీ తోఁబుట్టి సుధామధుద్రవముతోఁ జెన్నొందుపుష్పంబు శో
భాతారుణ్య మెలర్పఁగా ముడుచు పంపాహేమకూటాశ్రయ
ఖ్యాతబ్రహ్మము ప్రోచుఁగావుత విరూపాక్షాహ్వయం బాకువీ
టీతిమ్మప్రభువేంకటాద్రిహృదయాటీకంబు లోకంబులన్

టీక : శ్రీతోన్=లక్ష్మీదేవితో, పుట్టి=జన్మించి, సుధామధుద్రవముతోన్=సుధా –అమృతమనెడి, మధు=పూఁదేనె యొక్క, ద్రవముతోన్=తడితో, చెన్నొందు పుష్పంబు–చెన్నొందు=ప్రకాశించు, పుష్పంబు=పూవును, శోభాతారుణ్యము= తరుణకాంతి, ఎలర్పఁగాన్=ప్రకాశించగా, ముడుచు పంపాహేమకూటాశ్రయఖ్యాత బ్రహ్మము, ముడుచు=జడయందు ధరించిన, పంపా=పంపా సరస్సు తీరమునందున్న, హేమకూట=హేమకూట పర్వతమనెడు, ఆశ్రయ=ఉనికిలో ఖ్యాతి=పేర్కొనిన, బ్రహ్మము=కర్త, విరూపాక్షాహ్వయంబు=విరూపాక్ష నామముగలది, ఆకువీటీ తిమ్మప్రభు వేంకటాద్రి హృదయాటీకంబు–ఆకువీటి=ఆకువీడు పట్టణపు రాజైన తిమ్మప్రభు=తిమ్మరాజు కుమారుడైన, వేంకటాద్రి=పెద వేంకటాద్రి ప్రభువు యొక్క, హృదయ=మనస్సునందు, ఆటీకంబు=వర్తించునది, లోకంబులన్=జనులను ప్రోచుఁ గావుతన్=రక్షించును గాక!

తాత్పర్యం : లక్ష్మీదేవితోబాటు జన్మించి, అమృతమనెడి పూదేనెతో తడిసిన బాలచంద్రుని జడలో ముడుచుకున్న పంపా సరస్సు తీరంలోని హేమకూట పర్వతంలో వసిస్తూ, ప్రఖ్యాతి గడించి, ఆకువీటి తిమ్మరాజు కుమారుడైన పెదవెంకటాద్రి ప్రభువు హృదయంలో నర్తించెడి విరూపాక్షుడు లోకములను రక్షించుగాత!

శా. శ్రీచన్గొండలు రెండు నండగొని వాసిం బేర్చుచున్ భక్తిసా
మీచీన్యామల పెద్దవేంకటనృపోన్మీలన్మనశ్చాతక
వ్యాచిక్రింసకుఁ గైవసం బయి సదోదంచత్కృపావృష్టిస
ధ్రీచీనం బగు కృష్ణమేఘము జగత్ప్రీతిం గడుం జేయుతన్ 2

టీక : శ్రీ=లక్ష్మీదేవి యొక్క, చన్కొండలు=స్తనములనెడు పర్వతములను, రెండున్=రెండింటిని, అండగొని=ఆశ్రయించి, వాసిన్=ఆధిక్యముచేత, పేర్చుచున్=ప్రసిద్ధికెక్కుచు, భక్తి=భక్తి యొక్క సామీచీన్య=నిష్కలంకతచే, అమల= పవిత్రుడైన, పెద్దవేంకటనృప=పెదవేంకటాద్రి ప్రభువుయొక్క, ఉన్మీలత్=వికారము పొందుచున్న, మనః=మనస్సు అనెడి, చాతక=వానకోయిల యొక్క, వ్యాచిక్రింసకున్=నీటిని గోరి వెళ్లెడి గమనమునకు, కైవసంబయి=అధీనమై, సదా=ఎల్లప్పుడు, ఉదంచత్=ప్రకాశించుచున్న, కృపా=దయారసమనెడి, వృష్టి=వర్షముతో, సధ్రీచీనంబగు=కూడి తిరుగు, కృష్ణమేఘము=కృష్ణుడనే నల్లని మబ్బు, జగత్=లోకము యొక్క, ప్రీతిన్=ఇష్టమును, కడున్=మిక్కిలి, చేయుతన్=చేయుగాక!

తాత్పర్యం : లక్ష్మీదేవి యొక్క రెండు స్తనపర్వతాలను ఆశ్రయించి, నిష్కలంక భక్తితో ప్రసిద్ధికెక్కిన పెదవేంకటాద్రి ప్రభువు మనస్సు అనెడి చాతకపక్షి గమనమును సదా తన అధీనములో నుంచుకొనిన కృష్ణమేఘము లోకము యొక్క ఇష్టమును చేయుగాక!

శా. లోకత్రాణరతిం దదాదిమమహీలోక ప్రవేశోత్క భా
షాక్లుప్తప్రథమద్వితీయపదగుంజన్మంజు మంజీరగ
ర్జాకల్పామల రామభారతకథాసర్గంబులన్ మించు వా
ల్మీకి వాస్యులఁ గొల్చెదం దదుభయశ్లేషార్థసంసిద్ధికిన్ 3

టీక : లోకత్రాణరతిన్=లోక=జనులయొక్క, త్రాణ=రక్షించుటలో, రతిన్=ఆశతో, తత్=అట్టి, ఆదిమ=మొదటిదైన, మహీలోక=భూలోకమును గూర్చి, ప్రవేశ=ప్రవేశించుటకు, ఉత్క=ఉత్సాహముగల, భాషా=సరస్వతీదేవిచే, క్లుప్త=

తొడుగబడిన, ప్రథమ ద్వితీయ=కుడి, ఎడమలయిన, పద=పాదములందు, గుంజత్=అవ్యక్తముగా మ్రోగుచున్న, మంజు=వినసొంపైన, మంజీర=అందెల యొక్క గర్జాకల్ప=రొదతో సమానములయిన, అమల=స్వచ్ఛములైన, రామ=రాముని యొక్కయు, భారత=భరతవంశరాజుల యొక్కయు, కథా=చరిత్రముల యొక్క సర్గంబులన్=నిర్మాణములచే, మించు=పేర్చునట్టి, వాల్మీకి, వ్యాసులన్=వాల్మీకిని, వ్యాసుని, తదుభయ=ఆ రామాయణ, భారతముల రెంటి యొక్క, శ్లేషార్థ=కూడిన అర్థము యొక్క, సంసిద్ధికిన్=నెరవేర్చుటకు, కొలిచెదన్=సేవించెదను.

తాత్పర్యం : లోకమును రక్షించెడి ఆశచే భూలోకమును ప్రవేశించుటకు ఉత్సాహముగల సరస్వతీదేవి తొడిగిన కుడిఎడమ పాదములందు అవ్యక్తముగా మ్రోగుచున్న అందెల రొదతో సమానమైన స్వచ్ఛమైన రామాయణ భారత నిర్మాణములచే మించిన వాల్మీకి వ్యాసులను ఆ రామాయణభారత శ్లేషార్థసిద్ధికి సేవించెదను.

ఉ. ఏయెడ నర్థగౌరవసమృద్ధియు శబ్దవిశుద్ధియుం దిరం
బై యనవద్యతం బరఁగ నంధ్రవచస్థ్సితి భారతంబు రా
మాయణమున్ రచించిన మహాత్ముల నాత్మఁ దలంచెదన్ జగ
ద్గేయుల నన్నపార్యునిఁ దిక్కసుధీమణి నెఱ్ఱసత్కవిన్ 4

టీక : ఏయెడన్=ఎల్లెడల, అర్థ=అర్థముల యొక్క, గౌరవ సమృద్ధియున్=గొప్పదనమును, శబ్ద=పదముల యొక్క, విశుద్ధియున్=పటిష్ఠతయు, తిరంబై=స్థిరమై, అనవద్యతన్=దోషము లేకుండ, పరఁగన్=ఒప్పునట్లుగా, ఆంధ్రవచః=తెనుగు పదముల యొక్క, స్థితిన్=ఉనికి చేత, భారతంబు=భారతమును, రామాయణమున్=రామాయణమును, రచించిన=వ్రాసిన, మహాత్ములన్= పూజ్యులయిన, జగద్గేయులన్=లోకముచే స్తుతింపబడిన వారిని, నన్నపార్యునిన్=నన్నయభట్టును, తిక్కసుధీమణిన్=విద్వాంసుడైన తిక్కనను, ఎఱ్ఱసత్కవిన్=ఎఱ్ఱాప్రెగ్గడను, ఆత్మన్=హృదయమునందు, తలంచెదన్=భావించెదను.

తాత్పర్యం : ఎల్లెడల అర్థ గౌరవ సంపద, శబ్దగాంభీర్యము, నిశ్చయమై దోషరహితముగా ఒప్పునట్లు తెనుగు భాషలో భారతరామాయణములను వ్రాసిన మహాత్ములయిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలను మువ్వురను నా హృదయములో భావించెదను.

కం. ఈవిధి నభీష్టసిద్ధికి
దైవతకవినుతి యొనర్చి తప్పొప్పు మదిన్
భావించి దిద్దకుండను
దేవానాంప్రియుల మ్రొక్కి తెలతుఁ గుకవులన్ 5

టీక : ఈ విధిన్=ఈ క్రమముగా, అభీష్టసిద్ధికిన్=కోరిక నెరవేరుటకు, దైవత=దేవతలను, కవి=కవులను, నుతి=స్తోత్రము, ఒనర్చి=చేసి, తప్పు=దోషము, ఒప్పు=గుణము, మదిన్=తమ మనస్సులో, భావించి=ఆలోచించి, దిద్దకుండన్=సవరణలు చేయకుండునట్లు, దేవానాంప్రియులన్=మూర్ఖులకు, మ్రొక్కి=నమస్కరించి, కుకవులన్=చెడు కవులకు, తెలతున్=నమస్కరింతును.

తాత్పర్యం : ఈ విధముగా కోరిక నెరవేరుటకు దేవతలను, కవులను స్తోత్రము జేసి గుణదోషములను తమ మనస్సులో భావించి దిద్దకుండ మూర్ఖులకు మ్రొక్కి కుకవులకు నమస్కరింతును.

విశేషం : దేవానాంప్రియ ఇతిచ మూర్ఖే – అని వ్యాకరణ విశేషము.

వ. అని కుకవు లొకనిమిత్తంబునం బ్రార్థనీయు లగుటంజేసి తత్ప్రార్థనంబును గొంత నడపినవాఁడనై యెద్దియేనియు నొక్క భవ్య కావ్యంబును నవ్యప్రకారంబున రచియించుటకు నుదంచిత కుతూహలుండనై యుండు సమయంబున 6

టీక : అని=ఇట్లని, కుకవులు=చెడు కవులు, ఒక నిమిత్తంబునన్=ఒకానొక కారణముచే ప్రార్థనీయులగుటంజేసి=కొనియాడదగిన వారగుటచే, తత్=ఆ కవుల

యొక్క ప్రార్థనంబునున్=వేడికోలును, కొంత=కొంచెము, నడిపినవాడనై=చేసినవాడనై, ఎద్దియేనియున్=ఏదైనను, ఒక భవ్యకావ్యంబు=ఒక విశిష్టమైన ప్రబంధమును, నవ్యప్రకారంబునన్=కొత్త పద్ధతిలో, రచియించుటకున్=వ్రాయుటకు, ఉదంచిత కుతూహలుండనై=మిక్కిలి సంతోషించినవాడనై, ఉండు సమయంబునన్=ఉన్న వేళలో

తాత్పర్యం : అని కుకవులు ఒక కారణముచే ప్రార్థింపబడదగినవారగుటచే ఆ కవుల ప్రార్థన కొద్దిగా చేసినవాడనై, ఏదైనను ఒక విశిష్ట కావ్యమును కొత్తపద్ధతిలో రచించుటకు మిక్కిలి కుతూహలుడనై ఉన్న వేళలో –

విశేషం : దీని తరువాత ఒకటి రెండు విడి పద్యములు టీకాకారులైన (1910 సం) మాన్యశ్రీ శతఘంటము వేంకటరంగశాస్త్రిగారికి (శ్రీకాళహస్తి వాస్తవ్యులు) లభించినవి. అవి మిగతా సందర్భములందు అతుకవు. అందుచే వారు వాటిని ఇక్కడ జతపరచిరి.

సీ. ఏమహీవరుతాత యిమ్మభూవరుఁడు స
త్కీర్తిగంగాజన్మకృతి మహాద్రి
యేవిభు తండ్రి నానావిధపౌరుష
స్థిరవృత్తి మీసాలతిమ్మశౌరి
యేనృపోత్తము తల్లి మానితపరమసా
ధ్వీగుణంబుల ప్రోక తిమ్మమాంబ
యేధీరు ననుజన్ము లిద్ధదానక్షాత్ర
భద్రుండు చిన వేంకటాద్రినృపుఁడు

తే. ఘనులు వేంకటరాయ వేంకటవరదలు
ననఁ బ్రసిద్ధులు ముగు రట్టియాకువీటి
పురవరాంకుండు త్రిభువనపూర్ణకీర్తి
యతులతేజుండు పెదవేంకటాద్రివిభుఁడు 7

టీక : ఏ మహీవరు=ఏ రాజుయొక్క, తాత=తాత, సత్కీర్తి=గొప్ప కీర్తిని, గంగా=గంగానది యొక్క, జన్మ=పుట్టుక, కృతి=కలుగుటకు, మహాద్రి=గొప్ప పర్వతము, ఇమ్మభూవరుఁడు=ఇమ్మరాజో, ఏవిభు=ఏ రాజు యొక్క, తండ్రి=తండ్రి, నానావిధ=అనేక రకములైన, పౌరుష స్థిరవృత్తి=స్థిరమైన పౌరుషమే వ్యాపారముగాగల, మీసాల తిమ్మశౌరి=మీసాల తిమ్మరాజో, ఏ నృపోత్తము=ఏ రాజశ్రేష్ఠుని యొక్క, తల్లి=తల్లి, మానిత=గౌరవింపదగిన, పరమసాధ్వీగుణంబుల=గొప్ప పాతివ్రత్య గుణములకు, స్తోక=నిధి, తిమ్మమాంబ=తిమ్మాంబయో, ఏధీరు=ఏ ధైర్యవంతుని, అనుజన్ములు=తమ్ములు, ఇద్ధ=ప్రకాశించు, దాన=దానము చేతను, క్షాత్ర=పరిపాలనాదులచే, భద్రుండు=మంగళకరుడైన, చిన వేంకటాద్రి నృపుడు=చిన్న వేంకటాద్రిరాజో, ఘనులు=గొప్పవారైన, వేంకటరాయ=వేంకటరాయరాజు, వేంకటవరద=వేంకటరవరదరాజు, అనన్=అని, ప్రసిద్ధులు=పేరు సంపాదించిన, ముగ్గురు=ఈ ముగ్గురో, అట్టి=అట్టి, ఆకువీటి పురవర+అంకుడు=శ్రేష్ఠమైన ఆకువీడు నగరము గుర్తుగా గలవాడు, త్రిభువన=మూడు లోకములందు, పూర్ణకీర్తి=నిండిన యశస్సుగలవాడు, అతులతేజుడు=సాటిలేని పరాక్రమము గలవాడు, పెదవేంకటాద్రి విభుడు=పెదవేంకటాద్రి రాజు.

తాత్పర్యం : ఏ రాజు యొక్క తాత మంచి యశస్సు అనెడి గంగాజన్మమునకు కారణభూతమైన మహాపర్వతము వంటి ఇమ్మరాజో, ఏ ప్రభువుయొక్క తండ్రి నానావిధములైన పౌరుషములచేత స్థిరమైన ప్రవృత్తిగల మీసాల తిమ్మరాజో, ఏ రాజశ్రేష్ఠుని తల్లి మాన్యమయిన పరమపాతివ్రత్యగుణాల రాశియైన తిమ్మంబయో, ఏ ధీరునియొక్క ముగ్గురు తమ్ములు దానగుణము, క్షాత్రగుణములచే ప్రకాశించు మంగళప్రదులైన చిన వేంకటాద్రి రాజు, వెంకటరాయరాజు, వేంకటాద్రి రాజు - లని ప్రసిద్ధి కెక్కినారో, అట్టి ఆకువీటి పురమునకు రాజై ముల్లోకాలలో సాటిలేని యశస్సును, పరాక్రమమును కలవాడు పెదవేంకటాద్రిరాజు.

విశేషం : ఆకువీటి పెదవేంకటాద్రిరాజు పింగళి సూరన కాశ్రయమిచ్చిన ప్రభువు. కావ్యరచనను సూచించిన మహనీయుడు. అతని వంశాభివర్ణనను కవి చేసినాడు.

వ. నిజాస్థానంబున సంగీత సాహిత్యాది వివిధ విద్యా ప్రసంగంబులం
ప్రవర్తిల్లుచు 8

సీ. శోభితాపస్తంబసూత్రు గౌతమగోత్రు
సుచరిత్రుఁ బింగళ సూరసుకవి
పౌత్త్రు నన్నపరతిభావన దౌహిత్రు
నమర ధీమణికి నబ్బమకుఁ బుత్త్రు
ననుజన్ము లైనట్టి యమలన యెల్లనా
ర్యులు భక్తి సేవింప నలరువాని
సత్కావ్య రచనావిశారదుం డగువాని
సూరన నామవిశ్రుతుని నన్నుఁ

ఆ. బ్రియము సంధిలంగఁ బిలిపించి బహువస్త్ర
భూషణాదిదానములఁ గరంబు
సంతసం బొనర్చి యెంతయు గారవ
మెసఁగ మధురఫణితి నిట్టు లనియె 9

టీక : శోభిత=ప్రకాశించు, ఆపస్తంబసూత్రున్=ఆపస్తంబమను సూత్రము గలవానిని, గౌతమ గోత్రున్=గౌతమ మహర్షి గోత్రముగలవానిని, సుచరిత్రున్=మంచి నడవడిక గలవానిని, పింగళి సూరసుకవి పౌత్రున్=పింగళి సూరన్న కవి మనుమని, నన్నపరతి భావన=నన్నపరతి భావనలకు, దౌహిత్రున్=కుమార్తె కుమారుని (మనుమని), అమరధీమణికి=అమర కవికిని, అబ్బమకు=అబ్బమ్మకు, పుత్రున్=కుమారుని, అనుజన్ములు+ఐనట్టి=తోడబుట్టిన వారైన, అమలన్+ ఎల్లనార్యులు=అమలన్న, ఎల్లన్నకవులు, భక్తిసేవింప=భక్తితో కొలువగా, అలరువానిన్=ప్రకాశించు వానిని, నన్ను=నన్ను, సత్కావ్య రచనా విశారదుండగువాని=మంచి కావ్యములు వ్రాయుటలో నేర్పుగలవానిని, సూరననామ=సూరన్న అనే పేరుతో, విశ్రుతుని=పేరు గాంచిన వానిని, ప్రియము సంధిలంగన్=ప్రీతి కలుగగా, పిలిపించి=పిల్చి,

కరంబు=మిక్కిలిగా, బహువస్త్ర భూషణాది దానములన్=మిక్కిలి వస్త్రములు, ఆభరణములు మొదలైన దానములచే, సంతసంబు+ఒనర్చి=సంతోష పెట్టి, ఎంతయు గారవము+ఎసఁగ=మిక్కిలి గౌరవము కలుగునట్లుగా, మధురఫణితిన్=మృదురీతిలో, ఇట్టులు+అనియె=ఇట్లు అనెను.

తాత్పర్యం : ఆపస్తంబసూత్రముచే ప్రకాశించువానిని, గౌతమ గోత్రముచే ప్రసిద్ధుడైన వానిని, పింగళి సూరన కవికి మనుమని, నన్నరపతి భావనల మనుమని, అమరన్నకు, అబ్బమకు కుమారుడైన వానిని, అమలన్న, ఎఱ్ఱన్నలు తోబుట్టువులుగా తనను భక్తితో సేవింపగా ప్రకాశించువానిని, మంచికావ్యములు వ్రాయుటలో నేర్పుగల నన్ను, సూరన్న అను పేరుతో ప్రఖ్యాతిగలవానిని ప్రీతితో పిలిపించి అనేక వస్త్రాభరణములు దానముగా నిచ్చి, మిక్కిలి సంతోషపరచి, ఎంతో గౌరవముతో మృదుమధురముగా ఇట్లు అనెను.

విశేషం : ఈ పద్యంలో పింగళి సూరన తన వంశాభిజాత్యాన్ని వివరిస్తున్నాడు. ఆపస్తంబ సూత్రము, గౌతమ గోత్రముగల పింగళి వంశము సుప్రతిష్ఠితము. అందులో సూరన్న బహుకావ్య రచనా విశారదుడు.

శా. రెండర్థంబుల పద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండుం దద్గతిఁ గావ్య మెల్ల నగునే నోహో! యనం జేయదే
పాండిత్యంబున నందునుం దెనుఁగుకబ్బం బద్భుతం బంద్రు ద
క్షుం డెవ్వాఁ డిల రామభారతకథల్ జోడింప భాషాకృతిన్ 10

అర్థము : రెండు+అర్థంబుల పద్యము=ఒకే పద్యములో రెండు అర్థములు వచ్చునట్లు, ఒక్కటియు=ఒకటి అయినను, నిర్మింపంగన్=రచించుటకు, శక్యంబు+కాకుండున్=తరముగానట్లుండగా, తత్+గతిన్=ఆ విధముగా, కావ్యము+ఎల్లన్=కావ్యమంతయు, అగునేన్=అయినచో, ఓహో+అనన్+చేయదే=ఆశ్చర్యావహము కాదా? అందునున్=అందులో, పాండిత్యంబునన్=నేర్పుతో చేయు రచనలో, తెనుగున్+కబ్బము=తెలుగు కావ్యము, అద్భుతంబు+అంద్రు=

ఆశ్చర్యజనకమని చెప్పెదరు; భాషాకృతిన్=కావ్యస్వరూపములో, రామభారత కథల్=రామాయణ భారత కథలను, జోడింపన్=కలుపుటకు, దక్షుండు=సమర్థుడు, ఇలన్=భూమిలో, ఎవ్వాడు=ఎవ్వరు?

తాత్పర్యం : ఒకే పద్యంలో రెండు అర్థములు వచ్చునట్లు ఒక్క పద్యము రచించుటయే కష్టమయినపుడు, ఆ విధముగా కావ్యమంతయు చేయుట ఆశ్చర్య జనకముగాదా? అట్టిది పాండిత్యములోను, తెలుగు కావ్యము రచించుట అద్భుతమందురు. కావ్యరూపములో రామాయణ, భారత గాధలను జోడించి వ్రాయగల సమర్థుడెవ్వరు?

విశేషం : తెలుగులో తొలిద్వర్థి కావ్యరచనకు పూనుకొన్న పింగళి సూరన తన ముందున్న సవాళ్లు పేర్కొనుచున్నాడు.

ఉ. భీమన తొల్లి చెప్పె ననుపెద్దలమాటయె కాని యందు నొం
డేమియు నేయెడ న్నిలుచు టెవ్వరుఁ గాన ర టుండ
నామహిత ప్రబంధ రచనా ఘనవిశ్రుతి నీకుఁ గల్గుటన్
నామదిఁ దద్ద్వయార్థకృతి నైపుణియుం గల దంచు నెంచెదన్ 11

అర్థము : తొల్లి=పూర్వము, భీమన=వేములవాడ భీమకవి, చెప్పెన్+అను =చెప్పెనను, పెద్దల మాటయెగాని=పూర్వీకుల వాక్యమేగాని, అందున్=అందులో, ఒండు+ఏమియు=ఒక్కటి కూడ, ఏ యెడన్=ఎక్కడను, నిలుచుట=నిలబడుట, ఎవ్వరున్=ఎవ్వరును, కానరు=చూడలేదు, అటుండ+నిమ్ము=అది అటులుండనీ, నీకున్=నీకు, నానామహిత=అనేక గొప్ప; ప్రబంధ రచనా ఘన విశ్రుతి=ప్రబంధములు రచించు గొప్ప కీర్తి, కల్గుటన్=కల్గుటచేత, నా మదిన్=నా మనస్సులో, తత్+ద్వయ+ అర్థకృతి=ఆ విధమైన రెండర్థముల కావ్యము రచించు, నైపుణియున్=నేర్పు, కలదు+అంచు=కలదని ఎంచెదన్=భావించెదను.

తాత్పర్యం : పూర్వము భీమన అను కవి రచించెనని పెద్దలు చెప్పిన మాటయేగాని, అందులో ఒక్కటి కూడ నిలిచిపోయినట్లు ఎవ్వరును చూడలేదు.

అది అట్లుండగా, గొప్పవైన అనేక ప్రబంధములు రచించుట ద్వారా గొప్ప కీర్తి గల నీకు రెండర్థములు గల కావ్యము వ్రాయగల నేర్పు గలదని నా మనస్సులో భావించెదను.

కం. చాటుప్రబంధరచనా
పాటవకలితుఁడవు శబ్దపరిచితియందున్
మేటివి దీనిం దెనుఁగునఁ
బాటించి రచింప నీవ ప్రౌఢుఁడ వరయన్ 12

అర్థం : చాటుప్రబంధ=చాటు కావ్యముల, రచనాపాటవకలితుఁడవు=రచించు సామర్థ్యముగలవాడవు, శబ్దపరిచితి+అందున్=శబ్దముల యొక్క పరిచయములోను, మేటివి=సమర్థుడవు, దీనిన్=దీనిని, తెనుఁగునన్=తెలుగులో, పాటించి=స్వీకరించి, రచింపన్=వ్రాయుటకు, అరయన్=చూడగా, నీవ=నీవే, ప్రౌఢుఁడవు=జాణవు.

తాత్పర్యం : చాటు కావ్యములు వ్రాయు సామర్థ్యముగలవాడవు, శబ్దస్వరూప పరిచయముగల నీవే తెలుగులో దీనిని వ్రాయుటకు తగిన సమర్థుడవు (జాణవు)

ఉ. దక్షత యింత గల్మి విశదంబుగఁ గాంచియు నీమదిన్ ఫలా
పేక్ష ఘనంబు కామి నిది యిట్టనఁ గొంకెద నీకు నోలలా
టేక్షణభక్తిశీల రచియించుట యిష్టమ కాదె శ్రీవిరూ
పాక్షున కంకితంబుగ శుభార్థము రాఘవపాండవీయమున్ 13

అర్థం : ఓలలాట+ఈక్షణభక్తిశీల!=పరమశివునియందు భక్తి తత్పరతగలవాడా! (నొసట కన్నుగలవాడు శివుడు), దక్షత=సామర్థ్యము, ఇంత కల్మిన్=ఇంత ఉండుట, విశదంబుగన్=వివరముగా, కాంచియు=చూచి కూడ, నీ మదిన్=నీ మనసులో, ఫల+అపేక్ష=ప్రయోజనము మీది కోరిక, నీకు=నీకు, ఘనంబుకామి=గొప్పది కానందున, ఇది+ఇట్టు+అనన్=ఇది ఇట్లు అనుటకు, కొంకెద=జంకెదను, శ్రీవిరూపాక్షునకు=విరూపాక్ష స్వామికి, అంకితముగ=అంకితముగా, శుభార్థము=మేలు

కలుగుటకు, రాఘవ పాండవీయమున్=రాఘవపాండవీయకావ్యమును రచి యించుట=వ్రాయుట, ఇష్టమ కాదె=ఇష్టము కాదా?

తాత్పర్యం : ఓ శివభక్తిశీలా! నీలో ఇంతటి కావ్యరచనా సామర్థ్యము కలదని తెలిసియు, నీ మనస్సులో ఎటువంటి గొప్పదైన ఫలాపేక్ష లేదు గావున, ఇది ఇట్లు అని చెప్పుటకు జంకుచున్నాను. విరూపాక్షస్వామి కంకితముగా శుభఫలములను కోరి రాఘవపాండవీయమును రచించుట నీకిష్టమే గదా!

విశేషం : భగవదంకితముగా ఫలాపేక్ష రహితముగా శ్రీవిరూపాక్షుని పేర ఈద్వ్యర్థి కావ్యమును రచింపుమని పెద వేంకటాద్రి విభుడు సూచించుచున్నాడు.

వ. అని సవినయభక్తికంబులగు మధురభాషణంబుల నిజాభిలాషంబు
తెఱం గెఱింగించిన నేనునుం దదీయంబులగు నతిమాత్ర గౌరవ
సంభావనాదివిశేషంబుల చేతం బ్రీతచేతస్కుండనై యునికింజేసి
శక్యా శక్యవిచారంబు లేక యంగీకార భంగీతరంగితం బగునం
తరంగంబుతో నతని నభివీక్షించి. 14

అర్థం : అని=అని, సవినయభక్తికంబులగు=వినయము, భక్తితో గూడిన, మధుర భాషణంబులన్=తియ్యని మాటలతో, నిజ+అభిలాషంబు తెఱంగు=తన కోరిక తీరును, ఎఱింగించినన్=తెలియజేయుగా, ఏనునున్=నేను గూడ, తదీయంబులగు=అతనివైన, అతిమాత్రగౌరవ=ఎంతో గౌరవముతో గూడిన, సంభావన+ఆదివిశేషంబులచేతన్ =విశేషమైన మన్ననలచే, ప్రీతచేతస్కుండనై=సంతోషించిన హృదయముగలవాడనై, ఉనికిన్+చేసి=ఉండుట వలన శక్య+అశక్యవిచారంబు=చేయగలను, చేయలేనను ఆలోచనను, లేక=వదలి, అంగీకారభంగీ=ఒప్పికొను విధముతో, తరంగితంబగు =పెంచబడిన, అంతరంగంబుతోన్=మనస్సుతో, అతనిన్=ఆయనను, అభివీక్షించి=చూచి.

తాత్పర్యం : అని వినయభక్తిపూర్వకములైన తియ్యని మాటలతో తన మనసులోని కోరికను తెలియపరచగా, నేను గూడ అతని గౌరవాదర విశేషములచేత సంతోషించిన మనసు గలవాడనై ఉండుట వలన, ఈ పనిని చేయగలనా? లేదా? అనే ఆలోచన లేకుండ నా అంగీకారముతో గూడిన మనస్సుతో అతనిని చూచి.

ఉ. రాఘవపాండవీయకథ రమ్యముగా నొకకావ్యసృష్టి నా
హా ఘటియింపఁగా వశమె యాంధ్రకవీంద్రుల కైనఁ దావక
శ్లాఘనపూర్వకోక్తి యవిలంఘ్యము గావునఁ గోవిదానుకం
పాఘనబుద్ధిఁ జూపెదఁ జమత్కృతిమత్కృతి మత్కృతిత్వమున్ 15

అర్థం : ఆంధ్ర కవీంద్రులకు+ఐన=తెలుగు కవీశ్వరులకైనను, రాఘవ పాండవీయకథ=రామాయణ భారతకథలు, రమ్యముగా=రసవత్తరముగా, ఒక కావ్యసృష్టి=ఒక కావ్యముగా కల్పన చేసి, ఆహా!=ఆశ్చర్యకరముగా, ఘటియింపగా= కూర్చుట, వశమె?=సాధ్యమా? తావక=మీయొక్క శ్లాఘనపూర్వక+ ఉక్తి=ప్రశంసా పూర్వకమైన మాటలు, అవిలంఘ్యము=దాటనలవి గానివి; కావునన్=అగుటచే, కోవిద+అనుకంపాఘనబుద్ధి=పండితుల కరుణచేత అతిశయము పొందిన మనస్సుతో, చమత్+కృతిమత్=చమత్కారము గల; కృతిన్=కావ్యరచనలో, మత్+కృతిత్వమున్=నా రచనాకౌశల్యమును, చూపెదన్=చూపెదను.

తాత్పర్యం : తెలుగు కవులకైనను రామాయణ భారత కథలను రసవత్తరముగా ఒకే కావ్యముగా చేసి ఆశ్చర్యకరముగా మార్చుట సాధ్యమా? అయినను, మీ యొక్క ప్రశంసా పూర్వక వాక్యములు దాటనలవి గావున, పండితుల దయతో అతిశయించిన నా మనస్సుతో చమత్కారభరితముగా నా కావ్యరచనలో నా రచనాకౌశల్యమును చూపెదను.

వ. అని మఱియు నతనిచేత ననేకవిధసత్కారసంభావనాసంభృత
సమ్మదుండనై. 16

అర్థం : అని మరియు, అతనిచేత, అనేకవిధ=అనేక విధములైన, సత్కార సంభావనా=దానములు, సత్కారములచే, సంభృత=నిండిన, సమ్మదుండనై= సంతోషముతో

తాత్పర్యం : అని మరియు అతనిచే అనేక రకములైన దానములు, సత్కారములతో నిండిన సంతోషముతో –

సీ. ఆంధ్రభాషా సంస్కృతాభిభాషాశ్లేష
యొక్కొక్కచోట నొక్కొక్కచోట
నుచితశబ్దశ్లేష యొక్కొక్క చోట న
ర్థశ్లేష యొక్కొక్కతతిని ముఖ్య
గౌణవృత్తిశ్లేషఘటన యొక్కొకతతి
నర్థాన్వయము వేఱె యగుచు నునికి
శబ్దాన్వయవిభేదసంగతి యొక్కొక్క
తతి నివి యొక్కొక్కతతిని రెండు

తే. మూఁడు గూడుట యన సముజ్జ్వలము గాఁగ
నాకుఁ దోఁచినగతిఁ బెక్కుపోక లమర
రామభారతకథలు పర్యాయదృష్టిఁ
జూచు సుమతుల కేర్పడ నాచరింతు. 17

అర్థం : ఒక్కొక్కచోటన్=ఒక్కొక్కయెడ, ఆంధ్రభాషా సంస్కృత+అభిభాషాశ్లేష=తెలుగు, సంస్కృత భాషల కూడికయు, ఒక్కొక్కచోటన్, ఉచితశబ్దశ్లేష=తగిన విధముగా శబ్దముల కూడిక, ఒక్కొక్కచోటన్, అర్థశ్లేష=అర్థముల కూడికయు, ఒక్కొక్క తతిన్=ఒక్కొక్క సందర్భములో, ముఖ్య గౌణవృత్తి=ప్రధానములైన, అప్రధానములైన ప్రవృత్తులుగల, శ్లేషఘటన=కూడికతో కూర్పు, ఒక్కొక్క తతిన్, అర్థ+ అన్వయము=అర్థముల కలయిక, వేఱె+అగుచున్+ఉనికి=వేఱు విధముగా నుండుటవలన, శబ్ద+అన్వయ=శబ్దములను చేర్చెడి, విభేదసంగతి=వేర్పాటులు, ఒక్కొక తతిని, ఇవి, ఒక్కొక్క తతిని, రెండు మూడు కూడుట=రెండుగాని, మూడుగాని చేరుట, అనన్=అనగా, సముజ్జ్వలముగాగ=ఒప్పునట్లుగా, నాకు తోచిన గతిన్=నా మనసుకు నచ్చిన విధముగా, పెక్కుపోకలు+అమరన్=వివిధ పద్ధతులు ఏర్పడునట్లుగా, రామభారత కథలు=రామాయణ, భారత కథలు, పర్యాయ దృష్టిన్=ఒక దాని తర్వాత ఒకటిగా చూచు విధానముగా చూచు, సుమతులకు=పండితులకు, ఏర్పడన్=వేరు

వేరుగా, ఆచరింతున్=రచించెదను.

తాత్పర్యము : ఒక్కొక్కసారి తెలుగు, సంస్కృతభాషలతో కూడికయు, మఱియొకసారి శబ్దశ్లేషలతోను, ఇంకొకసారి అర్థశ్లేషలతోను, ప్రధానా ప్రధాన ప్రవృత్తులుగల శ్లేషలతోను, అర్థముల కలయిక వేరుగా ఉండునట్లు శబ్దములను చేర్చెడి ఏర్పాటు వలన రెండుగాని, మూడుగాని చేరుటచే నాకు తోచిన విధముగా వివిధపద్ధతులలో రామభారతకథలను ఒకదాని తర్వాత ఒకటిగా పండితులు విడివిడిగా చూచునట్లు రచించెదను.

కం. ఒక కథ వినియెడితఱి వే
ఱొకకథపై దృష్టి యిడిన నొకయర్థముఁ దోఁ
పక పోవుఁ గాన నేకా
ర్థకావ్య మెట్లట్ల వినఁగఁ దగు నొకటొకటిన్ 18

అర్థం : ఒక కథ = ఒక కథను, వినియెడి తఱిన్=విను సమయములో, వేరొక కథపైన=మరియొక కథపై, దృష్టి+ఇడినన్=చూపు పెట్టిచనో, ఒక+అర్థమున్=ఒక అర్థము కూడ, తోపకపోవున్+కాన=తెలియదు గావున, ఏకార్థ కావ్యము=ఒకే అర్థముగల కావ్యము, ఎట్ల=ఎట్లో, అట్ల=ఆ విధముగా, ఒకటి=ఒకటన్=ఒక్కొక్కటిగా, వినన్+తగున్=వినవలయును.

తాత్పర్యం : ఒక కథను విను సమయమున, వేఱొక కథపై దృష్టి పెట్టి చదివినచో ఒక అర్థము కూడ తోచదు గాన, ఒకే అర్థముగల కావ్యమెట్లో ఆ విధముగా ఒక్కొక్కటిగా వినవలయును.

తే. ప్రభువు సత్కార ఋణ మిందుఁ బాయు ననియు
శ్రీవిరూపాక్షసేవావిశేష మనియు
సుజను లిందు గుణాంశంబ చూతు రనియుఁ
జలిపితి నసాధ్యకృతి కిట్లు సాహసంబు 19

అర్థము : ప్రభువు=పెదవేంకటాద్రి ప్రభునియొక్క, సత్కార=సన్మానము అనెడి, ఋణము=అప్పు, ఇందున్=ఈ కావ్యము రచించుటచే, పాయుననియు= తొలగిపోవుననియు, శ్రీ విరూపాక్షసేవావిశేషము=విరూపాక్షస్వామి యొక్క సేవా విశేషము=సేవించుట అను విశేషము, అనియు, ఇందు=ఇందలి, గుణ+అంశంబు= మంచితనమును, సుజనులు=పండితులు, చూతురు+అనియున్= చూచెదరనియు, అసాధ్యకృతికి=సాధ్యము కాని రచనకు, ఇట్లు, సాహసంబు= తెగువను, చలిపితిన్=చేసితిని.

తాత్పర్యము : పెదవెంకటాద్రి ప్రభువు యొక్క సన్మానమనెడి ఋణము – ఈ కావ్యరచనచే తొలగిపోవుననియు, విరూపాక్షస్వామిని సేవించు విశేషము ఈ మంచి పని ద్వారా సజ్జనులు గ్రహించెదరనియు భావించి అసాధ్యమైన ఈ రచనా సాహసమును నేను చేసితిని.

వ. అని యిట్లు కృతోత్సాహుండ నగుచు నేతత్ప్రబంధనిబంధ నారంభంబునకుఁబ్రేరకుండైన సకలాంతర్యామి హేమకూటా ధ్యక్షుండు శ్రీవిరూపాక్షుండ నిర్విఘ్నపరిసమాప్తి ప్రచయ గమనంబులకుం దానకలం డతని సంకల్పాను సారంబున నెట్లు గావలయునట్లగుం గాక నాకు భారం బేమి యను తలంపున నిశ్చింతుండనై కడంగి దీనికిఁ బ్రత్యక్షనియామకుండైన పెదవేంకటాద్రి మహీవల్లభు వంశక్రమం బభివర్ణించెద. 20

అర్థము : అని యిట్లు, కృత=చేయబడిన, ఉత్సాహుండ నగుచున్=ప్రయత్నము గలవాడనై, ఏతత్=ప్రబంధ, ఆ కావ్యము యొక్క, నిబంధన+ఆరంభంబునకున్= నిర్మాణమును మొదలుపెట్టుటకు, ప్రేరకుండైన=పురికొల్పువాడైన, సకల+అంతర్యామి=అన్నిటా నిండిన, హేమకూట+అధ్యక్షుండు=హేమకూట పర్వతనాధుడైన, శ్రీవిరూపాక్షుండ=శ్రీ విరూపాక్ష స్వామియే, నిర్విఘ్న=ఆటంకములు లేకుండ, పరిసమాప్తి=ముగియుటకు, ప్రచయగమనంబులకున్=వ్యాప్తి నొందుటకును, తాన=తానే, కలందు=ఉన్నాడు, అతని, సంకల్ప+అనుసారంబున=ఇష్టము ప్రకారము,

ఎట్లు=ఏ విధముగా, కావలయున్=కావలెనో, అట్లు+అగున్+కాక=ఆ విధముగానే జరుగునుగాక, నాకు, భారంబు+ఏమి=బరువు ఏమి, అను తలంపున=అను ఆలోచనతో, నిశ్చింతుండనై=చింతలేని వాడనై, కడంగి=ప్రయత్నించి, దీనికిన్=ఈ ప్రబంధరచనకు, ప్రత్యక్షనియామకుండైన=ఎదుట నుండి ప్రోత్సహించిన, పెదవేంకటాద్రి మహీవల్లభు=పెదవెంకటాద్రి ప్రభువు యొక్క, వంశ క్రమంబు= కులము యొక్క వరుసను, అభివర్ణించెద=చెప్పెదను.

తాత్పర్యం : అని యీ విధముగా ఉత్సాహము కలిగినవాడనై ఆ కావ్యనిర్మాణ ప్రారంభమునకు మూలకారణమైన అన్ని చోట్లను తిరుగు హేమకూట పర్వతనాథుడైన శ్రీ విరూపాక్ష స్వామియే దానిని ఆటంకములు లేకుండా పూర్తి చేయుటకు, వ్యాప్తిలోనికి తెచ్చుటకు ఉన్నాడు. నాకు భారమేమియను ఆలోచనతో చింతలేనివాడనై ఆ పనికి పూనుకొని ఈ రచనకు ముందుండి నడిపించు పెదవేంకటాద్రిప్రభువు వంశ క్రమమును వర్ణించెదను.

విశేషం : ఇక్కడ భక్తునికి భగవంతునికి మధ్య సంబంధం చెప్పబడింది.

'భావము నీదేనని' ఆ పరమాత్మను నమ్మితే ఏ విధమైన ఆటంకములు కలుగవని నమ్మిక. కవి కూడ అదే నమ్మికతో కావ్యరచనను ప్రారంభించుచున్నాడు.

శా. శ్రీశోభాఘనుఁ డిమ్మభూవరుఁడు లక్ష్మీనాథకల్పద్రుబా
హాశాఖాఫలమైనవంశమున మూర్తామోదమున్ బోలె స
ర్వాశాపూరితకీర్తివాసనలతో నావిర్భవించెన్ ధరి
త్రీశోత్తంసితభవ్యశాసనకళాహేతుప్రతాపాఢ్యుఁ డై 21

అర్థము : శ్రీశోభా=సంపదల యొక్క విలాసముచే, ఘనుఁడు=గొప్పవాడైన ఇమ్మభూవరుఁడు=ఇమ్మరాజు, లక్ష్మీనాథ=శ్రీమన్నారాయణుడను, కల్పద్రు= కల్పవృక్షము యొక్క, బాహా=భుజమను, శాఖా=కొమ్మయందు, ఫలమైన వంశమునన్=పండైన కులమునందు=క్షత్రియ కులమునందు, ధరిత్రీశ=రాజులచే,

ఉత్తంసిత=శిరోభూషణముగా చేయబడినదై, భవ్య=యుక్తమైన, శాసనకళా=శిక్షా విధానమునకు, హేతు=కారణమైన, ప్రతాప=పరాక్రమముచే, ఆఢ్యుఁడై=గొప్పవాడై, మూర్తామోదమున్+పోలెన్=మూర్తిమంతమైన వాసనా విశేషమువలె, సర్వాశా=అన్ని దిక్కులయందు, పూరిత=నిండిన, కీర్తి=యశస్సు అనెడు, వాసనలతోన్=సువాసనలతో, ఆవిర్భవించెన్=జన్మించెను.

తాత్పర్యము : సంపదల విలాసముచే ఘనుడైన ఇమ్మరాజు నారాయణుని భుజశాఖల నుండి పుట్టిన క్షత్రియకులములో, రాజులచే శిరోభూషణముగా చేయబడిన శిక్షావిధాన పరాక్రమసంపన్నుడై, మూర్తిమంతమైన సువాసనలు అన్ని దిక్కులలో యశస్సు ద్వారా నిండి జన్మించెను.

విశేషము : అతని పరాక్రమమునకు రాజులందరు భయపడిరి. అతని ఆజ్ఞను శిరసావహించసాగిరి.

తే. ఆకువీటిపురీశాసనాంకుఁ డగుచు
సకలసంగ్రామకేళినిశ్శంకుఁ డగుచు
ననిశపూజిత శేషపర్యంకుఁ డగుచు
నతఁడు సొంపొందు యువతిమీనాంకుఁ డగుచు. 22

అర్థము : ఆకువీటిపురీశాసన=ఆకువీటిపుర ప్రభువనెడు, అంకుఁ డగుచున్=పేరుగలవాడై, సకలసంగ్రామకేళి=అన్ని యుద్ధతంత్రములలో, నిశ్శంకుఁ డగుచు=జంకులేనివాడై, అనిశ=నిరంతరము, పూజిత=అర్చించబడిన, శేషపర్యంకుఁ డగుచున్=అనంతుడు శయ్యగాగల నారాయణమూర్తి గలవాడై, యువతి= యువతులకు, మీన+అంకుడగుచు=మన్మధుడై, అతడు=ఆ ఇమ్మభూపతి, సొంపొందున్=శోభిల్లెను.

తాత్పర్యము : ఆకువీటి ప్రభువైన ఇమ్మరాజు సమస్త యుద్ధక్రీడలలో జంకులేని వాడై, నిరంతరము నారాయణమూర్తి నర్చించువాడై, యువతులకు మన్మధ ప్రాయుడై శోభిల్లెను.

కం. కౌండిన్యగోత్ర జలధివి
ధుం డాతఁడు గాంచె వరసుతున్ భావమహీ
మండలపతిఁ గదన బలో
ద్దండుని లక్ష్మాంబ యనెడు తన సతియందున్. 23

అర్థము : కౌండిన్య గోత్ర=కౌండిన్య గోత్రమనెడు, జలధి=సముద్రమునకు, విధుండు=చంద్రుడైన, ఆతడు=ఆ ఇమ్మభూపతి, లక్ష్మాంబ+అనెడు=లక్ష్మాంబ అను, తన సతి+అందున్=తన భార్యయందు, కదనబల+ఉద్దండునిన్=యుద్ధములో బలముచే గొప్పవానిని, భావమహీమండలపతిన్=భావరాజు అను, వరసుతున్=శ్రేష్ఠుడైన కుమారుని, కాంచెన్=పొందెను.

తాత్పర్యం : కౌండిన్య గోత్రమను సముద్రమునకు చంద్రుడైన ఆ ఇమ్మభూపతి, లక్ష్మాంబ అనెడు తన ధర్మపత్నియందు యుద్ధములలో తన బలముచే ఘనుడైన భావరాజు అను శ్రేష్ఠమైన కుమారుని పొందెను.

స్రగ్ధర : ఆ లక్ష్మాంబాకుమారుం డమలయశుఁడు భావావనీశుండు సాధ్విం
బోలాంబన్ బెండ్లియై యొప్పుగఁ గనియె సుతున్ భూపరీరంభలీలా
శీలస్థూలంభవిష్ణుస్థిర భుజబలలక్ష్మీవిశేషప్రయుక్తో
ద్వేలాశాదంతిశుండావిలసనలఘిమావేశు నిమ్మక్షితీశున్. 24

అర్థము : ఆ లక్ష్మాంబాకుమారుండు=ఆ లక్ష్మమ్మ పుత్రుడయిన, అమల యశుఁడు=నిర్మలమైన కీర్తిగల, భావావనీశుండు=భావరాజు, సాధ్విన్=పతివ్రతయైన, పోలాంబన్=పోలమను, పెండ్లియై, ఒప్పుగన్=తగునట్లుగా, భూ=భూదేవి యొక్క పరీరంభ=కౌగిలింతయందుగల, లీలా=వేడుకయే, శీల=స్వభావముగాగల, స్థూలంభవిష్ణు=తోరముగాగల, స్థిర=నిలకడగల, భుజబల=బాహుబలము యొక్క లక్ష్మీవిశేష=విశేష సమృద్ధిచేత, ప్రయుక్త=ప్రయోగింపబడిన, ఉద్వేల+ఆశా=అధికమైన దిక్కుల అంతమందున్న, దంతి=ఏనుగుల యొక్క, శుండా=తుండముల యొక్క విలసన=విజృంభించుట కొఱకై, లఘిమావేశున్=లఘువుగా ప్రవేశించగల,

ఇమ్మక్షితీశున్=ఇమ్మరాజును, సుతున్=కుమారునిగా, కనియెన్=పొందెను.

తాత్పర్యము : ఆ లక్ష్మీ సుపుత్రుడైన నిర్మల కీర్తిగల భావరాజు – పతివ్రతయైన పోలమను పెండ్లాడి, తగినట్లుగా భూదేవి కౌగిలింతలోగల వేడుకయే అలవాటుగాగల తోరముగాగల నిలకడయైన బాహుబలవిశేషముచే ప్రయోగించబడిన దిక్కుల చివరలలో ఉన్న ఏనుగుల తుండముల విజృంభణ కొఱకైన లఘు ప్రవేశముగల ఇమ్మరాజును కుమారునిగా పొందెను.

విశేషణ : ఇమ్మరాజు దిగంత వ్యాప్తి కీర్తిమంతుడు.

కం. రాజమహేంద్రవరాధిపు
రీజైత్ర విచిత్రములఁ బరిభ్రాజితుఁ డై
యాజిఘనుం డాయిమ్మమ
హీజాని ప్రసిద్ధిఁ గాంచె నెంతయు మహిమన్. 25

అర్థము : రాజమహేంద్రవర=రాజమహేంద్రవరమను, అధిపురీ=శ్రేష్ఠమైన పట్టణము యొక్క, జైత్ర=జయించిన, విచిత్రములన్=వింతపనులచే, పరిభ్రాజితుఁడై=ప్రకాశించినవాడై, ఆజిఘనుండు=యుద్ధములో శూరుడయిన, ఆ+ఇమ్మమహీజాని=ఆ ఇమ్మరాజు, ఎంతయున్ మహిమన్=గొప్ప ప్రభావముతో, ప్రసిద్ధిన్+కాంచెన్=పేరు ప్రతిష్ఠలు గడించెను.

తాత్పర్యము : రాజమహేంద్రవరమను శ్రేష్ఠమైన పట్టణమును జయించిన వింత పనులచే ప్రకాశించినవాడై, యుద్ధరంగములో శూరుడైన ఆ ఇమ్మరాజు గొప్ప ప్రభావముతో పేరు ప్రఖ్యాతులు గడించెను.

తే. ఆమహీలోకవిభుని యర్ధాంగలక్ష్మి
యయిన కసవమ్మ యనసూయ యగుట నార్య
యగుట సుప్రసిద్ధమ వేఱె యడుగ నేల
వినుతి కెక్కు పాతివ్రత్యవిలసనంబు. 26

అర్థము : ఆ మహీలోకవిభుని=ఆ ఇమ్మరాజుయొక్క, అర్థాంగలక్ష్మి=అర్ధ శరీరలక్ష్మి (భార్య) ఐన=అయినట్టి, కసవమ్మ, అనసూయ=అసూయలేనిది, అగుటన్=అయినందువలన, ఆర్య=శ్రేష్ఠురాలు, అగుటన్=అగుట, సుప్రసిద్ధమ= తేటతెల్లమే! వినుతికి+ఎక్కి=ప్రఖ్యాతి గడించిన, పాతివ్రత్య విలసనంబు=పతివ్రతా మహిమను, వేఱె=ప్రత్యేకముగా, అడుగనేల=విచారింప నవసరము లేదు.

తాత్పర్యము : ఆ ఇమ్మరాజు భార్య అయిన కసవమ్మ అసూయ లేని దగుటచే శ్రేష్ఠురాలైన విషయము తేటతెల్లమే! ప్రఖ్యాతి గడించిన ఆమె పతివ్రతా మహిమను ప్రత్యేకించి అడుగ నవసరము లేదు.

కం. ఆ యిమ్మడి ధాత్రీతల
నాయకునకుఁ గసవమకును నందను లధిక
శ్రీయుతు లిద్దఱు సుజనవి
ధేయులు బొమ్మప్రభుండు తిమ్మవిభుండున్ 27

అర్థము : ఆ యిమ్మడి ధాత్రీతల నాయకునకున్=ఆ ఇమ్మడి రాజునకు, కసవమకును, అధిక శ్రీయుతులు=గొప్ప ఐశ్వర్యవంతులు, నందనులు=కుమారులు- ఇద్దఱు, సుజన విధేయులు=సజ్జనులకు లొంగినవారు-బొమ్మ ప్రభుండు, తిమ్మ విభుండున్-బొమ్మరాజు, తిమ్మరాజు.

తాత్పర్యం : ఆ యిమ్మ రాజునకు, కసవమకు ఐశ్వర్యవంతులైన సజ్జనులకు విధేయులైన ఇద్దరు కుమారులు - వారు - బొమ్మరాజు, తిమ్మరాజు - (కలిగిరి).

వ. వారిలోన 28

వారిలోన = ఆ ఇరువురిలో

ఉ. పావనమూర్తియై విజయభైరవసద్బిరుదాంకుఁ డై దశా
శావనితాలలాటతటచందన చిత్రకభావభాగ్యశ
శ్రీవిభవాభిరాముఁడయి జృంభితదానవిహారుఁ డై ధరి
త్రీవలయంబునన్ వెలసెఁ దిమ్మనృపాలుఁడు ధర్మశీలుఁ డై. 29

అర్థము : పావనమూర్తియై=పవిత్ర శరీరముగలవాడై (సౌందర్యవంతుడు) విజయభైరవ సత్+బిరుద+అంకుఁడై=విజయ భైరవుడను గొప్ప బిరుదుగలవాడై, దశ+ఆశా=పది దిక్కులనెడు, వనితా=కాంతల యొక్క, లలాటతట=ఫాలభాగము నందుగల, చందన చిత్రకభావ=గంధపు బొట్టుగా భాక్=భాసించిన; యశః +శ్రీవిభవ+అభిరాముఁడయి=కీర్తి వైభవముచే ప్రకాశించినవాడై, జృంభిత=అధికమైన, దానవిహారుఁడై=దానములు చేయువాడై, ధర్మశీలుఁడై=పుణ్య స్వభావముగలవాడై, తిమ్మనృపాలుడు=తిమ్మరాజు, ధరిత్రీవలయంబునన్=భూవలయములో, వెలసెన్=ప్రకాశించెను.

తాత్పర్యము : పవిత్ర శరీరము గలిగి విజయభైరవుడను మంచి బిరుదుగలవాడై, పది దిక్కులనెడి కాంతల ఫాలభాగమున గంధపు బొట్టుగా భాసించిన కీర్తి వైభవముచే ప్రకాశించినవాడై, మిక్కిలి దానములు చేయువాడై, పుణ్యశీలుడై తిమ్మరాజు భూవలయములో ప్రకాశించెను.

విశేషము : దిగంత వ్యాపిత కీర్తిమంతుడని భావము.

కం. ఉభయకులసిద్ధిఁ దనరెడు
నభినవగుణములఁ బ్రసిద్ధ యగుతిమ్మాంబన్
విభవమునఁ బెండ్లి యాడెను
త్రిభువనవిభుఁ డాకువీటితిమ్మవిభుఁ డొగిన్ 30

అర్థము : త్రిభువనవిభుఁడు=ముల్లోకములకు ప్రభువు, ఆకువీటి తిమ్మ విభుఁడు=ఆకువీటి తిమ్మరాజు, బగిన్=క్రమముగా, ఉభయకుల=రెండు వంశములకు (పుట్టినిల్లు, మెట్టినిల్లు) సిద్ధిన్=నిలకడచేత, తనరెడు=ఒప్పునట్టి, అభినవగుణములన్ =కొత్త గుణములచే, ప్రసిద్ధయగు=ప్రసిద్ధురాలైన, తిమ్మాంబన్=తిమ్మమ్మను, విభవమునన్=వైభవముగా, పెండ్లియాడెను=వివాహమాడెను.

తాత్పర్యము : ముల్లోకములకు ప్రభువైన ఆకువీటి తిమ్మరాజు క్రమముగా ఉభయవంశములకు నిలకడచే నొప్పు సద్గుణరాశి, ప్రసిద్ధురాలు అయిన తిమ్మాంబను వైభవముగా పెండ్లాడెను.

చ. పటుబలశాలి తిమ్మనరపాలుఁడు పుత్త్రులఁ గాంచె విక్రమో
ద్భటుఁ బెదవేంకటాద్రిఁ బ్రతిపక్షహరుం బినవేంకటున్ మరు
ద్విటపిసమానదానఘను వేంకటరాయని భవ్యతేజు వేం
కటవరదున్ బుధప్రణుతి గాంచిన తిమ్మమయందుఁ బెంపుగన్ 31

అర్థము : పటుబలశాలి=గొప్ప బలము గల, తిమ్మనరపాలుఁడు=తిమ్మరాజు, బుధప్రణుతి గాంచిన=పండితులచే ప్రశంసించబడిన, తిమ్మమ యందు=తిమ్మాంబ వలన, పెంపుగన్=వృద్ధిగా, విక్రమ+ఉద్భటున్=పరాక్రమాతిశయముగల, పెద వేంకటాద్రిన్=పెదవేంకటాద్రిని, ప్రతిపక్షహరున్=శత్రువులను సంహరించు, పినవేంకటున్=చిన్న వేంకటాద్రిని, మరుత్+విటపిసమాన=కల్పవృక్షముతో సమానమైన, దానఘనున్=దానగుణములో గొప్పవానిని, భవ్యతేజున్=ప్రతాపశాలిని, వేంకటవరదున్=వేంకటవరదుని (నలుగురిని) పుత్రులన్=కుమారులను, కాంచెన్=పొందెను.

తాత్పర్యము : అధిక బలశాలియైన తిమ్మరాజు పండిత ప్రశంసలందుకొన్న తిమ్మాంబ వలన పరాక్రమాతిశయముగల పెదవేంకటాద్రిని, శత్రుసంహారకుడైన చిన్న వేంకటాద్రిని, దానగుణములో గొప్పవాడైన వేంకటరాయని, భవ్యతేజస్సుగల వేంకటవరదుని (నలువురిని) కుమారులుగా పొందెను.

వ. అందు 32

తే. అమరవరభూమి భృన్మస్తకములఁ గ్రిందు
పఱచు నిజపాదకటక సత్ప్రౌఢిచేత
విమలధృతిఁ గేశవ ప్రాయణమున వెలయు
వేంకటాద్రియ యనఁ బినవేంకటాద్రి 33

అర్థము : అమరవర=దేవతల నగరమైన, భూమిభృత్=మేరు పర్వతము యొక్క, మస్తకములన్=శిఖరములను, క్రిందుపఱచు=తగ్గునట్లు చేయు, నిజ=తన యొక్క పాదకటక=అందెల యొక్క, సత్+ప్రౌఢి చేతన్=ఔన్నత్యముచేత, విమల=నిర్మలమైన,

ధృతిన్=ధైర్యముచే, కేశవ=వేంకటేశ్వరునికి, ప్రాయణమునన్=ఉనికిచేత, వేంకటాద్రియ=వేంకటాచల పర్వతమనునట్లుగా, పినవేంకటాద్రి, వెలయున్=ఒప్పును.

తాత్పర్యము : మేరుపర్వత శిఖరములను తక్కువ చేయుచున్న తన యొక్క నితంబ ప్రదేశము యొక్క గొప్పదనముచే రాజశ్రేష్ఠుల తలలను తన పాద నూపురములచే వేంకటాచల పర్వతమువలె పిన వేంకటాద్రి యొప్పెను.

విశేషము : ఇక్కడ వేంకటాచలమునకు పినవేంకటాద్రికి సామ్యము చెప్పబడినది. మేరునగమును వేంకటాచలము తల వొంచుకొనునట్లు చేయగా, పిన వేంకటాద్రి శత్రురాజుల తలలను తన పాదనూపురములచే వంచుకొనునట్లు చేయుచున్నాడు. పాదకటక=నితంబమని యొక అర్థము, అందెలు అని మరొక అర్థము.

చ. క్షమయు నమోఘవిక్రమము సద్వినయంబు ప్రతాపమున్ సురూ
పము నవికారభావమును బ్రాభవశక్తియు నిత్యదాన శీ
లముఁ దగ నొక్కటొక్కటి కలంకృతిఁజేయఁగఁ దాల్చి శోభిలున్
విమలత నాకువీటి పురవేంకటరాయఁ డతిప్రసిద్ధుఁడై. 34

అర్థము : ఆకువీటిపుర=ఆకువీటి నగరమున కధిపతియయిన, వేంకటరాయఁడు, క్షమయున్=ఓర్పు, అమోఘవిక్రమము=గొప్ప పరాక్రమము, సత్+వినయంబు=మంచి వినయము, ప్రతాపమున్=శౌర్యము, సురూపము= అందము, అవికారభావమును=వికారము లేకుండుటయు, ప్రాభవశక్తియు=ఠీవియు, నిత్యదానశీలము=నిరంతరము దానముచేయు గుణము, తగన్=తగినట్లుగా, ఒక్కటి+ఒక్కటికిన్=ఒకటి మఱియొక గుణమునకు, అలంకృతిన్=అలంకారము, చేయఁగ=చేయునట్లు, తాల్చి=ధరించి, అతిప్రసిద్ధుడై=మిక్కిలి పేరు సంపాదించి, విమలతన్=నిష్కల్మషత్వముచే, శోభిలున్=ప్రకాశించును.

తాత్పర్యము : ఆకువీటిపుర వేంకటరాయడు ఓర్పు, అధిక పరాక్రమము, వినయసంపద, శౌర్యము, మంచి రూపము, అవికారము, రాచఠీవి, నిరంతర

దానగుణములు తగినట్లుగా ఒక గుణము మఱొక గుణమునకు అలంకారము చేయునట్లుగా ధరించి మంచి పేరు సంపాదించి, నిష్కల్మష భావముతో ప్రకాశించెను.

కం. వేంకటవరదుఁడు వెలయు ని
రంకుశ వితరణనిరూఢ ప్రజ్ఞను రణని
శ్శంకిత ప్రాభవమున నక
లంకితకీర్తి ప్రతాపలక్ష్ముల మహిమన్. 35

అర్థము : వేంకటవరదుఁడు=వేంకటవరదరాజు, నిరంకుశ=అడ్డులేని, వితరణ=దానములందు, నిరూఢ=లగ్నమైన, ప్రజ్ఞను=బుద్ధిచే, రణ=యుద్ధమునందు నిశ్శంకిత=జంకులేని, ప్రాభవమునన్=వైభవముచే, అకలంకిత=మచ్చలేని, కీర్తి, ప్రతాపలక్ష్ముల=కీర్తి, శౌర్యములను సంపదల, మహిమన్=గొప్పదనముచే, వెలయున్=ప్రకాశించును.

తాత్పర్యము : వేంకటవరదరాజు తన నిరంతర దానగుణముచేతను, యుద్ధములో జంకులేని శౌర్యముచేతను, మచ్చలేని కీర్తి, శౌర్యములను సంపదల ఆధిక్యముచే ప్రకాశించును.

తే. ఇట్టి యన్వయపరిశుద్ధి యింపుమీఱ
శ్రీవిరూపాక్ష భక్తివిశేషవిమల
హృదయుఁ డగుచు సంగీత సాహిత్యనిత్య
సరసగోష్ఠీవినోదైకనిరతుఁ డగుచు. 36

అర్థము : ఇట్టి, అన్వయపరిశుద్ధి=పరిశుభ్రమైన వంశముయొక్క ఇంపు మీఱన్= సొంపు పెంపగా, శ్రీ విరూపాక్ష భక్తివిశేష=విరూపాక్ష స్వామిపై భక్తి అతిశయముచే, విమలహృదయుఁడగుచు=నిర్మలమైన మనస్సు గలవాడై, సంగీత సాహిత్య=సంగీతముసాహిత్యములందు, నిత్యసరస=నిరంతరము సరసులతో, గోష్ఠి=కూటమిగా చేరి, వినోద+ఏక నిరతుఁడగుచు=వేడుక యందే ఇచ్ఛ కలవాడై.

తాత్పర్యము : ఇట్టి పరిశుద్ధమైన వంశములో సొంపు మీఱగా శ్రీ విరూపాక్ష

స్వామిపై గల భక్తి విశేషముచే మంచి హృదయము గలవాడై, సరస సంగీత సాహిత్య కూటములందు నిరంతరము కోర్కె గలవాడై.

విశేషము : పై పద్యముతో కర్తృక్రియలు అన్వయము చేయవలెను.

ఇది సతి సప్తమి.

కం. వడిగలతనాన నీవిని
విడిముడిపసఁ బ్రాభవమున విజయనగరిలోఁ
గడు నెన్న నేర్పఁ గలమే
ల్నడకలఁ బెదవేంకటాద్రి నరువరుఁ డొప్పున్. 37

అర్థము : వడిగలతనానన్=పరాక్రమము చేతను, ఈవిని=దానగుణము చేతను, విడిముడిపసన్=ధనసంపదచే, ప్రాభవమునన్=వైభవముచే, విజయనగరిలో= విజయనగరములో, కడున్=మిక్కిలి, ఎన్నన్=లెక్కించుటకు, ఏర్చన్=ఏర్పరచుటకు, కల=కలిగిన, మేల్+నడకలన్=మేటి ప్రవర్తనచే, పెదవేంకటాద్రి నరవరుడు=పెద వేంకటాద్రిరాజు, ఒప్పున్=ప్రకాశించును.

తాత్పర్యము : శౌర్య పరాక్రమములచేతను, దానగుణముచేతను, సంపదలు, వైభవముచేతను విజయనగరములో లెక్కించుటకు మిక్కిలిగా ఏర్పరుప కలిగిన మేటి ప్రవర్తనచే పెదవెంకటాద్రిరాజు ప్రకాశించును.

చం. విడువక యాకువీటి పెదవేంకటభూపతి సత్ప్రతాపమున్
గడుఁ దెలుపైన కీర్తియు జగంబుల నన్నిఁటి మించి ముంచినన్
జడధిశయుండు సంతసిలు నాదు విరాణ్మయమూర్తి కబ్బె ని
ప్పుడు నవకుంకుమంబు తెలిపూవుల పూజయు నంచునాత్మలోన్. 38

అర్థము : ఆకువీటి=ఆకువీటి పట్టణ ప్రభువైన, పెద వేంకటభూపతి=పెద వేంకటరాజు, సత్+ప్రతాపమున్=మంచి పరాక్రమమును, కడు=మిక్కిలి, తెలుపైన

కీర్తియు=తెల్లని యశము, జగంబులన్=లోకములను, అన్నిఁటిన్=అన్నింటిని, మించి=అతిశయించి, విడువక=వదలక, ముంచినన్=ముంచగా, జడధిశయుండు= సముద్రములో శయనించిన విష్ణువు, ఇప్పుడు, నాదు=నాయొక్క, విరాట్+మయ= విరాట్రూపమైన; మూర్తికిన్=దేహమునకు, నవకుంకుమంబు=కొత్త కుంకుమ పూతయు, తెలిపూవుల=తెల్లని పూల, పూజయు=అర్చనయు, అబ్బెనంచున్=కలిగెనని, ఆత్మలోన్=మదిలో, సంతసిల్లున్=ఆనందించును.

తాత్పర్యము : ఆకువీటి పెదవేంకటాద్రిరాజు యొక్క ఉజ్జ్వల పరాక్రమము, తెల్లని యశము లోకములన్నింటిని అతిశయించి ముంచెను. ఈ వేళ నాదు విరాట్ రూపమునకు కొత్త కుంకుమ పూతయు, తెల్లని పూలచే అర్చనయు కలిగెనని నారాయణుడు మనస్సులో ఆనందించెను.

విశేషము : ప్రతాప ప్రవాహము జలప్రళయమువలె ముంచి వేసెనని భావము. హరి (విరాణ్మూర్తియై) వటపత్రశాయిగా ప్రళయకాలమున పవళించుట ప్రసిద్ధము.

ఉ. చేకొని యాకువీటివిభు శ్రీపెదవేంకటుఁ జెంది యాత్మలో
నేకల సద్గుణంబు మహియెన్న దనేకలసద్గుణాప్తి చేఁ
గైకొని శేషభోగముల కల్మి దలంప దశేషభోగలీ
లాకలనంబు చేతఁ గరులన్ గిరులన్ మఱి చెప్ప నేటికిన్. 39

అర్థము : మహి=భూదేవి, ఆకువీటివిభున్=ఆకువీటి రాజైన, శ్రీపెద వేంకటున్=పెదవేంకటాద్రిని, చేకొని=వరించి, చెంది=పాలింపబడినదై, ఆత్మలోన్=హృదయములో, సద్గుణాప్తిచే=మంచి గుణముల ప్రాప్తిచే, అనేకల= సహాయ, సత్+గుణము=మంచి గుణము-ఎన్నదు=లెక్కించదు. (అనేక=పెక్కు, లసత్=ప్రకాశించు గుణగుణములుగల, ఆప్తిచేన్=ప్రాప్తిచే, ఏక=ఒకటైన, ఏకల= వరాహము యొక్క), శేషభోగములకల్మి=శేషభోగముల సంపదచే, లీలాకలనంబు చేతన్=విలాసానుభవముచే, శేష=ఆదిశేషుని యొక్క, భోగముల=పడగల, కల్మి=సంపదను, తలంపదు=లెక్కింపదు. అశేష=సమస్త, భోగ=సుఖముల యొక్క,

లీలాకలనంబుచే=విలాసక్రియచే, శేష=కొద్దిదైన-భోగముల సంపదను తలంపదు, మఱి ఇంక, కరులన్=అష్టదిగ్గజములను, గిరులన్=సప్తకుల పర్వతములను, చెప్పన్+ఏటికిన్=చెప్పనవసరమేమి?

తాత్పర్యం : భూదేవి పెద వేంకటాద్రిని వరించి పాలించబడినదై హృదయములో మంచిగుణముల ప్రాప్తిచే వరాహసుగుణమును లెక్కింపదు. ప్రకాశించుచున్న గుణముల ప్రాప్తిచే ఆదిశేషుని పడగల విలాసమును మెచ్చదు. అష్టదిగ్గజములను, సప్తకుల పర్వతములను లెక్కింపదు.

విశేషము : రసిక శిఖామణియైన పెద వేంకటాద్రిని కూడి ఆతని సద్గుణములను మరగినదిగాన, ఇతర మృగముల గుణమును మెచ్చదు. కేవల భగవదంశ సంభూతములైన వరాహాది శేషులే ఇట్లయినచో ఇతరముల విషయము ఏమి చెప్పగలము?

తే. ఈ కరణి ధాత్రి వెలసిన యాకువీటి
తిమ్మరాహుత్తతనయుఁ డు త్తీర్ణకీర్తి
పరుఁడు పెదవేంకటాద్రి భూవరుఁడు సేయు
సేవ లింపుగఁ గైకొని దైవమునకు. 40

అర్థము : ఈ కరణిన్=ఈ విధముగా, ధాత్రిన్=భూమిపై, వెలసిన=ప్రకాశించిన, ఆకువీటి=ఆకువీటి రాజైన తిమ్మరాహుత్త=తిమ్మరాజాగ్రణి, తనయుడు=కుమారుడు, ఉత్తీర్ణ=లోకమును జయించిన, కీర్తి=యశములో, పరుఁడు=ఆసక్తుడై, పెదవేంకటాద్రి భూవరుఁడు=పెదవేంకటాద్రి రాజు, కైకొని=ప్రయత్నించి, దైవమునకు=భగవంతునికి, ఇంపుగ=ఇష్టముతో, సేవలు, సేయు=చేయును.

తాత్పర్యం : ఈ విధముగా భూమిపై వెలసిన తిమ్మరాజు కుమారుడైన పెద వెంకటాద్రిరాజు అతిశయించిన కీర్తిగలవాడు. ఆయన ఇష్టముతో దైవమునకు పూజలు చేయును.

షష్ఠ్యంతములు :

కం. లోకైక స్తుత్యునకు ని
రాకృతనతజనజనుర్జరామృత్యునకున్
త్రైకాల్యసత్యునకుఁ బా
ణౌకృతగిరిరాడపత్యునకు నిత్యునకున్. 41

అర్థము : లోక+ఏకస్తుత్యునకున్=జనులచే ప్రధానముగా పొగడదగిన వానికి, నిరాకృత=పోగొట్టబడిన, నతజన=నమస్కరించు జనులయొక్క, జనుర్జరాం మృత్యునకున్=పుట్టుక, ముసలితనము, చావు గలవానికి, త్రైకాల్య=భూత, భవిష్యత్, వర్తమాన కాలములు మూడింటను, సత్యునకున్=నిత్యుడైన వానికి, పాణీకృత=పాణిగ్రహణము చేసిన (పెండ్లాడిన) గిరిరాట్+అపత్యునకున్=పర్వతరాజు కూతురు పార్వతిగలవానికి.

తాత్పర్యం : జనులచే ప్రధానముగా స్తోత్రము చేయదగినవానికి, అభివాదము చేయువారి పుట్టుక, ముదిమి, చావులు పోగొట్టిన వానికి, భూత భవిష్యత్ వర్తమాన కాలములు మూడింటను నిత్యుడయిన వానికి, పార్వతిని పెండ్లాడిన వానికి.

విశేషములు : షష్ఠీ విభక్తితో అంతమగునట్లు 8 కందములు షష్ఠ్యంతములుగా చెప్పబడినవి.

కం. అధ్యాత్మ తత్త్వవిద్యా
సాధ్యునకు సమస్త యోగిజన హృత్కమలా
రాధ్యునకుఁ గాలదిగనవ
రోధ్యున కధ్యుషితతిగ్మరుచిమధ్యునకున్. 42

అర్థము : అధ్యాత్మతత్వవిద్యా=బ్రహ్మ విద్యచేత, సాధ్యునకున్=సాధింపదగిన వానికి, సమస్త యోగిజన=అందరు తపోధనుల యొక్క, హృత్+కమల=మానసమను కమలములచేత, ఆరాధ్యునకున్=పూజింపదగినవానికి, కాల=కాలముచేతను,

దిక్=దిక్కులచేతను, అనవరోధ్యునకు=అడ్డగింపదగిన వానికి, అధ్యుహిత (అధి+ఉహిత)=ఉనికి చేయబడిన, తిగ్మరుచి=వేడి వెలుగు యొక్క, మధ్యునకున్=నడుముగలవానికి.

తాత్పర్యము : బ్రహ్మవిద్యచే సాధింపదగినవానికి, సమస్తతపోధనుల మానసాబ్జములచే పూజింపదగినవానికి, కాలముచేతను, దిక్కులచేతను అడ్డగింపలేని వానికి ఉనికిచే, వేడి వెలుగు నడుముగాగలవానికి.

విశేషం : ఇతర విద్యలచే ఎవ్వరి చేతనైనను సాధింపదగినవాడు. త్రిమూర్తులు మార్తాండ మండల మధ్యవర్తులని వేదనిష్ఠమైయున్నది.

కం. శంకారుజాపహృత్యగ
దంకారున కచలితామృత ప్రియముఖస
త్యంకారభక్తియుక్త్యక
లంకారచితార్యనుత్యలంకారునకున్. 43

అర్థము : శంకా=భయమనెడు, రుజా=వ్యాధిని, అపహృతి=పోగొట్టుటకు, అగదంకారునకున్=వైద్యుని వంటి వానికి, అచలిత=చలింపబడని, అమృత=సుధవలె, ప్రియముఖ=ఇంపైన మాటల యొక్క, సత్యంకార=నిశ్చలమైన, భక్తి=భక్తి యొక్క, యుక్తి=కూడికచే, అకలంక=కాలుష్యము లేకుండ, ఆరచిత=మించిన, ఆర్య=పెద్దల, నుతి=స్తోత్రములే, అలంకారునకున్=భూషణములుగా గలవానికి.

తాత్పర్యము : భయమను వ్యాధిని పోగొట్టుటకు వైద్యుని వంటివాడు, చలింపబడని అమృతము వలె ప్రియమైన వాక్కుల యొక్క నిశ్చలభక్తితో కూడి కాలుష్యరహితముగా పెద్దల స్తోత్రములు మించిన ఆభరణములుగా గలవానికి.

విశేషము : ఆశ్రితులకు జనన మరణాదులవలన కలుగు భయము పోగొట్టువాడు. భక్తితో సుజనులు చేయు స్తోత్రములకు సంతసించువాడు.

కం. ప్రార్థన పరసురసార్థహి
తార్థకృత త్రిపుర దైత్యహతికిన్ వేదాం

తార్థావనలీలాచరి
తార్థీకృతబహుమహర్షి హర్షితమతికిన్. 44

అర్థము : ప్రార్థన=వేడికోలునందు, పర=ఆసక్తి గలిగి, సురసార్థ=దేవతల గుంపునకు, హిత=మేలైన, అర్థ=ప్రయోజనము కొఱకు, కృత=చేయబడిన, త్రిపురదైత్య=త్రిపురాసురులను, హతికి=సంహరించనవానికి, వేదాంత=ఉపనిషత్తుల యొక్క, అర్థ=అర్థముయొక్క, అవన=పాలనమునందుగల, లీలా=విలాసముచే, చరిత+అర్థీకృత=సార్థకము చేయబడిన, బహుమహర్షి=అనేక ఋషుల యొక్క, హర్షిత=సంతోషించిన, మతికిన్=మనస్సుగలవానికి.

తాత్పర్యము : దేవతల సమూహముయొక్క ప్రార్థనలచేత త్రిపురాసుర సంహారము చేసినవానికి, ఉపనిషత్తుల అర్థపాలనమునందు విలాసముగల సార్థకులైన అనేక ఋషులను సంతోషింపజేసిన మనస్సు గలవానికి.

విశేషము : దేవతల ప్రార్థన స్వీకరించి పరమశివుడు త్రిపురాసుర సంహారము చేసెను. వేదాంతానుసరణముగా తాను ప్రవర్తించి మహర్షుల కోర్కెలను సఫలము జేసెను.

కం. దక్షమఖధ్వంసునకుం
జక్షూభవదనలకుముదసఖహంసునకున్
భిక్షాసరిరంసునకున్
వీక్షాసఫలితమనోజవిజిఘాంసునకున్. 45

అర్థము : దక్షమఖ=దక్ష ప్రజాపతి యొక్క యజ్ఞ, ధ్వంసునకున్=ధ్వంసము చేసిన వానికి, చక్షూభవత్=నేత్రములైన, అనల=అగ్నిదేవుడు, కుముదసఖ= కలువలఱేడు సూర్యుడు కలవానికి, భిక్షా=బిచ్చమడుగుటయందు, సరిరంసునకున్= క్రీడించు వేడుక గలవానికి, వీక్షా=చూపులచేత, సఫలిత=నెరవేర్చబడిన, మనోజ=మన్మథుని, విజిఘాంసునకున్=చంపనిచ్చగలవానికి.

తాత్పర్యము : దక్షప్రజాపతి యజ్ఞమును ధ్వంసము చేసిన వానికి, అగ్నిదేవుడు, సూర్యుడు రెండు కనులుగా గలవానికి, భిక్షాటనమందు ఇచ్చగలవానిని, తన చూపుచే

మన్మథుని చంపనిచ్ఛగించు వానికి.

విశేషము : మూడవ కంటితో మన్మథుని సంహరించినవాడు శివుడు.

కం. పశ్యత్ఫాలున కతిదృ
గ్దృశ్యద్రష్టాదిభేదధీజాలునకున్
వశ్యావిద్యునకు శమా
వశ్యాసాధ్యునకు నిత్యవైశద్యునకున్. 46

అర్థము : పశ్యత్=చూచుచున్న, ఫాలునకున్=నుదురు గలవానికి, అతిదృక్=చూడనతిక్రమించినవాడు, దృశ్య=చూడదగినవాడు, ద్రష్ట=చూచువాడును, ఆది=ఇవి మొదలుగాగల, భేద=భిన్నమొందిన, ధీ=బుద్ధుల యొక్క, జాలునకున్=సమూహులు గలవానికి, వశ్య=లోకువ చేసికొనదగిన, అవిద్యునకున్=మాయగల వానికి, శమ=ఓర్పు చేత, అవశ్య=తప్పకుండ, అసాధ్యునకున్=పొందదగినవానికి, నిత్య=నిత్యమైన, వైశద్యునకున్=నిష్కళంకునికి.

తాత్పర్యము : నుదుట చూపుగలవానికి, చూచుటకు శక్యముగానివానికి, చూడదగినవాడు, చూచువాడు - మొదలుగా భిన్న మొందిన ధీమంతుల సమూహముగల వారికి లోకువ చేసికొనదగిన మాయగలవానికి, ఓర్పుచే ప్రధానముగా పొందదగినవానికి, నిత్య నిష్కళంకునికి.

విశేషణము : త్రినేత్రుడు నుదుట నేత్రము గలవాడు. ధీమంతులు తమ తమ బుద్ధిబలముచే తన్ను చూడరానివాడు. భిన్న భావముల నిరూపణము చేయుదురని భావము. మాయచే తాను అందరిని మోహింపజేసినను, ఈశ్వరుడు అట్టి మాయకు తాను మోహము తొలగించును. శమదమాది గుణములగల వారికే అతడు లభ్యుడు, నిష్కళంకుడు.

కం. దేవాసురనరతిర్యక్
స్థావరబహుజంతుపూర్ణ సంఖ్యాతిగరా

జీవభవాండఫలావి
ర్భావాకరవపురుదుంబర క్ష్మాజునకున్. 47

అర్థము : దేవ=దేవతలు, అసుర=రాక్షసులు, నర=మనుషులు, తిర్యక్=జంతువులకు, స్థావర=నిలకడగల వృక్షములకు, బహు=పెక్కు, జంతు=జంతువులచేత, పూర్ణ=నిండిన, సంఖ్యాతిగ=లెక్కకు మించిన, రాజీవభవ+అండ=బ్రహ్మ గ్రుడ్డులనెడి, ఫల=మఱ్ఱిపండ్ల=యొక్క ఆవిర్భావ=పుట్టుకకు, ఆకరమైన=నెలవైన, వపుః=శరీరమనెడి, ఉదుంబర=మఱ్ఱి, క్ష్మాజునకున్=చెట్టుగలవానికి.

తాత్పర్యము : దేవతలు, రాక్షసులు, నరులు, జంతువులు, వృక్షములు, ఇతర జంతువులచేత నిండిన లెక్కకు మించిన బ్రహ్మ గుడ్డులను మఱ్ఱి పండ్ల పుట్టుకకు నెలవైన శరీరమను మఱ్ఱి చెట్టుగలవానికి.

విశేషణము : అసంఖ్యాకమైన చరాచర జంతుజాలముతోకూడిన బ్రహ్మాండ భాండ సహస్రములు వటఫలములు వటవృక్షమునకు వలె తన శరీరములో అతి వేలముగా పుట్టించువాడు శివుడు.

కం. దీపితరాగశివాత
న్వీపుండ్రేక్షునకు నాకువీటిపురాంక
శ్రీ పెదవేంకటనృపధీ
రూపాంబకలక్షునకు విరూపాక్షునకున్. 48

అర్థము : దీపిత=ప్రకాశించు, రాగ=ప్రేమగల, శివా=పార్వతి అనెడు, తన్వీ=స్త్రీకి, పుండ్రేక్షునకున్=మన్మథుడైన వానికి, ఆకువీటిపుర=ఆకువీటిపురము, అంక=గుర్తుగాగల, శ్రీ=సంపదలచే, పెదవేంకటనృప=పెద వేంకటరాజు యొక్క ధీరూప=బుద్ధి స్వరూపమైన, అంబక=కనులకు, లక్షునకున్=విషయమైన వానికి, విరూపాక్షునకున్=విరూపాక్ష స్వామికి.

తాత్పర్యము : ప్రకాశించు అనురాగము గల పార్వతీదేవికి మన్మథుని వంటివాడు, ఆకువీటి గుర్తుగా రాజ్యశ్రీ గల పెదవేంకటరాజు బుద్ధి స్వరూపమైన కనులకు లక్ష్యమైన వానికి, విరూపాక్ష స్వామికి.

విశేషణము : పెదవేంకటాద్రి నిరంతరము ఈశ్వరుని తన హృదయమున ధ్యానించునని భావము.

వ. సభక్తిక సమర్పితంబుగా నాయొనర్పంబూనిన రాఘవపాండ
వీయంబునకుఁ గథాప్రారంభం బెట్టి దనిన. 49

అర్థము : సభక్తిక=భక్తితోగూడిన, సమర్పితంబుగన్=ఇవ్వబడిన, నేన్+ఒనర్పన్+పూనిన=నేను రచించుటకు మొదలిడిన, రాఘవ పాండవీయంబునకున్=రాఘవపాండవీయ కావ్యమునకు, కథాప్రారంభంబు=కథారంభము, ఎట్టిదనినన్=ఎటువంటి దనగా.

తాత్పర్యము : నేను రచించడానికి మొదలుబెట్టి భక్తితో సమర్పించు రాఘవ పాండవీయమునకు కథారంభము ఎట్టిదనగా.

ప్రథమాశ్వాసము

కథా ప్రారంభము

ఆ. వెలయు నఖిలభువనములలోనవారణ
నగరిపురమతల్లి నాఁ దనర్చి
రాజ్యలక్ష్మి మిగులఁ బ్రబల నయోధ్య నాఁ
రాజవినుతి గనిన రాజధాని. 1

రామాయణార్థము : అఖిలభువనములలోన్=సమస్తలోకములలో, అవారణ=అనర్గళమైన, నగరిపు=ఇంద్రునియొక్క, రమ=సంపదను, తల్లి=పోషించునది, నాన్=అనగా, తనర్చి=ప్రకాశించినదై, రాజ్యలక్ష్మి=రాజ్యసంపద, మిగులన్=అతిశయముగా, ప్రబలన్=విస్తరించగా, అయోధ్య నాన్=అయోధ్య అను పేరు గలదై, రాజవినుతి+కనిన=రాజులచే ప్రసిద్ధికెక్కిన, రాజధాని=రాజధాని, వెలయు=ప్రకాశించును.

తాత్పర్యము : సమస్త లోకములలో అనర్గళమైన ఇంద్రుని సంపదను పోషించునదిగా ప్రకాశించినదై, అయోధ్య అను పేర రాజులచే ప్రశస్తికెక్కిన రాజధాని ప్రకాశించును.

భారతార్థము : అఖిలభువనములలోనన్=సమస్తలోకములలో, వారణ నగరి=హస్తినాపురము, పురమతల్లి=శ్రేష్ఠమైన నగరము, నాన్=అనగా, తనర్చి=ప్రకాశించినదై, రాజ్యలక్ష్మి=రాజ్యసంపద, మిగుల+ప్రబలన్=మిక్కిలి విస్తరించగా, అయోధ్యనాన్=యుద్ధము చేయుటకు శక్యము కానిది, అనునట్లుగా, రాజవినుతి+కనిన=నానాదేశరాజులచే పొగడ్తలందిన, రాజధాని=సింహాసనస్థలమై, వెలయు=ప్రకాశించును.

తాత్పర్యము : సమస్తలోకములలో హస్తినాపురము శ్రేష్ఠమైన నగరమనగా

ప్రకాశించినదై రాజ్యసంపద మిక్కిలి విస్తరించగా, యుద్ధము చేయుటకు శక్యము కాదనునట్లుగా నానాదేశపు రాజులచే పొగడ్తలందిన రాజధానీనగరము ప్రకాశించును.

విశేషణ : భువనము='విష్టపం భువనం జగత్' అని అమరకోశకారుడు.

'శ్రీయన గౌరినాc బరగు చెల్వకు' అని తిక్కన సోమయాజి ఆంధ్రమహా భారతములో తొలి పద్యమున 'నాన్' పదమును ప్రయోగించెను.

– రాజ్యలక్ష్మి ప్రబలగా అనుచో అత్యుక్తి అలంకారము – (చంద్రాలోకము) ఆంధ్రభాషాభూషణములో – భువనములలో నవారణ' – అనుచో సంధి. విభక్తులలో 'నురులులకు వచ్చు వోయినబోవు' అను లక్షణముననుసరించి 'ఉ' కార లోపము. 'రమతల్లి' అను ప్రయోగములో షష్ఠ్యర్థములో ప్రథమాంతరూపము ప్రయోగింపబడినది. "సంబంధ షష్ఠిపై ప్రథమయగును". ఉదా : దంతికన్నులు, రమపల్కు, తరువుకొమ్మ. కృత్యాదిని 'వెలయు' – అను పదము వాడుట మంగళప్రదము. ఆదియందు నగణము శుభప్రదము. 'న' కారము అమృత బీజము. వస్తు నిర్దేశరూప మంగళము. 'కృతి ముఖమున దైవ నమస్కృతి యొండె' అని ఇక్కడ మంగళప్రద ప్రయోగము.

"కృతులకు మొదలన్ మభజసనయరత గణాళి మల్లియరేచా' అని భీముని ఛందము. 'అవారణనగరి పురమతల్లి' – ప్రథమాంతము మీది పకారమునకు వకారాదేశము ప్రాసస్థానమందు నిత్యముగా వచ్చును. యతిస్థానమున ఉండరాదు. అందుచేత వారణనగరి పురమతల్లి' అని చెప్పవచ్చును.

కం. ఆపట్టణ మేలెడిపృథి
వీపాలుcడు భ్రుకుటిమాత్ర విముఖితసమదా
టోపారిపంక్తి రథుc డు
ద్దీపించు నుదారనీతి ధృతరాష్ట్రుc డనన్. 2

రామా : భ్రుకుటిమాత్ర=బొమముడిచే, విముఖిత=వెనుకకు తిరుగునట్లుగా

చేసిన, సమదాటోప=గర్వాతిశయముతో గూడిన, అరి=శత్రువులుగల, పంక్తి రథుఁడు=దశరథుఁడు, ఉదారనీతిన్=ఉదారమైన నీతిచే, ధృత=ధరించబడిన, రాష్ట్రుఁడు=దేశము నేలువాడు, అనన్=అనగా, ఆ పట్టణము+ఏలెడు=ఆ నగరమును పాలించు, పృధీవీపాలుడు=రాజు, ఉద్దీపించున్=ప్రకాశించును.

తాత్పర్యము : తన బొమముడిచేతనే శత్రువులు వెనుకకు తిరుగునట్లుగా చేయగల గర్వాతిశయముగల దశరథుడు ఉదారమైన రాజనీతిచే ధరించబడిన దేశము నేలువాడుగా ఆ నగరమును పాలించుచు ప్రకాశించును.

భారత : భ్రుకుటిమాత్ర విముఖిత సముదాటోపారి, పంక్తిరథుడు= శ్రేణులుగాగల రథములు గలవాడు, ధృతరాష్ట్రుఁడు+అనన్=ధృతరాష్ట్ర మహారాజు అనగా.

తాత్పర్యము : తన బొమముడిచే శత్రురాజులయొక్క రథముల శ్రేణులను వెనుకకు తిరుగునట్లుగా చేయగల గర్వాతిశయముతో గూడిన ఉదార రాజనీతి గల ధృతరాష్ట్రుడనగా ఆ నగరమును పాలించు రాజు ప్రకాశించును.

విశేషణము : పంక్తిరథుడు – "పంక్తి స్స్యాద్దశమచ్ఛందో దశసంఖ్యావళీషుచ" – విశ్వనిఘంటువు : విముఖత = 'క్త' ప్రత్యయాంతము. ఉదా : సువర్ణ దండైకసితాతపత్రితజ్వలత్ ప్రతాపావళికీర్తిమండలః – "హర్షనైషధం. ఉదారనీతి" 'ఉదారోదాత్తమహతోః'

చం. తెలివి నతిప్రగల్భుఁ డసదృగ్బలుఁ డాతఁడు భీష్మచాపకౌ
శలమె సహాయమై యమరశత్రుల నేపడఁపన్ వలంతియై
నిలుకడ నేలె విశ్వధరణిం దనమిత్త్రకులంబు వైభవో
జ్జ్వలతఁ దలిర్పఁ బౌరవసుసంతతిరాజుల కెల్ల హెచ్చుగన్. 3

రామా : తెలివిన్=తెలివి తేటలతో, అతిప్రగల్భుడు=మిక్కిలి శౌర్యముగలవాడు, అసదృక్+బలుఁడు=సాటిలేని బలముగలవాడు, ఆతడు=ఆ దశరథుడు,

భీష్మ=భయంకరమైన, చాపకౌశలమె=వింటి యందలి నేర్పే, (ధనుర్విద్య) సహాయమై, అమరశత్రులన్=దేవతల శత్రువులైన రాక్షసులను, ఏపు+అడఁపన్=బలమును అణగద్రొక్కుటకు, వలంతియై=సమర్థుడై, విశ్వధరణిన్=సమస్తభూప్రపంచమును, తన=తన యొక్క, మిత్త్రకులంబు=సూర్యవంశము, వైభవ+ఉజ్జ్వలత=వైభవ ప్రకాశముచే, పౌర=పట్టణమువారి, వసు=ధనముల, సంతతి=సమూహము, రాజులకెల్ల, హెచ్చుగన్=అధికముగా, నిలుకడన్=వంశపారంపర్యముగా, ఏలెన్=పాలించెను.

తాత్పర్యము : ఆ దశరథుడు తెలివితేటలు గలిగి, మిక్కిలి శౌర్యముగలవాడై, భయంకరమైన ధనుర్విద్య సహాయముగా రాక్షసుల బలము నణగద్రొక్కుటకు సమర్థుడై సమస్తభూప్రపంచమును తన సూర్యవంశవైభవప్రకాశముచే పౌరుల ధనసంతతిని రాజులందరికి హెచ్చునట్లు వంశపారంపర్యముగా పాలించెను.

భారత : తెలివిన్, అతి ప్రగల్భుడు - అసదృగ్+బలుడు=దృష్టి బలము లేనివాడు, ధృతరాష్ట్రుడు, భీష్మ చాపకౌశలమె సహాయమై యమరగా శత్రులను, ఏ పడపన్=సంహరించుటకు, వలంతియై, మిత్త్ర కులంబు=బంధువుల కులము, తలిర్పన్, పౌరవ=పూరుని సంబంధమైన, సుసంతతి=సత్కుల మందుగల, రాజులకు+ఎల్లన్= యయాతి, భరతాది రాజుల కందరికిని, హెచ్చుగన్=ఏలెన్.

విశేషణము : సదృక్ - 'సదృక్షస్సదృశస్సదృక్' - అని అమరకోశం.

మిత్త్ర = ద్యుమణిః తరణిః మిత్రః - అని అమరకోశం.

ఉజ్జ్వలతన్ = తత్ ప్రత్యయాంతము

వసు = 'వసురత్నధనేఽపిచ' అని అమరం. విశ్వ = విశ్వం కృత్స్నమ శేషం' అని అమరం.

రాజుల యొక్క సంపద అనుక్త సిద్ధము.

ఇందులో కావ్యార్థాపత్తి అలంకారము గలదు.

కైముత్యేనార్థ సంసిద్ధిః కావ్యార్థా పత్తిరిష్యతే'.

సుసంతతి = సంతతి ర్గోత్ర జనన కులాని.

కం. సుబలతనయగుణమహిమన్
ప్రబలి తనకుదారధర్మపాలన లీలన్
సొబ గొంది వన్నె దేఁగా
విబుధస్తుతుఁ డవ్విభుండు వెలసెన్ ధరణిన్. 4

రామా : సుబలత=బలముచే, నయగుణమహిమన్=మంచి గుణముల గొప్పదనముచే, ప్రబలి=అతిశయించి, ఉదారధర్మపాలనలీలన్=ఉదారముగా ధర్మ పరిపాలనచేయు విధమున, సొబగొంది=ప్రకాశించి, తనకు, వన్నె+తేఁగా=కీర్తి తీసికొని రాగా, ధరణిన్=భూమిపై, ఆ+విభుఁడు=ఆ దశరథుడు, విబుధస్తుతుడు= దేవతలచే పొగడబడి, వెలసెన్=ప్రకాశించెను.

తాత్పర్యము : తన బలముచే, సద్గుణ మహిమచే అతిశయించి, ఉదారముగా ధర్మపరిపాలన చేయు విధానముతో ప్రకాశించి తనకు కీర్తి కలుగజేయగా భూమిపై ఆ దశరథుడు దేవతల పొగడ్తలచే ప్రకాశించెను.

భారత : సుబలతనయ=గాంధారి (సుబల కూతురు) గుణమహిమన్=సౌశీల్యాది గుణాధిక్యముచే, ప్రబలి తనకున్, దారధర్మ=భార్య ధర్మముల, పాలన లీలన్=పాలించుటచే, సొబగొంది వన్నెతేఁగా, విబుధస్తుతుడు=పండితులచే ప్రశంసించబడు, ఆ+విభుడు=ఆ ధృతరాష్ట్రుడు=వెలసెన్.

తాత్పర్యము : గాంధారి తన సౌశీల్యగుణముచే తన పతివ్రతాధర్మములలో వన్నె తీసి కొనిరాగా ఆ ధృతరాష్ట్రుడు వెలసెను.

విశే : 'వినుతద్వితీయసప్తమికిని, మఱి మూడవ విభక్తికిని నిడగానౌ – అను కవిలోక చింతామణి ననుసరించి – 'గుణమహిమ' ప్రయోగము. 'అనుకూలాంవిమ లాంగీం కుశలాం, కులజాం సుశీల సంపన్నామ్, పంచలకారాం భార్యాం పురుషః పుణ్యాధికోలభతే' అనుకూల, విమలాంగి, కుశల, కులజ, సుశీల – అను ఐదు 'ల' కారములు గల భార్య పురుషునకు పుణ్యవిశేషముచే లభించును.

విబుధ – విబుధః పండితో, దేవో అని అమరము.

కం. అని నీడు లేనికడిమిం
దనరారు నతిప్రతాపితదనుజుఁ డతఁ డు
ర్విని గలనృపతుల నందఱఁ
దనకరిగాఁపులుగఁ జేసె దర్పస్ఫురణన్. 5

రామా : అనిన్=యుద్ధమందు, ఈడులేని=సాటిలేని, కడిమిన్=శౌర్యముచే, తనరారునట్టి=ప్రకాశించునట్టి, అతిప్రతాపిత దనుజుడు=మిక్కిలి తపింపజేయబడిన రాక్షసులు గలవాడు, అతఁడు=ఆ దశరథుడు, ఉర్వినిగల=ప్రపంచములోగల, నృపతులన్+అందఱన్=రాజులనందరిని, దర్పస్ఫురణన్=తన ప్రతాపస్ఫూర్తితో, తనకు, అరిగాపులుగ=సామంతులనుగ, చేసెన్=చేసెను.

తాత్పర్యము : యుద్ధములో సాటిలేని శౌర్యముతో ప్రకాశించి, రాక్షసులను మిక్కిలి తపింపజేయు ఆ దశరథుడు భూమిపైగల రాజులనందరిని తన ప్రతాప స్ఫూర్తితో తనకు సామంత రాజులుగా చేసెను.

భారత : అనిన్, కడిమిన్, తన పోరు, అతి ప్రతాపి=అధిక ప్రతాపముగల, తత్+అనుజుడు=అతని తమ్ముడైన, అతడు=పాండురాజు, ఉర్విని గలనృపతుల, దర్ప స్ఫురణన్, అంత తనకరిగాపులుగ జేసెన్.

తాత్పర్యము : అధికప్రతాపముగల అతని తమ్ముడైన పాండురాజు యుద్ధములో తనకు సాటిలేని పరాక్రమముచే భూమిలోగల రాజులనందరిని, తన ప్రతాపస్ఫూర్తితో సామంతరాజులుగా చేసెను.

విశేషణము : కాళిదాసు రఘువంశములో దశరథుని గూర్చి – 'మఘవతః ప్రతిపద్య మహారథః' అని చెప్పెను.

కం. తానన్న మాట యింద్రున
కైన నలంఘ్యమయి పేర్చు నట్లుగ నెంతేఁ

బూనిక చెల్లింపుచు జగ
తీనుతవిక్రముఁ డొనర్చె దిగ్విజయంబున్. 6

రామా : తాను - అన్నమాట - ఇంద్రునకైన - అలంఘ్యము+అయి= దాటరానిదై, పేర్చునట్లుగ=ఖ్యాతి గడించునట్లుగా, ఎంతే, పూనిక=ప్రయత్నముతో, చెల్లింపుచు=నడుపుచు, జగతీనుతవిక్రముఁడు=లోకముచే పొగడదగిన పరాక్రమము గలవాడైన దశరథుఁడు, దిక్+విజయంబుల్=అన్ని దిక్కుల జయమును, ఒనర్చెన్=చేసెను.

తాత్పర్యము : ఆ దశరథుడు తానాడిన మాట ఇంద్రునికైనను దాటరానిదై ఉండునట్లుగా ఎంతో నేర్పుతో లోకప్రశస్తుడైన ఆ ప్రభువు దిక్కులను అన్నింటిని జయించెను.

భారత : తాను, అన్నమాట : సోదరుడైన ధృతరాష్ట్రుని మాట.

మిగత అర్థము సమానమే.

తాత్పర్యము : ఆ పాండురాజు తన సోదరుడైన ధృతరాష్ట్రుని మాట ఇంద్రునికైనను దాటరానట్లుగా ఎంతో నేర్పుతో లోకులచే పొగడ్తల కెక్కునట్లు అన్ని దిక్కులను జయించెను.

విశేషణము : అన్న మాట అనుచో అనిన మాట, అన్న యొక్క మాట అని పదమునకు రెండర్థములు.

సీ. ధృతిఁ గుంతిమద్రభూపతుల నెయ్యపుఁగన్య
కలననవాలుఁదూపుల జయించె
యలరారునతనుజయశ్రీల వరియించి
యవనసౌరాష్ట్ర భూధవుల గెలిచె
ద్రవిడకళింగసాల్వవిదర్భ వసుధాధి
పతుల నోడించి కప్పములు గొనియెఁ
జోళనేపాళ పాంచాల కేరళమత్స్య
వత్సభూపతులగర్వం బడంచె

తే. శకయుగంధరఘూర్జరాశ్మంతసింధు
లాట భూపాలముఖ్యుల నోటుపఱిచె
జగతిఁ గోసల కేకయమగధులతన
యల వరించినయాజ్ఞలో మెలఁగఁజేసె. 7

రామా : ధృతిన్=ధైర్యముచే, కుంతిమద్ర భూపతులను=కుంతి, మద్రదేశరాజులను, నెయ్యపున్+కన్య-కలనన=ఇంపైన క్రొత్త జగడమున, వాలుఁ దూపులన్=వాడి బాణములచే, జయించె, అలరారు=ప్రకాశించు, అతను=విస్తారములైన, జయశ్రీలను=జయసంపదలను, వరియించి=వరించెను, యవన సౌరాష్ట్ర భూధవుల=యవన సౌరాష్ట్ర రాజులను; గెలిచె, ద్రవిడ, కళింగ, సాల్వ, విదర్భ వసుధాధిపతుల=ద్రవిడ, కళింగ, సాల్వ, విదర్భరాజులను, ఓడించి, కప్పములు+కొనియె=కప్పములు స్వీకరించెను, చోళనేపాళ పాంచాల కేరళ మత్స్య వత్సభూపతుల=చోళనేపాళ, పాంచాల, కేరళ మత్స్య, వత్సరాజుల, గర్వంబు+అడంచె=గర్వమును అణచివేసెను, శకయుగంధర ఘూర్జరాశ్మంత సింధులాట భూపాలముఖ్యులన్=శక, యుగంధర, ఘూర్జర, అశ్మంత, సింధు, లాట రాజశ్రేష్ఠులను, ఓటుపఱచె=ఓడించెను, జగతిన్=లోకములో, కోసల, కేకయ, మగధుల తనయల=కోసల, కేకయ, మగధ దేశరాజుల కుమార్తెలను, వరించెన్=వరించి వివాహమాడి, ఆజ్ఞలో మెలగన్+చేసె=తన మాటలో మెలగునట్లు చేసెను.

తాత్పర్యము : దశరథుడు ధైర్యముచే కుంతి, మద్ర రాజులను ఇంపైన కయ్యములలో వాడియైన బాణములచే జయించెను. యవన సౌరాష్ట్ర రాజులను విస్తారమైన జయసంపదలచే గెలిచెను. ద్రవిడ, కళింగ సాల్వ విదర్భ రాజుల నుండి కప్పములు స్వీకరించెను. చోళ నేపాళ పాంచాల కేరళ మత్స్యరాజుల గర్వమును అణచెను. శక యుగంధర ఘుర్జరాశ్మంత సింధు లాట రాజులను ఓడించెను. కోసల, కేకయ, మగధ, రాజుల కుమార్తెలను వరించి తన ఆజ్ఞలో మెలగునట్లు చేసెను.

భారత : ధృతిన్=సంతోషముతో, కుంతి మాద్రి భూపతుల=కుంతి మాద్రి రాజుల యొక్క, నెయ్యపు+కన్యకలన్=ఇంపైన కన్యలను, ననవాలు+తూపులన్=పుష్ప

బాణములచే జయించి, అలరారు=ఒప్పుచున్న, అతను=మన్మథునికి, జయశ్రీలన్=జయశ్రీలైన వారిని, వరియించెన్=వివాహమాడెను. మిగతా సమానము. కోసల కేకయ మగధలన్=ఈ దేశ రాజులను, తన=తన యొక్క, అలవరించిన= నియమించిన ఆజ్ఞలో మెలగజేసె.

తాత్పర్యము : పాండురాజు సంతోషముతో కుంతి, మాద్రి రాజుల కుమార్తెలను పుష్పబాణములచే జయించి, మన్మథుని జయశ్రీలతో నొప్పువారిని వివాహమాడెను. యవన సౌరాష్ట్ర రాజులను గెలిచెను, ద్రవిడ, కళింగ, సాల్వ, విదర్భ రాజులనోడించి కప్పములు స్వీకరించెను. చోళ నేపాళ పాంచాల కేరళ మత్స్యరాజుల గర్వమును అణచెను. శక యుగంధర ఘూర్జరాశ్మంతసింధులాట రాజశ్రేష్ఠుల నోడించెను. భూమిపై కోసల కేకయ మగధ రాజులను తన ఆజ్ఞకు లోబడునట్లు మెలగజేసెను.

విశేషణము : కన్యశబ్దము తద్భవమయినచో కన్నెయగును. దానికి బహువచనము భారతార్థములో కన్నియలని చెప్పవచ్చును. కోసల కేకయ మగధులన్–ఇక్కడ ఆజ్ ప్రత్యయ లోపము.

సీ. కొందఱు తనవార్త కొనసోఁకినంతన
　　　కొందఱు వృత్తాంత గురుతకతనఁ
గొందఱు భేరినిర్ఘోషంబు లాలించి
　　　కొందఱు బలరజోబృంద మరసి
కొందఱు నాసీరకోలాహలంబునఁ
　　　గొందఱు మణికేతుకోటివీక్షఁ
గొందఱు కోదండగుణటంకృతులు విని
　　　కొందఱు హుంక్రియాకులతఁ జెంది
తే. కొంద ఱొకటి రెండేటులకొలఁది గలిగి
వివిధదిగ్దేశనృపతులు విరిగి పాఱ
నవనియందును యుద్ధవిహారమునకు
మాఱులేకయ విహరించె మనుజవిభుఁడు. 8

అర్థము : రామాయణ భారతార్థములు రెండును సమానము.

తన వార్త=తన యొక్క వృత్తాంతము, కొనసోఁకినంతన=తెలిసినంతనే, కొందఱు, వృత్తాంత గురుతుకతన=విషయము గుర్తించినందున, కొందఱు, భేరీనిర్ఘోషంబులు=భేరీ శబ్దములు, ఆలించి=విని, కొందఱు, బలరజః+బృందము=సైనికుల పాదధూళి సముదాయమును, అరసి=చూచి, కొందఱు, నాసీరకోలాహలంబున్=సేనల నినాదముచే, కొందఱు, మణికేతుకోటి వీక్షన్=మణుల పొదిగిన జెండా సముదాయమును చూచి, కొందఱు, కోదండగుణటంకృతులు=ధరించిన వింటినారి శబ్దములు, విని, కొందఱు, హుంక్రియ+ఆకులతన్=హూంకరింపుల భయము, చెంది, కొందఱు, ఒకటి, రెండు+ఏటుల కొలఁది=ఒకటి రెండు బాణముల వేటు, కలిగి=తగిలి కొందరు-వివిధ దిక్+దేశనృపతులు=వివిధ దిక్కులకు చెందిన దేశపు రాజులు, విరిగిపాఱ=చెల్లాచెదరై పరుగులు తీయగా, మనుజవిభుడు=దశరథుడు/ పాండురాజు, అవని యందును=భూమిపైన, యుద్ధ విహారమునకు= యుద్ధరంగము లోను, మాఱులేకయె=తేడా లేని విధముగా, విహరించె=వ్యవహరించెను.

తాత్పర్యము : ఆ రాజు వార్త తెలిసినంతనే కొందరు, ఆయన వివరాలు గుర్తు రాగానే కొందరు, భేరీ భాంకార నినాదములు విని కొందరు, సైనిక బలవిజృంభణను చూచి కొందరు, యుద్ధకోలాహలమును చూచి కొందరు, కేతనముల మణులను చూచి కొందరు, వింటినారి శబ్దములు విని కొందరు, హుంకారములచే భయపడి కొందరు ఒకటి రెండు బాణములు తగిలి కొందరు – (ఈ విధముగా) వివిధ దిక్కులలోని దేశాధీశులు చెల్లాచెదురు కాగా ఆ దశరథుడు / పాండురాజు భూమిపైన, యుద్ధ విహారములోను తేడా లేని రీతిలో విహారించెను.

విశేషణము : భేరీ నిర్ఘోషము : ఇక్కడ తెనుగు షష్ఠి

మ. తలఁపంజొప్పడి యొప్పెనప్పుడు తదు ద్యజ్జైత్రయాత్రాసము
త్కలికారింఖదసంఖ్యసంఖ్యజయవత్కంఖాణరింఖావిశృం
ఖలసంఘాతధరాపరాగపటలాక్రాంతంబు మిన్నే అన
ర్గళ భేరీరవనిర్దళద్గగనరేఖా లేపపం కాకృతిన్. 9

అర్థములు : రామాయణ భారతార్థములు రెండు సమానము.

తత్=ఆ రాజు యొక్క, ఉద్యత్=ప్రకాశించుచున్న, జైత్రయాత్ర=విజయ యాత్రయందు, సముత్+కలికా=అధికమైన ఉత్కంఠచే, రింఖత్=సంచరించునవై, అసంఖ్య=లెక్కలేనన్ని, సంఖ్య=యుద్ధములందు, జయవత్=జయములుగల, కంఖాణ=గుర్రములయొక్క, రింఖా=గిట్టలచే, విశృంఖల=విరివిగా, సంఘాత= త్రొక్కబడిన, ధరా=భూమియందలి, పరాగపటల=ధూళి సమూహముచే, ఆక్రాంతంబు=ఆక్రమించబడిన, మిన్నేఱు=ఆకాశగంగ, అనర్గళ=ఎడతెగని, భేరీరవ=భేరీభాంకారశబ్దముల, నిర్దళత=పగులుచున్న, గగనరేఖ=బీటలువారిన ఆకాశమునకు, ఆలేప=పూయబడిన, పంక+ఆకృతిన్=బురదవలె, తలఁ పన్=ఆలోచించగా, అప్పుడు, చొప్పడి=అందముగా, ఒప్పెన్=ప్రకాశించెను.

తాత్పర్యము : ఆ దశరథుడు / పాండురాజు యొక్క విజయయాత్రాసంరంభము అధికమైన ఉత్కంఠతో సంచరించు అసంఖ్యాకమైన యుద్ధములందు జయములు గొన్న గుఱ్ఱముల గిట్టలచే అధికముగా తొక్కబడిన భూమిపై ధూళి సమూహముచే ఆక్రమించబడెను. ఎడతెగని భేరీభాంకార శబ్దములచే పగులుచున్న ఆకాశపు బీటలకు పూయబడిన బురదవలె ఆలోచించగా అప్పుడు ఆకాశగంగ అందముగా ప్రకాశించెను.

విశేషణము : సంఖ్య='మృధమా స్కందనం సంఖ్య' అని అమరకోశము.

ఇందు సంబంధాతిశయోక్తి అలంకారము. ఉదా : సౌధాగ్రణి పురస్యాస్యస్పృశంతి విధుమండలమ్

చం. తురగఖురాహతిక్షితిజ ధూళిచయస్థగితాంబరంబుతో
నొరయుచుఁ దచ్చమూగజసముత్కర మప్పుడు చూడ నొప్పెది,
క్కరివరయూథమత్సరవిగాఢతఁజేసి సమస్తమైన యి
ద్ధర దనపైకి నెత్తుకొని తాల్చెడినో యనుచుండఁ జూపఱుల్. 10

అర్థము : రెండింటికి సమానము.

చూపఱుల్=చూచువారు, తురగఖుర=గుఱ్ఱపు డెక్కల, ఆహతి=తాకిడిచే, క్షితిజ=భూమిపై, ధూళిచయ=దుమ్ముచే, స్థగిత=నిలిచిన, అంబరంబుతో=ఆకాశముతో, ఒరయుచు=పోటీపడుచు, తత్+చమూ గజసముత్కరము=ఆ ఏనుగుల సమూహము, దిక్+కరివర=దిగంతములలోని ఏనుగుల, యూధ=సమూహము, మత్సర విగాఢతన్+చేసి=మాత్సర్యము యొక్క అతిశయముచే, సమస్తమైన, ఈ+ధరన్=ఈ భూమిని, తనపైకిన్+ఎత్తుకొని=తమపైకి ఎత్తుకొని, తాల్చెడినో+అనుచుండ= ధరించుచున్నట్లు, అప్పుడు, చూడన్+ఒప్పె=అప్పుడు చూడగా ప్రకాశించెను.

తాత్పర్యము : చూచువారికి గుఱ్ఱపు డెక్కల తాకిడిచే భూమిపై దుమ్ముతో నిండిన ఆకాశముతో పోటీ పడునట్లు దిగంతములలోని దిగ్గజముల సమూహము మచ్చరము గలిగి భూమినంతటిని తమపై కెత్తుకొని మోయుచున్నట్లు అప్పుడు చూడగా నొప్పెను.

మ. జవవద్ఘోటకపాటితక్షితిరజస్సంక్రాంతిచే నింకుసిం
ధువులం గ్రమ్మఱ నుర్వికిన్ దివికిఁ దోడ్తో నించెఁ దన్నాగముల్,
నవనిర్యన్మదనిర్ఝ రౌఘమున శుండాశీకరోర్ధ్వప్రవ,
ర్షవిధిం దానను జేసి సింధురములన్ ప్రఖ్యాతిగాంచెం గరుల్. 11

అర్థము : రెండింటికి సమానము.

జవవత్=వేగముగా వెళ్లు, ఘోటకపాటిత=గుఱ్ఱముల తొక్కిడిచే, రజః +సంక్రాంతిచే=దుమ్ము సముదాయముచే, ఇంకు=ఇంకిపోయెడి, సింధువులన్=ఆకాశ గంగను, తత్+నాగముల్=ఆ సేనలోని ఏనుగులు, నవనిర్యత్=కొత్తగా పుట్టిన, నిర్ఝర+ఓఘమున=ఆకాశగంగలో, శుండా=తుండముల యొక్క, శీకర=నీటి కణములచే, ఊర్ధ్వ ప్రవర్ష విధిన్=పొడవుగా పైకి చల్లుటచే, ఉర్వికిన్=భూమికి, దివికిన్=ఆకాశమునకు, తోడ్తోన్=వెంటనే, క్రమ్మఱన్=తిరిగి, నించెన్=నిండించెను, దానను+చేసి=అందువలన, కరుల్=ఏనుగులు, సింధురములన్=ఏనుగులను,

ప్రఖ్యాతిన్=కీర్తిని, కాంచెన్=పొందినవి.

తాత్పర్యము : వేగవంతముగా నడచు గుఱ్ఱముల తొక్కిడి వలన కలిగిన ధూళిసమూహముచే ఇంకిపోయిన ఆకాశగంగను ఆ సేనలోని ఏనుగులు కొత్తగా ఏర్పడిన ఆకాశగంగలో తమ తొండముల జలకణములను పైకి ఎగజల్లుటచే భూమిని, ఆకాశమును వెంటనే నిండించినవి. అందువలననే ఏనుగులకు సింధురములను ప్రఖ్యాతి లభించినది.

విశేషణము : ఇందులో క్రమాలంకారము. సింధురములు="సింధూన్ రాంతి దదతీతి సింధురాః" ఇక్కడ నిరుక్త్యలంకారము.

సీ. గంభీరవేది లక్షణలక్షితంబులై
తనరారు భద్రదంతావళములు
నారట్టసింధుగాంధారాదిభవములై
కొఱలు శ్రీవృక్షకీఘోటకములు
పదునాల్గుజాతులం ద్రిదశకాంతల మీఱు
పద్మినీజాతి సౌభాగ్యవతులు
కడు నద్భుతములైన కనకరత్నాంశుక
చందనాదిసువస్తుసంపదలును
తే. నఖిలదిగ్దేశ భూపసమర్పితంబు
లగుచు నరణంబుగతిఁ దోన యరుగు దేఱఁ
దనువరించు జయశ్రీలఁ గొనుచు నతఁడు
పురికిఁ జనుసొంపు వాగగోచరతఁ బరఁగె. 12

అర్థము : రెండింటికి సమానము. గంభీరవేది=గంభీరవేదులనెడి ఏనుగుల, లక్షణ లక్షితంబులై=లక్షణములచే కనబడినవై, తనరారు=ఒప్పుచున్న, భద్రదంతావళములు=పట్టపుటేనుగులును, ఆరట్ట సింధుగాంధారాదిభవములై=ఆ పేర్లతో జన్మించి, కొఱలు=చెలగుచున్న, శ్రీవృక్షకీఘోటకములు=శ్రీవృక్షకీ గుఱ్ఱములు,

పదునాల్గు జాతులన్=పదునాలుగు రకములైన జాతులచే, త్రిదశకాంతలన్+మీఱు= దేవకాంతలను మించు, పద్మినీజాతిసౌభాగ్యవతులు=పద్మినీజాతి స్త్రీలు, కడున్+ అద్భుతములైన=మిక్కిలి ఆశ్చర్యకరమైన, కనక=బంగారు, రత్న+అంశుక= రత్నములు పొదిగిన వస్త్రములు, చందన+ఆది=గంధము మొదలైన, వస్తు సుసంపదలను= వస్తువులతో కూడిన, మంచి సంపదలను, అఖిలదిక్+దేశ=అన్ని దిక్కులలోని దేశములందలి, భూప=రాజులచే, సమర్చితంబులు+అగుచు= అర్చించబడినవై, అరణంబుగతి=అరణము నిచ్చినట్లు, తోనన్=వెంట, అరుగుదేఱ=రాగా, తనువరించు=తనను వరించిన, జయశ్రీలన్+కొనుచు=జయ సంపదలను స్వీకరించుచు, అతడు=దశరథుడు / పాండురాజు, పురికి=పట్టణమునకు, చనుసొంపు=వెళ్లు అందము, వాక్+అగోచరతన్=చెప్పుటకు శక్యముగాని రీతిలో, పరగెన్=ప్రకాశించెను.

తాత్పర్యము : గంభీరవేదులను గజ విశేషముల లక్షణములతో కనిపించిన పట్టపు టేనుగులు, ఆరట్టసింధుగాంధారాదులలో జన్మించిన శ్రీవృక్షకీనామ గుఱ్ఱములు, పదునాలుగు జాతులలో దేవకాంతలను మించు పద్మినీజాతి స్త్రీలు, అద్భుతములైన కనకరత్నవస్త్రములు, చందనాది వస్తుసముదాయములచే సమస్త దిక్కులలోని దేశాధీశులు అర్చించగా వాటిని అరణముగా స్వీకరించి వచ్చునట్లుగా జయశ్రీలతో తన పట్టణమునకు తిరిగి వచ్చు ఆ దశరథుడు / పాండురాజు మాటలలో వర్ణింప నలవిగాని రీతిలో ప్రకాశించెను.

విశేషణము : మృగచర్మీయము, రాజపుత్రీయము అను గ్రంథములలో చర్మ భేదములచే గంభీరవేదులను గజముల ప్రసక్తి గలదు.

– హయలీలావతి గ్రంథములో, వైజయంతీ నిఘంటువులో శ్రీవృక్షకీ – అను గుఱ్ఱముల జాతి పేర్కొనబడినది.

– పదునాల్గు జాతులు : బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, వ్యావహారిక, గోరక్షక, శిల్పక, పంచాహణ, కుంభకార, తంతువాయ, క్షౌరక, రసిక, వస్త్రచ్ఛేదక, చర్మకర, తిలఘాత, లుబ్ధక, చండాల, మాతంగులనెడు పదు నాలుగు జాతులు.

– రతి రహస్యములో పద్మినీ జాతి స్త్రీ లక్షణములు చెప్పబడినవి. దివ్యసౌరభము గలిగి నేత్రస్తన యుగళము అనర్ఘమై, రాజహంసవంటి తనువు గలిగి గాఢలజ్జ గల స్త్రీ పద్మినీ జాతికి చెందినది.

కం. తన పాండుసమాఖ్య జగం
బున వెలయఁగ నిట్టు సకల భూనాథుల నా
త్మనిదేశవర్తనులుగా
నొనరించె నితాంత వైభవోజ్జ్వలుఁ డగుచున్. 13

అర్థము : ఇందులో కర్తృపదము నరనాథుడు ముందరి 15వ పద్యములో చెప్పబడినది.

రామా : తన=తన యొక్క, పాండుసమాఖ్య=తెల్లనైన కీర్తి, జగంబునన్+ వెలయగ=లోకములో ప్రకాశించగా, నితాంత=ఎల్లప్పుడు, వైభవ+ఉజ్జ్వలుడు+ అగుచున్=వైభవకాంతిగలవాడై, ఇట్లు, సకలభూనాథుల=అన్ని దేశముల రాజులను ఆత్మనిదేశవర్తనులుగా=తన మాటకు కట్టుబడి నడుచుకొనునట్లు ఒనరించెన్=చేసెను.

భారత : తన యొక్క, పాండు సమాఖ్య=పాండురాజు అను పేరు. మిగత సమానము.

తాత్పర్యము : తన తెల్లనైన కీర్తి / పాండురాజను పేరు లోకములో ప్రకాశించగా ఎల్లప్పుడు వైభవకాంతిగలవాడై ఈ విధముగా అన్ని దేశముల రాజులను తన మాటకు కట్టుబడి ప్రవర్తించునట్లు చేసెను.

విశేషణము : పాండు=హరిణః పాండురః పాండుః అని అమరం.

సమాఖ్య=యశః కీర్తిస్సమాఖ్యాచ=అని అమరం.

వ. ఇట్లు యథేష్టభోగంబులఁ బ్రవర్తిల్లుచు నొకనాఁడు తన మనంబున. 14

అర్థము : యథా+ఇష్టభోగములు=తనకిష్టమైన సంపదలతో ప్రవర్తిల్లుచు= నడచుచు, ఒకనాడు,

అర్థము : రెండింటికి సమానము.

చం. శ్రమ ముడుగుం దనూజడిమ జాఱుఁ జలాచలలక్ష్య భేదన
క్రమము లెఱుంగవచ్చు మదిఁ గానఁబడుం బరజాతి భీతి కో
పముల విచేష్టితంబు లివి భావమునం దలపోయ నన్ని చం
దములఁ బ్రియంబె యంచు నరనాథుఁడు వేఁటకు నుద్యతాత్ముఁడై

అర్థము : రెండింటికి సమానార్థము.

నరనాధుడు=దశరథుడు / పాండురాజు, శ్రమము+ఉడుగున్=శ్రమ తొలగిపోవు, తనూజడిమ=శరీరము యొక్క అలసత్వము, జాఱు=పోవును, చలా+అచల లక్ష్య భేదనక్రమము=కదలునవి, నిశ్చలమైనవి అయిన లక్ష్యములను కొట్టు విధానము, ఎఱుంగవచ్చు=తెలిసికొనవచ్చును, మదిన్+కానన్+ పడున్=మనస్సులో కన్పించు, పరజాతి భీతి=ఇతర జాతుల గూర్చి భయము, కోపములచే, విచేష్టితంబులు=పనులు-ఇవి, భావమునన్+తలపోయ=మనస్సులో ఆలోచించగా, అన్ని చందములన్=అన్ని రకములుగా, ప్రియంబె+అంచు=ఇష్టమని భావించి, వేటకు=వేటాడుటకు, ఉద్యత+ఆత్ముడై=ప్రేరేపించిన మనస్సుగలవాడై.

తాత్పర్యము : దశరథుడు / పాండురాజు శ్రమ తొలగిపోవునదియు, శరీర అలసత్వము జారిపోవునదియు, కదలెడివి, కదలనివి అయిన లక్ష్యములను కొట్టుటలో నేర్పు గ్రహించుటకు, మనస్సులో కన్పించు ఇతర జాతుల గూర్చి భయము, కోపముచే చేయు పనులు - ఇన్ని రకములుగా ఆలోచింపగా అవి ఇష్టమైనవని భావించి వేటాడుటకు సమధికోత్సాహము గలవాడై

విశేషణము : వేటను గూర్చి కాళిదాసు -
'పరిచయంచ చలలక్ష్యనిపాతనే
భయరుషోశ్చ తదింగితబోధనం,

శ్రమజయాత్ర్పగుణంచ కరోత్యసౌ
తను మతోనుమతస్సచివైర్యయౌ" చెప్పిన రీతిలో సూరన చెప్పెను.

ఇక్కడ ఛందో విశేషము : ఆఖరి పాదములో డాపలిసున్నకు 'న' కారము యతిగా చెల్లింపబడినది. కవి లోక చింతామణిలోను, కావ్యాలంకార చూడామణిలోను ఇది సమర్థించబడినది.

కం. అతివినయాన్విత కుంతియు
ధృతి మహిమాద్రియును నగుచు నతిప్రీతితరం
గితమతులై తనుఁ గొలువఁగఁ
జతురమృగయు లేఁగు దేరఁ జనియెన్ వనికిన్. 16

రామా : అతివినయ+అన్వితకుంతియు=ఈటెలుగల వారు తోడురాగా, ధృతిమన్=ధైర్యశక్తికి, హిమ+అద్రియును+అగుచు=హిమాలయ సమానుడై, అతి ప్రీతితరంగితమతులై=మిక్కిలి సంతోషముతో నిండిన మనస్సుగల, చతుర మృగయులు=నిపుణులైన వేటగాండ్రు, తనున్+కొలువంగా=తన వెంట, ఏగుదేర=రాగా, వనికిన్=అడవికి, చనియెన్=వెళ్లెను.

తాత్పర్యం : ఈటెలు ధరించినవారు తోడు రాగా, ధైర్యశక్తిలో హిమపర్వత సమానుడై నిపుణులైన వేటగాండ్రు సంతోషాత్ములై తన వెంట రాగా అడవికి వెళ్లెను. (దశరథుడు).

భారత : అతివినయాన్విత=అత్యంత వినయముతో గూడిన, కుంతియు=కుంతీదేవి, ధృతిన్=ధైర్యమునకు, మహి=స్థానమైన, మాద్రియును= మాద్రియు, నగుచు=నవ్వుచు, అతిప్రీతి తరంగితమతులై=మిక్కిలి సంతోషించిన మనస్సు గలవారై, తను గొలువగ మిగతా సమానము.

తాత్పర్యము : అత్యంత వినయ సంపన్నులైన కుంతి, మాద్రి నవ్వుచు మిక్కిలి సంతోషాత్మలై తన వెంట రాగా పాండురాజు వేటకు బయలుదేరెను.

విశేషణము : కుంతః – ప్రాసస్తుకుంతః – అని అమరము.

కుంతియు, మాద్రియును – అను పదప్రయోగము కావ్యాలంకార చూడామణి సమర్థించినది. "తెనుగున ఆయీయూలు తుదలజనుపలుకులకు"

వ. ఇట్లు సని చని వివిధ మృగంబుల వేఁటాడుచుం దిరిగితిరిగి. 17

తాత్పర్యము : ఈ విధముగా వెళ్లి, వెళ్లి అనేక మృగములను వేటాడుచు తిరిగి తిరిగి (రెండింటికి సమానము).

కం. నెలకొనియె వేఁటతమి న
బ్బలియుఁడు శిశిరనగరుచిరపరిసరమహిమం
గల తమసతీరసికతా
విలసనములు డెందమునకు విందొనరింపన్. 18

రామా : ఆ+బలియుఁడు=ఆ బలవంతుడైన దశరథుడు, శిశిరనగ=శీతల వృక్షములచే, పరిసర=సమీప భూముల, మహిమన్+గల=మహిమ గలిగిన, తమస తీర=తమసానది గట్టుల యందు, సికతా విలసనములు=ఇసుక తిన్నెల సౌందర్యము, డెందమునకు=మనస్సునకు, విందు+ఒనరింపన్=ఆనందము కలిగింపగా, వేటతమి=వేటాడుట యను కోర్కెయందు, నెలకొనియెన్=స్థిరుడయ్యెను.

తాత్పర్యము : ఆ దశరథుడు శీతలవృక్షములచే మనోహరములైన పరిసర ప్రాంతముల మహిమను, తమసానదీతీరమునందలి ఇసుకతిన్నెల అందచందములు మనస్సునకాహ్లాదము కల్గింపగా వేటయందు స్థిర చిత్తుడాయెను.

భారత : ఆ+బలియుడు=ఆ పాండురాజు, శిశిరనగ=హిమవత్ పర్వతము యొక్క, రుచిర పరిసర మహి=అందమైన పరిసరభూమియందు, మంగలతరు=అత్యంత శుభప్రదములయిన, సతీ=కుంతీ, మాద్రుల యొక్క, రసికతావిలసనములు= రసికత్వముతో కూడిన విలాసములు, డెందమునకు విందొనరింపన్ వేట తమి నెలకొనియె.

తాత్పర్యము : ఆ పాండురాజు హిమవత్ పర్వతముయొక్క అందమైన పరిసర భూమిలో అత్యంత శుభప్రదలైన కుంతీమాద్రుల యొక్క రసికతతో కూడిన విలాసములు మనస్సునకు విందొనరింపగా వేటయందు కోర్కెతో స్థిరుడాయెను.

విశేషణము : (మహిమన్+గల) మహిమంగల–అనుచో అరసున్న నెఱసున్న వచ్చుటను ఆంధ్ర భాషా భూషణము సమర్థించినది. తమసతీర–ఇది తెనుగు షష్ఠి. మంగళతమ–ఇది రసిక శబ్దమునకు విశేషణము.

ఉ. హారిమృగవ్యనవ్యవిహితాదరుఁ డాధరణీతలేశుఁ డ
ధ్వారచితశ్రమాకలితుఁ డై కడు మెచ్చె సురాపగాజలా
సారసమాగమార్హతమసారససార సౌర భో
దీరణకారణంబు నతిధీరసమీరకిశోరవారమున్. 19

రామా : హారి=హారములు గలవాడు, మృగవ్యనవ్య=వేటలో కొత్త, విహిత+ఆదరుఁడు=ఆదరముగలవాడు, ఆ ధరణీతల+ఈశుడు=ఆ రాజు (దశరథుడు) అధ్వారచిత=దారిలో కలిగిన, శ్రమాకలితుడై=బడలికచే అలసి, సురాపగా జలాసార=గంగా ప్రవాహమునకు, సమ=సమానమై, ఆగమ=శ్రుతిస్మృతులవలన, అర్హ=శ్రేష్ఠమైన, (ఆగమ+అర్హ=యాత్రా యోగ్యమైన అని కూడ చెప్పవచ్చును). తమసారస=తమసానదీజలములందుగల, సారస=బెగ్గురు పక్షులుగల, సారస=తామరల యొక్క, సౌరభ+ఉదీరణ=వాసనలు విస్తరించుటకు, కారణంబు=కారణమైన, అతిధీర=మెల్లమెల్లనైన, సమీరకిశోరవారమున్= మందమారుత సమూహమును, కడున్+మెచ్చె=మిక్కిలి మెచ్చెను.

తాత్పర్యము : హారములు ధరించిన ఆ దశరథుడు కొత్తదనము వేటలో కనిపించగా దారి మధ్యలో ఏర్పడిన బడలికచే గంగా ప్రవాహ సమానమైన, యాత్రా యోగ్యమైన తమసాజలములలోని బెగ్గురు పక్షులను, తామరల వాసనలు విస్తరించుటకు కారణమైన మెల్లమెల్లగా వీచు మందమారుత వాయువులను మెచ్చెను.

భారత : హారి=ఒప్పుచున్న, మృగవ్య=వేటలో, నవ్య=కొత్తగా, విహిత+ఆదరున్=

ఆదరముగలవాడు, ఆ ధరణీతలేశుడు=ఆ పాండురాజు, అధ్వారచిత శ్రమాకలితుడై, సురాపగాజలాసార=గంగాజలప్రవాహములందు (మిగతా సమానము) సారసౌరభ= మంచి వాసనలు, ఉదీరణ=విస్తరించుటకు.

తాత్పర్యము : ఆ పాండురాజు వేటలో కొత్తదనముచే ఆదరింపబడినవాడై దారిలో ఏర్పడిన శ్రమవలన అలసిపోయి గంగాజలప్రవాహములందు పరస్పర సాంగత్యముగల బెగ్గురు పక్షులను, మంచి వాసనలు విస్తరించు మందమారుత సమూహమును కడు మెచ్చెను.

విశేషణము : అచ్ఛోదనం మృగవ్యం - అని అమరము. ఆసారము - ధారాసంపాత ఆసారః అని అమరము. ఉదకము వలన శైత్యము, పద్మముల వల్ల సౌరభము, కిశోరపదము వలన మాంద్యము చెప్పబడినవి.

సీ. పుడమిఱేఁ డీరీతిఁ గడఁగి డెందము మృగ
    వ్యాపారఖేలన మభిలషింపఁ
గానలోఁ దారమృగంబులకై వడిఁ
    గైకొని యసమాస్త్రకర్మవలనఁ
దనరుచొక్క పురాణమునిదంపతులు దమ
    కంబులు దేర నెయ్యంబు మీఱ
ననిచిన తత్ప్రియతనయుం డవారిత
    కారుణ్యుఁ డై పూని కలశమంబు
తే. మగ్నముగఁ జేయుచప్పుడు భుగ్న హృదయుఁ
డగుచు వినిశితశరవిశేషాభిహతిని
ద్రెళ్ల నేసె నాఘనులసద్ద ృష్టినియతి
బ్రుంగఁ గేవలసారంగబుద్ధిఁజేసి. 20

రామా : పుడమిఱేడు=రాజైన దశరథుడు, ఈ రీతిన్+కడఁగి=ఈ విధముగా ప్రయత్నించి, డెందము=మనస్సు; మృగవ్యాపారఖేలనము=మృగవ్య+ అపార

ఖేలనము=వేటాడు విహారమును, అభిలషింప=కోరగా, కానలోన్=అడవిలో, తారు=సంచరించెడి, మృగంబులకై=జంతువుల కొఱకు, వడిన్+కైకొని=తొందరపడి, అసమ=సాటిలేని, అస్త్రకర్మ కలనన్=బాణప్రయోగముచే, తనరుచున్=ఒప్పుచు, ఒక్క పురాణ ముని దంపతులు=ఒక వృద్ధ ముని దంపతులు, తమకంబులు+తీర= తమకు దాహము తీర్చు నీరు తెచ్చుటకు, నెయ్యంబు మీరన్+అనిచిన=ప్రీతితో పంపగా, తత్+ప్రియతనయుండు=వారి ముద్దుల కొడుకు, అవారితకారుణ్యుడై=దయతో కూడిన వాడై, పూని కలశము=ప్రయత్నముతో కలశము, అంబుమగ్నముగ=నీటితో ముంచి, చేయు చప్పుడు=చేసిన శబ్దమును, భుగ్నహృదయుడు+అగుచున్=సరళముగాని హృదయముగలవాడై, విని=విని, శితశరవిశేష+అభిహతిని=వాడియైన శబ్దఘాతి అను బాణము వేటుతో, ఆ ఘను=ఆ గొప్పవానిని, లసత్+దృష్టి=మంచి వివేకము అను, నియతిబుంగ=నియమము కొంచెపడగా, కేవల సారంగబుద్ధిన్+చేసి=కేవలము ఏనుగు – అను ఆలోచనతో, త్రెళ్లన్+ఏసె=చంపెను.

తాత్పర్యము : ఆ విధముగా దశరథమహారాజు మనస్సు వేటపై కోర్కెను కల్గింపగా అడవిలో సంచరించు మృగములకొఱకు బాణప్రయోగము చేయుచు ఒక వృద్ధ మునిదంపతులు తమ దాహము తీర్చుటకై తమ ప్రియపుత్రుని జలములు తెమ్మని పంపగా అతడు కలశముతో నీటిని ముంచు శబ్దమును విని సరళముగాని హృదయముగలవాడై వాడియైన శబ్దభేదియను బాణపు వేటుతో ఆ ఘనుని వివేకరహితుడై ఏనుగు అనే ఆలోచనతో చంపెను.

భారత : పుడమిఱేడు=పాండురాజు, ఈ రీతి గడగి, డెందము, మృగ=మృగ దంపతుల, వ్యాపార=రీతి వ్యాపార, ఖేలనము=క్రీడను, అసమాస్త్ర కర్మ కలనన్=మన్మథ వ్యాపారాసక్తితో, తనరు, చొక్కపు రాణన్=మంచి అనురాగముచే, మునిదంపతులు, తమకంబులు తేరన్=కామము పుట్టగా, నెయ్యంబు మీఱ=ప్రేమ అతిశయించగా, తత్ప్రియతన=ఆవిడ మీది ప్రేమతో, ఉండ=ఉండగా, వారితకారుణ్యుడై=వారించబడిన దయగలవాడై, పూని, కలశమంబు=కలిగిన శాంతి సంతతిని, మగ్నముగ చేయుచున్=అణచుచు, అప్పుడు=అపుడు, భుగ్నహృదయుడు+అగుచు=సరళముగాని

మనసు గలవాడై, వినిశిత శర విశేషాభిహతిని=తీక్షణమైన బాణముల దెబ్బచే, సత్+దృష్టి నియతి=వృద్ధాచారము, బ్రుంగన్=తప్పగా, సారంగబుద్ధిన్+చేసి=లేళ్లు అనెడి బుద్ధిచే, ఆ ఘనుల=ఆ పెద్దవారిని, త్రెళ్ళనేసె.

తాత్పర్యము : పాండురాజు ఈ రీతిగా మనస్సు మృగదంపతుల రతి వ్యాపార క్రీడను మన్మథవ్యాపారాసక్తితో తనరు మంచి అనురాగముగల ముని దంపతులు కామవశమున ప్రేమాతిశయముతో ఆవిడపై ప్రేమతోనుండగా, వారించబడిన దయగలవాడై కలిగిన శాంతి నణచుచు, సరళముగాని మనసుతో తీక్షణమైన బాణములతో వృద్ధాచారము తప్పిపోగా లేళ్లు అనెడి బుద్ధిచే ఆ ఘనులను త్రెళ్లనేసెను.

విశేషణము : పుడమితేడు – తద్భవము, పృథివి – పుడమి – అని కావ్యాలంకార చూడామణి. డెందము – దేశ్యపదమని కావ్యాలంకార చూడామణి. అపారఖేలనము – ప్రథమకు ద్వితీయార్థమని ఆంధ్రభాషాభూషణము. దంపతులు – జంపతుల – జాయాయాదం భావజం – అని వార్తికము. అంబులు – అంబువులు అని కావ్యాలంకార చూడామణి. సారంగము – సారంగాశ్చాతకే భృంగే కురంగేచమతంగజే – అని అమరము.

సారంగ శబ్దమునకు లేడి, ఏనుగు అని రెండు అర్థములు. మృగ వ్యాపారము=మృగముల వ్యాపారము అని సమాసము. తారు – తాము. కవి లోక చింతామణి నిర్ధరించినది.

వ. ఇట్లేసిన. 21

తాత్పర్యము : ఈ విధముగా బాణమేసిన.

కం. వాలంపతాకునకు ధృతి
వ్రీలఁగ హా తాత యనుచు వెలువడుతన్మ
ర్త్యాలాపమునకు నాజన
పాలకులోత్తంసుగుండె భగ్గునఁ గలఁగెన్. 22

అర్థము : రెండింటికి సమానము.

వాలంప=బాణము, తాకునకు=దెబ్బకు, ధృతిప్రీలగ=ధైర్యము వీడగా 'హా! తాత!' అనుచు=హా! తాతా! అనుచు, వెలువడు, తత్+మర్త్య+ఆలాపమునకు=ఆ మనుష్య శబ్దమునకు, ఆ జనపాలకులోత్తంసుగుండె=ఆ రాజశ్రేష్ఠునిగుండె. భగ్గునన్+కలఁగన్=భగ్గుమని చెదరెను.

కం. ఆధరణీపాలుఁడు తమ
సాధునియతికొమరునేఁడు సమసెనె యిట్లా
హా ధాతవ్రాఁత యని శర
బాధం గలఁగఁగను వారిపజ్జకుఁ జనియెన్. 23

రామా : ఆ ధరణీపాలుఁడు=ఆ దశరథుడు, తమసాధునిన్=తమసా నదియందు, యతి కొమరు=మునిపుత్రుని, ఏఁడు=ఏండ్లు (ఆయువు), సమసెన్=అంతరించిపోయెనే - ఇట్లు+ఆహా!=ఈ విధముగా ఆహా!, ధాతవ్రాత+అని=బ్రహ్మ వ్రాసిన వ్రాతయని, శరబాధన్=బాణముచే కలిగిన బాధను, కలఁగఁగన్=తొట్రుపడగా, వారిసజ్జకు=వారి వద్దకు, చనియెన్=వెళ్లెను.

తాత్పర్యము : ఆ దశరథుడు తమసానది యందు మునిపుత్రుని ఆయువు నేడు పూర్తి ఆయెనని, ఆహా! ఇది విధివ్రాత యని తలచి, బాణము వ్రేటుచే బాధపడు మునిదంపతుల వద్దకు వెళ్లెను.

భారత : ఆ ధరణీపాలుఁడు=ఆ పాండురాజు. తమ=తమ యొక్క, సాధు నియతి=లెస్సయయిన భాగ్యము యొక్క, కుమారుడు, సమసెన్=నశించెను గదా ఇది విధివ్రాతయని-సమానము.

తాత్పర్యము : ఆ పాండురాజు తమ గొప్ప భాగ్యము యొక్క సౌభాగ్యము నేడు అంతరించినది గదా! ఇది విధి వ్రాతయని తలచి, బాణము యొక్క బాధచే తొట్రుపడు మునిదంపతుల వద్దకు వెళ్లెను.

విశేషణము : ధునీ తటినీ హ్రాదినీధునీ – అని అమరము.

నేడు – వాడి మయూఖముల్ కలుగువాడపరాంబుధి గ్రుంకె ధేనువుల్ నేడిటవచ్చె'నని నన్నయభట్టు ప్రయోగం.

కం. చని తన్ముఖమునఁ దద్వ
ర్తనవిధ మంతయును విని ధరారమణుఁడు ద
త్తనుశరవేదనఁ గ్రమ్మఱి
తనుఁ బొదవినయ ట్లతివ్యథావిహ్వలుఁ డై. 24

అర్థము : రెండింటికి సమానము. ధరారమణుఁడు=దశరథుడు / పాండురాజు చని=వెళ్లి, తత్+ముఖమున్=వారి నోటి వెంట, తత్+వర్తనము=వారి వృత్తాంతము, అంతయును విని, తత్+తనుశర వేదనన్=వారి శరీరమునకు తగిలిన బాణముల బాధ, క్రమ్మఱి=తిరిగి, తను=తనను, పొదవిన యట్లు=తాకినట్లు, అతివ్యథా విహ్వలుడై=మిక్కిలి బాధతో అలమటించినవాడై.

తాత్పర్యము : దశరథుడు / పాండురాజు వెళ్లి వారి నోటి వెంట జరిగిన వృత్తమంతయు విని వారి శరీరమునకు తగిలిన బాణముల బాధ తిరిగి తనను తాకినట్లు మిక్కిలి బాధతో అలమటించినవాడై.

కం. ఏనుం గనికర మరయక
పూనితిఁ గా కిట్టియెడలఁ బొసఁగునె యేయం
గానమెకాలనియమగతి
తో నావేఁట మునియుగము ద్రుంగించెఁ దుదన్. 25

రామా : ఏనుంగు+అని=గజమని, కరము=మిక్కిలి, అరయక=ఆలోచింపక, పూనితిఁగాక=చేసితినిగాక, ఇట్టియెడన్=ఈ యాశ్రమ భూములలో, ఏయన్=బాణము ఏయుట, పొసఁగునె=యుక్తమగునా? కానమె= ఎఱుగమా! కాలనియమగతితోన్= కాలప్రేరణచే, ఆ వేఁటన్=ఆ వేటలో, మునియుగము=మునికుమారుని ఆయుస్సును,

తుదన్=వేట సమయమున, ద్రుంగించెన్=తుదముట్టించెను.

తాత్పర్యము : ఏనుగని మిక్కిలి ఆలోచింపక చేసితినిగాక, ఈ యాశ్రమ భూములలో బాణము ఏయుట యుక్తమా? ఎఱుగమా! అనుకొనుచు కాలప్రేరణచే ఆ వేటలో మునికుమారుని ఆయుస్సును వేట సమయములో తుదముట్టించెను.

భారత : ఏనున్=నా వంటి వాడును, కని=ప్రత్యక్షముగా చూచి, కరమరయక= ఎక్కువ ఆలోచింపక (కనికర మరయక=దయలేక అని కూడ చెప్పవచ్చును). పూనితిగాక, ఇట్టి యెడల పొసగునె, ఏయనే, కానమెకాలని=అడవిమృగములని, యమగతితోనే=యమప్రేరణముతో, నావేట, మునియగము=మునుల జంటను, తుదన్, ద్రుంగించెన్.

తాత్పర్యము : నావంటి వాడును ప్రత్యక్షముగా చూచి దయలేక పూనితినిగాక. ఇట్టి చోట్ల బాణముతో ఏయుట తగునా? అని అడవి మృగములని యమప్రేరణముచే నా వేటలో ముని దంపతులను తుదకు తుదముట్టించెను.

విశేషణము : కాలప్రేరణ తప్పించలేరనుటకు - లలాట లిఖితారేఖా పరిమార్ష్టుం నశక్యతే, ఏనుగు+కనికరమనుచోట సంధికి - ఆంధ్ర భాషాభూషణములో 'కుఱుచల తుది హల్లులకును పిఱుదన్నెల కొన్నయట్టి బిందువులెల్లన్ నెరయగ నూదుచుదేలుచు నొఱపై యిరుదెఱగు సెల్లుచుండున్ కృతులన్ - అని చెప్పబడినది.

వ. అని చింతించుచుండ. 26

అని బాధపడుచుండగా

చ. ఘనశర వేదనల్ బలియఁగా వనకుంభిని వ్రాలియున్నయ
మ్మునియుగళంబు దొట్రుపడ ముంచితి నాతలిదండ్రులన్ మహా
ఘనదినిఁ కేమన న్నె అయఁగా నని కన్నులవారివృద్ధులం
దనరఁ దదంఘ్రి చేర్పునను ధార్మికుఁ డాయన నమ్రవక్త్రుఁడై.

రామా : ఘనశరవేదనల్=బాణముచేత మిక్కిలి బాధలు, బలియగా= అతిశయింపగా, వనకుంభిని=జలకలశియందు, వ్రాలియున్న=వాలిన, ఆ+మునియు=ఆ ముని, గళంబు=కంఠము, తొట్రుపడన్=తొట్రుపడగా, నా తలిదండ్రులన్=(ముని కుమారుని) తల్లిదండ్రులను, మహా+అఘనదిని=గొప్ప దుఃఖమనెడి నదిలో, ముంచితి=ముంచితివి (దశరథునితో) ఇక+ఏను=ఇంక నేను, మనన్=జీవించుటకు, నెఱయ=మిక్కిలి, కానని కన్నుల వారిన్=అంధులను, వృద్ధులన్=ముసలివారిని, తనరన్=ఒప్పుగా, నను=నన్ను, తత్+అంఘ్రి, చేర్పు=వారి పాదముల వద్దకు చేర్చుము, ధార్మికుడా=ఓ విలుకాడా! అనన్=అనగా, నమ్రవక్త్రుడై=వాల్చిన ముఖముగలవాడై.

తాత్పర్యము : బాణముచేత మిక్కిలి బాధ అతిశయింపగా జలకలశియందు వాలిన ఆ మునికంఠము తొట్రుపడగా (దశరథునితో ఇట్లనెను) ఓ విలుకాడా! నా తల్లిదండ్రులను గొప్ప దుఃఖమనెడు నదిలో ముంచితివి. ఇంక నేను జీవించుట ఏల? మిక్కిలి అంధులైన ముసలివారి పాదముల వద్దకు నన్ను చేర్చుము. అనగా వాల్చిన ముఖముగలవాడై.

భారత : ఘనశరవేదనలే, బలియగా, వనకుంభినిన్=భూమిపై, ముని యుగళంబు=మునిదంపతులు, తొట్రుపడగా–(పాండు రాజిట్లనుకొనెను) ఆ తలిదండ్రులన్, మహాఘ=మహాపాపమనెడి, నదిన్=వైతరణీనది యందు, ముంచితి, ఇంక+ఏమనన్=ఇంక అనుటకేమున్నది? అని, కన్నులవారి=కన్నీరు, వృద్ధులన్+తనర=అధికము కాగా, తదంఘ్రి చేర్పునన్=వారి పాదములయొద్ద, ధార్మికుడు=ధర్మాత్ముడైన, ఆయన=పాండురాజు, నమ్రవక్త్రుడై=వంచిన తలగలవాడై.

తాత్పర్యము : అధికమైన బాణవేదనలు కలుగగా భూమిపై ఆ మునిదంపతులు తొట్రుపడగా, "ఆ తలిదండ్రులను మహాపాపమనెడు వైతరణియందు ముంచితిని. ఇంక అనుటకేమున్నది" అని కన్నీరు హెచ్చుగా వారి పాదముల యొద్ద ధర్మాత్ముడైన ఆ పాండురాజు తలను వంచినవాడై.

విశేషణము : ముంచితి. తెనుగులో ప్రథమ మధ్యమోత్తమ పురుషములకని ఆంధ్ర భాషాభూషణము. ధార్మికుడా అనుచో (రామాయణార్థంలో) వ్యంగ్యోక్తి.

కం. విని యతనిం దనపై నిడు
కొని యేఁగినియమికిఁ దగని ఘోరార్తి యొన
ర్చినవాఁడ మీకు దండ్యుఁడ
నని తనుఁ దెలుపుచును వారి కప్పన సేసెన్. 28

రామా : విని, అతనిన్=మునిపుత్రుని, తనపైన్+ఇడుకొని=తనపై కెత్తుకొని, ఏఁగి=వృద్ధుల వద్దకు బోయి, (దశరథుడిట్లు అనుచున్నాడు) నియమికిన్=మునీశ్వరునికి, తగని, ఘోర+ఆర్తి=మిక్కిలి బాధను, ఒనర్చినవాడ=చేసితిని, మీకు దండ్యుడన్=మీచేత దండింపదగినవాడను, అని, తను=తనను గూర్చి, తెలుపుచును, వారికి, అప్పన చేసెన్=అర్పణ చేసెను.

తాత్పర్యము : మిక్కిలి నియతమైన అపకీర్తినే తనపైన వేసికొని పాండురాజు మునితో నిట్లనెను. క్షమించుటకు తగని అధికమైన బాధను నేను కలిగించితిని. మీచేత దండనకు అర్హుడను అని తనను గూర్చి వారికి తెలుపుచు అర్పణ చేసెను.

తే. చేసి మనుజేశ్వరుండు తచ్ఛాసనమున
నాత్మశరసముత్పాటన మాచరించె
దానఁబట్టి ప్రాణంబు లెంతయుఁ జలింప
నసుతతోఁగ్రార్తి కోర్వక యతివరుండు. 29

రామా : చేసి=అర్పణ చేసి, మనుజ+ఈశ్వరుఁడు=దశరథుడు, తత్+శాసనమున=వారి ఆజ్ఞచే, ఆత్మశరసముత్పాటనము=తాను వేసిన బాణమును వెలికి తీయుటను, ఆచరించె=చేసెను, దానన్=దాని వలన, పట్టి ప్రాణంబులు=వారి కుమారుని ప్రాణములు, ఎంతయున్+చలింప=మిక్కిలి పోగా, అసుతతా=కుమారుదు

మరణించుటచే, ఉగ్ర+ఆర్తికి=అధికమైన బాధకు, ఓర్వక=సహించలేక, యతివరుఁడు=మునిశ్రేష్ఠుడు.

తాత్పర్యము : అర్పణ చేసి దశరథుడు వారి అనుజ్ఞచే తాను ఏసిన బాణమును వెలికి తీసెను. దానిచే మునిపుత్రుని ప్రాణములు పోగా, కుమారుడు లేడను అధికమైన బాధకు ఓర్చుకొనలేక మునిశ్రేష్ఠుడు...

భారత : చేసి, మనుజేశ్వరుడు=పాండురాజు, తత్+శాసనమున, ఆత్మశరసముత్పాటనము, ఆచరించె, దానన్‌పట్టి=బాణము తీయుట వలన, ప్రాణంబులు+ఎంతయు, చలింపన్=తొట్రుపడగా, అసు=ప్రాణముల యొక్క, తత్+విస్తృతమైన, ఉగ్రార్తికి, ఓర్వక, యతివరుండు.

తాత్పర్యము : అర్పణ చేసి పాండురాజు వారి అనుజ్ఞచే తాను ఏసిన బాణమును పెకలించెను. దాని వలన ప్రాణములు చలింపగా విస్తృతమైన బాధకు ఓర్చుకొనలేక మునిశ్రేష్ఠుడు...

ఆ. కాంతతోడఁ గూడఁ గాన ని ట్టటు చన
లేనియీాయవస్థ పూనియున్న
మాకుమారుప్రాపు వోకార్చె నేఁడు నీ
దైనప్రౌఢిమహిమ భానుకులుఁడ. 30

రామా : భానుకులుడ=ఓ సూర్యవంశపు రాజా! దశరథా! కాంతతోడన్=భార్యతో కూడన్=కలిసి, కానన్=అడవిలో, ఇట్టు+అటు=అటునిటు, చన=వెళ్లుటకు, లేని ఈ+అవస్థ=వార్ధక్యమును పూని+ఉన్న=ధరించియున్న, మా=మా యొక్క, కుమారు ప్రాపును=కుమారుని అండను, నేడు, నీదైన, ప్రౌఢమహిమ=బలాతిశయము, పోకార్చె=తొలగించెను.

తాత్పర్యము : ఓ దశరథ మహారాజా! భార్యతో కలిసి అడవిలో (అంధత్వము వలన) అటునిటు వెళ్లలేని ఈ స్థితిలోనున్న మాకు కుమారుని అండను నేడు నీదైన బలాతిశయము తొలగించెను.

భారత : భానుకులుడ! ఓ పాండురాజా! కాంతతోడన్+కూడన్=భార్యతోగూడ, కానన్, ఇట్టటు, చనలేని, ఈ+అవస్థ= రతిని, పూనియున్న మాకు=ధరించిన మాకు, మారుప్రాపు= మన్మథానందమును నేడు, నీదైన, ప్రౌఢ మహిమ=బలాతిశయము, పోకార్చెను=లేకుండ చేసెను.

తాత్పర్యము : ఓ పాండురాజా! భార్యతో కూడ అడవిలో అటునిటు వెళ్లలేని రీతి అవస్థ ధరించిన మాకు మన్మథానందమును నేడు నీదైన బలాతిశయము లేకుండ చేసినది.

విశేషణము : ఇది వ్యాజనిందాలంకారము.

ఆ. ఎందు వేఁటరారె యితరు లేమనసుతో
దారసంగసుఖముఁ దప్పఁ ద్రోచి
తకట పాండురాజ యశ మెన్న వైతివి
క్రూరదశరథేశ కులము రోయ. 31

రామా : అతిక్రూర!=మిక్కిలి క్రూరుడా! దశరథేశ=దశరథ మహారాజా! ఇతరులు, ఎందువేటరారె=ఇతరులు ఎవరైనను వేటకు రారా? ఏ మనన్=ఏమందును? సుత+ఉదార సంగసుఖము=కుమారునివలన సాంగత్యసుఖమును, తప్పన్+ద్రోచితి=తప్పించితివి, అకట!=అకట! పాండుర=స్వచ్ఛమైన, అజయశము=అజ మహారాజు యొక్క కీర్తిని, కులమురోయ=కులము రోయునట్లుగా, ఎన్నవైతివి=లెక్కించలేదు.

తాత్పర్యము : అతిక్రూరుడా! ఓ దశరథ మహారాజా! ఇతరులు ఎవరైనను వేటకు రారా! నిన్ను ఏమందును? మాకు కుమారుని సాంగత్య సుఖమును తప్పించితివి, అకటా! శుభ్రమైన అజమహారాజు కీర్తిని నీ కులము రోయునట్లుగా లెక్కించనైతివి.

భారత : పాండురాజ! ఓ పాండురాజా! ఇతరులు, ఎందున్ వేటరారె, ఏ మనసుతో, దారసంగమ సుఖము=భార్యాసంగమసంతోషమును తప్ప ద్రోచితి, అకట!

యశము+ఎన్నవైతివి, క్రూరదశన్=క్రౌర్యముతో; రధేశ=అతిరధులైనవారి, కులము రోయన్=కులము రోయునట్లుగా.

తాత్పర్యము : ఓ పాండురాజా! ఇతరులెవ్వరైనను వేటరారా? ఏ మనసుతో భార్యా సంగమ సుఖమును తొలగించితివి? అకటా! క్రూరమైన దశతో అతిరధులైన కులము వారు రోయునట్లుగా కీర్తిని లెక్కింపవైతివి.

వ. అని యమ్మునీశ్వరుండు. 32

అని, ఆ+ముని+ఈశ్వరుండు=అని ఆ మునిశ్రేష్ఠుడు.

తే. నిజశరీర మెట్లట్ల యానృపుని మేను
నాత్మ జాయాసమాగతం బైన యపుడ
ప్రాణములు వాయునట్లుగాఁ బరమశోక
వశత శపియించి మృతివొందె వనిత తోడ. 33

రామా : నిజశరీరము=తన శరీరము, ఎట్ల+అట్ల=ఎట్లో అట్లు, ఆ నృపునిమేను=ఆ రాజు శరీరము, ఆత్మజ=కుమారుని యొక్క, ఆయాసము=సంకటము, ఆగతంబైన+అపుడ=వచ్చినపుడే, ప్రాణములు+పాయునట్లుగా=ప్రాణములు నశించినట్లుగా, పరమశోకవశత=మిక్కిలి దుఃఖముతో, శపియించి=శపించి - వనితతోడ=భార్యతో, మృతి+పొందె=మరణించెను.

తాత్పర్యము : తన శరీరమెట్లో అట్లు ఆ రాజు శరీరము కుమారుని యొక్క సంకటము వచ్చినపుడే ప్రాణములు పోవునట్లుగా మిక్కిలి శోకముతో శపించి, భార్యతో కలిసి మరణించెను.

భారత : నిజశరీరము, ఎట్ల, అట్ల, అన్నృపునిమేను, ఆత్మజాయా=తన భార్యలతో గూడ, సమాగతంబైన యపుడ=సంయోగము చెందినపుడే ప్రాణములు, పాయునట్లుగా, పరమ శోకవశత, శపియించి, మృతిచెందె, వనితతోడ.

తాత్పర్యము : తన శరీరమెట్లో అట్లు ఆ రాజు శరీరము తన భార్యలను

సంగమించినపుడే ప్రాణములు విడుచునట్లుగా పరమ శోకముతో శపించి భార్యతో కలిసి మృతి చెందెను.

విశేషణము : సమాగత శబ్దము భావార్థమందు 'క్త' ప్రత్యయాంతము.

మ. యతి యెంతేఁ దనయార్తిఁ జేద్వడినవాఁడై యాత్మ జాయాసమా
గత మైనప్పుడ మేనుఁ బాయు మని యుల్కన్నన్ను శాపించె సం
తతి లేకుండెడిచోఁ దదాశ మిగులందాఁ బోవు టెట్లేనియున్
ధృతిమై నోర్వఁగ వచ్చు నామదికిఁ జింతింపంగ నం చెన్నుచున్.

రామా : యతి=ముని, ఎంతేన్=ఎంతైనను, తనయ+ఆర్తి=కుమారుని వలన బాధచే, చేద్వడినవాడై=నొచ్చినవాడై, ఆత్మజ=పుత్రుని యొక్క, ఆయాసము=శోకము, ఆగతమైనప్పుడు=వచ్చినప్పుడే, మేను=శరీరమును, పాయుము+అని=వదలుమని, అల్కన్=కోపముతో, నన్ను, శాపించె=శపించెను, సంతతి లేకుండెడిచో=పుత్రులు లేనిచో, తత్+ఆశ=సంతానాపేక్ష, మిగులన్=పూర్ణమైనను, తాన్+పోవుట=తాను మరణించుట, ఎట్లు+ఏనియున్=ఎట్లయినను, ధృతిమై=ధైర్యముతో, ఓర్వగవచ్చు=ఓర్చుకొనవచ్చును, నామదికి=నా మనస్సుకు, చింతింపగన్= ఆలోచింపగా, అంచు+ఎన్నుచున్=అని భావించుచు...

తాత్పర్యము : ముని ఎంతేని కుమారుని మరణముచే కలిగిన బాధచే నొచ్చినవాడై, పుత్రశోకము కలిగినపుడు శరీరమును వదలుమని కోపముతో నన్ను శపించెను. పుత్రులులేని నాకు సంతానాపేక్ష పూర్ణమై మరణించుటను ఎట్లయినను ధైర్యముతో ఓర్చుకొనవచ్చునని ఆలోచింపగా నా మనస్సుకు తోచుచున్నదని భావించుచు...

భారత : యతి=ముని, ఎంతేన్=ఎంతయిన, తన+ఆర్తిన్=తనదెసకు, చేద్వడినవాడై=లోనై, ఆత్మజాయా=తన భార్యతో, సమాగమమైనప్పుడు=సంపర్కము కలిగినపుడు, మేను+పాయుమని=ప్రాణములు వీడుమని, శాపించె, సంతతి లేకుండెడిచో, తదాశన్=ఆ సంయోగాపేక్ష వలననే, తాబోవుట=తాను మరణించుట,

ఎట్లేనియున్, ధృతిమైన్=ఎంత ధైర్యము కలిగినను, ఓర్వగవచ్చు=ఓర్వవచ్చునా? నామదికి, చింతింపగ, అంచు+ఎన్నుచున్.

తాత్పర్యము : ముని ఎంతేనియు తన దుర్దశకులోనై భార్యతో సంపర్కము గలిగినపుడు నేను ప్రాణములు వీడుదునని శపించెను. సంతతి లేకుండెడిచో ఆ సంయోగాపేక్షవల్లనే తాను మరణించుట ఎట్లేని ధైర్యముతో ఓర్వ వచ్చును గదా అని తన మనస్సులో భావించుచు........

కం. జనపతి దాననతివ్యథ
మనస్కుఁ డై యిట్టి దయ్యె మత్సుచరితవా
సన యిఁక నేమని నిజపురి
కిని జనియెద ననుచు నాత్మ కిల్బిషశంకన్. 35

రామా : జనపతి=దశరథుడు, తాను, అనతివ్యథితమనస్కుఁడై=మిక్కిలి బాధలేని మనస్సు గలవాడై, మత్+సుచరిత వాసన=నా జన్మాంతర సుకృత సంస్కారము, ఇట్టిది+అయ్యె=ఇట్లాయెను, ఇఁకన్+ఏమని=ఇంకేమి అని, నిజపురికిని+చనియెద=నా అయోధ్యా నగరమునకు వెళ్లెదనని, ననుచు=చిగురించు, ఆత్మకిల్బిషశంకన్=తన పాపభీతిచే (తర్వాత పద్యమునకు అన్వయము).

తాత్పర్యము : దశరథమహారాజు తాను మిక్కిలి బాధలేని మనస్సుగలవాడై, నా జన్మాంతరసుకృతసంస్కారము ఇట్లాయెను, ఇంకేమియని, తన అయోధ్యా నగరమునకు వెళ్లెదనని చిగురించిన పాపభీతిచే -

భారత : జనపతి=పాండురాజు, దానన్=ఆ ఎన్నికచేత, అతివ్యధిత మనస్కుడై=మిక్కిలి బాధగల మనస్సుతో, మత్+సుచరిత వాసన, ఇట్టిదయ్యె, ఇక నేమని, నిజపురికిన్=హస్తినాపురికి, చనియెదననుచున్, ఆత్మకిల్బిషశంకన్.

తాత్పర్యము : పాండురాజు ఆ ఎన్నికచేత మిక్కిలి బాధగల మనస్సుతో నా పూర్వజన్మసంస్కారము ఇట్లాయెను, ఇంకేమి అని విచారించి హస్తినాపురికి వెళ్లెదననుచు, మనస్సులో పాపభీతిచే - తర్వాత పద్యముతో అన్వయము.

కం. గణనాతీతము లగుగో
గణములు వేదండఘోటకస్తోమములున్
మణులు ధనధాన్యములు బ్రా
హ్మణులకు దానంబు సేసె నాతఁడు మఱియున్. 36

రెండింటికి అర్థము సమానము

అర్థము : గణన+అతీతములగు=లెక్కింపనలవిగాని, గోగణములు=ఆవుల సముదాయములు, వేదండ=ఏనుగులు, ఘోటకస్తోమములున్=గుఱ్ఱముల సముదాయములు, మణులు, ధనధాన్యములు, ఆతఁడు, మఱియున్, బ్రాహ్మణులకు దానంబు+చేసె.

తాత్పర్యము : అసంఖ్యాకములైన గోవులు, ఏనుగులు, గుఱ్ఱముల సముదాయమును, మణులు, ధనధాన్యములను అతడు బ్రాహ్మణులకు దానము చేసెను. (దశరథుడు / పాండురాజు)

తే. తనకుఁ గల భూషణాదిసద్వస్తుజాల
మగ్రజాయత్తముగఁ జేసి యంచితనయ
బలలసద్వర్తనలవనీస్థలిని జూడఁ
జాల నని వారితో దయాశ్రయత మెఱయ. 37

తే. మనవియుక్తి తెఱంగు మీ కనిన దడవి
నవయ నేటికి మనకరినగరమునకు
నరుగుఁ డని పెదముదుసళ్లు ననుఁగులాడ
వెరవరులు గనికరముతోఁ బెరసి కొలువ. 38

కం. మానవతులారహిత స
త్త్వానుగతిన్ శాంతిఁ దనరి యతినైపుణ్య

శ్రీనెరయ నాత్మసామ్రా
జ్యానుభవము పూనె దయ జనావళి మెచ్చన్. 39

కం. అనిభృతదాక్షిణ్యుం డై
తనయాలోకనవిదూరతకుఁ గుందునిజాం
గనలం గూడి యవని నా
ఘనుఁడు నడపెఁ బెంపె మీఱఁగా మునిచర్యల్. 40

ఈ నాలుగు పద్యములకు కుళకము.

రామా : తనకున్+కల=తనకున్న, భూషణ+ఆది, సత్+వస్తుజాలము= అలంకారములు మొదలైన మంచి వస్తుసముదాయమును, అగ్రజ+ ఆయత్తముగన్+ చేసి=బ్రాహ్మణుల అధీనముగజేసి, అంచిత=అర్హములైన, నయబల=నయమైన శక్తిచే, లసత్+వర్తనలన్=మంచి నడవడికచే, అవనీస్థలినిన్+ చూడన్+చాలక=భూమిపై చూడలేక, అనివారిత=వారింపజాలని, ఉదయాశ్రయత మెఱయ=అభ్యుదయము యొక్క ఆశ్రయత్వము, మెఱయ=ప్రకాశింపగా.

మునుల వాక్యము.

1. మనవి=విన్నపము, యుక్తి తెఱంగు=ఉపాయమార్గము, మీకనినది=మీరు చూచినది, అడవిన్=అడవిలో, అవయన్+ఏటికి=బాధపడుట ఎందుకు?

2. మనకు+అరి=మన శత్రువు, నగరమునకున్= పట్టణమునకు అరుగుఁ డు+అని=వెళ్లుడని, పెదముదుసళ్లును= వయోవృద్ధులు, అనుఁగులును= మిత్రులును, ఆడన్=చెప్పగా, వెరవు=వారు చెప్పిన బుద్ధిని, కని, అరులు=శత్రువులు, శరముతోన్=కప్పములతో, పెరసి కొలువ=అధికముగా కొలువగా.

3. మానవతులా=ఇతర పురుషసామ్యముతో, రహితమైన=నశించిన, సత్త్వ బలము యొక్క, అనుగతిన్=యోగముతో, శాంతిన్+తనరి=శాంతితో కూడి, అతి నైపుణ్యశ్రీ=అధికమైన నిపుణతయొక్క సమృద్ధితో, నెరయ=ప్రకాశించగా,

దయ=దయతో, జన+ఆవళి=జనుల సముదాయము మెచ్చన్, ఆత్మసామ్రాజ్య+ అనుభవము=తన సామ్రాజ్యమును నిర్వహించుటకు, పూనె=పూనెను.

4. అనిభృత=రహస్యముగాని, దాక్షిణ్యుండై=దక్షిణ నాయకత్వము గలవాడై, తనయ=కుమారులను, ఆలోకన విదూరతకన్+కుందు=చూడలేకపోవుటకు బాధపడుచు, నిజాంగనలన్+కూడి=కౌసల్యా, కైకేయి, సుమిత్రలను కూడి అవనిన్=భూమిపై, ఆఘనుడు=ఆ దశరథుడు, పెంపెమీఱగా=అతిశయించగా, కామునిచర్యల్=మన్మథ వర్తనమును, నడిపెన్=నడిపెను.

తాత్పర్యము : ఆ దశరథుడు తనకున్న సమస్త ఆభరణాది వస్తుజాలమును బ్రాహ్మణాధీనము చేసి అర్థములైన నయబలముచే నొప్పుచున్న వర్తనలు అనివారితమైన అభ్యుదయము యొక్క ఆశ్రయత్వముచే భూమిపై మెఱయగా, మనవి, ఉపాయ మార్గము, మీరు చూచినది అడవిలో బాధపడుట ఎందుకు? దశరథుని పట్టణమున కరుగుడని వయోవృద్ధులు, అనుంగులు చెప్పగా వారు చెప్పిన మాట విని శత్రువులు కప్పముతో కొలువగా ఇతర పురుష సామ్యరహితమైన బలయోగముచే అధికనిపుణత్వసమృద్ధి నెరయగా జనావళి మెచ్చగా తన సామ్రాజ్య పాలనను వహించెను.

గూఢముగాని దక్షిణ నాయకత్వము గలవాడై కుమారులను కనలేని బాధచే కుందు కౌసల్యాకైకేయీ సుమిత్రలనుగూడి భూమిపై ఆలాగున ప్రసిద్ధుడైన దశరథుడు మన్మథ క్రీడలను నడపెను.

విశేషణము : దక్షిణ నాయకుడు –

పెక్కండ్రు సతులయందును
చక్కని మొగమాట మొక్క చందముగాఁ బెం
పెక్కిన దక్షిణ నాయకుఁ
డక్కజముగఁ దెలియ వలయు నార్యులు ప్రీతిన్ – అని కావ్యాలంకార చూడామణి.

1. భారత : తనకున్+కల, భూషణాది సద్వస్తుజాలము, అగ్రజా యత్తము=జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రుని, అధీనమగునట్లు, చేసి, అంచి=పంపి, సద్వర్తనలన్=మంచి నడకలుగల, తన+అబలలన్=తన భార్యలైన కుంతీ మాద్రులను, వనీస్థలియందున్=అడవి యందు, చూడన్+చాలనని=చూడలేనని, వారితో దయాశ్రయత మెఱయ.

2. మన వియుక్తి తెఱంగు=మన వియోగ విధానము, మీ కనినది=మీరు చూచినది, అడవిన్=అడవిలో, అవయ నేటికి=బాధపడుట ఎందుకు? మన కరినగరమునకున్=మన హస్తినాపురమునకు, అరుగుడు+అని=వెళ్లమని, పెదముదుసళ్లు, అనుగుల్, ఆడన్=ఆ పట్టణములో, నెరవరులును కనికరముతో కొలువన్.

3. మానవతులార!=శీలవతులారా! హితసత్త్వానుగతిన్=హితమైన సత్వగుణము యొక్క ఆ వృత్తిచే, యతినై=తపస్వినై, పుణ్యశ్రీ=పుణ్యముల యొక్క సమృద్ధి, నెరయన్=ప్రకాశింపగా, ఆత్మ=బ్రహ్మమనెడి, సామ్రాజ్య+ అనుభవము=సామ్రాజ్యము యొక్క స్థితిని, తనరి, పూనెద, యజన=యజ్ఞముల యొక్క, ఆవళి=సముదాయము మెచ్చున్.

4. అని, భృతదాక్షిణ్యుండై, తన, ఆలోకనవిదూరతకున్=చూడకుండుటకు కుందునిజాంగనలను=బాధపడు తన భార్యలను, కూడియ=కూడుకొనియే, వనిని=అడవిలో, ఆ ఘనుడు=పాండురాజు, పెంపు మీఱగా, ముని చర్యల్, నడపె.

1. తాత్పర్యము : ఆ పాండురాజు తనకు గల సమస్త ఆభరణాది వస్తుజాలమును తన జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రుని అధీనము చేసి, మంచి నడవడికగల కుంతీమాద్రులను అడవిలో చూడజాలనని వారితో దయాశ్రయత మెఱయగా.

2. మన వియోగ స్థితిని మీరు చూచితిరి. ఈ అడవియందు బాధపడనేటికి? మన హస్తినాపురమునకు వెళ్లుడని వయోవృద్ధులు, అనుగులు తెలుపగా వెరవరులు కనికరముతో కొలువగా.

3. మానతులారా! హితమైన సత్వగుణము యొక్క ఆ వృత్తిచే తపస్విని పుణ్యశ్రీలు ప్రకాశించగా బ్రహ్మజ్ఞానానుభవమును బూనెదను, అని యజ్ఞముల సముదాయమును మెచ్చెను.

4. అని దక్షిణ నాయకుడై తాను చూడకుండుటకు బాధపడు తన భార్యలను కూడి అడవిలో పాండురాజు మునిచర్యలను పెంపు మీఱగా నడపెను.

విశేషణము : పుణ్యశ్రీ=ఇక్కడ శ్రీ శబ్దము మీద గూడ దీర్ఘమున్నందుకు – కవిలోకచింతామణిలో.

కం. స్త్రీలింగ శబ్దవితతికి
నోలిందుది దీర్ఘముడుప నుండును తెనుగై
కోలది యేకాక్షరశ
బ్దాలి విసర్జించి నిర్జితాసురకృష్ణా!

చ. అకలుష యౌవనస్థదశ యంతయుఁ దా నడపెన్ నృలోకపా
లకుఁడు శఠాంతరంగరిపు లన్ నెఱయం బొలియింపుచున్ సమా
ధికరహితాత్మ వర్తన నతిస్థిరుఁ డై ప్రణిధిప్రయుక్తిఁ బా
యక యెపుడుం బ్రధానపురు షాంతరవర్తన నాకలింపుచున్. 41

రామా : నృలోకపాలకుఁడు=దశరథమహారాజు, శఠ=కఠోరములైన, అంతరంగరిపు=మనస్సులోని శత్రువులను, నెఱయన్+పొలియింపుచున్=లెస్సగా నిగ్రహించుచు, అకలుష=కాలుష్యములేని, యౌవనస్థదశ+అంతయు=యౌవనములో ఉన్న రతి ప్రసంగములతో, నడపెన్=నడపెను, సమాధిక=సమానులు, అధికులతో, రహిత=అడచి, ఆత్మవర్తనన్=తన రాజధర్మముచే, అతిస్థిరుఁడై=ధైర్యగుణము అధికముగా గలవాడై, ప్రణిధి=గూఢచారులను, ప్రయుక్తిన్=పంపుటచే, పాయక= వదలక, ఎపుడున్, ప్రధానపురుష+అంతరవర్తనన్=ప్రధానవ్యక్తుల అంతరంగ వృత్తాంతమును, ఆకలింపుచున్=తెలిసికొనుచు...

దీనికి మరొక రీతిలో అర్థము చెప్పవచ్చును.

శర=నిగ్రహమునకు రాని, అంతరంగ=హృదయములోని, రిపులను= వ్యసనరూప శత్రువులను, నెఱయన్+పొలియింపుచున్=పెంచకుండ చెఱచుచు, ప్రణిధి=గూఢచారులయొక్క ప్రయుక్తిన్=వాక్యమును, పాయక=అతిక్రమింపక, ప్రధాన పురుష=ప్రధానమంత్రితో, అంతరవర్తనన్=ఆప్తమైన ఆలోచనతో ఆకలించుచు= చేయుచు,

తాత్పర్యము : దశరథుడు కఠోరములైన అంతరంగ శత్రువులను నిగ్రహించుచు కాలుష్యములేని యౌవనదశలో రతి ప్రసంగములతో నడపెను. సములు, అధికులు అయిన వారితో రాజధర్మముచే ధైర్యవంతుడై యుండి, గూఢచారులను పంపుటచే ఎప్పుడు ప్రధాన వ్యక్తుల అంతరంగ వృత్తాంతములు తెలిసికొనుచు...

విశేషణము : అంతరంగరిపులు=అంతరంగ శత్రువులైన క్రోధగుణగ్రస్తములు, ఇవి ఎనిమిది అని మనుస్మృతి చెప్పుచున్నది. పైశున్యం సాహసం ద్రోహమీర్ష్యా సూయార్థదూషణమ్, వాగ్దండనంచ పారుష్యం క్రోధజోపి గుణోష్టదా=అమరం.

ప్రధానపురుష=పురోహిత మంత్రి పుత్ర జ్ఞాని దండనాయకులు. 'పురోహితా మాత్య కుమారకుల్య సేనాప్రణీతార ఇతి ప్రధానాః' అని కామందకము.

'అకలుష' అను పద ప్రయోగము=ధర్మార్థకామములను ప్రాతర్మధ్యాహ్న సాయంకాలములందు నాచరించుట ధర్మమే. అందువలన అకలుష పదప్రయోగము. "ధర్మార్థ కామః కాలేషు త్రిషుయేన స్వనుష్ఠితాః" అని బ్రహ్మాండపురాణం.

భారత : నృలోకపాలకుఁడు=పాండురాజు, శర, అంతరంగరిపులన్, నెఱయన్, పొలియింపుచున్, సమాధి=ఏకాగ్రధ్యానమును, కర=చేయుచున్నదై, హిత=ఇంపైన, ఆత్మ=మనస్సు యొక్క, వర్తనన్=వ్యాపారముచే, అతిస్థిరుడై=చాంచల్యము లేనివాడై, ప్రణిధి=ప్రార్థనారూపములైన, స్తోత్రములను, ప్రయుక్తిన్=పఠించుచు, పాయక= వదలక, ఎపుడున్=ఎల్లప్పుడు, ప్రధాన=ప్రకృతియొక్కయు, పురుష= పరమాత్మ యొక్కయు, అంతరవర్తనన్=భిన్నమైన ఉనికిని, ఆకలించుచున్=ఉపాసన చేయుచు, అకలుషయౌ=పరిశుద్ధమైన, వనస్థదశ=వానప్రస్థదశను, అంతయున్, సాంగముగా, నడపెన్.

తాత్పర్యము : పాండురాజు కఠోరమైన తన అంతరంగశత్రువులను నిగ్రహించుచు, ఏకాగ్రధ్యానముతో ఇంపైన మనోవ్యాపారముచే చాంచల్యములేని బుద్ధిగలవాడై ప్రార్థనారూపస్తోత్రములు పఠింపుచు ఎల్లప్పుడు వదలని ప్రకృతి, పరమాత్మల భిన్నమైన ఉనికిని ఉపాసన చేయుచు పరిశుద్ధమైన వానప్రస్థ జీవితదశను సాంగముగా నడపెను.

విశేషణము : అంతరంగరిపు=అరిషడ్వర్గములగు కామక్రోధలోభమోహ మద మాత్సర్యములు, ప్రణిధి ప్రయుక్తి=శ్రవణమనననిధి ధ్యాసముల తర్వాత బ్రహ్మ సాక్షాత్కారమని వేదాంత మత సిద్ధాంతము.

ప్రధాన - ప్రధానం ప్రకృతి స్త్రియామ్ - అని అమరము.

పురుష - పురుషావాత్మమానదౌ - అమరము.

వ. ప్రవర్తిల్లువాఁడెందుం ననపత్యులకు గతి లేదని మహా మునుల వలన వినుచుండుం గావున నక్కొఱఁత దీర్చుకొనలేమికిం జింతాక్రాంతుఁడై యొక్క నాఁ డమ్మహీకాంతుండు దన యగ్రభాగంబున. 42

రెండింటికి అర్థము సమానము.

అర్థము : ప్రవర్తిల్లువాడు=సంచరించువాడు, ఎందున్=ఎక్కడను, అనపత్యులకు=బిడ్డలు లేనివారికి, గతిలేదని, మహామునుల వలన, వినుచుండున్+కావున, ఆ+కొఱత=ఆ లోటు; తీర్చుకొనలేమికి=తీర్చుకొనలేకపోవుటకు, చింతాక్రాంతుడై=బాధపడుచు, ఒక్కనాడు, ఆ+మహీకాంతుండు=ఆ దశరథుడు/పాండురాజు, తన+అగ్రభాగంబున=తన ముందు.

చం. తనరు నిజాన్వవాయగురుధర్మదవృత్తి నరుంధతీసువా
సిని వరుసన్నుతుల్ బుధవిశిష్టసభం గనునట్టిసద్గుణై
కనిధి నిజాగ్రదారహిత కార్యభరాత్మతనుండఁ జూచి యి
ట్లనియెఁ దనూజహీనతకు నాత్మగరంబు భరంబు నొందఁగన్.

రామా : తనరు=ప్రకాశించు, నిజ+అన్వవాయగురున్=తనకులగురువైన వానిని, ధర్మదవృత్తిన్=ధర్మోపదేశము చేయు వర్తన గలవానిని, సన్నుతుల్=ప్రశంస లందుకొను, అరుంధతీసువాసిని=అరుంధతీదేవి యొక్క, వరున్=పతియైన వసిష్ఠుని, బుధవిశిష్ట సభన్=విశిష్టులైన పండితుల సభలో, కనునట్టి=చూడబడు, సద్గుణైకనిధిని= సద్గుణముల రాశిని, జాగ్రత్=ప్రకాశించు, అరహిత=లెస్సగా విడువబడిన, కార్యభర=ఇతర కార్యభారముగల, ఆత్మతన్=బుద్ధికౌశలము గలవాడగుటచే, ఉండన్, చూచి, ఇట్లనియె, తనూజహీనతకు=బిడ్డలు లేకపోవుటకు, ఆత్మ=మనస్సు, కరంబు=మిక్కిలి, భరంబు+ఒందగన్=బాధపడగా.

తాత్పర్యము : తన కులగురువైన వానిని, ధర్మోపదేశము చేయు వర్తనగలవానిని అరుంధతీపతియైన వసిష్ఠుని, పండిత సభలో ప్రశంసలందుకొనువానిని, ప్రకాశించుచు విడువబడిన ఇతర కార్యభారముగల బుద్ధితో (దశరథుడు) బిడ్డలు లేకుండుటకు మనస్సు బాధపడగా – ఇట్లనెను.

విశేషణము : జాగ్రత్పదము ఆత్మకు విశేషణము.

భారత : తనరు, నిజాన్వవాయ=నిజవంశమునకు, గురుధర్మద వృత్తిన్=అధిక ధర్మమునిచ్చు వర్తనగలదానిని, అరుంధతీ సువాసిని వరుసన్=అరుంధతీదేవికి సమానముగా, బుధవిశిష్ట సభన్, నుతుల్ గనునట్టి, సద్గుణైకనిధిని, నిజాగ్రదారన్=తన పెద్ద భార్య కుంతిని, హితకార్యభర=ఇంపైన వ్రతాచరణప్రయోజనముగల, ఆత్మతన్=బుద్ధిగలదౌటచే, ఉండగాన్+చూచి, తనూజహీనతకు=పుత్రులు లేమికి, ఆత్మ=తన బుద్ధి, భరంబునొందగన్=కుందుచుండగా – ముందరి వచనములోని మహీకాంతుడు కర్త.

తాత్పర్యము : తన వంశమునకు అధిక ధర్మమునిచ్చుదానిని, నిత్యవర్తనగలదానిని, అరుంధతికి సమానమైనదానిని, పండిత సభలో ప్రశంసలు గొను సద్గుణరాశియైన తన భార్య కుంతిని, ఇంపైన వ్రతాచరణ ప్రయోజనము గల్గిన బుద్ధిగల దౌట చూచి పుత్రులు లేమికి తన బుద్ధి కుందుచుండగా (మహీకాంతుడు)

చం. పొదలితి రాజ్యభోగములఁ బూనితి దిగ్విజయోన్నతింగడున్
వదలక దానధర్మముఖవర్తనలుం దగునట్లు సల్పితిం
దుది నవి యేమి చెప్ప నతిదుఃఖకరంబుగ నిట్లు పుత్రసం
పద కెడ యైతి నీదయసమగ్రత యాపరిపాటి యే మనన్. 44

రెండింటికి సమానార్థకము.

నీ దయ సమగ్రత అన్న పదములో

రామా : నీ దయ యొక్క సమగ్రత.

భారత : నీదు+అయసమగ్రత=నీ భాగ్యము యొక్క సంపన్నత.

అర్థము : రాజ్యభోగములన్, పొదలితి=రాజ్య సంపదలలో తేలియాడితిని, దిగ్విజయోన్నతిన్+పూనితిన్=దిక్కులను జయించుట నిర్వహించితిని, కడున్ వదలక=మిక్కిలి వదలక, దానధర్మముఖవర్తనములున్=దానధర్మముల ద్వారా చేయు పనులు, తగునట్లు సల్పితిన్=ఉచితముగా చేసితిని, తుదన్+అవి+ఏమి చెప్ప=చివరకు వాటిని గూర్చి ఏమని చెప్పుదును, అతి దుఃఖకరంబుగ=మిక్కిలి దుఃఖజనకముగ, ఇట్లు, పుత్రసంపదకు=ఈ విధముగా పుత్రులను సంపదకు, ఎడ+ఐతి=దూరమైతిని, నీ దయసమగ్రత, ఆ పరిపాటి+ఏమనన్=ఆ భాగ్యము నేమందును?

తాత్పర్యము : రాజ్యభోగము లనుభవించితిని, దిక్కులను జయించితిని, అనేక దానధర్మములు చేసితిని, చివరకు అవి అన్నియు ఏమని చెప్పెదను? మిక్కిలి బాధాకరముగా నాకు ఈ విధముగా పుత్రసంపదకు దూరమైతిని. నీ దయా సంపదకు నోచుకోలేదు.

కం. చెలువమరు ధర్మమునఁ బు
త్రులలామముఁ బడయ లేమిఁ దాపసనాథా
కులహృద్వర్తన మగునా
కలుషపు జీవనముకంటెఁ గష్టము గలదే. 45

రామా : చెలువు+అమరు=ఒప్పిదమగు, తాపసనాథా=ఓ మునిశ్రేష్ఠా! ధర్మమునన్=ధర్మపద్ధతిలో, పుత్త్రలలామమున్=మంచి కుమారుని, పడయన్ లేమి=పొందలేకపోవుటచే, కులహృద్వర్తనమగు=వంశనాశనమైన వృత్తిగల, ఆ కలుషపు జీవనము కంటె=ఆ పాపిష్ఠి బ్రతుకుకంటె, కష్టము+కలదే=కష్టమున్నదా?

తాత్పర్యము : ఓ మునిశ్రేష్ఠా! ఒప్పిదమైన ధర్మపద్ధతిలో కుమారుని పొందలేకపోవుటచే వంశనాశకమైన వృత్తిగల ఆ పాపిష్ఠి బ్రదుకుకంటె వేరొక కష్టమున్నదా?

భారత : చెలువ=ఓ కాంతా! మరుధర్మమున=రతిచేత, పుత్రలలామము=సుపుత్రుని, పడయన్+లేమి=పొందలేకపోవుటచే, తాప=తాపముతో, సనాథ=కూడినదై, ఆకుల=బాధపడిన, హృత్+వర్తనమగు=మనోవ్యాపారముగల, ఆ కలుషపు జీవనముకంటె కష్టముగలదే!

తాత్పర్యము : ఓ కాంతా! రతిచేత సుపుత్రుని పొందలేని తాపముతో కూడినదై బాధపడిన మనోవ్యాపారముగల ఆ పాపిష్ఠి జీవనము కంటె వేరొక కష్టము గలదా?

సీ. కులవర్ధనుం డగుకొడుకుఁ గాననియట్టి
లాఘవాస్పదుని యాలయము లయము
సిరులకుఁ దొడవైన వరసుతుఁ బడయని
ఘనకలుషాత్మజీవనము వనము
పితరుల ఋణము దీర్చెడు సూనుఁ జెందని
దౌర్భాగ్యశీలు గోత్రమ్ము త్రమ్ము
రహి నిహపరసుఖప్రదుఁ బుత్త్రు నెత్తని
వరపుణ్యహీనుభవమ్ము వమ్ము
తే. పలుపలుకు లేల నిఖి లమఖిలము సూవె
యాత్మజులు లేనివారి కోయతివరమణి

తరమె యనపత్యువైవర్ణ్య మరయ నతని
యఖిలమును నిట్లు ముఖవర్ణహానిఁ జెంద. 46

అర్థము : రెండింటికి సమానము. ఒక్కపదము 'యతి వరమణి' తప్ప. రామా యతివరమణి!=మునిశ్రేష్ఠా.

భారత : అతివ! రమణి! సంబోధనలు.

అర్థము : కులవర్ధనుండగు=వంశోద్ధారకుడైన, కొడుకున్+కానని+అట్టి= కుమారుని పొందలేని; లాఘువ+ఆస్పదుని=అల్పుని, ఆలయము=ఇల్లు, లయము=నాశనము, సిరులకు+తొడవైన=సంపదలకు నెలవైన, వరసుతున్=మంచి కుమారుని, పడయని=పొందని, ఘన కలుష+ఆత్మ=మిక్కిలి పాపిష్ఠి అయనవారి, జీవనము=జీవితము, వనము=అరణ్యము, పితరుల ఋణము=తల్లిదండ్రుల అప్పు, తీర్పెడు=తీర్చు, సూనున్=కుమారుని, చెందని=పొందని, దౌర్భాగ్యశీలు= దురదృష్ట వంతుడైన వాని, గోత్రమ్ము=గోత్రము, త్రమ్ము=వ్యర్థము, రహిన్=మిక్కిలి, ఇహపర సుఖప్రదు=ఇహమునందును, పరమునందును సుఖమునిచ్చు, పుత్రున్=కుమారుని, ఎత్తని=లాలించని, వరపుణ్యహీను=మిక్కిలి పుణ్యరహితుడైన, వాని భవమ్ము=పుట్టుక, వమ్ము=వ్యర్థము. పలు పలుకులేల=వేయి మాటలేల? నిఖలము=సమస్తము, ఖిలము= నాశనము, సూవె=చూడగా, ఆత్మజులు లేనివారికి=కుమారులు లేనివారికి, అనపత్యు=పుత్రులు లేనివాని, వైవర్ణ్యమును=కళావిహీనతను, అరయన్+తరమె= ఎంచగలమా? అతని+అఖిలమును=అతని సమస్తమును; ఇట్లు, ముఖవర్ణ హానిన్+ చెంద=అతని సంబంధములైన అన్ని శబ్దములకు తొలి 'అక్షరము' నశించిపోగా.

తాత్పర్యము : ఓ యతి శ్రేష్ఠా / ఓ అతివ! రమణీ! వంశోద్ధారకుడైన కొడుకును పొందలేని అల్పుని ఇల్లు నాశనము. సంపదలకు నెలవైన కుమారుని పొందని పాపిష్ఠి వాని జీవనము అరణ్య సమానము. తల్లిదండ్రుల ఋణము తీర్చు కుమారుని పొందని దురదృష్టవంతుని గోత్రము వ్యర్థము. ఇహపరములందు సుఖమునిచ్చు కుమారుని ఎత్తుకొనలేని పుణ్యరహితుని పుట్టుక నిష్ఫలము. వేయి మాటలేల?

సమస్తము నాశనము. కుమారులులేనివాని కళావిహీనతను లెక్కించగలమా? అతనికి సంబంధించిన అన్ని శబ్దములకు తొలి 'వర్ణము' లోపించును.

విశేషణము : 'ఆ'లయము-లయము, 'జీ'వనము-వనము, 'గో'త్రమ్ము-త్రమ్ము, 'భ'వమ్ము=వమ్ము. తొలి అక్షరము లోపించినది.

శా. వేయుం జెప్పెడి దేమి మౌనివరసద్వృత్తంబుచే నేమిటం
జేయన్రాదు పితౄణమోక్షముసుత శ్రీఁదక్కఁదత్ప్రాప్తికిన్
ధీయుక్తింగన నొండుత్రోవ గలదేనిన్ వేఁడెదన్ దేవర
న్యాయం బొప్ప ఘటింపు నాకురుకులం బవ్యాహతిన్ వర్తిలన్ 47

రామా : మౌనివర!=ఓ మునిశ్రేష్ఠా! వేయున్+చెప్పెడిది+ఏమి=పెక్కు మాటలేల? సత్+వృత్తంబుచే=మంచిరీతిలో, ఏమిటన్=ఏ విధముగా, సుతశ్రీన్+తక్క=పుత్రసంపదచే తప్ప, పితృ+ఋణము=పితరుల అప్పు, మోక్షము+చేయన్ రాదు=విముక్తి గలిగింపరాదు, తత్+ప్రాప్తికిన్=అది లభించుట కొఱకు, ధీయుక్తిన్+కనన్=బుద్ధి కుశలతతో ఆలోచించినచో, దేవరన్=దేవరను, ఒండు త్రోవగలదేనిన్=మరియొక మార్గము కలిగినచో, వేఁడెదన్=వేడెదను, నాకు, ఉరుకులంబు=నా గొప్ప వంశము, అవ్యాహతిన్ వర్తిలన్=చెదరకుండా ఉండునట్లుగా, న్యాయంబు+ఒప్ప ఘటింపు=న్యాయరీతిలో కూర్చుము.

తాత్పర్యము : ఓ మునిశ్రేష్ఠా! పెక్కు మాటలేల? మంచి పద్ధతిలో ఏవిధముగా పుత్రసంపదచే తప్ప పితౄణము తీర్చుకొనవచ్చును. దాని కొఱకు బుద్ధికుశలతతో దేవరను మరియొక మార్గము కలిగినచో ఆలోచించమని వేడెదను. నా గొప్పవంశము చెదరని రీతిలో న్యాయ పద్ధతిలో కూర్చుడు.

భారత : వేయుంజెప్పెడిదేమి? మౌనివర సద్వృత్తంబుచే నేమిటన్=ఏ ముని వర్తనచే; పితౄణమోక్షము, సుతశ్రీ-తక్కన్, చేయన్+రాదు, తత్+ప్రాప్తికిన్, ఒండు త్రోవగలదు=మరొక మార్గముగలదు, ఏన్=నేను, నిను=నిన్ను, వేడెదను, దేవర

న్యాయం బొప్పన్=దేవరన్యాయము వలన, నా=నాయొక్క, కురుకులము= కురు వంశము, అవ్యాహతిన్=ఎడతెగకుండ, వర్తిలన్, ఘటింపు=నిలుచునట్లు ఏర్పరచుము.

తాత్పర్యము : ఏ మునివర్తననైనను పితౄణము తీర్చుకొనుటకు పుత్ర సంపద తప్ప మార్గము లేదు. ఆ పుత్ర లాభమునకు మరియొక త్రోవగలిగినచో నేను నిన్ను దేవర న్యాయముచే నా కురువంశ నాశనము కాకుండునట్లు చేయుమని వేడెదను.

విశేషణము : దేవరన్న్యాయము 'అనచిచ' అను సూత్రముచే నకారమునకు ద్విత్వము వచ్చినది స్వరభేదమైనను అక్షరము ఒకటి గనుక శ్లేషకు చెప్పవచ్చును.

దేవరన్యాయము : ఈ న్యాయమున సంతతిని స్త్రీ ఇతరుల ద్వారా పొందవచ్చును.

కం. అనవగతోనత యై పెం
పునఁ దనరుభవత్కృపావిభూతిఁ గనినయేఁ
దనయాపేక్షాదీనత
ననఘ యితరు నట్లు పొందు టర్హమె యకటా! 48

రామా : అనఘ!=శ్రేష్ఠా! అనవగత=తెలియఁబడని, ఊనతయై=అల్పత్వము గలదియై, పెంపునన్+తనరు=ఆధిక్యముచే అతిశయించు, భవత్+కృపావిభూతి=నీ దయావిశేషము, కనిన+ఏను=చూచిన నేను, తనయాపేక్షా=పుత్రుల మీది కోరికతో, దీనతన్=దైన్యముతో, ఇతరునట్లు=వింతవారిని ఆ విధముగా, అకటా!, పొందుట+ అర్హమె= పొందుట న్యాయమా?

తాత్పర్యము : ఓ శ్రేష్ఠా! తెలయబడని అల్పత్వముగలదియై ఆధిక్యముచే అతిశయించు నీ దయావిశేషము చూచిన నేను పుత్రులమీది కోరికతో దైన్యముగా వింతవారిని అకటా! పొందుట న్యాయమా?

విశేషణము : ఇక్కడ అర్హమె – అనునది కాకుస్వరము.

భారత : అనున్=ఇట్లనగా, వగతోన్=బాధతో, నతయై=తలవాల్చినదై (కుంతి మాటలాడు పలుకులు) అనఘ పెంపునన్+తనరు, భవత్+కృపావిభూతిగనిన, ఏన్,

తనయాపేక్షాదీనతన్=కుమారుడు గలగవలెనను కోరికతో దైన్యముగా, ఇతరున్=పరుని, అట్లు=నీవు చెప్పినట్లు, పొందుట=కూడుట, అర్హమె?

తాత్పర్యము : (పాండురాజు) ఇట్లనగా (కుంతి సమాధానము) బాధతో నమ్రవదనయై ఓ అనఘా! నీ దయావిశేషముతో పెంపొందిన నేను పుత్రుడు కలుగవలెనను కోరికతో దైన్యముగా నితరులను నీవు చెప్పినట్లుగా పొందుట అర్హమే! (కాదని భావము).

మ. ఎనయన్ లోకగురు ప్రశస్తిగల నీయిల్లాలనై కాంతవ
ర్తనలం బర్వుచు నుర్వి మానవతులన్ ధన్యస్థితిన్ మించి యె
ప్పినన న్నర్హమె యిట్లనందనులయాభీలార్తి పాల్సేఁత పా
వన మౌనీశ్వర యింతకంటె నయశోవాదంబు లే దెన్నఁగన్. 49

రామా : పావనమౌనీశ్వర!=పవిత్ర మునిశ్రేష్ఠా! ఎనయన్=లెక్కింపగా, లోకగురుప్రశస్తిగల=లోకములో గొప్పవాడనుఖ్యాతిగల, నీ=నీ యొక్క, ఈ+లాలన+ఏకాంత వర్తనలన్=ఈ లాలనయొక్క అత్యంతమైన వర్తనలచే పర్వుచు=తిరుగుచు, ఉర్విన్=భూమిలో, మానవతులన్=మనుష్యసామ్యమును, ధన్యస్థితిన్=ధన్యమైనరీతిలో, మించి ఒప్పిన నన్ను=అతిశయించిన నన్ను, ఇట్లు, అనందనుల=అపుత్రకులయొక్క, ఆభీలార్తిపాల్+సేత=కష్టమైన పీడకు గురి చేయుట, అర్హమె, ఇంతకంటె, అయశోవాదంబు=చెడ్డ కీర్తి, లేదు+ఎన్నగన్=చూడగా లేదు.

తాత్పర్యము : ఓ పవిత్రమునిశ్రేష్ఠా! లెక్కించగా లోకములో గొప్ప గౌరవముగల నీ లాలనవలన అతిశయమును పొంది మనుష్యసామ్యమును మించి ధన్యతతో జీవించు నన్ను ఈ విధముగా అపుత్రకులు పొందు కష్టముల పాలు చేయుట అర్హమా? ఇంతకంటె ఎంచి చూడగా అపకీర్తి లేదు.

విశేషణము : ఇల్లాలన – ఈ + లాలన

ఆంధ్రభాషా భూషణములో –

కం. ముదమున ఆ ఈ ఊలను
పదముల తుద లూష్మలుడుగc బైవర్ణముతో
నదుకునెడం గవియును దుది
గుదియcగ మఱి జడ్డవ్రాలగుం బై హల్లుల్

ఇక్కడ ఏ కారమునకు ఇ కారముతో యతి చెల్లెను.

భారత : ఎనయన్, లోక=లోకములందు, గురుప్రశస్తిగల=అతిప్రసిద్ధిగల, నీ=నీయొక్క ఇల్లాలినై=భార్యనై, కాంతవర్తనలన్+పర్వుచు=మనోహర రీతులతో తిరుగుచు, ఉర్విన్=భూమిపై గల, మానవతులన్=స్త్రీలను, ధన్యస్థితిన్=ధన్యత్వముతో, మించి యొప్పిననను, ఇట్లనన్+అర్హమె=ఇట్లనుట న్యాయమా? ఈశ్వర!=ఓరాజా!, ఇంతకంటెన్=పరపురుషసంగతి కంటె, తనులయ=శరీరనాశనము చేతనైన, ఆభీలార్తి=కష్టమైన పీడకు, పాల్+సేత=అధీనము చేయుట, పావనమౌన్=పవిత్రమగును, ఇంతకంటె, అయశోవాదంబులేదు–ఎన్నగన్.

తాత్పర్యము : ఓ రాజా! లోకములో అత్యంత ప్రశస్తిగల నీ భార్యనై మనోహర రీతులలో సంచరించుచు భూమిపై ధన్యత్వముతో స్త్రీలను మించిన నన్ను ఇట్లనుట న్యాయమా? పరపురుష సాంగత్యము కంటె శరీర నాశనముచే కష్టమైన పీడకు గురి చేయుట పవిత్రమగును. ఇంతకంటె అపకీర్తి చూడగా లేదు.

విశేషణము : 'అపయశోద్యస్తి కిం మృత్యువా' అను న్యాయముచే జన్మహాని రాకుండును.

చం. అన నతc డిట్లనుం గలcక నందcగ నేటికిc దొల్లి యీక్రమం
బున ననపత్యు లౌనృపులు పుత్రులc గానరె యెందఱేనిc బెం
పెనయ సుతేష్టిc జేసి నిను నే నియమించుచు నున్న వాcడ నె
మ్మనమునc జింత దక్కి సుసమాహితవృత్తి నొనర్పు మవ్విధిన్.

రామా : అనన్=దశరథుడిట్లనగా, అతcడు=వసిష్ఠ మహర్షి, ఇట్లనున్=ఇట్లనెను – కలcకనందగన్+ఏటికి=బాధపడుట ఏల? తొల్లి=పూర్వము, ఈ క్రమంబున=ఈ

విధముగా, అనపత్యులౌ=కుమారులులేని, ఎందఱేని నృపులు=ఎందరో రాజులు, పెంపు+ఎనయ=అతిశయించగా, సుతేష్టి+చేసి=పుత్రకామేష్టియాగము చేసి, పుత్రులన్+కానరె=పుత్రులను పొందరా? నినున్=నిన్ను, నే=నేను, నియమించు చున్నవాడ=నియోగించుచున్నాను, నెమ్మనమునన్=మనస్సులో, చింతన్+తక్కి=బాధను వదలి, ఆ+విధిన్=ఆ పద్ధతిని, సుసమాహితవృత్తి=మంచి విధానమును, ఒనర్పుము=చేయుము.

తాత్పర్యము : దశరథుడిట్లనగా, వసిష్ఠుడు ఇట్లనును–"బాధపడనేల? ఇంతకు ముందు ఈ విధముగా పుత్రసంతతిలేని ఎందరో రాజులు, పుత్రకామేష్టి చేసి పుత్రులను కనలేదా? నిన్ను నేను ఆజ్ఞాపించుచున్నాను. మనస్సులో మరో చింతలేక ఆ మంచి కార్యమును ఆ విధానములో నిర్వహించుము.

భారత : అనన్=కుంతి ఇట్లనగా, అతడు=పాండురాజు ఇట్లనును.

సుతేష్టిన్=చేసి=పుత్రుడు కావలెనను కోరికచే. మిగతా సమానము.

తాత్పర్యము : కుంతి ఇట్లనగా పాండురాజు ఇట్లనెను. "బాధపడనేల? ఇంతకు ముందు రాజులెందరో పుత్రసంతతిలేనివారు, పుత్ర వాంఛతో ఇట్లు చేయలేదా? నేను నిన్ను నియోగిస్తున్నాను. అందువలన మనస్సులో చింతలేక ఈ మంచి పద్ధతిని ఆచరించుము!".

విశేషణము : "ఇష్టిర్యాగేచ్ఛయోః" అని అమరము. ఇష్టి, యాగము, ఇచ్ఛ అను అర్థములు గలవు.

కం. అవినింద్యమతి వసుమతీ
ధనగుర్వాదేశమునను దా నెద్దానిన్
సవరించిన నది యిష్టము
నవిలంబత నొసఁగు సందియము వల దెందున్. 51

రామా : అవినింద్యమతి!=నిందలేని మనస్సుగలవాడా! వసుమతీధర=రాజా! గురు+ఆదేశమునను=గురువుయొక్క ఆదేశముతో, తాను, ఎద్దానిన్=తాను ఏ పనినైనను సవరించిన=చేసినను, అది యిష్టము, అవిలంబత+ఒసగు=ఆలస్యము లేకుండజేయును, ఎందున్=ఎక్కడను, సందియము, సందేహము, వలదు.

తాత్పర్యము : నిందలేనివాడా! ఓరాజా! గురువు ఆదేశముతో తాను ఏ పని చేసినను అది యిష్టమే. ఎక్కడను ఆలస్యము లేదు. సందేహము వలదు.

భారత : అతివ=ఓ స్త్రీ! సుమతీ=మంచి బుద్ధిగలదానా! ధవ=భర్త యొక్క, గురు+ఆదేశమునన్=గొప్ప ఆజ్ఞచే, తాను, ఎద్దానిన్, సవరించినది, అవినింద్యము= దూషింపబడని, ఇష్టము=కోరికను, ఒసగును.

తాత్పర్యము : ఓ అతివా! సుమతీ! భర్త యొక్క గొప్ప ఆదేశముచే తాను ఏ పనిని చేసినను అది దూష్యము కాదు. అభీష్టము నొసగును.

వ. అదియు 52

సీ. అలఘు పావనగుణోజ్జ్వలదృశ్యశృంగార
చితమై సుపుత్త్ర సంసిద్ధిఁ జేయుఁ
గావునఁ దత్కర్మకలనకు వరియింప
వలయునాతనిఁ దెచ్చువైపుఁ జూడు
మనుడుఁ బూర్వమున నేఁ గనిన సుమంత్రోప
దేశ మొక్కటి యిప్డు దీని కొనరి
యున్నది మీతలం పొకటి పొల్లగునె పు
త్త్రేష్టికి వేల్పుల నే నిచటికి
తే. దానఁ దెత్తు నోయనఘ నా తండ్రి యాజ్ఞ
యతిశయమున సాక్షాదీశ్వరాంశ మవు త
పస్వివరునిను మాధవుబలె భజించి
కంటి నీమంత్రశక్తి నీగరిమ మెఱయ. 53

అదియున్=ఆ యజ్ఞమును ఓ+అనఘ=ఓ శ్రేష్ఠుడా! నా తండ్రి=నా తండ్రీ! అలఘు=అధికములైన, పావనగుణ=పవిత్ర గుణములచే, ఉజ్జ్వలత్= ప్రకాశించు, ఋశ్యశృంగ=ఋశ్యశృంగమునిచే, ఆరచితమై=చేయబడినదై, సుపుత్ర సంసిద్ధి చేయు=సత్పుత్రులను కలుగజేయును, కావునన్=కావున, తత్+కర్మకలనకు=ఆ యజ్ఞము యొక్క ప్రయోగవిధికి, వరియింపవలయు=వరించవలసిన, ఆతని=ఋశ్య శృంగమునిని, తెచ్చు వైపున్+చూడుము=తీసికొని వచ్చు ఉపాయమును ఆలోచింపుము, అనుఁడున్=వసిష్ఠుడనినంతనే – (దశరథుడను మాటలు), పూర్వ మున=ఇంతకు ముందు, నేన్+కనిన=నేను తెలిసికొన్న, సుమంత్ర+ఉపదేశము =సుమంత్రుడను మంత్రి యొక్క వాక్యము, ఒక్కటి, ఇప్డు=ఒకటి యిప్పుడు, దీనికి+ఒనరి యున్నది=దీనికి సరిపోవుచున్నది, మీ తలంపు=మీ ఆలోచన, ఒకటి పొల్లుగా అగునె=ఒకటి అయినను వ్యర్థమగునా? పుత్ర+ఇష్టికి=పుత్ర కామేష్టికి, దానన్=మీ తలపున్, ఆజ్ఞ+అతిశయము=మీ ఆదేశానుసారము, ఇచటికి నేను వేల్పులన్+తెత్తు=ఇచ్చటికి నేను దేవతలను తీసికొని వత్తును. సాక్షాత్+ ఈశ్వరాంశమవు=సాక్షాత్తు భగవదంశమైన, నినున్=నిన్ను, మాధవుబలె=విష్ణునివలె, భజించి=పూజించి, నీ మంత్రశక్తి, ఈగరిమ=ఈ పూజ్యత్వమును మెఱయన్+ కంటి=ప్రకాశింపగా తెలిసికొంటిని.

తాత్పర్యము : ఓ అనఘా! నా తండ్రీ! అధికములైన పవిత్రగుణములచే ప్రకాశించు ఋశ్యశృంగమునిచే చేయబడినదై యాగము సత్పుత్రులను కలుగజేయును. కావున ఆ యజ్ఞప్రయోగవిధికి వరించవలసిన అతనిని తీసికొనివచ్చు ఉపాయమును ఆలోచింపుమని వసిష్ఠుడనినంతనే దశరథుడిట్లనెను. పూర్వము నేను సుమంత్రుని వలన వినిన ఉపదేశము నాకిప్పుడు సరిపోవుచున్నది. మీ ఆలోచన ఎన్నడును వ్యర్థముగాదు. పుత్రకామేష్టికి నేను ఇక్కడికి దేవతలను తెచ్చెదను. మీ ఆజ్ఞానుసారము తపసివర్యుని విష్ణునివలె పూజించి మీ మంత్రశక్తిని, మీ పూజనీయతను దర్శించెదను.

భారత : అదియును, నే చెప్పిన ప్రకారము, అలఘు పావనగుణములచేత, ఉజ్జ్వల=ప్రకాశించుదానా! దృశ్య=కంటి కింపైన, శృంగార=శృంగారముచేత,

చితమై=చేయబడినదై, సుపుత్ర సంసిద్ధి చేయు గావున, తత్+కర్మ కలనన్=ఆ దేవర న్యాయవిధికి, వరియింపవలయు నాతనిన్=వరింపవలసిన వానిని, తెచ్చు వైపు, చూడుము, అనుడున్=పాండురాజు అనగా – (కుంతి అనిన మాట) పూర్వమున నేను, కనిన=తెలిసిన, సుమంత్రోపదేశము=మంచి మంత్రోపదేశము ఒక్కటి, ఇపుడు, దీనికిన్=ఈ వాక్యమునకు, ఒనరి యున్నది. పుత్రేష్టికి, వేల్పులన్=దేవతలను, దానన్=ఆ మంత్రముచే, ఇచటికి తెత్తును. ఓ అనఘ!, నా తండ్రి=నా తండ్రి, కుంతి భోజుని యొక్క, ఆజ్ఞాతిశయమునన్, సాక్షాత్=ఈశ్వరాంశమవు=సాక్షాత్తు ఈశ్వరాంశ అయిన, తపస్వివరున్=దుర్వాసుని ఉమాధవువలె భజించి=శంకరునివలె పూజించి, ఈ మంత్రశక్తి , ఈగరిమ=ఇట్లు దేవతల తెచ్చు మహిమ, మెరయన్= వెలయగా, కంటి.

తాత్పర్యము : అదియును, నేచెప్పిన ప్రకారము అలఘుపావనగుణములచే ప్రకాశించుదానా! కంటికింపైన శృంగారముచేత చేయబడి సుపుత్రుల సంసిద్ధిని కలుగజేయునుగాన ఆ దేవరన్యాయవిధికి వరించవలసిన వ్యక్తిని తెచ్చు ఉపాయము నాలోచింపుము – అని పాండురాజు చెప్పగా – కుంతి ఇట్లనును :

పూర్వము నాకు తెలిసిన మంచి మంత్రోపదేశము ఇపుడు మీ వాక్యమునకు సరిపోవుచున్నది. పుత్రులను పొందుటకు దేవతలను ఆ మంత్రముచే తెచ్చెదను. ఓ అనఘా! నా తండ్రియైన కుంతిభోజుని ఆజ్ఞానుసారము సాక్షాత్తు రుద్రాంశయైన దుర్వాసుని శంకరునివలె పూజించి మంత్రశక్తిని పొందితిని. ఇట్లు దేవతలను తెచ్చు మహిమ వెలయగా కంటిని.

వ. కావున 54

కం. అవితథసంకల్పధరా
దివిజులలో నెట్టివారిఁ దెచ్చి వరింతున్
వివరింపవలయుఁ బుత్రే
ష్టివిధికి రప్పింతు మీరు చెప్పినయతనిన్. 55

రామా : అవితథ సంకల్ప!=సఫలమైన మనోరథము గలవాడా! ధరా దివిజులలోన్=బ్రాహ్మణులలో, ఎట్టివారిన్=అధికులను తెచ్చి, వరింతున్=యాగార్థము నియమించెదను, వివరింపవలయు, మీరు చెప్పిన+అతనిన్=మీరు చెప్పిన ఋష్యశృంగుని, పుత్రేష్టివిధికి=పుత్రకామేష్టి యాగమునకు, రప్పింతున్=రప్పించెదను.

తాత్పర్యము : ఓ సఫలమనోరథా! బ్రాహ్మణులలో అధికులను తెచ్చి యాగార్థము నియమించెదను. వివరింపుడు. మీరు చెప్పిన ఋష్యశృంగుని పుత్రకామేష్టి యాగమునకు రప్పించెదను.

భారత : అవితథ సంకల్పధరా!=సఫలమైన మనోరథమును ధరించినవాడా!, దివిజులలో=దేవతలలో, ఎట్టివారి తెచ్చి=అధికులను తెచ్చి, వరింతున్, వివరింపవలయు, పుత్రేష్టివిధికి=పుత్రులు కావలెనను కోరిక సిద్ధించుటకు, మీరు చెప్పిన అతనిని రప్పింతును.

చం. అనయముఁ దత్త్వబోధమున నంచితధర్మనిరూఢియందు స
త్యనియతిఁ బెద్ద యంద్రు విబుధావళిలోపల నమ్మహాత్ముఁ బా
వనగుణశాంతతోరుచిరవర్ణ్యనిసర్గమనఃప్రసాదుఁ డై
తనరెడువాని మంత్రవిధిదక్షమతిన్ భజియించి తేఁదగున్. 56

రామా : అనయమున్=ఎల్లప్పుడు, ఆ+మహాత్మున్=ఆ ఋశ్యశృంగుని, తత్త్వబోధమునన్=ఆధ్యాత్మిక బోధనలలో, అంచితధర్మనిరూఢియందు=మిక్కిలి ధర్మనిష్ఠయందు, సత్యనియతిన్=సత్యనిష్ఠయందు, పెద్ద+అంద్రు=గొప్ప అనెదరు, విబుధావళిలోపల=పండితులలో, పావనగుణ=పవిత్ర గుణములచే, రుచిరవర్ణ్య=మనోహరమైన వర్ణింపదగిన, నిసర్గ=స్వభావముచే, మనః ప్రసాదుఁడై=మనః ప్రసన్నత గలవాడై, తనరెడునానిన్=ప్రకాశించు ఋష్యశృంగుని, శాంతతో=శాంతాదేవితో, మంత్రవిధిన్=మంత్రములు తెలిసినవారిలో, దక్షమతిన్=సమర్థుని, భజియించి=పూజించి, తేన్+తగున్=తీసికొని రావలెను.

తాత్పర్యము : ఎల్లప్పుడు తత్వబోధలలోను, అధికమైన ధర్మనిరూపణలోను,

సత్యనిష్ఠలోను పండితులలో అధికుడని చెప్పబడు ఆ ఋష్యశృంగుని, పావనమైన గుణములుగలవానిని, రమ్యమైన వర్ణింపదగిన స్వభావముచే మనః ప్రసన్నతగలవాడై తనరు నతనిని మనసారా గొలిచి శాంతాదేవితోడ తోడ్కొని రావలెను.

భారత : అనన్=కుంతీదేవి ఇట్లనగా, తత్వబోధమున, అంచిత ధర్మనిరూఢి యందు, సత్యనియతియందు, విబుధావళిలో పెద్దయండ్రు=దేవతల సంఘములో పెద్దయందురు, పావనగుణశాంతత+ఉరుచిర=పవిత్ర శాంతగుణములతో ప్రకాశించు, నిసర్గమనఃప్రసాదుఁడై=స్వభావముచే ప్రసన్న మనస్సుగల్గి, తనరెడువాని= ప్రకాశించువానిని, యమున్=యముని, మంత్రవిధిదక్షమతిన్=మంత్రానుష్ఠానములో, దక్షమతిన్=సమర్థమైన బుద్ధిగలవానిని, భజియించి=మనసుకు నచ్చునట్లుగా పూజించి, తేఁదగున్=ఆహ్వానించవలెను.

తాత్పర్యము : కుంతి అట్లు అనగా – (పాండురాజు అను మాటలు)

ఆధ్యాత్మిక బోధలోను, అధికమైన ధర్మనిరూపణలోను, సత్యనిష్ఠలోను పండితులలో పెద్దయనబడు మహాత్ముని, పావనశాంత గుణములతో ప్రకాశించువానిని స్వభావరీత్యా ప్రసన్న మనస్సుగలవానిని, ఆ యముని, మంత్రానుష్ఠానమునందు సమర్థమైన బుద్ధిచే పూజించి ఆహ్వానించవలెను.

కం. అని నృపుఁడు భార్యతో నా
యనఁ దడయక తెచ్చి యాగమాచారముతోఁ
దనకుఁ దనూభవలాభం
బొనరం జేయుటకుఁ గడుఁ బ్రియోక్తులు పలికెన్. 57

రామా : అని, నృపుఁడు దశరథుడు, భార్యతోన్=శాంతతోగూడ, ఆయనన్= ఋష్యశృంగుని, తడయక తెచ్చి=ఆలస్యము చేయక తీసికొని వచ్చి, తనకు, తనూభవలాభంబు=కుమారుడు కలుగు, ఒనరన్+చేయుటకు=విధముగా చేయుటకు, యాగము, ఆచారముతో=యాగమును సంప్రదాయానుసారము, చేయుటకున్, కడు=మిక్కిలి, ప్రియ+ఉక్తులు=మంచి మాటలు, పలికెన్=పలికెను.

తాత్పర్యము : అని దశరథుడు :- శాంతతో ఋష్యశృంగుని వెంటనే తెచ్చి తనకు కుమారుడు కలుగుటకు యాగమును సంప్రదాయబద్ధముగా చేయుమని మంచి మాటలు పలికెను.

భారత : అని=ఇట్లని, నృపుడు=పాండురాజు, భార్యతో=కుంతితో, ఆయనన్=యముని, తడయక తెచ్చి, ఆగమాచారముతోన్=దేవరన్యాయశాస్త్ర విధితో, తనకు, తనూభవలాభంబు - ఒనరంజేయుటకు, కడుప్రియోక్తులు పలికెన్.

తాత్పర్యము : ఇట్లని పాండురాజు కుంతితో మాట్లాడి యముని త్వరగా ఆహ్వానించి దేవరన్యాయము ప్రకారము తనకు కుమారుడు కలుగజేయుమని మిక్కిలి ప్రియమైన మాటలు పలికెను.

వ. ఇట్లు నియమించి 58

తే. ప్రతిపదంబును నిజపురోహితమతాను
శీలనమున సదీక్షావిశేషుఁ డగుచు
ననఘమతు లైనమునులతో నాత్మయోగ
మొకటి కొదవ లేకయుండఁ జేయుచును వేడ్క. 59

రామా : ప్రతిపదంబును=అన్ని ప్రయోజనములయందును, నిజపురోహిత=తన పురోహితుడైన వసిష్ఠునకు, మతానుశీలమున=సమ్మతమైన పద్ధతిలో, సదీక్షావిశేషుడు+అగుచున్=దీక్షా కంకణము ధరించినవాడై, అనఘమతులైన=పాపరహితులైన, మునులతో, ఆత్మయోగము=ఆత్మయోగము చేయుచు, ఒకటి=ఏ ఒక్కటియు, కొదలేక+ఉండక=కొరవలేనట్లు, వేడ్కన్+చేయుచును=వేడుకతో చేయుచు - తర్వాతి పద్యముతో అన్వయము.

తాత్పర్యము : అన్ని ప్రయోజనములలో తన కులగురుడైన వసిష్ఠునికి సమ్మతమైన పద్ధతిలో దీక్షాకంకణధారియై, పాపరహితులైన మునులచే ఆత్మయోగము చేయుచు, ఏ ఒక్కటియు కొదువలేకుండ వేడుకతో చేయుచు -

భారత : ప్రతి పదంబును=పలుమార్లు, నిజ=తన, పురః=తన ఆముష్మికము కొఱకు, హిత=హితమైన, మత=యోగము యొక్క, (పురా=ఆదిలో, ఊహితమైన= ఎంచుకొని, మత=యోగ సంకల్పముచే) అనుశీలనమున= పరిచయమున, సత్=లెస్స అయిన, ఈక్షావిశేషుఁడగుచున్=జ్ఞానముగలవాడగుచు, అనఘమతులైన, మునులతో, ఆత్మయోగము=బ్రహ్మోపాసన – చేయుచును.

తాత్పర్యము : పలుమార్లు తన ఆముష్మికము కొఱకు తాను ఎంచుకొనిన యోగసంకల్పపరిచయముచే మిక్కిలి జ్ఞానసంపత్తి గలిగి అనఘులైన మునులతో బ్రహ్మోపాసన చేయుచును –

విశేషణము : ఆత్మయోగము=ఆత్మదేహమనో బ్రహ్మ స్వభావ ధృతిబుద్ధిషు – అని.

చం. ధరణిపుఁ డుండె నంత బహుధామునిసన్మ నుహూయమానుఁ డై
పరమసమృద్ధిఁ బర్వెడువిభావసునందనురూపకాంతిని
ర్భరుఁగొద లెల్ల దూరముగఁబాయ సభాజన గౌరవానమ
త్కరుఘను నొక్కనిం బ్రమదగౌరవ మొప్పఁగఁ గాంచి సన్నిధిన్. 60

రామా : ధరణిపుఁడు+ఉండెను=దశరథుడుండెను. అంతన్=అంతట, బహుధా=అనేక ప్రకారములైన, మునిసన్మను=మునుల శ్రేష్ఠమంత్రములచే, హూయమానుఁడై=వేల్వబడుచున్నవాడై, పరమసమృద్ధిన్=అధికసమృద్ధితో, పర్వెడు=ప్రజ్వరిల్లెడు, విభావసునందన్=అగ్నియందు, అనురూప కాంతిని=తగిన కాంతిచే, నిర్భరున్=అధికుడైనవాని, కొదలెల్ల=కొరతలన్నియు, దూరముగ=తీరగా, పాయసభాజన=పరమాన్నపాత్రముయొక్క, గౌరవ=గౌరవముచే, ఆనమత్= వంగుచున్న, కరు=చేతులు గలవానిని, ఘనున్=శ్రేష్ఠుని, ఒక్కనిన్=ఒక దివ్యపురుషుని, ప్రమద గౌరవము+ఒప్పగ=సంతోష గౌరవములతో, సన్నిధిన్=సభలో–కాంచి=చూచి, (పాయన్+సభాజన గౌరవ=సభాజనుల గౌరవము తొలగగా)

తాత్పర్యము : దశరథుడుండెను – అంతట అనేక మునుల శ్రేష్ఠమంత్రములచే వేల్వబడుచున్న వాడై అగ్నియందు తగిన కాంతిచే అధికుడైన వానిని, కొఱతలన్నియు తీరగా, పాయసపాత్ర గౌరవముచే వంగిన చేతులు గలవానిని ఒక శ్రేష్ఠుడైన దివ్యపురుషుని సంతోష గౌరములతో ఎదుట చూచి.

విశేషణము : పాయసభాజన=భాజనం యోగ్య పాత్రయోః – అని

భారత : ధరణిపుడుండెన్=పాండురాజు ఉండెను, అంతన్, బహుధాామునిన్=అధికతేజముగలవానిని, సన్మను=ఘనమైన మంత్రములచే, హూయమానుడై=పిలువబడినవాడై, పరమసమృద్ధిన్+పర్వెడు, విభావసునందమ=సూర్యుని కుమారుడైన యముని, రూపకాంతినిర్భరున్=సౌందర్యతేజములచే అధికుని, కొదలు=కొరతలు, ఎల్లదూరముగ పాయు, దూరముగా అన్నియు తీరగా, సభాజనగౌరవ=సన్మానాతిశయముచే, ఆనమత్=వ్యాపించియున్న – కరున్=హస్తముగలవాని, ఒక్కనిన్=ఒంటరిగా వచ్చినవాని, సన్నిధిన్=సమీపము, ప్రమద గౌరవము=సంతోషాధిక్యము, ఒప్పగా కాంచి (అప్పుడా యార్యయుండెను).

తాత్పర్యము : పాండురాజు ఈ ప్రకారము వర్తించుచుండెను. అంతట అధికతేజము గలవానిని, ఘనమైన మంత్రముచేత పిలువబడినవాడైన సూర్యపుత్రుడైన యముని, సౌందర్య తేజములచే నధికమైన వానిని, కొరతలు తీరునట్లు సన్మానాతిశయముచే వ్యాపించిన హస్తముగలవానిని (ప్రేమాతిశయముచే హస్తాభినయ పూర్వకముగా చేర పిలుచువానిని) ఒంటరిగా వచ్చినవానిని సంతోషాధిక్యముతో చూచి – ఆ కుంతి.

విశేషణము : విభావసు – సూర్యవహ్నీ విభావసూ – అని అమరం.

తే. అప్పు డాయార్యసభ యాతతాద్భుత ప్ర
మోదమందాక్షవృత్తిఁ గేల్మోగిచి యుండె
నంత రారమ్ము మనుజపయజ్ఞఫలము
నొసఁగెదఁ గొను మని విభావసూద్భవుండు. 61

రామా : అప్పుడు, ఆ+ఆర్యసభ=ఆ పెద్దల సభలో, ఆతత=విస్తృతమైన, అద్భుత=ఆశ్చర్యముతో, ప్రమోద=సంతోషముతో, మంద=స్థిమితమైన, అక్షవృత్తిన్=ఇంద్రియ వ్యాపారముచే, కేల్+మొగిచి+ఉండె=నమస్కరించి యుండెను, అంతన్, విభావసు+ఉద్భవుండు=ప్రాజాపత్య పురుషుడు (అగ్నిలో నుండి వచ్చినవాడు) రారమ్ము మనుజప=నృపా! యజ్ఞ=పుత్రకామేష్టియొక్క ఫలమున్+ఒసగెద= ఫలమునిచ్చెదను, కొనుమని=స్వీకరించుమని.

తాత్పర్యము : అప్పుడు ఆ పూజనీయసభలో జనులు విస్తరించిన ఆశ్చర్యము, సంతోషముతో స్థిమితమైన ఇంద్రియ వ్యాపారముచే అగ్నిలో నుండి ఉద్భవించిన ప్రాజాపత్య పురుషుని చూచి ఇంద్రియ వ్యాపారములు మందగించిన సభలో వారు నమస్కరించిరి. అతడు నృపా! రారమ్ము, పుత్రకామేష్ఠి ఫలమునిచ్చెదను కొనుమని –

భారత : అప్పుడు, ఆయార్య=ఆ కుంతి, సభ=సభలో, యాతత+అద్భుత ప్రమోదమందాక్షవృత్తిన్=భయాశ్చర్యసంతోష లజ్జా చేష్టలతో సహితురాలై, కేల్మోగిచియుండెనన్, విభావసూద్భవుండు=సూర్యపుత్రుడు (యముడు) మనుజప= మంత్ర జపమనెడు, యజ్ఞఫలమును=యజ్ఞముయొక్క ఫలమైన సంతానప్రాప్తిని, కొనుమని=స్వీకరించుమని.

తాత్పర్యం : అప్పుడు ఆ కుంతి భయాశ్చర్యసంతోషలజ్జా చేష్టలతో కూడినదై కేల్మోగిచియుండెను. యముడు అంతట – "మంత్రజపముచే సంతానప్రాప్తి ఫలమును గలిగించెదను రారమ్ము – స్వీకరించుమని" – (పిలిచెను).

విశే : అక్షవృత్తిక – అక్షోరథస్యావయవే పాచికేప్యక్ష మింద్రియమ్ – అని వి.

మందాక్ష వృత్తిన్=దేవతాకర్షణ మపచారమని భయమును మంత్ర మహాత్మ్యము వలన నాశ్చర్యమును, సుపుత్రలాభమనెడు సంతోషమును, పరపురుషుడు గదాయని సిగ్గును కలదై యుండెనని భావము.

'మందాక్షంహ్రీస్త్రపాత్రీడా' అని అమరం.

మ. నిరతిం బార్థివగేహినీజనులకున్ సేవింప నిమ్మిందు వం
శరమాస్ఫూర్తికిఁ బట్టుఁగొమ్మ సకలక్ష్మాభారధుర్యం బనన్
స్థిరమై మించుతనూజలాభ మొదవున్ నీకంచు నిచ్చెం గృపన్
వరముం బాయసమస్తకల్మషము దివ్యశ్రేష్ఠుఁ డత్యాదృతిన్ 62

రామా : పార్థివ : రాజా!, నిరతిన్=నిష్ఠతో, గేహినీజనులకున్=పత్నులకు, సేవింప=భుజింప, ఇమ్ము, ఇందున్=ఈ పాయసమందు, వంశరమాస్ఫూర్తికిన్=వంశ సౌభాగ్యస్ఫూర్తికి, పట్టుగొమ్మ=ఆధారము, సకలక్ష్మాభారధుర్యంబు=సమస్త రాజ్యభారమును ధరింపగలది, అనన్=అనునట్లు, స్థిరమై=నిశ్చలమై, మించు= అతిశయించు, తనూజలాభము=పుత్రలాభము, నీకు, ఒదవున్=కలుగును, అంచు=అని చెప్పి, వరమున్=శ్రేష్ఠమైన, అస్తకల్మషము=నిష్కళంకమైన, పాయసము, దివ్యశ్రేష్ఠుడు= ప్రాజాపత్యపురుషుడు, అత్యాదృతిన్=అధిక ఆదరముతో, కృపన్=దయతో, ఇచ్చెన్=ఇచ్చెను,

తాత్పర్యం : ఓ దశరథ మహారాజా! నిష్ఠతో నీ పత్నులకు భుజింపనిమ్ము. ఈ పాయసము వంశసౌభాగ్యస్ఫూర్తికి ఆధారమై సమస్తరాజ్యభారమును ధరింపగలదనునట్లు నిశ్చలమైన పుత్రలాభము నీకు కలుగునని చెప్పి శ్రేష్ఠము, నిష్కళంకమునయిన పాయసము ప్రాజాపత్యపురుషుడు అధికాదరముతో దయతో నిచ్చెను.

భారత : పార్థివగేహినీ!=రాజపత్ని-కుంతీ! నిరతిన్=నియమముతో, జనులకు సేవింపన్, ఇమ్ము=స్థానమైనది, ఇందువంశ=చంద్రవంశముయొక్క, రమాస్ఫూర్తికి= సౌభాగ్యస్ఫూర్తికి, పట్టుగొమ్మ=ఆధారము, అనన్, మించు, తనూజలాభము, నీ కొదవునంచు, దివ్యశ్రేష్ఠుడు=యముడు, సమస్త కల్మషము=అన్ని విచారములు, పాయన్=తొలగునట్లు, అతి+ఆదృతిన్=మిక్కిలి ఆదరముతో, కృపన్, వరమున్= వరమును, ఇచ్చెన్=ఇచ్చెను.

తాత్పర్యం : ఓ రాజపత్నీ! (కుంతీ!) నియమముతో జనులు సేవించుటకు

స్థానమైన చంద్రవంశపు సౌభాగ్యస్ఫూర్తికి అవలంబము, సమస్తరాజ్యభార ధారణమునకు స్థిరమై మించు పుత్రలాభము నీకు కలుగునని యముడు సమస్త దురితములు పోవునట్లుగా ఆదరపూర్వకమైన కృపతో వరమునిచ్చెను.

సీ॥ అ ట్లిచ్చి యతఁడు దా నంతర్హితుం డయ్యె
        నది యెల్ల విని గాఢహర్షుఁ డగుచు
    జనవరుండు నిజాగ్రసతికి సౌభాగ్యంపు
        నడకల కేకయనందనకుఁ గ
    రంబు గౌరవమహిమం బంచితానంత
        భావంబునం బర్వఁ బరమనియతి
    మనుసుమిత్ర కులసన్మానవతికి భవ్య
        దౌహృదోదయనిమిత్తంబులైన
ఆ. యాసగములలోన నరయరయవ్యగ్ర
    బుద్ధిఁ గోర్కు లెల్లఁ బూరితముగ
    నొసఁగఁ బనిచె నెంతయును దత్పరిగ్రహ
    జనుల వారు నట్లు సలిపి రెలమి. 63

రామా : అట్లు+ఇచ్చి, అతఁడు=తాను, అంతర్హితుండయ్యె=మాయమాయెను, అది+ఎల్ల=పాయసమంతయు, జనవరుండు=దశరథుండు, విని గాఢహర్షుడు+ అగుచు=విని మిక్కిలి సంతసించుచు, నిజ+అగ్రసతికి=పెద్దభార్య కౌసల్యకు, సౌభాగ్యము+ నడకల=సౌభాగ్యవంతమైన నడకలు గల, కేకయనందనకు=కైకేయికి, కరంబు=మిక్కిలి, గౌరవమహిమ=గౌరవభావముతో, పంచి, తాన్=తాను, అంత=ఆ తరువాత, భావంబునన్+పర్వన్=చిత్తమున్ నిల్వగా, పరమనియతిమను=పరమనిష్ఠతో జీవించు, లసత్+మానవతికి=మిక్కిలి మానవతియైన సుమిత్రకు, భవ్యదౌహృదోదయ నిమిత్తంబులైన=మనోహరముగా గర్భప్రాప్తికి హేతువులైన, ఆ సగములలోనన్=ఆ రెండు భాగములలో, అరయర=సగము సగము, వ్యగ్రబుద్ధిన్=సంభ్రమబుద్ధితో,

కోర్కులెల్ల=కోరికలన్నియు, పూరితముగ=నిండునట్లు, ఎంతయును, తత్+పరిగ్రహ జనులన్=భార్యలైన కౌసల్యా కైకేయిలను ఒసగన్+పనిచెన్=ఇయ్యకట్టడి చేసెను. ఎలమిన్=ప్రీతితో, వారును, అట్లు సలిపిరి=అట్లే చేసిరి.

తాత్పర్యము : ఆ విధముగా పాయసమిచ్చి ప్రాజాపత్యపురుషుడు అంతర్ధాన మొందెను. ఆ పాయసమంతయు దశరథుడు మిక్కిలి సంతోషించినవాడై తన భార్య కౌసల్యకు, సౌభాగ్యవతియైన కైకకు మిక్కిలి గౌరవభావముతో పంచెను. తర్వాత మనస్సులో భావింపగా పరమనిష్ఠాగరిష్ఠురాలైన సన్మానవతియైన సుమిత్రకు మనోహర గర్భప్రాప్తి కారకములైన ఆ సగములో సగము, సగము నిష్ఠతో కోర్కెలు పూరించునట్లు కౌసల్యా కైకేయిలకు ఇచ్చునట్లు కట్టడి చేసెను. వారును మిక్కిలి ప్రేమతో అట్లే చేసిరి.

విశేషణము : పరిగ్రహజనులు–పరిగ్రహః పరిజనే పత్న్యాం స్వీకార మూలయోః' అని వి.

భారత : అట్లు+ఇచ్చి=అతడు, తాను=యముడు, అంతర్హితుండయ్యె, అది+ఎల్లవిని=ఆ వరప్రకారము నంతయు విని, జనవరుండు=పాండురాజు, సౌభాగ్యపు నడకలకు, ఏకయనన్=ముఖ్యురాలనగా, తనకు, కరంబు, గౌరవ మహిమంబు=కుంతికి మిక్కిలి ప్రభావాతిశయము, అంచిత=పూజితమైన, అనంతభావమునన్=బాహుళ్యముచే, పర్వన్=ఒప్పుచుండగా, పరమనియతిన్=మంచి నియమమున, మను=జీవించుచున్న, సుమిత్ర కులసన్మానవతికిన్=బంధు సమూహమున బహుమానము గల, నిజాగ్రసతికి=కుంతీదేవికి, దౌహృదో దయమునకు=గర్భము ధరించుటకు, నిమిత్తంబులైన=చిహ్నములైన, ఆసగములన్= ఆశాపరంపరలను, లోనరయన్=లోలోపల తెలియునట్లు, రయ=వేగముచేత, వ్యగ్రబుద్ధిన్=సంభ్రమపడుచున్న బుద్ధిచే, కోర్కులెల్ల, పూరితముగ=ఒసగన్, తత్+పరిగ్రహజనులన్=కుంతి పరిచారికలను, పనిచె=పంపెను. ఎలమిన్ వారును, అట్లు సలిపిరి.

తాత్పర్యం : ఆ విధముగా వరమునిచ్చి యముడు అంతర్ధానము నొందెను. ఆ వరప్రకారమునంతయు విని సౌభాగ్యపు నడకలతో ముఖ్యురాలైన కుంతి మిక్కిలి

ప్రభావాతిశయము, పూజితబాహుళ్యము కలిగి ఒప్పుచుండెను. మంచి నియమముతో జీవించుచు, బంధుజనుల బహుమానములుగొను కుంతీదేవికి గర్భము ధరించుటకు చిహ్నములైన ఆశాపరంపరలు లోలోపల తెలియునట్లు వేగముచే సంభ్రమబుద్ధిచే కోరిన కోర్కెలన్నియు నిండునట్లు ఆమె పరిచారికలను పాండురాజు ఆదేశించెను. వారును అట్లే చేసిరి.

కం. భరియించె నపుడు విబుధో
త్కరసంప్రార్థన మొనర్చుకడఁక దలిర్పన్
హరిమధ్యమభువనముఁ బ్రో
చురతిం దద్గర్భభావశోభనలీలన్. 64

రామా : విబుధ+ఉత్కర=దేవతల సమూహము యొక్క, సంప్రార్థనము+ఒనర్చు =ప్రార్థించు, కడఁక+తలిర్పన్=ప్రయత్నము ఫలించునట్లు, హరి=విష్ణువు, మధ్యమభువనమున్=భూలోకమును, ప్రోచురతిన్=రక్షించు ఆసక్తితో, తత్+గర్భభావ శోభనలీలన్=ఆ కౌసల్యా, కైకేయీ సుమిత్రల గర్భత్వమనెడి శోభన లీలలను, అపుడు భరియించె.

తాత్పర్యం : అప్పుడు దేవతాసమూహముల ప్రార్థనలు ఫలించునట్లు విష్ణువు భూలోకమును రక్షించు ఆసక్తిచే కౌసల్యాకైకేయీ సుమిత్రల గర్భత్వమనెడి శోభనలీలను భరించెను.

భారత : అపుడు, హరిమధ్యమ=సింహమధ్యమయైన కుంతి, తద్గర్భ=ఆ గర్భస్థుని యొక్క, భావ=అభిప్రాయము యొక్క, శోభనలీలన్, విబుధోత్కర=విద్వత్ సమూహము యొక్క సంప్రార్థనమొనర్చు, కడక, తలిర్పన్, భువనము బ్రోచు రతిని భరియించె.

తాత్పర్యం : అప్పుడు సింహమధ్యమయైన కుంతి ఆ గర్భస్థుని అభిప్రాయమను శోభను లీలచే విద్వత్ సమూహముయొక్క సంప్రార్థనల ప్రయత్నము ఫలింపగా లోకమును రక్షించునట్లు భరించెను.

ఉ. దీనులఁ బ్రోవఁ గోరుదు రతిక్రమసత్కరుణన్ విపక్షసం
తానము ద్రుంపఁ గోరుదురుదాహరణీయరణైకశిక్షనం
భోనిధిమధ్యభూభరముఁ బూనఁగఁ గోరుదురత్య యోన్నతి
న్మానవనాథకాంత లసమానగుణాద్భుతగర్భసంగతిన్ 65

రామా : మానవనాథకాంతలు=రాణులు, అసమాన=అసాధారణములైన, గుణాద్భుత=గుణములచే అద్భుతమైన, గర్భసంగతిన్=గర్భముయొక్క సాంగత్యముచే, అతిక్రమ=అతిశయించిన, సత్+కరుణన్=మంచి దయతో, విపక్ష సంతానమున్=శత్రువుల సంతానమును, త్రుంపగోరుదురు=నశింపగోరుదురు, ఉదాహరణీయ=వర్ణింపదగిన, రణ+ఏకశిక్షన్=యుద్ధవిద్యలో, అంభోనిధి మధ్య=సముద్రము మధ్యగల, భూభరము=భూమి భారమును, అత్యయోన్నతిన్=అధిక భాగ్యము యొక్క అతిశయముచే, పూనగన్+కోరుదురు=భరించగోరుదురు, దీనులన్+ప్రోవ గోరుదురు =దీనులను రక్షింపగోరుదురు.

తాత్పర్యం : రాణులు అసాధారణములైన గుణములచే అద్భుతమైన గర్భసాంగత్యముచే అతిశయించిన దయతో శత్రుసంతానము నశింపగోరుదురు; వర్ణింపదగిన యుద్ధవిద్యతో సముద్ర మధ్యభూభారమును అధిక భాగ్యాతిశయముచే భరించగోరెదరు. దీనులను రక్షింపగోరెదరు.

భారత : మానవనాథకాంత=కుంతి, లసమానగుణ=సద్గుణములచే, అద్భుత గర్భసంగతిన్, దురతిక్రమ=నివారింపశక్యముగాని, సత్కరుణన్, దీనుల బ్రోవగోరు, విపక్షసంతానము ద్రుంపగోరు, దురుదాహరణీయ=దృష్టాంతము చెప్పరాని, రణైక శిక్షన్, అంభోనిధి మధ్య భూభారము, పూనగన్+కోరు, దురత్యయ=అతిక్రమింపరాని, ఉన్నతిన్=అతిశయముచే.

తాత్పర్యం : కుంతి తన సద్గుణములతో అద్భుతగర్భధారణచే నివారింప శక్యముగాని కరుణతో దీనుల బ్రోవగోరును. విపక్షసంతానము నశింపగోరును,

దృష్టాంతము చెప్పరాని యుద్ధవిద్యతో సముద్రవేలావలయిత భూభారమును అతిక్రమింపరాని అతిశయముచే భరింపగోరును.

విశేషణం : భారతార్థములో అన్నియు ఏకవచనములు.

క. విభునగ్రమహిషి కయ్యెడఁ
త్రిభువనములయం దజాతరిపునామకుఁడై
యభిమతి గాంచుకుమారుఁడు
ప్రభవించె మహాయశోభిరాముఁ డనంగన్. 66

రామా : విభున్+దశరథుని, అగ్రమహిషికి=కౌసల్యకు, ఆ+ఎడ=అక్కడ, త్రిభువనములయందు=ముల్లోకములలో, అజాతరిపునామకుఁడై=పుట్టని శత్రు శబ్దముగలవాడై, అభిమతి+కాంచుకుమారుడు=సమ్మతి పొందు పుత్రుడు, మహ=ఉత్సవములచే, అయ=భాగ్యములచే, శోభి=ఒప్పెడివాడు, అనంగన్=అనగా, మహత్+అధికమైన, అయశోభి=అపకీర్తి వలన భయముగలవాడు, రాముడనగన్, ప్రభవించె=పుట్టెను.

తాత్పర్యం : దశరథుని పట్టమహిషి కౌసల్యకు ముల్లోకములలో శత్రువులను శబ్దము పుట్టనివాడై, సమ్మతి గాంచు కుమారుడు, ఉత్సవములచే, భాగ్యములచే ఒప్పెడివాడనగా రాముడు జన్మించెను.

భారత : విభు=పాండురాజు యొక్క, అగ్రమహిషికి=పట్టపురాణి కుంతికి, అయ్యెడన్, త్రిభువములయందు, అజాతరిపునామకుఁడై=అజాతశత్రువను నామముగల ధర్మరాజు, మహత్+యశః=అధికకీర్తిచే, అభిమతి గాంచు= అభిరాముడనగా, కుమారుడు, ప్రభవించెను.

తాత్పర్యం : కుంతికి అప్పుడు ముల్లోకములయందు అజాతశత్రువైన ధర్మరాజు అధికకీర్తిచే అభిరాముడనగా కుమారుడై జన్మించెను.

విశేషణము : అగ్రమహిషి – కృతాభిషేకా మహిషీ – అని అమరం.

కం. సుర లెంతయు నలరిరి భా
సురతం దెస లెసఁగెఁ బ్రబలె శుభవిభవంబుల్
ధరణిజనంబుల కపు డా
సరణి నుదయ మంది ధర్మసంతతి పెరుఁగన్ 67

రామా : ఆసరణిన్=రాముదు జన్మించిన ప్రకారముననే, ఉదయము+అంది= అభ్యుదయమొంది, ధర్మసంతతి=ధర్మసమూహము, ధరణిజనంబులకు=భూలోక వాసులకు, అపుడు, శుభవిభవంబుల్=శుభవిశేషములు, ఎసంగెన్=కలిగెను, సురలు+ఎంతయు=దేవతలెంతయు, అలరిరి=సంతోషించిరి, భాసురతన్= ప్రకాశముతో, దెసలు+ఎసంగె=దిక్కులు ప్రకాశించెను.

తాత్పర్యం : ఆ విధముగా రాముదు జన్మించిన విధముగానే ధర్మసమూహము అభ్యుదయమంది పెరిగెను. భూలోకవాసులకు శుభలక్షణములు ప్రబలెను. దేవతలు సంతోషించిరి. దిక్కులన్నియు ప్రకాశించెను.

భారత : ఆ సరణిన్=ఆ ప్రకారముగా, ఉదయమంది, ధర్మసంతతి=ధర్మరాజు పెరుగన్, ధరణిజనంబులకపుడు, శుభవిభంబులు, ప్రబలె, సురలు, ఎంతయు, అలరిరి. దెసలు భాసురతన్+ఎసగె.

తాత్పర్యం : ఆ విధముగా జన్మించి ధర్మరాజు పెరుగగా భూలోకవాసులకు శుభలక్షణములు ప్రబలెను. దేవతలు సంతసించి, దిక్కులు ప్రకాశించెను.

వ. మఱియు 68

కం. అమితోన్నతిఁ గనియె నృప
ప్రమద మనుగుణప్రసన్న పవనునివలనం
గొమరు మిగుల బలియుసుగం
ధము గలవిరిసోన సురపథంబునఁ దొరుఁగన్ 69

రామా : నృప=దశరథుని, ప్రమదము=సంతోషము, అనుగుణ ప్రసన్న

పవనునివలనన్=అనుకూల మలయమారుతము వలన, కొమరు మిగుల=ప్రకాశించు, బలియు=గాఢమైన సుగంధముగల, విరిసోన=పూలవాన, సురపథంబున=ఆకాశ మార్గమున, తొరుగన్=కురియగా, అమిత+ఉన్నతిన్=అధికమైన ఉన్నతిని, కనియె=కాంచెను.

తాత్పర్యం : దశరథుని సంతోషము అనుకూల మలయమారుతము వలన ప్రకాశించగా గాఢమైన సుగంధముగల పూలవాన ఆకాశమార్గమున కురియగా, అధికమైన అభ్యున్నతి గాంచెను.

భారత : నృపప్రమద=రాజు భార్యయైన కుంతి, మనుగుణ=మంత్ర పఠనముచేత, ప్రసన్న=ప్రసన్నుడైన, పవనునివలనన్=వాయువువలన, కొమరున్=కుమారుని, మిగులబలియున్=మిక్కిలి బలిష్ఠుని, అమిత+ఉన్నతిన్= అమితమైన పరాక్రమముగలవానిని, కనియెన్=కనెను.

తాత్పర్యం : కుంతీదేవి మంత్రపఠనముచే ప్రసన్నుడైన వాయుదేవునివలన మిగుల బలిష్ఠుడు, అమిత పరాక్రమముగల కుమారుని ప్రసవించెను. ఆకాశ మార్గమున పూలవాన కురిసెను.

కం. అరిభీమనాముఁ డీతఁడు
కర మరుదుగఁ గొను నృపాళిఁ గడు నొడిచి మహా
సురుల వధించు ననేకుల
దురమున ననువిబుధసన్నుతులు వినఁబడియెన్. 70

రామా : అరిభీమనాముఁడు=శత్రుభయంకర నామముగలవాడు, ఈతడు, నృపాళిన్=రాజుల నుండి, కరము+అరుదుగన్+కొను=మిక్కిలి కప్పములను గొను, కడున్+ఒడిచి=మిక్కిలి బంధించి, మహాసురుల వధించు=రాక్షసులను చంపును, దురమున=యుద్ధమున, అనేకులన్=పెక్కురను, వధించు=చంపును, అను, విబుధ సన్నుతులు=పండిత ప్రశంసలు, వినఁబడియెన్=వినబడెను.

తాత్పర్యం : ఇతడు శత్రుభయంకరనామముగలవాడై రాజుల నుండి అధికముగ కప్పములు స్వీకరించును. యుద్ధములో పరాక్రమము చూపి రాక్షసులను అనేకుల చంపును – అను పండిత ప్రశంసలు వినబడెను.

భారత : భీమనాముడు=భీముడని పేరుగల, ఈతడు, నృపాళిన్=రాజులనుండి, అరి=కప్పము, కరమరుదగ గొను, కడునొడిచి మహాసురుల, వధించుననేకుల దురమున–అను విబుధ సన్నుతులు వినబడియెన్.

తాత్పర్యం : భీమనామధేయుడైన ఇతడు రాజులనుండి కప్పమును అధికముగా స్వీకరించును. మహాసురులను ఒడిసి పట్టును, అనేకులను యుద్ధమున వధించును – అను పండిత ప్రశంసలు వినబడెను.

కం. అమరనగరమున నపుడు
త్తమనీతివిచిత్రవీర్యతనయ జ్యేష్ఠ
త్వమునఁదనరారు నృపస
త్తమునియతివశతసుతాప్తిఁ దద్దయు వెలసెన్ 71

రామా : అమరనగరమునన్=అమరావతియందు, అపుడు, ఉత్తమనీతిన్=మంచినీతిచే, విచిత్రవీర్యతన్=అద్భుతపరాక్రమముగలిగియుండుటచే, అయ=భాగ్యముచేతను, జ్యేష్ఠత్వమునన్=పెద్దతనముచే, తనరారు=ప్రకాశించు, నృపసత్తము=దశరథునియొక్క, నియతివశత=అదృష్టసంప్రాప్తి, సుతాప్తిన్=రాముని జన్మచే, తద్దయు=మిక్కిలి, వెలసెన్=వెలసెను.

తాత్పర్యం : అమరావతియందు అపుడు మంచి నీతిచే, అద్భుత పరాక్రమముచే, భాగ్యముచే పెద్దతనముచే ప్రకాశించు అదృష్టసంప్రాప్తి రాముని జననమందు మిక్కిలి వెలసెను.

భారత : అమరనగరమునన్=హస్తినాపురమున, అపుడు, ఉత్తమనీతి=గాంధారికి, విచిత్రవీర్యతనయజ్యేష్ఠత్వమున=ధృతరాష్ట్రుని (విచిత్ర వీర్యుని పెద్దకుమారుని), తనరారు, నృపసత్తముని, అతివ=గాంధారి, శతసుతాప్తిన్=నూర్గురు

కుమారులు కలుగుటచే, తద్దయు వెలసెన్.

తాత్పర్యం : హస్తినాపురమున అపుడు ఉత్తమనీతిమంతురాలైన ధృతరాష్ట్రుని భార్య గాంధారి నూర్గురు కుమారులు కలుగుటచే మిక్కిలి వెలసెను.

సీ. దుర్యోధనుం డన దుశ్శాసనుం డన
దుర్ధర్షణుం డన దుర్ముఖుఁ డన
నమరువీరాదిగానారూఢగాఢశౌ
ర్యప్రదీప్తులఘూకరణవిషణ్ణ
నానావిబుధనింద్యమానోదయులసద్వి
చారవివర్జితాచారుమతుల
విగణింపరానిదుర్వృత్తి నధర్మపు
దశలపనులయాస్పదంబు గాఁగఁ
తే. జలుపఁ గలవీతనియతుల సాహసాతి
శయసమున్నతులనికృతశ్లాఘు లగుచు
నార్యు లబ్బాలురసితభావ్యర్థదృష్టి
నరసి మదిలోన నుర్ఘ్షితవ్యసను లైరి 72

రామా : దుర్యోధనుండు=యుద్ధము చేయ శక్యముగానివాడు, దుశ్శాసనుడు=దుష్టమైన ఆజ్ఞగలవాడు, దుర్ధర్షణుండు=ఎదిరింపరానివాడు, అనన్, దుర్ముఖుఁడు+అనన్=బహు ప్రలాపియనగను, అమరు, వీరాదిగానారూఢగాఢ శౌర్యప్రదీపిక – వీర=వీరులలో, ఆదిగాన=ప్రథమగణ్యత్వమును, ఆరూఢ=పొందినట్టి, గాఢశౌర్య=అధికప్రతాపులుచే, ప్రదీప్తున్=ప్రకాశించెడువానిని, లఘూకరణ=తృణీ కరించుటచే, విషణ్ణ=దీనులైన, నానావిబుధ=అనేకదేవతల, నింద్యమాన= నింద కర్హమైన, ఉదయున్=అభ్యుదయముగలవానిని, లసత్ విచారవివర్జితాచారున్= మిక్కిలి దురాచారుని, మతుల విగణింపరాని, దుర్వృత్తిన్=తలపరాని కష్టజీవుని, అధర్మపు=పాపరక్షకుని, దశలపనున్=దశముఖుని, లయ+ఆస్పదంబుగాన్= నాశనమునకు స్థానమైనవానిగా, ఈతని=ఈ రామునియొక్క, అతుల

సాహస+అతిశయసమున్నతులన్=మిక్కిలి పరాక్రమాతిశయసమృద్ధిగలవారిని, చలుపగలవు=సంహరించగలవు, అని, ఆర్యులు=పెద్దలచే, కృతశ్లాఘులుగా, అగుచు=పొగడబడినవారై, ఆ+బాలుని=ఆ రాముని, రసిత=రుచిగొనబడిన, భావ్యార్థ దృష్టిన్=భవిష్యత్ కాలదృష్టితో, అరసి=చూచి, మదిలోన=మనస్సులో ఉర్ఝితవ్యసనులైరి=వ్యసనములకు దూరులైరి.

తాత్పర్యం : యుద్ధము చేయనలవిగానివాడు, దుష్టమైన ఆజ్ఞగలవాడు, ఎదిరింపరానివాడు, బహు ప్రలాపి అనగా సమరు వీరులలో ప్రధముడని రూఢియై ప్రకాశించి, తృణీకరించుటచే దీనులైన దేవతలచే నిందింపబడినవాడు, దురాచారుని, తలపరాని కష్టజీవిని, పాపరక్షకుని దశకంఠుని - నాశనమునకు నిలయమైనవానిగా ఈ రాముని అతిపరాక్రమము నిర్జింపగలదని రుచిగొనబడిన భవిష్యత్ జ్ఞానముచే మదిలో చింతనొందినవారైరి.

భారత : దుర్యోధనుండన, దుశ్శాసనుండన, దుర్ధర్షణుండన, దుర్ముఖుండన, అమరువీరలాదిగా... వీరు మొదలుగా, ఆరూఢగాఢశౌర్యప్రదీప్తులనే, ఘూక= గుడ్లగూబల యొక్క, రణి=ధ్వనిచే, విషణ్ణ=ఖిన్నులైన, నానావిబుధ=అనేక విద్వాంసులచే, నింద్యమాన+ఉదయులన్=దూషింపబడు పుట్టుకలు గలవారిని, సద్విచార=వివేకముతో, వినర్జిత=ఎడబాసిన, అచారు=మంచిదిగాని, సుతులన్=మతిగలవారిని, విగణింపరాని దుర్వృత్తిన్, అధర్మపుదశల=పాపచర్యల యొక్క, పనుల=ప్రయోజనములకు, ఆస్పదంబుగాగన్=అవకాశమగునట్లు, చలుపగల=చేయగల, వీతనియతులన్=నియమరహితులైన వారిని, సాహసాతిశయ సమున్నతులన్, ఆర్యులు, ఆc బాలురన్, సిత=పరిశుద్ధమైన, భావ్యర్థసిద్ధిని, నికృతశ్లాఘులగుచు=దూషించుచు, మదిలో, అనుర్ఝిజితవ్యసనులైరి.

తాత్పర్యం : దుర్యోధనుడు, దుశ్శాసనుడు, దుర్ధర్షణుడు, దుర్ముఖుడు - అను వీరు మొదలుగా ప్రకటిత పరాక్రమ దీప్తులచే గుడ్లగూబల యొక్క ధ్వనిచే ఖిన్నులైన పండితులు - దూషింపబడు పుట్టుకగలవారిని వివేకముతో ఎడబాసిన చెడు మతిగలవారిని లెక్కింపరాని చెడునడవడిచే, పాపపుచర్యల ప్రయోజనములకు

అవకాశమగునట్లు చేయగల నియమరహితులైన సాహసోపేతులైన వారిని చూసి పెద్దలు – ఆ బాలురను పరిశుద్ధమైన భవిష్యత్ దృష్టితో దూషించుచు మనసులో విడువబడిన వ్యసనులైరి.

విశేషణము : అధర్మము – దశల=అధర్మపుదశల – ఆంధ్రభాషాభూషణములో 'పు'నాదేశమగునని సూత్రీకరించబడినది.

ఆ+బాలులు=అబ్బాలురు – 'లు, ల మీదిలులకు 'రు, ర' లగు నని ఆంధ్రభాషాభూషణము.

కం. వెండియుఁ బతికోర్కిపొదల
రెండవసతి యనవరగుణరేఖఁ దనరుచున్
గం డెసఁగెడు సుతరత్నము
పాండురమణిశుక్తివోలెఁ బడసె హరికృపన్. 73

రామా : వెండియు=మఱియు, పతికోర్కి+పొదల=భర్తకోర్కి తనరగా (దశరధుని), రెండవసతి=కైకేయి, అనవర=నికృష్టముగాని, గుణరేఖన్=గుణముచే, తనరుచున్+శోభించుచు, గండు+ఎసఁగెడు=పరాక్రమముగల, సుతరత్నము=పుత్రరత్నమును, పాండుర=శుభ్రమైన, మణి=ముత్తెమును, శుక్తి=ముత్యపు చిప్పవలె, హరికృపన్+పడసెన్=విష్ణుని దయచే పొందెను.

తాత్పర్యం : మఱియు దశరధుని కోర్కెననుసరించి రెండవ భార్య అయిన కైకేయి, నికృష్టముగాని గుణసంపదతో ప్రకాశించు పరాక్రమవంతుడైన పుత్రరత్నమును ముత్యపు చిప్పలో శుభ్రమైన ముత్యమువలె విష్ణుని దయవలన పొందెను.

భారత : వెండియున్, పతికోర్కె పొదలన్=పాండురాజు ఇంకను పుత్రులుగావలెనను అపేక్షననుసరించి, రెండవ సతియనన్=రెండవ సతీదేవియనగా, వరగుణరేఖన్=శ్రేష్ఠమైన గుణములచే, తనరుచున్=ప్రకాశించు, పాండురమణి=కుంతీదేవి, సుతరత్నము, శుక్తివోలె, హరికృపన్=ఇంద్రుని అనుగ్రహముచే, పడసెను.

తాత్పర్యం : మఱియు పాండురాజు కోర్కెననుసరించి రెండవ సతీదేవిని పోలి శ్రేష్ఠగుణములచే ప్రకాశించు కుంతీదేవి ముత్యపు చిప్పవలె పుత్రరత్నమును ఇంద్రుని అనుగ్రహముచే పొందెను.

విశేషణము : ఇంద్రుడు వర్షాధిదేవత. ఇంద్రుని వలననే శుక్తియు ముత్యమగును. శుక్తివోలెన్=ఉపమాలంకారము.

కం. భూకాంతుమన్ననలు గడుఁ
జేకుఱు నాముదితబుధరచితనుతిభరతుం
గైకమహావీరత్వా
స్తోకుని నర్జునసమాఖ్యుసుతుఁ గని యలరెన్. 74

రామా : భూకాంతు మన్ననలు=రాజుగారి ఆదరము, కదు+చేకుఱు= అధికముగా ప్రాప్తించు, ఆముదిత=సంతుష్టులైన, బుధరచితనుతు=పండితులచే ప్రశంసింపబడిన, భరతున్=భరతుని, కైక=కైకేయి, మహావీరత్వాస్తోకుని=అధిక శౌర్యముచే ఘనుడైనవానిని, అర్జునసమాఖ్యున్=శుభ్రమైన కీర్తిగలవానిని, కని=ప్రసవించి, అలరెన్=ప్రకాశించెను.

తాత్పర్యం : దశరథమహారాజు మన్ననలు అధికముగా ప్రాప్తించుచు, పండితులచే ప్రశంసింపబడిన అధిక శౌర్యవంతుని, శుభ్రమైన కీర్తిగలవానిని భరతుని ప్రసవించి కైక అలరారెను.

భారత : ఆ ముదిత=ఆ స్త్రీ, కుంతీ భూకాంతు మన్ననలు, కదున్+చేకుఱు, బుధరచిత, నుతిభర=స్తోత్రాతిశయముచే, తుంగ=ఘనమైన, ఏక=ముఖ్యమైన, మహావీరత్వ, అస్తోకుని అర్జున సమాఖ్యున్=అర్జునుడను పేరుగలవానిని, కని అలరెను.

తాత్పర్యం : ఆ కుంతి భూకాంతుడైన పాండురాజు మన్ననలు అధికముగా లభించు పండితులచే ప్రశంసలందు ఘనుడు, వీరత్వముచే ప్రకాశించు అర్జునదను నామముగలవానిని ప్రసవించి అలరారెను.

విశేషణము : ముదిత – దేశీయ పదము – ఆంధ్ర భాషాభూషణము

సీ. ఇవ్విధంబునఁ గాంచి హృదయేశుమన్ననఁ
బెనుచుచు నుండ నబ్బిసరుహాక్షి
కొండొకసవతియు గురుతరధర్మర
క్షణశీలతన్మనుగుణవిధేయ
రక్షోరివైద్యవరప్రాప్తిరూపుల
లక్ష్మణశత్రుఘ్నులను గరంబు
వినయసౌభ్రాత్రాదిఘనతరసుగుణరే
ఖను మించుతనయులఁ గవలఁ గనియె
తే. నొప్పు మీఱ నాసత్యవీర్యోదయు లగు
నట్టిచతురాత్మజులు సురూపాభిరాము
లైనకులసహదేవపదాతివిశ్రు
తాత్మవర్తనులై మించి రవనిలోన. 75

రామా : ఈ+విధమున=ఈ విధముగా, కాంచి=పుత్రులను పొంది, ఆ+బిసరుహ+అక్షి=ఆ కైకేయి, హృదయేశు=దశరథుని, మన్ననన్=గౌరవముతో, బెనుచుచునుండ=పెంచుచుండగా, కొండొక సవతియు=చిన్న సవతి సుమిత్రయు, గురుతర ధర్మరక్షణ శీలతన్=అధికమైన ధర్మరక్షణ స్వభావముచే, మను=ఒప్పుచున్న, గుణవిధేయ=గుణవశురాలు, రక్షోరి(రక్షః+అరి) వైద్య=సురవైద్యులకంటె, నర=శ్రేష్ఠమౌనట్లు, ప్రాప్తరూపులన్=సౌందర్యవంతులైనవారిని, కరంబు=మిక్కిలి, వినయ=వినయము, సౌభ్రాత్రాది=సుహృద్భావము మొదలైన, ఘనతర=గొప్పవైన, సుగుణరేఖను=మంచి లక్షణములతో, మించు=అతిశయించు, తనయుల=కుమారులను, లక్ష్మణ శత్రుఘ్నులను, కవలన్=లక్ష్మణ శత్రుఘ్నులను కవలలను, కనియె=కనెను, ఒప్పుమీఱ=అతిశయించు, ఆ సత్య వీర్యోదయులగునట్టి=సత్యము, శౌర్యములకు ఉత్పత్తి స్థానమయిన, చతుర+ఆత్మజులు=నలుగురు కుమారులును,

సురూపాభిరాములు+అయిన=సూర్యసంబంధమైన, కుల=కులమునకు, సహ=తగిన, దేవపదాతి=దేవపదములు మొదలుగా, వి(శ్రుత+ఆత్మవర్తనులై=(ప్రసిద్ధి పొందిన నడకగలవారై, అవనిలోన=భూమిపై, మించిరి=వెలుగొందిరి.

తాత్పర్యం : ఈ విధముగా కుమారులను పొంది, దశరధుని మన్ననలతో బెంచుచునుండగా ఆ కైక మరొక సవతి, అధిక ధర్మరక్షణ శీలత్వముతో జీవించు సుగుణవిధేయరాలైన సుమిత్ర సురవైద్యుల కంటె శ్రేష్ఠమైన సౌందర్యవంతులైన వారిని, వినయ సౌభ్రాత్రాది గొప్పసుగుణరేఖతో మించు లక్ష్మణశత్రుఘ్నులను కవలలను ప్రసవించెను. ఆ సత్య శౌర్యములకు స్థానమైన ఆ నలుగురు కుమారులు (రామలక్ష్మణభరతశత్రుఘ్నులు) సూర్యవంశమునకు తగిన దేవపదముతో సమానమైన నడకగలవారై మించిరి.

భారత : ఇవ్విధంబున గాంచి, హృదయేశు మన్ననన్=పాండురాజు ఆదరముతో, పెనుచుచునుండ, అబ్జసరుహాక్షి=ఆ కుంతీదేవి, కొండొక సవతియు=మాద్రియు గురుతరధర్మరక్షణశీలతన్, మను=మంత్రముయొక్క, గుణ=ఆవృత్తిచేత, విధేయ=వశులైన, రక్షోరివైద్యుల=దేవతల వైద్యులైన అశ్వనీదేవతల, వరప్రాప్తి రూపులన్=వరమువలన అవతరించినవారిని, లక్ష్మణ=లక్ష్మీవంతులై, శత్రుఘ్న= శత్రుసంహారకులైన వారిని, కరంబు, వినయ, సౌభ్రాత్రాది ఘనతర సుగుణరేఖను మించు తనయులన్, కవలన్=కవలలను, కనియె, ఒప్పుమీఱ, నాసత్య=అశ్వనీ దేవతల యొక్క, వీర్యోదయులగు=వీర్యము వలన జన్మించిన, అట్టి చతుర+ ఆత్మజులు=అట్టి చతురులైన కుమారులు, సురూపాభిరాములై=అందముతో ప్రకాశించు, నకులసహదేవపద=నకులసహదేవులనెడి పదములతో, అతివిశ్రుత= మిక్కిలి ప్రసిద్ధమైన, ఆత్మవర్తనులై=నడకగలవారై, అవనిలోన మించిరి.

తాత్పర్యం : ఈ విధముగా పుత్రులను పొంది పాండురాజుయొక్క ఆదరము పెనుచుచుండగా, ఆ కుంతీదేవి సవతియైన మాద్రియు అధిక ధర్మరక్షణశీలయై మంత్రమును మాటిమాటికి జపించుటచే వశులైన దేవతల వైద్యుల వరము వలన

అవతరించిన లక్ష్మీవంతులు, శత్రుసంహారకులునైన వారిని, మిక్కిలి వినయ సౌభ్రాత్రాది సుగుణసంపదచే మించు కవలలను ప్రసవించెను. అశ్వనీదేవతల యొక్క వీర్యము వలన జన్మించిన అట్టి చతురులైన కుమారులు అందచందములతో ప్రకాశించుచు నకుల సహదేవులనెడి పేర్లతో మిక్కిలి ప్రసిద్ధమైన నడకగలవారై మించిరి.

విశేషణము : నాసత్య - నాసత్యావశ్వినౌదస్రౌ - అని అమరము.

ఆశ్వాసాంత పద్యములు :

శా. ప్రాలేయాంబువతంస సన్నిహితపంపావాతశైత్యౌచితీ
లీలాగూఢనిగాఢరూఢపులకాళీహేతుహార్ద్దోదయ
స్థూలంభావుకశైలరాజతనయాదోర్దండనిష్పీడనో
ద్వేలోర్ధ్వస్రుతచిత్తరాగలహరీ ధీకృజ్జటామండలా. 76

అర్థం : ప్రాలేయ+అంశువతంస=చంద్రశేఖరా! సన్నిహిత=సమీపముననున్న, పంపా=పంపానదియందుగల, వాత=గాలియొక్క, శైత్య=చల్లదనముచే, ఔచితీ= ఉచితభావముచే, లీలా=విహారమందు, గూఢ=రహస్యమైనట్లు, నిగాఢ=మిక్కిలి, రూఢి=పుట్టిన, పులకాళీ=పులకింతల సమూహమే, హేతు=కారణముగాగా, హార్ద్దోదయ=ప్రేమాతిశయముచే, స్థూలంభావుక=ఉప్పొంగుచున్న, శైలరాజతనయా= పార్వతీదేవి యొక్క దోర్దండ నిష్పీడన=గాఢాలాంగనము వలన, ఉద్వేల=మితిమీరినదై, ఊర్ధ్వస్రుత, పొడవుగా ఎగసిన, చిత్త=హృదయమునందలి, రాగలహరీ=అనురాగ ప్రవాహమనెడి, ధీకృత=బుద్ధిని చేయుచున్న, జటామండలా=జడల సముదాయము గలవాడా! (పరమేశ్వరా!).

తాత్పర్యం : ఓ చంద్రశేఖరా! సమీపమునందున్న పంపానది యొక్క గాలియొక్క చల్లదనముచే ఔచిత్యవిహారమున రహస్యముగా పుట్టిన పులకాంకురములు కారణముగాగా ప్రేమాతిశయముచే ఉప్పొంగుచున్న పార్వతీదేవి గాఢాలింగనము

వలన మితిమీరినదై పైకెగసిన హృదయమునందలి అనురాగ ప్రవాహమను బుద్ధిని కలుగజేయు జటామండలధారీ!

విశేషణము : ఉత్ప్రేక్షాలంకారము.

క. మూర్తిత్రయధృతిలీలా
వర్తితనానాజగదుద్భవస్థితిలయని
ర్వర్తనసజ్జనసుకృతవి
వర్తాయితదివ్యదేహవారితమోహా! 77

అర్థం : మూర్తిత్రయ=త్రిమూర్తి రూపముయొక్క, ధృతి=ధారణమనెడి, లీలా=విలాసముచే, వర్తిత=చేయబడిన, నానాజగ=నానాలోకముల యొక్క ఉద్భవ=పుట్టుక, స్థితి=రక్షణ, లయ=నాశము, నిర్వర్తన=చేయువాడా! సజ్జన=మంచివారి, సుకృత=పుణ్యముల, వివర్తాయిత=వినిమయరూపమగు, దివ్యదేహ=దివ్యస్వరూపముగలవాడా! వారిత=పోగొట్టబడిన, మోహ=భక్తుల అజ్ఞానముగలవాడా!

తాత్పర్యం : త్రిమూర్తిరూపమును ధరించుటయను విలాసముచే చేయబడిన నానాలోకముల యొక్క సృష్టిస్థితిలయములకు కారణభూతుడా! సజ్జనుల పుణ్యవినిమయముచే దివ్యస్వరూపము గలవాడా! భక్తుల అజ్ఞానమును హరించువాడా!

విశేషణము : పుణ్యాత్ములకు సారూప్యము నిచ్చువాడని భావము.

మాలిని: ప్రథమతమవచోంతకప్రస్ఫుట బ్రహ్మవిద్యా
పథపథికవిపశ్చిద్భావవిశ్రామసీమా
పృథుచిదమృతధారాభీక్ష్ణసిక్తాకువీటి
ప్రథితతిరుమలక్ష్మాపత్యపత్యగ్రజన్మా. 78

అర్థము : ప్రథమతమవచోంత=వేదాంతముల యందు, ప్రస్ఫుట=లెస్సగా తెలియబడిన, బ్రహ్మవిద్యాపథ=బ్రహ్మజ్ఞానమార్గమునకు, పథిక=పాంథులైన, విపశ్చిత+భావ=విద్వాంసుల హృదయములకు, విశ్రామసీమా!=విశ్రమ స్థానమైన వాడా!, పృథు=అధికమైన, చిత్+అమృతధారా!=జ్ఞానామృతధారచే, అభీక్ష్ణ=నిరంతరము,

సిక్త=అభిషిక్తుడైన, ఆకువీటి=ఆకువీటి వంశములో, ప్రథిత=ప్రసిద్ధికెక్కిన, తిరుమలక్ష్మాపతి=తిరుమల నాయని, అపత్య=కుమారులలో, అగ్రజన్మా!=పెద్దవాడైన పెదవెంకటాద్రీ!

తాత్పర్యం : వేదాంతములయందు లెస్సగా తెలియబడిన బ్రహ్మజ్ఞానమార్గమున నడచు విద్వాంసుల హృదయములకు విశ్రామస్థానమైనవాడా! అధికమైన జ్ఞానామృత ధారచే నిరంతరము అభిషిక్తుడైన ఆకువీటి తిరుమలనాయని పెద్దకుమారుడైన పెదవెంకటాద్రీ!.

విశేషణము : విశ్రామసీమా – విశ్రామయని ఘఞ్ ప్రత్యయము వాడబడినది. 'మితాం హ్రస్వః' అను సూత్రముచే హ్రస్వము రాగా విశ్రమయని యుండవలయును. 'విశ్రాంతసీమా!' అనునది మంచి పాఠముగా శతఘంఠము వెంకటరంగశాస్త్రి పేర్కొన్నారు.

మాలినీ వృత్తము : న, న, మ, య, య గణములు+గురువు. 13వ అక్షరము యతి.

ఆశ్వాసాంత గద్య :

ఇది నిజసూరిలోకాంగీకారతరంగితకవిత్వవైభవ పింగళి యమరయార్య తనూభవ సౌజన్యజేయసూరయనామధేయ ప్రణీతంబైన రాఘవపాండవీయము నందుఁ బ్రథమాశ్వాసము. 79

అర్థము : ఇది, నిజసూరిలోక+అంగీకార=విద్వాంసులచే అంగీకరించబడిన, తరంగిత కవిత్వవైభవ=కవితాధారావైభవముగల, పింగళి అమరయార్య=పింగళి అమరనామాత్యుని, తనూభవ=కుమార, సౌజన్యజేయ=సౌజన్యముచే సూరయనామధేయ=సూరనచే, ప్రణీతంబైన=రచింపబడిన, రాఘవ పాండవీయము నందు ప్రథమాశ్వాసము.

తాత్పర్యం : ఇది పండితులచే ప్రశంసించబడిన కవితాధారావైభవముగల పింగళి అమరన కుమారుడైన సూరననామధేయునిచే రచింపబడిన రాఘవ పాండవీయమునందు ప్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము

కం. శ్రీ పంపాసరసక్రీ
డాపండిత పెద్దవేంకటక్ష్మాపతి చి
త్తోపాసితపద ప్రత్య
గ్రూప విరూపాక్ష హేమకూటాధ్యక్షా! 1

అర్థము : శ్రీ పంపాసరస=శ్రీపంపానదీతీర, క్రీడాపండిత=క్రీడించు పండితుడా! పెద్ద వేంకటక్ష్మాపతి=పెద వేంకటాద్రివిభుని, చిత్తోపాసితపద=మనసులో ఉపాసించబడిన పదములుగలవాడా! ప్రత్యగ్రరూప=ఎదుటనున్న రూపముగల, విరూపాక్ష!, హేమకుట+అధ్యక్షా!=హేమకూటమునకు అధిపతీ!

తాత్పర్యం : శ్రీ పంపానదీ తీరమున క్రీడించు పండితా! పెద్ద వేంకటాద్రి విభుని హృదయసీమలో ఉపాసించబడే పాదములుగలవాడా! ఎదుటనున్న రూపముగల విరూపాక్షా! హేమకూటాధిపతీ!.

కం. దేవాంశభవులఁ బుత్త్రుల
నీవిధమునఁ బడసి ముదితహృదయుఁ డగుచు ధా
త్రీవరుఁడు పెనుచుచుండె య
థావిధి సంస్క్రియలు మునికదంబము నడుపన్. 2

అర్థము : రెండింటికి సమానము.

దేవాంశభవులన్=దేవతాంశలతో, ఈ విధమున, పుత్రులన్, పడసి, ముదితహృదయుడగుచు=సంతోషించు హృదయముగలవాడై, ధాత్రీవరుడు= దశరధుడు/పాండురాజు, సంస్క్రియలు=ఆయా కాలములందు జరుపు షోడశకర్మలు, యధావిధిన్=శాస్త్రోక్తముగా, మునికదంబము=మునిశ్రేష్టులు, నడుపన్,

పెనుచుచుండె=పోషించుచుండెను.

తాత్పర్యం : ఈ విధముగా దేవతాంశలతో పుత్రులను పొంది సంతోషాంతరంగుడై దశరథుడు / పాండురాజు, మునిశ్రేష్ఠుల ద్వారా ఆయా కాలములందు జరుపు షోడశకర్మలు శాస్త్రోక్తముగా నిర్వహించుచు పోషించుచుండెను.

విశేషణము : సంస్క్రియలు=నామకరణాది షోడశకర్మలు. గర్భాదానము, పుంసవనము, సీమంతము, జాతకర్మము, నామకరణము, అన్నప్రాశనము, చౌలము, ఉపనయనము, ప్రాజాపత్యము, సౌమ్యము, ఆగ్నేయము, వైశ్యదేవము, గోదానము సమావర్తనము, వివాహము, అంత్యకర్మ – అను 16 కర్మలు.

సీ. నానాఁటి కుప్పొంగు నవకంపుఁ గళల పెం
పునఁ జిన్ని క్రొన్నెలబోద లనఁగ
నుత్తరోత్తరవృద్ధి నొప్పుతేజోరేఖ
పసఁ గోమలార్కబింబంబు లనఁగఁ
గ్రొత్త క్రొత్తగఁ బొదల్కొమరునెమ్మేనుల
బలుపుష్టిఁ గరికలభంబు లనఁగ
నంతకంతకు మించు వింతమగంటిమి
యదుటున సింగంపుఁ గొదమ లనఁగ
తే. వెలసి రిలను ధర్మజభీమవిజయు లనఁగఁ
గ్రాలునృపసుతుల్ దమలోనఁగవలు గూడి
మనసు మైత్రిచే రామలక్ష్మణచరితము
సనయ భరతశత్రుఘ్న ఖేలనము మెఱయ. 3

అర్థము : రెంటింటికి సీసపాదములు సమము. ఎత్తుగీతి మాత్రము వేరు.

ఆ బాలురు, నానాటికి=రోజురోజుకు, ఉప్పొంగు=అతిశయించు, నవకము+కళలపెంపున=కొత్తనైన కళల ఆధిక్యముచే, చిన్ని క్రొత్త+ నెలబోదలనగ=

చిన్న చందమామలనునట్లు, ఉత్తర+ఉత్తరవృద్ధిన్+ఒప్పు =క్రమక్రమముగా పెరుగుటచే నొప్పు, తేజోరేఖపసన్=తేజస్సుయొక్క కాంతిచే, కోమల+అర్కబింబంబులు+అనగ= కోమలమైన సూర్యబింబములనునట్లు, క్రొత్తక్రొత్తగన్=నూత్నముగా, పొదల్కొను= అతిశయించు, కొమరునెమ్మేనుల= అందమైన నూత్నశరీరములతో, బలుపుష్టిన్= సౌష్ఠవముతో, కరికలభంబులు+అనగ= గున్న ఏనుగులు అనునట్లు, అంతకంతకు మించు=రోజు రోజుకు పెరుగు, వింత మగంటిమి=వింతయైన మగసిరి, అదుటున= బయల్పడగా, సింగము+కొదములు+ అనగ=సింహపు పిల్లలు అనునట్లు – రెండింటికీ సమము.

తే.గీ. రామా : ధర్మజ=వింటివలన కలిగిన, భీమ=భయంకరమైన, విజయులు=విజయము గలవారు అనగా, క్రాలు=ఒప్పుచున్న, నృపసుతులు= రాజకుమారులు, తమలోన, కవలుకూడి=జోడుగూడుకొని, మనసు మైత్రిచే=మదిలోని స్నేహభారముచే, రామలక్ష్మణచరితము=రామలక్ష్మణులనడకయు, సనయ= నీతిసహితులైన; భరతశత్రుఘ్ను=భరతశత్రుఘ్నులయొక్క, ఖేలనము=విహారము, మెఱయ+ఇలను=అతిశయించునట్లు, భూమిపై, వెలసిరి.

విశేషణము : ధర్మజ – ధర్మః పుణ్యేయమేన్యాయే స్వభావాచారయోః క్రతౌ
ఉపమాయా మహింసాయః చాపేచోపనిషద్యపి – అని.వి.

భారత : ధర్మజభీమవిజయులనఁగన్=ధర్మరాజు, భీముడు, అర్జునుడు అనునట్లు, క్రాలు, నృపసు+తుల్, తమలోనన్, కవలుగూడి=నకుల సహదేవులను గూడి, సుమైత్రిచే=మంచి స్నేహముచే, మనన్=జీవించగా, సనయభరతన్= నయాతిశయముతో కూడిన వారౌటచే, శత్రుఘ్న=శత్రుసంహారకమైన, ఖేలనము మెఱయ, ఇలను వెలిసిరి.

తాత్పర్యం : సీసమునకు సమానము. ఎత్తుగీతికి వేరు.

ఆబాలురు నానాటికి అతిశయించు నూత్న కళలతో చిన్న చందమామలవలె క్రమక్రమాభివృద్ధిచే నలరారు తేజోరాశిచే కోమలసూర్యబింబములవలె, కొత్తగా

విస్తరిల్లిన శరీర పుష్టిచే గున్న ఏనుగులవలె, అంతకంతకు మించిన మగతనముచే సింగపు పిల్లలవలె వెలిసిరి.

తే.గీ. రామా : వింటి వలన కలిగిన భయంకరవిజయము గలవారు, తమతో జోడుగూడి మైత్రిభావముచే జీవింపగా రామలక్ష్మణభరతశత్రుఘ్నులు విహారములలో మెఱసిరి.

భారత : ధర్మజభీమార్జునులు కవలలైన నకులసహదేవులతో గూడి మైత్రీ భావముచే మనోహర లక్ష్మీవంశములైన నడకల అతిశయముచే శత్రుసంహార విహారముతో వెలిసిరి.

ఉ. అంత వసంత మొప్పెఁ జరమాగ్రిమభాగచరాలఖిలర్తుసా
మంత మనంతజాలకసమంజసరంజితకుంజకుంజరో
ద్వాంతనితాంతసాంద్రమధుదానవిజృంభితబంభరస్వనా
త్యంతనిరంతరీకృతదిగంత మతాంతలతాంతకుంతమై. 4

అర్థము : రెంటికి సమానము. వసంత ఋతువర్ణనము.

చరమ+అగ్రిమభాగ=పడమర, తూర్పుభాగములయందు, చర=వర్తింపుచున్న అఖిల+ఋతువులును=అన్ని ఋతువులును, సామంతము=సమాన రాజసముగల (సకలర్తు సౌభాగ్యముగల) అనంత=అసంఖ్యాకములైన, జాలక=మొగ్గలచే, సమంజస=యుక్తమౌనట్లు, రంజిత=ఒప్పిన, కుంజ=పొదలనెడి, కుంజర=ఏనుగుల వలన, ఉద్వాంత=వెడలి వచ్చుచున్న, నితాంతసాంద్ర=మిక్కిలి దట్టమైన, మధు=మకరందమనెడి, దాన=మదజలముచే, విజృంభిత=గర్వించిన, బంభర=తుమ్మెదల యొక్క, స్వన+అత్యంతమును=అధికమైన ధ్వనిచే, నిరంతరీకృత=నిబిడముగా చేయబడిన, దిగంత=దిక్కుల యొక్క అంతములుగలది, అతాంత=అలయికలేని, లతాంతకుంతలై=కుసుమాయుధుడుగలదై – అంత, వసంతము+ఒప్పెన్=అంతట వసంతము వెల్లివెరిసెను.

తాత్పర్యం : తూర్పు, పడమర దిక్కులలో వర్తించుచున్న అన్ని ఋతువులు సమాన రాజసముగలిగి అసంఖ్యాకములైన మొగ్గలచే యుక్తమౌనట్లు ఒప్పెను. పొదలనెడి ఏనుగుల వలన బయటికి వెడలి వచ్చు దట్టమైన మకరందమను మదజలముచే గర్వించిన తుమ్మెదల ధ్వనిచే నిబిడముగా చేయబడిన దిగంతములు గలది, అలయికలేని కుసుమాయుధుడు గలదై అంతట వసంతము వెల్లివిరిసెను.

సీ. అచ్చంపు లేఁజిగురాకుజొంపము కెంపు
 మేలిచెందిరపుఁ గెంధూళి గాఁగఁ
గ్రుచ్చినట్టుగ జాదుకొన్న మొగ్గలగుంపు
 ప్రకటపాటల బిందుపాళి గాఁగ
విచ్చిన పరువంపు విరులతండము పెంపు
 శోభితభూతిరింఛోళి గాఁగ
నిచ్చలం బైనతేనియ వానజడిసొంపు
 లాలిత దానధారాళి గాఁగ
తే. సుమపరాగముల్ కేళిపాంసువులు గాఁగ
భ్రమరపంక్తులు పై సరపణులు గాఁగ
బుడమినెల్లెడ వాహ్యాళి వెడలుమదను
మదపుటేనుఁగువోలె నామని దనర్చె. 5

అర్థము : రెండింటికి సమానము

అచ్చము+లేత+చిగురాకు జొంపము=స్వచ్ఛమైన లేత చిగురాకు సముదాయపు, కెంపు=ఎఱ్ఱదనము, మేలి చెందిరము+కెంధూళిగాఁగ=మేలిమియైన ఎఱ్ఱని దుమ్ముగాగ, గ్రుచ్చినట్టుగ=ఒక చోట చేర్చినట్లు, జాదుకొన్న=అమర్చబడిన, మొగ్గల గుంపు=మొగ్గల సముదాయము, ప్రకట=ప్రకటించబడిన, పాటల=తెల్లనైన, బిందు పాళిగాఁగ=బిందువుల సముదాయము గాగ, విచ్చిన=వికసించిన, పరువము+

విరులతండము=సుకుమారమైన పుష్ప సముదాయపు, పెంపు=ఆధిక్యము, శోభిత=ప్రకాశించు, భూతిరింఛోళిగాఁగ=గజశృంగారపంక్తి కాగ, నిచ్చలంబైన= నిలకడగల, తేనియవానజడి=తేనెలవాన జడి, సొంపు=అందము, లాలిత=లలితమైన, దానధారాళిగాగ=మదజలస్రవము కాగ, సుమపరాగముల్= పుష్పముల పుప్పొడి, కేళిపాంసువులుగాగ=వినోదముగ ఎగజిమ్మిన దుమ్ముకాగ, భ్రమర పంక్తులు= తుమ్మెదల గుంపులు, పైసరపణులుగాగ=పైన అమర్చిన ఇనుప గొలుసులు కాగ, పుడమినెల్లెడ=భూమి అంతయు, వాహ్యాళివెడలు=విహారార్థము బయలుదేరిన, మదనుమదము+ఏనుగు+పోలె=మన్మథునియొక్క మదించిన ఏనుగువలె, ఆమని=వసంతము, తనర్చె=ఒప్పెను.

తాత్పర్యం : స్వచ్ఛమైన లేజిగురాకు సముదాయపు ఎర్రదనము, మేలిమి ఎర్రని దుమ్ముకాగ, గుచ్చినట్లు అమర్చిన మొగ్గల సముదాయము ప్రకటించబడిన తెల్లని బిందువుల సముదాయము కాగ, వికసించిన సుకుమారమైన పుష్ప సముదాయముయొక్క పెంపు ఏనుగు శృంగార పంక్తికాగ, నిలకడగా కురియు తేనె వానల సొంపు మీది జలధారలు కాగ, పుప్పొడులు ధూళి కాగ, తుమ్మెదల గుంపు పైన అమర్చిన ఇనుప గొలుసులు కాగా, విహారార్థము బయలుదేరిన మన్మథుని మదపుటేనుగువలె భూమిపై అంతటా వసంతము వెల్లివిరిసెను.

విశేషణము : భూతి – భూతిర్మాతంగ శృంగారే – అని వి.

అంత్యానుప్రాసలు సీసపాదములు నాల్గింటిలో – కెంపు, గుంపు, పెంపు, సొంపు నియతముగ చెప్పినాడు.

రగడ. పొలిచె మధులక్ష్మి సురపొన్నలను బొన్నలను
దెలిసిపడి పుప్పొడుల తిన్నెలను జిన్నెలను
రంగుగఁ దనర్చునారంగముల సంగములఁ
బింగళత చెందె మదభృంగముల యంగములఁ
గొఱలెఁ జిగు రెలమావిగున్నలను జిన్నలను
బఱిచె మరుఁ డురుల ముదిపన్నలను బిన్నలను

లలిం జిక్కెం గరువలిబలంగము లవంగముల
 లులిత మై లవలికుడుంగముల లుంగముల
వెలయు కురువింద పూవిరువులును మురువులును
 దెలిపె మదనునకుం బని తెరువులును హరువులును
బెరయుచుం బలాశతరుబృందముల నందముల
 విరిమొగ్గ లమరె గురువిందముల చందముల
నెన్నికగ వాసించె నిరువులును బొరువులును
 జిన్ని చెందొవలచేం జెరువులను దొరువులును
వీలకొాఱ పమరె నరవిందములం గుందముల
 లీల దళుకొత్తంగ మిళిందముల డెందముల
మెదలె మలయాచలసమీరములు సారములు
 కొదవిరహి కయ్యె నతిఘోరములు క్రూరములు
జడిగొను మధూళికాసారముల పూరముల
 వడి దనరె నవసింధువారముల యీరముల
వదరెం గడుం గ్రొవ్వి పికవారములుం గీరములు
 గదిరె నళులందు ఝుంకారములు బీరములు
గలంగి పాంథులు కర్ణికారముల వేరములం
 దొలంగి రిల ఘంటలకు దూరముల దూరములం
బొదలె సంపెగలందుం బూవులును దావులును
 గుదిగొనం దనర్చెం గడుంగ్రోవులును మోవులును
సారెకడ తాంకుసంచారికల చేరికల
 జారులు చరించి రభిసారికల కోరికల
నిగురుబోం డ్లెన్నరైరీవులును గీవులును
 దిగజాఱ విడిచి రటు తీవులును వావులును
దదనంగతంత్రావతారికల కారికల
 చదు వంటెం గేలివనశారికలం గీరికల

మితి లేక పరఁగె రతిమెలపులును వలపులును
నతివ లెంతయు మఱచి రలపులును సొలపులును
బోణిమిగ వకులకుజపూగములఁ బూగముల
రాణ దనరారెను బరాగముల రాగములఁ
బరఁగె మధుమదనులకు బలుపులును గెలుపులును
బెరిఁగె యువయువతులకుఁ బిలుపులును బొలుపులును
రంజిలిరి గాణ లనురాగముల రాగములఁ
బుంజిత శ్రీఁ దనరు భోగములఁ జాగముల
నలముకొని పెంటిచెరలాటములు గూటములుఁ
జలిపె నహిపక్షిమృగఝూటములుఁ గీటములు
సొరిది మధువృష్టి వంజులకములఁ దిలకములఁ
గురిసెఁ జెదరుచుఁ దేంట్లకులకముల జలకములఁ
గయికొనియె ననువుపసగాటములు వాటములు
నయి తరులతల పెనుఁకు లాటములు నోటములు
బొరసె విరహిణుల కురుపులకములఁ దిలకములఁ
బరుసఁదనము కపోలఫలకముల నలకముల
సరిగెనానాలతాజాలములు సాలములు
జరదళుల నయ్యె వాచాలములు నీలములు
దళు కెసఁగఁ బల్లవవితానముల సూనములఁ
బులియుఁ బికమధుపములు బోనములఁ బానములఁ
జవి గొనిరి గరువులు పిసాళములు మేళములు
మివులఁ దపసికి నించె మేళములుఁ బాళములు
దగ మసలుభసలసంతానముల గానముల
మగువ లెగఁజోఁపి రభిమానముల మానముల
వడిఁ ద్రిప్పి మరుఁడు జయవంతములు కుంతములు
సడలించె మునిజనస్వాంతములు శాంతములు

మందిరారామవనమాలికల డోలికలఁ
బందెములు జరిగెఁ గులపాలికల కేలికల
సతతమును గందపువసంతములుఁ బంతములు
వ్రతులకును నయ్యె రసవంతములుఁ గాంతములు
మరిగి యెపుడును గంఠమాలికల పోలికలఁ
బరఁగ మగ లిడి రంకపాలికల బాలికల. 6

వసంతర్తు వర్ణన : రెంటికి సమానము.

అర్థము : పుప్పొడుల తిన్నెలను=పుప్పొడుల రాశులయందును, చిన్నెలను=అందములందును, తెలిసిపడి=వ్యక్తమై, మధులక్ష్మి=వసంత ఋతుసంపద, సురపొన్నలను, పొన్నలను =సురపొన్నలు, పొన్న వృక్షములందు, పొలిచె=ప్రకాశించెను, నారంగముల సంగములన్=విటుల కూటమిలో, రంగుగన్+తనర్చు=అందముగా ప్రకాశించెను, మదభృంగముల=మదించిన తుమ్మెదల సముదాయపు, అంగములన్=శరీరములందు, పింగళతచెందె=పసుపుదనము దాల్చెను, ఎలమావిగున్నలను=చిన్ని మామిడి బోదెల, చిన్నలను=చిఱుతదనములో, చిగురు–కొఱలె=చిగురుతనము అతిశయించెను, ముదిపన్నలను=వృద్ధులకు, పిన్నలను=యువతీ యువకులకు, మరుడు=మన్మథుడు, ఉరులు+పరిచె=పాశములు వైచెను, కరువలి బలంగము=వాయు పరిజనము, లవంగముల, లలిన్+చిక్కె=లాలిత్యమున చిక్కెను, లవలికుడుంగముల=లవలి పొదరిండ్లలో, లుంగముల=పుల్లమాది ఫలములలో, లులితమై=లోలనమందెను, కురువింద పూవిరువులును=కురువింద పూల విచ్చుదనములో, మురువులును=అందములు, వెలయు=వెలిసెను, మదనునకు=మన్మథునకు, పని తెరువులును=పనిచేయు మార్గములు, హరువులు=సొగసులు, తెలిపె=తెలిపెను.

పలాశతరుబృందముల=మోదుగువృక్షసముదాయముల, అందముల=అందములందు, తెరయుచు=అతిశయించెను, గురువిందముల చందముల=గురివింద యందములో, విరిమొగ్గలు+అమరె=విరిసిన మొగ్గలు కలిగెను, ఇరువులును=స్థానములు, బొరువులును=పేలగింజలు, ఎన్నికగ=ప్రత్యక్షముగా, చిన్న

చెందొవలచే=చిన్ని ఎఱ్ఱ కలువలచే, చెరువులును, దొరువులును, వాసించె=కన్పించెను. అరవిందముల, కుందముల, వీలకొఱఅపు=పగుళ్లు, అమరె=ప్రకాశించెను. మిళిందముల=తుమ్మెదల, డెందములన్=మనసులో, లీలన్+తఱుకొత్తగ=నూత్నత లీలగా భాసించెను, మలయాచలసమీరములు=మలయమారుత వాయువులు, సారములు=పటిష్ఠములై, మెదలె=వీచెను, విరహికి=విరహులకు, అతిఘోరములు= మిక్కిలి కష్టములు, క్రూరములు, కొద+అయ్యె=అతిశయించెను, మధూళి కాసారముల=పుప్పొడుల సరస్సులలో, పూరముల=నీటియందు, జడిగొను= వర్షించెను, నవసింధువారముల=నదీప్రవాహపు, ఈరముల=పొదరిండ్లలో, వడిదనరె= వేగము హెచ్చెను, పికవారములు=చిలుకల గుంపులు, కీరములు =శుకములకు, కడున్=క్రొవ్వి=మిక్కిలి బలిసి, వదరెను=వదరుబోతుతనము హెచ్చెను, అళులందు=తుమ్మెదలందు, ఝంకారములు, బీరములు=పరాక్రమము, కదిరె=అతిశయించెను, పాంథులు=బాటసారులు, కర్ణికారముల=కొండగోగుల, వేరములన్=విరోధముచే, కలంగి=కలత చెంది, ఘంటలకు=మొక్కపు చెట్లకు, దూరముల=దూరములుగా, ఇలన్+తొలగిరి=భూమిపై తొలగినడచిరి.

సంపెంగలందు, పూవులును, తావులును=సువాసనలును, పొదలె=విరిసెను, క్రోవులును=కురవకములు, మోవులును=లేత ఆకు మొలకలు, గుదిగొనన్= గుంపులుగా, తనర్చె=తనరెను, అభిసారికల, కోరికలతో; జారులు=వ్యభిచారులు, సంచారికల=దూతికల, చేరికల= కలయికతో, సారెకడతాఁకు=మాటిమాటికి కూడిరి, చరించిరి=తిరిగిరి, ఈవులు, గీవులు=సంపదలు, ఇగురు బోండ్లు= యువతులు, ఎన్నరైరి=లెక్కింపరైరి, అటు=అటు వైపు, ఠీవులును=హుందాతనమును, వావులును=వావి వరుసలను, తత్+అనంగతంత్ర+అవతారికల కారికల=ఆ మన్మథ తంత్ర ప్రారంభ సమయ యాతనలలో, దిగజాఱ విడిచిరి. కేలివన=ఉద్యానవన ములందు, శారికలన్ గీరికలన్=చిలుకలయందు, చదువంటె=విద్య అబ్బెను, రతి మెలపులును=రతి విశేషములను, వలపులును=ప్రేమలును మితిలేకన్+ పరగె=హద్దులేని రీతిలో సాగెను, అతివలెంతయు=స్త్రీలెంతయు, అలపులును= అలసటలను, సొలపులను=బాధలను, మరచిరి, వకులకుజ పూగముల=వకుళ

వృక్షముల పూవుల, పూగముల=సువాసనలందు, బోణిమిగ=అందముగా, పరాగముల రాగముల=పుప్పొడుల వర్ణములలో, రాణ+తనరారెను=సౌందర్య మతిశయించెను, మధుమదనులకు=వసంతునికి, మన్మధునికి, బలుపులును=బలిమి, గెలుపులును=విజయము, పరఁగె=అతిశయించెను, యువయువతులకు=కొత్త యువతులకు, పిలుపులును=ఆహ్వానములు, పొలుపులును=అతిశయములు, పెరిగె, గాణలు=ప్రౌఢ వనితలు, అనురాగముల= ప్రేమల, రాగముల=అనుబంధముతో, భోగముల= సంభోగములందు, చాగములన్=ప్రవర్తనలందు, పుంజితశ్రీన్+తనరు= సౌభాగ్యముతో, రంజిలిరి=ప్రకాశించిరి, పెంటి చెరలాటములు=పెంటి జంతువులతో చెరలాడు, కూటములు= కలయికలు, అలుముకొని=అధికమై, అహి=పాములు, పక్షి, మృగ ఝూటములు=మృగ పక్షి సముదాయములు, కీటములు=పురుగులు, చలిపె=సంచరించెను.

వంజులకములన్, తిలకములన్=అశోక తిలక వృక్ష జాతులలో, మధువృష్టి=పూలవాన, తేంట్ల కులకముల=తుమ్మెదల సముదాయమునందు, జలకముల=ఎట్టి తామరలందు, చెదరుచు, సొరిది=అధికముగా, కురిసెన్= వర్షించెను.

పసగాటములు, వాటములు నయి=అనుకూలతతో, తరులతలపెనుఁ కులాటములు=వృక్షములు, తీగల మధ్య పెనుగులాటలు, ఓటములు, అయి, అనువుగయికొనియె=అనుకూలతను సంతరించుకొనెను, విరహిణులకు=విరహిణులైన స్త్రీలకు, ఉరుపులకముల=రోమాంచములందు, తిలకములన్, కపోలఫలకముల= చెక్కిళ్లయందు, అలకముల=ముంగురులందు, పరుసదనము=నూత్నకాంతి, పొరసె=కలిగెను, నానాలతాజాలములు=వివిధ తీవెలు, సాలములు=వృక్షములు, సరిగె=పెరిగెను జరదళులన్=తుమ్మెదలందు, వాచాలములు=వదరుబోతుతనము, నీలములు=నలుపు, అయ్యె=ఆయెను, పల్లవవితానముల=చిగురు గుంపులతో, సూనముల=పూలలో, తళుకు+ఎసగ=అందము అతిశయించెను, పికమధుపములు= చిలుకలు, తుమ్మెదల, బోనములన్=పాత్రలయందును, పానములన్=త్రాగుట యందును, పులియు=పుల్లదనము కలిగెను.

గరువులు=నేలగుంటలు, పిసాళములు=వికాసములు, మేళములు=కూడి, చవిగొనిరి=రుచి చూచిరి, తపసికి=తపస్సు చేసికొను వానికి, మేళములు=కూటములు, పాళములు=సమయములు, మివులన్ నించె=మిక్కిలిగా నిండెను. భసల సంతానముల=తుమ్మెదల గానములందు, తగమసలు= తగునట్లు చరించిరి, మగువలు=స్త్రీలు, అభిమానములు, మానములు, ఎగఁజోపిరి=పైకి ఎగదోపిరి, మరుడు=మన్మథుడు, జయవంతములు= విజయవంత ములైన, కుంతములు= త్రవ్వుసాధనములైన గుద్దళులను, వడిద్రిప్పి=వేగముగా త్రిప్పి, మునిజన స్వాంతములు=మునుల మనసులలోని; శాంతములు, సడలించె=సడలించెను, మందిరారామవనమాలికలన్=ఇళ్లలోని ఉద్యానవనములలో, డోలికలన్= ఊయలలలో, కులపాలికల=కుల స్త్రీల, కేలికల=ఆటలలో, పందెములు జరిగె= పందెములు జరిగెను, గందపు వసంతములు=చందన వసంతములు, పంతములు, సతతమును=నిరంతరము, వ్రతులకును=వ్రత దీక్షబూనినవారికి, రసవంతములు, కాంతములు=అందము, అయ్యె=ఆయెను, ఎపుడును, కంఠమాలికల=మెడల, పోలికలన్, మరిగి, మగలు=పురుషులు, బాలికలన్, అంకపాలికల=తొడలపై, ఇడిరి=ఉంచుకొనిరి.

తాత్పర్యం : వసంతర్తు వర్ణన :

వాసంతశోభ సురపొన్నలందు, పొన్నలందు పుప్పొడుల రాశులందు తెలిసిపడెను. విటుల సంగములలో అది అతిశయించెను. మదించిన తుమ్మెదల శరీరములలో అది పసుపుదనము చెందెను. ఎలమావి గున్నలలో చిగురు బలిసెను. మన్మథుడు వృద్ధులలో, చిన్నవారిలో ఉరులు బిగించెను. లవంగములలో వాయు బలగము చిక్కెను. లవలి పొదరిండ్లలో పుల్ల మాది ఫలములలో లోలితమాయెను. కురువింద పూలవిచ్చుదనములో మురువులు చూపెను. మన్మథునికి పనితీరును, సొగసులను తెలిపెను. మోదుగు చెట్ల అందములో అది వృద్ధి బొందెను. కురువిందములలో విరిమొగ్గలు విరిసెను. స్థానముల ఎన్నిక హెచ్చెను. ఎర్ర తామరలచే చెరువులు, దొరువులు చెన్నలరారెను. అరవిందములు, కుందములలో

పగుళ్లు వికసించెను. తుమ్మెదల మదిలో తళుకు లీనెను. మలయ మారుతములు వ్యాపించెను. విరహులకు అతిఘోరముగ, క్రూరముగ కొరతలేర్పడెను.

పుప్పొడుల రాశులలో జడివాన గురిసెను. నదీ ప్రవాహములలో పొదరిండ్లలో వేగము హెచ్చెను. చిలుకల గుంపులు, శుకములు మిక్కిలి బలిసెను. తుమ్మెదల ఝంకారములలో బీరములు పెరిగెను. బాటసారులు కొండగోగుల విరోధముచే మొక్కపు చెట్లకు దూరదూరముగ చెదరి నడచిరి. సంపెంగలందు పూవులు, వాసనలు వికసించెను. కురవకములు మోవులు గుదిగొనెను. వ్యభిచారులు దూతికల కలయికతో అభిసారికల కోరికలననుసరించి సంచరించిరి. సంపదలను యువతులు లెక్కింపరైరి. వారు తమ ఈవిని వావివరసలను వారి మదన సామ్రాజ్యములో దిగవిడిచిరి. శుకములు కేలివనములో చదువ నేర్చెను. రతివేళలందు వలపులు మితిమీరెను. ఆ సమయములలో స్త్రీలు అలసటను, సొలసటను మరచిరి. వకుళవృక్ష పూగములలో పోడిమి హెచ్చెను. పుప్పొడులలో రాణింపు హెచ్చెను. వసంతునికి, మన్మథునికి బలుపులు, గెలుపులు కలిగెను. యువయువతులకు ఆహ్వానములు పెరిగెను. జాణలు అనురాగములతో రంజిలి భోగములలో అనురాగసంపదలతో అతిశయించిరి. పెంటితో కూటములలో చెరలాటలు, అహి, పక్షి, మృగ కీట సమూహములలో అలముకొనెను. అశోకములు, తిలకములలో తేనెవానలు తుమ్మెదల సముదాయముల వలన ఎఱ్ఱతామరలలో చెదరునట్లు గురిసెను. పసగాటముల వాటములలో అనువు కలిగెను. తరువులు, లతలు పెనుగులాటలో ఓటమిని చవి చూసెను. విరహిణుల రోమాంచములందు, తిలకములందు, కపోలములందు, ముంగురుల యందు కాంతి కలిగెను.

నానాలతా సముదాయము, వృక్షములు వృద్ధి పొందెను. పల్లవములలో, పూలలో తళుకు కలిగెను. బోనములలో పానములు పులియగా పికమధుపములు చవిగొనెను. గరువులు, పిసాళములు, మేళములు చవిగొనిరి. తపసికి కూటములు సమయములు, మిక్కిలి యాయెను. తుమ్మెదలసంతానముల గానములో మసలసాగి అభిమానములు, మానములను స్త్రీలు ఎగజోపిరి. మన్మథుడు తనగుధళులను

జయప్రదము వడిగా త్రిప్పెను. ముని జనముల మనములలో శాంతత సడలెను. మందిరములలోని ఉద్యానవనములలోని ఉయ్యేలలో కులపాలికల ఆటలలో పందెములు జరిగెను. చందనపు వసంతములలో నిరంతరము పంతములు హెచ్చెను. అవి వ్రతదీక్షాపరులకు రసవంతములు, మనోహరములాయెను. మగవారలు కంఠమాలికల పోలికలను మరగి యువతులను తమ తొడలపై నుంచుకొనసాగిరి.

విశేషణము : ప్రతి పాదమునను - ఛేకాలంకారము.

పోణిమి=పోడిమి, అనంతుని ఛందములో పోడిమి పోణిమియగుట సమర్థితము. రగడ దేశీయ ఛందము.

వ. అప్పుడు

మ. త్రిజగన్మోహనతన్ వసంతఋతు వీరీతిం బ్రకాశింపఁగా
యజమానత్వరసప్రకర్ష మహిమవ్యాప్తిన్ విజృంభించె ది
వ్యజనుల్ మెచ్చనితాంతసంయమిత విశ్వామిత్ర మౌనీశబు
ద్ధి జయప్రౌఢిని మించు టెంతయు ధరిత్రిం దేటతెల్లంబుగన్. 7

రామా : వసంత ఋతువు, ఈ రీతిన్=పై వర్ణించిన విధముగా, త్రిజగత్+ మోహనతన్=ముల్లోకములు పరవశించునట్లు, ప్రకాశింపగా, యజ మానత్వ= సోమయాజి భావమందుగల, రసప్రకర్ష మహిమ వ్యాప్తిన్=రాగాతిశయ మహిమ యొక్క విస్తారముచే, దివ్యజనుల్ మెచ్చ=దివ్యపురుషులు ప్రశంసించునట్లుగా, నితాంతసంయమితన్=మంచి యతిత్వముచే, విశ్వామిత్రమౌని+ఈశబుద్ధిన్= విశ్వామిత్రమహర్షి యొక్క ఆలోచనతో, జయప్రౌఢిని=సర్వోత్కర్షముగా, మించుట=అతిశయించుట, ధరిత్రిన్=భూమిపై, ఎంతయు, తేటతెల్లంబుగన్= విశదమగునట్లు, విజృంభించె=అతిశయించెను.

తాత్పర్యం : పై వర్ణించిన విధముగా మూడు లోకములవారికి రమ్యమగునట్లుగా సోమయాజి భావమందుగల రాగాతిశయమహిమయొక్క విస్తారము

ప్రకాశింపగా దివ్యపురుషులు మెచ్చునట్లుగా మంచియతిత్వముచే విశ్వామిత్రమహర్షి ఆలోచనలు సర్వోత్కర్షముగా అతిశయించుట భూమిపై విశదమగునట్లు వసంతర్తువు విజృంభించెను.

విశేషణము : విశ్వామిత్రుడు తపోవ్యయము చేయకుండ రాక్షసులను సంహరించి యజ్ఞము చేయుటకు యత్నము చేయుటకు ముల్లోకములు హర్షించినట్లు వసంతర్తువు విజృంభించెను.

భారత : త్రిజగన్మోహనతన్, వసంత ఋతువు, ఈ రీతిన్, ప్రకాశింపన్ – కాయజమానత్వర=మన్మధునియొక్క అహంకారవేగము, సప్రకర్ష మహిమ వ్యాప్తిన్=అధిక ప్రభావ యోగముచే, దివ్యజనుల్ మెచ్చ, నితాంతసంయమితా=మిక్కిలి శిక్షింపబడిన, విశ్వామిత్రమౌ=సకలాంతశ్శత్రువులు గలదైన, ఈశబుద్ధిన్=పాండురాజు బుద్ధిని, జయప్రౌఢిన్=విజయ ప్రౌఢిమచే, మించుట=చలింపజేయుట, ధరిత్రిన్, ఎంతయు, తేటతెల్లంబుగన్, విజృంభించె.

తాత్పర్యం : ముల్లోకములు పరవశించునట్లు పై వర్ణించిన విధముగా వసంతర్తువు ప్రకాశింపగా మన్మధుని అహంకార వేగము యొక్క అధికప్రభావముచే దివ్యజనులు మెచ్చగా మిక్కిలి శిక్షింపబడిన సకలాంతశ్శత్రువులు గల పాండురాజు బుద్ధిని విజయప్రౌఢిచే చలింపజేయుట లోకములో తేటతెల్లము అగునట్లు విజృంభించెను.

వ. అప్పుడు 8

చం. అనయము మ్రోల నేకతమహార్దగతిం దనచిన్ని రామచం
ద్రుని నగుమోము దామరసిరుల్ గనుపండువుగాఁజెలంగఁగాం
క్షనరయు పాండురాజితయశస్కుఁడు రాజవరుం డవారితా
తనువిభవాధి రాజ్యసముదగ్రమనోధృతియై ప్రవర్తిలన్. 9

రామా : మ్రోల=తన ముందు, అనయము=ఎల్లప్పుడు, ఏకతను=మిక్కిలి ముఖ్యమైన, హార్దగతిన్=స్నేహప్రవర్తనచే, తన, చిన్ని, ముద్దులు గొలుపు, రామచంద్రుని,

నగుమోము=రాముని నవ్వు మోము, తామరసిరుల్=తామరసంపదలు, కనుల పండువుగా=నయనానందకరముగా, చెలంగన్=మెలగగా, కాంక్షన్+అరయు=కోరికతో చూచు, పాండు=తెల్లనైన, రాజిత=మనోహరమైన, యశస్కుడు=కీర్తిగల రాజవరుండు=దశరథమహారాజు, అవారిత=నివారింపబడని, అతనువిభవ=అనల్పమైన వైభవముగల, అధిరాజ్య=సామ్రాజ్యముచే, సముదగ్ర=ఉన్నతమైన, మనోధృతిమై=మనస్సుకు సంతోషముగలవాడై, ప్రవర్తిలన్=ప్రవర్తించుచుండగా–ముందరి పద్యములో క్రియతో అన్వయము.

తాత్పర్యం : తనముందట ఎల్లవేళల అధిక స్నేహప్రవర్తనచే తన ముద్దుగొలుపు నగుమోముతో రామచంద్రుడు కనుల పండువుగా తామర సంపదలవలె మెలగగా, శుభ్రమైన మనోహర కీర్తిగల దశరథ మహారాజు నివారింపబడని అనల్ప వైభవోపేత సామ్రాజ్యముతో ఉన్నతమైన మానసికానందముతో ప్రవర్తిల్లుచుండగా –

భారత : అనయము, మ్రోలన్, ఏకతమ=ఏకాంతముగా, తన చిన్నిరామ=తన చిన్నభార్య మాద్రి, చంద్రుని నగుమోము కాంతులు=చంద్రుని నవ్వేడు ముఖపద్మకాంతులు, కనుల పండువుగా చెలంగ, కాంక్షన్+అరయు=మోహముతో చూచు, ఇతయశస్కుడు=పొందబడిన కీర్తిగల, పాండురాజు, అతనువిభవ=మన్మథ వైభవముచే, అవారిత=వారింపబడని, ఆధిరాజ=మనోవ్యథయొక్క, రాజి=శ్రేణిచే, అసముదగ్ర=అల్పమైన, మనోధృతియై=మనోధైర్యముగలవాడై, ప్రవర్తిలన్= ప్రవర్తించగా.

తాత్పర్యం : తనముందు ఎల్లవేళల ఏకాంతముగా తన చిన్న భార్య మాద్రి నవ్వేడు చంద్రుని ముఖపద్మ కాంతులతో కనులపండువగా వర్తిల్లగా, అధిక యశస్కుడైన ఆ రాజవరుడైన పాండురాజు వారింపబడని మనోవ్యాధి శ్రేణిచే అల్పమైన మనోధైర్యము గలవాడై మోహకాంక్షతో ప్రవర్తించగా.

క. ఆయమనియమైకనిధి, మ
హాయతధైర్యమహిమగని, యసురక్షయమ
త్యాయత్తతఁ దాఁ జేయక,
యాయతను క్రియకుఁ జేరె నతనినియతిచేన్. 10

రామా : ఆ యమనియమ+ఏకనిధి=కఠోర నియములకు ముఖ్యస్థానమైన ఆ విశ్వామిత్రుడు, మహాయత ధైర్యమహిమ=అధికమైన ధైర్య ప్రభావమును, కని=ఎంచి (మహిమకు గని - అని మరొక అర్థము) అసురక్షయము=రాక్షసనాశనమును, అతి+ఆయత్తతన్=అధిక ఆసక్తితో, అతను క్రియకున్=అధికోద్యోగమునకు, అతని నియతిచేన్=ఆ దశరధుని భాగ్యవిశేషమున, చేరెన్=వచ్చెను.

తాత్పర్యం : కఠోరనియములకు ముఖ్యస్థానమైన ఆ విశ్వామిత్రుడు అధికమైన ధైర్యమహిమకు గని. రాక్షస నాశనమును అధిక ఆసక్తితో చేయుటకు అధికోద్యోగమునకై దశరధుని భాగ్యవిశేషమున విశ్వామిత్రుడు వచ్చెను.

విశేషణము : యమనియమ -

“శరీర సాధనాపేక్షం, నిత్యం యత్కర్మ తద్యమః

నియమస్తు సయత్కర్మ నిత్యమాగంతు సాధనమ్’ - అని అమరం.

భారత : మహాయత ధైర్యమహి=అధిక ధైర్యస్థానమైనది, ఆయమ=ఆ మాద్రి, మగని=పాండురాజుయొక్క, అసురక్ష=ప్రాణరక్షణను, అమత్యాయత్తతన్=బుద్ధి వశమున, తాన్=చేయక=తాను చేయక, ఆ+అతను క్రియన్=ఆ మన్మధ క్రీడకు, అతని=పాండురాజు, నియతిచేన్=నియమముతో (దురదృష్టముతోనని అర్థాంతరము) చేరెను=కూడెను.

తాత్పర్యం : మహాధైర్యశాలియైన ఆ మాద్రి పాండురాజు యొక్క ప్రాణరక్షణను బుద్ధివశమున తాను చేయక ఆ మన్మధక్రీడకు పాండురాజు కోరికచే దురదృష్టముగా సమ్మతించెను.

చ. మనుజవరుండు నప్డు నడుమన్ ఘటియిల్లెడు విఘ్నవాక్ప్ర వ
ర్తనలు గురుప్రయత్న విహతంబులు నేయుచు రామ యేక్రియన్
నిను విడనేర్తు నంచుఁ గడు నెమ్మిఁ గవుంగిటఁ జేర్చియంతటం
దనయసువాంఛ డించి తగఁ దన్పెఁ దదర్థిఁ, గృతార్థుఁ గామునిన్. 11

రామా : అప్డు=అప్పుడు, నడుమన్=కొంత కాలమునకు (నడువన్=నడువగా) ఘటియిల్లెడు=సంభవించు (కలుగు), విఘ్నవాక్+ప్రవర్తనలు='పంపించలే'నను మాటలను, గురుప్రయత్న=వసిష్ఠుని నిర్బంధముచే, విహితంబులు+చేయుచు= మానినవాడై, రామ!=ఓ రామా! ఏ క్రియన్=ఏ విధముగా, నినువిడన్+నేర్తునంచు= నిన్ను వీడగలను అనుచు, కడునెమ్మి=మిక్కిలి ప్రీతితో, కవుంగిటన్+చేర్చి=కౌగిట జేర్చి, అంతటన్=తర్వాత, తనయ సువాంఛ=అధిక పుత్ర వాత్సల్యమును, డించి=వదలి, తత్=ఆ రాముని, అర్థిక=తోడ్కొని పోవుటకు నిశ్చయించిన, మునిన్=విశ్వామిత్రుని, కృతార్థున్=కోరిక తీరినవానినిగా, తగన్+తన్పెను=మిక్కిలి సంతోషపరచెను.

పాఠాంతరము=నడువన్

తాత్పర్యం : దశరథుడు – "నేను పంపించలేనను" మాటలను వసిష్ఠుని నిర్బంధముచే విరమించుకొని, "ఓ రామా! ఏ విధముగా నిన్ను వదలి యుండగలను", అని కౌగిట ప్రియముగా జేర్చుకొని ఆ పిదప కుమారునిపై వాత్సల్యమును వదలి ఆ రాముని తోడ్కొనిపోవుటకు నిశ్చయించుకొనిన విశ్వామిత్రమునిని కృతార్థునిగా సంతోషపరచెను.

భారత : అప్డు, నడువన్, మనుజవరుండు=పాండురాజు, ఘటియిల్లెడు, విఘ్నవాక్+ప్రవర్తనలు=మాద్రి నివారించు మాటలను, గురుప్రయత్న విహితంబులు+చేయుచు=అధికప్రయత్నముచే మాన్పుచు, రామ!=ఓ మాద్రీ! ఏ క్రియన్, నినువిడనేర్తునంచు, కడునెమ్మిన్, కవుంగిటఁ జేర్చి, అంతటన్, తన=తన యొక్క, అసువాంఛను డించి=ప్రాణములపై కోర్కెను వదలి, తత్=ఆ ప్రాణములను, అర్థిన్=హరింప నిశ్చయించినవానిని, కృత+అర్థున్=చేయబడిన ప్రయోజనము గలవానినిగా, కాముని=మన్మథుని, తగన్+తన్పెన్=మిక్కిలి సంతోషపరచెను.

తాత్పర్యం : అప్పుడు మధ్య కాలమున (కొంత కాలము నడువగా) పాండురాజు మాద్రి నివారించు మాటలను అధిక ప్రయత్నముచే మాన్పుచు, "ఓ మాద్రీ! ఏ విధముగా నిన్ను వదలగలను" అని అతిప్రీతితో కౌగిట చేర్చెను. అంతట ప్రాణములపై కోర్కెను వదలి, ఆ ప్రాణములను హరింప నిశ్చయించిన మన్మథుని కృతార్థునిగా జేసి సంతోషపరచెను.

(మాద్రి నివారించినను వినక ఆమెను సంభోగించెనని భావము)

తే. స్వవిధివిఘ్న నిరాసంబు సలుప నతఁడు
రామసాంగత్య మర్థించెఁ బ్రమదగరిమఁ
బెనుచుదను యాత్రకు నంతఁ దనువు వొంగఁ
బ్రస్ఫుటంబైన యుత్సాహభరముఁ బూనె. 12

రామా : స్వవిధి=తాను నిర్వహింపదలచిన యజ్ఞమునకు, విఘ్ననిరాసంబు+చలుపన్=విఘ్నములు కలుగకుండ చేయుటకు, అతడు=విశ్వామిత్రుడు, రామసాంగత్యము=రాముని సాహచర్యము, అర్థించెన్=కోరెను, అంతన్=పంపెదనని దశరథుడు చెప్పినంత, ప్రమదగరిమ=సంతోషాతిశయము, పెనుచు=పెంచుచు, తనువు=శరీరము, పొంగన్=పొంగగా, ప్రస్ఫుటంబైన=ప్రకటితమైన, ఉత్సాహభరము=ఉత్సాహభారమును, పూనెను=పొందెను (త్వరపడెను).

తాత్పర్యం : తాను నిర్వహింపదలచిన యజ్ఞమునకు విఘ్నము కలుగకుండ చేయుటకు విశ్వామిత్రుడు రాముని పంపుమని కోరెను. దశరథుడు అందుకు అంగీకరింపగా సంతోషాతిశయముతో శరీరము పొంగగా విశ్వామిత్రుడు ఉత్సాహభారముతో త్వరపడెను.

భారత : స్వవిధి=తాను చేసిన పని (తన విధి), విఘ్ననిరాసంబు సలుపన్=ఆటంకము లేకుండ చేయగా, రామసాంగత్యము=స్త్రీ తోడి పొందును, అర్థించెను=కోరెను (క్రీడించెను) అంతన్=అటు తర్వాత, ప్రమద=మాద్రి, గరిమఁ బెనుచు=గౌరవ హేతువైన, తదను యాత్రకున్=అతనితో పొందునకు ఉత్సాహభరము, పూనె=ఉత్సాహాతిశయమును పూనెను.

తాత్పర్యం : తన విధి విఘ్నము లేకుండ చేయగా స్త్రీతోడి సాంగత్యమున క్రీడించెను. అటుపై మాద్రి గౌరవహేతువైన అతని పొందునకు ఉత్సాహాతిశయము పూనెను.

స్రగ్ధర.

తలఁ పి ట్లుత్సాహ మొందం దనయజనపరిత్రాణ మర్థిం చియక్కం
దళితాపత్యానురక్తిన్ మహిపుననుగతిం దానురాఁ బూనకుండన్
వలనొప్పన్ మాన్చి స్వస్థానమునకుఁజనియెన్ రామునాత్మేశుఁబ్రేమా
త్యలఘు శ్రేయస్సుమిత్రా నవరతనయ యోగాఢ్యుఁ దోడ్కొంచు వేడ్కన్. 13

రామా : తన=విశ్వామిత్రుని, తలపు=ఆలోచన, ఇట్లు, ఉత్సాహమొందన్=సంతోషము కల్గించగా, యజన పరిత్రాణము=యజ్ఞ సంరక్షణమును, అర్థించి=కోరి, ఆ+కందళిత+అపత్య+అనురక్తిన్=ఆ చిగిర్చిన పుత్రానురాగముగల, మహిపున్=దశరథుని, అనుగతిన్=అనుసరించి, తాను రాన్+పూనకుండన్=తాను వచ్చుటకు వలనొప్పన్=ప్రయత్న పూర్వకముగా, మాన్చి=విరమింపజేసి, రామున్=రాముని, ఆత్మ+ఈశు=దశరథుని, ప్రేమ=ప్రేమచే, అత్యలఘు=అతిశయించునట్లు, శ్రేయః=శ్రేష్ఠుడైన, సుమిత్ర=సుమిత్ర యొక్క, అనవరతనయు=జ్యేష్ఠుడైన, యోగ+ఆఢ్యున్=కూటమిగల వానిని, తోడ్కొని=వెంట బెట్టుకొని, స్వః=తన యొక్క, స్థానమునకు, ఆశ్రమమునకు, చనియెన్=వెళ్లెను.

తాత్పర్యం : విశ్వామిత్రుని యాలోచన ఈ విధముగా సంతోషము కల్గించగా, యజ్ఞ సంరక్షణమును కోరి, చిగిర్చిన ఆ పుత్రానురాగముగల దశరథుడు తన వెంట అనుసరించి వచ్చు ప్రయత్నమును బలవంతముగా విరమింపజేసి, దశరథుని ప్రేమచే అతిశయించిన రాముని సుమిత్ర జ్యేష్ఠనందనుడైన లక్ష్మణుని వెంట బెట్టుకొని తన ఆశ్రమమునకు వెళ్లెను.

విశేషణము : కందళిత – అను చోట బిందువునకు, నకారమునకు యతి చెల్లింపబడినది : దానికి లక్షణము :

తే. టతపవర్గాక్షరములకు డాపలించి
యొనర నూఁదినబిందువు లుండెనేని
వరుస ణనములు వళు లగువానికెల్ల
నవనిఁ గొందఱు సుకవుల యనుమతమున

– అని కావ్యాలంకార చూడామణి

భారత : తలంపు, ఇట్లు, ఉత్సాహమొందన్, తనయ జన పరిత్రాణము=పుత్ర జనరక్షణమును, అర్థించి=కోరి, అక్కన్=అక్కయైన కుంతిని, దళిత=పోగొట్టబడిన, అపత్య=పుత్రులయందుగల, అనురక్తిన్=ప్రేమగల దానిని, మహిపు=పాండురాజుతో, అనుగతిన్=సహగమనమునకు, తాను=కుంతి, రాన్+పూనకుండగన్= రాకుండు నట్లుగా, వలనొప్పన్, మాన్చి, ప్రేమ=ప్రియముచే, అత్యలఘు=మిక్కిలి అధికమైన, శ్రేయ=పుణ్యమునకు, సుమిత్ర=మంచి చెలికాడైన, అనవరత=ఎడతెగని, నయ=నీతిగల, యోగ=ఆత్మయోగముతో, ఆఢ్యున్=సంపన్నుని, రామున్=మనోహరుని, ఆత్మేశున్=తన భర్తతో, తోడ్కొంచున్=కలిసి, స్వః+స్థానమునకున్, చనియెను.

తాత్పర్యం : తన ఆలోచన ఈ విధముగా ఉత్సాహమొందగా, పుత్ర జనరక్షణమును గోరి అక్కయైన కుంతిని, (పోగొట్టబడిన పుత్ర ప్రేమగల దానిని) పాండురాజుతో సహగమనమునకు వారించి, అధికమైన పుణ్యమునకు మంచి చెలికాడైన నిరంతర నీతిగల ఆత్మయోగసంపన్నుడు మనోహరుడైన తన భర్తతో కలిసి (మాద్రి) స్వర్గ స్థానమును చేరెను.

విశేషణము : అక్కందళిత – అను ప్రయోగములో నకారము పొల్లు సున్నయైనది.

ఆంధ్ర భాషా భూషణములో –

క. నాంతములైన పదంబుల
పొంతంబైనున్న శబ్దముల కచటతపల్
దొంతి గజడదబలగున
య్యంత నకారంబు సున్న లభినవదండీ!

స్రగ్ధర ఛందస్సు : మ–ర–భ–న–య–య–య – అను గణములు. ప్రతిపాదమున 8, 15 అక్షరములు యతి స్థానములు.

తే. అట్లు తండ్రి చేత, విసృష్టులైనయట్టి,
రాకుమారులు, సహజననీకయాత్రc
బూని సంయమీశ్వరనీయమాను లగుచుc
జనిరి నిజపురమునకు విషాద మొదవ. 14

రామా : అట్లు, తండ్రిచేత=దశరధునిచే, విసృష్టులైన యట్టి=పంపబడిన, రాకుమారులు=రామలక్ష్మణులు, సహజన్=కులాచార యోగ్యమైన (స్వభావ సిద్ధమైన) అనీకయాత్రను=యుద్ధయాత్రను, పూని, సంయమీశ్వర=విశ్వామిత్రునిచే, నీయమానులగుచు=తోడ్కొని పోబడినవారై, నిజపురమునకున్=అయోధ్యకు, విషాదమొదవ=దుఃఖము కలుగునట్లుగా చేసి, చనిరి=వెళ్లిరి.

తాత్పర్యము : ఆ విధముగా దశరధునిచే పంపబడిన రామలక్ష్మణులు స్వభావసిద్ధమైన యుద్ధ యాత్రను పూని విశ్వామిత్రుడు తోడ్కొని పోగా అయోధ్యకు దుఃఖమును కలిగించి వెళ్లిరి.

భారత : అట్లు, తండ్రిచేతన్=పాండురాజుచే, విసృష్టులైన యట్టి=విడువబడినట్టి (తండ్రి మరణించినవారై) రాకుమారులు=ధర్మజ భీమార్జున నకుల సహదేవులు, సహజననీక యాత్రన్=తల్లియైన కుంతితో యాత్రను పూని, సంయమీశ్వర=మునులచే, నీయమానులగుచున్=తోడ్కొని రాబడినవారై, విషాదమొదవన్=దుఃఖపడుచు, నిజపురమునకున్=హస్తినాపురికి, చనిరి=వెళ్లిరి.

తాత్పర్యం : ఆ విధముగా పాండురాజు మరణించగా పాండు రాకుమారులు తల్లి కుంతితో బయలుదేరి మునులచే తోడ్కొని రాబడినవారై దుఃఖపడుచు హస్తినాపురికి వెళ్లిరి.

సీ. అత్తెఱంగునc జను నప్పుడు దమవార్త
దవుదవ్వులను విని తత్పథంబు
నందు మదప్రౌఢి మందాటకమహేభ
హరిశతాంగ సమృద్ధిc గరము మించు

సముదగ్రతరబల సంపద నెదురుగాఁ
గనిజపితృ జ్యేష్ఠుఁ డనుప నతని
ప్రియముగా రాముసంశ్రిత ధర్మగుణమైన
యమ్ము బుధాళికి సమ్మదకర
ఆ. మగుచుఁ బరఁగె నమ్మహాబలముదము భ
జించి యమరనగరిఁ జేర నంత
నక్కుమారు లరిగి రావలమానని
గాఢధృతిని మౌనికథలు వినుచు. 15

రామా : ఆ+తెఱంగున=ఆ విధముగా, చనునపుడు=వెళ్లు సమయమున, తమ వార్త, దవుదవ్వులను విని=దూరముననే విని, తత్+పథంబునందు=ఆ దారిలో మదప్రౌఢిమన్=గర్వోద్రేకముచే, తాటక=తాటక, మహా+ఇభ=మత్తేభముల యొక్కయు, హరి=సింహముల యొక్కయు, శత+అంగ=నూరు శరీరములైన, సమృద్ధిన్=స్ఫూర్తిచే, కరముమించు=మిక్కిలి అతిశయించు, సముదగ్రతర బలసంపదను=అత్యంత బలసంపదగల (తాటకను) ఎదురుగాన్+కని=ఎదురుగా చూచి, జపితృశ్రేష్ఠుడు=మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు, అనుపగా=పంపగా, అతని ప్రియముగా, రాముని=రాముని యొక్క సంశ్రితధర్మగుణమైన=వింటియల్లె యందు సంధింపబడిన, అమ్ము=బాణము, బుధాళికిన్=దేవతల శ్రేణికి, సమ్మదకర మగుచు=ఆనందదాయకమగుచు, ఆ+మహాబల=ఆ తాటక, ముదము భజించి=సంతోషముతో, అమరనగరిన్+చేర= స్వర్గమును చేరునట్లుగా, పరగె= పఱచెను, అంతన్=పిమ్మట, ఆ+కుమారులు=ఆ రామలక్ష్మణులు, మానని=అణగని, గాఢ ధృతిన్=అధిక సంతోషముతో, మౌనికథలు వినుచు=విశ్వామిత్రుడు చెప్పిన గాథలు వినుచు, ఆవల=ముందుకు, అరిగిరి=సాగిరి.

తాత్పర్యం : ఆ విధముగా వెళ్లునపుడు తమ రాక దూరముననే విని వారి దారిలో మదవిజృంభణచే మంద గమనముతో మత్తగజములు, సింహములు

నూరింటి బలముగల తాటకను ఎదురుగా చూచి, విశ్వామిత్రుడు ఆదేశించగా అతని ప్రియము గోరి రాముడు వింటి అల్లె సంధించి బాణమును వదలెను. అది దేవతా శ్రేణికి ఆనందము కలిగింపగా, తాటక సంతోషముగా స్వర్గలోకము చేరెను. ఆ తర్వాత రామలక్ష్మణులు మిక్కిలి సంతోషముతో విశ్వామిత్రుడు చెప్పిన గాధలను వినుచు ముందుకు సాగిరి.

భారత : అత్తెఱంగున జనునప్పుడు=ఆ విధముగా పాండవులు వెళ్లునపుడు, తమ వార్త, దవుదవ్వులను విని, తత్+పథంబునందు, మదప్రౌఢిన్=మదించిన బలముచే, అటక=చరించు, మహీభములు=మదగజములు, హరి=సింహములు, శతాంగ సమృద్ధిన్=రథముల యొక్క అతిశయముచే, కరము మించు, సముదగ్రతర బలసంపదన్, నిజపితృజ్యేష్ఠుడు=తమ పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడు, ఎదురుగాగ=ఎదురుగా అనుప, అతని ప్రియము, గారాము=ప్రేమ, సంశ్రిత ధర్మగుణమై=ధర్మముతో కూడినదై, నయమ్ము=నీతియు, బుధాళికి=పెద్దలకు, సమ్మదకరమగుచు+పరగె, ఆ+మహాబలము, తమున్=తమను, భజించి+అమరన్=కొల్చి యొప్పగా, నగరిన్+చేరన్=పురము జేరగా, అంతన్, ఆ+కుమారులు=ఆ పాండవులు, ఆవలమాన=ఇంచుకంత చలింపుచున్నను, నిగాఢధృతిని=అధిక ధైర్యముతో, మౌనికథలు=వెంట వచ్చు మునుల వాక్యములను వినుచు, అరిగిరి=హస్తినాపురికి వెళ్లిరి.

తాత్పర్యం : ఆ విధముగా పాండవులు వెళ్లునపుడు తమ వార్త దూరముననే విని, మదించి చరించు మదగజములు, సింహములు, రథముల ఆధిక్యముచే బలసంపదచే అతిశయించుచు ధృతరాష్ట్రుడు పంపగా, అతని ప్రీతి, ప్రేమ ధర్మబద్ధము కాగా, ఆ నీతి పెద్దలకు సంతోషకారి ఆయెను. ఆ బలము తమను కొల్వగా పాండవులు నగరమును చేరిరి. ఇంచుక చలించినను, అధిక ధైర్యముతో వెంట వచ్చు మునులు చెప్పు గాథలు వినుచు వారు హస్తినాపురికి వెళ్లిరి.

విశేషణము : శతాంగము – శతాంగఃస్యందనో రథః అని అమరము.

అటక – అటగతే అనుధాతువుపై ఘఞ్ప్రత్యయాంతము

ఆవలమాన – ఆజీహదర్థే భివ్యాప్తౌ – అని అమరము.

సీ. ఆరీతిఁ జని తమయానగరంబు ప్ర
వేశించి మెలఁగ నుద్వృత్తి నడరు
నస్రపయోధుల, నంబకంబుల నాఁగి
తన్మహాశ్రమశోక దైన్యభరము
హరియించుటకుఁ దమకురువృద్ధు లొసఁగెడు
బహుళ తాపసహితభాషితములు
దీవెనల్ వినయవిధేయతతోడఁ జే
కొనుచును వెండియు నెనరుదొరలు

ఆ. గౌరవము లొనర్పఁ గైకొంచుఁ గ్రమమునఁ
బితృవియోగచింతఁ బ్రిదిలి క్రీడ
సలిపి రెల్లప్రొద్దు సన్మానసస్థితిఁ
జాలి ధార్తరాష్ట్ర లీలఁ దగిలి. 16

రామా : ఆ రీతిన్+చని=ఆ విధముగా వెళ్లి, తమ+ఆన=తమ ఆజ్ఞ, కరంబు ప్రవేశించి=మిక్కిలిగా ప్రవేశించి, మెలఁగన్=వర్తించగా, ఉద్వృత్తిన్+అడరు= అధికముగా పెంపొందు, అస్రప=రాక్షసులైన, యోధులన్=వీరులను, అంబకంబులన్=బాణములచే, ఆగి=నివారించి, తత్+ఆ విశ్వామిత్రుని యొక్క, మహా+ఆశ్రమ=తపోవనమందుగల, శోకదైవభరము=శోకము, దీనత్వము యొక్క భారము, హరియించుటకున్=నశించుటకు, తమకు+ఉరువృద్ధులు+ఒసగెడు= అభివృద్ధులనిచ్చు, బహుళ తాపస=అధికులైన మునుల యొక్క, హితభాషితములు= ప్రియోక్తులు, దీవెనలను, వినయవిధేయతతోడ=వినయము, విధేయతతో, చేకొనుచును=స్వీకరించుచు, వెండియున్=మఱియు, నెనరుదొరలు=ప్రియముతో గూడిన, గౌరవములన్; ఒనర్పన్=మునులు చేయగా, కైకొంచు=స్వీకరించుచు క్రమమున, పితృవియోగచింతన్=తండ్రి మరణించిన బాధను, ప్రిదిలి=వదలి,

ఎల్లప్రొద్దు=ఎల్లవేళల, సత్=సత్పురుషులచే, మానస=మనస్సు అనే మానస సరస్సునందుగల, స్థితిన్=వర్తనచే, చాలి=గడపుచు, ధార్తరాష్ట్రలీలన్=హంసలవలె, తగిలి=నిలిచి, క్రీడ సలిపిరి=ఆనందముగా గడిపిరి.

తాత్పర్యం : ఆ విధముగా రామలక్ష్మణులు వెళ్లి తమ ఆనతిచే ప్రవేశించి వర్తించగా అధికముగా పెంపొందు రాక్షసవీరులను బాణములచే నివారించి, ఆ విశ్వామిత్రుని తపోవనమందుగల శోకమును, దీనమును నశింపజేసి, తమ కభివృద్ధులనిచ్చు మునుల దీవెనలను వినయవిధేయతలతో స్వీకరించుచు ప్రియముతో మునుల గౌరవములను స్వీకరించుచు, క్రమముగా పితృవియోగ బాధను వీడి, ఎల్లవేళల సత్పురుషుల మనస్సులనే మానస సరస్సులో హంసలవలె గడుపుచు ఆనందముగా గడిపిరి.

విశేషణము : ధార్త రాష్ట్రాస్సితేతరైః - అని అమరము
ఆజ్ఞకు ఆన అని తద్భవము (ఆంధ్ర భాషాభూషణము)

భారత : ఆ రీతిన్+చని, తమ, ఆ నగరంబు=ఆ హస్తినాపురము, ప్రవేశించి, మెలగన్, ఉద్వృత్తిన్+అడరు, అస్ర=కన్నీళ్లనెడు, పయోధులన్=సముద్రములను, అంబకములన్=నేత్రముల యందు, ఆగి=వారించి, తత్=ఆ వ్యధచే, మహాశ్రమ=అధికమైన బడలికచే, శోక=దుఃఖము యొక్క, దైన్యభారమున్=దీనత్వ భారమును హరియించుటకు, తమ, కురువృద్ధులు=భీష్మాదులు, ఒసగెడు, బహుళతాప=మిక్కిలి పరితాపముతో, సహిత=కూడిన, భాషితములు=మాటలు, దీవెనల్, వినయ విధేయతతోడ, చేకొనుచును, వెండియు, నెనరు దొరలు=నెనరులుగల రాజుల, గౌరవములు=పూజలను, ఒనర్పన్, కైకొంచున్, క్రమమున, పితృవియోగచింతన్=పాండురాజు మరణించిన విచారమును, ప్రిదిలి=విడిచి, సన్మాన స్థితిన్=మంచి మనోవ్యాపారముతో, ఎల్లపొద్దు, ధార్తరాష్ట్ర=దుర్యోధనాదుల యొక్క లీలన్+తగిలి, క్రీడ సలిపిరి.

తాత్పర్యము : ఆ విధముగా పాండవులు వెళ్లి హస్తినాపురము ప్రవేశించి అధికముగా మెలగగా కన్నీళ్లనెడు సముద్రములను కనులలో వారించి, ఆ వ్యధచే

అధికమైన బడలికచే దుఃఖము, దీనము యొక్క భారమును హరించుటకు తమ భీష్మాదులందించు మిక్కిలి పరితాపముతో కూడిన మాటలు, దీవెనలు - వినయవిధేయతలతో నెనరుగల రాజుల పూజలను స్వీకరించుచు పాండురాజు మరణించిన విచారమును వీడి మంచి మనోవ్యాపారముతో ఎల్లవేళల దుర్యోధనాదులతో కలసి క్రీడలు సలిపిరి.

విశేషణము : అంబకము - అంబకంబ నేత్ర శరయోః అని అమరము.

మ. అమిత ప్రౌఢిగ ధార్మికాగ్రి యపితృ వ్యాదిష్టవృత్తిన్ మహో
త్తమ భక్తిన్ గ్రహియించి, శాంతనవసత్త్వ శ్రీచమత్కార ప
క్రిమ సౌభాగ్య ధురీణతన్మహి మహర్షి స్వాంతలీలోచితో
త్తమసంక్రీడ లొనర్చి రక్కొమరు లాత్మజ్ఞాతి సఖ్యాఢ్యులై. 17

రామా : అమిత ప్రౌఢిగ=మిక్కిలి బలము పొంది, ధార్మిక=విలుకాండ్రలో, అగ్రియ=శ్రేష్ఠుడైన, పితృ=దశరథునిచే, వ్యాదిష్ట వృత్తిన్=ఆజ్ఞాపింపబడిన వర్తనను, మహా+ఉత్తమ భక్తిన్=మిక్కిలి భక్తితో, గ్రహియించి=స్వీకరించి, శాంత=పరస్పర విరోధములేని, నవ=ప్రాయములోనున్న, సత్త్వ=సింహాది మృగముల యొక్క, శ్రీ=సమృద్ధి యొక్క (సమూహము), చమత్కార=చెరలాటములచే, పక్రియ= పరిపక్వమైన, సౌభాగ్యధురీణ=ఒప్పిదమును ధరించిన, తత్=మహి=ఆ తపోభూమిలోనున్న, మహర్షి=మునీశ్వరుల యొక్క, స్వాంత=మనస్సుల యొక్క, లీలా+ఉచిత=ఉల్లాసమునకు తగిన, ఆ+కొమరులు=రామలక్ష్మణులు, ఆత్మజ్ఞ=బ్రహ్మణ్యులతో, అతి సఖ్య+ఆఢ్యులై=మిక్కిలి స్నేహముతో కూడినవారై, ఉత్తమ సంక్రీడలు=ఉచితమైన వినోదములు, ఒనర్చిరి=చేసిరి.

తాత్పర్యము : మిక్కిలి బలము పొంది విలుకాండ్రలో శ్రేష్ఠుడైన దశరథునిచే ఆజ్ఞాపించబడిన పనిని అధిక భక్తితో స్వీకరించి, పరస్పర విరోధములేని ప్రాయములో నున్న సింహాది మృగముల యొక్క సమూహముల చెరలాటములతో నిండిన ఆ తపోభూమిలోనున్న మునీశ్వరుల మనస్సులయొక్క ఉల్లాసమునకు తగినట్లుగా ఆ

రామలక్ష్మణులు బ్రహ్మణ్యులతో మిక్కిలి స్నేహముతో ఉచిత వినోదములు చేసిరి.

భారత : అమితప్రౌఢిగ=మిక్కిలి ప్రౌఢియగునట్లు, ధార్మిక=ధర్మాత్ముడైన, అగ్రియ పితృవ్య=పెద తండ్రియైన ధృతరాష్ట్రునిచే, ఆదిష్ట=ఆదేశించబడిన, వృత్తిన్=పనిని, మహా+ఉత్తమ భక్తిన్=అధికభక్తితో, శాంతనవ=భీష్ముని యొక్క, సత్త్వశ్రీ=బలసంపద యొక్క చమత్కార, పక్రిమ, సౌభాగ్య ధురీణ, తత్+మహిమ=ఆ ధృతరాష్ట్రుని ఐశ్వర్యముచే, హర్షి=సంతోషముగల, స్వాంతలీల, ఆ+కొమరులు=ఆ పాండు కుమారులు, ఆత్మజ్ఞాతి=దుర్యోధనాదులతో, సఖ్య+ఆఢ్యులై=స్నేహభావముతో గూడి, ఉత్తమ సంక్రీడ లొనర్చిరి.

తాత్పర్యం : మిక్కిలి ప్రౌఢియగునట్లు ధర్మాత్ముడైన పెదతండ్రియైన ధృతరాష్ట్రునిచే ఆదేశించబడిన పనిని అధికభక్తితో భీష్ముని బలసంపదతో నిండిన సౌభాగ్యమును ధరించి ఆ ధృతరాష్ట్రుని ఐశ్వర్యముచే సంతోషించిన మనస్సులతో ఆ పాండుకుమారులు జ్ఞాతులైన దుర్యోధనాదులతో స్నేహభావముతో గూడి ఉత్తమముగా వినోదము లాడిరి.

విశేషణము : పితృవ్య – పితృభ్రాతా పితృవ్యస్స్యాత్ – అని అమరము.

శా. శశ్వద్విస్ఫురిత స్వబాహుబలభీష్మ ప్రౌఢచాపక్రియల్
విశ్వామిత్రవితాన విఘ్న భయవిశ్లేషం బొనర్పన్ జగ
ద్విశ్వాస్యస్థితిఁ జాలి యున్కి నటు లవ్వీరార్భకుల్ గాంచి ర
త్యైశ్వర్యాహమికావిశృంఖల విహారారంభ విస్రంభముల్. 18

రామా : శశ్వత్+విస్ఫురిత=మిక్కిలి ప్రకాశించుచున్న, స్వబాహుబల=తమ బాహుబలముచే, భీష్మ=భయంకరములైన, ప్రౌఢచాపక్రియల్=గంభీరమైన వింటి పనులు, విశ్వామిత్ర=విశ్వామిత్రునియొక్క, వితాన=యజ్ఞము యొక్క, విఘ్నభయ=ఆటంకములు కలుగునను భయము, విశ్లేషంబు+ఒనర్పన్=అక్రమించగా, జగత్+విశ్వాస్య స్థితిన్+చాలి=లోకమంతయు విశ్వసించదగిన స్థితికి చాలి, ఉన్కి=ఉండుటచే, అటుల=ఆ విధముగా, ఆ+వీర+అర్భకుల్=ఆ వీరులైన బాలురు (రామలక్ష్మణులు) అతి+ఐశ్వర్య=ఈశ్వరసంకల్పము నతిక్రమించిన,

అహమికా=అహంకారముచే, విశృంఖల=అనివారితములైన, విహారారంభ=క్రీడోద్యోగములందుగల, విస్తంభముల్=ఆ సంకోచవృత్తులను, కాంచిరి=చూచిరి.

తాత్పర్యం : మిక్కిలి ప్రకాశించుచున్న తమ బాహుబలముచే భయంకరములైన గంభీరములైన వింటి కృత్యములు విశ్వామిత్రుని యజ్ఞమునకు కలుగు ఆటంకములను భయమును అక్రమించగా లోకమంతయు నమ్మదగిన స్థితికి చాలియుండుటచే ఆ విధముగా వీరులైన ఆ బాలకులు (రామలక్ష్మణులు) ఈశ్వరసంకల్పము నతిక్రమించి, అహంకారముచే అనివారితములైన క్రీడోద్యోగములందు సంకోచవృత్తులు గలవారిని చూచిరి.

విశేషణము : వితానము – క్రతు విస్తారయోర స్త్రీ వితానంత్రిషుతూచ్ఛకే – అని అమరము. అత్యైశ్వర్య=ద్వితీయాతత్పురుష సమాసము.

భారత : శశ్వత్, విస్ఫురిత, స్వబాహుబల; భీష్మ=భీష్ముని యొక్క ప్రౌఢచాప క్రియత్, విశ్వ=సమస్తమైన, అమిత్ర=శత్రువుల యొక్క, వితాన=సమూహముచే, ఆ+వీర+అర్భకుల్=ఆ కౌరవ పాండవ కుమారులు, విఘ్నభయ విశ్లేషం బొనర్పన్, జగత్+విశ్వాస్య స్థితిన్+చాలి+ఉన్కి, అతి+ఐశ్వర్య=మిక్కిలి సంపదలచే, అహమికా=అహంకారముతో, విశృంఖల విహార=విశృంఖలములైన విహారములను, ఆరంభ=ఆరంభములందు, విస్రంభములు=విశ్వాసములను (సిద్ధఫలములైన ఉద్యోగములను) కాంచిరి.

తాత్పర్యం : మిక్కిలి ప్రస్ఫుటముగా బాహుబలముచే కూడిన భీష్ముని గంభీర చాపక్రియలతో సమస్త శత్రురాజ సమూహము ఆటంకములు కలుగునని భయపడగా లోకమంతయు విశ్వసించదగిన అధికసంపదలచే కూడిన అహంకారముతో విశృంఖల విహారముల ఆరంభమును – సిద్ధఫలములైన ఉద్యోగములను ఆ కౌరవ పాండవ కుమారులు చూచిరి.

సీ. ఇమ్మాడ్కి నయ్యన్న దమ్ములపాపల
    వార్యఖేలల నతివ్యాప్తమైన

యాసవనక్షోణియందును సరసుల
గరిడి నిష్టపురాణపరిచితిఁ బ్రియ
మందెడు సమయంబునం దాటకాకుమా
రులలోలసద్బలరూఢి నెందు
మాఱుద్ది లేకొప్పుమీఱుభీమోద్ధతి
ప్రబలంగఁ దారాసరణి మెలంగఁ

ఆ. గడఁక చాలక కడుఁ గలఁగెడు తాపస
నాథహృదయ వర్తనంబు దిరము
గాఁగఁ దేర్చి బాధకలితసుయోధనా
దులగు రాజనందనులు గడంగి. 19

రామా : ఈ+మాడ్కిన్=ఈ విధముగా, ఆ+అన్నదమ్ములు=ఆ రామ లక్ష్మణులు, అపాపలవ=పాపలేశరహితులైన, ఆర్య=పెద్దల యొక్క, ఖేలలన్=విహారములచే, అతివ్యాప్తమైన=అధికమైన, ఆసవనక్షోణియందును=ఆ యజ్ఞ భూమియందు, సరసులగరిడిన్=రసికుల వెంబడి, ఇష్టపురాణ పరిచితిన్=ఇష్టమైన పురాణశ్రవణమువలన, ప్రియమందెడు సమయంబునన్=సంతోషించు సమయములలో, తాటకా కుమారులు=సుబాహు మారీచులు, అలోల=చలింపని, సత్+బలరూఢిన్=మంచి సేవలయొక్క, ఎందున్=ఎక్కడను, మాఱు+ఉద్ది= సమానమైన శత్రువు, లేక+ఒప్పు మీరు=లేకుండ అతిశయించు, భీమ+ఉద్ధతిన్= భయంకరమైన అతిశయముతో, ప్రబలంగన్=వ్యాపించగా, తారాసరణిన్=ఆకాశమున, మెలంగగా=సంచరిపంగా, కడఁక చాలక=ధైర్యము చాలక, కడున్+కలఁగెడు=మిక్కిలి చింతించు, తాపసనాథ=విశ్వామిత్రుని, హృదయవర్తనము=మానసిక స్థితిని, తిరముగాఁగ+తేర్చి=స్థిరపడునట్లు చేసి, బాధకలిత=అధికమైన, సుయోధ=శూరుల యొక్క, నాదులు=సింహనాదములతో, కలిత=కూడినవారై, కడంగి=ప్రయత్నించి – ముందటి పద్యములో క్రియ.

తాత్పర్యం : ఈ విధముగా ఆ రామలక్ష్మణులు పాపలేశరహితులైన పెద్దల విహారములచే అధికమైన ఆ యజ్ఞభూమియందు రసికుల వెంబడి ఇష్టమైన పురాణశ్రవణము వలన సంతోషించు సమయములో మారీచ సుబాహులు చలింపని సేనలతో ఎందును సమానమైన శత్రువు లేనట్లు అతిశయించుచు భయంకరాతిశయముతో వ్యాపించి ఆకాశమున తిరుగసాగిరి. ధైర్యము చాలక మిక్కిలి చింతించు విశ్వామిత్రుని మానసిక స్థితిని స్థిరపడునట్లు చేసి రామలక్ష్మణులు అధికమైన శూరుల సింహనాదములను ప్రయత్నించి...

భారత : ఇమ్మాడ్కిన్, ఆ+అన్నదమ్ముల పాపలు=ఆ కౌరవ పాండవులు, అవార్య ఖేలలన్, అతివ్యాప్తమైన, ఆసన్=అపేక్షతో, వనక్షోణియందును=ఉద్యానవన భూమిలో, సరసులను=సరోవరములలో, గరిడిన్=సాముగరిడీలలోను, ఇష్టపురాణ పరిచితిన్, ప్రియమందెడు సమయంబునన్, ఆటకు=ఆడుకొనుటకు, ఆ కుమారులలో, లసద్బల నిరూఢిన్, ఎందుమాఱుద్దిలేక, ఒప్పు మీరు, భీమ+ఉద్ధతి= భీముని యొక్క ఔద్ధత్యము, ప్రబలంగన్, తారు=తాము, ఆసరణిన్=ఆ రీతిగా, మెలంగన్ - కడఁక చాలక=ధైర్యము సరిపోక, కలఁగెడు=చింతించు, తాపసనాధ=విచారయుక్తమైన, హృదయవర్తనంబు, తిరముగానన్+తేర్చి, బాధ=సంహరించెదమను ప్రతిజ్ఞచే, కలత=కూడిన, సుయోధనాదులను=దుర్యోధనుడు మొదలైన, రాజనందనులు, కడంగి.

తాత్పర్యం : ఈ విధముగా ఆ అన్నదమ్ముల బిడ్డలైన కౌరవ పాండవులు వారింపరాని ఆటపాటలలో అపేక్షతో ఉద్యానవనభూమిలో, సరస్సులలో, సాముగరిడీలలో ఇష్టపురాణపరిచయములతో ప్రియమునందు సమయములో ఆడుకొనుటకు ఆ కుమారుల బలసంపదలతో ఎదురులేని భీముని ఔద్ధత్యమును తాము ఆ విధముగా చూచి మెలగగా, ధైర్యము చాలక చింతించుచు విచారముతో గూడిన మానసిక వృత్తితో సంహరించెదమను ప్రతిజ్ఞ చేకూడిన దుర్యోధనాదులు ప్రయత్నించి -

విశేషణము : బాధ - భృశ ప్రతిజ్ఞ యోర్బాధః - అని అమరము.

మ. అసమామ్నాయనయాధ్వరక్షణవిభూతాపాదియై మించురా
క్షసకర్మంబునకుం దలంకక సమగ్ర స్థైర్య ధౌరేయమా
నసు లై డెందములోనధర్మ పటిమం దద్భీమసేనాంగద
ర్పసముద్రేకము రూపుమాపఁ గలిత ప్రారంభు లై రంతటన్. 20

రామా : అసమ=సమముకాని, ఆమ్నాయనయ=వేదవిధిగల, అధ్వరక్షణ=యజ్ఞము యొక్క, విభూత+ఆపాదియై=గొప్పదనమును ధ్వంసముచేయు, రాక్షస కర్మంబునకున్=రాక్షసుల పనులకు, తలంకక=అధైర్య పడక, సమగ్ర స్థైర్య=సంపూర్ణమైన ధైర్యముతో, ధౌరీయమానసులై=నిండిన మనసు గలవారై, డెందములోన=మనసులో, ధర్మపటిమన్=వింటి నేర్పుచే, తత్=ఆ రాక్షసుల యొక్క, భీమ=భయంకరములైన, సేన+అంగ=సేనల యొక్క అంగములైన, దర్పసముద్రేకము=గర్వాతిశయమును, అంతటన్=అన్ని రకములుగా రూపమాపన్=నశింపజేయుటకు, కలిత ప్రారంభులైరి=ఉద్యోగించిరి.

తాత్పర్యం : సరిసమానములేని వేదవిధితో నిర్వహించు యజ్ఞముయొక్క ఉత్సవ వైభవమును ధ్వంసము చేయు రాక్షస కృత్యములకు అధైర్యపడక, సంపూర్ణమైన ధైర్యముతో నిండిన మనసుగలవారై మనసులో వింటి నేర్పుతో ఆ రాక్షసుల భయంకరమైన సేనల - రథగజతురగపదాతుల ఆడంబరమును అన్ని రకములుగా నశింపజేయుటకు రామలక్ష్మణులు ఉద్యోగించిరి.

భారత : అసమ=సరిలేని, ఆమ్నాయ=కులము యొక్క, నయాఢ్య=నీతి మార్గము యొక్క, రక్షణ, విభూతి, ఆపాదియై, మించు, రాక్షసకర్మంబునకున్=క్రూరమైన పనులకు, తలంకక, సమగ్ర స్థైర్య ధౌరీయమానసులై, డెందములోన, ధర్మపటిమన్=ధర్మమార్గములో, తత్భీమసేనాంగ=ఆ భీమసేనునియొక్క, దర్పసముద్రేకము, రూపుమాప, అంతటన్, కలిత ప్రారంభులైరి.

తాత్పర్యం : సరిలేని కులము యొక్క నీతిమార్గ రక్షణమునకు ఐశ్వర్యము నశింపజేయు క్రూరమైన పనులకు బెదరక, సమగ్ర ధైర్యముగల మనసుగలవారై,

మనసులో ధర్మమార్గమును పాటించుచు ఆ భీమసేనుని దర్పము యొక్క ఉద్ధతిని రూపుమాపుటకు అన్ని విధముల కౌరవులు ప్రారంభింపదొడగిరి.

ఉ. తోరపుటల్క నారిపులు దొమ్మిగఁ బైపయిఁ గ్రమ్మవారి లీ
లారణవృత్తిఁ గిట్టి కడు లావరిభీముఁడు రామభద్రుఁ డే
పారెడువేడ్కతో నెరపె నప్పుడు కాండపటుప్రహారదు
ర్వారవిధిన్ సుబాహుఁడనువాఁడిలసద్గతి గాంచి మించఁగన్. 21

రామా : ఆరిపులు=ఆ శత్రువులు, తోరము+అల్కన్=అధికమైన కోపముతో, దొమ్మిగన్=గుంపుగా, పైపయిన్=పైకొని, క్రమ్మ=ముసురుకొనగా, వారిన్=వారిని, లీలారణవృత్తిన్=వినోదముగా యుద్ధము చేసి, కిట్టి=ఎదుర్కొని, కడులావు=అధిక బలముతో, అరిభీముడు=శత్రుభయంకరుడైన, రామభద్రుఁడు, ఏపారెడు వేడ్కతో=అతిశయించిన వేడుకతో, అప్పుడు, కాండపటుప్రహార=బాణముయొక్క తీవ్రమైన దెబ్బచే, దుర్వారవిధిన్=సహింపరాని విధముగా, సుబాహుఁడు=అనువాడు, ఇలన్=భూమిపై, సద్గతి గాంచి=స్వర్గలోకమును పొంది, మించగన్-నెరపె= ప్రకాశించెను.

తాత్పర్యం : ఆ శత్రువులు అధికమైన కోపముతో గుంపుగా పైబడి ముసురుకొనగా వారిని వినోదముగా యుద్ధము చేసి ఎదుర్కొని అధికబలముతో శత్రుభయంకరుడైన రామచంద్రుడు అతిశయించిన వేడుకతో అప్పుడు బాణపు తీవ్రమైన దెబ్బచే సహింపరాని విధముగా సుబాహునికి భూమిపై స్వర్లోకమును పొందునట్లు చేసెను.

భారత : ఆ రిపులు=దుర్యోధనాదులు, తోరపుటల్కను, దొమ్మిగ బైపయిగ్రమ్మి, వారి లీలావరణ వృత్తి గిట్టి, కడులావరి=అధికబలసంపన్నుడైన, రామభద్రుఁడు=మంచి అదృష్టముగల, భీముఁడు, ఏ పారెడు వేడ్కతో నప్పుడు, కాండ పటు ప్రహారవిధిన్=ఉదకము యొక్క ప్రహారముచే, సుబాహుఁడను=లెస్స భుజములు గలవాడనెడి, వాడి=ప్రతాపము, లసత్+గతి=ప్రఖ్యాతిని గాంచి, మించగన్, నెరసె.

తాత్పర్యం : దుర్యోధనాదులు అధికమైన కోపముతో గుంపుగా పైబడగా వారిని వినోదముగా యుద్ధములో బలవంతుడైన అదృష్టశాలి భీముడు, అధికమైన వేడుకతో అప్పుడు నీటిలో ముంచి సహింపరాని విధముగా లెస్స భుజములు గలవాడని ప్రతాపముతో ప్రఖ్యాతి గాంచి మించగా...

వ. అప్పు డతండు మఱియును 22

కం. వెసఁ దజ్జ్యేష్ఠుని నతిసా
హసుని హృదర్పితమహాశుగాశుగవేగో
ల్లసనప్రసభాచరితా
ధిసముద్ర నిపాతుఁ జేసె దృఢదోశ్శక్తిన్. 23

రామా : అతిసాహసుని=మిక్కిలి సాహసవంతుడైన, తత్+జ్యేష్ఠుని=ఆ మారీచుని, వెసన్=వేగముగా, దృఢదోః+శక్తిన్=తనదైన భుజబలపరాక్రమముతో, హృత్+అర్పిత=గుండెకు నాటిన, మహా+ఆశుగ+ఆశుగ=గొప్పదైన వాయవ్యాస్త్రము యొక్క, వేగ+ఉల్లసన=తీవ్రప్రకాశముచే, ప్రసభ+ఆచరిత=బలాత్కారముగా, అధిసముద్ర=లోతైన సముద్రమునందు, నిపాతున్=పడునట్లుగా, చేసెన్=చేసెను.

తాత్పర్యం : శ్రీరాముడు మిక్కిలి సాహసవంతుడైన ఆజ్యేష్ఠుడైన మారీచుని తనదైన భుజబలపరాక్రమముచే వేగముగా గుండెకు నాటిన వాయవ్యాస్త్రము యొక్క తీవ్రతచే బలాత్కారముగా సముద్రమునందు పడునట్లుగా చేసెను.

భారత : అతిసాహసుని, తత్+జ్యేష్ఠుని=దుర్యోధనుని, హృదర్పిత=గుండెకంటిన, మహాశున్=అధికశోకమనెడి, ఆశుగ=బాణములనెడి, అధిసముద్ర=చింతా సముద్రమునందు, వెసన్=వేగముగా, దృఢదోశ్శక్తిన్, నిపాతున్, చేసె.

తాత్పర్యం : అతి సాహసియైన దుర్యోధనుని గుండె కంటిన అధిక శోకమనెడి బాణములనుడి చింతాసముద్రమునందు వేగముగా తన భుజబలముతో పడునట్లు భీముడు చేసెను.

చం. అతఁడును నట్లు బాల్యదశ యందు కడుం బిరుదైన యాబలా
దృుతునిదురంబరిస్ఫురణదూలఁ బ్రవర్తిలువేళఁగ్రూరచి,
త్తతఁ దనమూఁకతోఁ బొదివి తాఁ దదజయ్యతచూచుటన్ భయా
హతమతిఁ గట్టి వైచె వెస నాపగలోన నవారతంబుగన్. 24

రామా : అతడును=ఆ మారీచుడును, అట్లు=ఆ విధముగా, బాల్య దశయందున్=చిన్నతనములోనే, కడున్=మిక్కిలి, బిరుదైన=ఘనుడైన, ఆబల+ అద్భుతుని=ఆ రామచంద్రుని యొక్క, దురంబు=యుద్ధము, అరిస్ఫురణ=శత్రు సామర్థ్యమును, తూలన్=కొంచెము పడునట్లుగా, ప్రవర్తిలు వేళ=చేసెడి వేళ, క్రూరచిత్తతన్= దుష్టబుద్ధితో, తనమూకతో=తన సైన్యముతో, పొదివి=ఎదిరించిపట్టి, తాన్=ఆ రాముని యొక్క, అజయ్యత=జయింపశక్యముగాని వాడౌటను, చూచుటన్=చూచుట వలన, భయహతమతి=భయము నిండిన మనస్సును, వెసన్=ప్రయత్నపూర్వకముగా, ఆ పగ=ఆభ్రాతృవధ ద్వేషమును, లోనన్=లోపల, అవారితంబుగన్=నిలుచునట్లుగా, కట్టివైచె=అణచి వేసెను.

తాత్పర్యం : ఆ విధముగా బాల్యమునందే అక్కడ మిక్కిలి పరాక్రమముతో ఆ రాముని బలాతిశయమును యుద్ధములో చెలరేగగా ఆ మారీచుడు క్రూరమైన మనస్సుతో తన సేనలతో పొదివెను. ఆ రాముని జయించుటకు శక్యముగాని శక్తిని చూచుటచే (మారీచుడు) భయముతో గూడిన తన మనస్సును కట్టివైచి భ్రాతృవధ వలన కలిగిన పగను లోపల నిలుచునట్లుగా అణచివేసెను.

విశేషణము : అజయ్యత – క్షయబయ్యౌ శక్యార్థే – అని నిపాతము.

భారత : అతఁడును=దుర్యోధనుడును, అట్లు=ఆ విధముగా, బాల్యదశ యంద=చిన్నతనముననే, కడున్ బిరుదైన, ఆ బలాద్భుతున్=భీముని, నిదురన్=నిద్రచే, పరిస్ఫురణదూలన్=ఏమఱినట్లు, ప్రవర్తిలు వేళ=సంచరించు వేళ, క్రూరచిత్తతన్, తన మూకతో=తన బలగముతో, పొదివి, తాన్=తాను, తత్=ఆ భీముని, అజయ్యత, చూచుటనే, భయహతమతిన్=భయముతో గూడిన మనస్సుతో, వారితంబుగన్=

వారించునట్లు, ఆపగలోనన్=నదియందు, కట్టివైచె=కట్టి పడవేసెను.

తాత్పర్యం : దుర్యోధనుడును పైచెప్పిన విధముగా మిక్కిలి బలాఢ్యుడైన ఆ బలసంపన్నుడు, భీముడు నిదురించి ఏమరి యందువేళ దుష్టచింతనతో తన గుంపుతో పొదివి, ఆ భీముని అజేయశక్తిని చూచుట వలన భయముతో గూడిన మనస్సుతో వారింపలేనట్లుగా అతనిని నదిలో బంధించి వేసెను.

వ. అప్పుడు. 25

కం. ఘనవిగ్రహజృంభణమున
ననయము దనకట్లు దెగఁగ నవ్వాహినిఁ గ్రీ
డన గెలిచి వచ్చు నబ్బా
లుని గని వెఱఁ గంది రాత్మలో నచటిజనుల్. 26

రామా : అప్పుడు, ఘనవిగ్రహజృంభణమునన్=గొప్ప యుద్ధాతిశయముచే, అనయము=నిరంతరము, తనకు+అట్లు తెగఁగ=తనకు ఆ విధముగా తెగిపోగా, ఆ+వాహినిన్=ఆ రాక్షససేనను, క్రీడన=వినోదముగా, గెలిచి వచ్చు=గెలిచిన, ఆ+బాలుని=ఆ రాముని, గని=చూచి, అచటి జనుల్=అక్కడి ప్రజలు, ఆత్మలోన్= మనసులో, వెఱఁగందిరి=భయపడిరి.

తాత్పర్యం : అప్పుడు గొప్పగా యుద్ధాతిశయము నిరంతరము తనకావిధముగా తెగిపోగా, ఆ రాక్షస సేనను వినోదముగా గెలిచిన ఆ రాముని చూచి అక్కడి ప్రజలు మనసులో భయపడిరి.

భారత : అప్పుడు, ఘన=పెద్దగా, విగ్రహజృంభణమున=శరీరమును పెంచి, అనయము= అవశ్యముగా, తనకట్టు=తన బంధములు, తెగఁగ=తెగిపోగా, అవ్వాహినిన్ క్రీడన, గెలిచి=ఆ నదిలో వినోదముగా తరించి, వచ్చు=బయటికి వచ్చు, ఆ+బాలుని=ఆ భీముని, కని, అచటి జనుల్, ఆత్మలో వెఱగందిరి.

తాత్పర్యం : అప్పుడు పెద్దగా శరీరమును పెంచి అవశ్యముగా తన బంధములు తెగగా ఆ నదిని వినోదముగా తరించి బయటకు వచ్చు ఆ భీముని అక్కడి జనులు చూచి మనసులో భయపడిరి.

కం. ఆతఁడు మదిఁ జతురాత్మ
భ్రాతృసహాయతఁ గరంబు రంజిలుచుం ద
ద్జ్ఞాతులయాగస్ఫుటవిధు
లీతెఱఁగున జరుగ నిర్వహించె విజయతన్. 27

రామా : ఆతఁడు=రాముడు, మదిన్=మనస్సులో, చతుర=సమర్థుడైన ఆత్మభ్రాతృసహాయతన్=తన సోదరుడైన లక్ష్మణుని సహాయముతో, కరంబు=మిక్కిలి, రంజిలుచున్=శోభిల్లుచు, తజ్ఞ=విశేషజ్ఞుడైన ఆ విశ్వామిత్రుని యొక్క, అతుల=సాటిలేని, యాగ=యాగము యొక్క, స్ఫుటవిధులు=నిర్దేశిత కార్యములు, ఈతెఱగున=ఈ విధముగా, విజయతన్=విశిష్ట జయముతో, జరుగన్=జరుగునట్లుగా, నిర్వహించె=నిర్వహించెను.

తాత్పర్యం : రాముడు తన సోదరుడైన లక్ష్మణుని సహాయముతో మనస్సులో రంజిల్లుచు, ఆ విశ్వామిత్రుని సాటిలేని యాగవిధులు ఈ విధముగా జయప్రదముగా జరుగునట్లు నిర్వహించెను.

భారత : ఆతఁడు=ఆ భీముడు, మదిన్=మనస్సులో, చతుః=నలుగురైన, ఆత్మభ్రాతృ=సోదర ధర్మాదులైనవారి, సహాయతన్, కరంబు, రంజిలుచున్, తత్+జ్ఞాతుల=ఆ దుర్యోధనాదులయొక్క, ఆగః=అపరాధముల యొక్క, స్ఫుటవిధులు=కనిపించునట్లు చేయుటలు ఈ తెఱగున, జరుగన్, విజయతన్= విజయత్వమును, నిర్వహించె.

తాత్పర్యం : భీముడు తన నలుగురు సోదరుల (ధర్మజాదుల) సహాయమునకు మనస్సులో మిక్కిలి సంతోషించుచు, ఆ దుర్యోధనాదులు అపవాదములు కనిపించునట్లు చేయు పనులు ఈ విధముగా జరుగగా విజయత్వమును నిర్వహించెను.

విశేషణము : స్ఫుటవిధులు - శర్పరేఖరి వావిసర్గలోపః - అని విసర్గ లోపము జరిగినది.

సీ. అతఁడు దానవిహత యైనవసుధయంద
మును మించుప్రఖ్యాతి ఘనసమృద్ధిఁ
దనర విశ్వామిత్ర తాపసుహృత్ప్రమో
దస్ఫూర్తి సాధించి తద్గురుత్వ
శక్తినంబకఘనాశనిగదాస్యాదులు
వర్ణింప నెక్కుడై వఱలఁ గాంచెఁ
గావున నవ్వీర్య కలితుఁ డాశత్రుల
యమ్మనాకులవృత్తి నిమ్ముకొనఁగఁ
తే. జేసె నంత ఘనఖ్యాతి భాసిలఁ గృప
నామునిఁ బురస్కరించి నానామహాస్త్ర
గరిమ వడసి రాకుమారు లాగురునిరూఢిఁ
దిరముకొలిపెఁ దదచ్యుతతేజ మిలను. 28

రామా : అతడు=రాముడు, దానవి=తాటక, హతయైన=మరణించిన, వసుధయంద=భూమియందే, మును=మునుపు, మించు ప్రఖ్యాతి=అధికమైన కీర్తి, ఘన సమృద్ధిన్+తనర=అధిక సంపదతో అలరారగా, విశ్వామిత్ర తాపసు=విశ్వామిత్ర మహర్షి యొక్క, హృత్=హృదయమునకు, ప్రమోద స్ఫూర్తి సాధించి=ఆనందమును కలిగించి, తత్+గురుత్వ శక్తిన్=ఆయన గొప్పదనముతో, అంబక=బాణములైన, ఘన=మేఘములును, అశని=పిడుగులును, గదా=గుదియలును, అసి=చంద్రహాసము, ఆదులు=మొదలైన, (వారుణాస్త్ర - ఇంద్రాస్త్ర, యామ్యాస్త్ర, రౌద్రాస్త్రములు మొదలైన యస్త్రములను) వర్ణింపనెక్కుడై=వర్ణించుటకు అధికమై, కాంచెన్=స్వీకరించెను, కావున, ఆ+వీర్యకలితుడు=ఆ బలిష్ఠుడైన రాముడు, ఆ శత్రులయమ్ము=ఆ శత్రుసంహారమును, అనాకులవృత్తిన్=అనాయాసముగా, ఇమ్ముకొనగన్+చేసె=వసించునట్లు చేసెను.

(స్వతస్సిద్ధముగ మహిమగల రాముడు విశ్వామిత్రుని వలన అస్త్రముల నభ్యసించి శత్రుజయమును అనాయాసముగా సాధించెను. తత్=ఆ, అచ్యుత తేజము=విష్ణుని అంశమైన రాముడు, అంత=అంతైన (రాముని గురువు) ఘనఖ్యాతి భాసిలన్=అధిక కీర్తితో విలసిల్లగా, కృపన్=తన దయతో, ఆ మునిన్=ఆ విశ్వామిత్రుని, పురస్కరించి= అస్త్రములను స్వీకరించి, నానామహా+అస్త్ర గరిమ+పడసి=మిక్కిలి గొప్పవైన అస్త్రబలమును పొంది, రాకుమారులు=రాకుమారుని యొక్క, లాగు=రీతిని, ఉరునిరూఢి=అధికశక్తిచే, ఇలన్=భూమిపై తిరము కొలిపె=స్థిరపరచెను (తాను శిష్యుడై విశ్వామిత్రునికి ప్రసిద్ధి గల్పించెను).

తాత్పర్యం : ఆ రాముడు తాటక చనిపోయిన భూమియందే మునుపు కీర్తి గడించి అతిశయముతోనున్న విశ్వామిత్రమహర్షి హృదయమునకు ఆనందము కలిగించి, ఆ గురువు యొక్క శక్తిచే వారుణాస్త్ర, ఇంద్రాస్త్ర, యామ్యాస్త్ర రౌద్రాస్త్రాది అస్త్రములను వర్ణింపనలవిగాని రీతిలో స్వీకరించెను. కావున ఆ బలసంపన్నుడు ఆ రాక్షసులను సంహరించి అతిశయించెను. మహిమగల రాముడు శత్రుజయమునకు హేతువాయెను. నానామహాస్త్రములను పొంది రాజకుమారుని రీతిగా విష్ణ్వంశ తేజమున అధికముగా నెలకొల్పెను.

విశేషణము : అసి – చంద్రహాసారిష్టయః అని అమరము.

భారత : అతడు=భీముడు, తాను+అవిహతమై=తాను నశింపక, నవసుధయందమును=(కొత్త) అమృతమువలె, మించు=ప్రకాశించు, ప్రఖ్యాతి=కీర్తి, ఘనసమృద్ధిన్+తనర, విశ్వామిత్రతాప=అఖిల శత్రుతాపము యొక్క, సుహృత్+ప్రమోద స్ఫూర్తిన్=మిత్రుల సంతోషముయొక్క, స్ఫూర్తిని, సాధించి, తత్+గురుత్వ శక్తిచే=గొప్పదైన ఆశక్తిచే, అఘనాశనిగన్=దుఃఖమును విడిచినట్లుగా, అంబకున్=తల్లియైన కుంతికి, దాస్యాదులు=సేవాదులను, కాంచెన్+కావున= కల్పించెను గావున, ఆ+వీర్యకలితుడు= భీముడు, ఆ శత్రుల=ఆ దుర్యోధనాదుల యొక్క, అమ్మను=గాంధారిని, ఆకులవృత్తిన్+ ఇమ్ముకొనగజేసెన్=మిక్కిలి విచారపడునట్లు చేసెను, అంతన్, ఆ కుమారులు=ఆ కౌరవ పాండవులు,

కృపనామునిన్=కృపుడు అను పేరుగల కృపాచార్యుని, పురస్కరించి=ఆదేశముతో, నానామహాస్త్రగరిమన్=అనేకములైన గొప్ప అస్త్రములను, పడసిరి. ఆ గురునిరూఢిన్=ఆ కృపుని యొక్క ప్రసిద్ధిని, ఇలను=భూమిపై, తత్=ఆ కుమారుల యొక్క, అచ్యుత తేజము=జాలని తేజము, తిరము కొలిపె=స్థిరపరచెను.

తాత్పర్యం : ఆ భీముడు తాను నశింపక, అమృతమువలె మించిన కీర్తి సంపదతో వెలసెను. అఖిలశత్రుతాపమును, మిత్రసంతోష స్ఫూర్తిని సాధించి, ఆ గొప్ప శక్తిచే తన తల్లియైన కుంతిని దుఃఖము విడుచునట్లుగా సేవాదులతో కాంచెను. అట్లే భీముడు దుర్యోధనాదుల తల్లి గాంధారాని విచారపడజేసెను. అంత ఆ కౌరవపాండవులు కృపుడను పేరుగల వానిచే అస్త్రసంపదను బడసిరి. ఆ కుమారుల జాలనితేజము ఆ కృపాచార్యుని ప్రసిద్ధిని స్థిరపరచెను.

వ. అంత. 29

సీ. సంయమిదివ్య తేజమునఁ గుంభిని జనిఁ
చినయాదిలక్ష్మి నజేయుఁ డైన
విమలశీలునిరఘువీరకులోత్తంసుఁ
దాగూర్చువాఁ డయితన్నృపాల
వరకుమారకులకుగురువై మనః ప్రీతి
దనర నత్యాశ్చర్యజనకధామ
భీమబాణాసనస్థేమవార్తాప్రవ
ర్తనమనుభవ్య సుధన్వినూత్న

తే. విరచితావధానశ్రుతివీథికలను
ద్రోణులసదాదరైకధురీణుఁ డగుచుఁ
బ్రౌఢి మన్నించె మేదినీపతిసుతులును
దద్ధనుశ్శక్తిపస గాంచుతమిఁ బొదలిరి. 30

రామా : సంయమి=విశ్వామిత్రుడు, కుంభినిన్=భూమియందు, దివ్యతేజమున= అద్భుత తేజస్సుతో, జనించిన=పుట్టిన, ఆదిలక్ష్మిన్=సీతను, అజేయుడైన=జయింప శక్యముగాని, విమలశీలుని=స్వచ్ఛమైన శీలముగల, రఘువీరకులోత్తంసున్= శ్రీరాముని, కూర్చువాడయి=వివాహము చేయు యత్నముచేసి, తాను=విశ్వా మిత్రుడు, తత్+నృపాల వర కుమారకులకు=ఆ రాజకుమారులకు, గురువై=అధికమై, మనః ప్రీతి=మనస్సునకు ఆనందము కలిగించునట్లు, తనరు=ప్రకాశించు, అతి+ఆశ్చర్య=మిక్కిలి ఆశ్చర్యకరమైన, జనకధామ=జనకమహారాజు గృహమునందున్న, భీమ=పరమేశ్వరుని యొక్క, బాణ+ఆసన=వింటియొక్క, స్థేమ=బలిమియొక్క, వార్తాప్రవర్తనము=వార్త వ్యాపించుట, అను=అనెడి, భవ్యసుధన్=ప్రశస్తమైన అమృతమును, వినూత్న విరచిత=కొత్తగా రచింపబడిన, అవధాన=హెచ్చరికగల, శ్రుతివీధికలను=చెవులనెడి, ద్రోణులన్=దొన్నెల యందు, సదా+ఆదరైకధురీణుడు +అగుచు=నిరంతరము ఆదరించుటయందే మనస్సు గలవాడై, ప్రౌఢిమన్=శక్తిని, నించెన్=నిండించెను, తత్+ధనుః+శక్తిపసన్=ఆ వింటి శక్తి సామర్థ్యమును, కాంచు తమిన్=చూచు కోరికతో, మేదినిపతి సుతులును=రాకుమారులైన రామలక్ష్మణులును, పొదలిరి=వర్ధిల్లిరి.

తాత్పర్యం : విశ్వామిత్రుడు - దివ్యమైన తేజస్సుతో భూమిలో జన్మించిన సీతను అజేయుడైన రామచంద్రునికి కూర్చువాడై, ఆ రాజకుమారులకు మనః ప్రీతిని అధికము చేయదలచి, ఆశ్చర్యకరముగా జనకుని ఇంటనున్న వింటి సామర్థ్యమును గూర్చిన వార్తలనెడి అమృతము తన చెవుల దొన్నెలలో ఆదరముగా నిండినవాడాయెను. ఆ ధనుస్సుయొక్క శక్తిని చూడవలెనను కోరికతో రామలక్ష్మణులును వర్ధిల్లిరి.

విశేషణము : స్థేమ - స్థిరశబ్దము యొక్క నిమనచ్ ప్రత్యయము.

ద్రోణ - ద్రోణీకాష్ఠాంబు వాహినీ అని అమరము.

భారత : సంయమి వీర్యతేజమునన్=భరద్వాజమహర్షి వీర్యముయొక్క తేజస్సుతో, కుంభినిన్=కలశమునందు, జనించి=పుట్టి, నయాది లక్ష్మిన్=మంచి గుణసంపదచే, అజేయుడైన, విమలశీలుడు=మంచి శీలముగల, నిరఘు=

పాపములేని, వీరకులోత్తంసు=వీరవంశమునందు పుట్టిన వానిని, తాన్, కూర్చు వాడయి=ఆప్తుడై, తత్+నృపాలవరకులకు=ఆ రాజకుమారులైన కౌరవ పాండవులకు, గురువై=గురువై (ద్రోణాచార్యుడు) మనః ప్రీతిన్+తనర; అత్యాశ్చర్యజనక=మిక్కిలి ఆశ్చర్యమును కలిగించు, ధామ=ప్రతాపముచే, భీమ=భయంకరమైన, బాణాసన=వింటి వల్లనైన, స్థేమ=ధైర్యగుణము యొక్క, వార్తా ప్రవర్తనన్=వార్తా విలాసముచే, మను=జీవించు, భవ్యసుధన్వి=మంచి విలుకానిని, నూత్నవిరచిత= కొత్తగా రచింపబడిన, అవధాన=ఎచ్చరికగా, శ్రుతివీధికలన్=వేదమార్గ విచారముగల వానిని, ద్రోణు=ద్రోణాచార్యుని, లసత్+ఆదర+ఏకధురీణుడు+ అగుచు=మిక్కిలి ఆదరము జూపు స్వభావముగలవాడగుచు, మేదినీపతి=ధృతరాష్ట్రుడు, ప్రౌఢిన్=మన్నించె, సుతులును=కుమారులును, తత్+ధనుః+శక్తిపస=ఆ ధనుర్వి ద్యసారమును, కాంచుతమిన్=అభ్యాసము చేయు కోరికతో, పొదలిరి= ప్రవర్తించిరి.

తాత్పర్యం : భరద్వాజమహర్షి వీర్యముతో కలశమునందు జన్మించి మంచి గుణసంపదచే అజేయుడైన విమలశీలుడు, పాపరహితుడు, వీరవంశమునందు జన్మించిన వానికి ఆప్తుడై ఆ రాజకుమారులగు కౌరవ పాండవులకు ఆచార్యుడై (ద్రోణుడు) మనస్సునకు ప్రీతి కలుగునట్లుగా, అత్యాశ్చర్యకర ప్రతాపముచే వింటి ధైర్యగుణ వార్తావిలాసముచే జీవించు మంచి విలుకానిని, కొత్తగా రచించిన హెచ్చరికగల వేదపండితుని, ద్రోణాచార్యునిపై మిక్కిలి ఆదరము చూపుచు ధృతరాష్ట్రుడు మన్నించెను. కుమారులును ఆ ధనుర్విద్యాసారమును అభ్యాసము చేయు కోరికతో ప్రవర్తిల్లిరి.

వ. అందు. 31

మ. గురుసంకల్పము చొప్పు దప్ప కెలమిన్ క్షోణీజనాశ్చర్యవి
స్ఫురణం బొంద ఘనోగ్రకార్ముకవరంబున్ వంప నెంతే మహా
శరసోత్కర్షరయప్రయుక్తిఁ బొదలన్ సామర్థ్యసంపద్ధురం
ధరుఁ డారామవిభుండు జిష్ణుఁడు సముద్భాసిల్లె నత్యంతమున్.

రామా : గురు=విశ్వామిత్రుని యొక్క, సంకల్పము చొప్పు=ఆలోచన తీరును, తప్పక, ఎలమిన్=మిక్కిలి, క్షోణీజను=సీతను, ఆశ్చర్య విస్ఫురణన్=ఆశ్చర్యము యొక్క ఖ్యాతి కలుగునట్లుగా, పొందన్=వరించునట్లుగా, ఘన+ఉగ్ర కార్ముక వరంబున్=గొప్పదైన రుద్రచాపమును, వంపన్=ఎక్కుబెట్టుటకు, ఎంతేన్=ఎంతైనను, మహాశరసోత్కర్షరయప్రయుక్తిన్=గొప్ప అనురాగమహిమ వేగప్రేరణచే, పొదలన్=వర్ధిల్లగా (అత్యధికమగుచుండగా) సామర్థ్యసంపత్+ధురంధరుఁడు=సమర్థత అనే సంపదయందు శక్తిగలవాడు, ఆ రామవిభుడు=ఆ రామచంద్రుడు, జిష్ణుడు=జయశీలుడై, అతి+అంతమున్=మిక్కిలి, సముద్భాసిల్లె=సంతసిల్లెను.

తాత్పర్యం : విశ్వామిత్ర సంకల్పము తీరు తప్పకుండ ఆనందముగా భూమిజయైన సీతను ఆశ్చర్యకరముగా వరించుటకు రుద్రచాపమును ఎక్కుబెట్టుటకు ఎంతో అనురాగ మహిమ వేగప్రేరణ కలిగి సమర్థుడైన జయశీలియైన ఆ రామచంద్రుడు మిక్కిలి సంతోషించెను.

(ఈశ్వరుని విల్లు వంచి సీతను వరించెదనని మిక్కిలి తెలివి గలిగియుండెను).

భారత : గురు సంకల్పము చొప్పు తప్పక=ద్రోణాచార్యుని ఆలోచనను తప్పక, ఎలమిన్, క్షోణీజన=లోకులు, ఆశ్చర్య విస్ఫురణన్ పొందన్=ఆశ్చర్యముయొక్క ఖ్యాతి పొందగా, ఘనకార్ముకవరంబున్ వంప=గొప్పదైన వింటిని ఎక్కుబెట్టగా, శరసోత్కర్ష రయప్రయుక్తిన్=బాణానుసంధాన వేగమును, పొదలన్=కలిగియుండగా, సామర్థ్య సంపద్ధురంధరుఁడు, ఆ రామవిభుండు=ఆ మనోజ్ఞకాంతిగల, జిష్ణుడు=అర్జునుడు, అత్యంతమున్ సముద్భాసిల్లెన్=ప్రకాశించెను.

తాత్పర్యం : ద్రోణాచార్యుని సంకల్పము తప్పని రీతిలో లోకులు ఆశ్చర్యము నొందునట్లు వింటినెక్కుబెట్టుట యందును, బాణప్రయోగ వేగమునందును వర్ధిల్లి సామర్థ్య సంపద గలిగిన మనోజ్ఞ కాంతిగల ఆ అర్జునుడు అత్యంతము ప్రకాశించెను.

విశేషణము : సముద్భాసిల్లె – ఆంధ్ర భాషాభూషణములో –

కం. సల్లలితైకపదముపై
నిల్లుండుట యగుటయనగ నెల్లెడ జనురా
జిల్లుట ప్రభవిల్లుట శో
భిల్లుట వర్తిల్లుటనగ బెనుపైయునికిన్

సీ. అపు డేమి చెప్ప నన్యాసాధ్యతద్ధను
ర్వార్త సర్వక్షత్రవంశ్యులందు
మిగులఁ గర్ణాసహ్యముగఁ బర్వ నతఁడు త
న్మహిమ పెంపునరాతి మత్సరవిధి
నాత్మలో సరకు సేయక సంభ్రమించె స
న్మునికృప జనకునింటను వివాహ
మగుటకు మున్ను తదంబకాశ్చర్యమం
త్రమహత్త్వకృతచండధామయుక్తి

తే. నుదయ మందినమేటియన్యుల కలఁగునె
యరయ నిట్లర్కసంతతి ఖ్యాతిమహిమ
ధాత్రిపైఁ గుంద సూతసంతానభావ
గణనఁ బ్రబలుట తత్పోషకారణమున. 33

రామా : అపుడు, ఏమి చెప్పన్=ఏమని చెప్పవచ్చును, అతడు=ఆ రామచంద్రుడు, అన్య+అసాధ్య=ఇతరుల కసాధ్యమైన, తత్+ధనుః+వార్త=ఆ వింటి ప్రయోగవార్త, సర్వక్షత్రవంశ్యులందు=సమస్తక్షత్రియకులమునందు, మిగుల, కర్ణ+అసహ్యముగ=చెవికి వినరానిదిగా, పర్వన్=వ్యాపింపగా, తత్+మహిమ పెంపు=ఆ ఆధిక్యత గౌరవము, మున్ను=మునుపు, అరాతి=శత్రులయొక్క మత్సరవిధిన్=ద్వేషమును, ఆత్మలోన్=మనసులో, సరకు+చేయక=లెక్కింపక, సత్+మునికృపన్=విశ్వామిత్రుని దయచే, జనకునింటను=జనకుని ఇంటిలో, వివాహమగుటకు=పెండ్లాడుటకు,

సంభ్రమించెన్=త్వరపడెను, తత్+అంబక=ఆ విశ్వామిత్రుని బాణములయొక్క, ఆశ్చర్య=ఆశ్చర్యకరమైన, మంత్ర మహత్త్వకృత=మంత్రములయొక్క గొప్పదనముచే, చండధామయుక్తిన్=తీవ్రమైన ప్రతాపయోగముచే, ఉదయమందిన=అభ్యుదయము పొందిన, మేటి=రాముడు, అన్యులకు=ఇతరులకు, అలగునె=లోబడునా, అరయన్=చూడగా, ఇట్లు=ఈ విధముగా, అర్కసంతతి=సూర్యవంశము యొక్క, ఖ్యాతి=కీర్తి, ధాత్రిపైన=భూమిపై, కుంద=మొల్లలయొక్కయు, సూత=పాదరసము యొక్కయు, సంతాన=కల్పవృక్షముల యొక్కయు, భా=కాంతి యొక్క, అవగణనన్=తిరస్కారము వలన, తత్+పోష కారణమున=దానిని పోషించుటచే, ప్రబలుట=వ్యాప్తి చెందెను.

తాత్పర్యం : అప్పుడు ఏమని చెప్పవచ్చును. ఆ రాముని అనన్యసాధ్యమైన ధనుర్విద్యాప్రావీణ్యము సమస్త రాజలోకమునకు సహింపరానది కాగా, ఆ రాముడు ఆ మహిమాధిక్యత వలన శత్రువుల మాత్సర్యము పెరిగినను, లెక్కింపక విశ్వామిత్రుని దయవలన జనకునింట వివాహమునకు త్వరపడెను. ఆ విశ్వామిత్రుని బాణప్రతాపాభ్యుదయముచే రఘునాధుడు ఇతరులకు లోపడునా? ఆలోచింపగా ఈ విధముగా సూర్యవంశసంతతి ఖ్యాతి భూమిపై మొల్లలు, పాదరసము, కల్పవృక్షముల కాంతిని తిరస్కరించునట్లుగా ఆ పోషణము వలన ప్రబలెను.

విశేషణము : సూత - రసస్సూతశ్చపారదే - అని అమరము.

భారత : అప్పుడేమి చెప్ప, అన్యాసాధ్య, తత్=ఆ అర్జునుని యొక్క, ధనుః+వార్త=బాణవిద్యా ప్రావీణ్యవార్త, సర్వక్షత్ర వంశ్యులందు సమస్త రాజవంశమునందును మిగుల పర్వన్=వ్యాపింపగా, కర్ణాసహ్యముగ=కర్ణునికి సహింపరానిదిగా, పర్వన్=ఉండగా, అతడు=ఆ కర్ణుడు, తత్+మహిమ పెంపున్=ఆ ధనుస్సు యొక్క ప్రావీణ్యాధిక్యమును, నర=అర్జునుని మీది, మత్సరవిధి=మచ్చర మను కార్యమును, సరకు సేయక, సంభ్రమించె, సత్+మునికృపను=దూర్వాసమహర్షి దయతో, జనకునింటను=కుంతిభోజుని ఇంటిలో, వివాహమగుటకు మున్ను=పెండ్లికి ముందు, తత్+అంబకు=అతని తల్లి కుంతికి, ఆశ్చర్యమహాత్వకృత=ఆశ్చర్యకరముగా గొప్పగా

లభించిన, చండధామయుక్తిన్=సూర్యుని యోగముచే, ఉదయమందిన=జన్మించిన, మేటి=శ్రేష్ఠుడైన కర్ణుడు, అన్యులకు, అలగునె? అర్కసంతతి=సూర్యునికి జన్మించిన, ఖ్యాతిమహిమ=కీర్తియొక్క గొప్పదనము, ధాత్రిపై=భూమిపై, కుందన్=అణగగా, తత్+పోషకారణమున=ఆసూతుడు పోషించుటచే, సూతసంతాన భావగణన=సూతుని కుమారుడను, భావన లెక్కించుట, ప్రబలుట=అధికమగుట వలన –

తాత్పర్యం : అప్పుడేమని చెప్పను. ఆ అర్జునుని యొక్క ధనుర్విద్యాప్రావీణ్యవార్త సమస్త రాజవంశమునందును మిక్కిలిగా వ్యాపించుట, కర్ణునికి సహింపరానిది కాగా, ఆ కర్ణుడు ఆ ధనుర్విద్యా ప్రావీణ్యమును, అర్జునుని మీది మచ్చరమును లెక్కసేయక త్వరపడెను. దూర్వాసమహర్షి దయవలన అతని తల్లికి ఆశ్చర్యకరముగా లభించిన మంత్రవిద్యచే సూర్యవరప్రసాదముచే జన్మించిన మేటియైన కర్ణుడు ఇతరులకు లోబడునా? సూర్యునికి జన్మించిన కీర్తి యొక్క గొప్పదనము భూమిపై అణగగా, ఆ సూతుడు పోషించుటచే సూతకుమారుడను గణన అధికమగుట వలన.

చం. అది యటు లుండెఁ గన్గొనుసమస్తజనుల్ దమలోనఫల్గును
న్మదఘనశత్రు భంగగరిమన్ గురుదక్షిణ సేసి యొప్పు శ
శ్వదనఘుఁ జారుమూర్తిమనువంశవతంసు నుతించి రిమ్మహా
భ్యుదయునిఁ గన్న నెంతలరునో జనకుం డనుచింత సంధిలన్. 34

రామా : అది+అటులుండె=అది అట్లుండగా, కన్గొను=చూచు, సమస్తజనుల్=లోకులందరు, తమలోన, అఫల్గున్=సారవంతుని, ఉన్మదఘనీ=మదించిన గొప్ప, శత్రుభంగగరిమన్=శత్రులనోడించు సామర్థ్యమును, గురుదక్షిణ+చేసి=విశ్వామిత్రునికి దక్షిణగా నిడి, ఒప్పు=ప్రకాశించు, శశ్వత్+అనఘు=మిక్కిలి గొప్పవాడైన, మనువంశవతంసు=మనువంశ శ్రేష్ఠుని, చారుమూర్తి=సుందరుడైన రాముని, ఈ+మహాభ్యుదయునిన్=ఈ గొప్ప ఉన్నత వ్యక్తిని, కన్న=చూచిన, జనకుండు=జనక మహారాజు, ఎంత+అలరునో=ఎంత సంతోషించునో, అనుచింత=అను ఆలోచన, సంధిలన్=రాగా, నుతించిరి=పొగడిరి.

తాత్పర్యం : అది అట్లుండగా, అది చూచిన సమస్తజనులు తమలో సారవంతుడు, మదించిన శత్రుల నోడించు సామర్థ్యమును విశ్వామిత్రునకు దక్షిణగానిచ్చి ప్రకాశించు మనువంశ శ్రేష్ఠుని, మహోన్నత వ్యక్తిని చూచిన జనకుడు ఎంత సంతోషించునో యను ఆలోచన రాగా పొగడిరి.

భారత : అది అటులుండె, కన్గొను=సమస్త జనుల్, తమలోన్, ఉన్మద ఘన శత్రు=గర్వపూర్ణుడైన ద్రుపదుని యొక్క, భంగగరిమన్=పరాజయమను అతిశయముచే, గురుదక్షిణ+చేసి=ద్రోణునకు దక్షిణగా సమర్పించి, ఒప్పు=ప్రకాశించు, శశ్వత్+అనఘు, చారుమూర్తిన్=సుందరుడై, మను=మనెడి, వంశవతంసున్=తన వంశములో శ్రేష్ఠుని, ఫల్గునున్=అర్జునుని, ఈ+మహాభ్యుదయుని=ఈ మహోన్నతమూర్తిని, కన్నన్=చూచినచో, జనకుండు=పాండురాజు, ఎంతలరునో, అనుచింత సంధిలన్, నుతించిరి.

తాత్పర్యం : అది అట్లుండగా, చూచెడి సమస్త ప్రజలును తమలో గర్వపూర్ణుడైన ద్రుపదుని పరాభవించిన ప్రౌఢిమను ద్రోణునకు గురుదక్షిణగా సమర్పించిన మహోన్నతవ్యక్తిని, సుందరుని, మనువంశ శ్రేష్ఠుని, అభ్యుదయము గల అర్జునుని చూచి పాండురాజు ఎంత సంతోషించునో యను ఆలోచన రాగా జనులు ఫల్గునుని ప్రశంసించిరి.

విశేషణము : అఫల్గున్ – "అసారం ఫల్గు" అని అమరము.
ద్రుపదుని పట్టి తెచ్చి అర్జునుడు గురుదక్షిణ చేసినాడని భావము.

వ. అంత. 35

సీ. తనయకలుషయత్న ఘనతరనిర్బంధ
 మున రాజు పనుచుటయును గపటధు
రావారణావతారచితాతిమంజులా
 క్షామయశోభిప్రశస్తధామ

ఘనకేళికలనుండగణ్యుఁ డాత్మస్వామి
యనియు నిజోచితియును గణించి
యురుతరాదరము నేయుచుభ్రాతృయుతముగా
నమ్మనువంశరత్నమ్ముఁ గొంచు

తే. నరిగె సపరిచ్ఛదముగ రాజాన్వయముని
తనదు సుఖదుఃఖవిరహవర్తనలు సరకు
గొనక సమవర్తితనయుండు జనకుఁ దేలు
పురమున కరాళగతివాసి సరళసరణి. 36

రామా : తన=తన యొక్క, అకలుషయత్న=ధర్మార్థ ప్రయత్నము యొక్క, ఘనతర=గొప్ప నిర్బంధమునన్=బలాత్కారముచే, రాజు=దశరధుడు, పనుచుట యును=పంపగా, కపటధుఁరా=కపట భారమును (అధర్మమును), వారణ=మాన్పించు నటువంటి, అవతార=మత్స్యాది అవతారములచే, చిత=సంపాదించిన, అతిమంజుల=మిక్కిలి సుందరమైన, అక్షామ=అధికమైన, యశః +అభిప్రశస్త=యశస్సుచే పేరు గడించిన, ధామ=మహిమచే, ఘనకేళికలనుండు= గొప్ప క్రీడావిధిగలవాడు, అగణ్యుడు=అమేయుడు, ఆత్మస్వామి=పరబ్రహ్మమైనవాడు, అనియు, నిజ+ఉచితియును=తమ ఔచిత్యము, గణించి=లెక్కించి, ఉరుతర+ ఆదరము+ చేయుచు=మిక్కిలి గౌరవించుచు, భ్రాతృయుతముగా= లక్ష్మణసహితముగా, ఆ+మనువంశరత్నమున్=ఆ మనువంశ శ్రేష్ఠుడైన రాముని, రాజ+అన్వయముని= విశ్వామిత్రుని, సపరిచ్ఛదమునన్=తన పరివారముతోగూడ, కొంచున్+అరిగెన్= తోడ్కొని పోయెను, తనదు=తన యొక్క, సుఖదుఃఖ విరహవర్తనలు=సుఖదుఃఖముల భేద భావములను, సరకుగొనక=లెక్కింపక, సమవర్తితన=సమాన భావముతో, ఉండు, జనకుడు+ఏలు=జనకుడు పరిపాలించు, పురమునకున్=మిధిలానగరమునకు, అరాళగతివాసి=వక్రమార్గమును వదలి, సరళ సరణిన్=చక్కని మార్గములో – అరిగెను.

తాత్పర్యము : తన ధర్మార్థ ప్రయత్నము యొక్క బలాత్కారముచే దశరథుడు పంపగా అధర్మమును మాన్పునటువంటి మత్స్యాది అవతారములచే సంపాదించబడిన సుందరము, అధికమునయిన కీర్తి మహిమను క్రీడావిధిగాగల అమేయుడైన పరబ్రహ్మమగు రాముని లక్ష్మణసహితముగా తన ఔచిత్యమును పూని గౌరవ భావముతో (ఆ మనువంశరత్నమును) విశ్వామిత్రుడు జనకుడు పరిపాలించు మిథిలానగరమునకు వక్రమార్గమునగాక, సరళమైన దారిలో – అరిగెను.

భారత : తనయ=కుమారుడైన దుర్యోధనుని, కలుష యత్నము=పాపకార్యము కొఱకు, ఘనతర నిర్బంధమున=గొప్పగా బంధించుటకు, రాజు=ధృతరాష్ట్రుడు, కపటధురా=కపటభారముచే, వారణావత=వారణావతపురమందు, ఆరచిత= నిర్మించిన, అతిమంజు=మిక్కిలి మనోహరమైన, లాక్షామయశోభిత=లక్కతో నిర్మితమై శోభిల్లు, ప్రశస్తధామ=యోగ్యములైన గృహములందు, ఘనకేళికలన్=అధిక వినోదములచే, ఉండన్=ఉండు కొఱకు, పనుచుటయును=పంపగా, గణ్యుడు= ఆదరణీయుడైన, ఆత్మస్వామి=తనకు కర్తయైన ధృతరాష్ట్రుడు అనియు, నిజోచితియున్=ధార్మికుడైన తనకు ఉచితమైన మాటగా, గణించి=భావించి, ఉరుతర+ఆదరము+చేయుచు=మిక్కిలి ఆదరభావముతో, భ్రాతృయుతముగా= సోదరులైన భీమార్జున నకులసహదేవులతోకూడి, వంశరత్నమ్ము=వంశమునకు రత్నమువంటి, అమ్మను=తల్లి కుంతీదేవిని, కొంచు=తోడ్కొని, రాజాన్వయముని= రాజర్షియైన, సమవర్తి తనయుండు=యముని కుమారుడైన ధర్మరాజు, సపరిచ్ఛదము=సపరివారముగా, జనకు డేలుపురమునకున్=పాండురాజు పాలించిన వారణావత పట్టణమునకు, అరాళగతివాసి=విచారింపక, సరళసరణిన్= ఋజుమార్గమున, అరిగెన్=వెళ్లెను.

తాత్పర్యం : దుర్యోధనుని పాపకార్యము కొఱకు గొప్ప నిర్బంధముచే ధృతరాష్ట్రుడు కపట భారముతో వారణావతమందు మనోహరముగా లక్కతో నిర్మించి శోభిల్లు ప్రశస్తములైన గృహములందు వినోద క్రీడలచే నుండుట కొఱకు పంపెను. ధృతరాష్ట్రుడు ఆదరణీయుడగుటచే ధార్మికుడైన తనకు అది ఉచితముగా భావించెను.

భీమార్జున నకులసహదేవ సహితముగా వంశరత్నమైన తల్లిని తోడ్కొని రాజర్షియైన ధర్మజుడు విచారించక పాండురాజు పాలించిన వారణావతమునకు బుజుమార్గమున వెళ్లెను.

విశేషణము : లాక్షామయ – ప్రాచుర్యార్థమున 'మయట్' ప్రత్యయము వచ్చినది.

తే. పరమమునియతివశతమన్యురతిహేతు
వున మహాశాపహతిఁ జేసి తనువికృతిగ
నున్న నేల యంత వచింపనొగి నరు దని
తత్కథల్ రుచిగొనుచురాట్తనయులందు. 37

రామా : పరమముని=గౌతముని యొక్క, అతివ=భార్యయైన అహల్య, శతమన్యు=ఇంద్రుని యొక్క, రతిహేతువున=రతి కారణముగా, మహాశాపహతిన్+చేసి=గొప్ప శాపకారణముగా, తను వికృతిగన్+ఉన్న=దేహ వికారముతో నుండగా, నేల=భూమి; అంతవచింపన్=అంతట చెప్పగా, బగిన్+అరుదని=మిక్కిలి అరుదని తత్+కథల్=ఆ గాథలు, రుచిగొనుచు=ఆసక్తిగా వినుచు, రాట్+తనయులు=రాజకుమారులు, అందు.

తాత్పర్యము : గౌతమ మహర్షి భార్య అహల్య ఇంద్రునితో రతి కారణముగా శాపమును పొందిన కారణముగా శరీరవికారమును పొంది నేలపై నుండుటను చెప్పగా, అది మిక్కిలి అరుదని యాగాథలు ఆసక్తిగా వినుచు రాకుమారులు అందు...

భారత : నియతివశత=దైవాధీనముచే, పరమము=దాటరానిదనుట, మన్యు=శోకమును, రతి=వేడుకయనెడి, హేతువునన్=కారణముచే, మహాశ+ఉన్నన్=పేరాశయొక్క, అపహతిన్+చేసి=వ్యర్థము చేసియుండియు, తనువికృతిగన్=దేహము వివర్ణముగా నున్నను, ఏల=ఏమిటని, అంత వచింపన్= అంతగా చెప్పుటకు, బడిన్+అరుదని=గొప్ప ఆశ్చర్యమని, తత్కథల్=ఆ ధర్మరాజు కథలను, రుచిగొనుచు= ఆదరింపుచు, రాట్+తనయులు=రాకుమారులు, అందు=ముందు పద్యముతో అన్వయము.

తాత్పర్యము : దైవాధీనము దాటరానిదగుటచే శోకము, వేడుక అను కారణముచే పేరాసను వ్యర్థము చేసి దేహవైవర్ణ్యమున్నను అంతగా చెప్పుటకు అరుదని ఆ ధర్మరాజు కథలను ఆదరింపుచు రాకుమారులు అందు అరిగిరి.

విశేషణము : లక్క యిల్లు వివర్ణముగా నున్న ఆశ్చర్యముతో నుండిరి.

సీ. ఆలీల నలరుచు నరుగునప్పుడు తత్పు
రస్ఫూర్తి మిగులఁ జిత్రం బొనర్చె
రమణీయ మైనయారామపాదపరాగ
మాశాపవారణ మాచరింప
నాయతివసుశోభ నాకృతియును సర
సీకృతమానసహ్రీకలనయు
ఘననవరత్నకాంచనధామశోభన
వన్యాభరణ వైభవస్ఫురితయు

ఆ. విపులతరపయోధరపదవ్యతిక్రమ
కరనవాంశు కాంతవరణనిరతి
శయసమున్నతియును నయి వారలందఱు
గౌరవమునఁ దన్నుఁ గనుఁగొనంగ 38

రామా : ఆలీలన్=ఆ విధముగా, అలరుచు=ప్రకాశించుచు, అరుగునపుడు= వెళ్లునపుడు, తత్=వారి యొక్క పురః=ముందట, స్ఫూర్తిమిగుల=మిక్కిలి ప్రకాశముతో, చిత్రంబు+ఒనర్చె=ఆశ్చర్యమును కలిగించెను, రమణీయమైన= మనోహరమైన, ఆరామపాదసరాగము=ఆ రాముని కాలి ధూళి, ఆశాపవారణము=ఆ శాప విమోచనము, అచరింపన్=కల్గింపగా, ఆ+అతివ=ఆ అహల్య, సుశోభవ+ ఆకృతియును=అందమైన ఆకారమును, సరసీకృత=అందముగా, మానస హ్రీకలనయు=మనసులో లజ్జగలదియు, ఘననవరత్న=గొప్ప నవరత్నములతో, కాంచనధామ=బంగారు కాంతి వంటి కాంతిగలది, శోభన=అందమైన, వన్య+ఆభరణ

వైభవస్ఫురితము=నారచీరలు మొదలైన ఆభరణములతో వెలుగొందు, విపులతర=విశాలమైన, పయోధర=స్తనము, పదవ్యతిక్రమకర=మది నుండి జారుతున్న, నవ=మనోహరమైన, అంశుకాంత=పైట యొక్క, వరణ=కప్పుటయందు, నిరతి=ఆసక్తిగల, శయ=హస్తముల యొక్క, సమున్నతియును= ఉపచారము గలదియు, అయి, వారలందరు, గౌరవమున్, తన్ను=అహల్యను, కనుగొనంగ= చూడగా.

తాత్పర్యము : ఆ విధముగా ప్రకాశించుచు వెళ్లునపుడు వారిముందట మిక్కిలి ప్రకాశము ఆశ్చర్యము కలిగించెను. మనోహరమైన ఆరామ పాదధూళి ఆ శాప విమోచనము కలిగింపగా ఆ అహల్య అందమైన ఆకారముతో అందముగా మనసులో లజ్జగలదియు, నవరత్నములతో బంగారు కాంతివంటి కాంతిగలిగి, అందమైన నారచీరలు మొదలైన ఆభరణములతో వెలుగొందుచు, విశాలమైన స్తనముల మీది నుండి జారు పైటను చేతులతో కప్పుకొనుచు వారలందరు గౌరవముగా తనను (అహల్యను) చూడగా –

విశేషణము : వైభవస్ఫురిత – సరసిజమనువిద్ధం – అని కాళిదాసు శాకుంతలములో చెప్పినాడు.

శయ – పంచశాఖశ్శయః పాణీః అని అమరము.

భారత : ఆలీలన్, అలరుచు, అరుగునప్పుడు=వికారరహితుడై వెళ్లునపుడు తత్+పుర=ఆ వారణావతముయొక్క, స్ఫూర్తి=వైభవము, మిగులన్=మిక్కిలి, చిత్రం బొనర్చి=ఆశ్చర్యకరమాయెను, రమణీయ=అందమైన, ఆరామ=ఉద్యానవనము లందున్న, పాదప=వృక్షములయొక్క, రాగము=వర్ణము, ఆశా=దిక్కులందు, అపవారణము=ఆచ్ఛాదనమును, ఆచరింపన్=కలిగింపగా, ఆయతి=తర్వాతి కాలములో రాబోవు ఫలము, వసుశోభనాకృతియు=భూమియందలి శోభయు, సరసీకృత=సరస్సులచే, మానస=మానససరస్సు యొక్క, హ్రీకలనన్=లజ్జా స్థితిగలదియు, ఘననవరత్నకాంచన=గొప్ప నవరత్నములు, బంగారు, ధామ=గృహము యొక్క, శోభన్=శృంగారముచే, అవని=భూమికి, ఆభరణవైభవస్ఫురితయు=

ఆభరణములవంటి వైభవమును కల్గించుచు, విపులతర=విశాలమైన, పయోధర పదవీ=మేఘమార్గము యొక్క, అతిక్రమమును=విస్తరించుటను, కర=చేయుచున్న, నవాంశ=నవాంశువులచే, కాంత=మనోహరమైన, వరణ=కోట యొక్క, నిరతిశయ=అతిశయించిన, సమున్నతియు=ఔన్నత్యముగలదియు, అయి, వారలందఱు, గౌరవమున, తన్ను=ఆ నగరమును, కనుగొనంగా –

తాత్పర్యము : ఆ విధముగా అలరారుచు వికారరహితుడై వెళ్లునపుడు (ధర్మజుడు) ఆవారణావతపురముయొక్క వైభవము మిక్కిలి ఆశ్చర్యకరమాయెను. అందమైన ఉద్యానవనములందున్న వృక్షముల వర్ణము దిక్కులందు ఆచ్ఛాదనమును కలిగింపగా, తర్వాతి కాలములో రాబోవు ఫలము భూమియందలి శోభయు, సరస్సులచే మానస సరస్సు లజ్జాస్థితిగలది కాగా, నవరత్నములు, బంగారుతో నిర్మించిన గృహము యొక్క శృంగారముచే, భూమికి ఆభరణముల వంటి వైభవమును కలిగించుచు విశాలమైన మేఘమార్గము యొక్క విస్తారముచే కప్పబడిన మనోహరమైన కోట యొక్క అతిశయించిన ఔన్నత్యముగల ఆ పురమును వారలందరు గౌరవముతో కనుగొనగా –

విశేషణము : అపవారం – అంతరపవారణమని అమరము.

తే॥ హరిపురాభోగవార్త పెంపపుడు వారి
మదిఁ బొడమఁ దలపోసి రట్టిది యటంచుఁ
జెలువసంకోచవిభవవైచిత్రిఁ బరఁగఁ
బరఁగు నానగరంబు గన్పట్టఁ జూచి 39

రామా : హరి=ఇంద్రుని యొక్క, పురాభోగ=పూర్వపు సంభోగము యొక్క, వార్త పెంపు=వార్త వ్యాపించుట వలన, అపుడు, వారి మదిన్+పొడమ=వారి మనస్సులో కలుగగా, రట్టు=పరపురుషసంభోగముతో కూడిన దూఱు, ఇది+అటంచు=ఇది యని, తలపోసిరి, చెలువ=అహల్య, సంకోచవిభవ=మిక్కిలి జంకుతో, వైచిత్రిన్=వింతగా, పరగపరగు=ప్రవర్తిల్లు, అనన్=ఆజ్ఞను, కరంబు=మిక్కిలి,

కన్పట్ట=కనపడగా, చూచి.

తాత్పర్యము : ఇంద్రునితో పూర్వపు సంభోగము వార్త వ్యాపించుట రామాదుల మనస్సులో పరపురుష సంభోగము వలన దూఱు - ఇది అని తోచగా, అహల్య మిక్కిలి జంకుచేనైన వింతరీతిలో ప్రవర్తిల్లు ఆజ్ఞ కన్పట్టగా చూచి -

(నుతి చేసిరని ముందరి పద్యముతో అన్వయము)

భారత : ఆ నగరంబు (వారణావతము), చెలువు=కాంతి, పరగన్, హరిపుర=అమరావతి యొక్క, ఆభోగ=విరివి యొక్క, వార్త పెంపు=వార్త యొక్క వ్యాప్తి అపుడు వారి (పాండవుల) మదిబొడమ, సంకోచ విభవవైచిత్రి పరగ పరగ=సిగ్గుతో నుండు రీతి కన్పట్టగా, చూచి.

తాత్పర్యము : వారణావతము యొక్క చెలువు అమరావతి వైభవమును మించు వార్తా వ్యాప్తి పాండవుల మనస్సులో కలిగి సిగ్గుతో నుండురీతి కన్పట్టగా చూచి -

విశేషణము : సదృశాదృష్ట చింతాద్యాః స్మృతి బీజస్యబోధకాః - అను న్యాయము.

తే॥ అనిశశివవాసమైన పుణ్యపురమణివ
ఘాపహస్మృతి వనుచు నాయపకలంక
మానసోత్కర్షయుక్తులనూననుతులు
సేసి యందఱు తత్పురస్థితినిఁ బరఁగ 40

రామా : అనిశ=నిరంతరము, శివవాసమైన=శుభప్రదమైన, పుణ్యపురమణివి=పుణ్యస్త్రీవి, అఘ+అపహస్మృతివి=పాపమునశించిన స్మరణగలదానవు, అనుచు, ఆయప=ఆమెయొక్క, కలంక=బాధ, మానన్=మానునట్లుగా, సోత్కర్షయుక్తులు=ప్రశంసలు, ఊనన్=మనస్సున స్థిరమగునట్లు, నుతులు+చేసి=ప్రస్తుతించి, అందఱు, తత్=అహల్య యొక్క, పురఃస్థితిన్=ముందర, పరగన్=ఉండగా

తాత్పర్యము : నిరంతరము శుభప్రదమైన పుణ్యాంగనవు=పాపము నశించిన స్మరణగల దానవునని ఆమె బాధ మానునట్లుగా ప్రశంసలు ఆమె మనస్సులో నిలుచునట్లు ప్రస్తుతించి అందరు అహల్య ముందటనుండగా.

విశేషణము : అహల్యా ద్రౌపదీ సీతా- అని సృతి - పంచకన్యలలోనొకతె.

భారత : అనిశ=నిరంతరము, శివవాసమైన=రుద్రనివాసమైన, పుణ్యపురమణిని, అఘాపహస్మృతివి=పాపము నశింపజేయుదానివి, అనుచున్, అపకలంక= నిష్కళంకమైన, మానసోత్కర్ష=హృదయముయొక్క ఆనందముతో, యుక్తులు=కూడిన పాండవులు, అనూననుతులు=అధిక స్తోత్రములను జేసి, అందరు, తత్పురస్థితిన్ పరగ=ఆ పట్టణమున నుండగా.

తాత్పర్యము : నిరంతరము రుద్రనివాసమైన పుణ్య ప్రదేశమవు, పాపనాశనము చేయుదానివి-అని పలుకుచు నిష్కళంక హృదయముతో అధిక స్తోత్రములు చేయుచు ఆ నగరమున నుండగా.

కం॥ చనునెడ శ్రీరాముఁడు పా
వనినవనిజరూపవైభవశ్రీ నుల్లం
బున నిడి దానవిచిత్రా
తనురాగప్రౌఢి వచ్చి తనుఁ బైకొనఁగన్ 41

రామా : చనునెడ=వెళ్లునపుడు, శ్రీరాముడు, పావనిన్=పవిత్రమైన దానిని, అవనిజ=సీతయొక్క, రూపవైభవశ్రీని=అందాల సంపదను, ఉల్లంబునన్+ ఇడి=మనస్సులో నుంచుకొని, దానన్=అందువలన, విచిత్ర=విచిత్రమైన, అతనురాగప్రౌఢి=మన్మధుని వలన కలిగిన మోహాతిశయము, వచ్చి, తానున్=తనను పైకొనగన్=ఆక్రమించగా-అనుమతించెనని పైపద్యము.

తాత్పర్యము : వెళ్లునపుడు శ్రీరాముడు పవిత్రమైన సీత యొక్క రూపసంపదను మనస్సులో నుంచుకొని, దానివలన విచిత్రమైన మన్మధమోహాతిశయము వచ్చి తనను పైకొనగా.

భారత : చనునెడ=వెళ్లునపుడు, శ్రీరాముడు=కాంతిచే నొప్పువాడు, పావని=భీముడు, నవ=కొత్తదైన, నిజ=స్వకీయమైన, రూపవైభవశ్రీని, ఉల్లంబుననిడి, చిత్ర అతనురాగప్రౌఢి=చిత్రమైన మన్మథావేశముతో, దానవి=హిడింబి, వచ్చి, తనున్+పైకొనగన్=తనను పొడవగా.

తాత్పర్యము : వెళ్లునపుడు కాంతివంతుడైన భీముడు కొత్తదైన తన రూపసంపదను మనస్సులోనిడి చిత్రమైన మన్మథవైభవముతో హిడింబి తనను పొడవగా -

సీ. ఆసమయమున నే మని చెప్ప నరుదెంచి
చూడ నద్భుతతమస్ఫూర్తి యగుచుఁ
దద్జ్ఞాతియమితచేతఃకళంకుండు త
ద్గృహమేధితద్వేషమహిమ పేర్మి
ననలసముద్వృత్తిహరము గావింపంగ
నంచితానఘవిధిసంచితార్థ
సందర్శనుఁడు గామినిందనపెం పెల
ర్పంగఁ జేకొనియె నారాకొమరులు

తే. నతనియాదరక్రియ గాంచి యవలఁ జనిరి
స్వీయగురుయుక్తముగఁ దద్విసృష్టు లగుచు
విదురజనదర్శితోచితవివరసరణి
నలఁత యెఱుఁగక దక్షిణానిలజధృతిని 42

రామా : ఆ సమయమునన్=అప్పుడు, ఏమని చెప్ప, అరుదెంచి చూడన్=వచ్చి చూడగా, తత్=ఆ శాపవిమోచన విధమును, జ్ఞ=ఎరిగినవాడై, తత్+గృహమేధి=ఆ యింటి యజమానియైన గౌతముడు, చూడన్=చూచుటకు, అద్భుతతమ స్ఫూర్తియగుచు=చూడరాని తేజస్సు గలవాడగుచు, అమిత=మిక్కిలి, చేతః కళంకుడు=మనస్సులో కలత గలవాడు, అనలస=అధికమైన, ముత్=సంతోషము యొక్క, వృత్తి=కార్యమును, తత్=అహల్యయందుగల, ద్వేషమహిమపేర్మి=

ద్వేషభావము యొక్క ఆధిక్యమును, హరము గావింపంగ=నశింపజేయుటకు, అంచిత=పూజితమైన, అనఘవిధిన్=పాపరహితవిధానముచే, సంచిత= సంపాదింప బడిన, అర్థసందర్శనుడు=తత్వజ్ఞానముగలవాడు, కామినిన్=అహల్యను, తనపెంపు=తన ప్రేమ, ఎలర్పంగ+చేకొనియెను=అతిశయింపగా స్వీకరించెను, ఆ రాకుమారులు=ఆ రామలక్ష్మణులు, అతని=గౌతముని, ఆదరక్రియన్+ కాంచి=ఆదరణను స్వీకరించి, అవలన్=తర్వాత, స్వీయగురుయుక్తముగన్=తమ గురువైన విశ్వామిత్రునితో, తత్=ఆ గౌతమునిచే, విస్పష్టులగుచు=వీడ్కోలు చెప్పబడినవారై, దక్షిణ+అనిల=మలయ మారుతమువలన, జ=పుట్టిన, ధృతిన్= సంతోషముతో, అలంత+ఎఱుగక=అలసట తెలియని రీతిలో, విదురజన=దారి చూపు నెళవరులచే, దర్శిత=చూపబడిన, ఉచిత=సరియైన, వి=విశేషమైన, వరసరణిన్=త్రోవయందు, చనిరి=వెళ్లిరి.

తాత్పర్యము : ఆ సమయమున ఏమని చెప్పవలెను. వచ్చి చూడగా ఆ శాప విమోచన విధానమును ఎరిగిన గౌతముడు చూచుటకు అందని తేజస్సుగలవాడాయెను. తన మనస్సులో కలతలను సంతోష కార్యముద్వారా అహల్యపైగల ద్వేషభావాధిక్యతను నశింపజేయుటకు పూజితమైన పాపరహిత విధానముచే సంపాదింపబడిన తత్వజ్ఞానముగలవాడై అహల్యను ప్రేమాతిశయముతో స్వీకరించెను. ఆ రామలక్ష్మణులు గౌతముని ఆదర సత్కారములు స్వీకరించిన తర్వాత విశ్వామిత్రునితో గూడి గౌతమునిచే వీడ్కోలు నంది మలయమారుతము వలన పుట్టిన సంతోషముతో అలసట తెలియని రీతిలో దారి చూపువారు చెప్పిన సరియైన మంచి త్రోవ యందు వెళ్లిరి.

విశేషణము : అర్థ సందర్శనుడు – దర్శనం నయన స్వప్న బుద్ధి నర్త్రోపలబ్ధిషు – అని

విశేషణము – అర్థోభిధేయరై వస్తు ప్రయోజన నివృత్తిషు – అని అమరము.

భారత : ఆ సమయమున, ఏమని చెప్ప, ఎంచి చూడన్+అరుదు=ఆలోచించి చూడగా అరుదైన విషయము – అని కవి చెప్పిన విశేషము, అద్భుత తమ స్ఫూర్తియగుచు, అమిత చేతః కళంకుడు=మిక్కిలిగా మనస్సులో కళంకముగలవాడు,

తత్=ఆ ధర్మజుని యొక్క జ్ఞాతి=జాతియైన దుర్యోధనుడు, తత్=ఆ ధర్మజుని యొక్క గృహ=గృహమును, ఏధిత=వృద్ధి బొందిన, ద్వేషమహిమపేర్మి=అసూయ యొక్క ఆధిక్యముచే, అనలసముద్యుతి=అగ్నిని దరికొల్పుటచే, హితము గావింపంగన్= చంపుట కొఱకై, అంచి=ఒక మనుష్యుని బంపి, తాను=దుర్యోధనుడు, అఘవిధిన్= పాపకార్యముచే (ఆ గృహదాహ విధిచే) సంచిత=సంపాదింపబడిన, అర్థసందర్శనుండు=ప్రయోజనప్రాప్తిగలవాడు, కామిన్=కాకుండుటచే, నిందన= అపకీర్తిచే, పెంపు+ఎలర్పంగ+చేకొనియె=అతిశయించగా స్వీకరించెను, ఆ రాకొమరులు=ఆ పాండవులు, తత్+విసృష్టులగుచు=ఆ అగ్ని భయము నుండి విడువబడినవారై, విదుర=విదురుని యొక్క, జన=దూత చేత, దర్శిత=చూపబడిన, వివరసరణిన్= బిలమార్గములో, దక్షిణ=సమర్థుడైన, అనిలజ=భీముని యొక్క, ధృతిని=ధైర్యముతో, అతని=దుర్యోధనుని, ఆ=ఆ, దరక్రియ=భయమును, కాంచి=గ్రహించి, స్వీయగురుయుక్తముగ=తమ తల్లితో, అలంత ఎఱుగక, అవల= ముందుకు, చనిరి.

తాత్పర్యము : ఆ సమయమున ఏమని చెప్ప? ఆలోచించి చూడగా అరుదైన విషయము. అద్భుతమైన స్ఫూర్తిలో మనసులో అధికమైన పాపముగల ఆ దుర్యోధనుడు ధర్మజుని యొక్క గృహమును, వృద్ధిబొందిన అసూయ యొక్క ఆధిక్యముచే అగ్నిని దరికొల్పి వారిని చంపుటకు ఒక మనుష్యుని పంపి, దుర్యోధనుడు పాపకార్యముచే (గృహమును దహింపజేసిన) సంపాదించబడిన ప్రయోజనము గలవాడై, అపకీర్తిని అతిశయముగా పొందెను. పాండవులు ఆ అగ్నిభయమునుండి విడువబడినవారై విదురుని యొక్క దూతచే చూపబడిన బిలమార్గములో సమర్థుడైన భీముని ధైర్యము సహకరింపగా దుర్యోధనుని వలన ఆ భయము నూహించి తల్లితోకూడి అలసట తెలియని రీతిలో ముందుకు వెళ్లిరి.

ఆ. తొడఁగి యపుడు దాని తోఁబుట్టుగురుతర
సంగరసముదీర్ణసరణిఁ బరఁగ
వాని నంత గెలిచి స్వగురుకథాదర
మమరఁ బ్రమదయుక్తి కనుమతించె 43

రామా : తొడఁగి=పూని, అపుడు, దానితోఁబుట్టు=రాగప్రౌఢితో పుట్టునట్టి గురుతర=గొప్పవైన, సంగరసము=ఆపేక్ష, ఉదీర్ణసరణిన్+పరగన్=అతిశయించగా, వానిన్=ఆ మన్మథవాంఛలను, అంతన్ గెలిచి=అప్పుడే జయించి, స్వగురుకథా=విశ్వామిత్రుని గంగాసంభవాది కథలయందలి, ఆదరము=ప్రేమ, అమరన్=కలుగగా, ప్రమదయుక్తికి=సంతోషముతో కూడుటకు అనుమతించె= అనుమతించెను.

తాత్పర్యము : అప్పుడు ప్రయత్నపూర్వకముగా రాగప్రౌఢితో పుట్టిన గొప్పదైన ఆపేక్ష అతిశయించగా ఆ మన్మథవాంఛలను అప్పుడే అణచి విశ్వామిత్రుని గంగావతరణాది కథలయందు ప్రేమ కలుగగా సంతోషముతో ననుమతించెను.

భారత : తొడగి, అపుడు, దాని తోఁబుట్టుగు=దాని సోదరుడైన హిడింబుడు, ఉరుతర=గొప్పదైన, సంగర=యుద్ధమున, సముదీర్ణసరణిన్+పరగ=అతిశయముగా గెలిచి, స్వగురుకథా=తన పెద్దలైన కుంతి ధర్మజుల మాటపై, ప్రమదయుక్తికి=హిడింబా సంయోగమునకు – అనుమతించె.

తాత్పర్యము : ప్రయత్న పూర్వకముగా అపుడు దాని సోదరుడైన హిడింబుని ఘోరయుద్ధములో అతిశయముగా గెలిచి తన పెద్దలైన కుంతి, ధర్మజుల మాటపై హిడింబి సంయోగమునకు అంగీకరించెను.

వ. అంత 44

తే. ఉరుగుణాద్భుతజనకసుతోదయమహి
మాతిశయము సాధించి పుణ్యజనకాంత
సుగుణ యనిపించుకొనిన భాసురపురమణిఁ
జూపుతగులు వహించె నుత్సుకత నతఁడు 45

రామా : ఉరుగుణ+అద్భుత=గొప్ప గుణములచే ఆశ్చర్యకరుడైన, జనకసుతా=జనకుని కుమార్తెయైన సీత యొక్క, ఉదయ=పుట్టుకచేనైన, మహిమ+అతిశయము=గొప్పదనమును, సాధించి, పుణ్యజన=సుజనులచే, కాంత=మనోహరమైన, సుగుణ+అనిపించుకొనిన=సుగుణఖని అనిపించుకొనిన,

భాసురపురమణిన్=పురశ్రేష్ఠమైన మిథిలయందు, అతడు=రాముడు ఉత్సుకతన=సంతోషముగా, చూపు తగులు వహించె=దృష్టి సారించెను.

తాత్పర్యము : గొప్ప గుణములచే ఆశ్చర్యకరుడైన జనకుని కూతురైన సీత పుట్టుకచే గొప్పతనమును సాధించి సుజనులచే మనోహర సుగుణఖని అనిపించుకొనిన పురశ్రేష్ఠమైన మిథిలయందు సంతోషముగా రాముడు దృష్టి సారించెను.

(మిథిలకు ప్రయాణము సమకట్టెను)

భారత : ఉరుగుణ=గొప్ప గుణములు గల, అద్భుతజనక=ఆశ్చర్యకర జనకుడైన (భీముని వలన) సుత=ఘటోత్కచుని, ఉదయ మహిమాతిశయము=జనన విశేషమును సాధించి, పుణ్యజనకాంత=రాక్షసస్త్రీ హిడింబి, సుగుణ+అనిపించు కొనినన్=మంచి గుణములు కలదని పేరు తెచ్చుకొనగా, అతడు=భీముడు, భాసురపు=అందమైన, రమణిన్=హిడింబయందు, ఉత్సుకతన్=సంతోషముగా, చూపుతగులు=అనురాగమును, వహించె=నిలిపెను.

తాత్పర్యము : గొప్ప గుణములతో ఆశ్చర్యకరమగు జనకుడైన భీముని వలన పుత్రుడు (ఘటోత్కచుడు) కలుగుటను సాధించి రాక్షసస్త్రీ అయిన హిడింబ మంచి గుణములు కలదని పేరు తెచ్చుకొనగా భీముడు అందమైన ఆ హిడింబయందు సంతోషముగా అనురాగమును నిలిపెను.

విశేషణము : పుణ్యజన - యాతుధానః పుణ్యజనః అని అమరము.

ఉ. అన్న గరంబు ప్రోది దనరారఁగఁ దమ్ములఁ గన్నతల్లి నా
సన్నుతఖేలనుండు వికసన్నయనైకవిలాసగౌరవా
భ్యున్నతిఁ దద్వనాంతమునఁ బ్రోచెఁ గడుం దనశ్రాంతి యాత్మలో
నన్నెఱయంగణింపఁడు మనస్థిరతన్ వివరించుపూనికన్ 46

రామా : ఆ+నగరంబు=ఆ మిథిలాపురము, ప్రోదిన్+తనరారఁగన్=సౌభాగ్యముతో అలరారగ, తమ్ములన్+కన్నతల్లినాన్=పద్మముల కుత్పత్తి స్థానము అనగా, సన్నుత=వర్ణించబడిన, ఖేలన్=లీలతో, ఉండు=ఉండెడి, వికసత్+నయన=

తెలికన్నుల యొక్క, ఏక=ముఖ్యమైన, విలాసగౌరవ=శృంగారాతిశయము యొక్క అభ్యున్నతిన్=అతిశయముచే, తత్+వన+అంతమునన్=ఆ పట్టణము యొక్క ఉద్యానవనమునందు, ప్రోచె=కటాక్షించెను, కడున్=మిక్కిలి, తనశ్రాంతిన్=తన కష్టమును, మనః+స్థిరతన్విన్=మనస్సున లగ్నమైన స్త్రీయగు సీతను, వరించు పూనికన్=వివాహమను సంకల్పముతో, ఆత్మలో=మనస్సులో, ఎఱయన్+ గణింపడు=అధికముగా లెక్కింపడు.

తాత్పర్యము : ఆ మిథిలా నగరము సౌభాగ్యముతో నలరారగా పద్మముల కుత్పత్తి స్థానముగా ప్రశంసించబడు తెలికన్నుల శృంగారాతిశయము యొక్క అతిశయముగల ఆ పట్టణపు ఉద్యానవనమును కటాక్షించెను. మిక్కిలియైన తన శ్రమను మనస్సులో సీతపై లగ్నమైన వివాహసంకల్పముతో ఏవిధమైన శ్రమను అధికముగా లెక్కింపడు.

భారత : అన్న=ధర్మరాజు, కరంబు=మిక్కిలి, తమ్ములన్=తమ్ములను, కన్నతల్లిన్=కుంతిని, ఆ సన్నుతఖేలనుండు=భీముడు, ప్రోది తనరారగన్=ప్రేమ అతిశయింపగా, వికసత్=వికసించిన, నయ=నీతియొక్క, నైక=ఆధిక్యముచే, విలాసగౌరవ+అభ్యున్నతిన్=విలాసమైన గౌరవాతిశయముచే, తత్+వనాంతమునన్= ఆ అరణ్యమునందు, ప్రోచె=రక్షించెను, ఆత్మలోనన్=మనసులో, తనశ్రాంతి=తన కష్టమును, మనఃస్థిరతన్=మానసికబలముతో, వివరించు పూనికన్=వివరించు సంకల్పముతో, నెఱయన్, గణింపడు.

తాత్పర్యము : ఆ భీముడు ధర్మరాజును మిక్కిలిగా తమ్ములను, కుంతిని ప్రేమాతిశయము వికసింపగా నీతివంతముగా విలాసగౌరవాతిశయముచే అరణ్యమునందు రక్షించెను. మనసులో తాను పడిన శ్రమను తన మానసిక బలముతో వివరించు సంకల్పబలముతో లెక్కింపడాయెను.

వ. అది య ట్లుండె వారలందఱు తత్ప్రకారంబున విపినమార్గ
వర్తనంబునడపి యథోచితగమనంబున 47

రామ, భారతములకు సమము.

అర్థము : అది+అట్లుండె=అది అట్లుండగా, వారలందరు=(రామలక్ష్మణ విశ్వామిత్రులు) పాండు తనయులు, కుంతి) తత్+ప్రకారంబున్=ఆ విధముగా, విపినమార్గ వర్తనంబు=అరణ్య మార్గసంచారమును, నడిపి, యధా+ఉచిత గమనంబున్=తమకు తోచిన విధముగా.

తాత్పర్యం : అది అట్లుండగా వారలందరు ఆ విధముగా అరణ్యమార్గ సంచారము తమకు తోచిన విధముగా -

కం. చనిరి పురసవిధి మార్గం
బున సద్ద్విజలీలలు నడపుచు మాధుకరా
శన మొనఁగూర్చుచు నపుడుప
వనసంతతి యలరఁ జేసె వారలయాత్మన్ 48

రామా : పుర=మిధిలానగరమునకు, సవిధి=సమీపమైన, మార్గంబున= దారిలో, చనిరి=వెళ్లిరి, అపుడు, సత్=లెస్సయయిన, ద్విజ=పక్షుల యొక్క లీలలు=విలాసములు, నడుపుచున్=నడుపుచు, మాధుకర=తుమ్మెదల సంబంధమైన, అశనము=పూదేనె, ఒనగూర్చుచు=అందముతో, ఉపవనసంతతి=ఉద్యానవన పరంపర, వారల=రామాదులయొక్క, ఆత్మన్=మనసును, అలరన్+చేసె= సంతోషింపజేసెను.

తాత్పర్యము : మిధిలానగరమునకు సమీప దారిలో వారు వెళ్లిరి. అప్పుడు లెస్స అయిన పక్షులలీలలు, పూదేనెల అందముతో ఉద్యానవన పరంపర రామాదుల యొక్క మనస్సును సంతోషపరచెను.

భారత : పుర=ఏకచక్రపురములో, సవిధ=మంచి పద్ధతిలో నడచు, మార్గంబున=దారిలో, సత్+ద్విజలీలలు=మంచి బ్రాహ్మణ విశేషములను నడపుచు, మాధుకర+అశనము=భిక్షావృత్తిలో స్వీకరించిన అన్నమును, ఒనగూర్చుచు= స్వీకరించుచు, అపుడు, పవనసంతతి=భీముడు, వారల, ఆత్మన్, అలరన్=చేసె.

తాత్పర్యము : ఏకచక్రపురములో మంచి పద్ధతిలో నడచు దారిలో సద్బ్రాహ్మణ విశేషములు నడుపుచు భిక్షా వృత్తిలో స్వీకరించిన అన్నమును భుజించిరి. అపుడు భీముడు వారి ఆత్మలను సంతోషపరచెను.

విశేషణము : తస్యేదమ్ - అని అణ్ ప్రత్యయాంతము.

ఆ. అందుదారవృత్తి నందితానేకచ
క్రాగ్రహారరహిత విహారమహిమఁ
బ్రచురసారసమద బకదర్పహారితఁ
దనరె సరసు లందఱును నుతింప 49

రామా : అందున్=ఆ మిథిలానగరమందు, దారవృత్తిన్=భార్యావర్తనచే, నందిత=సంతోషితములైన, అనేకచక్ర=అనేక చక్రవాకపక్షుల యొక్క, ఆగ్రహ= కోపముచే, అరహిత=విరహితమైన (ఔత్సుక్యముగల) విహార మహిమన్=సంచారము ఎక్కువ అగుటచే, ప్రచుర=అధికమైన, సారస=బెగ్గురుల యొక్క, మద బక=మదించిన కొంగల యొక్క, దర్ప=విశృంఖల సంచారముచే, హరితన్=మనోహరత్వముచే, సరసులు=కొలకులు, అందఱును, నుతింప=పొగడగా, తనరె=ప్రకాశించెను.

తాత్పర్యము : ఆ మిథిలానగరమందు ఆడు పక్షులచే సంతోషితములైన అనేకచక్రవాక పక్షుల కోపముచే ఔత్సుక్యముగల సంచారాతిశయముచే బెగ్గురులు, మదించిన కొంగల విశృంఖల సంచారముచే మనోహరముగా కొలకులు ప్రకాశించెను.

భారత : అందున్=ఆ వర్తనలందు, ఉదారవృత్తినంది=సాహస వృత్తిని బొంది, తాను=భీముడు, ఏకచక్ర+అగ్రహార=ఏకచక్రపుర అగ్రహారమునకు, హిత=ప్రియమైన, విహారమహిమన్, ప్రచురసారీ=అధిక బలముగల, సమద=గర్వసహితుడైన, బక= బకాసురుని యొక్క, దర్పహారిత=గర్వము నణచుటచే, సరసులందరును, నుతింప, దనరె.

తాత్పర్యము : ఆవర్తనలచే సాహసవృత్తిని బొంది, భీముడు ఏకచక్రపుర అగ్రహారమునకు ప్రియమైన విహారమహిమచే అధిక బలగర్వితుడైన బకాసురుని మదమణచుటచే సరసులందరును పొగడగా తనరెను.

కం. జననేత్ర చిత్రదారుణ
వనజగతులనిశలసత్త్వవశత నడచుచోఁ
గన నరుదురమారూఢిం
దనరె జితాంగారపర్ణ దర్పోదయతన్ 50

రామా : పురవర్ణనః=జననేత్ర చిత్రద=జనుల కనులకు ఆశ్చర్యమును కలిగించు, అరుణ వనజగతులు=కెందామరల ప్రకారములు, అనిశ=ఎల్లప్పుడు, అసత్త్వవశత= శోభావశత్వము, నడచుచో=నడిచెడిచోట, కనన్+అరుదు=చూడశక్యము కాని, జిత=జయింపబడిన, అంగార=అగ్ని శకలములుగల (రక్తవర్ణములు గల) పర్ణ=ఆకుల యొక్క, దర్పోదయతన్=గర్వోన్నతిగల వేటచే, రమారూఢిన్=లక్ష్మీప్రాప్తిచే, తనరెన్= ప్రకాశించెను.

తాత్పర్యము : చూచు జనుల కనులకాశ్చర్యమును కలిగించు కెందామరల ప్రకారములు ఎల్లప్పుడు శోభావహముగా నడిచెడి చోట చూడ శక్యముగాని జయింపబడిన అగ్నిశకలములు (రక్తవర్ణములు) గల ఆకుల గర్వోన్నతిగలవౌటచే సంపద ప్రాప్తిచే ప్రకాశించెను. (అరుణ పద్మములు నిత్యశోభావహములై సౌభాగ్యవంత ములై అద్భుతముగా కన్పట్టెను)

భారత : జననేత్రచిత్ర=చూచు వారిని ఆశ్చర్యకరముగా, దారుణ= భయంకరములైన, వనజగతులన్=వనభూములందు, నిశలన్=రాత్రులందు, సత్వవశతన్=బలవంతుడౌటచే, నడచుచో=నడుచునప్పుడు, కనన్=చూచుటకు, నరు దురము=అర్జునుని యుద్ధము, ఆరూఢిన్=ప్రాప్తిచే, జిత=జయింపబడిన, అంగారపర్ణ=అంగారపర్ణుడను గంధర్వుని యొక్క, దర్వోదయతన్=గర్వాతిశయముతో, తనరె=ప్రకాశించెను.

తాత్పర్యము : చూచువారి కనులకు ఆశ్చర్యము కలిగించునట్లు భయంకరములైన ఆ వనభూములలో రాత్రులందు బలవంతుడౌటచే నడుచునప్పుడు అర్జునుని యుద్ధము చూచుట కధికమై అంగారపర్ణుడను గంధర్వుని గర్వాతిశయమును జయించుటచే ప్రకాశించెను.

వ. అంతట వారియంతరంగంబునందు 51

సమానార్థము : అంతట, వారి, అంతరంగంబునందు=మనస్సులో

కం. వివిధద్విజాళిభూమా
నవరతసంశ్లాఘితస్వయంవరకల్యా
ణవిధివరద్రుపదసుతా
నవమంజులతా ప్రవృత్తినడపెఁ గుతుకమున్. 52

రామా : వివిధద్విజావళి=వివిధ పక్షిసమూహములయొక్క, భూమ=బాహుళ్యముచే, అనవరత=ఎల్లప్పుడు, సంశ్లాఘిత=స్తుతించబడిన, స్వయంవర కల్యాణ విధిన్=స్వయంవరమున వరించినట్లు, వర=వరులైన, ద్రు=వృక్షములు, పద=పదస్థానముగలవియునైన, సుతాన=మంచి కోమలత్వముగల, మంజులతా=రమ్యమైన తీగలయొక్క, ప్రవృత్తి=విధమును, కుతకమున్ నడపె=సంతోషము కలిగించెను.

తాత్పర్యము : వివిధ పక్షి సమూహముల బాహుళ్యముచే ఎల్లప్పుడు పొగడదగిన స్వయంవరములో వరించిన వరులవలె వృక్షములు పదస్థానముగలవియై మంచి కోమలమైన రమ్యమైన లతలతో సంతోషమే కలిగించెను.

భారత : వివిధ=పలువురు, ద్విజాళి=బ్రాహ్మణ సమూహముల యొక్క, భూమ=బాహుళ్యముచే, అనవరత, సంశ్లాఘిత, స్వయంవర=స్వయంవరమనెడు, కల్యాణవిధిన్=కల్యాణవిధిగల, వరద్రుపదసుతా=శ్రేష్ఠమైన ద్రుపదుని కుమార్తె ద్రౌపది, నవ=నూతనమైన, మంజులతా=మనోహరత్వ, ప్రవృత్తి=వృత్తాంతము, కుతకమున్, నడపె.

తాత్పర్యము : పలువురు బ్రాహ్మణ సమూహముల బాహుళ్యముచే నిత్యము పొగడబడు స్వయంవరములో శ్రేష్ఠమైన ద్రౌపది నూత్న మనోహర వృత్తాంతము సంతోషము నందించెను.

శా. అంతన్ వారలు రామభద్రుపదరాజ్యారూఢిచే నెంతయుం
జింతాతీతవిశేషయై ప్రబలలక్ష్మిన్మించుచంచద్ఘనో
పాంతం దత్పురి గూఢరాజపదవిప్రాకారరేఖన్ శుచి
స్వాంతుల్ నేరిరి తత్పురోహితముఖవ్యాక్లప్తసన్మానులై. 53

రామా : అంతన్=తర్వాత, వారలు=విశ్వామిత్రాదులు, రామభద్రు=రాముని యొక్క పదరాజి=పాదవిన్యాసపంక్తి యొక్క ఆరూఢిచేన్=ప్రాప్తిచే, ఎంతయున్=మిక్కిలి, చింతా=భావనను, అతీత=అతిక్రమించిన, విశేషయై=వింత గుణములుగలదై, ప్రబలన్=ప్రబలునట్లుగా, లక్ష్మిన్+మించు=సంపదను మించు, చంచత్+ఘనోపాంత= మిక్కిలి ప్రకాశించు, గూఢ=ఆవృతమైన, రాజపదవి=చంద్ర మార్గముగల, ప్రాకారరేఖన్=ప్రాకారముల శ్రేణిగల, తత్పురిన్=ఆ మిథిలను, తత్+పురోహిత=అక్కడి పురోహితుల, ముఖవ్యాక్లప్త=ముఖముల నుండి వెలువడిన శుభాశీస్సులతో, సన్మానులై=ఆదరింపబడినవారై, శుచిస్వాంతుల్=శుచియైన మనస్సుగలవారై, చేరిరి=చేరిరి.

తాత్పర్యము : తర్వాత విశ్వామిత్రాదులు రాముని పాదవిన్యాస పంక్తి ప్రాప్తిచే మిక్కిలి భావన నతిక్రమించిన వింత గుణములుగలదై, ప్రబల సంపదతతో మిక్కిలి ప్రకాశించు ఆవృతమైన చంద్రమార్గముగల, ప్రాకారశ్రేణిగల ఆ మిథిలను అక్కడి పురోహితుల ఆశీర్వచన పూర్వక స్వాగతముతో శుచియైన మనస్సుగలవారై చేరిరి.

(జనక పురోహితామాత్యులు ఎదురువచ్చి తోడ్కొని చనిరి)

భారత : అంతన్, రామ=రమ్యమైన, భ=కాంతిగల, ద్రుపద రాజ్య=ద్రుపదుని రాజ్యముయొక్క, ఆరూఢిచే=ప్రాప్తిచే ఎంతయున్, చింతాతీత=చింతలులేని, విశేషయై=తాత్కాలికావస్థగలదై, ప్రబలలక్ష్మిన్=ఉత్కృష్ట బలముల అతిశయముచే, మించు, చంచత్=ఘనోపాంతన్, తత్+పురిన్=ఆ ద్రుపదుని పట్టణమును, గూఢ=గూఢమైన, రాజపద=రాజ చిహ్నములుగల, విప్రాకార రేఖన్=బ్రాహ్మణుల వేషములతో, శుచిస్వాంతులు=పరిశుభ్రమనస్కులై, వారలు=ధర్మజాదులు,

తత్+పురోహితముఖ=ఆ విధముగా ప్రసిద్ధములైన, శ్రేయస్కరము=సంచారముగల, వి=పక్షులచే, ఆక్లృప్త=మిక్కిలి చేయబడ్డ, సన్మానులై=బహుమానముగలవారై (శుభశకునములు గలవారై) చేరిరి.

తాత్పర్యము : అంతటి రమ్యమైన కాంతిగల ద్రుపదుని రాజ్యముయొక్క ప్రాప్తిచే మిక్కిలి చింతలులేని తాత్కాలికావస్థగల ఉత్కృష్ట బలాతిశయముతో మించు ప్రకాశాతిశయముగల ఆ ద్రుపదుని పట్టణమును గూఢమైన రాజచిహ్నముగల బ్రాహ్మణవేషములతో పరిశుభ్రమనస్కులైన ధర్మజాదులు ప్రసిద్ధములైన ముఖసంచారముగల పక్షులచే చేయబడిన శుభశకునముల సన్మానమందుచు చేరిరి.

విశేషణము : విశేషయై – విశేషః కాలికోవస్థా – అని అమరము.

వి – వినిర్విఘ్నే చతు పక్షిణి – అని వైజయంతి.

ఆ. అందుఁ దన్నృపాలుఁడాత్మజ కిది యుంకు
వంచు నెక్కిడ నియమించినట్టి
కార్ముకోత్తమమును ఘనమైనమూర్తిల
క్ష్యంబు సూచి రాన్నృపాత్మభవులు. 54

రామా : అందున్=ఆ మిధిలానగరమునందు, తత్+నృపాలుడు=ఆ జనక మహారాజు, ఆత్మజకు=తన కుమార్తెకు, ఇది ఉంకువ+అంచు=ఇది శుల్కమని, ఎక్కిడ=ఎక్కు పెట్టుటకు, నియమించినట్టి=ఏర్పరచిన, కార్ముక+ఉత్తమమును= ఉత్తమమైన ధనుస్సును, ఘనమైన=గొప్పదైన, మూర్తి=కాఠిన్యముచే, లక్ష్యంబు= చూడదగిన వానిని, ఆ నృప+ఆత్మభవులు=ఆ రాజకుమారులైన రామలక్ష్మణులు, చూచిరి.

తాత్పర్యము : ఆ మిధిలానగరమున ఆ జనకమహారాజు తన కుమార్తెను వివాహ మాడుటకు శుల్కముగా ఎక్కు పెట్టుటకు నియమముగా ఏర్పరచిన ఉత్తమమైన ధనుస్సును గొప్ప కాఠిన్యముచే చూడదగినదానిని ఆ రాజకుమారులు (రామ లక్ష్మణులు) చూచిరి.

భారత : అందున్=ఆ ద్రుపదుని నగరమునందు, తత్+నృపాలుడు=ఆ ద్రుపద మహారాజు, ఆత్మజకు, ఇది, ఉంకువంచు, ఎక్కిడన్, నియమించినట్టి, కార్ముకోత్తమమును, ఘన=గొప్పదైన, మైనమూర్తి=మీన సంబంధమైన ఆకృతిగల, లక్ష్యంబు=గురిని, ఆనృపాత్మభవులు=ఆ పాండుతనయులు, చూచిరి.

తాత్పర్యము : ఆ ద్రుపదుని నగరమునందు ఆ ద్రుపద మహారాజు తన కుమార్తెను (వివాహమాడుటకు) ఇది ఉంకువయని ఎక్కు పెట్టుటకు నియమముగా పెట్టిన మీన సంబంధ (మత్స్య యంత్రమును) గురిగాగల కార్ముకోత్తమమును ఆ పాండుతనయులు చూచిరి.

విశేషణము : మూర్తి – మూర్తిః=కాఠిన్యకాయయోః అని అమరము.

వ. అటమున్న సకలదిగ్దేశాగతులైన రాజకుమారులు నిజశక్తి తారతమ్యంబునం జేసి దర్శన స్పర్శనచాలనోచ్చాలనాది వ్యాపార పారాహంకారులగుచు శిథిలప్రయత్నులయి తొలంగిపోవం జేవ మిగులు నమ్మహాకోదండంబు గనుంగొనునప్పుడు వారలందు. 55

సమానార్థము : అటమున్న=అంతకు ముందే, సకలదిక్+దేశాగతులైన=అన్ని దిక్కులలోని దేశముల నుండి వచ్చిన, రాజకుమారులు, నిజశక్తి=తమ యొక్క బలము యొక్క, తారతమ్యంబునన్+చేసి=తేడా వలన, దర్శన=చూచుట, స్పర్శన=తాకుట, చాలన=కదిలించుట, ఆది=మొదలైన, వ్యాపార, పనులచే, పార+అహంకారులు +అగుచు=తుదముట్టిన అహంకారము గలవారై, శిథిల ప్రయత్నులయి=విఫల ప్రయత్నములు గలవారై, చేవమిగులు=శక్తివంతమైన, ఆ+మహాకోదండంబు=ఆ ధనుస్సును, కనుంగొనునప్పుడు=చూచునప్పుడు, వారలందు=వారిలో.

తాత్పర్యము : అంతకు ముందే అన్ని దిక్కుల నుండి సమస్త దేశాధీశులైన రాకుమారులు వచ్చి తమ బలముయొక్క తారతమ్యముచే చూచుట, తాకుట, కదిలించుటగాగల విఫల ప్రయత్నములు గలవారై శక్తివంతమైన ఆ ధనుస్సును చూచుచుండగా – వారిలో –

చ. అనుపమదివ్యవిక్రమసమగ్రుఁడు రామవిభుండు జిష్ణుఁ డా
యనితరభేద్యరౌద్ర ధనువశ్రమభంగిగ వంచి బాహులీ
ల నెరసె నభ్రగానిమిషలక్షహృదంబకవృత్తి నుర్వరా
జన హృదయాక్షివర్తనముఁ జాలఁగ నద్భుతవార్ధి ముంచుచున్ 56

రామా : అనుపమ=సాటిలేని, దివ్యవిక్రమసమగ్రుఁడు=అద్భుత పరాక్రమశీలి అయిన, రామవిభుండు=రామచంద్రుడు, జిష్ణుడు=జయశీలుడు, ఆ+అనితర భేద్య=ఇతరులు ఎక్కుపెట్టుటకు శక్యముగానిదౌ, రౌద్రధనువు=శివుని ధనుస్సును, అశ్రమభంగిగ=అనాయాసముగా విరుగునట్లు, వంచి=విరిచి, అభ్రగ=ఆకాశ మార్గమున తిరుగు, అనిమిష=దేవతలయొక్క, లక్ష=లక్షలాది, హృదంబక వృత్తిన్=హృదయము, కనులయొక్క వ్యాపారముచే, ఉర్వరాజన=లోకములోని జనుల హృదయ+అక్షివర్తనము=హృదయము, కనుల ప్రవర్తనను, చాలగ=మిక్కిలి, అద్భుతవారి=ఆశ్చర్యమనెడి సముద్రములో, ముంచుచున్=ముంచుచు-బాహులీలన్=భుజశక్తిచే, నెరసె=ప్రకాశించెను.

తాత్పర్యము : అసమానమైన అద్భుత విగ్రహముచే నిండైన రామచంద్రుడు జయశీలుడై ఇతరులకు దుర్భేద్యమైన శివధనుస్సును అవలీలగా విరిచి గగనచరులైన లక్షలాది దేవతల హృదయములు, కనుల వ్యాపారమును, భూలోకములోని జనుల హృదయములను, కనుల వర్తనములను మిక్కిలిగా ఆశ్చర్య సముద్రములో ముంచుచు తన భుజశక్తిచే ప్రకాశించెను.

విశేషణము : ధనువు - ఉకారంతము, సోయంధనురజనివక్రః-అని నైషధ ప్రయోగము గలదు.

భారత : అనుపమ దివ్యవిక్రమ సమగ్రవిభుండు, రామవిభుడు=అందమైన ప్రభువు, జిష్ణుడు=జయశీలియైన అర్జునుడు, ఆ అనితరభేద్య=ఇతరులు సాధింపలేనియౌ, రౌద్రధనువు=భయంకరమైన ధనుస్సును, అశ్రమ భంగిగవంచి=అవలీలగా ఛేదించి, అభ్రగ=ఆకాశమున తిరుగు, అనిమిష=

మత్స్యయంత్రమును, లక్ష్య=గుఱిని, హృత్=హరించునట్టి, అంబక=బాణము యొక్క వృత్తిన్=వర్తనముచే ఉర్వరాజన, హృదయాక్షి వర్తనము, చాలగ, అద్భుత వార్ధిమునుంచుచున్, బాహులీల నెరసె.

తాత్పర్యము : అసమానమైన దివ్యవిక్రమము సంపూర్ణముగాగల ఆ అందమైన ప్రభువు, జయశీలి అయిన అర్జునుడు ఇతరులు సాధింపలేని యా భయంకర ధనుస్సును అవలీలగా ఛేదించెను. ఆకాశమున తిరుగు మత్స్యయంత్రమును గురిని హరించు బాణముయొక్క వర్తనముచే లోకములోని జనుల హృదయములు, చూపులు చాలా అద్భుతసముద్రములో మునుగునట్లుగా తన భుజబలశక్తిచే ప్రకాశించెను.

విశేషణము : అనిమిష – 'సురమత్స్యావనిమిషౌ' అని అమరము.

అంబక – బాణము అను అర్థమున – 'అంబకంనేత్ర శరయోః' అని వైజయంతి

చం. ఉదుటున నట్లు తన్మహిపుఁ డొడ్డినయొడ్డు జయించి యేమనం
దదసహకర్ణ శల్యసముదగ్రతర ప్రథనాశ్రితాధికా
భ్యుదయతఁ జెందె భీమభుజపుష్టిసహాయతఁ దజ్జయార్థులై
కదిసి సమస్తభూపతులు గైకొని రంతకమున్న భంగమున్. 57

రామా : ఉదుటున=ఒక్క ఎత్తున, అట్లు, తత్+మహిపుడు=ఆ జనకుడు, బడ్డిన+ఒడ్డు=ఏర్పరిచిన నియమమును, జయించి, ఏమని+అందు=ఏమని చెప్పుదును, తత్=ఆ విల్లు విరుచుట వలన, అసహ=ఓర్వరాని వారి యొక్క, కర్ణ శల్య=చెవులకు శూలములవలె, సముదగ్రతర=అధికమైన, ప్రథన్=ఖ్యాతిచే, ఆశ్రిత+అధిక=ఆశ్రయించిన వారి కధికముగా, అభ్యుదయతన్+చెందె=అభ్యుదయము కలిగెను. అంతకుమున్న=అంతకుముందే, భీమభుజపుష్టి సహాయత=భయంకరమైన భుజబలసామర్థ్యము వలన, తత్+జయార్థులై=ఆ వింటిని జయింపవలెనను కోరికతో కదిసి=దగ్గరైన, సమస్తభూపతులు=అందరు రాజులు, భంగమున్=భంగపాటును, కైకొనిరి=స్వీకరించిరి.

తాత్పర్యము : ఆ విధముగా ఒక్కఎత్తున జనక మహారాజు ఏర్పరచిన నియమమును జయించి, ఏమని చెప్పుదును – ఆ విల్లు విరుచుట వలన సహింపరాని రీతిలో చెవులకు శల్యమైన, అధికమైన ఖ్యాతి ఆశ్రయించినవారి అభ్యుదయమును చెందెను. భయంకరమైన భుజబలసహాయముతో ఆ వింటిని జయించవలెనని దగ్గరైన సమస్తరాజులును అంతకుముందే భంగపాటు చెందిరి.

భారత : అట్లు=ఆ విధముగా, ఉదుటున, తన్మహిపుడు=ద్రుపదుడు, బడ్డిన ఒడ్డు=చాటించిన పందెమును, జయించి, ఏమని చెప్పుదును, తత్=ఆ జయమును, అసహ=సహింపని, కర్ణ=కర్ణుడు, శల్య=శల్యులతో, సముదగ్రతర=అధికతరమైన ప్రధాన=యుద్ధమునందు, ఆశ్రిత=ఆశ్రయించిన, అధికాభ్యుదయతన్=గొప్పదనమును, భీమ=భీముని యొక్క, భుజపుష్టి సహాయతన్=భుజబలపరాక్రమ సహాయముచే చెందె=చెందెను, తత్=ఆ అర్జునుని, జయార్థులై=జయింపవలెనని, కదిసి=ఎదుర్కొని, సమస్త భూపతులు=సకల రాజులు, అంతకుమున్న, భంగమున్, కైకొనిరి=భంగపాటు పొందిరి.

తాత్పర్యము : ఆ విధముగా ఒక్క ఎత్తున ఆ ద్రుపదుడొడ్డిన పందెమును జయించి – ఏమని చెప్పుదును – సహింపరాని కర్ణశల్యుల అధికతరమైన యుద్ధమునందు ఆశ్రయించిన గొప్పదనము భీముని భుజబల పరాక్రమ సహాయముచే చెందెను. ఆ అర్జునుని జయింపవలెనని ఎదుర్కొనిన సకలరాజులు ఆ కర్ణ శల్యుల యుద్ధము కంటె ముందే భంగపాటు నొందిరి.

ఆ. అతఁడు వీర్యశుల్కయగురాజసుత నట్లు
దనదుసొమ్ముఁ జేసికొని భృశప్ర
కాశితాత్మవంశుఁడై శోభిలెను మామ
కసదృశప్రమోద మావహిల్ల 58

రామా : అతడు=ఆ రాముడు, వీర్యశుల్కయగు=పరాక్రమమే ఉంకువగాగల, రాజసుతను=సీతను, అట్లు, తనదు సొమ్మున్+చేసికొని=తన దానివిగా చేసికొని,

భృశ=మిక్కిలి, ప్రకాశిత=ప్రకాశించిన, ఆత్మవంశుడై=తన వంశమునకు ఖ్యాతిదెచ్చినవాడై, మామకు=జనకునకు, అసదృశ ప్రమోదము=మిక్కిలి సంతోషము, ఆవహిల్ల=కలుగగా, శోభిలెను=ప్రకాశించెను.

తాత్పర్యము : ఆ రాముడు పరాక్రమమే ఉంకువగాగల సీతను అట్లు తన సొమ్ముగా స్వీకరించి మిక్కిలి ప్రకాశించిన తన వంశమునకు ఖ్యాతిదెచ్చినవాడై మామయైన జనకునకు అధిక సంతోషమును కలుగజేసి ప్రకాశించెను.

భారత : అతడు=అర్జునుడు, వీర్యశుల్కయగు, రాజసుతను=ద్రౌపదిని, అట్లు, తనదు సొమ్ము - చేసుకొని, భృశప్రకాశిత, ఆత్మవంశుడై, మామకు=ద్రుపదునకు అసదృశ ప్రమోద మావహిల్ల - శోభిలెను.

తాత్పర్యము : అర్జునుడు పరాక్రమమే ఉంకువగాగల ఆ ద్రౌపదిని ఆ విధముగా తన సొమ్ముగా స్వీకరించి అధికముగా ప్రకాశించు తన వంశముగలవాడై ద్రుపదునకు అసమానమైన సంతోషము ఆవహిల్లగా శోభిల్లెను.

విశేషణము : వీర్యశుల్క - "శుల్కో స్త్రీ స్త్రీ ధనేపిచ" అని అమరము

సీ. అసమానపాండుకీర్తి సమృద్ధిజనకుండు
ధర్మ రాజీడితకర్మపరుఁడు
స్వజననియుక్తియు వరగుణవ్యాసము
నీశ్వరాజ్ఞయుఁ దనహృదయగతియు
నేకమై తనుఁ జాల నెచ్చరింప నిజాను
జులసన్మతిని బిల్చి తెలియఁ జెప్పి
తమకు నందఱకు నుదారభావంబున
నాచరింపఁగ బాత్ర మగుట యరసి

తే. యునికి నపు డాసుబాహుజ యోపశోభి
తమ్ములైనకుమారరత్నములకాభు

జద్రవిణశుల్కయనుజల జాతబాంధ
వరుచిఘనహృదబ్జామోద గరిమ నొసఁగె 59

రామా : అసమాన=సమానముగాని, పాండు=శుభ్రమైన, కీర్తి సమృద్ధి=అధికమైన కీర్తిగల, జనకుండు=జనక మహారాజు, ధర్మరాజ=ధర్మవర్తనముచే, ఈడిత=పొగడబడిన, కర్మపరుడు=కర్మము గలవాడు, స్వజన=తన ఆప్తజనుల, నియుక్తియున్=నియోగమును, వర=వరుల యొక్క, గుణవ్యాసమున్=గుణముల విస్తారము, ఈశ్వర+ఆజ్ఞయు=భగవంతుని ఆదేశమును, తన హృదయగతియు=తన మనస్సు పోకడయు, ఏకమై=ఒకటియై, తనున్=తనను, చాలన్+ఎచ్చరింప= అధికముగా గుర్తు చేయుగా, నిజానుజున్=తన తమ్ముడైన కుశధ్వజుని, లసత్+మతిని=మంచి మనసుగల వానిని, పిల్చి=పిలిచి, తెలియన్+చెప్పి=తెలియజేసి, తమకు, అందఱకున్–ఉదారభావంబునన్=మహత్త్వముచే, ఆచరింపగ=చేయుటకు, పాత్రమగుట+అరసి=అర్హమగునని గ్రహించి, ఉనికిన్=ఉండుటచే, అపుడు, సుబాహు=సుబాహుడను రాక్షసుని, జయ+ఉపశోభితమ్ములైన=జయించుటచే ప్రకాశించునట్టి, కుమారరత్నములకు=లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు, ఆ భుజద్రవిణ శుల్క=ఆ విధముగా భుజపరాక్రమమున కుంకువయైన సీత, అనుజలన్=చెల్లెండ్రైన ఊర్మిళ, మాండవీశ్రుతకీర్తుల, జాత=పుట్టిన, బాంధవ=బంధుత్వము నందలి, రుచిన్=అపేక్షచే, ఘనహృదాబ్జామోదము=అధికమైన హృదయకమలమునకు సంతోషము యొక్క, గరిమనొసగె=ఆధిక్యత కలిగించెను.

విశేషణము : గుణవ్యాసము – 'విస్తారోవిగ్రహోవ్యాసః' – అని అమరము.

తాత్పర్యము : అసమానమైన పరిశుభ్ర కీర్తిగల జనకుడు ధర్మవర్తనముచే పొగడ్తలందిన కర్మపరుడు తన ఆప్తజనుల నియోగమును వరులయొక్క గుణవిస్తారమును, ఈశ్వరుని ఆదేశమును, తన మనస్సు వర్తనము ఒకటియై తనను హెచ్చరింపగా తన తమ్ముడైన కుశధ్వజుని – మంచి మనసు గలవానిని పిలిచి తెలియజేసి తమ కందరకు మహాత్త్వముచే ఆచరించుటకు అర్హమని గ్రహించి యుండుటచే ఆ సుబాహుని జయించి ప్రకాశించు లక్ష్మణ భరత శత్రుఘ్నులకు ఆ

విధముగా భుజపరాక్రమమున కుంకువయైన సీత చెల్లెండ్రైన ఊర్మిళ, మాండవీ, శ్రుతకీర్తుల పుట్టిన బంధుత్వరుచిచే అధికమైన సంతోషమును హృదయ కమలమునకు ఆధిక్యత గలిగించెను.

(భరత శత్రుఘ్నులు సమీపమున లేకున్నను వారికిచ్చెదనని ప్రకటించెను.)

భారత : అసమాన=సాటిలేని, పాండు=పాండురాజుయొక్క, కీర్తి సమృద్ధికి=కీర్తి యొక్క ఆధిక్యతకు, జనకుండు=ఉత్పత్తి స్థానమైనవాడు, ధర్మరాజు, ఈడిత=స్తోత్రము చేయబడిన, కర్మపరుడు=ప్రయోజనములందు పరుడు, స్వజనని=తన తల్లి కుంతి యొక్క, ఉక్తియున్=మాటను, వరగుణ=శ్రేష్ఠ గుణములుగల, వ్యాసమునీశ్వర+ ఆజ్ఞయు=వ్యాసముని ఆదేశమును, తన హృదయగతియు, ఏకమై, తను–చాల–ఎచ్చరింప, నిజ+అనుజుల=తన తమ్ములైన భీమాదులను, సన్మతినిబట్టి, తెలియజెప్పి, తమకు, అందఱకును, దారభావంబున్=భార్యాతనము ఆచరింపగ, పాత్రయగుట, అరసియునికినపుడు, ఆ, సుబాహు జయోపశోభితమ్ములైన=ఆ భుజ పరాక్రమ శోభితులైన, కుమార రత్నములకున్=శ్రేష్ఠమైన కుమారులకు, ఆ భుజద్రవిణ శుల్కయును=భుజసంపదయే యుంకువగాగల ద్రౌపదియనెడి, జలజాత బాంధవరుచి=సూర్యదీప్తి, హృత్=హృదయములనెడి, అబ్జ=తామరలకు, ఆమోద=హర్షమనెడి సౌరభ్యము యొక్క, గరిమనొసగె=అతిశయమునిచ్చెను.

తాత్పర్యము : సాటిలేని పాండురాజు యొక్క కీర్తి ఆధిక్యతకు మూలస్థానమైన ధర్మరాజు, స్తోత్రము చేయబడిన కర్మపరుడు కుంతి మాటను, శ్రేష్ఠగుణుడైన వ్యాసమునీశ్వరుని ఆదేశమును, తన హృదయవర్తనమును ఏకమై హెచ్చరించగా తన తమ్ములైన భీమాదులను సన్మతితో పిలిచి వారికి తెలియజెప్పెను. తమ కందరకును భార్యాత్వము నాచరించుటకు యోగ్యమగుట తెలిసికొని అపుడు ఆ భుజపరాక్రమ శోభితులైన శ్రేష్ఠమైన కుమారులకు భుజసంపదయే యుంకువగాగల ద్రౌపదియనెడి సూర్యదీప్తి హృదయమనెడి తామరలకు హర్షమనెడి సౌరభ్యము యొక్క అతిశయమునిచ్చెను.

వ. అంతఁ దత్ప్రవృత్తి యాకర్ణించి 60

రామా : అంతన్, తత్+ప్రవృత్తి=ఆ పద్ధతిని, ఆకర్ణించి=విని

భారత : తత్+ప్రవృత్తి=ఆ ధర్మరాజు ప్రవర్తనను (వివాహమాడవలెనను కోరికను)

కం. తనయులు దాను నపుడు త
జ్జనకుం డరుదెంచి చూచు జనులకు ననుభా
వనిరూఢి మానితానం
తనవోత్సవముగ నొనర్చెఁ దత్పరిణయమున్ 61

రామా : తత్+జనకుండు=ఆ కుమారుల తండ్రి దశరథుడు, తనయులు=భరత, శత్రుఘ్నులును, తానును=దశరథుడును, అరుదెంచి=వచ్చి, చూచు జనులకు=చూచెడి మిథిలానగరవాసులకు, అనుభావ నిరూఢిన్=ప్రభావ మహిమచే, మానిత=గౌరవింపదగిన, అనంతనవోత్సముగ=అధికమైన నూతన సంబర మయియుండగా, తత్+పరిణయమున్=ఆ రామాదుల వివాహములను, ఒనర్చె=జరిపించెను.

తాత్పర్యము : ఆ కుమారుల తండ్రి భరత శత్రుఘ్నులును తానును బయలుదేరి వచ్చి చూచెడి మిథిలానగరవాసులకు ప్రభావమహిమచే గౌరవార్హమైన నూతనోత్సవమగు రామాదుల వివాహములను జరిపించెను.

భారత : తనయులు=ద్రుపదకుమారులైన ధృష్టద్యుమ్నాదులు, తానును=ద్రుపదుడును, అపుడు తత్+జనకుడు=ద్రౌపది తండ్రి ద్రుపదుడు, అరుదు+ఎంచి=విశేషముగా భావించి, చూచు జనులకు, అను=అరుదనెడి, భావనిరూఢి=తలపు యొక్క దారుఢ్యమును, మాని=వదలి, తాను=ద్రుపదుడు, అంత=అంతట, నవోత్సవముగ=కొత్తదనముగా, తత్+పరిణయమున్=ఆ వివాహమును, ఒనర్చె.

తాత్పర్యము : ధృష్టద్యుమ్నాదులును, ద్రుపదుడును అపుడు దానిని అరుదుగా

భావించి చూచు జనుల కరుదనెడి తలపుయొక్క బలమును వదలి ద్రుపదుడు అంతట నూతనోత్సవముగా ఆ వివాహము జరిపించెను.

వ. అందు 62

అందున్=ఆ వివాహమందు

కం. త్రిజగద్భూషణ మగుభూ
మిజనాదృతశీలఁ గృష్ణమృగనేత్రఁ బురం
ధ్రిజనులు గయిచేసిరి సొం
పుజనింప వివాహయోగ్యభూషావిధులన్ 63

రామా : త్రిజగత్+భూషణము+అను=మూడు లోకములకు అలంకార ప్రాయమగు, భూమిజను=సీతను, ఆదృతశీలన్=ఆదరింపదగు శీలముగలదానిని, కృష్ణమృగనేత్రన్=జింక కనులవంటి కనులుగలదానిని, పురంధ్రిజనులు=ముత్తైదువలు, సొంపు జనింప=అందముగా, వివాహయోగ్య=పెండ్లికి సరియగు, భూషావిధులన్= అలంకారములతో, కయిచేసిరి=అలంకరించిరి.

తాత్పర్యము : ముల్లోకములలో జనులు ఆదరించు శీలముగల సీతను అందముగా వివాహోచితముగా ముత్తైదువలు అలంకరించిరి.

భారత : త్రిజగద్భూషణమగు, భూమిజన+ఆదృతశీలన్=లోకములోని జనులు ఆదరించు శీలముగల, మృగనేత్రన్=జింక వంటి కనులుగల, కృష్ణన్=ద్రౌపదిని, పురంధ్రిజనులు, సొంపు జనింప, వివాహయోగ్య భూషావిధులన్, కయి సేసిరి.

తాత్పర్యము : ముల్లోకములలో జనులు ఆదరించు శీలముగల జింక వంటి కనులుగల ద్రౌపదిని ముత్తైదువలు అందముగా వివాహయోగ్యమైన ఆభరణములతో అలంకరించిరి.

విశేషణము : పురంధ్రి జనులు – పురంధ్రి శబ్దము ఇకారాంతము.

'పురంధ్రి భిశ్చక్రమశః ప్రయుక్త' అని కాళిదాసు ప్రయోగము.

మహాస్రగ్ధర –

లలనం గైసేసి కాంతల్రమణగృహమహా లక్ష్మీవైయొప్పు మంచుం
గలితాశీర్వాదలై రక్కడమముగురు భాగ్యస్థితుల్ మీఱ నీదృ
గ్బలవన్మాల్యాంగరాగాభరణవసనసౌభాగ్యలక్ష్మీకలై కాం
తలగత్సంసేవలందుం దలఁపు మనుచు నుత్కంఠఁ బ్రాపించి రందున్

రామా : లలనన్=అందముగా, కైసేసి=అలంకరించి, కాంతల్=ముత్తైదువలు, రమణ గృహమహాలక్ష్మివై=అందమైన ఇంటి సౌభాగ్యమువై, ఒప్పుమంచున్=ప్రవర్తిల్లుమని, కలిత+ఆశీర్వాదలైరి=ఆశీస్సులు పొందినవారైరి, ఆ+కడమముగురు=ఆ చివరి ముగ్గురైన ఊర్మిళ, మాండవీ, శ్రుతకీర్తులు, భాగ్యస్థితుల్ మీఱ=సౌభాగ్య సంపదలతిశయింపగా, ఈదృక్=ఈ సీత అలంకారము వంటి అలంకారములచే, బలవత్+మాల్య+అంగరాగ+ఆభరణవసన=అధికమైన పూమాలలు, మైపూతలు, నగలు, వస్త్రములతో, సౌభాగ్యలక్ష్మీకలై=సౌభాగ్యము అతిశయించినవారై, కాంత=పతులయందు, లగత్=లగ్నమైన, సంసేవలందున్=పతి సేవలందు, తలఁపు =కోరికను, అందున్=అందు, మనుచు=పోషింపుచున్న, ఉత్కంఠ=ఉత్సాహమును, ప్రాపించిరి=వేగిరించిరి.

తాత్పర్యము : ముత్తైదువలు వారిని అందముగా అలంకరించి అందమైన గృహలక్ష్ములై ప్రవర్తిల్లుడని ఆశీస్సుల నందించిరి. చివరి ముగ్గురు అయిన ఊర్మిళ, మాండవీ, శ్రుతకీర్తులు సౌభాగ్య సంపద లతిశయింపగా సీత అలంకారమువంటి అలంకారములచే పూమాలలు, మైపూతలు, ఆభరణములు, వస్త్రములతో సౌభాగ్యాతిశయముగలవారైరి. పతులయందు లగ్నమైన పతిసేవలను కోరికలను అందు పోషించు ఉత్కంఠను వేగిరించిరి.

భారత : కాంతల్=ముత్తైదువలు, లలనన్గైసేసి=ద్రౌపదిని అలంకరించి, రమణగృహ=రమణీయమైన ఇళ్లకు, మహాలక్ష్మివై యొప్పుమంచున్, కలిత+ఆశీర్వాదలైరి=ఆశీర్వదించిరి. అక్కడన్=ఆ పతి గృహములయందు,

మమున్=మమ్ములను, గురుభాగ్యస్థితుల్=గొప్ప భాగ్యముగల స్థితిలో, మీఱ=అతిశయింపగా, ఈదృక్=ఇప్పటి శృంగారమువలె, బలవత+మాల్య+అంగరాగ+ఆభరణవసన=అధికమైన పూమాలలు, మైపూతలు, ఆభరణములు, వస్త్రములు, సౌభాగల్యలక్ష్మీకలా=సౌభాగ్య సంపదల వృద్ధితో, ఏకాంత=మిక్కిలి, లగత్=తగిలిన, సంసేవలందున్=అనుభవములయందు, తలపుమనుచు=గుర్తుంచుకొనుకుని, అందున్, ఉత్కంఠ ప్రాప్తించిరి.

తాత్పర్యము : ముత్తైదువలు ద్రౌపదిని అలంకరించి రమణీయమైన గృహములలో మహాలక్ష్మివైయుండుమని ఆశీర్వదించిరి. ఆ పతి గృహములందు గొప్ప భాగ్యస్థితి అతిశయింపగా ఇప్పటి శృంగారమువలె అధికమైన మాల్యాభరణాదులు, మైపూతలు, వస్త్రముల సౌభాగ్య సమృద్ధితో మిక్కిలిగా తగిలిన అనుభవములను మమ్ము తలపుమని ఉత్కంఠను కలిగించిరి.

వ. తద్వధూజనకుండును దత్కాలసముపస్థితం బైన నరసమాగమంబున
కత్యంతసంతుష్టుం డగుచు ననంతవిభవసంపదలు వొదల
నెదురుకోలు సేయించి తత్ప్రవేశోత్సవంబు నడపునప్పుడు 65

రామా : తత్=వధూజనకుండును=పెండ్లి కుమార్తెల తండ్రియైన ఆ జనక మహారాజును, తత్+కాల సముపస్థితంబైన=అప్పుడు విచ్చేసిన, నరసమాగంబునకు=జనుల రాకకు అత్యంత సంతుష్టుండగుచు=మిక్కిలి ఆనందించుచు, అనంతవిభవ సంపదలు+పొదల=అధికమైన వైభవసంపదలు అతిశయింపగా, ఎదురుకోలు సేయించి=ఎదరు సన్నాహమును నిర్వహించి, తత్+ప్రవేశోత్సవంబు=ఆ ప్రవేశపు వేడుకను, నడపునప్పుడు=జరుపగా.

తాత్పర్యము : ఆ పెండ్లి కుమార్తెల తండ్రియైన జనకుడు ఆ వివాహమునకు విచ్చేసిన జనుల రాకకు మిక్కిలి సంతోషించి అధికమైన వైభవసంపదలతో ఎదురుకోలను జరిపి ఆ ప్రవేశోత్సవమును జరుపగా.

భారత : తత్ వధూజనకుండును=ఆ ద్రుపదమహారాజు, తత్ కాల

సముపస్థితంబైన, నరసమాగమము=అర్జునుని రాకకు, అత్యంత సంతుష్టుడగుచు, అనంత విభవ సంపదలు పొదల, ఎదురుకోల సేయించి, తత్ ప్రవేశోత్సవంబు, నడుపునప్పుడు.

తాత్పర్యము : ఆ ద్రుపద మహారాజు అప్పుడు వివాహోమునకు విచ్చేసిన అర్జునుని రాకకు మిక్కిలి సంతోషించినవాడై అనంత వైభవముతో ఎదురుకోల నిర్వహించి వారి ప్రవేశోత్సవమును నడుపుచుండగా –

సీ. నృపకన్యకలకనిందితనవభ్రమరకా
స్యవిలాసలక్ష్మీనిరస్తపూర్ణ
తారకాధిపతుల కారయఁ దత్పూర్వ
భవసంచితోరుతపఃఫలంబు
లేగురుశుభగుణభోగాంచితులు వీర
లీరీతిఁ దగఁ బతులై రటంచు
లోకరక్షణచతురాకారభాగ్దివ్య
విమలతేజోవిలాస మిది యనుచు

తే. నర్థి నేతెంచి చూచెఁ బౌరాళి యత్యు
దారమణిభూషణోజ్జ్వల దాశరథుల
మాంగలికవస్త్రరత్న భూషాంగరాగ
పాండుసూనులఁ గన్నులపండువుగను. 66

రామా : నృపకన్యకలకు=రాకుమారితలకు, అనిందిత=నిందింపబడని, నవభ్రమరక=ముంగురులుగల, ఆస్య=ముఖములయొక్క, విలాసలక్ష్మీ=సౌభాగ్యలక్ష్మీచే, నిరస్త=తిరస్కృతుడైన, పూర్ణతారకాధిపతులకు=పూర్ణచంద్రునికి, ఆరయ=చూడగా, తత్+పూర్వభవ=అంతకు ముందు జన్మలోని, ఉరుతపః ఫలంబులే=గొప్పదైన తపస్సు యొక్క ఫలములే, గురుశోభగుణభోగ+

అంచితులు=అధికమైన శోభాగుణముచే సమృద్ధిగలవారు, వీరలు=రామలక్ష్మణాదులు, ఈ రీతిన్=ఈ విధముగా, తగన్=తగిన విధముగా, సతులైరటంచు=భర్తలైరని, లోకరక్షణ=భువనముల పాలించు, చతుర+ఆకారభాక్=నాలుగు ఆకారములతో ప్రకాశించు, దివ్యవిమలతేజో విలాసము=దివ్యమైన స్వచ్ఛమైన కాంతి విలాసము, ఇది+అనుచు=ఇదియని, అర్థిన్=కోరికతో, పౌరాళి=పురజనుల సముదాయము, అతి+ఉదారమణిభూషణ+ఉజ్జ్వల=మిక్కిలి సంపన్నమైన మణులు, అలంకారములతో ప్రకాశించుచున్న, దాశరథుల=రామలక్ష్మణాదులను, మాంగలికవస్త్ర=కళ్యాణ వస్త్రములు, రత్నభూష+అంగరంగ=రత్నాలంకారములు, మైపూతలతో, పాండు=తెల్లనైన, సూనులన్=పుష్పములు ధరించిన వారిని, ఏతెంచి=వచ్చి, కన్నులపండువగను, చూచె=కంటికింపుగా చూచిరి.

తాత్పర్యము : నిందింపబడని ముంగురులు గల ముఖ్య సౌభాగ్య సంపత్తిచే తిరస్కరింపబడిన పూర్ణచంద్రులకు చూడగా వైభవమంతయు రాకుమార్తెల పూర్వజన్మతపః ఫలమేయనియు, అధిక శోభాగుణ సమృద్ధిగల రామలక్ష్మణాదులు ఈ విధముగా తమ భర్తలైరనియు, లోకములను పాటించుటకు నాలుగు ఆకారములతో ప్రకాశించు దివ్యము, విమలమునైన కాంతి విలాసమిదియని పురజనులు అందరు కోరికతో వచ్చి కళ్యాణ వస్త్రములు, రత్నాలంకారములు, మైపూతలు, తెల్లని పూలు ధరించిన వారిని కనుల పండువగా చూచిరి.

భారత : అలకనిందిత నవభ్రమరకు=ముంగురులచే నిందించబడిన నూత్న భ్రమరములుగలవానికి, ఆస్యవిలాసలక్ష్మీ=ముఖవిలాస సంపదచే, నిరస్త=తిరస్కరింపబడిన, పూర్ణతారకాధిప=పూర్ణచంద్రుని, తులకు=సామ్యముగల దానికి, ఆరయున్=చూడగా, నృపకన్యకు=ద్రౌపదికి, తత్పూర్వభవ=ఆమె పూర్వజన్మమునందు, సంచిత=సంపాదింపబడిన, ఉరుతపః ఫలంబులు=గొప్ప తపస్సు ఫలితములు, ఏగురు=ఐదుగురు, శుభగుణభోగాంచితులు, వీరలు=పాండవులు, ఈరీతి, తగన్+పతులైరటంచు, లోకరక్షణ=లోకములు పాలించుటకు, చతుర=సమర్థములైన, ఆకార=ఆకారములను, భాక్=పొందిన, దివ్య=ధర్మానిల

శక్రాశ్వినుల యొక్క, తేజః=అంశలయొక్క, విలాసమిదియనుచు, అర్థి, నేతెంచి, పౌరాళి, అతి+ఉదార, మణిభూషణోజ్జ్వలత=మణులు, అలంకారములతో ప్రకాశించు, ఆశ=దిక్కులుగల, రథులన్=రథములు గలవారిని, మాంగలిక=శుభప్రదములైన, వస్త్రరత్నాభరాషాంగరాంగ=వస్త్రములు, రత్నభరాషలు, మైపూతలుగల పాండుసూనుల=పాండుపుత్రులను, కన్నుల పండువగను, చూచెన్=చూచిరి.

తాత్పర్యము : ముంగురులచే అపహసించబడిన నూత్నభ్రమరములు గల, ముఖవిలాస సంపదచే తిరస్కరింపబడిన పూర్ణచంద్రునితో సామ్యముగలదానికి ఆ ద్రౌపదికి ఆమె పూర్వజన్మమున సంపాదింపబడిన గొప్ప తపోఫలితములు శుభగుణభోగాంచితులైన ఐదుగురు పాండవులు ఈ రీతిగా భర్తలైరని, లోకరక్షణ సమర్థులైన ఆకారములను పొంది - ధర్మ, అనిల, శక్ర, అశ్వినుల ఆంశల విలాసమిదియని - పురజనులందరు ఏతెంచి మిక్కిలిమణులు, అలంకారములతో ప్రకాశించు దిక్కులే రథముగా గల శుభప్రదమైన వస్త్రములు, రత్నభూషలు, మైపూతలుగల పాండవులను కన్నుల పండువగా చూచిరి.

విశేషణము : ద్రౌపది పూర్వజన్మలో ఈశ్వరుని గూర్చి తపస్సు చేసి ఐదుగురు పతులను వేడినట్లు భారతాది పర్వములో చెప్పబడినది.

2) అలక - అలకాశ్చూర్ణకుంతలాః - అని అమరము.

చం. అలఘుతరాజవంశమణులై విలసిల్లెడునక్కుమారకుల్
నలుగురురూపవైభవకళల్ గడు మీఱుచు సద్గుణాతిశీ
తలచతురాకృతిన్ మెఱయు తజ్జనతాన్వయభాగ్యలక్ష్మి నా
నలరెడు పెండ్లికూఁతులసదాదర మొప్పఁగ నోలిఁ బెండ్లియై 67

రామా : అలఘుతర=గొప్పదైన, అజ=అజుని, వంశమణులై=వంశమున కలంకారమైన వారై, విలసిల్లెడు=ప్రకాశించు, ఆ+కుమారకుల్=ఆ రాజకుమారులు, నలుగురు=రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు, రూపవైభవకళల్=రూప సంపదల శోభచే కడుమీఱుచు=మిక్కిలి అతిశయించుచు, సత్+గుణ+అతిశీతల చతురాకృతిన్=

సద్గుణములనెడి చల్లని అందమైన ఆకారములతో, మెఱయు=ప్రకాశించు, తత్+జనక+అన్వయ భాగ్యలక్ష్మి=ఆ జనకుని వంశములో భాగ్యసంపద, నాన్=వలె, అలరెడు=ప్రకాశించు, పెండ్లికూతుల=సీతాదులను, సదాదరమొప్పగ=మిక్కిలి ఆదరపూర్వకముగా, ఒప్పగా=అందగించగా, ఓలిన్=శుల్కముగా (వరుసగా) పెండ్లియై=వివాహమై –

తాత్పర్యము : గొప్పదైన అజవంశమునకు అలంకారప్రాయమై విలసిల్లు ఆ ఆ రాజకుమారులు (రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు) నలుగురు రూపసంపదచే అతిశయించుచు సద్గుణముల చతురతగల ఆకారములతో ప్రకాశించు ఆ జనకవంశ భాగ్యలక్ష్మి అనునట్లు అలరారు పెండ్లికూతులను ఆదరపూర్వకముగా వరుసగా పెండ్లి యాడిరి.

విశేషణము : జనకాన్వయభాగ్యలక్ష్మి – నాలుగు ఆకారములై యున్నవారిని అనుచో ఉత్ప్రేక్షాలంకారము.

భారత : అలఘుతన్=గొప్పదనముచే, రాజవంశ=చంద్రవంశమునకు, మణులై విలసిల్లెడు, ఆ+కుమారకుల్=ఆ ధర్మరాజాదులు, నలు=నలుని యొక్క, గురురూప వైభవకళల్ కడుమీఱుచు, సద్గుణాతి శీతల చతురాకృతిన్, మెఱయు, తత్+జనక+అన్వయభాగ్యలక్ష్మి=ఆ తండ్రియైన ద్రుపదుని వంశ సంపద, నాన్=వలె, అలరెడు, పెండ్లికూతున్=ద్రౌపదిని, లసత్+ఆదరమొప్పగన్=మిక్కిలి ఆదర పూర్వకముగా, ఓలిన్+పెండ్లియై=వరుసగా పెండ్లియాడి –

తాత్పర్యము : గొప్పదనముచే చంద్రవంశమునకు మణులై విలసిల్లెడు ఆ ధర్మజాదులు నలుని యొక్క గొప్ప రూపవైభవ సంపదతో అతిశయించుచు సద్గుణముల యొక్క గొప్పదనముచే ప్రకాశించుచు తండ్రియైన ద్రుపదుని వంశసంపదవలెనుండు ద్రౌపదిని మిక్కిలి ఆదరపూర్వకముగా వరుసగా పెండ్లాడిరి.

విశేషణము : రాజవంశ – రాజాప్రభౌనృపచంద్రే – అనివి.

తే. అతులితానందమునఁ బేర్చి రంత విదుర
మంత్రిధృతరాష్ట్రుఁ డమ్మహామహులతండ్రి
వినిహతమనోవిచారుఁడై తనదుపురికిఁ
గొడుకుల వధూయుతముగఁ దోడ్కొంచు రాఁగ 68

రామా : అతులిత+ఆనందమున=మిక్కిలి ఆనందముతో, పేర్చిరి=విలసిల్లిరి, అంత=తర్వాత, విదుర=వివేకులైన, మంత్రి=ప్రధానులచే, ధృత=ధరింపబడిన, రాష్ట్ర=రాష్ట్రముగలవాడు, ఆ+మహామహుల తండ్రి=ఆ గొప్పవారి తండ్రి దశరథుడు, వినిహతమనోవిచారుడై=లగ్నమైన మనస్సుగలవాడై, కొడుకులన్=కుమారులను, వధూయుతముగ=పెండ్లి కూతురులతో, తనదుపురికి=తన అయోధ్యానగరమునకు, తోడ్కొంచురాగ=తీసికొనిరాగా.

తాత్పర్యము : మిక్కిలి ఆనందముతో పేర్చిరి (అని ముందటి పద్యముతో నన్వయము)

తర్వాత వివేకులైన మంత్రులచే ధరింపబడిన రాష్ట్రముగల ఆ మహామహుల తండ్రియైన దశరథుడు వినిహితమనోవిచారముగలవాడై ఆ కుమారులను వధువులతో సహా తన అయోధ్యానగరమునకు తోడ్కొనిరాగా –

విశేషణము : విదుర – జ్ఞాతాతువిదురోవిందః – అని అమరము.

భారత : అతులితానందమున చేర్చిరి. విదురమంత్రి=విదురుడు మంత్రిగాగల ధృతరాష్ట్రుడు, ఆ+మహామహుల తండ్రి, అంతన్=వివాహవార్తను, విని=విని, హితమనోవిచారుడై=పాండవులు చనిపోయిరను విచారమును విడిచి, కొడుకులను= పాండుపుత్రులను, వధూయుతముగన్=ద్రౌపదితోగూడ, తనదుపురికి=తన హస్తినాపురికి, తోడ్కొంచురాగ.

తాత్పర్యము : అతులితానందమున చేర్చిరి. విదురుడు మంత్రిగాగల ఆ మహామహుల తండ్రి అయిన ధృతరాష్ట్రుడు వివాహవార్తనంతయు విని పాండవులు గతించిరను విచారమును విడిచి పాండుపుత్రులను ద్రౌపదితో గూడ తన హస్తినాపురికి తోడ్కొనిరాగా –

సీ. ప్రౌఢిఁ బేర్చినవారిభావ మెలర్పంగ
నను పశాంతాత్మత నరుగుదెంచి
రాకుమారులవైరిలోకాభిగమ్యభు
జావిజృంభణగుణశ్లాఘనుండు
వీరునర్జునుఁ బరశూరులసత్ప్రతా
పాన్వితభీమబాహాసహాయుఁ
డై యోర్చినట్టియాహవజయశోభిరా
ముం డని వేడ్క పెంపున వెదకుచుఁ

తే. బఱపె మిక్కిలిఁ జూడ్కులందఱిని గడచి
యవల దాశరథిశ్రేష్ఠుఁ డైనయతని
పైఁ బురస్థితజనకదంబకముచిత్త
ములమహాదరసంభ్రమమొలయ నపుడు 69

రామా : ప్రౌఢిన్=పేర్చి=ధృడత్వముతోగూడి, నవ=నూతనమైన, అరిభావము=శత్రుభావము, ఎలర్పంగ=కలుగగా, అనుప=పంపగా, శాంత=శాంతముగాని, ఆత్మతన్=బుద్ధిగలవాడౌటచే, అరుగుదెంచి=వచ్చి, రాకుమారుల వైరి=రాకుమారుల శత్రువుల, లోకాభిగమ్య=లోకమునకు తెలిసిన, భుజావిజృంభణ=భుజబలము అతిశయించిన, గుణశ్లాఘనుండు=పొగడదగిన గుణములు గలవాడు, వీరున్=వీరుడైన, అర్జునున్=కార్తవీర్యార్జునుని, పరశు=గండ్ర గొడ్డలిచే, ఉరు=అధికమైన, లసత్+ప్రతాప=మిక్కిలి ప్రతాపముచే, అన్విత=కూడిన, భీమ=భయంకరమైన, భుజసహాయుఁడై=భుజశక్తి సహాయముగాగలవాడై, ఓర్చినట్టి=జయించిన, ఆహవజయశోభి=యుద్ధములో జయముతో శోభించిన, రాముండు=పరశురాముడు, అనిన్=యుద్ధమునందు, వేడ్కపెంపున=వేడుక యొక్క ఆధిక్యముచే, వెదకుచు=పరిశీలించుచు, అందరిని గడచి=అందరిని వదలి, అవల=తర్వాత, దాశరథిశ్రేష్ఠుడైన=దశరథుని పుత్రులలో పెద్దవాడైన, అతనిపై, రామునిపై, పురః

స్థిత=ముందు నిలుచున్న, జనకదంబక=జనసముదాయము యొక్క, చిత్తములన్= మనసులలో, మహోదర=గొప్ప భయము వలన, సంభ్రమమొలయన్= ఆశ్చర్యము కలుగగా, అపుడు=అపుడు, మిక్కిలి చూడ్కులు పరపె=తీక్షణమైన చూపులు నిగుడించెను.

తాత్పర్యము : ప్రౌఢిమతో గూడిన నూతనమైన శత్రుత్వ భావము అధికముగా, శాంతముగాని బుద్ధిగలవాడుగా వచ్చి, రాకుమారులకు శత్రువని పొగడబడుచు, తన భుజబల సంపత్తిచే కార్తవీర్యార్జునుని పరశువుచే గొప్ప ప్రతాపముతో భయంకరమైన భుజశక్తితో జయించి యుద్ధములో జయముతో శోభించు పరశురాముడు వెదకుచు యుద్ధమునకై వేడుకతో వచ్చెను. అందరిని వదలి ఆ తర్వాత దశరథుని పెద్దకుమారుడైన రామునిపై - తన ముందు చేరిన జన సముదాయము మనసులలో గొప్పగా భయమును పొందుచుండగా తీక్షణమైన చూపులు ప్రసరింపజేసెను.

భారత : ప్రౌఢిన్+పేర్చినవారిని=ప్రౌఢులైన వారిని, భావము+ఎలర్పంగన్= మనసులో ఉద్దేశము తెలియునట్లుగా, అనుపన్=పంపగా, శాంతాత్మతన్=శాంత బుద్ధితో, ఆ కుమారులు=పాండవులు, అరుగుదెంచి=వచ్చి, వైరిలోకాభిగమ్య= శత్రుజనులకు పొందరాని, భుజా=బాహువుల యొక్క, విజృంభణ గుణశ్లాఘనుండు, వీరున్=వీరుడైన, అర్జునున్=అర్జునుని, భీమబాహుసహాయుడై=భీముని బాహుబలము సహాయముగాగలవాడై, పరశూరులన్=శత్రువీరులను, సత్+ప్రతాపాన్విత=అధిక బలసంపత్తితో, ఓర్చినట్టి=జయించిన, ఆహవజ=యుద్ధమునందు పుట్టిన, యశోభిరాముండని=కీర్తిచే ప్రకాశించువాడని, వేడ్క పెంపున, వెదకుచు, అవలత్=చలింపని, ఆశన్=అపేక్షచే, రథిశ్రేష్ఠుడైన=రథికులలో గొప్పవాడైన, అతనిపై=అర్జునునిపై, పురస్థిత=పట్టణమందున్న, జనకదంబకము=జనుల సముదాయము యొక్క, చిత్తములన్=మనస్సులలో, మహాదర=మిక్కిలి ఆదరముతో గూడిన, సంభ్రమము=ఆశ్చర్యము, ఒలయన్+అపుడు=కలుగగా, మిక్కిలి చూపులు అందరిని గడచిపఱపె.

తాత్పర్యము : ప్రౌఢులైనవారిని తన మనస్సులో భావము తెలియునట్లు పంపగా పాండవులు శాంత చిత్తముతో నరుగుదెంచిరి. శత్రులోకమును తన భుజబలముచే జయించిన శ్లాఘనీయగుణములుగల ఆ వీరుడైన అర్జునుని, బాహుబల భయంకరత్వముచే శత్రుజనులను జయించి యుద్ధములో విజయములో శోభించువాడై యుండు అర్జునుని వేడుకతో వెదుకుచు, చలింపని అపేక్షచే పట్టణమందలి జనసముదాయము తమ మనసులలో ఆదరము, సంభ్రమము కలుగగా అందరి చూపులు అతనిపై పఱపిరి.

వ. కనుంగొనుజనులు తదనంతరంబ 70

సీ. ఎంతయు నద్భుతం బీరామభార్గవ
　　రామలసత్ప్రౌఢి యేమిచెప్ప
బలవదనేకపతులనానుగుణ్యంబు
　　జగదుపశ్లోకితంబుగ భజించెఁ
గంటిరే యనువారు గడఁక నేతద్వర
　　పురుషు లన్యోన్యంబు నొరసి యెవ్వ
రెట్టు గాఁగలవారొ యిటమీఁద ననుశంక
　　మదిఁ బెట్టువారు నక్కొదవ లేల

తే. యొదవు మనభాగ్యమహిమ కయోనిజాత
మహితనయ కృష్ణమృగనేత్ర మంజుగాత్ర
యైదువతనంబుప్రోక మాయమ్మ యనుచు
సతికిఁ గేల్మోడ్చువారునై సందడిలిరి 71

రామా : ఈ రామ భార్గవరామ=ఈ రాముని, పరశురాముని, లసత్+ప్రౌఢి= అధికమైన శక్తి, ఏమి చెప్ప, ఎంతయున్+అద్భుతంబు=ఎంతయు ఆశ్చర్యకరము, బలవత్=బలిష్ఠమైన, అనేకప=గజములతో, తులన+అనుగుణ్యంబు=సమాన

గుణముగల, జగత్+ఉపశ్లోకితంబుగ=లోకముచే పొగడబడునట్లు, భజించె=ఉన్నది, కంటిరే=చూచితిరా? అనువారు, కడంకన్=ప్రయత్నపూర్వకముగా, ఏతత్ వరపురుషులు=ఆ ఇద్దరు శ్రేష్ఠపురుషులు, అన్యోన్యంబు=ఒకరినొకరు, బరసి=కదిసి, ఎవ్వరు+ఎటుగాగలవారొ ఇటుమీద=ఇకపై ఎవరు ఎట్లుండెదరో, అనుశంక=అను అనుమానమును, మదిపెట్టువారు=మనసులో పెట్టుకొన్నవారును, ఆ+కొదవలేల యొదవు=ఆ కొరతలెందుకు కలుగును?, మన భాగ్యమహిమకు=మన అదృష్ట సంపదయైన, అయోనిజాత=యోనియందు జన్మించని, మహితనయ=భూమి పుత్రి కృష్ణమృగనేత్ర=జింకవంటి కనులుగల, మంజుగాత్ర=సౌందర్యరాశి, ఐదవతనంబుప్రోక =ఐదవతనము రాశి అయిన, మాయమ్మ=మా తల్లి అనుచు, సతికి=సీతకు, కేల్మోడ్చువారునై=నమస్కరించుచు, సందడిలిరి=సంతోషించిరి.

తాత్పర్యము : ఈ రామ పరశురాముల అధికశక్తి ఎంతయు నాశ్చర్యకరము. ఏమి చెప్పగలము. బలిసిన ఏనుగులతో సమానమైన గుణముగలిగి లోకముచే శ్లాఘింపబడిన వీరి చూచితిరే? అనువారును, ప్రయత్నపూర్వకముగా, ఆ శ్రేష్ఠపురుషులిరువురు పరస్పరము కలియబడగా ఎవరికేమగునో ఇకపైనని అనుమానము కలుగువారును, ఆ కొరతలెందుకు? మన భాగ్యరాశికి, అయోనిజ అయిన సీత, మృగనేత్ర, మంజుగాత్ర అయినందున ఐదవతనపురాశి మా అమ్మ అని సీతకు వందనము లిడుచు సందడిగొనిరి.

భారత : ఈ రామ=ద్రౌపది, భార్గ=భృగు సంబంధమైన, వర+అమల= వరముల యొక్క నిర్మలమైన, సత్ప్రౌఢి=మహత్వమును, ఎంతయు, అద్భుతంబు, ఏమి చెప్ప, బలవత్=బలవంతులైన, అనేకపతులన్=ఐదుగురు భర్తలను, అనుగుణ్యంబు=అనుకూలవతియై, జగదుపశ్లోకితంబుగ=లోకము మెచ్చునట్లుగా, భజించె=సేవించెను, కంటిరేయనువారు=చూచితిరాయనువారు, కడకన్=ప్రయత్న పూర్వకముగా, ఏతత్=ఈ ద్రౌపది యొక్క, వరపురుషులు=పతులైన మగవారు, అన్యోన్యంబును=ఒకరినొకరు, బరసి=ఎదిర్చి, ఎవ్వరెట్టుగా గలవారూ, ఇటమీదననుశంక, మదిబెట్టువారు, మన భాగ్యమహిమకు ఆ కొదవలేలయొదవు,

అయోనిజాత=యోనియందు జన్మించనిది, మహిత=మహత్వముగల, నయ=నీతిగలది, కృష్ణ=ద్రౌపదీ, మృగనేత్ర, మంజుగాత్ర, ఐదవతనంబుప్రోక, మాయమ్మఅనుచు, సతికికేల్మోడ్చువారునై, సందడిలిరి.

తాత్పర్యము : ద్రౌపది భర్త సంబంధ వరముల యొక్క మహత్వముచేనెంతయు అద్భుతముగానున్నది. ఏమి చెప్పగలము. బలవంతులైన ఐదుగురు భర్తలకు అనుకూలవతియై లోకము మెచ్చునట్లుగా సేవించెను - చూచితిరా? యనువారు, ప్రయత్నపూర్వకముగా ఈ ద్రౌపదియొక్క పతులు ఒకరినొకరు ఎదిరించి ఎవ్వరెట్లుగాగలరో ఇకపై నను శంక గలవారు, మన భాగ్యమహిమయైన ఈమెకు ఆ కొదవలెందుకు కలుగును? అయోనిజయై మహత్వ నీతిగల ద్రౌపది మృగనేత్ర, మంజుగాత్ర, ఐదవతనములరాశి, మాయమ్మయని ద్రౌపదికి వందనములిడి సందడిగొనిరి.

వ. మఱియును 72

చ. చనియెఁ బ్రశాంతమై యనలసత్వర హేతివిహారవృత్తిచే
తన యని వింటి మిట్టియతిధర్ము యమోదయు రాజమానశా
సనుఁ గొనివచ్చెఁ దానవరజస్ఫురణాఢ్యునిఁజేసి క్రమ్మఱన్
మనపృథగూఢభాగ్యమహిమస్థితి యిట్టిది వో విచిత్రముల్ 73

రామా : అనలస=మందముగాని, త్వర=వేగముగల, హేతి=ఖడ్గము యొక్క, విహారవృత్తి=చాలనమునందు, చేతన=బుద్ధి, చనియెనని వింటిమి=వెళ్లెనని వింటిమి, ఇట్టి యతిధర్మున్=ఈ విధమైన మునిధర్మముగలవానిని, యమోదయు=యముని యొక్క ఉదయముగలవానిని, రాజమానశాసనున్=క్షత్రియ గర్వాపహారియైన పరశురాముని, తాన్=రాముడు, నవరజస్ఫురణాఢ్యునిన్+చేసి=నూత్నమై నరచు గుణ స్ఫురణ గలుగువానినిగా చేసి, క్రమ్మరిన్=తిరిగి, ప్రశాంతమై చనియె=శాంతుడై వెళ్లెను, మన=మన యొక్క, పృథక్=వేరు విధముగా, ఊఢభాగ్యమహిమస్థితి= వహించబడిన, అదృష్టశక్తి, ఇట్టిదివో=ఇటువంటిదే, విచిత్రముల్=విచిత్రములు గదా.

తాత్పర్యము : అమందమైన వేగముగల ఖడ్గవిహారమునందు బుద్ధిగలిగి ప్రశాంతమై వెళ్లెనని వింటిమి. ఇట్టి మునిధర్మముగలవానిని, యమము యొక్క ఉదయము గలవానిని, క్షత్రియ గర్వాపహారియగు పరశురాముని, తాను నూత్నమైన రజోగుణము స్ఫురించువానినిగా జేసికొని వచ్చెనని అనేకులు అనేకవిధముల పలుకుచు, మన వేరైన అదృష్టశక్తి ఇటువంటిదే విచిత్రము గదా – అనుకొనిరి.

భారత : గూఢభాగ్యమహిమస్థితి=కనిపించని అదృష్టమహిమగల, మన పృథ=మన కుంతి, అనల=అగ్ని యొక్క, సత్వర=తీవ్రమైన, హేతి=జ్వాలలయొక్క, విహారవృత్తిచే=తీవ్రతచే, తన=వర్తనచేతనే, ప్రశాంతమై చనియెనని వింటిమి, ఇట్టి , అతిధర్ముని=మిక్కిలి ధర్మనిష్ఠుడైన, యమ+ఉదయున్=ధర్మజుని, రాజమాన=ప్రకాశించుచున్న, శాసనున్=శాసనముగలవానిని, తాన=తానే, అవరజ=తమ్ముల యొక్క, స్ఫురణాఢ్యునిజేసి=స్ఫూర్తిగలవానినిగా చేసి, క్రమ్మఱన్=మరల, కొని వచ్చెన్.

తాత్పర్యము : గూఢమైన భాగ్యమహిమగల మన కుంతి అగ్నివలె తీవ్రజ్వాలల వర్తనచే ప్రశాంతమై చనియెనని వింటిమి. ఇట్టి ధర్మనిష్ఠుడైన ధర్మజుని ప్రకాశించు శాసనముగలవానిని, తమ్ముల స్ఫూర్తి గలవానినిగా చేసి మరల కొనివచ్చెను.

తే. అని యనేకు లనేకవాక్యములు వలుక
నట్లు చనుదెంచినట్టి భీమాగ్రజన్ము
నిజపురస్థాయిగాఁ గాంచి నిఖిలలోకు
లును సముద్వేగవినతులై వినుతిసేయ 74

రామా : అని, అనేకులనేక వాక్యములు=అని పలువురు పలు విధములుగా, పలుక=మాట్లాడగా, అట్లు=ఆ విధముగా, చనుదెంచినట్టి=వచ్చిన, భీమ=భయంకరుడైన, అగ్రజన్మున్=బ్రాహ్మణుడైన పరశురాముని, నిజపురః+స్థాయిగా=తనముందట నున్నట్లుగా, కాంచి=చూచి, నిఖిలలోకులును=సమస్త జనులు, సముద్వేగ=సంతోషాతిశయముతో, వినతులై=వినయముతో, వినుతిసేయ=పొగడగా.

తాత్పర్యము : ఆ విధముగా పలువురు పలురీతులుగా మాట్లాడగా వచ్చిన భయంకరుడైన పరశురాముని తన ముందట చూచి సకలజనులును సంతోషాతిశయముతో వినతులై పొగడగా.

భారత : అని, అనేకులనేక వాక్యములు, పలుక, అట్లు, చనుదెంచినట్టి, భీమ+అగ్రజన్మున్=భీముని సోదరుడైన ధర్మజుని నిజపురః+స్థాయిగా, తన నగరములో నుండగా చూచి, సమస్త జనులు, సముద్వేగ, వినతులై, వినుతిసేయ

తాత్పర్యము : అని అనేకులనేక విధములుగా పలుకగా అట్లు వచ్చిన ధర్మజుని తన నగరములో చూచి సమస్త జనులు సంతోషభరితులై వినతులు చేసి పొగడిరి.

ఉ. పేర్మిని విగ్రహించినను భీమధనంజయలీలఁ బేర్చుత
ద్ధర్మజతేజ మాత్మజుప్రతాపసమృద్ధి నడంచు నంచు నం
తర్మనుఁ డై మహీధవుఁడు తత్సమరాజ్యసమర్పణంబుఁ దా
నిర్మలవృత్తిఁ జేయుటయనీతిగ నెంచెఁ గడున్ మనంబునన్ 75

రామా : పేర్మిని=అతిశయముతో, విగ్రహించినను=మార్కొనినను, భీమ=భయంకరమైన, ధనంజయలీలన్=అగ్నివలె, పేర్చు=అధికమైన, తత్+ధర్మజ తేజము=పరశురామునివింటి శౌర్యము, ఆత్మజు=తన కుమారుడైన రాముని, ప్రతాప సమృద్ధి=శౌర్యసంపద, అడంచునంచు=అణచునని, అంతః+మనుఁడై=ఖిన్నమనస్కుడై, మహీధవుడు=దశరధుడు, తత్+ఆ రాముని యొక్క, సమర=యుద్ధమునకు, ఆజ్య సమర్పణంబు=నేతిని సమర్పణము సేయుట, తాన్=తాను, నిర్మలవృత్తిన్=నిర్మలమైన మనస్సుతో, చేయుటయ=నిర్వహించుటయే, నీతిగ=ధర్మముగా మనంబునన్= మనస్సులో, కడున్=మిక్కిలి, ఎంచెన్=భావించెను.

తాత్పర్యము : అతిశయముతో ఎదిరించి భయంకరమైన అగ్నిజ్వాలవలె పేర్చు ఆ పరశురాముని వింటి శౌర్యమును తన కుమారుడైన రాముని శౌర్యసంపద అణచునాయని మనస్సులో ఖిన్నుడై దశరధుడు ఆ రాముని యొక్క యుద్ధ యజ్ఞమునకు తాను నిర్మలవృత్తితో ఆజ్య సమర్పణ చేయుటయే ధర్మముగా మనస్సులో భావించెను.

సీ. అట్లాత్మ నెంచినయర్థ రాజ్యమహిమ
తేజప్రదీప్తుఁ డారాజు ప్రియము
తో నమర్చి యనుపమానసపర్యాప్తి
నెరపును నాదరోన్మేష మొప్ప
సప్రణతిగ నమ్మహిప్రభునానతి
గైకొని నిలక శీఘ్రంబ యరిగి
ప్రథితమహాచలేంద్ర ప్రస్థపుట భేద
నప్రభువై శిఖోగ్రప్రతాప
తే. కలితుఁ డురుదండనీతి భార్గవుఁడు నిజభు
జైకవశసర్వధరణిపార్థ్యుఁ డగుచు
నవరజస్థితి బందురాజ్యవిరళరతిఁ
బొదలి యభిరామవర్తనంబునఁ జెలంగె 76

రామా : అట్లు+ఆత్మన్+ఎంచి=ఆ విధముగా మనసులో భావించి, నయ=నీతిచేత, అర్థ=వృద్ధి బొందింపబడిన, రాజ్యమహిమన్=రాజ్యమహిమతో, తేజః=ప్రతాపముచే, ప్రదీప్తుడు=ప్రకాశించు, ఆరాజు=దశరధుడు, ప్రియముతోన్+అమర్చి=ప్రీతితోగూర్చి, అనుపమాన=అసమానమైన, సపర్యాప్తిన్=పూజా విధిని, నెఱపుచు=నిర్వహించుచు, ఆదర+ఉన్మేషము+ఒప్ప=ఆదరము, వికాసము, అతిశయింపగా, సప్రణితగన్=నమస్కారములు అందుకొనుచు, ఆ+మహిప్రభుని=ఆ రాజు యొక్క, ఆనతిన్+కైకొని=ఆజ్ఞను స్వీకరించి, నిలక=నిలువక, శీఘ్రంబు+అరిగి=వేగముగా వెళ్లి (సేవాదులను స్వీకరింపక) ప్రథిత=ప్రశస్తమైన, మహా+అచల+ఇంద్ర=క్రౌంచపర్వతము యొక్క, ప్రస్థ=చరిపట్టు యొక్క, పుటభేదన=బంధనమును ఛేదించుటయందు, ప్రభు=సమర్థమైన, వైశిఖ=విశిఖ సంబంధమైన (బాణము), ఉగ్రప్రతాప=అధికమైన ప్రతాపముతో, కలితుఁడు=కూడినవాడు, ఉరుదండనీతిన్=గొప్పదైన దండనీతిలో, భార్గవుడు=పరశురాముడు,

నిజభుజైకవశ=తన భుజబలముచే వశము చేసికొనిన, సర్వధరణిప=సమస్త రాజుల, అర్థాధ్యుడు=అర్థ ప్రాణములు గలవాడు, అగుచు, నవ=కొత్త, రజఃస్థితి=రజోగుణము యొక్క స్థితిచే, బంధుర=సమర్థమైన, ఆజి=యుద్ధమునందుగల, అవిరళరతిన్= ఆసక్తితో, పొదలి=కూడుకొని, అభిరామ=రామునికెదురైన, వర్తనంబునన్+ చెలంగె=స్థితిలో నుండెను.

తాత్పర్యము : ఆ విధముగా మనసులో భావించి నీతిచే వృద్ధి పొందిన రాజ్యమహిమచేతను, ప్రతాపముచేతను దశరథుడు అసమానమైన పూజా విధానమును నెరపుచు, ప్రణమిల్లుచుండగా ఆ దశరథుని నమస్కారమును, సేవాదులను స్వీకరించక క్రౌంచపర్వత చరియల బంధన భేదమునందు సమర్థుడైన బాణప్రతాపముతో కూడినవాడై, దండనీతితో తన భుజబలసంపత్తితో సమస్తభూపతుల అర్థప్రాణములుగొని నూత్న రాజసస్థితిలో సమర్థుడై యుద్ధమునందుగల కోర్కెతో రాముని కెదురుగా వర్తించెను.

విశేషణము : సపర్యాప్తి – సపర్యాతర్పణం బలిః – అని అమరము.

భారత : అట్లు, ఆత్మనెంచిన, అర్థరాజ్య మహిమను=సగము రాజ్యసంపదతో, తేజప్రదీప్తుడు, ఆ రాజు=ధృతరాష్ట్రుడు, ప్రియముతోనమర్చి, అనుపన్=పంపగా, మానసపర్యాప్తి=మనఃపూర్తిగా నెరపుచు, ఆదరోన్మేషమొప్పన్, సప్రణతిగ=నమస్కార పూర్వకముగా, ఆ+మహిప్రభుని=ఆ ధృతరాష్ట్రుని, ఆనతి=ఆజ్ఞను, కైకొని=స్వీకరించి, నిలక=నిలువక, శీఘ్రంబు=అరిగి, ప్రథిత=ప్రసిద్ధమైన, మహా=ఉత్సవములచే, అచల=స్థిరమైన, ఇంద్రప్రస్థ=ఇంద్రప్రస్థమనెడి, పుటభేదన=పట్టణమునకు ప్రభువై, శిఖా=జ్వాలభంగి, ఉగ్రప్రతాపకలితుడు=భయంకర ప్రతాపముతో కూడినవాడు, ఉరుదండనీతి=గొప్పదైన దండనీతిలో, భార్గవుడు=శుక్రాచార్యుని వంటివాడు, నిజభుజైకవశ సర్వధరణి=తన భుజబలముచే వశముగాబడిన సమస్త రాజ్యముగలవాడు, పార్థాద్యుడు=పృథపుత్రులలో జ్యేష్ఠుడు–ధర్మరాజు, అగుచున్, అవరజస్థితిన్=తమ్ముల కూటమిచే, బంధురాజి=ఆత్మజనుల సహాయము యొక్క,

అవిరళరతిన్=అధికానురాగముచే, పొదలి, అభిరామవర్తనంబున=అందముగా, చెలంగె=ప్రకాశించెను.

విశేషణము : పుటభేదన - పట్టణం పుటభేదన-మని అమరము.

తాత్పర్యం : ఆ విధముగా మనసులో భావించిన అర్ధరాజ్య మహిమతో తేజోవంతుడైన ఆ ధృతరాష్ట్రుడు ప్రియముగా అమర్చి పంపగా మనః పూర్తిగా ఆదరవికాసము లొప్పగా నమస్కారసహితముగా ఆ ధృతరాష్ట్రుని ఆజ్ఞను గైకొని నిలువక శీఘ్రముగా వెళ్లి ప్రశస్తమైన ఇంద్రప్రస్థ నగరమునకు ప్రభువై తన ప్రతాపముతో కూడినవాడై గొప్పదైన దండనీతియందు శుక్రాచార్యునితో సమానమై తన భుజబల సంపత్తితో సమస్త భూమిని వశము చేసుకొన్న ధర్మజుడు సోదరులు, బంధువుల అధికానురాగముతో చెలంగెను.

వ. ఇట్లు ప్రవర్తిల్లుచుండ 77

తాత్పర్యము : ఈ విధముగా గడచుచుండగా

కం. సత్యైక్యము కతమున వీ
రత్యంతము నిర్విభేదులయ్యు నతనుమా
యాత్యాజితమైత్రీ సా
తత్యతఁ దమలోనఁ బోరెదరొయను శంకన్ 78

రామా : సత్య=యదార్థమైన, ఐక్యము కతమునన్=ఇద్దరును ఆ విష్ణుని అవతారములైన కారణమున, వీరు=రాముడు, పరశురాముడు, నిర్విభేదులయ్యున్=భేద భావములేనివారైనను (బెరకులేనివారు) అత్యంతము=మిక్కిలి, అతనుమాయా=అధికమైన మాయచే, త్యాజిత=విడువబడిన, మైత్రీ=స్నేహము యొక్క, సాతత్యతన్=ఎడతెగనుగలవారగుటచే, తమలోనన్=తమలోతాము, పోరెదరొ= తగవులాడెదరో, అనుశంకన్=అను అనుమానముచే...

తాత్పర్యము : ఇద్దరును యదార్థముగా ఆ విష్ణుని అవతారములైన కారణముచే రాముడును, పరశురాముడును మిక్కిలి అధికమాయచే విడువబడిన స్నేహ

సంబంధముగలవారు అగుటచే తమలోతాము పోరాడెదరను ననుమానముచే -

భారత : సతీ=భార్య యొక్క, ఐక్యము కతమునన్=ఒక్కటే అయిన కారణముచే, వీరు=పాండవులు, అత్యంతులు, నిర్విభేదులయ్యు, అతనుమాయా=మన్మధుని మాయచే, త్యాజిత, మైత్రీసాతత్యత, తమలోన-పోరుదురొయను శంకన్.

తాత్పర్యము : ద్రౌపది ఒక్కటీ అయిన కారణముచే పాండవులు అత్యంతము భేదభావములేని వారైనను, మన్మధుని మాయవలన విడువబడిన స్నేహము యొక్క ఎడతెగమని వదలి తమలో తాము పోరాడెదరేమోనను అనుమానముచే -

పై పద్యముతో అన్వయము.

కం. కయ్యంబుల వేడుకకాఁ
దయ్యున్నతకలహకేళికా కాంక్షకుఁ డై
నెయ్యమున వచ్చె నారదుఁ
డయ్యెడ దివినుండి వారి నభిదర్శింపన్. 79

రామా : కయ్యంబుల వేడుకకాడు=తగవులను వేడుకగా భావించువాడును, ఆ+ఉన్నత కలహకేళీకాంక్షకుఁడై=ఆ గొప్ప తగవు అను వినోదమును కోరినవాడై, నారదుఁడు, నెయ్యమున=స్నేహభావముతో, వారిన్=రామభార్గవులను, అభిదర్శింపన్=చూచుట కొఱకు, దివినుండి=స్వర్గము నుండి, వచ్చె=వచ్చెను.

తాత్పర్యము : తగవులమారియు, తగవులను వినోదముగా భావించువాడును నయిన నారదుడు స్నేహభావముతో రామపరశురాములను చూచుట కొఱకై దివినుండి దిగి వచ్చెను.

భారత : కయ్యంబుల వేడుకకాడయ్యున్=యుద్ధాపేక్షగలవాడైనను, నత=అణగిన, కలహకేళికా=తగవులను వేడుకయందు, ఆకాంక్షకుడై=కోరికగలవాడై నారదుడు, నెయ్యమున, వారిన్=పాండవులను, అయ్యెడ, అభిదర్శింపన్, దివి నుండి వచ్చె=వచ్చెను.

తాత్పర్యము : యుద్ధముపై కోరికగలవాడైనను తగవులను వేడుకగా నణచుకొని నారదుడు స్నేహపురస్సరముగా పాండవులను అక్కడ చూడవలెనను కోరికతో వచ్చెను.

వ. అప్పుడు. 80

ఉత్సాహ. ఆనరాధిపతికుమారకాగ్రయాయి దమ్ములుఁ
దాను బరశుభాసమానధాముఁడైనమునికిఁ బెం
పూన నర్ఘ్యముఖ్యవిధులనూనముగ నొనర్ప న
మ్మౌనివరుఁడు నవగణితసమస్తతదుపచారుఁడై. 81

రామా : ఆనరాధిపతికుమారక+అగ్రయాయి=ఆ దశరథుని కుమారులలో జ్యేష్ఠుడైన శ్రీరాముడు, తమ్ములున్=తమ్ములును, తాను=తానును, పరశు=గండ్రగొడ్డలిచే, భాసమాన=ప్రకాశించుచున్న, ధాముడైన=ప్రతాపముగల, మునికిన్=పరశురామునికి, పెంపూనన్=ఆదరముతో, అర్ఘ్యముఖ్యవిధులన్= అర్ఘ్యపూజాది విధులచే, అనూనముగ=గొప్పగా, ఒనర్పన్=చేయగా, ఆ+మౌనివరుడు= ఆ మునియు, అవగణిత=లెక్కింపరానంత, సమస్త=సకల, తత్=శ్రీరామునిచే, ఉపచారుడై= ఉపచారములు పొందినవాడై.

తాత్పర్యము : ఆ దశరథ కుమారులలో జ్యేష్ఠుడైన శ్రీరాముడు తానును, తమ్ములును పరశువు ధరించి ప్రకాశించు పరశురామునికి ఆదరముతో అర్ఘ్యపాద్యాది పూజావిధులు ఘనముగా చేయగా ఆ మునియు రామునిచే సమస్తములైన ఘన మర్యాదలను ఉపచారముగా పొందినవాడై.

భారత : ఆనరాధిపతికుమారగ్రయాయి=ఆ పాండు పుత్రులలో జ్యేష్ఠుడైన ధర్మజుడు, తమ్ములున్=తమ్ములును, తానును, పరశుభా సమానధాముడైన=ఇతరులకు శుభప్రదమైన అసమానమైన తేజస్సుగల, మునికిన్=నారదునికి పెంపూన, అర్ఘ్యముఖ్యవిధులు, అనూనముగ, నొనర్చన్, ఆ+మౌనివరుడు=ఆ నారదుడు, అవగణిత సమస్త, తత్=ఆ పాండవుల యొక్క, ఉపచారుడై=ఉపచారములు పొందినవాడై.

తాత్పర్యము : ఆ పాండు పుత్రులలో జ్యేష్ఠుడైన ధర్మరాజు తమ్ములును, తానును ఇతరులకు శుభప్రదము, అసమానమైన తేజస్సుగల నారదమహర్షికి ఆదరముతో అర్ఘ్యపాద్యాది పూజావిధులు గొప్పగా చేయగా, పాండవులచే సమస్త ఉపచారములు పొందినవాడై.

విశేషణము : ఉత్సాహవృత్తామునకు పాదమునకు ఏడు సూర్యగణములును, ఆ పైన ఒక గురువును ఉండును. అయిదవ గణము మొదటి యక్షరము యతిస్థానము. ఇట్లు నాలుగు పాదములు. సగణము, హగణము అను రెండు సూర్యగణములు. ఈ రెండును కలిసి ఏడు గణములుండును.

వ. పదంపడి నిజభ్రూచలనదూరనిరస్త సమస్త జనుండగుచు నతని నుపలక్షించి తదనుజసమక్షంబున. 82

అర్థము : పదంపడి=తరువాత, నిజభ్రూచలన=తన బొమముడి కదలికచే, దూరనిరస్తసమస్తజనుండు+అగుచు=ఇతరులైన సమస్త జనులను దూరముగా నెంచబడినవారినిగా చేసి, అతనిన్=అతనిని (రాముని), ఉపలక్షించి=ఉద్దేశించి, తత్+అనుజ సమక్షంబున=అతని తమ్ములముందర.

తాత్పర్యము : తరువాత పరశురాముడు తన భ్రూకుటీచలనముచే సమస్తజనులను దూరముగాచేసి, రామునుద్దేశించి అతని తమ్ములముందర.

భారత : పదంపడి, నిజభ్రూచలన దూరనిరస్తసమస్త జనుండగుచు, అతనిన్=ధర్మజుని, ఉపలక్షించి, తత్+అనుజ సమక్షంబున.

తాత్పర్యము : తర్వాత నారదుడు తన బొమముడి కదలికలచే అక్కడనున్న సమస్త జనులను దూరముగా పంపి ధర్మజునుద్దేశించి అతని తమ్ముల ముందర.

కం. అకళంకిత నిట్టనుఁ గొం
చకయేమీమనము సమరసముదారక్రీ
డకు నొండొరు మార్కొనుట దొ
రకు నని వచ్చితి నెఱుంగ రావా కినుకల్. 83

రామా : అకళంకితన్=కళంకములేని విధముగా, కొంచక=సంకోచింపక, ఇట్టనున్=పరశురాముడు ఇట్లనెను, ఏమీ=ఏమీ, మనము=మన మిరువురము, సమీర=యుద్ధము యొక్క, సముదారక్రీడకున్=ఉదాత్తమైన వినోదమునకు, బండొరు=ఒకరినొకరు, మార్కొనుట=ఎదుర్కొను విధము, దొరకునని=లభించునని, వచ్చితి=వచ్చితిని, కినుకల్=కలహోద్యోగములు, ఎఱుంగరావా?=తెలియవా?

తాత్పర్యము : కళంకములేని రీతిలో సంకోచింపక పరశురాముడు రామునితో ఇట్లనెను. ఏమీ! మనమిరువురము ఉదారరీతిలో యుద్ధక్రీడలో ఒకరినొకరు తలపడు విధము లభించునని వచ్చితిని. ఆ కలహోద్యములు తెలియబడవా? (ఇది భర్త్సనా వాక్యము)

భారత : అకళంకితన్, కొంచక, ఇట్లనున్=నారదుడిట్లనును; ఏన్=నేను మీమనము=అన్నదమ్ములైన మీ మనసులు, దారక్రీడకున్=ద్రౌపదీ సంభోగమునకు, సమరసము=సమానరాగమైనది, ఒండొరు=మీరు పరస్పరము, మార్కొనుట= కలహించుట, దొరకునని=సంభవించునని, వచ్చితిన్=దానికి కట్టడి చేయదలచి వచ్చితిని; ఆకినుకలు=ఆ కలహములు (స్త్రీ సంబంధ కోపములు) ఎఱుంగరావు= తెలిసినట్లుగారావు.

తాత్పర్యము : కళంకములేని రీతిలో సంకోచింపక నారదుడు ధర్మజాదులతో నిట్లనెను. నేను అన్నదమ్ములైన మీ మనసులు ద్రౌపదీ సంభోగ విషయమున సమానరాగము గలవని ఎరుగుదును. మీరు పరస్పరము కలహించుకొనుట సంభవించునని దానికి కట్టడి చేయదలచి వచ్చితిని. స్త్రీ సంబంధ కోపములు చెప్పిన రీతిలో రావు.

కం. చేతశ్చిత్రము గాదె స
మాతతగుణసార్థసిద్ధిమద్రామమహా
ఖ్యాతిపతివ్రత యిట్లవి
ఘాతముగ ననేకభర్తృకత నడపు టిలన్ 84

రామా : సమాతతగుణ=విస్తృత గుణములచే, సార్థసిద్ధి=అర్థముతో కూడిన, మత్=నాయొక్క, రామ=రాముడనెడి, మహాఖ్యా(మహా+అఖ్యా)=గొప్ప పేరు, అతిపతివ్రత=మిక్కిలి పాతివ్రత్యముచే, ఇట్లు, అవిఘాతముగా=అడ్డులేని రీతిలో, ఇలన్=భూమిపై, అనేక భర్తృకతన్=అనేక భర్తలుగలదౌటను, నడపుట= అసాధారణముగా నారామాఖ్యమరి యొకరి కుండుట, చేతః+చిత్రముగాదె= మనస్సునకు విచిత్రముగాదా?

తాత్పర్యము : విస్తృత గుణములచే అర్థసిద్ధితో కూడిన రాముడనెడి విశేష ఖ్యాతి గల రాముడను నా పేరు అతిపతివ్రతచే అనేక భర్తలుగల దౌటచే అసాధారణముగా మరొకరి యందుండుట ఆశ్చర్యముగాదా?

భారత : సమాతత, గుణసార్థ=గుణసమూహములయొక్క, సిద్ధిమత్=సిద్ధిగల, రామ=ద్రౌపది, మహాఖ్యాతి=అధిక కీర్తిగలది, పతివ్రత; ఇట్లు=ఈ విధముగా, ఇలన్=భూలోకములో, అవిఘాతముగా=అడ్డంకులు రాని రీతిలో, అనేక భర్తృకతన్=పెక్కురు భర్తలు గలిగి, నడుపుట, చేతశ్చిత్రముగాదె.

తాత్పర్యము : విస్తృత గుణసముదాయసిద్ధిగల ద్రౌపది అధిక కీర్తిగల పతివ్రత. ఈ విధముగా భూలోకములో అడ్డంకులు రాని రీతిలో పెక్కండ్రు భర్తలతో సంచరించుట మనస్సునకు చిత్రముగాదా?

విశేషణము : సంఘుసార్థౌ - అని అమరము.

ఆ. ఇదియ నాకు మీకు నితరేతరద్వేష
హేతు వనుచుఁ దోఁచె నేకతన్వి
భూతినెరపు నేను బుంవ్యక్తులకు నాలి
తనముతో సమాఖ్య మనుచు టెట్టు 85

రామా : ఇదియ=ఈ రామశబ్దమే, నాకు-మీకున్=నాకును, మీకును, ఇతరేతర=మరొక విధముగా, ద్వేషహేతువు+అనుచున్=కోపమునకు కారణమని, తోచెన్, ఏకతన్=ముఖ్యత్వమున, విభూతి=ఐశ్వర్యమును, నెరపు నేను=కలిగిన నేను,

పుంవ్యక్తులకున్=పురుషులకు, నాలితనముతో=కొంచెపుతనముతో, సమాఖ్య=సమానమైన పేరును, మనుచుట+ఎట్లు=ఉంచుట ఎట్లు?

తాత్పర్యము : ఈ రామశబ్దమే మన ఇరువురుకును మరొకరీతిలో ద్వేషకారణమని నాకు తోచుచున్నది. ఏకత్వముతో ఐశ్వర్యమును కలిగిన నేను పురుషులకు కొంచెపుతనముతో సమానమైన 'రామ' శబ్దమును ఉంచుట ఎట్లు? (ఆడువారికి 'రామ' అని పిలువవచ్చును గాని ఇతర పురుషులకెట్లు? అని ప్రశ్నించెను).

భారత : ఇదియ=ఈ ఏకపత్నీభోగము, మీకున్=మీ పాండవులకు, ఇతర+ఇతర ద్వేష హేతువనుచు దోచె, ఏకతన్వి=ఒక స్త్రీ, భూతినెరపు=ఐశ్వర్యముగలుగు, ఏను=ఐదుగురు, పుంవ్యక్తులకు, ఆలితనముతో=భార్యగా, సమాఖ్యమనుచుట+ఎట్లు=కీర్తి చెడకుండ ప్రవర్తించుటెట్లు?

తాత్పర్యము : ఈ ఏకపత్నీభోగము మీకు పరస్పరము వైరమూలమగునని నాకు తోచుచున్నది. ఒకే కాంత ఐశ్వర్యవంతులైన ఐదుగురు పురుషులకు భార్యగా కీర్తి చెడకుండ నిర్వహించుటెట్లు?

చం. భవదుపయామకాలమునఁ బర్వినసుద్దులు విన్న వాఁడ నా
భవువరధర్మ మట్టగుట భావములో నిడి మాకు శంక లె
య్యవి యని యుబ్బు టొప్ప దివి యావరశక్తికి లోనుగా వశ
క్యవిజయముల్ మదీరితమహాశరమణ్యవరుద్ధ యుద్ధముల్. 86

రామా : భవత్=మీ యొక్క, ఉపయామకాలమునన్=వివాహ సమయములో, పర్వినసుద్దులు=జరిగిన వార్తలు, విన్నవాడ=విన్నాను, నాభవు=నా గురువైన ఈశ్వరుని, వరధర్మము=దొడ్డవిల్లు, అట్టగుట=ఆ విధముగా విరువబడుట, భావములోనిడి=మనస్సులో నుంచుకొని, మాకు, శంకలు+ఎయ్యవి=అనుమానములేవియో, అవి=అవి, ఉబ్బుట+ఒప్పదు=గర్వపడుట మంచిదిగాదు, ఇవి, ఆవరశక్తికిన్=ఆ విల్లు విరిచిన సత్త్వమునకు, లోనుగావు=లోబడవు, మత్=నాచేత, ఈరిత= ప్రయోగింపబడిన, మహాశరమణి=మహాస్త్రములలో గొప్పవానిచే, అవరుద్ధ= నిలుపబడిన (చేయబడిన)

యుద్ధముల్=యుద్ధములు, అశక్యవిజయముల్= సహింపరాని జయములు.

తాత్పర్యము : మీ వివాహ సమయములో జరిగిన విశేషములు నేను విన్నాను. నా గురువైన ఈశ్వరుని గొప్పవిల్లును ఆ విధముగా విరుచుట మనస్సులో నుంచుకొని అనుమానములేవియో యవి చూచి గర్వపడుట మంచిదిగాదు. ఇవి ఆ విల్లువిరిచిన సత్వమునకు లోబడవు. నాచే ప్రయోగింపబడిన మహాస్త్రములలో గొప్పవానిచే చేయబడిన యుద్ధములు అశక్యములైన విజయములు.

భారత : భవత్, ఉపయామకాలమున, పర్వినసుద్దులు=వ్యాసుదు ప్రవచించిన పంచేంద్రియోపాఖ్యానము మొదలైన వార్తలు, విన్నవాడ, ఆభవు=ఆ ఈశ్వరుని యొక్క, వరధర్మము=వరము యొక్క పద్ధతి, అట్టగుట=అయిదుగురు పతుల నిచ్చుటను, భావములోనిడి, మాకు శంకలెవ్వి, అవియుబ్బుటొప్పుడు, ఇవి=స్త్రీ మూలక వైరములు, ఆవరశక్తికిన్=ఆ ఈశ్వర మాహాత్యమునకు, లోనుగావు, అశక్య విజయముల్= జయంపరానట్టివి, మత్=నాచే, ఈరిత=పలుకబడిన (సుందోప సుందోపాఖ్యానము) మహాశ=అధిక సురతాపేక్షగల, రమణీ=స్త్రీలచే, అవరుద్ధ=కల్పింపబడినవి (యుద్ధము లశక్యవిజయములని అన్వయము).

తాత్పర్యము : మీ వివాహ సమయమున జరిగిన వార్తా విశేషములు విన్నాను. ఆ ఈశ్వరుని వరము యొక్క రీతిలో అయిదుగురు పతులనిచ్చుట స్త్రీ మూలకమైన వైరములు ఈ విధముగా కలుగుట నా మనసులో శంకను కలిగించుట సహజము. ఆ ఈశ్వర మాహాత్యమునకు అవి లోనుగావు. అట్లగుట వలన నేను చెప్పిన అధిక సురతాపేక్షగల స్త్రీలచే కల్పింపబడిన యుద్ధములు సాధింపరాని విజయములు.

కం. విను మంతపనుల రాకకు
మునుపుగఁ దచ్ఛాంతిమార్గముం దెలిపెద నొం
డొనరింపుము సమయము ధరఁ
గొనసాఁగి తనర్చెద మనుకోర్కి గలిగినన్. 87

రామా : వినుము, అంత పనుల రాకకు=అంతటి వైరుధ్యములు రాక,

మానుపుగ=ముందే, తత్+శాంతి మార్గమున్=ఆ శాంతి పద్ధతిని, తెలిపెదన్=చెప్పెదను, బండు+ఒనరింపుము=ఒక పని చేయుదు, ధరన్=భూమిపై, కొనసాగి=కొనసాగి, తనర్చెదమను కోర్కె=జీవించెదమను కోరిక, కలిగినన్=కలిగినచో.

తాత్పర్యము : పరశురామా! వినుము! అంతటి వైరుధ్యములు రాకముందే ఆ శాంతి మార్గమును చెప్పెదను ఆ ఒక్కటి చేయుదు. భూమిపై కొనసాగి జీవించెదమను కోర్కె కలిగినచో –

భారత : వినుము, అంత పనుల రాకకు, మునుపుగ, తత్+శాంతి మార్గమున్ తెలిపెద, బండు=ఒక, సమయము=సంకేతమును, ఒనరింపుము, ధరనే కొనసాగి తనర్చెదమను కోర్కె గలిగినన్.

తాత్పర్యము : వినుము. అంతటి వైరుధ్యము రాకముందే ఆ శాంతి మార్గమును నేను తెలిపెదను. ఒక సంకేతమును ఏర్పరచుకొనుడు. దానిని భూమిపై కొనసాగించి జీవించెదమను కోర్కె కలిగినచో –

చం. సమరసరూఢిమచ్చరితసాధ్వసమాకృతిఁ బర్వరాజస
త్వమదనిరాసివక్త్రమగు వందనధర్మము పూని కొల్వు సే
యు మనుము నీకుఁ దమ్ములకు నొక్కనియొక్కనియింట నేఁడు పూ
ర్ణముగ వసించి సొంపు లమరన్ సమయం బిటు సేయు టొప్పగున్ 88

రామా : సమర=యుద్ధమునందు, సరూఢి=ప్రసిద్ధితోగూడిన, మత్=నాయొక్క, చరిత=చరిత్రవలననైన, సాధ్వసము=భయము, ఆకృతిన్ పర్వన్=ఆకారముతో కనిపించగా, రాజసత్వ=రజోగుణముచేనైన, మద=మదమును, నిరాసి=విడిచిన, వక్త్రమగు=ముఖముగల (ఆరంభముగల) వందనధర్మము=నమస్కార ధర్మమును, పూని కొల్వుసేయుము=ప్రయత్నించి సేవించుము – మనుము=బ్రతుకుము, నీకు=రామునికి, తమ్ములకు, ఒక్కని యొక్కని యింట=ఒక్కొక్కరి యింటిలో, నేడు=ఈ ప్రొద్దు, పూర్ణముగ వసించి=పూర్తిగా జీవించి, సొంపులు=విలాసములు, అమరన్=అమరుటకు, సమయంబు=వేళ, ఇటు సేయుట+ఒప్పగున్=వందనము చేయుట మేలు.

తాత్పర్యము : యుద్ధములో ప్రసిద్ధితో గూడిన నా చరిత్రవల్ల భయము ఆకారము దాల్చి కన్పించగా, రజోగుణముచే మదమును విడిచిన ఆరంభముగల వందన ధర్మమును ప్రయత్నించి సేవించుము. అట్లు బ్రతుకుము. నీకు నీ తమ్ములకు ఒక్కొక్కరి ఇంటిలో ఈ ప్రొద్దు పూర్తిగా జీవించి విలాసములమరుటకు వేళ అయినది. వందన ధర్మము చేయుట మేలు.

భారత : సమరసన్=సమాన రాగముగలదానిని, రూఢిమత్+చరితను= ప్రసిద్ధమైన చరిత్రగలదానిని, సాధు=సుందరమై, అసమ=సరిలేని, ఆకృతిగలదాని= ఆకారము గలదానిని, పర్వరాజ=పున్నమి చంద్రుని యొక్క, సత్వమద=చారుత్వ గర్వమును, నిరాసివక్త్రన్=తిరస్కరించు ముఖముగలదానిని, మగువన్=ద్రౌపదిని, తన ధర్మముపూని=పతివ్రతా ధర్మము పూని, ఒక్కని యొక్కని యింటను=ఒక్కొక్కరి ఇంటిలో, ఏడు=సంవత్సరము, వసింపు, సొంపులమరక, సమయంబు= నియమము- చేయుట, ఒప్పగున్.

తాత్పర్యము : సమాన రాగముగల దానిని, ప్రసిద్ధ చరిత్ర గలదానిని, సుందరమై అసమానాకృతి గల దానిని, పూర్ణిమాచంద్రుని చారుత్వగర్వమును తిరస్కరించు ముఖముగల ద్రౌపది పతివ్రతా ధర్మము పూని ఒక్కొక్కరి యింట ఒక సంవత్సరము వసించు సొంపు పెంపుగా నియమము చేయుట ఒప్పగును.

వ. మరియు నొక్క నియమం బెఱింగించెద. 89

తాత్పర్యము : ఇంకను ఒక నియమము తెలిపెదను.

కం. విను రామ యొరునిశాంతం
బున సేవయొనర్చు కాలమున నెవ్వఁడు దాఁ
జను దండకార్యగతి నా
యన వర్షాచరితతీర్థయాత్రుఁడుగఁ దగున్. 90

రామా : రామ=ఓ రామా! విను=వినుము, శాంతంబునన్=శాంతిచే, సేవయొనర్చు కాలమున=సేవించు సమయమున, బరుని=ఇతరులను, దండ

కార్యగతిన్=దండోపాయమున, ఎవ్వడు=ఎవడు, తాన్=తాను, చనున్=ప్రవర్తించును, ఆయన=ఆతడు, వర్ష=వర్షాకాలమునందు, ఆచరిత= చేయబడిన, తీర్థయాత్రుఁడుగన్=తీర్థయాత్ర గలవాడుగా, తగున్=తగును.

తాత్పర్యము : ఓ రామా! వినుము. శాంతిచే సేవ చేయు సమయంలో ఇతరులను దండించు పనిలో ఎవడు ప్రవర్తించునో ఆయన వర్షాకాలమున చేసిన తీర్థయాత్ర గలవాడగును.

విశేషణము : 'వర్షాకాలే ప్రయాణమ్' అని యతిక్లేశము.

శాంతంబునన్=శాంతిచే - కర్తరిక్తః అని అమరము.

భారత : విను=వినుడు! రాము=ద్రౌపది, ఒరు=ఒకరి యొక్క, నిశాంతంబునన్=గృహమున, సేవ యొనర్చుకాలమున=సేవించు సమయమున, దండకు=సమీపమునకు, ఎవ్వడు తాన్+చనున్=తాను వెళ్లునో, ఆయన, ఆర్యగతిన్=సన్మార్గములో, వర్ష=సంవత్సరమంతయు, తీర్థయాత్రుడుగన్+తగున్.

తాత్పర్యము : వినుడు! (పాండవులకు సంబోధన!) ద్రౌపది ఒకరి గృహములో సేవ చేయు కాలములో ఎవరు సమీపమునకు వెళ్లెదరో ఆయన సన్మార్గములో ఒక సంవత్సర కాలము తీర్థయాత్ర చేయదగును.

విశేషణము : నిశాంతము=నిశాంతనస్త్యసదనమ్ - అని అమరము.

కం. అనిశమదమహిమవర్తనుఁ
డనిపించుకొని చనియెను సహస్రకరుఁడు నా
యనలసమానౌజస్స ప్లు
ష్టినిఁజిత్రపతంగలీలఁ జెందెఁ జనునెడన్ 91

రామా : అనిశ=ఎల్లప్పుడు, మదమహిమ=గర్వాతిశయముగల, వర్తనుడు=ప్రవర్తనగలవాడను, అనిపించుకొని=ఖ్యాతిగలవాడై, సహస్రకరుడు= కార్తవీర్యార్జునుడు, చనియెను=నొచ్చెను, నా=నా యొక్క, అనలసమాన=అగ్నితో

సమానమైన, ఓజః=తేజస్సు యొక్క స్ఫృష్టిని=స్పర్శచే, చనునెడన్=నొచ్చునపుడు, చిత్ర=అద్భుతమైన, పతంగ=మిడుత యొక్క లీలన్ సామ్యమును, చెందెన్=చెందెను.

తాత్పర్యము : నిరంతరము గర్వాతిశయ ప్రవర్తనగల వాడను ఖ్యాతిగలవాడై కార్తవీర్యార్జునుడు నొచ్చెను. నా యొక్క అగ్నితో సమానమైన తేజ స్పర్శచే నొచ్చునపుడు అద్భుతమైన మిడుతవలె సామ్యమును చెందెను. (నా ప్రతాపాగ్నిలో అతడు మిడుతవలె పడుట వినియుండవా?)

విశేషణము : పతంగ-సమౌపతంగశలభౌ-అని అమరము.

భారత : అని=ముందు చెప్పినట్లుగా, శమ=అంతరింద్రియ నిగ్రహము చేతను, దమ=బహిరింద్రియ నిగ్రహముచేతను, హిమ=చల్లనైన, వర్తనుడు=వర్తనముగల (నారదుడు), అనిపించుకొని=అంపించుకొని, చనియెన్=చనియెను, చనునెడన్=వెళ్లునపుడు (నారదుడు ఆకాశములో), సహస్రకరుడు=సూర్యుడు, ఆయన=ఆయన యొక్క, లసమాన=ఒప్పుచున్న, ఓజ స్స్ఫుష్టిని=తేజస్స్పుర్శచే, చిత్రపతంగ=చిత్తరువులోని సూర్యుని యొక్క, లీలన్=చెందెన్=లీలను చెందెను.

తాత్పర్యము : ముందు చెప్పినట్లుగా అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహముచే చల్లనైన వర్తనముగల నారదుడు అంపించుకొని (వీడ్కోలు పొంది) చనియెను. ఆకాశగమనమున ఆయన పోవునపుడు సహస్రకిరణుడైన సూర్యుని తేజస్స్పుర్శచే చిత్తరువులోని సూర్యునివలె ఆయన భాసించెను.

విశేషణము : పతంగ-పతంగః పక్షి సూర్యయోః అని అమరము.

ఉత్సాహ : అంతరహితసమయవృత్తినర్జునుండు ధర్మ రా
జాంతికమున కరిగె దృఢనిజాయుధగ్రహేచ్ఛన
త్యంతము గురుధేనుదస్యుతాపితాతిమన్యుమ
త్స్వాంతబాడబప్రశాంతిసలుపనేర కొండుమైన్ 92

రామా : (ఈ పద్యములో గూడ కార్తవీర్యార్జునుని భంగమే ఉత్ప్రేక్షించబడినది).

అంతరహిత=అంతశ్శత్రువుల యొక్క సమయవృత్తిన్=సమిష్టి వ్యాపారముచే, అర్జునుండు=కార్తవీర్యార్జునుడు, దృఢ=దృఢమైన, నిజాయుధగ్రహేచ్ఛన్=తన ఆయుధములను తీసుకొనుటమానక, అత్యంతము=మిక్కిలిగా, గురు=తన తండ్రి జమదగ్ని యొక్క ధేను=గోవు యొక్క దస్యుతా=చౌర్యముచే, అపిత=పొందబడిన, అతిమన్యు=మిక్కిలి కోపముగల, మత్=నా యొక్క, స్వాంత=మనస్సు అనెడి, బాడబ=బడబాగ్నికి, ప్రశాంతి=శాంతిని, ఒండుమైన్=ఉపాయాంతరము, సలుప నేరక=చేయలేక, ధర్మరాజ=యముని యొక్క అంతికమునకు=సమీపమునకు, అరిగెన్=వెళ్లెను.

తాత్పర్యము : అంతః శత్రువుల సమిష్టి వ్యాపారముచే కార్తవీర్యార్జునుడు దృఢమైన తన ఆయుధములను ధరించుట మానక మిక్కిలిగా మా తండ్రి జమదగ్ని గోవును చౌర్యము చేసి పొందిన అధిక కోపముగల నా స్వాంతమను బడబాగ్నిని శాంతింపజేయు ఉపాయాంతరము లేక యముని వద్దకు వెళ్లెను.

(మాకు ఆగ్రహమును తెప్పించి భూలోకమున నిలువగూడదు గనుక యమలోకమునకు వెళ్లెనని భావము).

భారత : అంతన్=తర్వాత, రహిత=వదలబడిన, సమయ=సంకేతముగల, వృత్తిన్=ప్రవర్తనచే అర్జునుండు, ధర్మరాజు=ధర్మజుని, అంతికమునకు=గృహమునకు, దృఢ=దృఢమైన, నిజ+ఆయుధగ్రహ+ఇచ్ఛ=తన ఆయుధములను తీసికొను కోరికతో, అరిగె=వెళ్లెను, అత్యంతము=మిక్కిలిగా, గురు=పూజ్యములైన, ధేను=పాడియావులను, దస్యు=దొంగలచే, తాపిత=తపింపజేయబడినట్టి, అతిమన్యుమత్=మిక్కిలి శోకవంతమైన, స్వాంత=మనస్సుగల, బాడబ=బ్రాహ్మణునికి, ప్రశాంతిన్=మానసిక శాంతిని, సలుపనేరక=చేయలేక, ఒండుమెయిన్=వేరొక విధముగా.

తాత్పర్యము : తర్వాత వదలబడిన సంకేతముగల ప్రవర్తనచే అర్జునుడు దృఢమైన తన ఆయుధములను గ్రహించు కోరికతో ధర్మజుని గృహమునకు వెళ్లెను. మిక్కిలి పూజ్యములైన పాడియావులను దొంగిలించుటచే తపింపచేయబడి మిక్కిలి శోకతప్త మనస్కుడైన బ్రాహ్మణునకు మానసిక శాంతిని కలిగించుటకు వేరొక విధము

తెలియక (వెళ్లెను).

విశేషణము : దస్య - దస్యుతస్కరమోషకాః అని అమరము.

బాడబ - ద్విజాత్యగ్రజన్మభూదేవ బాడబాః అని అమరము.

కం. ఉదుటున నట్లరిగి యతం
డది ప్రాయశ్చిత్త తీర్థ యాత్రాలీలన్
వదలక పూతము సేయన్
సదమలగతి పూనె వృథయె సత్సంగరముల్. 93

రామా : అతండు=కార్తవీర్యార్జునుడు, ఉదుటున=ఒక్క ఎత్తున, అట్లు+అరిగి=అట్లు వెళ్లి, అది=ధేనుచౌర్య దోషమును, వదలక, పూతము+చేయన్=పవిత్రము చేయుటకు, ప్రాయశ్చిత్త=పాపపరిహారకర్మమునకు, తీర్థ=రేవు అయిన (ప్రవేశాస్పదమైన), యాత్రా=యుద్ధయాత్ర యొక్క, లీలన్=లీలచే, సదమలగతి=సద్గతిని, పూనె=పూనెను. సత్+సంగరములు=లెస్సయుద్ధములు, వృథయె=వ్యర్థమా?

తాత్పర్యము : కార్తవీర్యుడు ఒక్క ఎత్తున అట్లు వెళ్లి, ధేనుచౌర్య దోషమును పవిత్రము చేయుటకై పాపపరిహార కర్మకై రేవు అయిన యుద్ధయాత్ర లీలచే సద్గతిని పూనెను. మంచి యుద్ధములు వ్యర్థములగునా?

(ప్రియము చెప్పవలెను. లేదా గట్టిగా పోట్లాడవలెను)

విశేషణము : స్మృతి వాక్యము : ఎంతటి పాపాత్ముడైనను యుద్ధములో సద్గతిని బొందును.

"ద్వావిమౌ పురుషౌలోకే సూర్యమండల భేదినౌ
పరివ్రాడ్యోగ యుక్తశ్చ రణేచాభిముఖోహతః"

భారత : అతండు=అర్జునుడు, ఉదుటున, అట్లు, అరిగి, అది=ధర్మరాజు పడకటింటిలోనికి వెళ్లిన ప్రతిజ్ఞా భంగదోషమును, వదలక, పూతముచేయన్,

ప్రాయశ్చిత్త, తీర్థయాత్రాలీలన్=తీర్థయాత్రలకు వెళ్లునట్లు, సదమలగతిపూనె, సత్+సంగరముల్=సత్పురుషుల ప్రతిజ్ఞలు, వృధయె=వృధాకావు.

తాత్పర్యము : అర్జునుడు ధర్మజుని పడకటింటిలోనికి పోయిన ప్రతిజ్ఞా భంగదోషాన్ని పవిత్రము చేయుటకు వదలక ప్రాయశ్చిత్తముగా తీర్థయాత్ర చేయు సత్ప్రవర్తనను పూనెను. సత్పురుషుల ప్రతిజ్ఞలు వృధయగునా?

విశేషణము : అది – ఇక్కడ వ్యాకరణ సూత్రం–

తే.గీ. ప్రాణిపదములు వెలిగాగ ప్రథమలెల్ల.
నరయనొక్కకచో ద్వితీయార్థమిచ్చు.
సంగర – ప్రతిజ్ఞా జి సంవిదాపతస్సు సంగరః – అని అమరము.
అలంకారము : అర్థాంతరన్యాసాలంకారము.

వ. అందు 94

తే. అతనురణరసభోగికన్యార్థపరతఁ
దా నిలావంతుఁ డనుమహాద్రవిణనిధిని
సుతులసద్వృత్తిఁ బడసె దమితయశస్స్వ
లీల సుఖియింతు ననుచింత లే దెపుడును. 95

రామా : అతను రణరసభోగికిన్=అనల్పమైన యుద్ధము చవియెరిగినవానికి, అన్య=అన్యమైన, అర్థ=ప్రయోజనము మీది, పరతన్=తాత్పర్యముచే, తాను=కార్తవీర్యుడు, ఇలావంతుడను=భూమిగలవాడను, ద్రవిణవిధిని=ధనవంతుడను, సుతులన్=పుత్రులను, సత్+వృత్తిన్+పడసెద=మంచి మార్గములో పొందెదను, అమితయశః=గొప్ప కీర్తిగల, స్వలీలన్=తన విలాసముచే, సుఖియింతున్=సుఖపడుదును, అనుచింత=అను బాధ, ఎపుడును, లేదు.

తాత్పర్యము : అనల్ప యుద్ధపు రుచిని ఎరిగినవానికి అన్య ప్రయోజనము మీది తాత్పర్యముచే కార్యవీర్యార్జునుడు భూమిగలవాడు, ధనవంతుడు అయిన పుత్రులను

మంచి మార్గములో పొందెదను. గొప్ప కీర్తిగల తన విలాసముచే సుఖించెదనను బాధ ఎపుడును లేదు.

భారత : అతను=మన్మధుని యొక్క, రణ=యుద్ధమునందు, రస=వేడుకగల, భోగికన్య=నాగకన్యయైన ఉలూచి యొక్క, అర్థపరతన్=ప్రయోజనవశముచే, తాను=అర్జునుడు, ఇలావంతుఁడను=ఇలావంతుడను పేరుగల, మహోద్రవిణ నిధిని=మిక్కిలి బలాఢ్యుని, లసత్+వృత్తిని=మంచి మార్గములో, సుతున్+పడసెను=కుమారుని పొందెను, దమిత=అణచబడిన, యశః=కీర్తిగల, స్వలీలన్=తన క్రీడచే, సుఖియింతునను చింత, ఎపుడును లేదు.

తాత్పర్యము : మన్మధుని యొక్క యుద్ధతంత్రమునందు వేడుకగల ఉలూచి ప్రయోజన పారవశ్యముచే అర్జునుడు ఇలావంతుడను మిక్కిలి బలాఢ్యుని మంచి మార్గములో కుమారునిగా పొందెను. అణచబడిన కీర్తిగల తన క్రీడచే సుఖించు చింత ఎప్పుడు లేదు. తీర్థయాత్రకు వెళ్లిన తనకు స్త్రీ భోగము కుదరదని భావము.

విశేషణము : ఇలా వంతుడు. ఇల – గౌరిలా కుంభినీక్షమా – అని అమరము.
ద్రవిణ – ద్రవిణంతుధనంబలమ్ – అని అమరము.

సీ. తీర్థయాత్రాసమాప్తిఁ గరంబు దనరి రా
జోపభోగ్యం బైనయుద్ధవసుధ
నతిసరస మగుచిత్రాంగదానామల
తాంగీకృతసురతావాప్తిఁజేసి
భాసురనందనప్రసవభూషితవర
వర్ణినీగురుచిత్ర వాహనుండు
తదదూరదేశసిద్ధసరసీపుణ్యతీ
ర్థోపసేవల మహాశాపకలుష

తే. నైకనిర్జరీధృతమకరీకలాప
రూపలోపకృజ్జలవిహారుఁడును దివ్య
ధామకలితుండు నై శూరతరుఁ డగునరుఁ
డొప్పెసగురుచిరయశోమహోదయతను. 96

రామా : తీర్థయాత్రా=తీర్థయాత్రకు, సమ=సమానులైన, ఆప్తిన్=వ్యాప్తిచే, కరంబు=మిక్కిలి, తనరి=అందమై, రాజ+ఉపభోగ్యంబైన=రాజులచే అనుభవింపదగిన, యుద్ధవసుధన్=రణభూమిలో, అతిసరసము+అగు=మిక్కిలి ప్రియమైన, చిత్ర=ఆశ్చర్యకరమైన, అంగదాన=శరీరచ్ఛేదము వలన అయిన, అమలతా=నిష్కలషత్వముచే, అంగీకృత=అంగీకరించబడిన, సురతా=దేవత్వము యొక్క అవాప్తి, జేసి=ప్రాప్తిచే, శూరతర=ప్రతాపముచే, నరుడు=పురుషుడు, భాసుర=ప్రకాశమానమైన, నందన=నందనవనము యొక్క ప్రసవ=పుష్పములచే, భూషిత=అలంకరించబడిన, వరవర్ణినీ=ఉత్తమ స్త్రీలచే, గురు=వ్రేగైన, చిత్రవాహనుండు=చిత్తరువుతో గూడిన, విమానములుగలవాడు, తత్=ఆనందన వనములకు, అదూరదేశ=సమీపములోనున్న సిద్ధసరసీ=ఆకాశగంగ యొక్క, పుణ్యతీర్థ+ఉపసేవల=పుణ్యతీర్థములను సేవించుటచే, మహాశ=అధికాశగలవారైన, అపకలుష=కలుషితముగాని, నైకనిర్జరీ=అనేక దేవతాస్త్రీలచే, ధృత=ధరించిన, మకరీకలాప=మకరికా పత్రాలంకారముచే, రూప=సౌందర్యము యొక్క, లోపకృత్=నాశనము చేసిన, జలవిహారుడు=జలవిహారముగలవాడు, సగురు=ఘనమైన, చిరయశో మహోదయతను=చిరకీర్తి అతిశయముచే, ఒప్పె=ప్రకాశించెను.

తాత్పర్యము : తీర్థయాత్రకు సమానమైన వ్యాప్తిచే మిక్కిలి రాజభోగము లనుభవింపదగిన రణభూమిలో మిక్కిలి ప్రియమైన ఆశ్చర్యకరమైన శరీరచ్ఛేదము వలన నిష్కలషత్వముచే అంగీకరించబడిన దేవతల ప్రాప్తిచే ప్రతాపముచే గూడిన పురుషుడు ప్రకాశించెను. నందనవన పుష్పములచే అలంకరించబడిన ఉత్తమ స్త్రీలచే వ్రేగైన చిత్తరువుతోగూడిన విమానములు గలవాడు ఆనందన వన సమీపములోనున్న ఆకాశగంగ యొక్క పుణ్యతీర్థములను సేవించుటచే అధికాశగల, కలుషితముగాని

అనేక దేవతాస్త్రీలు ధరించిన మకరికా పత్రముల సౌందర్యము నాశనము చేసిన జలవిహారుడై గొప్పదైన చిరకీర్తి అతిశయముచే ప్రకాశించెను.

భారత : తీర్థయాత్రా సమాప్తిన్=తీర్థయాత్రలు పూర్తియైన సంవత్సరము, కరంబు, తనరి, రాజోపభోగ్యంబైన, ఉద్ధవసుధన్=ఉత్సవామృతముచే, అతిసరసమగు, చిత్రాంగదా నామ=చిత్రాంగద అను పేరుగల, లతాంగీ=స్త్రీయందు, కృత=చేయబడిన, సురతావాప్తిన్ చేసి=సంభోగముయొక్క వ్యాప్తిచే, భాసుర=ప్రకాశించు, నందన=పుత్రుడైన, బభ్రువాహనునియొక్క ప్రసవ=పుట్టుకచే, భూషిత= అలంకరించబడిన, వరవర్ణినీగురు=చిత్రాంగదా జనకుడైన, చిత్రవాహనుండు= చిత్రవాహనుడను రాజు, తత్=ఆ చిత్రవాహనుని పట్టణమునకు, అదూరదేశ= సమీపమున, సిద్ధ=కలిగిన, సరసీ=సరస్సు యొక్క, పుణ్య=మనోహరమైన, తీర్థ=రేవుల, ఉపసేవలన్=స్నానములచే, మహాశాపకలుష=గొప్ప ఆశగల కలుషితముగాని, నైకనిర్జరీ=అనేక దేవతా స్త్రీలచే, ధృత, మకరీకలాపరూప లోపకృత్=మకరీ సమూహ దేహములను నాశనము చేసిన జలవిహార, దివ్య=మనోహరమైన, ధామ=తేజస్సుతో, కలిత=కూడిన, నరుండు=అర్జునుడు, సగురు చిరయశోమహోదయతన్=ఘనమైన చిరకీర్తి అతిశయముతో, ఒప్పెన్.

తాత్పర్యము : తీర్థయాత్రలు పూర్తి అయిన సంవత్సరము మిక్కిలి తనరి రాజోపభోగ్యమైన ఉత్సవామృతముచే అతి సరసమగు చిత్రాంగదానామ స్త్రీయందు చేయబడిన సురతావాప్తిచే ప్రకాశించెను. బభ్రువాహనుని పుట్టుకచే అలంకరించబడిన ఆమె జనకుడైన చిత్రవాహనుడను రాజు పట్టణమునకు సమీపములోని సరస్సు వద్ద మనోహర తీర్థస్నానములచే గొప్ప ఆశగల కలుషితముగాని అనేక దేవతాస్త్రీలు ధరించిన మకరికా పత్రములను చెడిపి మనోహరమైన జలవిహారము యొక్క తేజస్సుతో అర్జునుడు ఘనచిరకీర్తితో నొప్పెను.

తే. అంత శౌర్యాశ్రయం బైన యట్టిమేటి
వీడు నాకాహవస్పృహాన్వీతథామ
కాంతిఁ జూచిపోయెద నని కదలి వచ్చి
నాఁడ నెటి సూపుమదనుగుణక్రమమున 97

రామా : అంత=అంతటి, శౌర్యాశ్రయంబైన=ప్రతాపమునకాటపట్టైన, అట్టి, మేటివి=శ్రేష్ఠుడవు, ఈడునాకు=నాతో సరియైనవాడవు, ఆహవస్పృహా=యుద్ధము మీది కోర్కెతో, అన్వీత=కూడిన, ధామ=ప్రతాపముయొక్క, కాంతిన్=స్ఫురణ, చూచిపోయెదనని=చూచి వెళ్లెదమని, కదలి వచ్చినాఁడ=బయలుదేరి వచ్చినాను, మత్+అనుగుణక్రమమున్=నాకు అనుకూలమైన రీతిలో, నెఱిసూపు=ఎదిరింపుము –

తాత్పర్యము : అంతటి ప్రతాపమునకు ఆట పట్టైన శ్రేష్ఠుడవు, నాకు సరిజోడైన వాడవు – అని యుద్ధ కాంక్షతో ప్రతాప స్ఫురణను చూచి వెళ్లెదమని కదలి వచ్చినాను. నాకనుగుణమైన రీతిలో ఎదిరింపుము. (యుద్ధమునందును, ప్రతాపమునను సరిజోడు నీవని పరశురాముడు రామునితో సంభాషించు సందర్భము).

భారత : అంత, శౌరి=కృష్ణునికి, ఆశ్రయంబైన యట్టి=నివాసమైన, మేటివీడు=ద్వారకానగరము, నాక=స్వర్గముతో, ఆహవ=యుద్ధముయొక్క, స్పృహా=సామ్యముతో, అన్వీత=కూడిన, ధామ=గృహములయొక్క, కాంతిన్= కాంతిగల దానిని, చూచిపోయెదనని, కదలివచ్చి, నాడ=నాడే, మదను=మన్మథుని యొక్క, గుణ క్రమమున=గుణానుసారమున, నెఱిసూపు=అందమును చూపుము.

తాత్పర్యము : అంతటి శ్రీకృష్ణుని నివాసమైన మేటి ద్వారకానగరము స్వర్గమును తలదన్ను సామ్యముతో కూడిన గృహముల కాంతిగలదియై యుండగా చూచి వెళ్లెదమని నాడే కదలివచ్చినాను. మన్మథుని గుణానుసారమున అందమును చూపునని (అర్జునుని పక్షమున భావము)

కం. తెరలక మనము సుభద్రా
కరనాళీకగ్ర హేచ్ఛ గప్పఁగఁ జనునా
దొర యదుపురిఁ జేరి జనవి
సరముల కెఱుకపడనీక శౌర్యతనుఘృణన్. 98

రామా : మనము=మనమిద్దరము, తెరలక=తొలగిపోక, సుభద్రాకత= శుభప్రదమైన, నాళీకగ్రహేచ్ఛ=బాణములను సంధించు కోరికతో, కప్పగన్+చనునా=

అణచవచ్చునా? నీక=నీకు, అశౌర్యతన్=శౌర్యహీనత్వముచే, ఘృణన్=జుగుప్సచే, పురిన్=అయోధ్యను, చేరి=చేరి, జనవిసరములకు=జనసముదాయమునకు, ఎఱుకపడన్=కనబడునట్లుగా, దొరయదు=యుక్తముగాదు.

తాత్పర్యము : మనమిద్దరము తొలగిపోక శుభమైన యుద్ధవాంఛను అణచవచ్చునా? నీవు శౌర్యహీనత్వముచే, జుగుప్సచే అయోధ్యను చేరి జన సముదాయమునకు కనబడుట యుక్తముగాదు.

విశేషణము : నాళీక – నాళీకః శిరపద్మయోః అని – వి.

భారత : మనము=మనస్సు, తెరలక=విడువక, సుభద్రా=సుభద్రయొక్క, కరనాళీకగ్రహేచ్ఛ=హస్త పద్మములు గ్రహించవలెనను కోరిక, కప్పగన్=ఆక్రమించగా, చనునాదొర=వెళ్లుచున్న అర్జునుడు, యదుపురిన్=ద్వారకలో, శౌరి=కృష్ణుని యొక్క, అతను=అనల్పమైన, ఘృణన్=దయను, జనవిసరముల, ఎఱుకపడనీక=జనులకు బయటపడనీక –

తాత్పర్యము : తన మనస్సు బయటపడనీక సుభద్రా కరగ్రహణ వాంఛ ఆక్రమించగా వెళ్లుచున్న అర్జునుడు ద్వారకలో శ్రీకృష్ణుని అనల్పమైన దయను జనసముదాయమునకు బయటపడనీక (తిరమైపోయెనని ముందరి పద్యముతో నన్వయము)

విశేషణము : క్రియముందటి పద్యములో నున్నది (తిరంబైపోయె)

మ. అనయంబున్ మదనామితాస్త్రకలనాత్యంతార్తి రాకుండఁ జ
య్యన మౌనిత్వకృతేష్టసిద్ధితఁ దిరంబైపోయె దేదీప్యమా
ననిరూఢిం బయిఁబడ్డయాదవుల నానావీరధర్మ ప్రవృ
త్తి నిరర్థం బనిపించి యాత్మపురికిందేవేరితోఁ గూడఁగన్. 99

రామా : అనయంబున్=అత్యంతము, నా యొక్క, అనామిత=అణపబడని, అస్త్రకలన=బాణ ప్రయోగముచే, అత్యంత+ఆర్తిరాకుండ=మిక్కిలి బాధకలుగకుండ,

మౌనిత్వ=నిరుత్తరత్వముచే, కృత=చేయబడిన, ఇష్టసిద్ధితన్=అభీష్టసిద్ధి కలుగుటచే, దేదీప్యమాన నిరూఢిన్=ప్రకాశించు నిరూఢిచే, పయిబడ్డ=ఆరోపితమైన, ఆ=అక్కడ, దవుల=దూరములనున్న, నానావీరధర్మ ప్రవృత్తి=నానావీరుల ధర్మవార్తతో నిరర్థంబనిపించి, ఆత్మపురికిన్=అయోధ్యకు, దేవేరితోకూడగన్=భార్యతోగూడ, తిరంబై=స్థిరముగా, పోయెదె=పోయెదవా?

తాత్పర్యము : (పరశురాముడు రామునితో) అత్యంతము అణచబడిన నా బాణప్రయోగముచే మిక్కిలి బాధ కలుగకుండ నిరుత్తరత్వముచే చేయబడిన అభీష్టసిద్ధిచే ప్రకాశించు నిరూఢిచే ఆరోపితమైన దూరములనున్న నానావీరుల ధర్మవార్తతో నిరర్థకమనిపించి అయోధ్యానగరమునకు నీ దేవేరితోగూడి వెళ్లెదవా?

భారత : అనయంబున్, మదన=మన్మధుని యొక్క, అమిత=అమితమైన, అస్త్రకలనా=బాణవిద్యచే, మౌనిత్వ=మునివేషముచే, అత్యంతార్తిరాకుండ, కృతేష్టసిద్ధితన్=తన కోరిక తీరగా, దేదీప్యమాన నిరూఢిన్, పయిబడ్డ=ఎదిరించిన, యాదవులన్=యాదవులను, నానావీర ధర్మప్రవృతిన్, నిరర్థంబనిపించి, ఆత్మపురికిన్=తన నగరమునకు, దేవేరితోగూడగన్=సుభద్రతోగలిసి, తిరంబైపోయె=స్థిరముగా వెళ్లెను.

తాత్పర్యము : అత్యంతము మన్మధుని అమితమైన బాణవిద్యకు గురియయి, మునివేషముచే తన కోరిక తీరగా మిక్కిలి బాధ కలుగకుండగా తన యిష్టసిద్ధి కలుగునట్లుగా దేదీప్యమానమైన నిరూఢితో తన నెదిరించిన యాదవులను నానావీరధర్మవర్తనచే నిరర్థకము చేసి తన నగరమునకు సుభ్రదతో గూడి వెళ్లెను.

చం. అనికృత ధర్మవీక్షుఁ డయియావరవర్ణినికామసంభ్రమం
బు నడపుచుం గరం బమరపూజ్యసమిజ్జయశోభిమన్యునా
మునిసుతుఁ గాంచి లక్ష్మణుఁ డముద్రితదీప్తిధనంజయుండు నే
ర్చెనయగభీరవీరసమపేక్ష్యతరోచ్చరణ ప్రగల్భతన్. 100

రామా : అని=ఈ విధముగా మాట్లాడి, కృత=చేయబడిన, ధర్మవీక్షుడయి=

వింటియందు దృష్టిగలవాడై, ఆవరవర్ణి=ఆ నైష్ఠిక బ్రహ్మచారి పరశురాముడు, నికామ=అత్యంతము, సంభ్రమంబు నడుపుచున్=ఆశ్చర్యము కల్గించుచు, కరంబు=మిక్కిలి, అమరన్=అమరగా, పూజ్య=దేవతా శ్లాఘ్యమైన, సమిజ్జయ=యుద్ధమందలి జయముచే, శోభి=ఒప్పుచున్న, మన్యున్=కోపముగల, ఆ మునిసుతున్=పరశురాముని, కాంచి=చూచి, లక్ష్మణుడు, అముద్రిత దీప్తిన్=ప్రకటితమైన ప్రకాశముచే, ధనంజయుండు=అగ్నివంటి, నేర్పెనయన్= చాతుర్యముగా, గభీర=గొప్పదైన, వీరసమపేక్ష్యతర=వీరత్వము ప్రకాశించునట్లు, ఉచ్చరణ ప్రగల్భతన్=ఉచ్చారణ శక్తిచేత. (తర్వాతి పద్యముతో అన్వయము).

తాత్పర్యము : ఇట్లు మాట్లాడి వింటియందు దృష్టిగల ఆ పరశురాముడు అత్యంతము ఆశ్చర్యము కల్గించుచు మిక్కిలి దేవతాశ్లాఘ్యమైన యుద్ధములందలి జయముచే శోభిల్లు కోపముగల ఆ పరశురాముని చూచి లక్ష్మణుడు అగ్నివంటి ప్రకాశముచే చాతుర్యముగా అధికమైన వీరత్వము కన్పించునట్లు ఉచ్చారణ శక్తిచే (మాట్లాడెనని ముందు పద్యము)

భారత : అనికృత=తిరస్కరింపబడని, ధర్మవీక్షుడయి=ధర్మదృష్టిగలవాడై, ఆవరవర్ణిని=సుభద్రయందు, కామసంభ్రమంబు=మదనవికాసమును, నడపుచున్, కరంబు, అమరపూజ్యసమిజ్జ=యుద్ధమున బుట్టిన, యశః=కీర్తిగల, అభిమన్యునాము=అభిమన్యుడను పేరుగల, సుతున్=పుత్రుని, కాంచి, లక్ష్మణుడు=లక్ష్మీవంతుడు, అముద్రితదీప్తి=అనర్గళమైన దీప్తిగల, ధనంజయుడు=అర్జునుడు, నయ=నీతిచే, గభీర, వీర, సమపేక్ష్యతర=మిక్కిలి ఆశింపదగిన, ఉచ్చ=ఉన్నతమైన, రణప్రగల్భతన్=యుద్ధమునందలి ప్రౌఢిమచే, నేర్పెన్=ఉపదేశించెను.

తాత్పర్యము : తిరస్కృతముగాని ధర్మదృష్టిగల సుభద్రయందు కామ విశేషమును నడుపుచు మిక్కిలి దేవతాపూజ్యమైన యుద్ధమున బుట్టిన కీర్తిగల అభిమన్యుడను పేరుగల కుమారుని గాంచి లక్ష్మీవంతుడు, అనర్గళదీప్తిగల అర్జునుడు నీతిచే గొప్పదైన మిక్కిలి ఆశింపదగిన ఉన్నత యుద్ధ ప్రౌఢిని ఉపదేశించెను.

విశేషణము : వర్ణి – వర్ణినోబ్రహ్మచారిణః అని అమరం.

తే. కొసర నిట్లనుభావంబు పస నెరపుచు
నమ్మహాత్ముతో జిష్ణుతేజోతిశయము
మిక్కిలిఁ బ్రకాశముగ భ్రాతృమిత్రబంధు
సచివులసమాదృతిని జూపి రుచితసరణి. 101

రామా : కొసరన్=విజృంభించి, ఇట్లు+అనుభావంబు=ఈ విధమైన భావమును, పసనెరపుచు=ఆధిక్యమును జూపుచు, ఆ+మహాత్ముతో=పరశురామునితో, జిష్ణుతేజోతిశయము=జయశీలమైన అధిక తేజస్సుతో, మిక్కిలి, ప్రకాశముగ, భ్రాతృ=సోదర, మిత్ర=మిత్రుల, బంధు=బంధువుల, సచివుల=మంత్రుల, సమాదృతిని=అధిక ఆదరమును, చూపి, రుచితసరణి=ఒప్పెడి విధముగా.

తాత్పర్యము : విజృంభించి ఈ విధమైన అను భావము యొక్క ఆధిక్యమును జూపుచు పరశురామునితో జయశీలమైన అధిక తేజస్సుతో మిక్కిలి ప్రకాశముగా సోదరులు, మిత్రులు, బంధువులు, మంత్రుల సమాదరముతో చూపు విధముగా నొప్పెను.

భారత : కొసరన్, ఇట్లు, అనుభావంబు, పస, నెరపుచు, ఆ+మహాత్ముతోన్= అభిమన్యునితోగూడి, జిష్ణు=అర్జునుని యొక్క, తేజోతిశయము, మిక్కిలి, ప్రకాశమునన్=ప్రకటముగాగ, భ్రాతృ, మిత్ర, బంధు, సచివులు, అసమ=అతులమైన, ఆదృతిన్=ఆదరమును, ఉచితసరణిన్=తగినరీతిగా, చూపిరి.

తాత్పర్యము : విజృంభించి ఈ విధముగా అను భావమును నెరపుచు అభిమన్యునితో గూడి అర్జునుని తేజోతిశయము మిక్కిలి ప్రకటముగాగా, భ్రాతృ, మిత్ర, బంధు సచివులు అతులమైన ఆదరమును తగినరీతిగా జూపిరి.

కం. మగలయిలువరుస గలపెను
దగవరు లొకఁడొకఁ డొకొక్క తనయు రుచిరశౌ
ర్యగతినుతిఁ జెంద ఘనకీ
ర్తిగ-నలరంగలరు ద్రోవదివరక్రమతన్. 102

రామా : మగల యిలువరసగల=వంశగత పౌరుషము గలిగిన, పెను+తగవరులు=మంచి నేర్పరులు, ఒకడొకడు=ఒక్కొక్క పురుషుడే, ఒక్కొక్క= ఒకానొకటి అయిన, తన=తన యొక్క, ఉరు=అధికమైన, చిర=స్థిరమైన, శౌర్యగతి=పరాక్రమవర్తనము, నుతిన్+చెందన్=ప్రసిద్ధమగునట్లుగా, ఘనకీర్తిగ=గొప్ప ప్రతిష్ఠగా, అక్రమతన్=క్రమము తప్పి, త్రోవదివరు=దారి తప్పరు, అలరన్+కలరు= ప్రకాశింపగలరు.

తాత్పర్యము : వంశపరంపరాగతమైన మంచి నేర్పరులైన వీరు ఒక్కొక్క పురుషుడే వింతైన తన అధికము, స్థిరము అయిన పరాక్రమవర్తనము ప్రసిద్ధమగునట్లుగా గొప్ప ప్రతిష్ఠగా క్రమము తప్పి దారి తప్పక ప్రకాశింపగలరు.

భారత : తగన్=తగినట్లుగా, వరులు=భర్తలు, ఒకడొకడు, ఒక్కొక్క=ఒక్కొక్క తనయున్=కుమారుని, రుచిరశౌర్యగతిన్=ప్రకాశించు పౌరుష ప్రవర్తనచే, చెందన్=చెందగా, ఘనకీర్తిగ=గొప్ప ప్రతిష్ఠగా, అల=ఆనాడు, రంగలరు=రంగుమీరు, ద్రోవది=ద్రౌపది, వరక్రమతన్=పెద్ద పిన్న వరుసను (మర్యాదతో) మగల=భర్తల, ఇలువరుస గలపెను=ఇంటిలో వరుసగా నడపెను.

తాత్పర్యము : తగినట్లుగా భర్తలొక్కక్కరు కుమారుని ప్రకాశించు పౌరుష ప్రవర్తనను చెందగా ఘనకీర్తితో ప్రకాశించు ద్రౌపది మర్యాదతో భర్తల ఇంటిలో వరుసగలపెను.

విశేషణము : ద్రోవది=ద్రౌపది శబ్దతద్భవము.

తిక్కన ప్రయోగము : ద్రోవది బంధురంబైన క్రొమ్ముడిగ్రన్నన విచ్చి–ఉద్యోగపర్వం.

సీ. అంత శౌర్యాప్తిచే నధికప్రవర్ష సం
పన్నత దగఁ గాంచియున్న తమగు
దండితనమున వీరుండనేనస్ఫుట
పటుశక్తి విజయుండబాలిశుండ

నీకాభిముఖ్యంబుగైకొని సుమనోబ
లంబుతోఁ దగ నుత్తరంబుఁ జెప్పఁ
జతురుండ నాతపస్థితివనాదృతవివి
ధవిహారభోగవర్తనలనొనరి

తే. తనరు నచ్యుతయోగశోభనత నుండ
వనికిఁ బనివడి విప్రుఁడై యనలుఁ డేఁగు
దెంచె ననవరదీప్తి నేతెంచి యిట్లు
పలికె దీవనలసగర్వకళ నెరపుచు. 103

రామా : అంతైన=ముందు చెప్పినట్లుగా, శౌర్యాప్తిచే=పరాక్రమాతిశయముచే, అధిక ప్రవర్ష సంపన్నతన్=అధికమైన పటిష్ఠమైన సంపదను, తగన్+కాంచి=తగిన విధముగా పొంది, ఉన్నతమగు=గొప్పదైన, దండితనమున్=పరాక్రమముచే, వీరు+ఉండన్=బంధుమిత్రాదులైన వీరు ఉండగా, నేను, అస్ఫుట=ప్రకటముగాని, పటుశక్తి=మిక్కిలి శక్తియు, విజయుండ=జయముగలవాడను, బాలిశుండను=బాలకుడను, నీకు=నీకు, ఆభిముఖ్యంబు+కైకొని=ఎదురుగా నిలిచి, సు=లెస్సదైన, మనోబలంబుతోన్=బుద్ధిబలముతో, తగన్=తగిన విధముగా, ఉత్తరంబు+చెప్పన్=బదులు పలుకుటకు, చతురుండనా=సమర్థుడనా?, తపః+స్థితివి=తపస్సునందు నిలకడగలవాడవు, అనాదృత=ఆదరింపబడని, వివిధవిహారభోగవర్తనలన్=వివిధములైన సంచారములు, భోగములుగల వర్తనలచే, ఒనరితనరు=ప్రకాశించు, అచ్యుత=నిలకడగల, యోగ=అష్టాంగయోగముచే, శోభన=శోభించునట్టి, తనుండవు=మేలుగలవాడవు, అనికి=యుద్ధమునకు, పనివడి=అదిపనిగా, అనలుడు=అగ్నిదేవుడు, విప్రుడై=బ్రాహ్మణుడే, ఏగుదెంచెనన=వచ్చినాడు–అనునట్లు; వరదీప్తిన్=గొప్ప కాంతితో, ఏతెంచి=వచ్చి, ఈవు=నీవు, అనలస=అమందమైన, గర్వకళన్=గర్వప్రాప్తిని, నెఱపుచు=భాసింపజేయుచు, పలికెదవు=మాట్లాడెదవు.

తాత్పర్యము : ముందు చెప్పినట్లుగా, శౌర్యాధిక్యముచే అధికమైన పటిష్ఠ

సంపదను తగిన విధముగా పొంది గొప్ప పరాక్రమముచే బంధుమిత్రాదులైన వీరందరు ఉండగా, ప్రకటముగాని శక్తి, జయము గలిగిన బాలకుడనైన నేను, నీకెదురుగా నిలిచి బుద్ధిబలముతో తగిన విధముగా బదులాడుటకు సమర్థుడనా? తపస్సులో నిలకడగలవాడవు, ఆదరింపబడని వివిధ సంచారములు, భోగములుగల వర్తనలచే ప్రకాశించు నిలకడగల అష్టాంగయోగ శోభతో మేలుగలవాడవు అయిన నీవు అది పనిగా యుద్ధమునకు అగ్నిదేవుడై విప్రుడై వచ్చినాడన్నట్లు గొప్ప కాంతితో వచ్చి, నీవు అమందమైన గర్వప్రాప్తితో భాసింపజేయుచు మాట్లాడెదవు.

భారత : అంత, శౌరి=కృష్ణుని యొక్క, ఆప్తిచే=రాకతో, అధిక ప్రవర్షసంపన్నత తగన్, కాంచి, ఉన్నతమగు, దండితనమున, వీరుండు=వీరుడు, అనేన=పాపరహితమైన, స్ఫుటపటుశక్తి=ప్రకటితమైన పటుశక్తిగల, అబాలిశుండు=బుద్ధిమంతుడు, విజయుండు=అర్జునుడు, అనీక=యుద్ధమునకు, ఆభిముఖ్యంబుగైకొని=ఎదురుగా వచ్చి, సుమనోబలంబుతోన్=దేవబలముతో, తగన్, ఉత్తరంబు చెప్ప చతురుండు=తగిన విధముగా సమాధానము చెప్పగల సమర్థుడు, అనాతపస్థితి=ఆతపస్థితిలేని (సూర్యుడు) వన=వనమునందు, ఆదృత=ఆదరింపబడి, వివిధ విహారభోగవర్తనల నొనరితనరు, అచ్యుతయోగ=కృష్ణుని సఖ్యముచే, శోభనతను=శోభనత్వముతో, ఉండగా, వనికి, పనివడి=పనిగట్టుకొని, అరణ్యమునకు, విప్రుడై=బ్రాహ్మణుడై, అనలుడు=అగ్నిదేవుడు, ఏగుదెంచె=వచ్చెను, అనవర=శ్రేష్ఠమైన, దీప్తిన్=కాంతితో, ఏతెంచి, అసగర్వ= గర్వముతో గూడని, కళన్=వర్తనచే, దీవనల=ఆశీస్సులను, నెరపుచు, ఇట్లు పలికె.

తాత్పర్యము : అంతట శ్రీకృష్ణుని రాకతో అధికమైన శ్రేష్ఠమైన సంపన్నతను గాంచి గొప్పదైన శక్తితో వీరుడు, పాపరహితమైన ప్రకటిత పటుశక్తిగల బుద్ధిమంతుడైన అర్జునుడు యుద్ధమునకు ఎదురుగా వచ్చి, దేవబలముతో సమముగా సమాధానము చెప్పగల సమర్థుడైన అతడు, సూర్యకాంతిలేని వనములో ఆదరిపంబడిన వివిధ విహార భోగముల నందుచు కృష్ణుని సఖ్యముతో శోభనత్వము నందియుండగా, పని గట్టుకొని ఆ అరణ్యమునకు బ్రాహ్మణ వేషమున అగ్నిదేవుడు వచ్చెను. శ్రేష్ఠమైన కాంతితో గర్వములేని కళతో వచ్చి దీవనలనిచ్చుచు ఇట్లు పలికెను.

విశేషణము : ఏనః=పాపము, 'కలుషంవృజినైనోఘ' అని అమరము.

కం. విను విజయశక్తిమీరితి
నను గాఢాహమికచెల్లునా మదిలో నెం
దును బహుతరాశనుండం
జనునే మి మ్మడుగవలయు సకలార్థంబుల్. 104

రామా : విను=వినుడు, విజయశక్తి మీరితి=జయించుశక్తిని దాటితిని, అను=అనెడి, గాఢాహమిక చెల్లునా=గొప్పదైన గర్వము చెల్లునా; మదిలోన్=మనస్సులో, ఎందును=ఎక్కడను, బహుతరాశన్=అధికాపేక్షచే, ఉండన్+చనునే=ఉండవచ్చునా? సకలార్థంబుల్=సకల ప్రయోజనములు, మిమ్ము+అడుగవలయు=మిమ్ములనడిగి తెలిసికొనవలెను.

తాత్పర్యము : వినుడు, (నేను) జయించు శక్తిమీరినాను - అనెడి గొప్పదైన గర్వము చెల్లునా? మనసులో ఎక్కడను అధికాపేక్షచే ఉండవచ్చునా? సకల ప్రయోజనములు మిమ్ములనడిగి తెలిసికొనవలెను.

భారత : విను, విజయ=ఓ అర్జునా! శక్తిమీరి=నా శక్తికి మించి, తినను=తినుటకు, గాఢాహమిక=గొప్ప కోరిక, నా మదిలో=నా మనస్సులో, చెల్లున్=చెలగుచున్నది, ఎందును, బహుతర+అశనుండన్=మిక్కిలియైన భోజనములను, నే=నేను, సకల+అర్థంబుల్=అన్ని కోరికలు, మిమ్మడుగవలయు, చనున్=తగుదును.

తాత్పర్యము : (అగ్ని దేవుడు అర్జునునితో చెప్పిన మాటలివి). ఓ అర్జునా! వినుము, నా శక్తికిమించి తినుటకు గొప్ప కోరిక నా మనస్సులో చెలగుచున్నది. అన్ని చోట్లను బహురకములైన ఆహారమును స్వీకరించు నేను అన్ని కోరికలు మిమ్ము అడుగతగుదును.

మ. అని వాలాయముగా నభీష్టతమమౌ నన్నం బొసంగన్ స్వనీ
తిని ము న్నెంతయు నియ్యకొల్పి మతి యుద్వృత్తిం బ్రవర్తిల్లుము

జ్జనితోల్లాసముతోడఁ బల్కె సముదంచత్ఖాండవాస్వాదవ
ర్తన మిష్టం బని రాజపుత్త్రునకు శస్తంబౌ శుచిత్వంబునన్. 105

రామా : అని=యుద్ధము, వాలాయముగా=నిర్బంధముగా, అభీష్టతమమౌ=కోరినదౌను, అన్నన్=అనినట్లు ఆయెనా, పొసంగన్=పొసగునట్లుగా, స్వనీతిన్=బ్రాహ్మణ ధర్మమును, మున్ను+ఎంతయు=ఇంతకు ముందు ఎంతో, ఇయ్యకొల్పి=అంగీకరించి, మఱి+ఉద్వృత్తిన్=మరియు అతిక్రమించుటచే, ప్రవర్తిల్లుము=నడువుము, ఉజ్జనిత+ఉల్లాసముతోడన్=పుట్టిన సంతోషముతో, పల్కె=భాషణమే, సముదంచత్=మిక్కిలి, ఖాండ=శర్కరా సంబంధమైన, వాః=నీటి యొక్క, స్వాద=రుచివంటి రుచిగల, వర్తనము=నడకగలది, శస్తంబౌ=చెప్పబడిన, శుచిత్వంబునన్=పరిశుభ్రతచే, రాజపుత్త్రునకు=రాజకుమారునకు, ఇష్టంబు+అని=ఇష్టమని.

తాత్పర్యము : యుద్ధము నిర్బంధముగా కోరినదౌను – అనినట్లు బ్రాహ్మణ ధర్మమును ఇంతకు ముందు అంగీకరించి, అతిక్రమించుటచే నడువుము. నాకు పుట్టిన సంతోషముతో మాట్లాడిన మాటలు మిక్కిలి శర్కరాసంబంధమైన నీటి రుచివంటి రుచిగల ప్రవర్తనతో శ్రేష్ఠమైన పరిశుభ్రతచే రాజకుమారున కిష్టమని – (పరశురాముడు రామునితో పలికిన మాటలు).

భారత : అని=ఇట్లని, వాలాయముగా=నిర్బంధముగా, అభీష్టతమమౌ=మిక్కిలి కోరిక గల, అన్నంబు=ఆహారమును, ఒసంగన్=ఇచ్చుటకు, స్వనీతిని=తన బ్రాహ్మణ వేషధర్మముననే, ఈయకొల్పి=ఇచ్చెదమనిపించి, మరి=ఆ తరువాత, ఉద్వృత్తిన్, ప్రవర్తిల్లు=నడచు, ముత్=సంతోషముచేత, జనిత=పుట్టిన, ఉల్లాసముతోడ, సముదంచత్=మిక్కిలి వృద్ధిపొందిన, ఖాండవ+ఆస్వాదవర్తనము=ఖాండవ వనమును ఆహారముగా స్వీకరించు పని, ఇష్టంబని=కోరికయని, శస్తంబౌ=చెప్పబడిన, శుచిత్వంబునన్=అగ్నిత్వముగలవాడై, రాజపుత్త్రునకు=అర్జునునితో, పల్కెన్=పల్కెను.

తాత్పర్యము : ఇట్లని నిర్బంధముగా తనకిష్టమైన ఆహారమును ఇచ్చుటకు

తన బ్రాహ్మణ ధర్మవేషము చేతనే ఇంతకు ముందు అంగీకరింపజేసిన పిమ్మట సంతోషముతో కలుగు అతిక్రమణచే సమృద్ధిగా వున్న ఖాండవ వనమును ఆస్వాదించుట తన కోరికయని చెప్పబడిన అగ్నిత్వము గలవాడై అర్జునునితో ఇట్లు పలికెను.

ఉత్సాహ : ఈ విధమునఁ బల్కి మఱియు నిట్టులనియె నట్టికాం
క్షావిధి కొకవిఘ్న మిపుడు గలదు నిన్ను నారయం
గా వినుము నివారణాధికారమునకు దగుదువే
తావదర్థగతియు మున్ను దలఁచినాఁడ నామదిన్. 106

రామా : విను=వినుము, ఈ విధమున బల్కి=ఇట్లు మాట్లాడి, మరియు నిట్టులనియె=ఇంకను ఇట్లనెను, అట్టి కాంక్షావిధికి=ఆ విధమైన కోరికకు, ఒక విధమైన అడ్డు, ఇపుడు కలదు, ఇప్పుడు వున్నది, నిన్ను=రాముని, ఆరయంగా=తెలియగా, మునివి=ఋషివి, ఆరణాధికారమునకున్=పరితపింపజేయుటకు, తగుదువే= తగుదువా, తావత్=అర్థగతియున్=అంతైన పనికి, నా మదిన్=నా మనస్సులో, మున్ను తలచినాడ=ముందే ఆలోచించితిని.

తాత్పర్యము : ఇట్లు మాట్లాడి మరియు ఇట్లనెను. ఆ విధమైన కోరికకు ఇపుడు నిన్ను చూడగా ఒక విఘ్నము కలదు. వినుము. నీవు మునీశ్వరుడవని తెలిసి అట్లు పరితపింపజేయుటకు తగుదువా! అంతైన కార్యరీతిని నా మనసులో ముందే తలచినాను.

భారత : ఈ విధమున, పల్కి, మరియు నిట్టులనియె. అట్టి కాంక్ష విధికిన్=అఖాండవ వన భక్షణవాంఛకు ఒక విఘ్నమిప్పుడు కలదు, నిన్ను నారయంగా వినుము. నివారణాధికారమునకున్=ఆ విఘ్నము మాన్పెడు పనికి, తగుదువు= సమర్థుడవు, ఏతావత్+అర్థగతియున్=ఇంత పూనికను, నామదిన్=నామనస్సులో (అర్జునుడు), మున్ను తలచినాడ=మునుపే ఆలోచించితిని.

తాత్పర్యము : ఈ విధముగా పలికి మరియు ఇట్లనియెను. ఆ ఖాండవ వనమును భక్షించవలయుననెడి కోరికకు ఇపుడు ఒక విఘ్నము కలదు. నిన్ను

తెలియగా వినుము. ఆ విఘ్నము మాన్పెడు పనికి నీవు తగుదువు. నా మనస్సులో ఇంత పూనికను ముందే తలచినాడను.

తే. వఱలునచ్యుతసఖ్యాతివర్ణితాతు
లప్రదీప్తి ని ట్లలరు నీ విప్రభావ
మెందుఁ బెట్టనికోటగా నెసఁగుచుఁ గడ
చేర్తువస్మన్మహాశరాజితనిరూఢి 107

రామా : వఱలు=ఒప్పెడి, అచ్యుత=నాశములేని స్థిరయోగముచే, సఖ్యాతి=ఖ్యాతితో కూడిన, వర్ణితా=బ్రహ్మచారిత్వము యొక్క, అతులప్రదీప్తిన్=మిక్కిలి ప్రసిద్ధిచే, ఇట్లు+అలరు=ఇట్లు ప్రకాశించు, నీ=నీ యొక్క, విప్రభావము=బ్రాహ్మణత్వము, అస్మత్=మా యొక్క, మహాశర=గొప్ప బాణముల యొక్క, అజిత నిరూఢిన్=జయింపరాని శక్తిచే, ఎందున్=ఎక్కడను, పెట్టని కోటగా=నిర్మింపని కోటగా, ఎసగుచు=విజృంభించుచు, కడచేర్తువు=అతిక్రమించెదవు.

తాత్పర్యము : స్థిరమైన యోగముచేత ప్రకాశించు ఖ్యాతితో కూడిన బ్రహ్మచారిత్వము యొక్క అత్యంత కీర్తిచే నీ బ్రాహ్మణ భావము. మా గొప్పవైన బాణముల అప్రతిహతమైన శక్తిచే ఎందును పెట్టనికోటగా విజృంభించుచు అతిక్రమించెదవు. (నీవు బ్రాహ్మణుడవు కాబట్టి కొంకుచున్నాము అని రాముని భావము).

భారత : వరలు, అచ్యుత=శ్రీకృష్ణుని యొక్క, సఖ్య=స్నేహముచే, అతివర్ణిత=మిక్కిలి శోభించు, అతులప్రదీప్తిన్=మిక్కిలి తేజస్సుచే, ఇట్లలరు నీవు=ఇట్లు ప్రకాశించు నీవు (అర్జునుడు), ఈ+ప్రభావము=ఈ మహిమచే, ఎందును, పెట్టని కోటగా, నెసగుచు, రాజితనిరూఢిన్=మంచి అస్త్రాభ్యాసమందలి నేర్పుచే, అస్మత్=నా యొక్క, మహాశన్=గొప్ప ఆపేక్షను, ఎందున్, పెట్టనికోటగా, ఎసగుచు, కడచేర్తువు=సఫలము చేయుదువు.

తాత్పర్యము : కృష్ణుని యొక్క సాహచర్యముచే మిక్కిలి వర్ణితమైన అధిక

తేజస్సుచే ఈ విధముగా అలరు నీవు ఈ మహిమచే మంచి అస్త్రాభ్యాసమందలి నేర్పుచే మా అధికాపేక్షను ఎందును పెట్టని కోటవలె ప్రవర్తించుచు సఫలము చేయుదువు. (అగ్నిదేవుడు అర్జునునితో అనిన మాటలు).

ఉత్సాహ : ఎన్న నేవరించువరసమిన్మహావనంబులో
నన్నగారి గినిసినను ఘనాతిచండకాండవృ
ష్టి న్నలంప వచ్చు జగదజేయదండ నుండుమా
యన్న బ్రాహ్మణునకు విరచితాంజలి యగుభక్తితోన్. 108

రామా : ఎన్ననే=ప్రసిద్ధమగునట్లుగానే, వరించు=స్వీకరించు, వరసమిత్=మహాయుద్ధమనెడి, మహ=ఉత్సవము యొక్క, అవనంబులోనన్=రక్షణములోపల, నగారి+కినిసినన్=ఇంద్రుడు ఎదిరించినను, ఘన+అతిచండ=మిక్కిలి తీవ్రమైన, ఖాండవృష్టి=శరవర్షముచే, జగత్+అజేయదండనుండు=జగములకు అతిక్రమింపరాని ఆజ్ఞగలవాడు, మాయన్న=రఘురాముడు, నలంపవచ్చున్=అణచు ప్రయత్నము చేయును, బ్రాహ్మణునకు, భక్తితోన్, విరచితాంజలి+అగు=నమస్కరించువాడగును.

తాత్పర్యము : ప్రసిద్ధమగునట్లుగ స్వీకరించు మహాయుద్ధమును ఉత్సవము యొక్క రక్షణలో ఇంద్రుడెదిరించినప్పటికిని శరవర్షముచే జగములకు అతిక్రమింపరాని ఆజ్ఞగలవాడగు మాయన్న రఘురాముడు అణచు యత్నము చేయును. భక్తితో బ్రాహ్మణునకు నమస్కరించును.

భారత : ఎన్న=లెక్కింపగా, నేవరించు=నేను కోరెడి, వర=శ్రేష్ఠమైన, సమిత్=సమిధలుగల, మహావనంబులో=గొప్ప అరణ్యములో, అన్నగారి=ఆ ఇంద్రుడు (ఆ+నగారి), కినిసి=కోపించి, నన్=నన్ను, ఘన=మేఘముల యొక్క, అతిచండ=మిక్కిలి ఉగ్రమైన, కాండవృష్టిన్=ఉదక వర్షముచే, నలంపవచ్చున్=బాధింపవచ్చును, జగత్+అజేయ=లోకములో జయింపరానివాడా! అని సంబోధన, దండన్+ఉండుమా =నా సమీపములో నుండుమా, అన్నన్=అనినను, బ్రాహ్మణునకున్=బ్రాహ్మణ వేషములోనున్న అగ్నికి, భక్తితోనే, విరచితాంజలియగు=నమస్కరించును.

తాత్పర్యము : “ఎన్నగా, నేను కోరిన శ్రేష్ఠమైన సమిధలుగల ఈ మహారణ్యములో ఆ ఇంద్రుడు కోపించి మేఘముల యొక్క జలవర్షముచే నన్ను బాధింపవచ్చును. ఓ జగదజేయా! (అర్జునా!) నీవు నా సమీపములో నుండుమా” అనిన అగ్నిదేవునకు భక్తితో నమస్కరించును.

విశేషణము : విరచితాంజలి యనుచో పంచమీ బహువ్రీహి.

స్రగ్ధర: ఆరాజన్యోత్తముం డిట్లనుదితరభసుండై భవత్సత్వరవ్యా
హారం బిట్లోర్చియుంటన్యముగఁగొనకు మాత్మాంగనాశుల్కతాదృ
క్సారోగ్రేష్వాస మిట్లశ్రమజిత మగుటెంచంగ నాచేతికాఁటం
గ్రూరేష్వాసంబు లేదొక్కొఁడు గలుగునె తద్ఘోరయుద్ధంబుసైఁపన్.

రామా : ఆరాజన్య+ఉత్తముండు=ఆ రాముడు, ఇట్లు=ఈ విధముగా, అనుదితరభసుండై=పుట్టిన కోపముగలవాడై, భవత్=నీ యొక్క, సత్వర=తీవ్రమైన, వ్యాహారంబు=వాక్యమును, ఇట్లు=ఈ విధముగా, ఓర్చియుంటన్=ఓర్చుకొని యుండుటను, అన్యముగ=వేరు విధముగా, కొనకుమా=భావించకుమా, ఆత్మ+అంగనాశుల్క=నా సతికోసమైన శుల్కమైన, తాదృక్+సార=అట్టి చేవగల, ఉగ్రేష్వాసము=ఈశ్వరుని విల్లు, ఇట్లు=ఈ విధముగా, అశ్రమజితమగుట= శ్రమలేకుండా జయింపబడుట, ఎంచంగన్=లెక్కింపగా, ఆచేతికిన్=ఆ రఘురాముని హస్తమునకు, ఆటన్=తాళునట్లుగా, క్రూరేష్వాసంబు=దురుసైన విల్లు, లేదు=లేదు, ఒక్కొడు=ఒక పురుషుడు, తత్+ఘోర యుద్ధంబుసైపన్=ఆ ఘోరమైన రఘురాముని యుద్ధమును ఎదిరించుటకు, కలుగునె=కలుగునా?

తాత్పర్యము : ఆ రాముడిట్లు పుట్టిన కోపముగలవాడై నీ తీవ్రమైన వాక్యము నీవిధముగా నేను ఓర్చుకొని యుండుటను నీవు వేరు విధముగా భావించకుమా! నా సతి కోసము వీర్యశుల్కముగా అట్టి చేవగల శివధనుస్సును ఈ విధముగా శ్రమలేకుండ జయించుటను లెక్కింపగా ఆ రఘురాముని హస్తమునకు తాళునట్లుగా దురుసైన విల్లు లేదు. ఒక పురుషుడు ఆ ఘోరమైన రఘురాముని యుద్ధమును ఎదిరించుట శక్యమా!”

విశేషణము : ఒక్కొడు అనునది ఒక్కడు, ఒకడు అను శబ్దమునకు మరొక రూపాంతరము.

భారత : ఆ రాజన్యోత్తముడు=అర్జునుడు, ఇట్లను=ఇట్లు పలుకును, దిత=ఖండితమైన, రభసుండై=వేగముగలవాడై (త్వరపడక), భవత్+సత్వర వ్యాహారంబు=నీ తొందరపాటు కార్యమును, ఇట్లు, ఓర్చియుంట=వించున్నయునికి, అన్యముగ, గొనకుము, ఆత్మాంగనా శుల్కతాదృక్సార=ద్రౌపదిని వీర్యశుల్కముగా గొన్న, ఉగ్రేష్వాసంబు=తీవ్రమైన విల్లు ఇట్లు, అశ్రమజితమగుట+ఎంచంగ=నాచేతి కాఁటన్=నా చేతికి తాళునట్లుగా, క్రూరేష్వాసంబు=క్రూరమైన విల్లు, తత్=ఆ ఇంద్రుని యొక్క, యుద్ధంబుసైపన్, ఒక్కడు, కలుగునె=యుద్ధమును, ఓర్చుకొనగలది=లేదు.

తాత్పర్యము : ఆ అర్జునుడు (అగ్నిదేవునితో) ఇట్లనును, ఖండితమైన త్వరితగతిని చూపక, నీ తొందరపాటు కార్యమును ఇట్లు ఓర్చియుండుటను వేరు విధముగా భావింపకుము. ద్రౌపదిని వీర్యశుల్కముగాగొన్న తీవ్రమైన విల్లు, ఈ విధముగా శ్రమలేకయే సాధింపబడినదగుటచే, నాచేతికి తాళునట్లుగా ఈ క్రూరమైన విల్లు, ఆ ఇంద్రుని యుద్ధమును ఓర్చుకొనగలది ఒక్కడును లేదు.

(నా చేతికి తగిన విల్లొకటి ఇచ్చిన ఇంద్రుని జయింపగలను).

స్రగ్ధర ఛందస్సు : మ-ర-భ-న-య-య గణములు. 8, 15 అక్షరములలో రెండు యతిస్థానములు.

సీ. అనుటయు నాతఁ డాజననాథ వరకుమా
రాగ్రణిఁ జూచి నీయాత్మయందు
నిటువంటితలఁపున్న నిదిగో మహాబలో
ద్దామంబు కమలేశదత్త మయ్యె
నాకీశచాపంబునకు నెక్కు డిది గాండి
వం బనుభారతీవరుధనుర్మ

తల్లికశేషోగ్రతరగుణప్రౌఢి న
త్యధికంబు క్రమమున నన్యదేవ

తే. ధృతము లైనవానిని గణుతింపనేల
దీని నెక్కిడి నీభుజస్థేమఘనవి
జృంభణముఁ జూపు మని తనచేతివిల్లు
దృఢరణస్థితి నరదంబుఁ దెచ్చి యిచ్చె. 110

రామా : అనుటయు, అతడు=ఆ పరశురాముడు, ఆ జననాధవరకుమారాగ్రణిన్=ఆ దశరధమహారాజు కుమారుడైన శ్రీరాముని, చూచి, నీయాత్మయందు=నీ మనస్సులో, ఇటువంటి తలపున్న=ఇట్టి కోరికయున్నచో, ఇదిగో, నాకు మహాబల+ఉద్దామంబు=మిక్కిలి బలపరాక్రమముగల, కమలేశదత్తమయ్యె=విష్ణువుచే నొసగబడెను, ఈశచాపంబునకు=శివధనుస్సునకు, ఎక్కడిది=అధికమైనది, గాండివంబను=గాండీవమను, భారతీవరుధనుర్మతల్లికకు=బ్రహ్మధనుస్సు కంటె శ్రేష్ఠమైనదానికి, అశేష+ఉగ్రతరగుణ ప్రౌడిన్=అధికమైన తీవ్రశక్తిచే, అత్యధికంబు=గొప్పది, క్రమమున=ఈ వరుసలో, అన్యదేవధృతములైనవానిని=ఇతర దేవతలు ధరించిన వానిని, గణుతింపనేల=లెక్కింపనేల? దీనినెక్కిడి=దీనిని ఎక్కుబెట్టి, నీ భుజస్థేమ=నీ భుజశక్తి యొక్క ఘనవిజృంభణము=అధికమైన శౌర్యమును, చూపుమని, దృఢరణస్థితి=ధృఢమైన యుద్ధస్థితిగల, నర=పురుషులను, ద=ఖండించు దానిని, తన చేతివిల్లు, తెచ్చి యిచ్చె.

తాత్పర్యము : అట్లనగా ఆ పరశురాముడు ఆ దశరధ కుమారుడైన రాముని జూచి, నీ మనసులో ఇటువంటి భావన యున్నచో, ఇదిగో! మహాబలపరాక్రమముగల విష్ణువుచే నాకొసగబడిన ఈశ్వరుని చాపముకంటె ఎక్కువైనది, గాండివమను బ్రహ్మ ధనుశ్శ్రేష్ఠమునకు తీవ్రమైన గుణప్రౌఢిచే అధికమైనది. ఇది క్రమముగా ఇతర దేవతలు ధరించిన వాటిని లెక్కింపనవసరము లేదు. దీనిని ఎక్కుపెట్టి నీ భుజశౌర్యమును విజృంభింపజేసి చూపుమని దృఢమైన రణస్థితిలో పురుషులను ఖండించు తన చేతివింటిని తెచ్చి యిచ్చెను.

భారత : అనుటయు, ఆతడు, ఆ జననాధవరకుమారాగ్రణి=ఆ అర్జునుని, చూచి, నీ ఆత్మయందు, ఇటువంటి తలపున్న, ఇదిగో, మహాబలోద్దామంబు, కమలేశ=జలాధిపతియైన వరుణునిచే, దత్తమయ్యెను=ఇవ్వబడెను, నాకీశ=దేవేంద్రుని యొక్క చాపంబునకు ఎక్కుడు, ఇది గాండివంబను=గాండీవమను, భారతీవరు=బ్రహ్మ యొక్క, ధనుర్మతల్లిక=ధనుశ్శ్రేష్ఠము, శేషోగ్రతర=ఆదిశేషునివలె ఉగ్రతరమైన, గుణప్రౌఢి=వింటినారి యొక్క ప్రౌఢి, అత్యధికంబు, క్రమమున, అన్యదేవధృతములైన= బ్రహ్మాదులచే ధరింపబడినవానిని=ఆధారణములను, గణుతింపనేల, దీనినెక్కిడి నీ భుజస్థేమఘనవిజృంభణము జూపుమని తన చేతివిల్లు, దృఢరణస్థితిన్= అప్రతిహతమైన, అరదంబు=రధమును, తెచ్చి యిచ్చె.

తాత్పర్యము : అనుటయు ఆ అర్జునుని చూచి నీ మనసులో ఇటువంటి ఆలోచన కలిగినచో ఇదిగో మహాబలపరాక్రమముగల వరుణునిచే ఇవ్వబడినదిది. దేవేంద్రుని చాపమునకు ఇది ఎక్కుడైనది. గాండీవమను బ్రహ్మాదేవుని ధనుశ్శ్రేష్ఠము. ఆదిశేషునివలె తీవ్రమైనదై వింటినారి యొక్క అధిక ప్రౌఢిచే అతిక్రమించునది. బ్రహ్మాదులచే ఆధారణములను ఇంక లెక్కింపనవసరము లేదు. దీనిని ఎక్కుపెట్టి నీ భుజపరాక్రమవిజృంభణము చూపుమని, తన చేతి వింటిని, అప్రతిహతమైన రధమును తెచ్చి యిచ్చెను (అగ్నిదేవుడు).

మ. నుతశక్తిన్ నృపసూనుఁ డట్టిధనువున్మోపెట్టి యైంద్రా యుధో
ద్ధతిపాథోదనిరాసి యయ్యె నపు డాతండున్ సముద్వేగయు
క్తతఁ గీర్తించి కృతావృథాగ్రహతదస్త్రక్రామిత స్వర్గప
ద్ధతియై యిష్టమహావనీచరతఁ జెందంగాంచి పొంగెన్ మదిన్111.

రామా : నృపసూనుడు=శ్రీరాముడు, నుతశక్తిన్=కీర్తించు శక్తితో, అట్టి ధనువున్ మోపెట్టి=అటువంటి ధనుస్సును ఎక్కుపెట్టి, ఐంద్రాయుధోద్ధతి=ఇంద్ర ధనుస్సుతో కూడిన ఉన్నతిగల, పాథోధనరాశియయ్యెన్=మేఘమును తిరస్కరించినవాడాయెను, (నీలమేఘశ్యాముడు గనుక) అపుడు, ఆతండున్=ఆ పరశురాముడును, సముద్వేగ యుక్తతన్=భయముతో కూడిన, కీర్తించి, కృత=చేయబడిన, అవృధా=వ్యర్థముకాని,

గ్రహ=గ్రహణముగల, (ఎక్కుబెట్టిన), తత్-అస్త్ర=ఆ రాముని బాణముచే, క్రామిత=ఆక్రమింపబడిన (పోగొట్టబడిన), స్వర్గ=స్వర్గము యొక్క, పద్ధతియై= మార్గముగలవాడై, ఇష్ట=ఇష్టమైన, మహా=గొప్పదైన, అవనీచరతన్=భూ సంచారమును, చెందన్+కాంచి=చెందుటను చూచి, మదిన్=మనస్సులో, పొంగెన్=సంతోషించెను.

తాత్పర్యము : కీర్తించు విధముగా శ్రీరాముడు అట్టి ధనుస్సును ఎక్కుపెట్టి, ఇంద్రధనుస్సుతో కూడిన ఉన్నతిగల మేఘమును తిరస్కరించినవాడాయెను. అప్పుడు ఆ పరశురాముడు భయముతో (రాముని) కీర్తించి, వ్యర్థముగాని ఎక్కుబెట్టిన ఆ రాముని బాణముచే ఆక్రమింపబడిన స్వర్గమార్గముగలవాడై ఇష్టమైన గొప్ప భూసంచారమును చెందుటను చూచి మనస్సులో సంతోషించెను.

భారత : నృపసూనుడు=అర్జునుడు, నుతశక్తిన్=కీర్తించు శక్తితో, అట్టి ధనువున్=ఆ గాండీవమును, మోపెట్టి, ఐంద్రాయుధోద్ధతిన్=ఇంద్రుని ఆయుధముల ఔద్ధత్యముతో గూడిన, పాథోద=మేఘములను, నిరాసియయ్యెన్=పోగొట్టినవాడాయెను, ఆతండును=ఆ అగ్నియు, సముద్వేగ=సంతోషముతో గూడిన సంభ్రమముతో, యుక్తతన్=కూటమిచే, కీర్తించి=ప్రశంసించి, కృత=చేయబడిన, అవృధా=వ్యర్థముగాని, ఆగ్రహ=చలముగల, తత్=ఆ అర్జునుని, అస్త్ర=అస్త్రములచే, క్రామిత=కప్పబడిన, స్వర్గపద్ధతియై=ఆకాశమార్గముగలవాడై, ఇష్ట=ఇష్టమైన, మహావనీ=గొప్ప అరణ్యము యొక్క, చరతన్=భక్షణమును, చెందన్+కాంచి=చెందుటను జూచి, మదిన్, పొంగెన్.

తాత్పర్యము : అర్జునుడు కీర్తించు శక్తితో ఆ గాండీవమును మోపెట్టి ఇంద్రుని ఆయుధముల ఉద్ధతితోగూడిన మేఘసముదాయమును పోగొట్టిన వాడాయెను. (ఇంద్రుని వజ్రము మొదలైన ఆయుధములను, మేఘాలను పోగొట్టెను). ఆ అగ్నియు సంతోషముతోగూడిన సంభ్రమముతో కూడి (అర్జునుని) ప్రశంసించి, వ్యర్థము గావింపబడిన చలముగల ఆ అర్జునుని అస్త్రములచే కప్పబడిన ఆకాశమార్గముగలవాడై (శరపంజరమునుగట్టి) ఇష్టమైన గొప్ప అరణ్య భక్షణమును అగ్ని చెందుటను జూచి మనస్సులో పొంగెను.

తే. తనకనలుచేష్ట లంతభీతిని ఘటింప
మగిడి శరణన్నఁ దన్మహిమయుఁ దదాత్త
తన్మహాదైన్యము గణించి దయ దలిర్పఁ
గాచె నేమన నప్పు డారాచపట్టి. 112

రామా : అప్పుడు, ఆరాచపట్టి=ఆ రామచంద్రుడు, తన=తన యొక్క, కనలుచేష్టలు=కోపించు చేష్టలు, అంత భీతిని ఘటింప=అంతటి భయమును కల్గింపగా, మగిడి=తిరిగి, శరణు+అన్న=శరణువేడిన, తత్+మహిమయు=ఆ పరశురాముని మహిమను, తత్+ఆత్తతన్=ఆ సమయములో పొందబడిన, మహాదైన్యము=గొప్ప దీనత్వమును, గణించి=లెక్కించి, ఏమనన్=ఏమనవచ్చును, దయదలిర్ప=దయ కలుగగా, కాచె=రక్షించెను.

తాత్పర్యము : అప్పుడు ఆ రాముడు తన కోపపు చేష్టలు అంతటి భీతిని కలిగింపగా తిరిగి తనను శరణువేడిన ఆ పరశురాముని మహిమను, ఆ సమయములో పొందిన మహాదీనత్వమును లెక్కించి, ఏమనవచ్చును, దయ కలుగగా రక్షించెను.

భారత : ఆ రాచపట్టి=ఆ అర్జునుడు, అప్పుడు, తనకు=అర్జునునకు, అనలుచేష్టలు=అగ్నిదేవుని పనులు, అంతభీతిన్=నాశభయమును, ఘటింప=కలిగింపగా, శరణన్నన్, తన్మహిన్=ఆ ఖాండవవనభూమియందు, మయున్=మయుడనువానిని, తదా=ఆ కాలమునందు, ఆత్త=పొందబడిన, తత్=ఆ మయుని యొక్క మహాదైన్యము, గణించి, దయదలిర్ప, ఏమనన్, కాచె.

తాత్పర్యము : ఆ అర్జునుడు అప్పుడు తనకు అగ్నిదేవుని చేష్టలు నాశభయమును కల్గింపగా శరణనిన ఆ ఖాండవవనభూమియందు మయుడను వానిని, ఆ కాలమున మహాదీనత్వముతోనున్నవానిని, ఏమని చెప్పవచ్చును, కాపాడెను.

ఉ. స్రుక్కక భూమిభృత్కులవిరోధి కడంక నడంచి యిమ్మెయిం
దక్కక హేతిధారి కుచితం బగుకార్యము నిర్వహించి పెం

పెక్కుడుగాఁగ నాత్మపురి కేఁగె హరిన్నుతకీర్తిఁ గూడిన
ల్దిక్కులఁ బిక్కటిల్లుచుఁ దలిర్చుప్రతాపవిజృంభణంబునన్. 113

రామా : స్రుక్కక=శుష్కించక, భూమిభృత్+కులవిరోధి=రాజుల విరోధియైన ఆ పరశురాముని, కడంకన్=గర్వమును, అడంచి=అణచి, ఇమ్మెయిన్=ఈ విధముగా, దక్కక=తప్పక, హేతిధారికిన్=శస్త్రధారునకు, ఉచితంబగు=యోగ్యమైన, కార్యము=పనిని, నిర్వహించి=చేసి, పెంపు+ఎక్కుడుగాగ=ఆధిక్యము ఎక్కువకాగా, ఆత్మపురికి=అయోధ్యకు, హరిత్=దిక్కులయందు, నుతకీర్తిన్=ప్రశంసించబడు కీర్తితో, కూడిన, నల్+దిక్కుల=నాలుగు దిక్కులయందు, పిక్కటిలుచు=వ్యాపించుచు, తలిర్చు=ప్రకాశించు, ప్రతాపవిజృంభణంబునన్=శౌర్యవిస్తృతిచే, ఏగెన్=వెళ్లెను.

తాత్పర్యము : శుష్కించక ఆ పరశురాముని గర్వభంగము చేసి ఈ విధముగా తప్పక శస్త్రధారి కుచితమగు పనిని నిర్వహించి ఆధిక్యముతోగూడిన అయోధ్యకు నాలుగు దిక్కులయందును ప్రశంసించబడు కీర్తితోకూడిన వ్యాప్తితో ప్రకాశించుచు శౌర్యవిస్తృతిచే రాముడు వెళ్లెను.

భారత : స్రుక్కక, భూమిభృత్+కుల=పర్వత సమూహములకు, విరోధిన్= ఇంద్రుని, కడంకన్, అడంచి, ఇమ్మెయిన్, దక్కక, హేతిధారికిన్= జ్వాలావహుడైన అగ్నికి, ఉచితంబగు కార్యము నిర్వహించి, పెంపెక్కుడుగాగ, నుతకీర్తిన్, హరిన్=కృష్ణుని, కూడి, ఆత్మపురికిన్=ఇంద్రప్రస్థమునకు ఏగెను.

తాత్పర్యము : తాను స్రుక్కక పర్వతవిరోధియైన ఇంద్రుని కోపము నణచి ఈ విధముగా జ్వాలావహుడైన అగ్నికుచితమైన కార్యము నిర్వహించి, ఆధిక్యముతో నుతకీర్తియైన శ్రీకృష్ణునితోగూడి అర్జునుడు ఇంద్రప్రస్థమున కేగెను.

సీ. సర్వేశ్వరుఁడు కృష్ణ సఖ్యాతిమహిమకు
నెంతపెంపును దగు నేమి చెప్ప
దక్షుఁ డానరుఁ డట్లు దనర రాక్షసకుల
తక్షకుం డతివిచిత్రతరశక్తి

మయుఁ డతిక్రాంతవాఙ్మానసభావిశే
షంబు వైవస్వతసంతతికిని
దనదు లీలోదయంబునను సంపాదించి
పెట్టె నత్యంతంబు పెంపుసొంపు

తే. సంఘటిల మరుచ్ఛతమఖసంతతుల క
తఁడు గదాదండమును సమిద్ధజయనాది
కంబువరము నిచ్చెను హరికిం బడరఁగఁ
బలుదెఱంగుల నార్యులుఁ బ్రస్తుతింప. 114

రామా : సర్వేశ్వరుడు=భగవంతుడైన, కృష్ణ=విష్ణువు యొక్క, సఖ్యాతి=ఖ్యాతితోగూడిన, మహిమకు=గొప్పకు, ఎంతపెంపునుదగు=ఎంత అధికముగానైనను తగును, ఏమిచెప్ప! దక్షుడు=సమర్థుడు, ఆనరుఁడు=రాముడు, అట్లుతనర=ఆ విధముగానొప్పగా, రాక్షసకుల తక్షకుండు=రాక్షస వంశనాశకుడు, అతి విచిత్రతర శక్తిమయుడు=మిక్కిలి విచిత్రమైన శక్తితో కూడినవాడు, అతిక్రాంత=అతిక్రమింపబడిన, వాఙ్మానస=వాక్కును, మనస్సుగల, భావిశేషంబు=కాంతి విశేషమును, వైవస్వత సంతతికిని=వైవస్వతమనువు వంశమునకు, తనదు, లీలోదయంబునకు=విలాసముగా అవతరించుటచే, అత్యంతంబు=మిక్కిలి, పెంపుసొంపు=ఆధిక్యమును, సంఘటిల=కూడగా, సంపాదించిపెట్టె, మరుత్+శత=దేవతా శతకములకును, మఖసంతతులకున్=యాగసమూహములకును, అతడుగదా=రాముడుగదా, దండ=ఆధారము, మును=పూర్వము, జయన్=జయము, ఆదికంబు=మొదలైనవి, హరికిన్=విష్ణువునకు, ఇంబడరగ=అతిశయింపగా, పలుతెఱంగుల=అనేక విధములుగా, ఆర్యులు ప్రస్తుతింప=పెద్దలు కీర్తింపగా, వరమునిచ్చెను.

తాత్పర్యము : భగవంతుడైన విష్ణువు యొక్క ఖ్యాతితోగూడిన గొప్ప ఆధిక్యమును ఏమని చెప్పగలము? సమర్థుడైన ఆ రాముడు ఆ విధముగా నొప్పగా రాక్షసవంశ నాశకుడు, మిక్కిలి విచిత్ర శక్తితో గూడినవాడు, అతిక్రమించబడిన వాక్కు, మనస్సుగల

శోభావిశేషమును వైవస్వతమనువంశమునకు తన విలాసావతారముచే మిక్కిలి ఆధిక్యము కలుగగా సంపాదించిపెట్టెను. వందలాది దేవతలకు, యాగ సమూహములకు, ఆ రాముడే గదా ఆధారము. పూర్వము జయము మొదలైనది విష్ణువునకు అనేక విధములుగా అతిశయింపగా, పెద్దలు కీర్తింపగా వరమునిచ్చెను.

భారత : సర్వేశ్వరుడు, కృష్ణ=శ్రీకృష్ణుని యొక్క సఖ్యాతిశయము=సఖ్యము చేతనైన యతిమహిమకు, ఎంత పెంపును తగునేమి చెప్ప దక్షుడు, ఆ నరుడు=ఆ అర్జునుడు, అట్లు తనర, రాక్షసకుల, తక్షకుండు, అతివిచిత్రతరశక్తి, అతిక్రాంత, వాక్=వాక్కుల యొక్క, మాన=పరిమాణముగల, సభావిశేషంబుఁ=మయసభా విశేషమును, వైవస్వత సంతతికిన్=ధర్మజునకు, తనదు, లీలోదయంబునన్= క్రియాచాతుర్యముచే అత్యంతము పెంపు సొంపు సంఘటిల సంపాదించిపెట్టె, మరుత్=వాయుదేవునియొక్క, శతమఖ సంతతులకున్=ఇంద్రుని పుత్రులగు - భీమార్జునుడు, అతడు, మయుడు, గదాదండమును, సమిద్ధ=ప్రకాశించుచున్న, జయ=జయము గలుగునట్లు, నాది=మ్రోసెడి, కంబువరమును=శంఖ శ్రేష్ఠమును, హరికిన్=శ్రీకృష్ణునకు, ఇంబడరగన్=ఇంపగునట్లుగా, పలు తెఱంగుల, ఆర్యులు ప్రస్తుతింప - ఇచ్చెను.

తాత్పర్యము : సర్వేశ్వరుడైన ఆ శ్రీకృష్ణుని యొక్క సఖ్యముచేత యతి మహిమకు ఎంతైనా పెంపు తగును. ఏమి చెప్పను. ఆ అర్జునుడు దక్షుడై అట్లు తనరగా రాక్షస కులమునకు చెందిన తక్షకుడు అతి విచిత్రమైన శక్తిచే అతిక్రమించిన వాక్కుల పరిమాణముగల మయసభా విశేషమును ధర్మజునికి తన క్రియాచాతుర్యముచే అత్యంతము పెంపుమీరగా సంపాదించి పెట్టెను. వాయునందనుడు, ఇంద్రనందనులకు మయుడు గదాదండమును, ప్రకాశించు జయము గలుగునట్లు మ్రోసెడి శ్రేష్ఠమైన శంఖమును శ్రీకృష్ణునికి ఇంపగునట్లుగా అనేక విధములుగా పెద్దలు ప్రస్తుతింపగా నిచ్చెను.

చం. అది యటు లుండె నట్టిసభయానతశత్రుదయాళుఁ డాజిదీ
వ్యదరిహృదంతవహ్ని సమవర్తిసుతుం డతిలోకభాగ్యసం

పద లమరంగఁ జేకొనిశుభస్థితిఁ దమ్ములుఁ దాను నెంతయుం
బొదల శుచిత్వశాలి యజపుత్త్రుఁడు మిక్కిలి సంతసిల్లుచున్. 115

రామా : అది యటులుండె=అది అట్లుండగా, అట్టి=ఆ విధమైన, సభయ=భయముతోగూడిన ఆనత=వినమ్రులైన, శత్రుదయాళుడు=శత్రువుల యందు దయగలవాడు, ఆజిన్=యుద్ధమునందు, దీవ్యత్=ప్రకాశింపుచున్న, అరి=శత్రువుల యొక్క, హృదంతవహ్నిసమ=హృదయములందు ప్రళయాగ్ని సమానమైనట్లు, వర్తి=వర్తించు, సుతుండు=రాముడు, అతిలోక=లోకముల నతిక్రమించిన, భాగ్య సంపదలు=భాగ్యవశమున కలిగిన సంపదలు, అమరంగన్+చేకొని=కలుగగా స్వీకరించి, శుభస్థితిన్=శోభాయుతముగా, తమ్ములు=లక్ష్మణాదులు, తాను=రాముడు, ఎంతయున్ పొదల=మిక్కిలి వృద్ధి పొందగా, అజపుత్రుడు=దశరధుడు, శుచిత్వశాలి= కీర్తివంతుడు, మిక్కిలి సంతసించుచున్=మిక్కిలి సంతోషించుచు – ముందు అన్వయము.

తాత్పర్యము : అది అట్లుండనిండు, ఆ విధమైన భయముతో వినమ్రులైన శత్రువులయందు దయాస్వభావముగలిగి యుద్ధమున ప్రకాశించి శత్రువుల హృదయములలో ప్రళయాగ్నికి సమానమై ప్రవర్తించుచు రాముడు లోకముల నతిక్రమించిన భాగ్యసంపదలు కలుగగా స్వీకరించి శోభాయుతముగా లక్ష్మణాదులు, తాను మిక్కిలి వృద్ధి పొందగా కీర్తివంతుడైన దశరథుడు మిక్కిలి సంతోషించుచు –

భారత : అది యటులుండె, అట్టిసభ=అట్టి మయసభలో ఆనతశత్రుదయాళుడు, ఆజిదీవ్యదరిహృదంతవహ్ని=యుద్ధమున తీవ్రమైన హృదయమును కాల్చు అగ్నివంటివాడు, సమవర్తిసుతుండు=ధర్మజుడు, అతిలోక భాగ్యసంపదలమరంగ, చేకొని, శుభస్థితి, తమ్ములు=భీమాదులు, తాను, ఎంతయున్ పొదల, శుచిత్వశాలి, అజపుత్రుడు=బ్రహ్మపుత్రుడైన నారదుడు, మిక్కిలి సంతసించుటన్ –

తాత్పర్యము : అది యట్లుండగా అట్టి మయసభలో వినమ్రశిరస్కులైన శత్రువుల పట్ల దయగలవాడు, యుద్ధమున హృదయమును తీవ్రముగా కాల్చు అగ్నివంటి ధర్మజుడు అతిలోక భాగ్యసంపదల మరగా శుభస్థితినంది భీమాదులు, తాను ఎంతో

అతిశయింపగా కీర్తిమంతుడైన నారదుడు మిక్కిలి సంతోషించుచు – వచ్చెనని ముందు పద్యముతో అన్వయము.

కం. చనుదెంచి సర్వదిగ్వ
ర్తనఁ దేజము మెఱయఁ దత్పురస్థితిఁ బెంపొం
దె నతం డనుజులుఁ దానుం
బొనరించు మహోపచారముల రంజిలుచున్. 116

రామా : సర్వదిక్+వర్తనతేజము=అన్ని దిక్కులయందును వ్యాపించుకాంతి, మెఱయ=ప్రకాశింపగా, చనుదెంచి=వచ్చి, తత్+పురస్థితిన్=ఆ పట్టణస్థితిచే (అయోధ్యచే) అతండు=రాముఁడు, అనుజులు=లక్ష్మణాదులు, పొనరించు మహోపచారముల=చేయు గొప్ప ఉపచారములచే, రంజిలుచున్=ఆనందించుచు, అతడు=దశరథుడు, పెంపొందెను.

తాత్పర్యము : అన్ని దిక్కుల వ్యాపించు కాంతితో ప్రకాశింపగా చనుదెంచిన రాముడు అయోధ్యలో లక్ష్మణాదులు, తాను చేయు మహోపచారములచే దశరథుడు సంతోషింపగా ఆధిక్యమునందెను.

భారత : సర్వదిగ్వర్తనన్, తేజము మెఱయగా, చనుదెంచి=వచ్చి, తత్=ఆ ధర్మజుని యొక్క, పురః స్థితిన్=అభిముఖమునందు ఉండుటచే, అతండును= నారదుడును, అనుజులు, తాను, పొనరించు మహోపచారములు, రంజిలుచున్, పెంపొందె.

తాత్పర్యము : అన్ని దిక్కులయందు తన తేజము మెఱయగా నారదుడు వచ్చి, ఆ ధర్మజునికి ఎదురుగా వుండుటచే ధర్మజుడు, అతని తమ్ములు చేయు మహోపచారములకు సంతసించుచు పెంపొందెను.

శా. మాహానాథవిహారవాహనకృపామాహాత్మ్య సాహాయ్యకో
త్సాహిశ్లక్ష్ణకటాక్షవిక్షపితభక్తవ్రాతసంసార శ్రీ

బాహుళ్యప్రదపాదసంస్మరణ పంపా హేమకూటాద్రి ఖే
లాహేవాకవిపాకవిస్మరితకైలాసాదికేళీరసా. 117

అర్థము : మహానాథ=గోరాజైన వృషభమే, విహారార్థ=విహరించుటకు, వాహన=వాహనముగాగలవాడా, కృపా మహాత్మ్య=దయతోగూడిన మహాత్వమనెడి, సాహాయ్యక=సహాయముచే, ఉత్సాహి=ఉప్పొంగిన, శ్లక్ష్ణకటాక్ష=కటాక్ష లేశముచే, విక్షపిత=చెదురునట్లు మీటబడిన, భక్తవ్రాత=భక్తుల సముదాయము యొక్క, సంసార=జన్మాదిబంధముగలవాడా, శ్రీబాహుళ్య=ఐశ్వర్యపరంపరను, ప్రద= అధికముగానిచ్చు, పాదసంస్మరణ=పాత జ్ఞాపకముగలవాడా (పాదారవింద సంస్మరణచే మోక్షమునిచ్చువాడా) పంపా=పంపానది యందుగల, హేమకూటాద్రి= హేమకూట పర్వతముపై, ఖేలా=విహారము యొక్క, హేవాక=హృదయంగమమైన, విపాక=పరిచయముచే, విస్మరిత=మరువబడిన, కైలాసాది=కైలాసగంగల యొక్క, కేళీరసా=విహారాపేక్షగలవాడా.

తాత్పర్యము : అంకిత పద్యమిది. గోరాజైన వృషభమే విహరించుటకనువైన వాహనముగలవాడా! కృప అనెడి మాహాత్యము యొక్క సహాయముచే ఉప్పొంగిన కటాక్షలేశముచే చెదరునట్లు మీటబడిన భక్తసంబంధము యొక్క జన్మాది బంధముగలవాడా! (భక్తులను నిత్యులను జేయువాడా!) ఐశ్వర్యపరంపరను అధికముగా ఇచ్చెడి పాదారవింద సంస్మరణ వలన సంపదను, ప్రసన్నత వలన మోక్షమును ఇచ్చెడివాడా! పంపానదియందు, హేమకూట పర్వతమునందు విహరించుటచే హృదయంగమమైన పరిచయముచే మరువ చేయబడిన కైలాసగంగల యొక్క విహారాపేక్షగలవాడా! (హేమకూట పంపానదులు కైలాసగంగల కంటె శ్రేష్ఠమని భావము).

కం. పెదవేంకటాద్రి హృదయా
స్పదపదవిన్యాసతుంగభద్రావీచీ
మృదుశీకరవిరచితనిజ
సదనాంగణరంగవల్లి సౌభాగ్యకళా. 118

అర్థము : పెదవేంకటాద్రి, హృదయాస్పద=హృదయమున కిష్టమైన, పదవిన్యాస=పదముల యొక్క విన్యాసముచే, తుంగభద్రా=తుంగభద్రా నదియొక్క, వీచీ=అలల, మృదుశీకర=మృదువైన బిందువులచే, విరచిత=రచింపబడిన, సదన+అంగణ=ఇంటి ముందు, రంగవల్లి=ముగ్గుల యొక్క, సౌభాగ్యకళా=సౌభాగ్యముతో గూడిన కళగలవాడా.

తాత్పర్యము : పెదవేంకటాద్రి హృదయమున కిష్టమైన పదముల విన్యాసముచే తుంగభద్రానది అలల మీదుబిందువులచే రచింపబడిన ఇంటి ముంగిట ముగ్గుల సౌభాగ్యముతో గూడిన కళగలవాడా!

స్రగ్విణి : బ్రధ్నకోటీసమభ్రాజితేజోఘనా
బుధ్న భావాప్తిసంపుష్టసృష్టిద్రుమా
బుధ్నవద్బోధసంహృష్యదృష్యర్చితా
గృధ్నుతాపూర్వ కాకృష్టశిష్టార్చనా. 119

అర్థము : బ్రధ్నకోటిసమ=కోటి సూర్యులతో సమమగునట్లు, భ్రాజి=ప్రకాశించు తేజోఘన=తేజస్సుచే గొప్పవాడా! బుధ్నభావ=మూలమగుటచే, ఆప్తి=ప్రాప్తిచే, సంపుష్ట=పోషింపబడిన, సృష్టి=సృష్టి అనే, ద్రుమా=వృక్షముగలవాడా, బుధ్నవత్=వృద్ధి బొందుచున్న, బోధ=జ్ఞానముచే, సంహృష్యత్=సంతోషించుచున్న ఋషులచే, అర్చితా=పూజింపబడువాడా, గ్రధ్నుతా=అపేక్షచే, అపూర్వక=అంతకు ముందు లేనట్లు, ఆకృష్ట=అంగీకరింపబడిన, శిష్ట+అర్చనా=శిష్టులచే అర్చనలు గలవాడా.

తాత్పర్యము : కోటి సూర్యులతో సమానమై ప్రకాశించు తేజస్సుచే గొప్పవాడా! మూలమగు ప్రాప్తిచే పోషింపబడిన సృష్టి అనే వృక్షముగలవాడా! వృద్ధి బొందుచున్న జ్ఞానముచే సంతోషించు ఋషులచే పూజింపబడువాడా! అపేక్షచే అంతకుముందు లేనట్లు అంగీకరింపబడిన శిష్టులచే అర్చనలు గలవాడా!

స్రగ్విణి ఛందస్సు : నాలుగు రగణములు, ఏడవ అక్షరము యతి.

గద్య : ఇది నిఖిలసూరిలోకాంగీకారకవిత్వ వైభవపింగళియమరనార్య తనూభవ సౌజన్యజేయ సూరయనామధేయ ప్రణీతంబైన రాఘవ పాండవీయంబునందు ద్వితీయాశ్వాసము.

గద్యము. ఇది శ్రీ మన్మదనగోపాలకృపాకటాక్షసంప్రాప్తసారసారస్వత సంపదానంద నందవరకులక్షీరపారావార తారకా సుధాధామముద్దరాజు గణపయామాత్య పెదరామధీమణి ప్రదర్శితం బైన రాఘవపాండవీయాదర్శంబునందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

కం. శ్రీమద్గౌరీపరమ
ప్రేమాస్పద యాకువీటి పెదవేంకటధీ
ధామ సదాలసదసదృ
గ్భూమ విరూపాక్ష హేమకూటాధ్యక్షా! 1

అర్థము : శ్రీమత్+గౌరీ=శ్రీమంతమైన గౌరీదేవికి, పరమప్రేమాస్పద=మిక్కిలి ప్రేమ పాత్రుడవై, ఆకువీటి పెదవేంకట, ధీధామ=బుద్ధికి నిధానమా, సదా=ఎల్లప్పుడు, లసత్=ఒప్పుచున్న, అసదృక్=సరిలేని, భూమ=మహిమగలవాడా! విరూపాక్ష హేమకూటాధ్యక్షా!

తాత్పర్యము : ఓ విరూపాక్ష హేమకూటాధ్యక్షా! శ్రీమంతమైన గౌరీదేవికి మిక్కిలి ప్రేమ పాత్రుడవైన ఆకువీటి పెదవేంకట (నామధేయా) బుద్ధికి నిధానమా! ఎల్లప్పుడు ఒప్పుచున్న సరిలేని మహిమగలవాడా!

వ. అవధరింపు మట్లు రంజిల్లుచున్న యయ్యతీంద్రసామ్రాజ్య
ధౌరేయుండు. 2

రామా : అవధరింపుము=వినుము, అట్లు, రంజిల్లుచున్న=ప్రకాశించుచున్న, ఆ+అతీంద్ర=ఆ ఇంద్రుని అతిక్రమించిన, సామ్రాజ్యధౌరేయుండు=దశరథుడు.

తాత్పర్యము : వినుము, అట్లు రంజిల్లుచున్న ఇంద్రుని అతిక్రమించిన ఆ దశరథుడు.

భారత : అవధరింపుము, అట్లు, రంజిల్లుచున్న, ఆ+యతీంద్ర సామ్రాజ్య ధౌరేయుండు=మునీశ్వరోత్తముడైన నారదుడు.

తాత్పర్యము : అట్లు ప్రకాశించుచున్న ఆ మునీశ్వరోత్తముడైన నారదుడు

తే. అతిశుభార్థసంపత్పదంబైనవసుధ
మహిమ నేలుచు వాత్సల్యమధురిమమున
నతని నలరింపుచును బ్రియంబగు సభాజ
నప్రధానహితోక్తి బృందమున నంత. 3

వ. ఇట్లనియె. 4

రామా : అతిశుభార్థ=మిక్కిలి శుభమైన, అర్థసంపత్=ద్రవ్య సమృద్ధికి, పదంబైన=స్థానమైన, వసుధ=భూమిని, మహిమన్+ఏలుచు=గొప్పగా పాలించుచు, వాత్సల్య మధురిమమున=నెనరుచే కూడిన ప్రేమతో, సభాజన=సభలోని జనుల యొక్క, ప్రధాన=సుమంత్రాది మంత్రులయొక్క, హితోక్తిబృందమునన్= ప్రియ వాక్యముచే, అంత=అంతట, అతనిన్=ఆ రాముని, అలరింపుచున్= ఆనందింప జేయుచు – ఇట్లనియెనని తర్వాతి అన్వయము.

తాత్పర్యము : మిక్కిలి శుభప్రదమైన ద్రవ్యసమృద్ధికి స్థానమైన భూమిని గొప్పగా పరిపాలించుచు అధికమైన ప్రేమతో సభలోని జనుల యొక్క, మంత్రుల యొక్క ప్రియవాక్యముచే అంత ఆ రాముని అలరింపజేయుచు –

భారత : అతిశుభ, అర్థసంపత్=భావపుష్టిగల, పదంబై=వాక్యములుగలవాడై, నవ=నూత్నమైన, సుధ=అమృతము యొక్క మహిమను, ఏలుచున్=అతిక్రమించుచు, వాత్సల్య మధురిమమున, అతనిన్=ధర్మజుని, అలరింపుచును, సభాజన=సన్మానమే, ప్రధాన=ప్రధానముగాగల, హితోక్తి బృందముననంత=మంచి మాటలతో అంత.

తాత్పర్యము : అతిశుభప్రదమైన భావపుష్టిగల వాక్యములతో నూతనమైన అమృతధారా మహిమను అతిక్రమించుచు వాత్సల్యభరితమై ధర్మజుని అలరింపుచు సన్మానమే ప్రధానముగా గల హితోక్తులతో – ఇట్లు పలికెనని అన్వయము.

కం. క్రమమున ధరణీభరణ
క్షమ మగుతద్ధర్మనీతి చాతుర్యవిశే

ష మశేష మరసి యధిక
ప్రమదుఁ డయి ప్రసంగవశత రప్పించి తగన్. 5

రామా : క్రమమున, ధరణీభరణ=రాజ్యభారమును, క్షమమగు=మోయగలుగునట్టి, తత్=ఆ రామునియొక్క, ధర్మనీతి=ధర్మముతోకేడిన నీతి, చాతుర్యవిశేషము=చతురతతో కూడిన విశేషమును, అశేషము=అరసి=మిక్కిలిగా తెలిసికొని, అధిక ప్రమదుడయి=మిక్కిలి సంతోషించి, ప్రసంగవశతచేత=మాట్లాడుటకై, తగన్ రప్పించి=తగునట్లు రాముని రప్పించి –

తాత్పర్యము : క్రమముగా రాజ్యభారమును మోయగల (సామర్థ్యముగల) ఆ రాముని ధర్మనీతి చాతుర్యము అధికమని తెలిసికొని మిక్కిలి సంతోషించి మాట్లాడుటకై తగునట్లు రాముని రప్పించి.

భారత : క్రమమున, ధరణీభరణక్షమమగు, తత్+ధర్మనీతి=ఆ ధర్మరాజు యొక్క, నీతిచాతుర్య విశేషమశేషము, అరసి, అధికప్రమదుడయి, తగన్, ప్రసంగ వశతను రప్పించి=ఆ ప్రసంగమును తెప్పించి.

తాత్పర్యము : క్రమముగా రాజ్యభారమును మోయుటకు ఆ ధర్మరాజు యొక్క నీతిచాతుర్యము అమోఘమని తెలిసికొని మిక్కిలి సంతసించి తగునట్లుగా ఆ ప్రసంగమును తెప్పించి.

సీ. బంధురంజనరామభద్ర ధర్మాత్మజ
యైశ్వర్యశోభిత యన్వయైక
పావన పాండురాజీవరమాధుర్య
శోభననయనవసుప్రతాప
నిర్మల ప్రౌఢివినీతత్వ విజ్ఞాన
సౌశీల్య శౌర్యాది సద్గుణములు
విని యుబ్బుచున్న వాఁడనుమోదగరిమఁ ద
త్ప్రేరణఁ జేసి యేఁ దివిరి నిన్నుఁ

తే. బనిచెద సమస్తమహిరాజ్యపాలనము గ
రంబు నుతికెక్కఁజేయుము రాజసూయ
మానచంద్రికాస్ఫూర్తియుఁ బోనికీర్తి
మున్ను గాఁబర్వి కకుబంతములఁ దలిర్ప. 6

రామా : బంధురంజన=బంధువులను సంతోషింపజేయు, రామభద్ర= రామభద్రుని యొక్క, ధర్మాత్మ=ధర్మముతోకూడిన, జయ+ఐశ్వర్యశోభిత=జయము, ఐశ్వర్యముతోగూడిన, అన్వయ+ఏకపావన=వంశమును పావనము జేయు, పాండు రాజీవ=తెల్లదామరలవంటి, రమాధుర్య=లక్ష్మిని ధరించినవై, శోభ=ప్రకాశించు, నయన=కనులుగలవాడా, వసు=అష్టవసువుల, ప్రతాప=ప్రతాపమువంటి ప్రతాపముగలవాడా! నిర్మల పౌఢ్రిని=కళంకము లేని ప్రజ్ఞగలవాడవు, నీ=నీ యొక్క, తత్వ=సిద్ధాంతమైన, విజ్ఞాన=శాస్త్రజ్ఞానమును, సౌశీల్య=సద్వర్తన, శౌర్యాది= పరాక్రమము మొదలుగాగల, సద్గుణములు=మంచి గుణములను, విని, మోదగరిమన్=సంతోషాతిశయముచే, ఉబ్బుచున్నవాడను=నిండినవాడను, తత్+ప్రేరణచేసి=ఆ ప్రేరణతో, ఏన్=నేను (దశరథుడు), తివిరి=పూనుకొని, నిన్ను=శ్రీరాముని, పనిచెదను=నియమించెదను, సమస్త మహిరాజ్యపాలనము, సమస్తమైన భూభారపాలనకు, కరంబు=మిక్కిలి, నుతికెక్కజేయుము= ప్రశంసించ బడునట్లు చేయుము, రాజ=చంద్రునిచే, సూయమాన=సృష్టించబడిన, చంద్రికా స్ఫూర్తియు పోని=వెన్నెలతో సమానమైన, కీర్తి, మున్నుగా=ముందుగా, పర్వి=వ్యాపించి, కకుబంతముల=దిక్కుల అంతములందు, పర్వ=సాగగా -

తాత్పర్యము : బంధువులనలరించు రామభద్రా! ధర్మాత్మా! జయ, ఐశ్వర్యశోభితమైన వంశ పావనా! తెల్లదామరలవలె లక్ష్మిని ధరించినవై శోభనములైన కనులుగలవాడా! అష్టవసువుల ప్రతాపమువంటి ప్రతాపము గలవాడా! నీవు కళంకములేని ప్రజ్ఞగలవాడవు, నీ తత్వశాస్త్రజ్ఞానమును శౌర్యాదిసద్గుణములను విని సంతోషాతిశయముచే నుబ్బుచున్నవాడను. ఆ సంతోష గరిమ ప్రేరణచే నేను నియోగిస్తున్నాను. చంద్రునిచే సృజింపబడు వెన్నెలల ధావళ్యముగలిగిన నీ కీర్తి

దిగంతములయందు వ్యాపించునట్లు ఈ సమస్త రాజ్యపరిపాలన ప్రస్తుతించు విధముగా చేయుము.

భారత : బంధురంజన=బంధువుల సంతోషముచే, రామ=ఒప్పెడి, భద్ర=శుభములుగలవాడా! ధర్మాత్మజ=యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజు యొక్క, ఐశ్వర్యశోభిత=సంపదచే శోభించు, అన్వయైకపావన=వంశమునంతటిని పావనము చేయు, పాండురాజు=పాండురాజు, ఈ=నీ యొక్క, వరమాధుర్య=అధిక మధురిమచే, శోభననయ=శుభావహమైన, నవసంప్రతాప=కొత్తదైన మంచి ప్రతాపము, నిర్మల ప్రౌఢి=స్వచ్ఛమైన ప్రౌఢితో, వినీతత్వ=చక్కని మార్గము, విజ్ఞాన, సౌశీల్య, శౌర్యాది సద్గుణములు=జ్ఞానము, సుశీలత్వము, పరాక్రమము మొదలైన మంచి గుణములు, విని, ఉబ్బుచున్నావాడ, అనుమోదగరిమచేత=అనుమోదించు గొప్పదనముచే, తత్=ఆ పాండురాజు యొక్క, ప్రేరణచేసి=పనుపుటచే, ఏను=నేను, తివిరి=అధికముగా, నిన్ను+పనిచెద=నిన్ను నియోగించెదను, సమస్తరాజ్యపాలనము, కరంబు నుతికెక్కజేయుము, రాజసూయము=రాజసూయయాగమును, ఆన=ఆజ్ఞగా, చంద్రికాస్ఫూర్తియు, మున్నుగా బర్విపోని కీర్తి కకుబంతముల, తలిర్ప.

తాత్పర్యము : బంధుజనమును సంతోషపరచుటచే నొప్పు శుభములుగలవాడా! ధర్మజుని సంపదచే శోభించు వంశమును పావనము చేయు పాండురాజు ఈ అధిక మాధుర్యముచే శుభావహమైన నూత్న ప్రతాపము యొక్క స్వచ్ఛమైన ప్రౌఢితో చక్కని మార్గము, విజ్ఞాన సౌశీల శౌర్యాది గుణములు విని ఉబ్బుచున్నవాడను. అనుమోదించు గొప్పదనముచే ఆ పాండురాజు ప్రేరణచే నేను అధికముగా నిన్ను నియోగించెదను. సమస్త రాజ్యపాలనము మిక్కిలి ప్రస్తుతింపగా జేయుము. రాజసూయ యాగమును చంద్రికాస్ఫూర్తి ముందుగా ప్రకాశింపగా, దిగంతములయందు కీర్తి వ్యాపించునట్లు చేయుము.

కం. అనుటయు ముకుళితకరుఁ డై
 యనఘా మది నవధరింపు మంతటి శక్తుం

డనె యే నొండొకపని నా
కనుగ్రహింపు మన మఱియు నతఁ డి ట్లనియెన్. 7

రామా భారతములకు సమానము.

అర్థము : అనుటయు, ముకుళితకరుడై=చేతులు జోడించి, అనఘా!=ఓ శ్రేష్ఠా, మదిన్=మనస్సులో, అవధరింపుము=భావింపుము, అంతటి శక్తుండనె=అంత సమర్థుడనా! ఏను=రాముడు/ధర్మజుడు, బండొకపని=మరొక పనిని, నాకు+అనుగ్రహింపుమన=నాకు సెలవిండనగా, అతడిట్లనియెన్.

తాత్పర్యము : అట్లు మాట్లాడగా రాముడు/ధర్మజుడు చేతులు జోడించి, ఓ శ్రేష్ఠా! మనస్సులో భావింపుడు. నేను అంతటి శక్తిగలవాడనా? వేఱొకపనిని అప్పగించుడు – అనగా అతడిట్లనియెను.

చ. జనకునియాజ్ఞ యన్న నవిచార్యము మున్నిది యెన్నిచూడుమా
యన–యము సన్నిధిన్ నిను సమర్థతరుం డని నిశ్చయించి పం
చినపని దీని నీవు దగఁ జేయ సదాత్తసుధర్మతన్ సుఖం
బున హరికొల్వొనర్తునని పూనినవాఁ డనయంబు బుద్ధిలోన్. 8

రామా : జనకునియాజ్ఞ=తండ్రి ఆనతి, అన్న=అనినచో, అవిచార్యము=ఆలోచించనవసరము లేనిది, మున్ను=ముందు, ఇది ఎంచి చూడుమా=దీనిని భావించి చూడుము, అనయము=ఎల్లప్పుడు, సన్నిధిన్=సత్పురుషులకు నిధివైన, నిన్ను=రాముని, సమర్థతరుండని=మిక్కిలి శక్తిమంతుడని, నిశ్చయించి=నిర్ణయించి, పంచిన పని=చెప్పినపని, దీని=దీనిని, నీవు తగు+చేయ=నీవు తగినట్లు చేయుటకు, సదా=ఎల్లప్పుడు, ఆత్త=స్వీకరింపబడిన, సుధర్మతన్=లెస్సయగు ధర్మముగలవాడనై, సుఖంబున, హరికొల్వున్=శ్రీహరి సేవను, ఒనర్తునని=చేయుదునని, బుద్ధిలోనే=మనస్సులో, అనయంబు=మిక్కిలి, పూనినవాడు=నిశ్చయించుకొన్నవాడై.

తాత్పర్యము : తండ్రి యానతి యనినచో అవిచార్యముగాన ముందు దీనిని భావించి చూడుము. ఎల్లప్పుడు సత్పురుషులకు నిధివైన నిన్ను (రాముని) సమర్థుడవని

నిశ్చయించి చెప్పిన పని ఇది. దీనిని నీవు తగినట్లు చేయుటకు సదా స్వీకరింపబడిన మంచి ధర్మము గలవాడనై సుఖంబున శ్రీహరి సేవను చేయుదునని మనస్సులో స్థిరముగా నిర్ణయించుకొన్నవాడై.

భారత : జనకుని ఆజ్ఞ అన్న, అవిచార్యము, మున్నిది, ఎంచి చూడుమాయన, యముసన్నిధిన్=యముని సముఖమునందు, నిను సమర్థతరుండని నిశ్చయించి, పంచినపని, దీనిన్=యాగమును, నీవు తగచేయన్=నీవు తగినట్లు చేసినచో, సదా=ఎల్లప్పుడును, ఆత్త=పొందబడిన, సుధర్మతన్=దేవసభగలవాడవై, సుఖంబున, హరికొల్వు, ఒనర్తునని, అనయంబు బుద్ధిలోనే పూనినవాడు.

తాత్పర్యము : జనకుని ఆనతి అనినచో విచారింపనవసరములేనిది – ఇది ముందుగా ఆలోచించు చూడుమనగా, యముని సముఖమున నిన్ను సమర్థవంతుడవని నిశ్చయించి ఏర్పరచితిని. ఈ యాగమును నీవు తగినట్లు చేసినచో ఎల్లప్పుడు పొందబడిన దేవసభ గలవాడవై సుఖముగా హరికొలువు చేయుదునని మిక్కిలిగా బుద్ధిలోపూనిన వాడాయెను.

కం. జను లందఱు నీయం ద
త్యనురాగముకలిమి నెరపెదరు సత్త్వమహ
త్వనిరూఢిఁ బొల్పెసఁగునీ
యనుజులు భవదీయశాసనైకాయత్తుల్. 9

వ. కావున నమ్మహాకార్యంబు నిర్వహింప. 10

రామా : జనులందరు, నీయందు, అత్యనురాగము కలిమి=మిక్కిలి ప్రేమగలిగినవారై, నెరపెదరు=నడిచెదరు, సత్త్వమహత్వనిరూఢిన్=సాత్వికభావముతో నిండినవారై, పొల్పు+ఎసగు=శక్తివంతులైన, నీ అనుజులు=లక్ష్మణాదులు/భీమాదులు, భవదీయ=నీ యొక్క, శాసనైక+ఆయత్తుల్=శాసనమునే పాటించు స్వభావము గలవారు.

తాత్పర్యము : జనులందరు నీయందు మిక్కిలి అనురాగము కలిగి ప్రవర్తించెదరు. సాత్విక భావసంపన్నులు, శక్తివంతులైన నీ అనుజులు నీ యొక్క శాసనమునే పాటించు స్వభావముగలవారు.

భారత, రామాయణములకు సమానార్థకము.

వ. కావున, ఈ+మహాకార్యంబు=ఈ గొప్పపనిని, నిర్వహింప=చేయుటకు.

ఆ. అనఘ నీవె తగుదు వనివారితనయాద
రౌచితిఁ గడు నొప్ప నాయతిశుభ
గుణవశుఁ డనిపించుకొని నిజేచ్ఛఁ జనని
యత్యుదారుఁ డఖిలకృత్యవిదుఁడు. 11

రామా : దశరథుడు రామునికి నీతి నుపదేశించుక్రమము.

అనఘా=ఓ రామా! అనివారిత=నివారించుటకు శక్యముకాని, నయ=నీతి యొక్క, ఆదర=అమితమైన, ఔచితిన్=ఔచిత్యముతో, కదున్+ఒప్ప=మిక్కిలి యొప్పగా, నీవెతగుదువు, ఆయతి=ఉత్తరకాలఫలముచే, శుభ=శుభములైన, గుణ=నిత్యత్వాది గుణములకు, వశుండనిపించుకొని=లొంగినవాడనిపించుకొని, నిజ+ఇచ్ఛన్=తన ఇష్టముతో, చనని=నడవనటువంటి, అతి+ఉదారుడు=మిక్కిలి సమర్థుడయినవాడు, అఖిలకృత్యవిదుడు=సర్వకార్యములు తెలిసినవాడు.

తాత్పర్యము : ఓ రామా! నివారించుటకు శక్యముగాని నీతి యొక్క అధిక ఔచిత్యముతో మిక్కిలి యొప్పగా నీవే తగుదువు. రాబోవు కాలముల ఫలముచే శుభములైన గుణములకు వశుడనిపించుకొని తన ఇష్టముతో నడవని సమర్థుడే సర్వకార్యములు ఎరిగినవాడు. (నీవు గుణవంతుడవుగా సకల కార్యములు ఎరుగుదువని భావము)

భారత : అనఘు=ఓ ధర్మజా! నీవు తగుదువని=తగుదువని చెప్పి, వారి=పాండవుల యొక్క, తన=తన యొక్క, ఆదరౌచితిన్+కదునొప్పగా, శుభగుణ=

సద్గుణవంతులకు, వశుడు=విధేయుడు, ఆయతి=ఆ నారదుడు, అనిపించుకొని, నిజేచ్ఛ=తన ఇష్టమైన దారిలో, చనన్=వెళ్లగా, నియతిన్= నియమముచే, ఉదారుడు, అఖిలకృత్యవిదుడు – ముందరి కన్వయం.

తాత్పర్యము : ఓ ధర్మజా! నీవే తగుదువని చెప్పి, పాండవులయొక్క, తన యొక్క ఆదరముతో నొప్పు సద్గుణవంతులకు విధేయుడని నారదుడనిపించుకొని తన ఇష్ట ప్రకారము వెళ్లగా నియమముచే ఉదారుడు, అన్ని పనులు తెలిసిన – (ఆ రాజు)

ఆ. ఆయవనివరేణ్యుఁ డాయాగమవ్యయా
గమసముచితధర్మగతి నడపుట
కై జయింపవలయు నాశల నన్నింటి
నని కృతిజనగోష్ఠి నాకళించి. 12

రామా : ఆ+అవనివరేణ్యుడు=ఆ రాజు, ఆయాగమ=ఆదాయప్రాప్తికిని, వ్యయాగమ=వ్యయప్రాప్తికిని, సముచిత=తగిన, ధర్మగతిన్=ధర్మవర్తనము, నడపుటకై=ఆశలనన్నింటిని జయింపవలయు, అనికృతి=శఠత్వములేని (కపటములేని), జనగోష్ఠిన్=జనులతో సాంగత్యమువలన, ఆకళించి=తెలిసి.

తాత్పర్యము : ఆ రాజు ఆదాయవ్యయ ప్రాప్తికి తగిన ధర్మవర్తనము నడపుటకై ఆశలనన్నింటిని జయింపవలయును. కపటములేని జనులతో సాంగత్యము వలననని తెలిసి.

భారత : ఆ అవనివరేణ్యుడు=ధర్మరాజు, అవ్యయ=నాశములేని, ఆగమ సముచిత=వేదోచితమైన, ధర్మగతిన్=ధర్మవర్తనముచే, ఆ యాగమును=ఆ రాజసూయమును, నడుపుటకై=చేయుటకు, ఆశలన్=దిక్కులను, అన్నింటిని, జయింపవలయునని, కృతిజనగోష్ఠిన్=విద్వజ్జనులతో ప్రసంగములచే, ఆకళించి= తెలిసి.

తాత్పర్యము : ఆ ధర్మరాజు నాశములేని వేదోచితధర్మవర్తనముచే ఆ రాజసూయమును చేయుటకు దిక్కులనన్నింటిని జయింపవలయునని విద్వజ్జనులతోడి ప్రసంగములచే తెలిసికొని –

(ఈ పద్యము నుండి తర్వాత రెండు పద్యముల వరకు కుళకము)

తే. సత్త్వ ధర్మకళా విరాజత్ప్రతాప
ఘనుఁడు రాజులలోనఁ బెద్ద యనఁగఁ జనుఁ బ్ర
కృష్టతనుజరాసంధుండు కేవలముని
జేష్టకర్మాక్షముం డని యెన్ను మదిని. 13

రామా : సత్త్వ=బలముచేతను, ధర్మకళా=ధర్మశాస్త్రముచేతను, విరాజత్=ప్రకాశించు, ప్రతాపఘనుడు=ప్రతాపముచే అధికుడు, రాజులలో, పెద్దయనగన్=గొప్పవాడనుటకు, చనున్=తగును, ప్రకృష్ట=అధికమైన, తను=శరీరము యొక్క, జరా=ముదిమి యొక్క, సంధుండు=సంధానముగలవాడైనను, (ముసలి వాడైనను), కేవలము, నిజ=తన యొక్క, ఇష్టకర్మ=ఇష్టమైన ప్రయోజనమందు, అక్షముండు=అసమర్థుడు, అని, మదిని, ఎన్ను=అని మనసులో భావింపుము.

తాత్పర్యము : బలముచేతను, ధర్మశాస్త్రముచేతను ప్రకాశించు ప్రతాపముచే అధికుడైనవాడు రాజులలో గొప్పవాడనుటకు తగును. అధికమైన శరీరవార్ధ్యక సంధానముగలవాడైనను, కేవలము తనయొక్క ఇష్టమైన ప్రయోజనమందు అసమర్థుడని మనస్సులో భావింపుము.

భారత : సత్త్వ, ధర్మకళా=ధనుర్విద్యచేతను, విరాజత్, ప్రతాపఘనుడు, రాజులలో పెద్దయనగ జను, ప్రకృష్టతన్=ఆధిక్యమున, జరాసంధుండు=జరాసంధుడు, కేవలము, నిజేష్ట=తన యాగకర్మమందు, అక్షముండు=ఓర్పులేనివాడు – అని, ఎన్నుమదిని=ఎంచెడి మనస్సుచే –

తాత్పర్యము : బలిమిచేతను, ధనుర్విద్యచేతను ప్రకాశించు ప్రతాపఘనుడు రాజులలో పెద్దయనగా చెల్లును. ఆధిక్యమున జరాసంధుడు కేవలము తన

యాగకర్మమునందు ఓర్పు లేనివాడని ఎంచెడి మనస్సుచే.

తే. విహితసన్మంత్రుఁ డగుచు వివేకఘనుఁడు
విహతి లేకొప్పునచ్యుత విజయసంయు
తప్రహితభీమసేనోద్ధతిప్రవృద్ధి
చేత రిపు నేలఁగల పెనుసిరులు గొనుచు. 14

రామా : విహిత=మంచివారితో, సత్+మంత్రుడగుచున్=ఆలోచించినవాడై, వివేకఘనుడు=వివేకములో ఘనుడైనవాడు, విహతిలేక=నాశములేక, ఒప్పు, అచ్యుత=జారని, విజయ=విజయముతో, సంయుత=కూడిన, ప్రహిత=అత్యంత విహితమైన, భీమ=భయంకరమైన, సేన=సేనయొక్క, ఉద్ధతి=ఔద్ధత్యముచే, ప్రవృద్ధిచేత=ఆధిక్యముచే, రిపునేలగలిగిన=శత్రువు యొక్క భూమియందు కలిగిన, పెనుసిరులు=అధిక సంపదలు, కొనుచు=స్వీకరించి.

తాత్పర్యము : మంచివారితో నాలోచించినవాడై వివేకములో ఘనుడైనవాడు, నాశము లేక ఒప్పుచు, జారని విజయముతో కూడిన అత్యంత విహితమైన భయంకర సేనల ఉద్ధతి యొక్క ఆధిక్యముచే శత్రువు యొక్క భూమియందుగల అధిక సంపదలను స్వీకరించి.

భారత : విహిత=చేయబడిన, సన్మంత్రుడగుచున్, వివేకఘనుడు=ధర్మరాజు, విహతిలేకొప్పు, అచ్యుతవిజయసంయుత=కృష్ణార్జునులతోగూడిన, ప్రహిత=పంపబడిన, భీమసేన=భీమసేనుని యొక్క, ఉద్ధతి=ప్రహారముల యొక్క, ప్రవృద్ధిచేత=ఆధిక్యముచే, రిపున్=శత్రువైన, (జరాసంధుని) సిరులుగొనుచు నేలగలపెను=సంహరించెను, –

తాత్పర్యము : మంచి ఆలోచనలు చేసిన ధర్మజుడు నాశములేని కృష్ణార్జునులతో గూడి పంపబడిన భీమసేనుని యొక్క ప్రహారముల ఆధిక్యముచే జరాసంధుని సంహరించి, సిరులుగొనుచు –

మ. స్వనిదేశోన్నతి నంతటన్ నెఱయుచున్ శక్తిం జతుర్దిఙ్నరేం
ద్రనికాయంబును గెల్చి తమ్ముల సమానప్రాప్తవిత్తార్పణం
బునఁ దన్ప న్వశు లైన బ్రాహ్మణులతోఁ బూర్ణాధ్వరారంభుఁడై
యనఘశ్రీఁ బృథివీశుఁ డొప్పెసఁగురూఢాపూర్వ సత్కీర్తితోన్. 15

రామా : స్వనిదేశోన్నతిన్=తన ఆజ్ఞామహిమచే, అంతటన్=అన్ని చోట్ల, నెఱయుచున్=ప్రకాశించుచు, శక్తిన్=తనశక్తిచే చతుర్+దిక్+నరేంద్ర నికాయంబును= నాలుగు దిక్కులందుగల రాజసముదాయమును, గెల్చి, తమ్ము=తమను, లసమాన=ఒప్పునట్లుగా, ప్రాప్త=లభించిన, విత్తార్పణంబునన్= ధనమును దానము చేయుటచే, తన్పన్=తృప్తిపరచగా, వశులైన=విధేయులైన, బ్రాహ్మణులతో, పూర్ణ+అధ్వర+ఆరంభుడై=పూర్తిగా యాగమును ప్రారంభించి, రూఢాపూర్వ సత్కీర్తితోన్=ప్రసిద్ధమైన వింత సత్కీర్తితో, అనఘశ్రీ=గొప్ప ఐశ్వర్యముతో, పృధివీశుడు=రాజు, ఒప్పెసఁగు=ఖ్యాతి గాంచెను.

తాత్పర్యము : తన ఆజ్ఞా మహిమచే అన్ని చోట్ల ప్రకాశించుచు తన శక్తిచే నాలుగు దిక్కులందుగల రాజసముదాయములను జయించి, తమకు ఒప్పునట్లుగా లభించిన ధనమును దానము చేయుటచే తృప్తిపరచగా విధేయులైన బ్రాహ్మణులతో పూర్తిగా యాగమును ప్రారంభించి ప్రసిద్ధమైన వింత కీర్తితో గొప్ప ఐశ్వర్యము పొంది రాజు ఒప్పెను.

భారత : స్వనిదేశోన్నతిన్, అంతటన్, నెఱయుచున్, శక్తిన్, చతుర్దిక్ నరేంద్ర నికాయంబును గెల్చి, తమ్ములు=భీమాదులు, అసమాన=సమానములేని రీతిగా, ప్రాప్తవిత్తార్పణంబునతన్పన్, వశులైన, బ్రాహ్మణులతో, పూర్ణ=ఈడేరిన, అధ్వర=యాగముయొక్క, ఆరంభుడై=ఆరంభముగలవాడై, సగురు=తండ్రితో గూడినట్లుగా, ఊఢ=వహింపబడిన, అపూర్వ=గొప్పదైన, సత్కీర్తితోన్=గొప్పకీర్తితో, పృధివీశుడు=ధర్మరాజు, ఒప్పెన్.

తాత్పర్యము : తన ఆదేశానుసారము అంతట నడవగా తన శక్తిచే నాలుగు

దిక్కులగలరాడు సముదాయమును గెల్చి, భీమాదులు అసమానరీతిలో తమకు లభించిన ధనమును దానము చేయగా వశులైన బ్రాహ్మణులతో నీడేరిన యాగము నారంభించినవాడై తండ్రితో గూడినట్లు గొప్ప సత్కీర్తితో ధర్మరాజు ప్రకాశించెను.

ఉ. క్లిష్టత యించుకంతయును లేక మనఃప్రమదంబుతోడ నా
యిష్టము నిర్వహించి పృథివీశులలోపల నర్హ భీష్మసం
సిష్టి మెయిం గరం బొనరిచెందు దనుత్తమపూజ చక్రి కు
త్కృష్టత నుర్విలోకసమతేజుఁడవీవని పల్కి నెమ్మితోన్. 16

రామా : క్లిష్టత=క్లేశము, ఇంచుకంతయునులేక=ఏమాత్రములేక, మనః ప్రమదంబుతోడ=మనస్సుకు సంతోషముతో, నా యిష్టము=నా కోరికను, నిర్వహించి=జరిపి, పృథివీశుల లోపల=రాజులలో, అర్హ=తగిన, భీష్మ=భయంకరమైన, సంసిష్టిమెయిన్=సమ్యక్ ఆజ్ఞచే, కరంబొనరి=మిక్కిలి కలిగి, అనుత్తమపూజ= అత్యుత్తమపూజను, చెందుదు=పొందుచున్నాడవు, చక్రికిన్=విష్ణువునకు, ఉత్కృష్టతన్=శ్రేష్ఠత్వములో, ఉర్విలో=భూమిలో, సమతేజుడవు=సమానమైన తేజస్సుగలవాడవు, ఈవని=నీవు అని, నెమ్మితోన్=ప్రీతితో, పల్కి.

తాత్పర్యము : క్లేశము ఏమాత్రములేక మనస్సుకు సంతోషముతో నాకోరికను నిర్వహించి రాజులలో తగిన భయంకరమైన గొప్ప ఆజ్ఞచే అత్యుత్తమపూజను పొందుచున్నాడవు. విష్ణువునకు శ్రేష్ఠత్వముతో భూమిలో సమానమైన తేజస్సుగలవాడవు, నీవని ప్రీతితో పల్కి.

భారత : క్లిష్టత, ఇంచుకంతయును లేక, మనః ప్రమదంబుతోడన్, ఆయిష్టము=ఆ యాగమును, నిర్వహించి, పృథివీశులలోపల, అర్హ=అర్హుడైన, భీష్మ=భీష్మునియొక్క, సంసిష్టిమెయిన్=ఆజ్ఞచే, తుదన్=యజ్ఞసమాప్తిలో, చక్రికి=కృష్ణునకు, ఉత్కృష్టత, ఉర్విలో అసమతేజుడవీవని, పల్కి, నెమ్మితోన్ ఉత్తమపూజ, కరంబొనరిచె=ఉత్తమ పూజను మిక్కిలి చేసెను.

తాత్పర్యము : క్లిష్టత ఏమాత్రము లేక మనఃపూర్వకసంతోషముతో ఆ

యాగమును నిర్వహించి రాజులలో అర్హుడైన భీష్ముని యొక్క ఆజ్ఞచే యజ్ఞసమాప్తిలో గొప్పగా భూమిలో అసమానమైన తేజస్సు గలవాడవు నీవని పల్కి ఆదరముతో ఉత్తమ పూజను కృష్ణునకు మిక్కిలిగా చేసెను.

తే. మఱియుఁ దగుమాటలాడి యమర్త్యకార్య
నియత లీలావతారు నన్నీలవర్ణు
స్నేహరసమున నభిషిక్తుఁ జేయ నతఁడు
లలి నడపె నప్డు తచ్ఛుభలగ్న చింత. 17

రామా : మఱియు, తగుమాటలాడి=ఉచితముగా మాట్లాడి, అమర్త్య=దేవతల, కార్యనియత=కార్యములను చేయుటయందు, లగ్నమైన, లీలావతారు=లీలారూపమున అవతారములు దాల్చు, ఆ+నీలవర్ణున్=ఆ రామచంద్రుని, స్నేహరసమున= స్నేహభావముతో, అభిషిక్తుజేయన్=పట్టాభిషిక్తుని చేయుటకు, తత్+శుభలగ్నచింత=ఆ శుభలగ్నమును గూర్చిన ఆలోచనను, అప్డు=అప్పుడు, లలినడపె=అందముగా నడపెను.

తాత్పర్యము : మరియు ఉచితముగా మాట్లాడి దేవతల కార్యములను చేయుటకు లీలావతారములను ధరించు ఆ రామచంద్రునికి స్నేహభావముతో పట్టాభిషిక్తుని చేయుటకై ఆ శుభలగ్నమును గూర్చిన ఆలోచనను అప్పుడు నడపెను.

భారత : మరియు, తగుమాటలాడి, అమర్త్యకార్యనియత లీలావతారు, ఆ+నీలవర్ణున్=శ్రీకృష్ణుని, స్నేహరసమున=స్నేహరసముతో, అభిషిక్తుచేయన్= వర్షింపగా, అతడు=కృష్ణుడు, తత్+ఆ ధర్మరాజు యొక్క శుభ=శుభమునందు, లగ్నచింత=లగ్నమైన చింతను, అప్డు=అప్పుడు, లలినడపె.

తాత్పర్యము : మరియు సరియైన మాటలాడి దేవకార్యము కొరకు లీలావతారమును ధరించు శ్రీకృష్ణుని స్నేహరసముతో అభిషేకింపజేయగా కృష్ణుడు ఆ ధర్మరాజు యొక్క శుభమందు లగ్నమైన చింతను అప్పుడు నడపెను.

చం. సువిభవభూతిఁ బేర్చుహరి సొం పవుఁగా దనుశ్రీమదాత్మవై
భవము వెలార్చుచుం బ్రబలభవ్యతదీయసుదర్శనంబుచే
దివిభువినున్న సభ్యవితతిం బరికల్పితసాధులోచనో
త్సవవిధి యైనితాంతముదితత్వముఁ జెందఁగఁజేసె నంతటన్. 18

రామా : సువిభవభూతి=మంచి వైభవకాంతితో, పేర్చుహరి=అతిశయించు ఇంద్రుని, సొంపు=అందమును, ఔగాదను=మించిన, శ్రీమత్=సమృద్ధి కలిగిన, ఆత్మవైభవము=తన విభవమును, వెలార్చుచున్=ప్రకటించుచు, ప్రబల=అధికమైన, భవ్య=శుభముగల, తదీయ=ఆ వైభవ సంబంధముగల, సుదర్శనంబుచేన్=మంచి దర్శనముతో, దివిభువినున్న=ఆకాశమున భూమిపై నున్న, సభ్యవితతిన్=దేవతలు, బ్రాహ్మణుల సముదాయమును, పరికల్పిత=కల్పించబడిన, సాధు=లెస్స అయిన, లోచనోత్సవ విధియై=కనులకు ఆనందమును కలిగించునదై, నితాంతముది తత్వమున్=మిక్కిలి సంతోషమును, అంతటన్=అన్ని చోట్లను, చెందగజేసె=అందునట్లు చేసెను.

తాత్పర్యము : మిక్కిలి వైభవము కలిగిన ఇంద్రుని సొంపును మించిన సంపదగల తన వైభవమును ప్రకటించుచు, ప్రబలమైన శుభముగల ఆ వైభవసంబంధ సుదర్శనముచే ఆకాశముననున్న దేవతలను, భూమిపైనున్న బ్రాహ్మణ సముదాయమునకు కల్పించబడిన లెస్సయైన కనుల కానందమును కలిగించి మిక్కిలి సంతుష్టత్వమును (ఆ దశరథుడు కలుగజేసెను).

భారత : సువిభవ విభూతిన్=పేర్చు, హరి=కృష్ణునియొక్క, సొంపు= ఆధిక్యమును, ఔగాదను=నిందించెడి, శ్రీమద=సంపద గర్వముతో కూడిన ఆత్మ=తన యొక్క వైభవము, వెలార్చుచున్, ప్రబల=వ్యాపింపగా, భవ్య=దివ్యమైన, తదీయ సుదర్శనంబు=శ్రీకృష్ణుని సంబంధమైన చక్రము, ఛేదివిభున్=శిశుపాలుని, వినున్నసభ్యవితతిన్=తిరస్కరింపబడిన సాధుజన సమూహముగల వానిని, పరికల్పితమైన=కల్పించబడిన, సాధు=సజ్జనుల యొక్క, లోచనోత్సవవిధియై=కనులకు

ఆనందము కల్గించునదియై (సుదర్శనము) నితాంతము=మిక్కిలి, దితత్వమున్= ఖండితత్వమును, అంతటన్=అప్పుడే, చెందగజేసెన్=సంహరించెను.

తాత్పర్యము : అధికవైభవముతో తనర్చు కృష్ణుని సొంపును నిందించెడి సంపద గర్వముతో కూడిన తన వైభవము ప్రబలగా శ్రీకృష్ణుని చక్రము – తిరస్కరింపబడిన సాధుజనసమూహముగల శిశుపాలుని, సజ్జనుల కన్నులకు మిక్కిలి ఆనందము కలిగించునట్లు సంహరించెను.

సీ. ఘనధర్మసుతరాజ్య ఘటనయాశల నట్లు
 దనరుచునికి గనుఁ గొని యసహ్య
మానతద్వైభవ మందరోన్మథితహృ
 ద్విషధివిషాయిత ద్వేషభరత
జననిగర్వాచారమున కోడ కెట్లొ యే
 మంత్రొ బంధువు లన్వయాదిగుణగు
రుతమాయనాడుదు రోదరం బిట్టిచో
 నూహింప నౌచిత్యయుక్త మనక

తే. తద్విధిని హరియించె నత్యంతదుష్ట
మతిని దుర్యోధనుఁడు సపత్ని తనయుండ
జాతశాత్రవరాజ్యవిభూతి మీఱు
టుల్లమున నించుకంతయు నోర్వలేక 19

రామా : ఘనధర్మ=అధిక ధర్మముగల, సుత=రాముని యొక్క, రాజ్యఘటన= రాజ్యఘటనము నందుగల, ఆశలన్=అపేక్షలచేత, అట్లు=ఆ విధముగా, తనరుచు ఉనికి=కూడిన దశరథుని ఉనికిని, కనుగొని=చూచి, అసహ్యమాన=సహింపలేని, తత్+వైభవ=రాముని వైభవముగల, మందర=మందరచే, ఉన్మథిత=మథింపబడిన, హృత్+విషధి=హృదయమనెడు సముద్రమునకు, విషాయిత=కాలకూట విషమువలె పుట్టిన, ద్వేష=ద్వేషము కలిగిన, భరతజనని=కైకేయి, గర్వాచారమునకు ఓడక=

నిందించెదరనుటకు భయపడక, ఎట్లొ=ఏ విధముగ, బంధువులు, అన్వయాదిగుణ= వంశమునకు సంబంధించి, గురుత=గురుత్వమును, మాయనాడుదురో=నిందించెదరో, దరంబు=భయము, ఇట్టిచోనూహింప=ఈ సందర్భములో ఆలోచింపగా, ఔచిత్యయుక్తము=ఉచితము, అనక=అని విచారింపక, తద్విధిన్=ఆ పట్టాభిషేక కార్యక్రమమును, హరియించెన్=మాన్పించెను, అత్యంత=మిక్కిలి, దుష్టమతిని= దుష్టబుద్ధిచే, దుర్యోధనుడు=పోట్లాడుటకు శక్యముకానివాడు, సపత్ని=కౌసల్య, తనయుండు=కుమారుడైన రాముడు, అజాతశాత్రవ=నిష్కంటకమైన, రాజ్యవిభూతిన్=రాజ్యముయొక్క ఐశ్వర్యముచే, మీఱుట=అతిశయించుట, ఉల్లమున=మనస్సున, ఇంచుకంతయు=కొద్దిగా, ఓర్వలేక=ఓర్చుకొనలేక.

తాత్పర్యము : అధికధర్మములుగల రాముని రాజ్యాభిషేకమునందుగల ఆశలచే ఆ విధముగానున్న దశరథుని ఉనికిని చూచి సహింపలేని (రాముని వైభవమును) మందరచే మథింపబడిన హృదయసముద్రమునకు కాలకూట విషమువలె జనించిన ద్వేషముగల కైకేయి, ఇతరుల నిందలకు భయపడక, బంధువులేవిధముగా వంశమునకు సంబంధించిన గురుత్వమును నిందించెదరోయను భయము ఈ సందర్భములో ఆలోచింపగా ఉచితమని విచారింపక ఆ పట్టాభిషేక కార్యక్రమమును మిక్కిలి దుష్టబుద్ధిచే సవతి కుమారుడైన రాముడు నిష్కంటకమైన రాజ్యవైభవము అతిశయించుట మనస్సున కొద్దిగా ఓర్చుకొనలేక మాన్పించెను.

భారత : ఘన=గొప్ప, ధర్మసుత=ధర్మరాజు యొక్క, రాజ్యఘటన=రాజ్యపాలన, ఆశలన్=దిక్కులందు, అట్లు, తనరుచు, ఉనికి, కనుగొని, అసహ్యమాన, తద్వైభవ, మందర=మందర పర్వతముచే, ఉన్మథితహృధి విషాయిత ద్వేషభరతన్= ద్వేషాతిశయముగలవాడగుటచే, జన=లోకులచే, నిగర్హ్యాచారమునకు=నిందింపదగిన ఆచారమునకు, ఓడక=భయపడక, ఎట్లొ, ఏమంద్రొ, బంధువులు, అన్వయాదిగుణ, గురుత=గురుత్వమును, మాయనాడు=మాయచే వాడెడి, దురోదరంబు=జూదము, ఇట్టిచోనూహింప, ఔచిత=ఔచిత్యముతో, అయుక్తము=రహితము (అనుచితము) అనక, తత్+విధిని=ఆ మాయాజూదముచే, దుర్యోధనుడు అత్యంతదుష్టమతిని=మిక్కిలి

దుస్స్వభావముతో, సపత్నిత=శత్రువుగా చేయబడిన, నయుండు=నీతిగలవాడు, అజాతశాత్రవ=ధర్మరాజు యొక్క రాజ్యవిభూతిమేరుట, ఉల్లమున, ఇంచుకంతయు, ఓర్వలేక, హరియించె=హరించెను.

తాత్పర్యము : గొప్పవాడగు ధర్మజుని రాజ్యపాలన దిక్కులందు ఆ విధముగా ప్రకాశించుటను చూచి, సహింపరాని ఆ వైభవముచే మందర పర్వతముచే మధింపబడిన కాలకూటవిషమువంటి విషమువలె ద్వేషాతిశయముగలవాడగుటచే, లోకులచే నిందింపదగిన ఆచారమునకు భయపడక, ఏవిధముగా బంధువులు, వంశములోని వారు ఏమందురోయని భావింపక, గురుత్వమున మాయచేనాడెడి జూదమును ఇట్టిచో ఊహించుట ఔచిత్యరహితమనక ఆ మాయాజూదముచే దుర్యోధనుడు అత్యంత దుష్టస్వభాముతో శత్రునీతిగలవాడై ధర్మజుని రాజ్యవిభూతిని మనస్సులో కొంచెముగూడ ఓర్వలేక హరించెను.

సీ. అవ్వేళ భవితవ్యతానుసారితఁ బ్రియ
కైతవదాసీకృతాతిమన్యు
గిళితప్రమోద యై కృష్ణసారప్రేక్ష
ప్రబలోగ్రతను స్వకపటము దోఁప
మలయుదుశ్శాసన మత్సరంబునశంకి
తత్వంబునొంది సత్వరిత యగుచు
స్వపురస్థితిఁ దనర్చు చక్రి లీలామర్త్య
మూర్తినుద్దేశించి ముదిత వలికెఁ

తే. దా మునుపుగన్న యాత్మనాథవరశక్తి
గడు పరాజిత యై యప్డు గానుపింప
ధర్మపాశసంయుతనిరుత్తరనిజాధి
పతిసదైన్యేక్షితాననపద్మ యగుచు. 20

రామా : ఆ+వేళ=ఆ సమయమున, భవితవ్యత+అనుసారిత=భవిష్యత్తులో జరుగవలసిన దానికనుగుణముగా, ప్రియ=ప్రియమైన, కైతవ=కపటముగల, దాసీ=మందరచే, కృత=చేయబడిన, అతిమన్యు=మిక్కిలి కోపముచే, గళితప్రమోదయై=కలిగిన ఆనందముతో, కృష్ణసారప్రేక్ష=హరిణముల కనులవంటి కనులుగల కైక, ప్రబల+ఉగ్రతను=మిక్కిలి కోపముతో, స్వకపటము=తనకపటము, తోప=కనిపించగా, మలయు=కలిగిన, దుశ్శాసన=అణచశక్యముగాని, మత్సరంబున=మాత్సర్యముచే, అంకితత్వంబు నొంది=కూడినదై, సత్వరితయగుచు=తొందరపాటుతో, స్వపురస్థితిన్=తన ముందట, చక్రి=విష్ణువు యొక్క లీలామర్త్యమూర్తిన్=లీలావరతారుడైన రాముని, ఉద్దేశించి, ముదిత+పలికె=కైక పలికెను, తా మునుపుగన్ను=తాను ముందు పొందిన, ఆత్మనాథ=దశరథుని యొక్క, వరశక్తి=వరములయొక్క శక్తిచే, పరాజిత=పరుల నోడించినదై, అప్డు=అప్పుడు, కానుపింప=కన్పించగా, ధర్మపాశ=ధర్మపాశముచే, సంయుత=బద్ధుడై, నిరుత్తర=బదులు చెప్పలేని, నిజాధిపతి=తన భర్త దశరథునిచే, సదైన్య+ఈక్షిత+ఆననపద్మ+అగుచు=దైన్యముతో గూడిన చూపులుగల ముఖపద్మముగలదియై.

తాత్పర్యము : ఆ సమయములో భవిష్యత్తులో జరుగవలసిన దాని కనుగుణముగా ప్రియమైన కపటముగల మందరచే చేయబడిన మిక్కిలి కోపముచే కలిగిన ఆనందముతో జింక కనులవంటి కనులుగల కైక, మిక్కిలి కోపముతో తన కపటము కన్పించగా కలిగిన సహింపరాని మాత్సర్యముచే కూడినదై తొందరపాటుతో తనముందట విష్ణుని లీలావతారరూపమైన రాముని ఉద్దేశించి కైక పలికెను. తాను ముందు పొందిన దశరథునియొక్క వరముల శక్తిచే పరుల నోడించినదైనట్లు అపుడు కన్పించగా ధర్మపాశముచే బద్ధుడై బదులు చెప్పలేని తన భర్త దశరథునిచే దైన్యముతోగూడిన చూపులుగల ముఖపద్మముగలదియై (పలికెను).

భారత : ఆవేళ, భవితవ్యత+అనుసారితన్=అదృష్టానుసారముచే, ప్రియ=ప్రియుడైన ధర్మరాజు యొక్క, కైతవ=జూదముచే, దాసీకృత=దాసిగా చేయబడినదియై, అతిమన్యుగళిత ప్రమోదయై=అత్యంతము శోకగ్రస్తముగలదియై,

కృష్ణ=ద్రౌపది, సారప్రేక్ష=సారమైన బుద్ధిగలది, ప్రబల=ప్రబలమైన, ఉగ్రతను=క్రౌర్యముచే, స్వకపటము=తన వస్త్రమును, దోఁపన్=దోచుటకు, మలయు=తీవ్రపడుచున్న, దుశ్శాసన=దుశ్శాసనునియొక్క, మత్సరంబున= మాత్సర్యముచే, శంకితత్వంబు నొంది=మానభంగము చెంది, సత్వరితయగుచు= వేగపడుచు, స్వపురస్థితిన్=తన పట్టణమునందుగల, స్థితిన్+తనర్చు=స్థితిచేత, లీలామర్త్యమూర్తి=లీలావతారుడైన, చక్రిన్=కృష్ణుని, ఉద్దేశించి, ముదిత=ద్రౌపది పలికె. తాన్=తాను, మునుపు, కన్న=ఎరిగిన, ఆత్మనాధవరశక్తి=ఆత్మనాథులపరమైన శక్తిని, కడుపరాజితయై=మిక్కిలి ఓటమిగల్గి, అప్డుగానిపింప, ధర్మపాశసంయుత=ధర్మమను పాశముచే, నిరుత్తర నిజాధిపతి=తన భర్తలు మాట్లాడలేకుండుటను, సద్దైన్య+ఈక్షితాననపద్మయగుచు=దీనముతోగూడిన చూపులుగల ముఖపద్మముగలది యగుచు.

తాత్పర్యము : ఆవేళ అదృష్టానుసారముచే ప్రియుడైన ధర్మరాజు యొక్క జూదముచే దాసిగా చేయబడినదై అత్యంతము శోకగ్రస్తయై ద్రౌపది సారమైన బుద్ధిగలది, ప్రబలమైన క్రౌర్యముచే తన వస్త్రమును దోచుటకు తొందరపడుచున్న దుశ్శాసనుని మాత్సర్యముచే మానభంగము చెంది, వేగపడుచు, తన పట్టణమునందు గలస్థితిచే లీలావతారుడైన కృష్ణునుద్దేశించి ద్రౌపది పలికెను. తాను మునుపు ఎరిగిన ఆత్మనాధులపరమైన శక్తికి మిక్కిలి ఓటమిగలిగి అప్పుడు కనుపించగా ధర్మమనే పాశముచే తన భర్తలు మాట్లాడలేకుండుటను దీనముతోగూడిన చూపులుగల ముఖపద్మము గలది యగుచు.

చ. వినుముదయాభివృద్ధి ప్రభవింపఁగ నిద్ధర యేలురాజు మ
త్తనయుఁడు నాకుమాపతి ముదంబునఁ బూర్వమునం దను గ్రహిం
చినవరలాభ మిప్పు డిటు సేసె నిజాత్మ నుపేక్ష మానునీ
సునియతి నిల్పు మానహతి సోఁకక యుండఁగఁ జేసి యిత్తటిన్.

రామా : వినుము, ఉదయ+అభివృద్ధి=అభ్యుదయాభివృద్ధి, ప్రభవింపగ=కలుగగా, ఈ+ధర=ఈ భూమిని, ఏలురాజు=పరిపాలించు రాజు, మత్=నా యొక్క తనయుడు=కుమారుడు, నాకు, మాపతి=మాపతి దశరధుడు, ముదంబున=సంతోషముతో, పూర్వమునందు=పూర్వకాలముననే, అనుగ్రహించిన=ఇచ్చిన, వరలాభము=వరములప్రాప్తి, ఇప్పుడు, ఇటుసేసెన్=రాజ్యము గైకొనునట్లు చేసెను, నిజాత్మన్=నీ మనసులో, ఉపేక్షమాని=కోరికనుమాని, ఆన=తండ్రి యజ్ఞ, హతిసోకక=నశించునట్లు చేయక, ఉండగజేసి, ఇత్తటిన్=ఈ సమయమున, నీ=నీ యొక్క, సునియతి=పుత్రధర్మమును, నిల్పుము.

తాత్పర్యము : వినుము - అభ్యుదయాభివృద్ధి కలుగగా ఈ భూమిని పరిపాలించు రాజు నాకు మాపతి దశరధుడు, సంతోషముతో పూర్వకాలముననే ఇచ్చిన వరముల ప్రాప్తి ఇప్పుడు నాయొక్క కుమారుడు రాజ్యముగైకొనునట్లు చేసెను. నీ మనస్సులో కోరికను మాని తండ్రి యాజ్ఞ నశించునట్లు చేయకుండగజేసెను. ఈ సమయమున నీ పుత్ర ధర్మమును నిల్పుము.

భారత : వినుము, దయాభివృద్ధి=దయ గొప్పతనముచే, ప్రభవింపగా, ఇద్దర ఏలురాజు=ధృతరాష్ట్రుడు, మత్త-నయుడు=మత్తుని యొక్క నీతివంటి నీతిగలవాడు (అవివేకి) నాకు, ఉమాపతి=పరమేశ్వరుడు, ముదంబున, పూర్వమునందు, అనుగ్రహించిన, వరలాభము=పతుల యొక్క లాభము, ఇప్పుడిటుసేసె, నిజాత్మన్=నా మనసులో, మానినీ=మానవతుల యొక్క, సునియతి, నిల్పు=మంచి నీతిలో నిల్పు, మానహతి=మానభంగము, సోకగయుండగజేసి, ఇత్తటిన్.

తాత్పర్యము : వినుము, దయావిశేషముతోగూడిన ఈ భూమినేలు ధృతరాష్ట్రుడు మత్తుని యొక్క నీతివంటి నీతిగలవాడు (అవివేకి). నాకు పరమేశ్వరుడు సంతోషముతో పూర్వము అనుగ్రహించిన పతుల యొక్క లాభము ఇప్పుడిటు చేసెను. నా మనసులో మానవతుల యొక్క మంచినీతిని నిల్పు మానభంగము సోకకుండునట్లు ఈ సమయమున -

ఉ. ఏకము నీవెఱుంగనిది యెయ్యది సర్వవిదుండ వీవు సో
త్సేకనిరూఢి నెల్లెడల శ్రీపసనాతనయుం డుదంచితా
స్తోకవిభూతి మీఱ నొరుచొప్పున నీయెడ నుండవచ్చునో
నీకును గావునన్ మది గణింపఁగ నెమ్మెయిఁ గాన దిక్కిఁకన్. 22

రామా : నీవెఱుంగనిది=నీకు తెలియనిది, ఏకము=ఒక్కటి, ఎయ్యది=ఏది? ఈవు=నీవు, సర్వవిదుండవు=అన్నియు తెలిసినవాడవు, సోత్సేక నిరూఢిన్=అతిశయముతో గూడిన ప్రౌఢిచే, ఎల్లెడల=అన్ని చోట్ల, శ్రీపసన్=ఐశ్వర్య సమృద్ధిచే, నా తనయుండు=భరతుడు, ఒరుచొప్పున=ఇతరులవలె (మంత్రులవలె) ఉదంచిత+అస్తోకవిభూతిమీఱ=మిక్కిలి అతిశయించిన ఐశ్వర్యముతో, నీయెడ=నీపట్ల, ఉండవచ్చునో, నీకును, కావునన్=అటుగనుక, మదిగణింపక=మనస్సులో లెక్కింపక, ఎమ్మెయిన్=ఏవిధముగానైన, కాన=అరణ్యము, దిక్కు+ఇకన్=ఇకపైదిక్కు (వనవాసమునకు వెళ్లుము).

తాత్పర్యము : (రామా!) నీకు తెలియనిది ఒక్కటియు లేదు. నీవు అన్నియు తెలిసినవాడవు. తన అతిశయించిన ప్రౌఢి అన్నిచోట్ల వెలుగగా ఐశ్వర్యాతిశయముచే నా కుమారుడు (భరతుడు) మిక్కిలి అతిశయించిన ఐశ్వర్యముతో ఇతర మంత్రులవలె నీపట్ల ఉండవచ్చునో! కావున మనస్సులో లెక్కింపక ఏవిధముగానైనను నీకు అడవులే ఇక దిక్కు.

భారత : ఏకము, నీవెఱుంగనిది, ఎయ్యది, (కృష్ణా!) సర్వవిదుండవు, ఈవు సోత్యేకవిరూఢిన్, ఎల్లడల, శ్రీప=లక్ష్మీశ! సనాతన=మూలపురుషా!, ఎల్లెడలనుండుదు=సర్వాంతర్యామివి, అంచిత+అస్తోకవిభూతిమీఱ=అధికమైన అశేష సంపదతో, ఒరుచొప్పున=ఇతరులవలె, నీయెడ, ఉండవచ్చునో, మీకును, ఎమ్మెయిన్, దిక్కు, ఇకన్, కాన=మరొక దిక్కు కన్పించదు కావు-నన్=నన్ను రక్షింపుమా!

తాత్పర్యము : నీకు తెలియని ఏమున్నది. ఓ కృష్ణా! నీవు అన్నియు తెలిసినవాడవు. అతిశయించిన ప్రౌఢిచే ఓ లక్ష్మీశ! సనాతనా! ఎల్లెడలనుండెదవు,

అధికమైన అశేష సంపదతో నితరులవలె నీయెడ నీకు ఉండవచ్చునో. నన్ను రక్షింపుమా! ఏవిధముగానైనను మరొక దిక్కుకానను.

సీ. ఇట్లు వల్కెడునంత హృదయసాహసమున
దాక్షిణ్యము లవంబు దనకు లేమిఁ
దోరంపుబిరుసున దుశ్శాసనుఁడవని
విభునూరకునికి భావింప నితని
కే నన్నపనిసేయు టెంతయు నభిమతా
ర్థం బని కని యవారణ మగువన
వాసస్థితినిగూర్పు స్వాంతవర్తనమున
న్వీతగర్హణభయనిష్ఠఁదోఁప

తే. రామకపటభావం బెందు నేమియునుజ
నింపదేమన నెంతటిపెంపు నీదు
నెమ్మనమునందు నెఱయ నా యమ్మ పాదు
కొలుపుభూతభవద్భవ్యగురుమహోజ్ఞ. 23

రామా : ఇట్లు+పల్కెడున్+అంత=ఇప్పుడు తామాట్లాడుపాటి, హృదయ సాహసమున=హృదయము యొక్క ధైర్యముతో, దాక్షిణ్యము=దయ, తనకు, లవంబులేమి=కొంచెము కూడ లేకుండుటచే, తోరము+బిరుసున=మిక్కిలి బిరుసుచే, దుశ్శాసనుడవు+అని=శిక్షించుటకు శక్యముకానివాడవనియు, విభున్=దశరధుని, ఊరక=ఉనికిన్=మాటలాడకుండుటను, భావింపన్=ఆలోచింపగా, ఇతనికిన్=ఇతనికి, ఈ రాజునకు, ఏను+అన్నపని+చేయుట=రాజ్యము వదలి వనవాసమునకు పోవుట, ఎంతయు, అభిమత+అర్థంబు+అని=ఎంతైనా ఇష్టమైన పనియని, కని=తెలిసి, అవారణమగు=మరొక చింత లేకుండ, వనవాసస్థితిని=వనవాసమనెడు స్థితిని, అన్వీత=అనుసరింపబడిన, గర్హణభయ=పితృవచనమును దాటెడినిందా భయముగల, నిష్ఠన్=సౌజన్యము, తోపన్=ప్రకాశించగా, స్వాంతవర్తనమున గూర్పు=మనసును కలిగించుము.

రామ=ఓ రామా! నీదు=నీ యొక్క, నెమ్మనమునందు=మంచి మనసునందు, కపటభావము=దురాలోచన, ఎందున్=ఎక్కడ కూడ, ఏమియున్ జనింపదు=ఏమియు కలుగదు, ఏమనన్=ఏమనగా, ఎంతటి పెంపు=ఎంతదైన ఆధిక్యము, భూత=అయిన, భవత్=నీ యొక్క, భవ్యగురు=పూజ్యుడైన తండ్రి యొక్క, మహాజ్ఞ=గొప్ప ఆజ్ఞచేత, నెఱయన్=ఇంక పదిలముగా, న్యాయమ్మ=న్యాయమునే, పాదుకొలుపు=నిలుపుము.

తాత్పర్యము : ఈ విధముగా మాట్లాడునట్టి హృదయసాహసముతో దయాస్వభావము కొంచెమైనను లేకుండుటచే మిక్కిలి బిరుసుచే శిక్షించుటకు శక్యము కానివాడవని దశరథుని ఊరకుండుటను భావింపగా, ఈ రాజునకు నీవు రాజ్యము వదలి వనవాసమునకు పోవుట ఎంతైనా ఇష్టమైన పనియని తెలిసి, మరొక ఆలోచన లేక వనవాసమనెడు స్థితిని అనుసరించుటకు పితృవచనమును దాటెదననెడి భయముగల సౌజన్యము ప్రకాశింపగా మనసును కలిగియుండుము. ఓ రామా! నీ మంచి మనసులో దురాలోచన ఎక్కడను ఏమియు కలుగదు. ఏమనగా ఎంతదో అయిన ఆధిక్యముగల పూజ్యుడైన తండ్రి గొప్ప ఆజ్ఞచే ఇంకను పదిలముగా న్యాయమునే నిలుపుము.

భారత : ఇట్లు పల్కెడు, అంతన్=అంతలో, దుశ్శాసనుడు, అవనివిభు=ధృతరాష్ట్రుని, ఊరకునికిన్=ఊరకుండుటచే, హృదయసాహసమున, దాక్షిణ్యము, లవంబు తనకులేమి, తోరంపుబిరుసున, భావింప, ఇతనికి, ఏను=నేను, అన్నపని=దుర్యోధనుని పని, చేయుట, ఎంతయు, అభిమతార్థంబు, అని, కని=తెలిసి, అవారణన్=అడ్డగింపులేని, మగువన్=ద్రౌపదిని, అవాసస్థితిన్=వస్త్రరహితమైన స్థితిని, కూర్పు స్వాంతవర్తనమునన్=కలిగించు ఆలోచనతో, వీత=పోగొట్టబడిన, గర్హణభయముగల=నిందించెదరను భయము, నిష్ఠన్=తలపెట్టుటచే, తోప=ఆలోచనతో, రామకున్=ద్రౌపదికి, అపటభావంబు=వస్త్రము లేకుండుట, ఎందున్, ఏమియు, జనింపదు, ఏమన, ఆయమ్మ=ద్రౌపది, పాదుకొలుపు=తలచునట్టి భూతభవద్భవ్యగురు=భూత భవిష్యత్ వర్తమానములకు కర్తయైన హరి యొక్క, మహాజ్ఞ=గొప్ప ఆజ్ఞ, ఎంతటి పెంపునీదు=ఎంతటి సౌభాగ్యమునివ్వదు – అని కవి వాక్యము.

తాత్పర్యము : ఈ విధముగా మాట్లాడునంతలో దుశ్శాసనుడు ధృతరాష్ట్రుని మౌనముచే హృదయసాహసముతో దాక్షిణ్యము ఏమాత్రము తనకు లేకుండుటచే, మిక్కిలి బిరుసుగా భావించి, నేను ఈ దుర్యోధనునకు ఈ పని చేయుట కోరిన కోర్కె అని తెలిసికొని, అడ్డగింపులేని ద్రౌపదిని వివస్త్రను చేయు ఆలోచనతో నిందించెదరను భయము పోగొట్టబడగా, ఆ ఆలోచనతో ద్రౌపది వివస్త్ర అయినను ఎందుకు ఏమియు కాదు. ఏమనగా భూత భవిష్యత్ వర్తమానములకు కర్తయైన శ్రీహరి సౌభాగ్యము నీకుండుటచే ఏమియు కాదని కవి భావన.

సీ. తొల్లి యొకప్పు డెందును గన్న యది గాక
  తనరునాయరిదివర్తనకు మెచ్చి
స్వవరమహారాజ్యసంపదల్ భూనాయ
  కుఁ డొసంగ రామ చేకొన్న దానఁ
దజ్జ్యేష్ఠసుతుఁ డవాప్తవిషాదతను జెంది
  మగుడ నమందాక్షమాయచేత
గురుదత్తరాజ్యంబు హరియించె దోదూయ
  మాను లై జనులు లోలోనఁ దిట్ట
తే. ననికృతాత్మగురువచోనుపాలనునాత
తత్ప్రభావు ననఘు ధర్మసూతి
నంద యోటువటిచి యాచతుర్దశవర్ష
భోగ్యమగు ప్రవాసమునకుఁ బనిచె. 24

రామా : తొల్లి=పూర్వమున, ఒకప్పుడు=ఎందును, కన్న+అదిగాక= చూచినదిగాక, తనరు=ఒప్పు, నా+అరిదివర్తనకు=నా విశిష్ట ప్రవర్తనకు మెచ్చి, స్వవర=తనకరములనెడి, మహారాజ్యసంపదల్=గొప్ప సంపదలను, భూనాయకుడు+ఒసంగ=దశరథుడివ్వగా - రామ=ఓ రామా!, చేకొన్నదానన్= స్వీకరించితిని, తత్=ఆ దశరథుని, జ్యేష్ఠసుతుడవు=పెద్దకుమారుడవు, ఆప్తవిషాదతను+ చెంది=పొందబడిన విషాదముచే, మగుడన్=తిరిగి, అమందాక్ష= లజ్జారహితమైన,

మాయచేత=కపటవర్తనచేత, గురుదత్తరాజ్యంబు=తండ్రి ఇచ్చిన రాజ్యము, హరియించెదో=తీసికొనెదవా?, దూయమానులై=పరితపించువారై, జనులు=ప్రజలు, లోలోనన్=లోలోపల, తిట్టన్=నిందించగా, అనికృత=తిరస్కరింప బడని, ఆత్మగురు=తండ్రి యొక్క, వచోనుపాలను=మాటననుసరించు, ఆతత్ ప్రభావున్=గొప్పశక్తిగల, అనఘున్=శ్రేష్ఠుని, ధర్మసూతిన్=ధర్మమునకు కారణమైన రాముని, అంద=ఆ మాటయందే, ఓటు పఱచి=నిరుత్తరుజేసి, ఆ చతుర్దశ=పదు నాలుగేండ్లు నిండునంతవరకు, భోగ్యమగు=అనుభవింపవలసిన, ప్రవాసమునకు= వనవాసమునకు, పనిచె=పంపెను.

తాత్పర్యము : పూర్వము ఒకప్పుడు ఎన్నడు చూడని విధముగా నేను చేసిన విశిష్ట ప్రవర్తనకు మెచ్చి తన వరములనెడు గొప్ప సంపదలను దశరథుడివ్వగా నేను స్వీకరించితిని. ఆ దశరథుని పెద్దకుమారుడవు గాన పొందబడిన విషాదముచే తిరిగి లజ్జావిరహిత కపటవర్తనచే తీసికొనదెవా? లోలోపల పరితపించు జనులు నిందించెదరు. తిరస్కరింపబడని తండ్రి మాట ననుసరించు గొప్పశక్తిగల శ్రేష్ఠుడైన ధర్మమునకు కారణమైన రాముని తన మాట యందే ఓడించి పదునాలుగేండ్లు పూర్తి అగునంతవరకు అనుభవింపవలసిన వనవాసమునకు పంపెను.

విశేషణము : మందాక్ష – అమరంలో మందాక్షం, హ్రీ, స్త్రపా, వ్రీడా.

ఆ చతుర్థశవర్ష – ఆఙ్మర్యాదాభావిద్యోః – అని అభివిద్యర్థము.

భారత : తొల్లి, ఒకప్పుడెందును గన్నయదిగాక, తనరు, ఆ+అరిదివర్తనకున్=ఆ అక్షయ వస్త్రములకు, మెచ్చి, స్వ=తన, వర=వరులను (భర్తలను), మహారాజ్యసంపదల్= మహారాజ్య సంపదలను, భూనాయకుండు=ధృతరాష్ట్రుడు, ఒసంగ=ఇవ్వగా, రామ=ద్రౌపది, చేకొన్నదానన్=స్వీకరించుటచే, తత్=ఆ ధృతరాష్ట్రుని, జ్యేష్ఠసుతుడు=పెద్దకుమారుడైన దుర్యోధనుడు, అవాప్త=సంక్రమించిన, విషాదతన్=భిన్నత్వమును, చెంది, అమంద=గొప్పదైన, అక్షమాయచేత=జూదములో, గురుదత్తరాజ్యంబు=తండ్రి ఇచ్చిన రాజ్యమును, హరియించె=స్వీకరించెను, దోదూయమానులై=మిక్కిలి పరితపించువారై, జనులు లోలోన తిట్ట, అనికృత=

తిరస్కరింపబడని, ఆత్మ=తన యొక్క, గురు=అధికమైన, వచో+అనుపాలనున్=వాక్యపాలనగలవానిని, ధర్మసూతిన్=ధర్మనందనుని, అంద=ఆ రెండవ జూదమునందే, ఓటుపఱచి=ఓడించి, ఆ చతుర్దదశ=పదమూడేండ్లు నిండు వరకు, భోగ్యమగు=అనుభవించవలసిన ప్రవాసమునకు బనిచె.

తాత్పర్యము : వస్త్రాపహరణము మున్నెన్నడు చూచినది కాకపోవుటచే, ఆ అరుదైన ప్రవర్తనకు మెచ్చి ధృతరాష్ట్రుడు ద్రౌపది భర్తలను, మహారాజ్య సంపదలను ఇవ్వగా ద్రౌపది స్వీకరించగా అతని పెద్దకుమారుడైన దుర్యోధనుడు మిక్కిలి ఖిన్నుడై, తిరిగి గొప్ప మాయాజూదములో తండ్రి ఇచ్చిన రాజ్యమును హరించెను. జనులందరు లోలోపల తిట్టుచు పరితపించిరి. తిరస్కరించబడని అధికమైన వాక్యపాలనగల ధర్మనందనుని, రెండవమారు జూదములో ఓడించి పదమూడేండ్లు నిండు వరకు ప్రవాసమునకు పంపెను.

సీ. అతఁడు తద్వచనానుసృతి నాత్మసామ్రాజ్య
మొకవికారము లేక యుజ్జగించి
ప్రియతరానుజకళత్రయుతంబుగా నుగ్ర
కాననంబునకు నేగంగ నంత
వత్స రామలసత్ప్రవర్తనల్ జనులకు
నప్రకాశంబుగ నాచరింపఁ
బూని యరిగె దయ్య మానెమ్మనంబుల
వేడుక లన్నియు వృథ చనంగఁ

తే. జేసితె కటకటా యంచుఁ జింతఁ జాల
వగచువారును బతిఁ దిట్టువారు నగుచుఁ
బౌరవృద్ధులు వెనువెంటఁ బాయ కరిగి
రతఁడు వారల మగుడంగ ననిచి చనియె. 25

రామా : అతడు=రాముడు, తత్=వదన+అనుస్మృతిన్=కైక వాక్యానుసారముగా, ఆత్మసామ్రాజ్యము=తన రాజ్యమును, ఒక వికారము లేక=ఏవిధమైన వికారము లేకుండ, ఉజ్జగించి=వదలిపెట్టి, ప్రియతర=ప్రీతిపాత్రమైన, అనుజ=సోదరుడైన లక్ష్మణుడు, కళత్రయుతంబుగా=భార్యయైన సీతతోగూడ, ఉగ్రకాననంబునకు= ఘోరమైన అడవులకు, ఏ గంగన్=బయలుదేరగా, అంత, వత్స!=ఓ బిడ్డా!, రామ=రామా! లసత్+ప్రవర్తనల్=మంచి నడవడిక, జనులకు, అప్రకాశంబుగ= కనిపించని రీతిలో, ఆచరింపగ+పూని=చేయుటకు నిశ్చయించి, అరిగెదు+అయ్య =వెళ్లుచున్నావు గదయ్యా! మా నెమ్మనంబులన్=మా మనస్సులలో, వేడుకలన్నియు=సంతోషములన్నియు, వృధచనంగ+చేసితె=వ్యర్థములగునట్లు చేసితివా? కటకటా!, అంచు=అనుచు, చింతన్=దుఃఖముతో, చాల వగుచువారున్= మిక్కిలి బాధపడువారును, పతిన్=దశరథుని, తిట్టువారున్+అగుచు=తిట్టువారును అయి, పౌరవృద్ధులు=పౌరులు, ముసలివారు, వెనువెంట=వెంబడించి, పాయక=వదలక, అరిగిరి=వెళ్లిరి, అతడు=ఆ రాముడు, వారల=పురజనులను, వృద్ధులను, మగుడంగన్+అనిచి=తిరిగి వెళ్లునట్లు చేసి, చనియె=వెళ్లెను.

తాత్పర్యము : రాముడు కైకవాక్యముననుసరించి ఏవిధమైన వికారము లేకుండగా తన రాజ్యమును వదలిపెట్టి, ప్రీతిపాత్రమైన లక్ష్మణుడు, సీతతో కలిసి ఘోరమైన అడవులకు బయలుదేరగా, ఓ వత్సా! రామా! నీ మంచి నడవడిక జనులకు కనిపించని రీతిలో చేయుటకు నిశ్చయించి వెళ్లుచున్నావు గదయ్యా! మా మనస్సులలో సంతోషములన్నియు వ్యర్థము చేసితివా? కటకటా! అనుచు దశరథుని నిందించుచు, బాధపడుచు పౌరవృద్ధులు రాముని వెన్నంటి వదలక వెళ్లిరి. ఆ రాముడు పురజనులను తిరిగి వెళ్లునట్లు చేసి వెళ్లెను.

భారత : అతడు=ఆ ధర్మరాజు, తత్వదనానుస్మృతి=ఆ దుర్యోధనుని మాట ప్రకారము, ఆత్మసామ్రాజ్యము, ఒక వికారము లేక, ఉజ్జగించి=తన రాజ్యమును ఏవిధమైన వికారము లేకుండ వదలి, ప్రియతర అనుజ=ప్రియమైన సోదరులు, కళత్రయుతంబుగా=ద్రౌపదితో కూడ, ఉగ్రకాననంబునకు, ఏగంగ=బయలుదేరగా,

అంత, వత్సర=పదమూడవ ఏటియందుగల, అమల+సత్ ప్రవర్తనల్=నిర్మలమైన మంచి నడవడికచే, జనులకు, అప్రకాశంబుగన్+ఆచరింపన్=అజ్ఞాతవాసముగా గడపగ, పూని=నిశ్చయించి, అరిగె=వెళ్లెను, దయ్యమా!=జనులు విచారంతో అన్నమాట, నెమ్మనంబుల వేడుకలన్నియు, వృధచనంగజేసితె=వ్యర్థమగునట్లు చేసితివే, అంచు=అనుచు, చింతన్+చాల, వగచువారును, పతిన్=ధృతరాష్ట్రుని, తిట్టువారున్+అగుచు, పౌరవృద్ధులు, వెనువెంట, పాయక, అరిగిరి, అతడు=ధర్మజుడు, వారనల్ మగుడంగ, ననిచి, చనియె -

తాత్పర్యము : ధర్మరాజు దుర్యోధనుని వచనానుసారము తన రాజ్యమును ఏవిధమైన వికారము లేకుండా త్యజించి, తన ప్రియమైన సోదరులు, భార్యతో భయంకరమైన అడవులకు బయలుదేరగా, అంత, పదమూడవ సంవత్సరము అజ్ఞాతవాసములో గడుపు నిర్మలమైన సత్ప్రవర్తన ఆచరింపదలచి వెళ్లెను. ఓ దయ్యమా! మనసులోని వేడుకలన్నియు వ్యర్థమైపోవునట్లు కటకటా! చేసితినే యని చింతించుచు బాధపడువారును, ధృతరాష్ట్రుని తిట్టువారునై పౌరవృద్ధులు వారి వెంబడి వదలక వెళ్లిరి. ధర్మజుడు వారిని వెనుకకు వెళ్లునట్లు చేసి ముందుకు వెళ్లెను.

వ. అంత. 26

ఆ. పుత్త్ర మోహమున విభుండు పోయినపోక
కును వగచుచు మఱియుఁ గూడ వచ్చి
కడుఁ బ్రయాణవిఘ్నకరు లగుభరతము
ఖ్యులఁబ్రయత్నమున మగుడ్చి వెసను. 27

రామా : పుత్రమోహమునన్=రామునిపై వ్యామోహముతో, విభుండు=దశరధుడు, పోయిన పోకకున్=నొచ్చుకొనుటకు, వగచుచు=బాధపడుచు, మరియు, కూడవచ్చి, ప్రయాణవిఘ్నకరులగు=తిరిగి అయోధ్యకు రమ్మని కోరు, భరతముఖ్యులన్=భరతుడు, మొదలైన ముఖ్యుల యొక్క, ప్రయత్నమున=ప్రయత్నమును, వెసను=శ్రమతో, మగుడ్చి=మరలించి.

తాత్పర్యము : రామునిపై దశరథుడు నొచ్చుకొనుటకు బాధపడుచు, మరియు తనవద్దకు వచ్చి తన ప్రయాణమునకు విఘ్నముగా (అయోధ్యకు రమ్మని) కోరు భరతాది ముఖ్యుల ప్రయత్నమును మిక్కిలిగా మరలించి.

భారత : పుత్రమోహమున=దుర్యోధనునిపై మోహముతో, విభుండు పోయిన పోకకున్=ధృతరాష్ట్రుడు నడచిన నడవడికి, మరియు కూడవచ్చి, కడున్, ప్రయాణ విఘ్నకరులగు=ప్రయాణము సాగుటకు ఆటంకపడు (వృద్ధులైన) భరత ముఖ్యుల=భీష్మ బాహ్లికాదుల ప్రయత్నమును, మగుడ్చి చనియె.

తాత్పర్యము : దుర్యోధనునిపై మోహముతో ధృతరాష్ట్రుడు నడచిన నడవడికి నొచ్చుకొనుచు, మరియు తమ ప్రయాణమునకు (వృద్ధాప్యముచే) ఆటంకపడు భీష్మబాహ్లికాదులను ప్రయత్న పూర్వకముగా వెనుకకు పంపి, వెళ్లెను (ధర్మజుడు).

చం. బహువనచిత్రకూటముఖపర్వతచక్ర మతిక్రమించి వి
శ్వహితుఁడు దండకాశ్రమనివాసు లెదుర్కొని కొంచుఁబోవఁ ద
త్ప్రహితసపర్యుఁడై యలరెఁ బావని యాత్మవిశుద్ధ సత్త్వవి
గ్రహఘనలక్ష్మి చూపఱకుఁ గన్నులపండువు గాఁగ నంతటన్. 28

రామా : బహువన=దట్టమైన అడవులుగల, చిత్రకూటముఖ=చిత్రకూటము మొదలైన పర్వతములయొక్క, చక్రము=సమూహమును, అతిక్రమించి=దాటి, విశ్వహితుఁడు=రాముడు, దండకాశ్రమనివాసులు=దండకారణ్యములో నివసించు మునులు, ఎదుర్కొని=స్వాగతించి, కొంచు+పోవన్=తీసికొని పోగా, తత్=ఆ మునులచే, ప్రహిత=చేయబడిన, సపర్యుడై=పూజగలవాడై, అలరె=ప్రకాశించెను, ఆత్మ=తన యొక్క, విశుద్ధసత్త్వ=మంచి బలిమిగల, విగ్రహ=శరీరము యొక్క, ఘనలక్ష్మి=గొప్ప సంపదతో, పావని=పవిత్రమైనది (లక్ష్మికి విశేషణము), చూపఱకు=చూచువారలకు, అంతటన్=అంతటను, కన్నుల పండువగాగన్= కంటికింపుగా (అలరెను).

తాత్పర్యము : దట్టమైన అడవులుగల చిత్రకూట పర్వత సమూహమును

దాటి రాముడు దండకారణ్య ఆశ్రమమునులు తనను స్వాగతించి తీసికొనిపోగా, ఆ మునులచే పరిచర్యలు అందుకొని ప్రకాశించెను. తన బలిమిగల, శరీరము యొక్క ఘనలక్ష్మి పవిత్రమైనదై చూచువారలకు అంతటను కనుల పండువయాయెను.

భారత : బహువనచిత్ర=అధికమైన చిత్రమైన వనములచే, కూటముఖి=శిఖరాసులుగల, పర్వతచక్రము=పర్వత సముదాయమును, విశ్వహితుడు=ధర్మరాజు, అతిక్రమించి=దాటి, దండకున్=సమీపమునకు, ఆశ్రమనివాసులు=మునులు, ఎదుర్కొని కొంచుబోవ, తత్+ప్రహిత సపర్యుడై=అలరె, పావని=భీముడు, విశుద్ధసత్త్వ=మంచి బలిమిగల, విగ్రహఘనలక్ష్మి, చూపఱకు కన్నుల పండువగాగ నంతటన్.

తాత్పర్యము : అనేక చిత్రమైన వనములచే శిఖరాదులుగల పర్వత సముదాయమును ధర్మజుడు దాటి, తన సమీపమునకు మునులు వచ్చి స్వాగతించి తీసికొని వెళ్లి సపర్యలు చేయగా ప్రకాశించెను. భీముడు తన బలముగల శరీర సంపదచే చూపరులకు అంతటను కనుల పండువజేసెను.

విశేషణము : భీముడుకిమ్మీరుని కూల్చెనను భావము స్ఫురింపజేసెను.

పావని - పవనస్యాపత్యమ్ పావని

కం. సతియును దానును నతివి
 శ్రుత మగుతనబలిమి నమితసుమనఃకిమ్మీ
రతరశ్రీధృత మగునతి
వితతాటవిఁ గొంకు లేక విహరించుతఱిన్. 29

రామా : సతియును+తానును=సీతతోగూడిన రాముడు, అతివిశ్రుతమగు=మిక్కిలి కీర్తి గడించిన, తనబలిమిన్=తన బలముచే, అమితసుమనః=అధిక పుష్పములచే, కిమ్మీర-తర=మిక్కిలి కర్బుర వర్ణమైన, శ్రీధృతము+అగు=సంపదచే ఆదరింపబడిన, అతివితత+అటవిన్=మిక్కిలి విస్తారమైన అడవిలో, కొంకులేక=భయమేమియులేక, విహరించుతఱిన్=సంచరించు సమయమున.

తాత్పర్యము : సీతతోగూడిన రాముడు మిక్కిలి కీర్తి గడించిన తన బలముచే అధిక పుష్పములతో మిక్కిలి కర్బురవర్ణమైన సంపదచే ఆదరింపబడిన మిక్కిలి విస్తారమైన అడవిలో భయమేమియులేక సంచరించు సమయములో.

భారత : సతియును+తానును=ద్రౌపదియును తానును (భీముడు), అతివిశ్రుతమగు-తన బలిమిన్, అమిత=అణచబడిన, సుమనః=దేవతలుగల, కిమ్మీర=కిమ్మీరుడను రాక్షసుని, తరః=బలిమి యొక్క, శ్రీధృతమగు నతివితతాటవి, కొంకులేక విహరించు తఱిన్.

తాత్పర్యము : ద్రౌపదితోగూడిన భీముడు మిక్కిలి గొప్పదైన తన పరాక్రమముచే అణచబడిన దేవతలుగల కిమ్మీరుడను రాక్షసుని బలిమి యొక్క సంపదచే ఆదరింపబడిన అడవిలో ఏవిధమైన భయము లేక సంచరించు సమయములో.

విశేషణము : సుమనః = స్త్రీయః సుమనసః పుష్పమ్ – అని అమరము.

కర్బుర = చిత్ర కిమ్మీర కల్మాషశబలైతాశ్చకర్బురే – అని అమరము.

శా. దోరాస్ఫాలకరాళితోద్ధతివిరాధున్ నీలశైలోపమున్
దారధ్వానయుతాట్టహాసవిసరద్దంష్ట్రామయూఖాళిఁ గి
మ్మీరాభిఖ్యఁ దనర్చు రాక్షసుమదమ్లిష్టోక్తు లాటోపదు
ర్వారాకృష్టమహీజుఁ డై వదరుగర్వగ్రస్తుఁ గూల్చెన్ధరన్. 30

రామా : దోః=భుజముల యొక్క, ఆస్ఫాల=మల్లచఱచుటచే, కరాళిత=అతి భయంకరముగా చేయబడిన, ఉద్ధతిన్=గొప్పదనముగలవానిని, నీలశైల+ఉపమున్= నల్లని కొండవంటి శరీరముగలవానిని, తార=అధికమైన, ధ్వాన=ధ్వనితో, యుత=కూడిన, విరాధున్=విరాధుని, అట్టహాస=అట్టహాసముచే, విసరత్=వ్యాపించిన, దంష్ట్రా=కోరలయందుగల, మయూఖాళిన్+జ్వాలాసముదాయముచే, కిమ్మీర+ అభిఖ్యన్=చిత్రవర్ణ కాంతిచే, తనర్చు=ఒప్పునట్టి, రాక్షసు=రాక్షసుని, మద=మదముచే, మ్లిష్ట=స్పష్టముగాని, ఉక్తులు=మాటలు, ఆటోప=వేగముతోగూడిన, దుర్వార=దుర్వారమైనట్లుగా, ఆకృష్ట=అపహరింపబడిన, మహీజుడై=సీతగలవాడై,

వదరు=దుర్భాషలాడు, గర్వగ్రస్తున్=గర్వముతోగూడినవానిని, ధరన్=భూమిపై, కూల్చెన్=సంహరించెను.

తాత్పర్యము : భుజములను మల్లచఱచుటచే అతి భయంకరమైన ఔద్ధత్యముగల ధ్వనితోగూడిన విరాధుని, అట్టహాసముచే వ్యాపించిన కోరలయందలి జ్వాలా సముదాయముచే చిత్రవర్ణ కాంతిచే ప్రకాశించు రాక్షసుని మదముచే స్పష్టముగాని మాటలు వేగముగా దుర్వారముగా చేసి సీతను అపహరించివదరుచున్న గర్వయుతుడైన వానిని భూమిపై కూలనేసెను.

భారత : దోరాస్ఫాలకరాళితోద్ధతిన్, విరాధుని=ప్రాప్తిగలవానిని, (ధూర్తుని), నీలశైలోపమున్, తారధ్వానయుతాట్టహాస విసరత్ దంష్ట్రామయూఖాళిన్, కిమ్మీర+అభిఖ్యన్=కిమ్మీరుడను పేరుతో, తనర్చు రాక్షసున్=మదమ్లిష్టోక్తులాటోపదుర్వార, ఆకృష్ట=ధరించిన, మహీజుడై=చెట్లుగలవాడై, వదరుగర్వగ్రస్తున్, ధరన్, కూల్చెన్.

తాత్పర్యము : భుజములు మల్లచఱచుటచే అతి భయంకరమైన ఔద్ధత్యముగల ధ్వనితో ప్రాప్తిగల నల్లని కొండవంటి శరీరముగలిగి అట్టహాసముచే వ్యాపించిన కోరల యందలి జ్వాలాసముదాయముచే ప్రకాశించు కిమ్మీరుడను రాక్షసుని మదముచే స్పష్టముగాని మాటలు వేగముగా దుర్వారముగా చేసి వదరుచున్నవానిని వృక్షములతో నేల గూల్చెను (భీముడు).

విశేషణము : విరాధు=రాధామృగయుదుష్టయోః అని వి.

తే. ఆనిశాటుఁ డట్లు హతుఁ డయి దేవతా
తుష్టిఁ జేసి వారు దొడఁగినట్టి
విపినవాసకార్య మపవిఘ్నమై సాఁగఁ
బ్రథమహత మగుబలిపశువుఁబోలె. 31

రామా : ప్రథమహతమగు=తొలిసారిగా చనిపోయిన, బలిపశువువోలె= బలిపశువువలె, ఆనిశాటుడు=ఆవిరాధుడు, అట్లు=ఆ విధముగా, హతుడై=మరణించి, దేవతాతుష్టిన్+జేసి=దేవతలకు సంతృప్తిగలిగించి, వారు తొడగినట్టి=వారు

ప్రారంభించిన, విపినవాసకార్యము=అరణ్యవాస కార్యక్రమము, అపవిఘ్నమై= విఘ్నములు లేకుండ, సాగన్=కొనసాగగా.

తాత్పర్యము : మొదటగా చనిపోయిన బలిపశువువలె ఆ రాక్షసుడు చనిపోగా, దేవతలకు సంతోషమును గలిగించి, వారు సంకల్పించిన అరణ్యవాస కార్యక్రమమునకు ఏవిధమైన ఆటంకములేకుండా కొనసాగగా.

(భారతార్థము కూడా సమానమే)

వ. అది య ట్లుండె మహారణ్యంబు దఱియంజొచ్చి యారాజ
మూర్ధన్యుండు. 32

రామాయణ భారతార్థములు సమానము.

అదియట్లుండె=అది అట్లుండగా, మహారణ్యంబు=గొప్ప అడవిని, తఱియన్+చొచ్చి=ప్రవేశించి.

రామా : రాజమూర్ధన్యుండు=శ్రీరాముడు.

భారత : రాజమూర్ధన్యుండు=భీముడు.

తాత్పర్యము : అది అట్లుండగా గొప్ప అడవిలో ప్రవేశించి శ్రీరాముడు/ భీముడు.

కం. ఈ తెఱఁగున సతితో స
భ్రాతృకుఁ డై వరుసఁ జని ప్రపంచితసుమనో
ద్వైతవనభూములందుఁ బ్ర
భూతామోదమున నెలమి వొందుచు నంతన్. 33

రామా : ఈ తెఱగున=ఈ విధముగా, సతితో=సీతతోగూడి, సభ్రాతృకుడై= లక్ష్మణునితోగూడి, వరుసన్+చని=వరుసగా వెళ్లి, ప్రపంచిత=విస్తరించబడిన, సుమనః =పుష్పములతో, అద్వైత=ఐక్యముగల, వనభూములందు=అడవులలో,

ప్రభూత+ఆమోదమున=ప్రచారమైన సంతోషము, ఎలమిన్+పొందుచు=మిక్కిలి పొందుచు, అంతన్=అంతట.

తాత్పర్యము : ఈ విధముగా సీతతో, లక్ష్మణునితో గూడి వరుసగా వెళ్లి విస్తారమైన పుష్పములతో ఐక్యముగల అడవులలో ప్రచురమైన సంతోషము పొందుచు – అంతట.

భారత : ఈ తెఱగున, సతితోన్=ద్రౌపదితో, సభ్రాతృకుడై=రాజులతోగూడి, వరుసజని=ప్రపంచిత, సుమనః=సజ్జనులుగల, ద్వైతవనభూములందు, ప్రభూత=ప్రచురమైన, ఆమోదమున, ఎలమిన్ పొందుచు, అంతట.

తాత్పర్యము : ఈ విధముగా ద్రౌపదితో, రాజులతోగూడి వరుసగా నడచి సజ్జనులుగల ద్వైతవనములో ప్రచురమైన సంతోషమును పొందుచు – అంతట.

చం. మొలచువచః ప్రసంగముల ముందరఁ గాఁగలకార్యరేఖ పెం
పెలయఁ బరాత్మచింతనను హృచ్ఛరభంగసుతీక్ష్ణకుంభజా
దులహితశాసనక్రమముతోఁ జరియించెద రత్యనూనత
త్కలితబహూపచారతకతంబున రంజిలి యంచు నెంచుచున్. 34

రామా : మొలచువచః ప్రసంగములన్=చెప్పబడిన మాటలచే, ముందరన్= భవిష్యత్తులో, కాగలకార్యరేఖపెంపు=జరుగబోవు కార్యములయొక్క శోభ, ఎలయన్= ప్రకాశింపగా, పరాత్మచింతన=పరమాత్మపై ధ్యానముతో, సుహృత్= బంధువులైన, శరభంగ=శరభంగుడు, సుతీక్ష్ణ=సుతీక్షణుడు, కుంభజ=అగస్త్యుడు, ఆదుల= మొదలైనవారి, హితశాసనక్రమముతో=హితోపదేశానుచారముతో, రతి=వేడుకతో, అనూన=అధికమగునట్లు, తత్+కలిత=ఆముని చేసిన, బహు+ఉపచారతకతంబున= అనేక ఉపచారముల కారణమున, రంజిలియంచు= ఆనందించినట్లు, ఎంచుచున్= భావించుచు, చరియించెదరు=తిరిగెదరు.

తాత్పర్యము : చెప్పబడిన మాటల వలన భవిష్యత్ కార్యరేఖల శోభ వెలయగా, పరమాత్మ ధ్యానముతో బంధువులైన శరభంగ, సుతీక్ష్ణ, అగస్త్యాదుల హితోపదేశాను

చారముతో వేడుక అధికమగునట్లుగా ఆముని చేసిన ఉపచారముల వలన మిక్కిలి ఆనందించినట్లు భావించుచు వారు తిరిగెదరు.

భారత : మొలచువచః కలిగిన ప్రసంగములతో, ముందరన్=అజ్ఞాతవాసము తర్వాత కాగల కార్యరేఖ పెంపెలయ=యుద్ధమును గూర్చి భావన కలుగగా, పర=పరులైన దుర్యోధనాదుల యొక్క, ఆత్మ=తన యొక్క, చింతన్=బలాబల విచారముచే, అసుహృత్=శత్రువుల యొక్క, శరభంగ=బాణములను త్రుంచు, సుతీక్ష్ణ=ప్రచండులైన, కుంభజాదులు=ద్రోణాదులు, అహిత=దుర్యోధనుని, శాసనక్రమములో=శాసనమునననుసరించి, అత్యనూన=పరిపూర్ణముగా, తత్+కలిత=ఆ దుర్యోధనునిచే చేయబడిన, బహూపచారతకతంబున=అనేక పరిచర్యల వలన, రంజిలియంచు=సంతోషించినట్లుగా, చరియించెదరు.

తాత్పర్యము : ప్రసంగములలో కలిగిన అజ్ఞాతవాసము తర్వాత యుద్ధమును గూర్చిన భావన కలుగగా, దుర్యోధనాదుల యొక్క, తన యొక్క, బలాబలముల విచారముచే శత్రువుల యొక్క బాణములను భంగపరచుటలో ప్రచండులైన ద్రోణాదులు దుర్యోధనుని శాసనమునను సరించి, పరిపూర్ణముగా ఆ దుర్యోధనుడు చేసిన ఉపచారముల వలన సంతోషించినట్లు భావించి చరించెదరు.

సీ. కడుఁ దన్మహాశ్రమగమనోదితోత్సాహుఁ
డయ్యె నాసమయంబునందు నమిత
తుంగహృద్రిపుశర భంగమునీశ్వరు
నంబకమున్మ హిమాస్పదమును
ఘనతపశ్శక్తిఁ దెమ్మని విధి దయచేసి
వెస జిష్ణుఁ బంచెఁ దద్వేళ వచ్చి
తత్పితామహుఁడు సత్యవిధానుఁ డ ట్లంప
నాఘనుఁ డింద్రకీలాశ్రమప్ర

తే. వేశ మొనరించి యవ్విధివిభుసురేశు
నఖిలనుతుని భజించెద యాత్వరాతి
రాముఁ డాదిత్యకులభర్తరమణ వచ్చి
కరుణ నేయు నంతకుఁ దగుగట్టితాల్మి. 35

రామా : కడున్=మిక్కిలిగా, తత్=ఆ శరభంగాదుల యొక్క, మహాశ్రమ= అధికమైన శ్రమలు, గమన=తరలిపోవుటకు, ఉచిత=జన్మించిన, ఉత్సాహుడు+ ఆయెను=ఉత్సాహము గలవాడాయెను, ఆ సమయంబునందు=అట్టి సమయములో, నమిత=నమ్రమైన, తుంగ=పొడవైన, హృత్+రిపు=అంతశ్శత్రువులు గలవానిని, అంబక=కనులకు, మున్మహిమ=సంతోషాతిశయమునకు, ఆస్పదమును=కారణమై, ఘనతపః+శక్తిన్=గొప్ప తపోశక్తి గలవానిని, శరభంగ మునీశ్వరున్=శరభంగముని శ్రేష్ఠుని, తెమ్మని=పిలుచుకరమ్మని, విధి=బ్రహ్మ, వెసదయ+చేసి=మిక్కిలి దయతో, జిష్ణున్=ఇంద్రుని, పంచెన్=పంపెను, తత్+వేళవచ్చి=ఆ సమయములో వచ్చి, తత్+పితామహుడు=ఆ బ్రహ్మదేవుడు, సత్యవిధానుడు=సత్యమార్గముగలవాడు, అట్లు+అంపన్=ఆ విధముగా పంపగా, ఆ ఘనుడు=శరభంగుడు, ఇంద్ర=ఓ ఇంద్రా!, కీల=అగ్నిజ్వాలయందుగల, ఆశ్రమ ప్రవేశ మొనరించి=ఆశ్రమములో ప్రవేశించి, అవ్విధిన్=ఆ బ్రహ్మదేవుని, విభున్+సుర+ఈశున్=అధిపతియైన ఇంద్రుని, అఖిలనుతుని=అందరిచే పొగడబడువానిని, భజించెద=కొలిచెదను, యాత్వ+రాతి= రాక్షసుల శత్రువైన, ఆదిత్యకులభర్త=సూర్యవంశములో శ్రేష్ఠుడైన, రాముడు, రమణవచ్చి=సొబగుతో వచ్చి, కరుణ+చేయు=నాకు తన సేవ అనుగ్రహించు, అంతకు=అంతవరకు, గట్టితొల్మి=ఆలస్యమును సహించుట, తగున్=తగును.

తాత్పర్యము : మిక్కిలి ఆ శరభంగాదుల అధికమైన శ్రమలు తొలగిపోవుటకు జన్మించిన ఉత్సాహము గలవాడాయెను. అట్టి సమయములో నమ్రమైన, పొడవైన అంతశ్శత్రువులు గలవాని కనులకు సంతోషాతిశయమునకు కారణమై, గొప్ప తపశ్శక్తి గల శరభంగ మునిశ్రేష్ఠుని పిలుచుకరమ్మని బ్రహ్మ మిక్కిలి దయతో ఇంద్రుని పంపగా, ఆ సమయములో వచ్చి ఆ బ్రహ్మదేవుడు సత్యమార్గముగల ఇంద్రుని

పంపగా శరభంగుడిట్లనెను : ఓ ఇంద్రా! అగ్నిజ్వాలగల ఆ ఆశ్రమములో అందరిచే పొగడబడు ఇంద్రుని కొలిచెదను. రాక్షసుల శత్రువైన సూర్యవంశ శ్రేష్ఠుడైన రాముడు సొబగుతో వచ్చి నాకు తన సేవ అనుగ్రహించు వరకు ఆలస్యమును సహించుట తగును.

(రాముడు శరభంగాశ్రమానికి వచ్చెడి వేళ బ్రహ్మ ఇంద్రుని పంపి శరభంగుని పిలిపించగా ఆయన రాముని సేవించిన వెనుక అగ్నిప్రవేశము చేసి బ్రహ్మ సన్నిధికి వచ్చెదనని శరభంగుడు పలికెను).

భారత : కడున్, తత్=ఆ ఎన్నికచే, మహాశ్రమగ=అధిక శ్రమ పొందిన, మనః=మనస్సుచే, దితోత్సాహుడయ్యెన్=ఖండించబడిన ఉత్సాహముగల వాడాయెను, ఆ సమయంబునందు, అమిత=అమితములైన, తుంగహృత్=ఉన్నతచిత్తులైన, రిపు=శత్రువుల యొక్క, శర=బాణములను, భంగమున్=పడగొట్టు, ఈశ్వరు+అంబకమున్=పాశుపతాస్త్రమును, మహిమాస్పదమును=మహిమకు ఆలవాలమైన దానిని, ఘనతపః+శక్తిన్=గొప్ప తపోదీక్షతో, తెమ్మని, విధి దయచేసి=మంత్ర విధానమునుపదేశించి, సత్యవిధానుడు=వ్యర్థము గాని శాసనముగల, ఆ+పితామహుడు=ఆ వ్యాసముని, తత్+వేళవచ్చి=ఆ సమయములో వచ్చి, జిష్ణున్=అర్జునుని, అట్లు+అంపన్=ఆ విధముగా పంపగా, ఆ ఘనుడు=ఆ అర్జునుడు, ఇంద్రకీల+ఆ శ్రమప్రవేశము+ఒనరించి=ఇంద్రకీలాద్రిపైనున్న ఆశ్రమములో ప్రవేశించి, ఆ+విధిన్=ఆ మంత్ర విధముగా, విభుసురేశు=దేవతలకధిపతియైన ఇంద్రుని, అఖిలనుతుని=అందరి స్తోత్రములందుకొనువానిని, భజించి=కొలిచెను, దయాత్వరా=కృపాతిశయముచే, అతిరాముడు=మిక్కిలి అభిరాముడు, ఆదిత్యకుల భర్త=దేవతాధిపతియైన ఇంద్రుడు, రమణవచ్చి=వేడుకతో వచ్చి, కరుణసేయునంతకు, తగున్, గట్టితాల్మి.

తాత్పర్యము : ఆ ఎన్నికచేత అధికశ్రమ పొందిన మనస్సుచే ఖండింపబడిన ఉత్సాహము గలవాడాయెను. ఆ సమయములో అమితములైన ఉన్నతచిత్తులైన శత్రువుల బాణములను పడగొట్టు మహిమగల పాశుపతాస్త్రమును గొప్ప తపోదీక్షతో

సాధించమని మంత్రోపదేశము చేసి వ్యర్థముగాని శాసనముగల వేదవ్యాసముని ఆ సమయములో వచ్చి అర్జునుని - ఆ విధముగా పంపగా అర్జునుడు ఇంద్రకీలాద్రిపై గల ఆశ్రమమును ప్రవేశించి, ఆ మంత్రోపదేశానుసారము అందరి నుతులనందుకొను ఇంద్రుని భజించెను. కృపాతిశయముచే మిక్కిలి అభిరాముడైన దేవతాధినాధుడింద్రుడు వేడుకతో వచ్చి కరుణించునంతవరకు ఓపిక పట్టెదనని భావించెను.

తే. ప్రీతి వచ్చినాకీశుఁడు నాతపోవి
భూతిఫలము దా నైయత్యపూర్వవృత్తి
నధికశివ మనురూపసన్నిధి యొసంగ
నతని నంచి కృతార్థుండ నగుదు ననుచు 36

రామా : ప్రీతిన్+వచ్చి=సంతోషముతో వచ్చి, నాకున్=నాకు, ఈశుడు=రాముడు, ఆ తపోవిభూతిఫలము=నా తపస్సంపద యొక్క ఫలమును, తానై=తానే, అతి+అపూర్వవృత్తి=మిక్కిలి గొప్ప రీతిలో, అధికశివము=అతి శుభమైన, అనురూప సన్నిధి=నాకు తన సాన్నిధ్యమును, ఒసంగన్=ఇవ్వగా, అతనిని=ఆ రాముని, అంచి=పంపి, కృతార్థుండన్+అగుదు+అనుచు=అలాగే బ్రహ్మలోకమునకు వచ్చెదననుచు.

తాత్పర్యము : ఆ రాముడు సంతోషముతో వచ్చి నా తపస్సంపద ఫలముగా తానే అత్యపూర్వమైన రీతితో అతిశుభంకరమైన తన సాన్నిధ్యమునివ్వగా ఆ రాముని పంపి, ఆ పిదప అట్లే బ్రహ్మలోకమునకు వచ్చెదననుచు.

భారత : ప్రీతి వచ్చి, నాక+ఈశుడు=ఇంద్రుడు, ఆ తపోవిభూతి ఫలము, తాన్=తాను, నైయత్యపూర్వ=నియతపూర్వకమైన, వృత్తిన్=వర్తనగలదానిని, అధిక=గొప్ప, శివమనురూప=శివమంత్రరూపమైన, సన్నిధి=లెస్సయైన నిధానమును (పెన్నిధియైన పంచాక్షరీ మంత్రమును), ఒసంగన్=ఇచ్చినను, అతనిన్=ఆ ఇంద్రుని, అంచి=పంపి, కృత=చేయబడిన, అర్థ=శివారాధన ప్రయోజనముగలవాడను, అగుదుననుచు.

తాత్పర్యము : ప్రీతితో వచ్చి ఇంద్రుడు ఆ తపస్సంపద ఫలమును తాను నియమ పూర్వకమైన వర్తనముగల ఆ గొప్ప శివమంత్రరూప విధానమును నాకిచ్చినచో ఆ ఇంద్రుని పంపి శివారాధన ప్రయోజనము కలవాడనగుదుననుచు.

(ఇంద్రుడు శివమంత్రోపదేశము చేసిన తర్వాత అర్జునుడీవిధముగా చింతించెను)

వ. యథోచితవినయోపచారపూర్వకంబుగా నింద్రుని మగుడననిచి. 37

అర్థము రెంటికి సమానము : యథా+ఉచిత=సందర్భానుసార, వినయ+ఉపచార పూర్వకంబుగా=సమయోచితముగా వినయపూర్వక పరిచర్యలతో ఇంద్రుని పంపి.

క. తనమనమున నెంతయు మిం
చినతాత్పర్యమున రాజశేఖరు శుభద
ర్శనుని రఘునాథుఁ దలఁచుచు
ననుపమభూయస్సమాధి నతఁడు దలిర్చెన్. 38

రామా : అతడు=ఆ తాపసి (శరభంగుడు), తనమనమున=తన మనస్సులో, ఎంతయు మించిన=మిక్కిలి అతిశయించిన, తాత్పర్యమున=భక్తితో, శుభదర్శనుని= దివ్యదర్శనముగల, రాజశేఖరు=రాజశ్రేష్ఠుడైన, రఘునాధున్=రాముని, తలచుచు=తలపోయుచు, అనుపమ=గొప్పదైన, భూయః=మరియు, సమాధిన్= సమాధి స్థితిలో, తలిర్చెన్=నిలిచెను.

తాత్పర్యము : ఆ శరభంగ మహర్షి తన మనస్సులో మిక్కిలి అతిశయించిన భక్తితో శుభదర్శనుడు, రాజశ్రేష్ఠుడునైన ఆ రాముని తలచుచు గొప్పదైన సమాధిలో నిలిచెను.

భారత : అతడు=అర్జునుడు, తన మనమున నెంతయు మించిన తాత్పర్యమున, రాజశేఖరు=ఈశ్వరుని, శుభదర్శను, నిరఘున్=నిష్కల్మషమైన వానిని, నాధుని

తలచుచు=ఈశ్వరుని తలపోయుచు, అనుపమ భూయస్సమాధి తలర్చెన్.

తాత్పర్యము : అర్జునుడు తన మనస్సులో అధికమైన తాత్పర్యముతో శుభదర్శనుడు నిష్కల్మషుడైన ఆ ఈశ్వరుని, (నాధుని) తలపోయుచు గొప్ప తపస్సమాధిలో నిలిచెను.

చం. అతఁడును దత్తపోమహిమయచ్చటిమౌనులు వచ్చి చెప్పఁగా
నతికుతుకంబునన్ వినుచు నచ్చటికిం జనియెం బరాజితో
ద్ధతివిలసద్వయోమృగయుతన్ వనలక్ష్మి నశేషలోకసం
స్తుతగుణకున్ ధరాత్మజకుఁ జూపియుఁ జెప్పియు వేడ్కసేయుచున్.

రామా : అతడును=ఆ రాముడును, తత్+తపోమహిమ=ఆ తపస్సు గొప్పదనమును, అచ్చటిమౌనులు=అక్కడి మునులు, వచ్చి చెప్పగా, అతికుతకంబునన్= మిక్కిలి ఉత్సాహముతో, వినుచు, అచ్చటికిన్, చనియెన్=వెళ్లెను. పరిజిత=లేని (తిరస్కరింపబడిన) ఉద్ధతి=వైరముగలవై, విలసత్=ఒప్పెడి, వయః=మృగములతో (పక్షులతో) యుతన్=కూడిన, వనలక్ష్మిన్=శరభంగాశ్రమవిలాసమును, అశేషలోక సంస్తుతగుణకున్=మిక్కిలిగా లోకముచే పొగడబడు గుణములగల, ధరాత్మజకు= సీతకు, చూపియు, చెప్పియు, వేడ్క+చేయుచున్=వేడుక కలిగించుచు.

తాత్పర్యము : ఆ రాముడును ఆ శరభంగుని తపోమహిమను గూర్చి అక్కడి మునులు వచ్చి చెప్పగా మిక్కిలి ఉత్సాహముతో వినుచు అచ్చటికి వెళ్లెను. పరస్పర వైరములేని మృగములు, పక్షులతో గూడిన ఆ ఆశ్రమ విలాసమును మిక్కిలి స్తుతి పాత్రురాలైన సీతకు చూపుచు, చెప్పుచు వేడుక కలిగించుచు – సాగెను.

భారత : అతడును=ఈశ్వరుడును, తత్=ఆ అర్జునుని, తపోమహిమ, అచ్చటి మౌనులు వచ్చి చెప్పగా, అతికుతుకంబునన్ వినుచు నచ్చటికిన్ చనియెన్=ఆ అర్జునుని ఆశ్రమసమీపమునకు వెళ్లెను, పర=పరులచేత, అజిత=నివారింపబడని, ఉద్ధతి=ఔద్ధత్యముచేత, విలసత్=ఒప్పుచున్న, వయః=ప్రాయముగల, మృగయుతన్= కిరాతత్వముచే, వనలక్ష్మిని=ఆశ్రమ సంపదను, ధరాత్మజకున్=పార్వతికి, చూపియు,

చెప్పియు, వేడ్క సేయుచున్.

తాత్పర్యము : ఈశ్వరుడును ఆ అర్జునుని తపోమహిమను గూర్చి అచ్చట మునులు వచ్చి చెప్పగా మిక్కిలి కుతూహలముతో వినుచు ఆ అర్జునుని ఆశ్రమ సమీపమునకు పరులచే నివారింపబడని ఔద్ధత్యముచే నొప్పు ప్రాయముగల కిరాత రూపముతో ఆ ఆశ్రమ సంపదను పార్వతికి చూపి, చెప్పి, వేడ్కసేయుచు - సాగెను.

విశేషణము : ధరాత్మజ - ఆహార్యధరపర్వతాః అని అమరము
ధర : భూమి, ధర=పర్వతము.

చం. వలసినవన్యవర్తన మవార్యగతిన్ జరిగింపుచుం బ్రవ
ర్ధిలుతమిఁ బేర్చుతమ్మునియతిస్థిరభక్తిఁ బ్రమోదసంపదల్
దలకొనఁగా నరణ్యచరతన్ భజియించి యతండుముఖ్యభృ
త్యులమరసంయముల్ ముదముతో మది మ్రొక్క నటించె మర్త్యతన్

రామా : అతఁడు=శ్రీరాముడు, వలసిన=కావలసిన, వన్యవర్తనము= కందమూల ఫలాదికమును, అవార్యగతిన్=తప్పనిసరిగా, జరిగింపుచున్=ఆహారముగా చేసికొనుచు, ప్రవర్ధిలుతమిన్=అధికారముచే, పేర్చునట్టి, తమ్ముని=లక్ష్మణుని యొక్క, అతిస్థిరభక్తిన్=చంచలముగాని భక్తిచే, ప్రమోద సంపదల్=సంతోషాతిశయము, తలకొనగా=కలుగగా, అరణ్యచరతన్=వనసంచారమును, భజియించి=చేకొని, ముఖ్యభృత్యులు=ఆత్మసేవకులైన, అమర సంయముల్=దేవమునులు, ముదముతో= సంతోషముతో, మదిమ్రొక్కన్=మనసులందే మొక్కగా, మర్త్యతన్= మానవునివలె, నటించె=నటించెను.

తాత్పర్యము : శ్రీరాముడు కావలసిన కందమూల ఫలాదులను ఆహారముగా చేసికొని అధికారముచే లక్ష్మణుని స్థిరభక్తిచే సంతోషాతిశయము కలుగగా వనసంచారమును చేకొని ఆత్మసేవకులైన దేవమునులు సంతోషముతో మనసులందే మొక్కగా మానవునివలె నటించెను.

భారత : అతడు=శివుడు, వలసిన, వన్యవర్తనము=వనవిహారము, అవార్యగతిన్=తప్పనిసరియై, జరిగింపుచున్=జరుపుచు, ప్రవర్ధిలుతమి పేర్చు, తమ్ము=తమను, నియతిస్థిరభక్తి=నియమపూర్వకమైన నిశ్చలభక్తితో, ప్రమోద సంపదల్ తలకొనగా=సంతోషము కలుగగా, అరణ్యచరతన్=కిరాతత్వమును, భజియించియ= పొందిన వారైన, తండు ముఖ్యభృత్యులు=నంది మొదలైన ప్రముఖ సేవకులు, అమరన్=కలుగగా, మర్త్యతన్=మనుష్యరూపమును, సంయముల్=మునులు, ముదముతో మది మ్రొక్క నటించె.

తాత్పర్యము : శివుడు వనవిహారము తప్పనిసరియై జరుపుచు అధికార వశముచే తమను నియమపూర్వకముగా సంతోషము కలుగునట్లు కిరాతత్వము పొందిన నంది మొదలైన ప్రముఖ సేవకులు తోడు రాగా తన మనుష్యరూపమును మునులు సంతోషముతో మనసులో మొక్కగా నటించెను.

విశేషణము : తండు – తండు నందినౌనందికేశ్వరే – అని అమరము.

వ. అది య ట్లుండె నట్టి సమయంబున 41

తాత్పర్యము : అది అట్లుండగా ఆ సమయములో.

చం. బిరుదునఁ బేర్చు దేవరిపుభీమవరాహవపుష్క రాక్షసుం
దరసవిశేషథామసముదంచితసత్త్వమయాంగ రాజకుం
జరకుధరాకృతిం బ్రబలుసర్వపలాశిచయంబు గూల్చుసు
స్థిరునినుమావిభుం డనుమతిన్ వెనుదౌలెదమాదరంబునన్. 42

రామా : బిరుదునపేర్చు=ఖ్యాతివహించి, దేవరిపుభీమ=రాక్షసులకు భయము కల్గించు, వరాహవ=లెస్సయుద్ధముగలవాడా, (వర+ఆహవ), పుష్కరాక్ష=రాజీవాక్షా! పూజితములై, సత్త్వమయ=సాత్వికగుణ ప్రధానమైన, అంగ=అంగములుగలవాడా! రాజకుంజర=రాజశ్రేష్ఠుడా!, కుధర+ఆకృతిన్=పర్వతాకారముచే, ప్రబలు= అతిశయించిన, సర్వపలాశిచయంబు=రాక్షససమూహమును, కూల్చు సుస్థిరు=సంహరించు నిశ్చలమైన, నిను=నిన్ను, మావిభుండను=మాధవుడను,

మతిన్=మదిలో, ఆరదంబునన్=ఆదరముతో, వెనుతౌలెదము=అనుసరించెదము.

తాత్పర్యము : రాక్షసులకు భయము కలుగజేయువాడని బిరుదు వహించిన ఓ రాజీవాక్షా! సుందరమై, విశేష తేజస్సు కలిగి, పూజితమై, సాత్త్వికగుణ ప్రధానమైన అంగములు గల ఓ రాజశ్రేష్ఠా! పర్వతాకారముచే అతిశయించిన రాక్షస సమూహమును సంహరించు నిశ్చలమైన నిన్ను మాధవుడను తలంపుతో మేము ఆదరముతో అనుసరించెదము.

భారత : దేవ=దేవతలకు, రిపు=శత్రుడైనవానిని, బిరుదున పేర్చు, వరాహపుష్క=సూకరాకార్థము కలిగిన, రాక్షసున్=మూకాసురుని, తరస=మాంసము యొక్క, విశేష=భేదమునకు (కొవ్వునకు) ధామ=స్థానమైన, సముదంచిత= ప్రకాశించుచున్న, సత్త్వమయ=బలప్రచురమైన, అంగరాజకున్=శరీర శ్రేష్ఠముగల వానిని, చర=చలించెడి, కుధరాకృతిన్=పర్వతాకారముచే, ప్రబలువానిని, సర్వపలాశి చయంబు=సమస్త వృక్షసమూహమును, కూల్చు సుస్థిరుని=పడగొట్టు స్థిరసంకల్పుని, ఉమావిభుండు=శివుడు, దమ=అణచెడి, అనుమతిన్=అనుతలంపుతో, ఆదరంబున్=ఆలోచనతో, వెను+తౌలెను=వెంబడించెను.

తాత్పర్యము : రాక్షసులలో బిరుదుమగడై సూకరాకారములో వచ్చి మూకాసురుని, బాగా క్రొవ్వి బలప్రాచుర్యముచే, శరీర శ్రేష్ఠతచే చరించుచు పర్వతాకారముతో ప్రబలువానిని, సమస్త వృక్షసమూహమును పడగొట్టు స్థిర సంకల్పుని శివుడు అణచెడి తలపుతో వెంబడించెను.

సీ. అని కోర్కిమీఱ నిజాలోకవరు లతీ
తాశ్రమాలయులు దన్ననుసరింప
నవనిభూదారానుయానోచితాధ్వని
క్షిప్తాంఘ్రిగతులను జెన్ను మిగుల
నాత్మభక్తునిసత్త్వ మరసి ప్రోచుటకు రా
జవతంసుఁ డట్లు వత్సలత నేఁగి

యావనక్రోడంబు నం దాతపస్వియుఁ
దానును గూడ సత్ఫలత నొప్పు

తే. నంబకము లేసిరి వహించె నది తదుభయ
సంగ రాగమనోర్జితోత్సవధురాని
మిత్తతఁ గరంబు నుతి గాంచి మించె నప్పు
డొగిఁ దదన్యోన్యజన్యముద్ద్యోతి యగుచు 43

రామా : అని=ఇట్లు, కోర్కిమీఱ=కోరిక మించగా, నిజాలోకవరులు=తనను చూచు శ్రేష్ఠులు, అతీత+ఆశ్రమాలయులు=విడువబడిన ఆశ్రమములు, ఆలయములుగలవారు, తన్ను=రాముని అనుసరించు, అవనిభూ=సీత యొక్క, ఉదార+అనుయాన=సముచితముగాకూడి వచ్చు, ఉచిత=ఉచితమైన, అధ్వ=మార్గమున, నిక్షిప్త=పెట్టబడిన, అంఘ్రి=పాదముల, గతులను=నడకలతో, చెన్నుమిగులు=ప్రకాశింపగా, ఆత్మభక్తుని=శరభంగుని, సత్త్వము=సత్త్వగుణమును, అరసిప్రోచుటకు=చూచి రక్షించుటకు, అట్లు రాజవతంసుడు=ఆ రాముడు, వత్సలతనేగి=ప్రేమతో వెళ్లి, ఆవన క్రోడంబునందు=ఆ వనమధ్యములో, ఆ తపస్వియు=ఆ శరభంగుడును, తానునుగూడ=రాముడు గూడ, సత్ఫలతనొందు=లెస్సఫలముగల, అంబకములేసిరి=కన్నులుగలవారైరి, అది=తత్+ఉభయ=వారిరువురి, సంగరాగ=కలయికవలన అనురాగముగల, మనః=మనస్సుచే, ఆర్జిత=సంపాదింపబడిన, ఉత్సవధురా=ఉత్సవాతిశయమునకు, నిమిత్తతన్=సూచకమగుటచే, తత్=ఆ శరభంగరాముల యొక్క, అన్యోన్యజన్య=ఒకరికొకరి వలన పుట్టిన, ముత్=సంతోషముచే, ద్యోతియగుచున్=ప్రకాశించునదై, అప్పుడు, కరంబు నుతిగాంచి=మిక్కిలి ప్రశస్తి కలిగి, మించె=మించెను.

తాత్పర్యము : అని కోర్కె మీరునట్లుగా తనను చూచు శ్రేష్ఠులు, ఆలయములు ఆశ్రమములు వదలి నివసించువారైన మునులు తననను సరింపగా సీత తనతో కూడ వచ్చుటకు ఉచితమైన ఉదార మార్గములో ఉంచబడిన పాదగతులచే ప్రకాశించునట్లుగా శరభంగమహర్షి సత్వగుణమును తెలిసి రక్షించుటకు రాముడు

ఆ విధముగా వాత్సల్యముతో వెళ్లి ఆ వనమధ్యములో ఆ తపస్వి, తాను పరస్పరాలోకనము చేసికొని సఫలత నొందిరి. వారిరువురి చూపుల కలయిక వలన కలిగిన సంతోషముచే ప్రకాశించుచున్న ఆ ఉత్సవము ప్రస్తుతి కెక్కెను.

భారత : అని=యుద్ధమందుగల, కోర్కె మీఱన్=కోరిక అధికము కాగా, నిజాలోకపరులు, అతీత=విడువబడిన, ఆశ్రమములు, ఆలయములు, తన్ను, అనుసరింప, భూదార=వరాహము యొక్క, అనుయాన=వెంబడి పోవుటకు, ఉచిత=ఉచితమైన, అధ్వని=ధ్వని లేకుండునట్లుగా, క్షిప్త=పెట్టబడిన, అంఘ్రిగతులను=పాదగమనముతో, చెన్నుమిగుల, ఆత్మభక్తుని=అర్జునుని, సత్వమరసి ప్రోచుటకు, రాజవతంసుడు=శివుడు, అట్లు, వత్సలతనేగి, ఆ వనక్రోడంబునందున్=ఆ అడవి పందియందు, ఆ తపస్వియు=ఆ అర్జునుడు, తానును=శివుడు కూడ, సత్ఫలతనొందు=మంచి ముల్లులుగల, అంబకములు=బాణములను, ఏసిరి. అది=ఆ పంది, తదుభయ=వారిరువురి, సంగర=యుద్ధము యొక్క, ఆగమన=రాక అను, ఉత్సవధురా=ఉత్సవాతిశయమునకు, నిమిత్తతన్=కారణమును, వహించెను, తత్=ఆ కిరాతార్జునుల యొక్క, అన్యోన్యజన్యము=పరస్పర యుద్ధము, బగి=అప్పుడు, ఉద్యోతియగుచున్=ప్రకాశించుచున్నదై, కరంబు, నుతిగాంచి మించె.

తాత్పర్యము : యుద్ధమునందు కోర్కె మీరగా విడువబడిన ఆశ్రమములు, ఆలయములు గల మునులు తనను అనుసరింపగా వరాహము వెంట బోవుటకు సరిపడునట్లు ధ్వని లేకుండునట్లుగా పెట్టబడిన పాదగమనముచే ప్రకాశించునట్లు అర్జునుని బలము పరీక్షించి రక్షించుటకు శివుడు వాత్సల్యముతో వెళ్లెను. ఆ అడవిపందిపై అర్జునుడు, శివుడు బాణములు వేయుటలో సఫలురైరి. ఆ పంది వారిద్దరి యుద్ధపు రాకను, ఉత్సవాతిశయమునకు కారణత్వము వహించెను. అప్పుడు వారి పరస్పర యుద్ధము ప్రకాశించునదై స్తుతి పాత్రమాయెను.

విశేషణము : భూదార – క్రోడోభూదార ఇత్యపి అని అమరము.

జన్యము – యుద్ధమాయోధనం జన్యమ్ – అని అమరము.

వ. వార లిద్దఱు గొంతతడవు 44

తాత్పర్యము : వారిద్దరు కొంతసేపు

కం. నుతసత్త్వాధికరణలస
దిత రేతరజాత్యుచితసమిద్ధసపర్యా
యతిరోహితభావు లగుచు
ధృతి నెరపుచు ధర్మపటిమ దృఢత నెరపుచున్. 45

రామా : నుత=ప్రశంసింపదగినట్లుగా, సత్త్వ=సత్త్వగుణమును, అధికరణ=స్థానమైనదై, లసత్=ఒప్పుచున్న, ఇతరేతరజాతి=అన్యోన్యబ్రహ్మక్షత్రజాతులకు, ఉచిత=తగిన, సమిద్ధ=ప్రదీప్తమైన, సపర్య=పూజలయొక్క ఆ యతి=నిడివి యందు, రోహిత=మొలిపింపబడిన, భావులగుచును=తాత్పర్యము గలవారై, ధృతి=సంతోషమును, నెరపుచు=చూపుచు, ధర్మపటిమ=ధర్మాతిశయము యొక్క, దృఢత=గొప్పదనమును, నెరపుచున్.

తాత్పర్యము : ప్రశంసార్హముగా సత్త్వముగణమునకు స్థానమైనదై యొప్పు అన్యోన్యబ్రాహ్మణక్షత్రియజాతులకు తగిన ప్రదీప్తమైన పూజల దీర్ఘత్వముచే సృష్టించబడిన తాత్పర్యముగలవారై సంతోషించుచు ధర్మాతిశయము యొక్క గొప్పదనమును నెరపిరి.

భారత : నుతసత్త్వ=వర్ణింపదగిన బలముగల, అధికరణ=గొప్ప యుద్ధముచే, లసత్, ఇతరేతరజ=ఒకరికొకరి వలన పుట్టిన, అత్యుచిత=మిక్కిలి తగిన, సమిద్ధ, సపర్యాయ=పర్యాయముతో గూడిన, తిరోహితభావులగుచు=ఓటమి గలవారై, ధృతి=ధైర్యమును, నెరపుచు, ధర్మపటిమ=వింటి నేర్పు యొక్క, దృఢత=దారుఢ్యమును, నెరపుచు.

తాత్పర్యము : వర్ణింపదగిన బలముగల గొప్ప యుద్ధముచే ప్రకాశించుచు, ఒకరికొకరి వలన పుట్టిన, మిక్కిలి తగిన ప్రకాశించు పర్యాయముతోగూడిన ఓటమి గలవారై ధైర్యమును చూపుచు వింటి నేర్పరితనములో దృఢత్వమును చూపిరి.

వ. ప్రవర్తిల్లి రయ్యవసరంబున. 46

ఆ+అవసరంబున=ఆ సమయమున, ప్రవర్తిల్లిరి=ప్రకాశించిరి.

మ. అరుదార న్నరభావవిస్ఫురితశౌర్యాలోకఖేలన్మనో
హరమాహాత్మ్యము మీఱ లుబ్ధకరణవ్యావర్తనాశక్తిని
ర్భరుఁ డై తాపసుఁ డంపలేమిఁ బ్రకటింపం జూచి యీరాట్కులా,
భరణం బిందునె చిక్కునో యని నిలింపవ్రాత మెంచెన్మదిన్. 47

రావమా : అరుదారన్=అరుదుగా, నరభావ=మనుష్యత్వముచే, విస్ఫురిత=ప్రకాశించెడి, శౌరి=రాముని యొక్క (విష్ణువు), ఆలోక=సందర్శనమనెడి, ఖేలన్=క్రీడచే, మనోహర మాహాత్మ్యము మీఱన్=అందమైన మహత్వము మెరయగా, లుబ్ధ=ఎడబాయజాలని, కరణ=ఇంద్రియముయొక్క (లోభముయొక్క), వ్యావర్తన+అశక్తిని=త్రిప్పుట యందుగల శక్తి హీనతచే, నిర్భరుడై=అధికముగాగలవాడై, తాపసుడు=శరభంగుడు, అంపలేమిన్=పంపలేకుండుటను, ఈరాట్+కులాభరణంబు=ఈ రామచంద్రుడు, ప్రకటింపన్+చూచి=తెలియజేయుటకై, ఇందునె=ఇక్కడనే, చిక్కునోయని=చిక్కిపోవునేమోయని, నిలింపవ్రాతము=దేవతాసముదాయము, ఎంచెన్=భావించెను.

తాత్పర్యము : అరుదుగా మనుష్యమహత్వముచే ప్రకాశించెడి రాముని సందర్శనాక్రీడచే మనోహరమైన మహత్వము మెరయగా ఎడబాయజాలని లోభత్వమను శక్తిహీనత అధికమై శరభంగుడు పంప లేకుండుటను ఈ రామచంద్రుడు తెలియజేయుటకై ఇక్కడ చిక్కుబడిపోవునేమోయని దేవతలు భావించిరి.

భారత : అరుదారన్, నర=అర్జునుని, భావ=భావమునందు, విస్ఫురిత శౌర్య=ప్రకటితమైన పరాక్రమము, ఆలోక=పరీక్షయందు, ఖేలత్=విహరించుచున్న, మనః=మనస్సుగల, హర=శివుని యొక్క, మాహాత్మ్యము మీఱగా=జయము ప్రకాశింపగా, లుబ్ధక=కిరాతరూపములోనున్న శివుని, రణ=యుద్ధమును, వ్యావర్తన=మార్చుటయందుగల, అశక్తి=శక్తిరాహిత్యముచే, నిర్భరుడై=

అతిశయములేనివాడై, తాపసుడు=అర్జునుడు, అంపలేమిన్=అమ్ముల యొక్క లేమిని ప్రకటింపన్, ఈ రాట్+కులాభరణంబు=అర్జునుడు, ఇందునె=బాణములు లేకపోవుటచే, చిక్కునోయని నిలింపవ్రాతమెంచెన్, మదిన్.

తాత్పర్యము : అరుదగునట్లు అర్జునుని యొక్క భావమందు ప్రకటితమైన పరాక్రమ పరీక్షలో విహరించుచున్న మనస్సుగల శివుని యొక్క జయము మీరగా కిరాత రూపములోనున్న హరుని యుద్ధమును మార్చు శక్తిరాహిత్య భారముగలవాడై అర్జునుడు బాణములు లేకపోవుటను ప్రకటింపగా, ఈ అర్జునుడు బాణములు లేకపోవుటచే చిక్కుబడునేమోయని దేవతల సముదాయము మనస్సులో భావించిరి. (బాణములు పొదిలో వెదకగా లేకపోయెను)

విశేషణము : లుబ్ధక-మృగయుర్లుబ్ధకశ్చపః అని అమరము.

కం. తనకును శరభంగమునీ
శునకు సమరసత్వభరము సొరిది నొదవుచుం
దనరుట గడు నెన్ని కలం
గని ప్రబల ధృతిం దనర్చు క్షత్త్రియుఁ డంతన్. 48

రామా : తనకును, శరభంగమునీశునకు, సమ=సమానమైన, రసత్వభరము= అనురాగాతిశయము, సొరిది నొదవుచున్=మిక్కిలి అందముగా, తనరుటన్+ కడు=ఉండుటచే మిక్కిలి, ఎన్నికలన్=కొనియాడుటచే, కని=చూచి, ప్రబలధృతిన్= అధికసంతోషముతో, తనర్చు=కూడిన, క్షత్రియుడు=రాముడు, అంతన్=అంతట.

తాత్పర్యము : తనకు శరభంగ మహర్షికి సమానమైన అనురాగాతిశయము మిక్కిలి అందముగా నుండుటచే కొనియాడుటను చూచి అధిక సంతోషముతోకూడిన రాముడు అంతట.

భారత : క్షత్రియుడు=అర్జునుడు, తనకును, శరభంగము=బాణములు లేకపోవుట, ఈశునకు=శివునకు, సమరసత్వభరము=సమానతను కూర్చగా సొరిదినొదవుచు, తనరుట, గడున్, ఎన్ని=గణించి కలంగని=చలింపని, ప్రబల ధృతిన్=తనర్చు, అంతన్.

తాత్పర్యము : అర్జునుడు తనకును బాణములు లేకపోవుటకు ఈశ్వరునకు సమానతను కూర్చగా, మిక్కిలి తనరగా గణించి, చలింపని అధికమైన సంతోషముతోకూడి అంతట.

సీ. అతిదృఢం బైనట్టి యాత్మసఖ్యాతిచా
పలత యెంతయుఁ దనబలిమిఁ ద్రిప్పి
ఘనతేజు నమ్మహాత్ముని నీకు నలబ్రహ్మ
కట్టడ యెట్లట్ల కాక దాఁట
నగునె పొమ్మనుచుఁ దా ననిపెనుగడఁక మొ
త్తంబై నిలింపసంఘంబు విరులు
గురిసె నప్పుడు నిజస్థిరచండహేతిపా
తమునవికారలేశముఁ బొరయక

తే. మెఱయునారణ్యకేంద్రుపై మెచ్చుదనర
నర్హగతివిధిఁ జేరంగ నరిగె నాస
మిద్ధశౌర్యుఁడు శుభమౌనియుద్ధవశత
ఘనపదవి నెల్లఖచరులు వినుతిసేయ. 49

రామా : అతిదృఢంబు+ఐనట్టి=మిక్కిలి గట్టిదైన, ఆత్మ=తన యొక్క, సఖ్య=చెలిమియందుగల, అతిచాపలత=మిక్కిలి చపలత్వమును, ఎంతయు=ఎంతో, తన బలిమిన్=తన బలముతో, త్రిప్పి=మరలించి –

రాముడనెడి మాట :

ఘనతేజో=గొప్పతేజముగలవానిని, ఆ+మహాత్ముని=ఆ శరభంగునితో – నీకు, అల=ఆనాడు, బ్రహ్మ కట్టడ=బ్రహ్మ దేవుని ఆజ్ఞ, ఎట్ల=ఎట్లో, అట్ల=ఆవిధముగా, కాక=కాకుండ, దాటనగునె=అతిక్రమించగలమా? అనుచు=అని చెప్పుచు, తాను=రాముడు, కడక+అనిపెను=ప్రయత్నపూర్వకముగా పంపెను. నిజ=తన,

స్థిర=నిత్యకృత్యమైన, చండ=తీవ్రమైన, హేతి=అగ్నిహోత్రుని యందు (ఔపోసనాగ్నియందు) పాతమునన్=ప్రవేశించుటచే, వికార లేశమున్=ఏ విధమైన కొద్దిపాటి వికారము, పొరయక=పొందక, మెఱయు=ప్రకాశించు, ఆరణ్యక+ఇంద్రుపై=మునిశ్రేష్ఠుడైన శరభంగుని మీద, నిలింపసంఘంబు=దేవతల సమూహము, మొత్తంబై=అందరు, అప్పుడు, మెచ్చుదనర=సంతోషముతో, అర్హగతిన్=తగిన క్రమముచే, విధిన్=బ్రహ్మదేవుని, చేరంగన్=చేరుచుండగా, విరులుకురిసె=పుష్పములు కురిపించిరి. ఆసమిద్ధశౌర్యుడు=ప్రదీప్తమైన పరాక్రమముగల రాముడు, శుభమౌని=శరభంగుని యొక్క, ఉద్ధవ=సంతోషముల, శత=అధికతచే, ఘనపదవిని=గొప్పపదవిని, ఎల్లఖచరులు=ఆకాశగాములందరు, వినుతిసేయ=పొగడగా, అరిగె=వెళ్లెను.

తాత్పర్యము : మిక్కిలి గట్టిదైన తన చెలిమియందు మిక్కిలి చాపల్యమును ఎంతయు బలముతో మరలించి : గొప్ప తేజముగల ఆ శరభంగమునితో – రాముడనుచున్నాడు నీకు ఆనాడు బ్రహ్మదేవుని ఆజ్ఞ ఏవిధమో ఆ విధముగా కాకుండ అతిక్రమించగలమా అని చెప్పుచు ఆ రాముడు ప్రయత్న పూర్వకముగా పంపెను. తన నిత్యకృత్యమైన తీవ్రమైన అగ్నిహోత్రుని యందు ప్రవేశించుటలో ఏవిధమైన వివాదము పొందక ప్రకాశించు మునిశ్రేష్ఠుడైన శరభంగుని మీద దేవతలు పుష్పములు గురిపించిరి. అప్పుడు సంతోషముతో తగిన క్రమముతో బ్రహ్మదేవుని చేరుచుండగా (పుష్పములు గురిపించిరి). మిక్కిలి పరాక్రమముగల రాముడు శరభంగుడు సంతోషాధిక్యముతో గొప్ప పదవిని పొందుటను చూచి దేవతలు పొగడగా వెళ్లెను.

(రాముడు శరభంగునికి ముక్తి ననుమతించి, ఆ ముని దివ్యపుష్ప వర్షముతో బ్రహ్మలోకమునకు వెళ్లుచుండగా తాను సుతీక్ష్ణుని ఆశ్రమమునకు సాగి వచ్చెను).

భారత : అతిదృఢంబైనట్టి, ఆత్మ, సఖ్యాతి=ఖ్యాతితో గూడిన, చాపలత=ధనుర్లతను (గాండీవమును), ఎంతయు, తనబలిమి=తన బలిమిచే, త్రిప్పి=విసిరి, అమ్మహాత్మునిన్=ఈశ్వరుని, నీకు, బ్రహ్మకట్టడ=బ్రహ్మవ్రాత, ఎట్ల, అట్ల కాక, దాటన్+అగునె పొమ్మనుచున్=(అణగునట్లుగా) అతిక్రమింపగలదె పొమ్మని,

తాను=అర్జునుడు, అని=చెప్పి, పెనుగడకన్=యుద్ధమునందలి అధికరోషముచే, మొత్తన్=కొట్టగా, పైన్=అర్జునునిపై నిలింపసంఘంబు విరులుగురిసె, నిజస్థిరచండహేతి=తన గాండీవము యొక్క, పాతమునన్=దెబ్బచే, మెఱయుచున్న, ఆరణ్యకేంద్రుపైన్=కిరాతునిపై (ఈశ్వరునిపై) మెచ్చుదనరగా, అర్హగతివిధిన్=సమయోచితరీతిలో, (వేగిరముగా) ఆ సమిద్ధశౌర్యుడు=అర్జునుడు, శుభమౌ=శుభమగునట్టి, నియుద్ధవశతన్=బాహుయుద్ధపరతచే, ఘనపదవిన్=ఆకాశ మార్గములో, ఎల్లఖచరులు=దేవతలందరు, వినుతి సేయగా=ప్రస్తుతించగా, చేరంగనరిగె.

తాత్పర్యము : అతి దృఢమైన తన ఖ్యాతి వహించిన గాండీవమును మిక్కిలి బలముగా విసిరి ఈశ్వరునితో ఇట్లనెను : నీకు బ్రహ్మవ్రాత ఎట్లో అట్లుగాక దాటుటుకు శక్యమా? అని చెప్పి అర్జునుడు యుద్ధమునందలి అధిక రోషముచే కొట్టగా అర్జునునిపై దేవతా సంఘములు పూలు కురిపించిరి. తన గాండీవము యొక్క దెబ్బతో కిరాతుడు మెచ్చుదనరగా వేగిరముగా అర్జునుడు శుభంకరమైన బాహుయుద్ధ నైపుణ్యమును చూపెను. దేవతలందరు ప్రస్తుతించుచు అతనిని సమీపించిరి.

విశేషణము : హేతి - రవేరర్చిశ్చశస్త్రంచవహ్నిజ్వాలాచహేతయః - అని అమరము.

వ. అంత. 50

శా. మాయామర్త్యుఁడుమాధవుం డవిచల న్మైత్రిన్ సుతీక్ష్ణాశ్రమ
స్ఫాయత్సత్త్వవిహారమప్రవిశదీషద్ద్వేషరోషాంకురం
బై యేపారఁగఁ జూచుచుం బరువడిన్ హర్షోదయం బెక్కఁగా,
జాయం దమ్మునిరూఢదృష్టిఁ గన భ్రూసంజ్ఞన్ నియోగించుచున్.

రామా : మాయామర్త్యుడు=మాయతో మానవుడైన, మాధవుడు=రాముడు, అవిచలత్=దృఢమైన, మైత్రిన్=స్నేహముతో (అర్జునునిపై), సుతీక్ష్ణ+ఆశ్రమమందు=సుతీక్ష్ణుని ఆశ్రమమున, స్ఫాయత్=వృద్ధి పొందుచున్న, సత్త్వ=జంతువుల యొక్క,

విహారము=సంచారము, ప్రవేశత్=ప్రవేశములేని, ఈషత్+ద్వేష రోషాంకురంబై=కొద్దిపాటి ద్వేషరోషములను కలిగించునట్లు, ఏపారగా=ప్రకాశింపగా, చూచుచున్, పరువడిన్=మిక్కిలి, హర్షోదయం బెక్కగా=సంతోషము కలుగగా, జాయన్=సీతను, తమ్ముని=లక్ష్మణుని, భ్రూసంజ్ఞన్=కనుబొమల సంజ్ఞచే, రూఢదృష్టిన్=సావధాన దృష్టితో, నియోగించుచున్+కన=ఉండునట్లు చూడగా.

తాత్పర్యము : మాయామానవుడైన రాముడు స్థిరమైన స్నేహభావముతో సుతీక్ష్ణాశ్రమములో వృద్ధి పొందుచున్న జంతువుల సంచారమును, ప్రవేశములో కొద్దిపాటి ద్వేషరోషములు లేనివిగా చూచుచు సంతోషము కలుగగా సీతను, లక్ష్మణుని తన కనుబొమల సంజ్ఞచే గమనించుచు.

భారత : మాయామర్త్యుడు=మాయా కిరాతరూపము ధరించిన, ఉమాధవుండు=శివుడు, అవిచలత్=చలింపని, మైత్రిన్=అర్జునుని మీది స్నేహముచే, సుతీక్ష్ణ=తీక్షణమైన, అశ్రమ=శ్రమలేని, స్ఫాయత్=పెరుగుచున్న, సత్వ=బలము యొుక్క, విహారము=పెనుగులాటను, అప్రవిశత్=ప్రవేశింపని, ఈషత్+ద్వేషరోషాంకురమై, ఏపారగా, చూచుచున్, పరువడిన=అర్జునుని వడిచేత, జాయన్=పార్వతిని, తమ్మున్=అర్జునుని, శివుని, నిరూఢదృష్టిన్=సావధాన దృష్టితో, కనన్=చూచునట్లు భ్రూసంజ్ఞన్, నియోగించుచున్ –

తాత్పర్యము : మాయా కిరాతరూపముననున్న శివుడు చలింపని అర్జునుని మీది మైత్రిచే తీక్షణము, శ్రమరహితమై పెరుగుచున్న బలిమి యొుక్క పెనుగులాటతో ప్రవేశింపని కొద్దిపాటి ద్వేషరోషములుగల అర్జునుని వడిచే పార్వతిని తమను (అర్జునుని, శివుని) సావధాన దృష్టితో చూచునట్లుగా తన కనుబొమల సంజ్ఞచే నియోగించుచు –

కం. ప్రీతి దనర భూరితప
శ్చాతుర్యసుతీక్ష్ణసత్త్వసందర్శనసం
జాత మగువేడ్క యంతటఁ
జేతోరంజనము మిగులఁ జేయ నలరుచున్. 52

రామా : ప్రీతిన్+తనర=ప్రీతి కలుగునట్లుగా, భూరితపస్+చాతుర్య=గొప్ప తపో సంపద చాతుర్యముచే, సుతీక్ష్ణ=సుతీక్ష్ణుని యొక్క, సత్త్వసందర్శన=సత్త్వగుణము యొక్క దర్శనముచే, సంజాతమగు=కలిగిన, వేడ్క=వేడుక, అంతటన్=ఎంతయు, చేతః+రంజనము=మనస్సుకు ఆనందమును, మిగులన్+చేయ=కలిగించగా, అలరుచున్=సంతోషించుచు.

తాత్పర్యము : సుతీక్ష్ణుని గొప్ప తపోదీక్ష ప్రీతి కలుగునట్లు చేయగా, ఆ సత్త్వగుణ దర్శనముచే కలిగిన వేడుక అంతటను మనస్సుకు మిక్కిలి ఆనందము కలిగించగా సంతోషించుచు.

భారత : ప్రీతిదనర, భూరితపశ్చాతుర్య=అర్జునుని గొప్ప తపోచాతుర్యము, సుతీక్ష్ణ=తీవ్రమైన, సత్త్వ=బలిమి యొక్క, సందర్శన, సంజాతమగు, వేడ్క, అంతట, చేతోరంజనము మిగుల చేయనలరుచున్.

తాత్పర్యము : అర్జునుని గొప్ప తపోచాతుర్యము ప్రీతి కలిగించగా, తీవ్రమైన అతని బలప్రదర్శనము వలన కలిగిన వేడుక మనస్సునకు ఆనందమును కలిగింపగా సంతోషించుచు –

కం. భద్రగతి నరుగ లోపా
ముద్రానందస్వరూపమునిదర్శితని
ర్ఛిద్రప్రసన్నతాసం
పద్రుచిరత మెఱయ నేత్ర పర్వ మొనర్చెన్. 53

రామా : భద్రగతిన్=మంచి గమనముచే, అరుగన్=వెళ్ళగా, లోపాముద్రానంద స్వరూపముని=లోపాముద్రకు ఆనంద స్వరూపుడైన అగస్త్యుడు, దర్శిత=చూపబడిన, నిర్ఛిద్ర=స్పష్టమైన, ప్రసన్నతా సంపత్=ప్రసన్నమైన సంపదయొక్క, రుచిరత మెరయన్=ప్రకాశింపగా, నేత్రపర్వ మొనర్చెన్=కనుపట్టెను.

తాత్పర్యము : మంచి గమనముచేత శ్రీరాముడు వెళ్ళగా లోపాముద్రకు ఆనందమును గూర్చు అగస్త్య మహర్షి చూపిన స్పష్టమైన ప్రసన్న సంపద సౌభాగ్యము

నేత్రములకానందము కలిగించెను (రాముడు అగస్త్యాశ్రమమును ప్రవేశించెను).

భారత : భద్రగతిన్=శుభలీలచేత, అరుక్=నిరామయమైన, అలోపప=అక్షయమైన, అముద్ర=నిరవధికమైన, ఆనంద=ఆనందముగల, స్వ-రూపము=తన యొక్క రూపము, నిదర్శిత=చూపబడిన, రుచిరతమెరయన్, నేత్రపర్వమొనర్చెన్=అందముగా ప్రత్యక్షమాయెను.

తాత్పర్యము : (శివుడు) తన శుభలీలలచేత నిరామయము, అక్షయము, నిరవధికము, ఆనందముగల తనరూప సౌభాగ్యముచే ప్రత్యక్షమాయెను.

వ. అప్పుడు 54

సీ. దివిమోచి యున్న యద్రిని ధర్మ కార్యర్థ
మానతంబుగఁ జేసి నట్టిఘనుని
మించిలోకము నావరించినవిషరాశి
నాపోశనము గొన్న యద్భుతాత్ము
జీవనదోషవిద్రావణజ్యోతిర్మ
యస్వమూర్త్యాలోకుఁ డగుమహాత్ము
నఖిల వేదాంత వేద్యాత్ముఁ డై భువనవం
ద్యతఁ బెంపు మీఱుమహానుభావు

తే. నమర నిమ్న గానిత్యనేకముల నెలయు
జడల లేఁగెంపు విమలతఁ గడు మెఱయఁగ
మెకముతోలు విభూతి సమిద్ధతనువు
నొండొకటి కంద మైయొప్ప నొప్పువాని. 55

రామా : దివిమోచియున్న=మిన్నుముట్టిన, అద్రిని=వింధ్యపర్వతమును, ధర్మకార్యర్థము=సంధ్యా వందనాది ధర్మములు నడుపుట కొరకు, ఆనతంబుగన్=అణగునట్లుగా, చేసినట్టి ఘనుని=చేసిన మహాత్ముని, మించి లోకమ్ము=లోకమును

మించి, ఆవరించిన=వ్యాపించిన, విషరాశిన్=సముద్రమును, ఆపోశనముగన్న= ఆపోశనము పట్టిన, అద్భుతాత్మ=మహాత్ముని, జీవనదోష=నిష్కళంకును, విద్రావణ=మాన్పెడి, జోతిర్మయ=నక్షత్రరూపమైన, స్వమూర్తి=తన యొక్క రూపముచే, ఆలోకుడగు=ప్రకాశముగలవాడైన, మహాత్మున్=మాహానుభావుని, అఖిల వేదాంత=సమస్త వేదాంతములను, వేద్యఆత్ముడై=తెలిసిన బుద్ధిగలవాడై, భువన వంద్యతన్=లోకముల మెప్పు, పెంపు మీరు=ఆధిక్యతగల, మహానుభావు=మహాత్ముని, అమరన్=అమరునట్లుగా, నిమ్నగా నిత్యసేకములన్=నదులయందు నిత్యము స్నానముచే, జడలలేగెంపు=జటల యొక్క లేత ఎఱ్ఱదనము, విమలత కడు మెఱయగ నెలయు=ప్రకాశముచేత శుద్ధమై కన్పించువానిని, మెకముతోలు=జింక చర్మము, విభూతి=విబూది, సమిద్ధతనువున్=ప్రకాశించు శరీరము, ఒండొకటికి= ఒకదానికొకటికి, అందమై యొప్ప నొప్పువాని=అందముగా కనిపించువానిని.

తాత్పర్యము : మిన్నుముట్టిన వింధ్యపర్వతమును ధర్మకార్యముల కొరకు అణగునట్లుగా చేసిన మహనీయుని, లోకములను మించి ఆవరించిన సముద్రమును ఆపోశన బట్టిన అద్భుత శరీరుని, నిష్కళంకతను పోగొట్టుటకు నక్షత్ర రూపమైన తన మూర్తి యొక్క ప్రకాశముగల మహాత్ముని, సమస్త వేదాంతములను తెలిసిన బుద్ధిగలవాడై లోకములచే పొగడబడు మహానుభావుని, నదీస్నానములచేత జడల ఎఱ్ఱదనము ప్రకాశించువానిని మృగచర్మము, విభూతి తన శరీరమునకు ఒకటిని మించి మరొకటి అందమై యొప్పు (అగస్త్యుని).

విశేషణము : జీవనదోష – 'జీవనం–భువనమ్' అని అమరము.

భారత : దివి=స్వర్గమును, మోచియున్న=మోసిన, అద్రిన్=మేరువును, ధర్మ=వింటి యొక్క, కార్యార్థము=కార్యము కొరకు, ఆనతంబుగ చేసినట్టి=అణగునట్లు చేసిన, ఘనుని=బలవంతుని, మించి లోకమునావరించిన=ఆధిక్యతచే లోకమంతటికి వ్యాపించిన, విషరాశిన్=కాలకూటమును, ఆపోశనముగొన్న=మ్రింగిన, అద్భుతాత్మ=విచిత్ర ధైర్యముగలవానిని, జీవనదోష=సంసార దోషమును, విద్రావణ=పోగొట్టెడి, జ్యోతిర్మయ=ప్రకాశించు, స్వమూర్తి=తనమూర్తిచే,

ఆలోకుడగు=సందర్శనము గలవాడగు, మహాత్మున్=పవిత్ర రూపుని, అఖిల వేదాంత=సమస్త వేదములచే, విద్యాత్ముడై=తెలియబడినవాడై, భువనవంద్యతన్=లోకముల పొగడ్తచే, పెంపుమీరు=ప్రకాశించు, మహానుభావు=మహాత్ముని, అమర నిమ్నగా=సురగంగా, నిత్యసేకముల=నిత్యస్నానములచే, నెలయున్=ప్రకాశించు (చంద్రుడను), జడల లేగెంపు విమలతకడు మెరయగ, మెకముతోలు=గజచర్మము, విభూతి, సమిద్ధతనువు, ఒండొకటి కందమై యొప్పునొప్పువాని.

తాత్పర్యము : స్వర్గమును మోచిన మేరువును వింటినారిగా చేసికొన్న బలవంతుని, లోకములన్నింటిని ఆవరించిన కాలకూటమును మ్రింగిన విచిత్ర ధైర్యవంతుని, సంసార దోషమును పోగొట్టు జ్యోతిర్మయమైన స్వమూర్తి సందర్శనముగల మహాత్ముని, సమస్త వేదములచే తెలియబడినవాడై లోకములచే స్తుతింపబడు ప్రభావముగలవానిని సురగంగా నిత్యస్నానముచే మెరయు చంద్రుడు గలవానిని, జడల ఎఱ్ఱదనము ప్రకాశించగా గజచర్మము, విభూతి, తన శరీరమునకు ఒకటిని మించి ఒకటి అందముగా నొప్పువానిని.

తే. చూచి యాదిత్యకుల రాజసుతుఁడు హర్ష
వినయభక్తులసాష్టాంగవినుతిసేసె
నపుడు గాకున్న యట్టితదస్త్రసిద్ధి
దమప్రయోజన మని సుర ల్దనరి రాత్మ. 56

రామా : చూచి=అగస్త్యుని చూచి, ఆదిత్యకుల=సూర్యవంశమునబుట్టిన, రాజసుతుడు=రాకుమారుడు (రాముడు), హర్షవినయభక్తుల=ఆనందము, వినయము, భక్తియుతముగా, సాష్టాంగ వినుతిసేసె=సాష్టాంగ ప్రణామము చేసెను, అట్టి=అటువంటి, తత్+అస్త్రసిద్ధి=ఆ అస్త్రములను పొందుట, అపుడు గాకున్న=అప్పుడు కానిచో, దమప్రయోజనమని=తమకు ప్రయోజనము లేదని, సురల్=దేవతలు, ఆత్మన్=ఆత్మలో, తనరిరి=సంతోషించిరి.

తాత్పర్యము : అగస్త్యుని చూచి సూర్యవంశజుడైన రాముడు హర్షము వినయము

భక్తిముప్పిరిగొనగా సాష్టాంగ ప్రణామము చేసెను. అగస్త్యుడిచ్చిన అస్త్రముల సంపాదన తమకు ప్రయోజనకారియని దేవతలు ఆత్మలో సంతోషించిరి. (అప్పుడు కాకున్నచో దాని ఫలితము లేదని భావన)

భారత : చూచి=పరమశివుని చూచి, ఆదిత్య కులరాజ=అదితి కులములో శ్రేష్ఠుడైన, దేవేంద్రుని, సుతుడు=కుమారుడు–అర్జునుడు, హర్షవినయ భక్తుల సాష్టాంగ వినుతి చేసె=ఆనందము, వినయము భక్తితో కూడి సాష్టాంగము చేసి ప్రస్తుతించెను, అపుడు గాకున్న యట్టితదస్త్రసిద్ధి=ఆ సమయములో కానిచో పాశుపతాస్త్రసిద్ధి, దమప్రయోజనము అని=నివాత కవచ కాలకేయాది సంహార హేతువని, సురలు=ఆత్మన్, తనరిరి.

తాత్పర్యము : పరమశివుని జూచి దేవేంద్ర కుమారుడైన అర్జునుడు హర్షవినయ భక్తి తాత్పర్యములతో సాష్టాంగనమస్కారములు చేసి ప్రశంసించెను. అట్టి పాశుపతాస్త్రసిద్ధి నివాతకవచ కాలకేయాది సంహార హేతువని దేవతలు ఆత్మలో సంతోషించిరి.

వ. అట్టి సమయంబున = ఆ సమయములో 57

కం. స్వతపఃఫలసాక్షాత్కా
రతఁ గృతసాన్నిధ్యుఁ డైనరాజవతంసున్
హతకలుషుఁడు దపసి ముద
న్వితమగుచిత్తమున ని ట్లని ప్రశంసించెన్. 58

రామా : స్వతపఃఫల=తన తపస్సు యొక్క ఫలితముచే, సాక్షాత్కారతన్= కనిపించిన, కృతసాన్నిధ్యుడైన=దగ్గరకు వచ్చిన, రాజవతంసున్=రాముని, హత కలుషుడు=పాపములు తొలగిన, తపసి=అగస్త్యుడు, ముదన్వితమగు=సంతోషముతో కూడిన, చిత్తమునన్=మనస్సుతో, ఇట్లని ప్రశంసించెన్=ఈ విధముగా స్తుతించెను.

తాత్పర్యము : తన తపస్సిద్ధిచే సాక్షాత్కరించి తన దగ్గరకు వచ్చిన రాముని పాపరహితుడైన అగస్త్యుడు ఆనందభరిత హృదయముతో నిట్లు ప్రశంసించెను.

భారత : స్వతపఃఫల సాక్షాత్కారతన్=తన తపస్సంపదచే సాక్షాత్కరించి, కృతసాన్నిధ్యుడైన, రాజవతంసున్=శివుని, హతకలుషుడు=పాపరహితుడైన, తపసి=అర్జునుడు, ముదన్వితమగు చిత్తమున ఇట్లని ప్రశంసించెన్.

తాత్పర్యము : తన తపస్సిద్ధిచే సాక్షాత్కరించి తన వద్దకు వచ్చిన పరమశివుని పాపరహితుడైన అర్జునుడు సంతోష చిత్తముతో నిట్లు ప్రశంసించెను.

కం. విశ్వేశ్వర విశ్వాత్మక
విశ్వాధిష్ఠాన యఖిలవేదాంతవచ
శ్శశ్వదభివర్ణ్యమానమ
హైశ్వర్య నిరీహనిత్యయభవశుభమయా. 59

రామా - భారత రెండింటికి సమానము.

విశ్వ+ఈశ్వర=లోకములకు నాయకా!, విశ్వ+ఆత్మక=విశ్వమే ఆత్మగా గలవాడా!, విశ్వ+అధిష్ఠాన=లోకములకు అధిష్టాన దేవత, అఖిలవేదాంత వచః =సమస్త వేదాంత వచనములచే, శశ్వత్=మిక్కిలి, అభివంద్యమాన= వర్ణించబడినవాడా!, మహా+ఐశ్వర్య=గొప్ప ఐశ్వర్యముగలవాడా!, నిరీహ= కోరికలేనివాడా!, నిత్య=నిత్యుడా!, అభవ=పుట్టుకలేనివాడా!, శుభమయ=శుభములు కలిగించువాడా!

తాత్పర్యము : రామాయణార్థములో రాముని విశేషణములు.
భారతార్థములో పరమశివునకు విశేషణములు.

మ. నిశిత ప్రజ్ఞతఁ జూడ నేవికృతియున్లే దంద్రు నీయందు నీ
దశరూపాశ్రయణం బొనర్చుట మదిం దర్కింప లోకంబులం
దశుభ ప్రక్షయమున్ శుభోదయమునుద్యద్భక్తవాత్సల్యతా
తిశయాయత్తతఁజేయ నింతియ గుణాతీతా ప్రసన్నాత్మకా! 60

రామా : గుణ+అతీత=గుణములకు లోనుకానివాడా!, ప్రసన్నాత్మకా= ప్రసన్నమైన మనసుగలవాడా!, నీయందు=రాముని యందు, నిశిత ప్రజ్ఞతన్+చూడ=సూక్ష్మమైన బుద్ధి విశేషమును చూడగా, ఏ వికృతియున్=ఏ విధమైన వికారమును, లేదు+అంద్రు=లేదని చెప్పుదురు, నీ=నీవు, దశరూపాశ్రయణం బొనర్చుట=దశావతారముల నెత్తుట, మదిన్=మదిలో, తర్కింపన్=విమర్శింపగా, లోకంబులందు=లోకములలో, అశుభప్రక్షయమున్=దుష్టశిక్షణకు, శుభోదయమున్= శుభములు కలిగించుటకు, ఉద్యత్=మిక్కిలి, భక్తవాత్సల్యాతిశయాయత్తతన్=అధిక ప్రేమను సమకూర్చుటకు, చేయన్+ఇంతియ=చేయుట కొరకే.

తాత్పర్యము : ఓ గుణాతీతా! ప్రసన్నాత్మకా! నీలోని నిశితమైన ప్రజ్ఞను చూడగా ఏవిధమైన వికారమును లేదని చెప్పుదురు. మనస్సులో విచారించగా నీవు దశావతారముల నెత్తుట లోకములలో అశుభములను తొలగించుటకు, శుభములను కలిగించుటకు భక్తులయందు అధిక ప్రేమను చూపుటకు మాత్రమే!

భారత : గుణాతీతా! ప్రసన్నాత్మకా! నిశిత ప్రజ్ఞతన్చూడ, ఏ వికృతియన్, లేదంద్రు, ఈ దశన్=ఈ ప్రకారముగా, రూపాశ్రయణంబు=కిరాత రూపమును, ఒనర్చుట=ధరించుట, మిగతా సమానము.

తాత్పర్యము : ఓ గుణాతీతా! ప్రసన్నాత్మకా! శివా! నీ యందలి నిశిత ప్రజ్ఞను చూడగా ఏవిధమైన వికారమును లేదని చెప్పుదురు. నీవు ఈ విధముగా కిరాత రూపమును ధరించుట మదిలో ఆలోచింపగా లోకములలోని అశుభమును తొలగించుటకు, శుభములను కలిగించుటకు, భక్తునియందు అధిక ప్రేమను కనబరచుటకు మాత్రమే!

కం. అది సకలసదాచారం
బది సర్వజ్ఞాన మది సమస్తజనిఫలం
బొదివినకొలఁది నొకప్పుడు
హృదయము నీయందుఁ జేర్తురేని మహేశా. 61

రామా : మహేశా!=ఓ రామా!, ఒకప్పుడు=ఎప్పుడైన, హృదయము=మనస్సు, నీయందు, చేర్తురేని=చేర్చెదరేని, అది, సకల సదాచారంబు=సకలమైన మంచి ఆచారము, అది, సర్వజ్ఞానము=సమస్త జ్ఞానము, అది, సమస్త జనిఫలంబు=సకలమైన జన్మల ఫలితము, ఒదవిన కొలదిన్=కలిగిన విధముగా.

రామాయణ భారతములకు తాత్పర్యము సమానము. భారతార్థమున మహేశా=ఈశ్వరా!

తాత్పర్యము : ఓ రామా! (ఈశ్వరా) సమస్త జన్మముల పుణ్యఫలముగా హృదయమును నీయందు చేర్చిరేని అది సమస్త సదాచారము, అది సకల జ్ఞానము.

కం. అతివాఙ్మనసాస్పద యీ
నుతికొగ్గినసాహసమ్మును సహింపు దయన్
మతి నాకు నేన లజ్జిం
చితి నోయచ్యుత యనంత శివగుణరాశీ. 62

రామా : శివగుణరాశీ!=మంగళప్రదమైన గుణముల సమూహము గలవాడా! ఓఅచ్యుతా=నాశనములేనివాడా!, అనంతా!=అంతములేనివాడా!, అతివాక్+ మానస+ఆస్పద=వాక్కునకు మనస్సునకు గోచరముగాని స్థితిగలవాడా! ఈనుతికి+ ఒగ్గిన=ఈ ప్రశంసకు పూనిన, సాహసమ్మును=సాహస కార్యమును, దయన్ సహింపు= దయతో ఓర్చుకొనుము, నాకు నేన=నాకు నేనే, మతిన్=మనస్సులో, లజ్జించితిని= సిగ్గుపడితిని.

రెండింటికి సమానము. భారతార్థమున శివగుణరాశి=పరమశివా!

తాత్పర్యము : ఓ రామా! (ఓ శివా!) స్థిరమైనవాడా! అనంతా! వాగ్మనస్సులకు గోచరముగాని స్థితిగలవాడా! ఈ విధముగా స్తుతించుటకు పాల్పడిన సాహసమునకు దయతో సహింపుము. నాకు నేనే (అగస్త్యుడు, అర్జునుడు) మనస్సులో సిగ్గిల్లెదను.

కం. అనుచుఁ బునః పునరభివం
దనములు నెమ్మనమునం దుదంచితసమ్మో
దనితాంతభక్తిసంతత
వినయంబులు సందడింప వేమఱుఁ జేసెన్. 63

అర్థతాత్పర్యములు రెండింటికి సమానము.

అర్థము : అనుచు=అని పలుకుచు, నెఱ+మనమునందు, నిండు మనస్సుతో, ఉదంచిత=మిక్కిలి, సమ్మోద=ఆనందము, నితాంతభక్తి=అధికమైన భక్తి, సంతత వినయంబులు=మిక్కిలి వినయము, సందడింపన్=పెనగొనగా, పునః పునః +అభివందనములు=మాటి మాటికీ నమస్కారములు చేయుచు, వేమఱున్= పలుమార్లు, చేసెన్=చేసెను.

తాత్పర్యము : అగస్త్యుడు (అర్జునుడు) అట్లు పలుకుచు నిండు మనస్సునందు అధికమైన ఆనందము, అత్యంతభక్తివినయములు పెనగొనగా మాటిమాటికీ పలుమార్లు నమస్కారములు చేసెను.

వ. తదనంతరంబ. 64

తత్+అనంతరంబ=ఆ తర్వాత

కం. విమలుఁడు రాజన్యోత్తముఁ
డమితతపశ్శక్తిమహిమహర్షీశకృపా
సమవాప్తినిష్టదివ్యా
స్త్రమతల్లీసిద్ధి గని ముదం బందెఁ గడున్. 65

రామా : విమలుడు=మాలిన్యము లేనివాడు, రాజన్య+ఉత్తముడు=రాజులలో శ్రేష్ఠుడు అయిన రాముడు, అమిత తపశ్శక్తి=మిక్కిలి తపోసంపదకు, మహి=స్థానమైన, మహర్షీశా!, అగస్త్యుని యొక్క కృపా సమవాప్తిన్=దయావిశేషముచే, ఇష్ట=ఇష్టములైన, దివ్యాస్త్రమతల్లీ=వైష్ణవచాప బ్రహ్మాస్త్రములయొక్క, సిద్ధిన్గని=ప్రాప్తిని పొంది,

కడున్=మిక్కిలిగా ముదంబున్+అందెన్=సంతోషించెను.

తాత్పర్యము : మలినరహితుడైన రామచంద్రుడు మిక్కిలి తపశ్శక్తికి స్థానమైన అగస్త్యుని యొక్క కృపా విశేషములచే యిష్టములైన వైష్ణవచాప, బ్రహ్మాస్త్రముల సిద్ధిని పొంది, మనస్సున మిక్కిలి సంతోషించెను.

భారత : విమలుడు, రాజన్యోత్తముడు=అర్జునుడు, అమితతపశ్శక్తి మహిమన్=మిక్కిలియైన తపశ్శక్తి గొప్పదనముచే, హర్షి=ఆనందించిన, ఈశా=ఈశ్వరుని, కృపాసమవాప్తిన్=దయతో, ఇష్ట, దివ్య=దివ్యమైన, అస్త్రమతల్లీ=పాశుపతాస్త్రముయొక్క, సిద్ధిన్గని, కడున్, ముదంబందెన్.

తాత్పర్యము : మలిన రహితుడైన అర్జునుని తపశ్శక్తికి ఆనందించిన ఈశ్వరుని అపారదయా విశేషముచే ఇష్టములైన దివ్యమైన పాశుపతాస్త్రమును పొంది మిక్కిలి సంతోషించెను.

శా. అక్షుద్రప్రథమానదివ్యశరసంప్రాప్తిం బ్రకాశించునా
కుక్షిద్వంశవతంసుఁ గన్గొని మహాగోదావరీతీరస
ద్రక్షోపాయపథంబు నేఁడు దొరకెన్రండంచు సంరక్షణా
పేక్షం దద్వనభూమి దేవతలుసంప్రీతిం గడు న్మూఁక లై. 66

రామా : అక్షుద్ర=అసమాన్యమైన, ప్రథమాన=పొగడ్తకెక్కిన, దివ్యశర సంప్రాప్తిన్=దివ్యమైన బాణములను పొందుటచే ప్రకాశించు, ఆ కుక్షిత్+వంశవతంసున్=ఆ రాజశ్రేష్ఠుడైన రాముని, కన్గొని=చూచి, మహాగోదావరీతీర=గొప్పదైన గోదావరీ తీరము యొక్క, సత్+రక్ష+ఉపాయపథంబు=చక్కగా రక్షించు ఉపాయమార్గము, నేడు, దొరకెన్=దొరికెను, రండు+అంచు=రమ్మనుచు, సంరక్షణ+అపేక్షన్=రక్షించు నుద్దేశముతో, తత్+వనభూమి దేవతలు=ఆ అరణ్యమునందున్న బ్రాహ్మణులు, సంప్రీతిన్=సంతోషముతో, కడున్+మూకలై=మిక్కిలి గుంపులుగా చేరి.

తాత్పర్యము : అసమానమైన పొగడ్తకెక్కిన దివ్యశరములు లభించుటచే ప్రకాశించు ఆ రాముని చూచి మహాగోదావరీతీరము చక్కగా రక్షించు ఉపాయ

మార్గము నేడు దొరికెను రమ్మనుచు ఆ అరణ్యములోని బ్రాహ్మణులు సంరక్షింప గలడని గుంపులు గుంపులుగా సంతోషముతో మిక్కిలి (ఉపచారములు) చేసిరి.

భారత : అక్షుద్ర ప్రథమాన దివ్యశర సంప్రాప్తిన్ ప్రకాశించు, ఆ కుక్షిద్వంశ వతంసున్=రాజవంశ శ్రేష్ఠుడైన అర్జునుని, కనుగొని, మహాగః=మహా+అగః=గొప్ప అధిక అపరాధములచేత, దావరీతి=దావాగ్నివలె, రసత్=మ్రోయుచున్న, రక్షః=రాక్షసుల యొక్క, అపాయ పథంబు=వధించు ఉపాయ మార్గము, నేడు దొరకెన్ రండంచు, తద్వనభూమిన్=ఆ అరణ్యములో, సంరక్షణాపేక్షన్, దేవతలు, సంప్రీతిన్, కడున్, మూకలై.

తాత్పర్యము : అసమానమైన పొగడ్తకెక్కిన పాశుపతాస్త్రము లభించుటచే ప్రకాశించు ఆ అర్జునుని చూచి అధికాపరాధములచే దావాగ్నివలె మ్రోయుచున్న రాక్షసులను వధించుటకు ఉపాయమార్గము నేడు లభించెను రమ్మని ఆ అరణ్యము సంరక్షించు అపేక్షతో అక్కడి ఇంద్రాది దేవతలు ప్రీతితో మిక్కిలి గుంపులుగా కనిపించిరి.

విశేషణము : కుక్షిద్వంశ – గోత్రాకుహుపృథివీ, పృథ్వీ అని అమరము.

వ. యథోచిత ప్రకారంబునంబొడసూపి యతని ప్రణామాది
వినయకృత్యంబులు గైకొని 67

అర్థము సమానము.

యాథా+ఉచిత ప్రకారంబునన్=సముచిత రీతిలో, పొడసూపి=కనిపించి, అతని ప్రణామాది=అతడు (రాముడు) చేసిన నమస్కారములు మొదలైన వినయ కృత్యంబులు గైకొని=వినయముతో కూడిన పనులు స్వీకరించి –

తాత్పర్యము : అతనికి సముచిత రీతిలో కనిపించి (రామునికి, అర్జునునికి) అతడు చేసిన నమస్కారాది వినయ కార్యక్రమములను స్వీకరించి,

కం. అరుదుగ నుపచార మొన
ర్చిరి దీవన లెలమి నిచ్చిరి తమతమమహా

శరసాదరార్పణంబులఁ
గర మమరుచు నుండ వేడుకను సప్రభులై. 68

రామా : సప్రభులై=ప్రభాసమేతులై, తమతమ=తమ యొక్క, మహా+ఆశ=గొప్ప కోరిక, రస=అనురాగముయొక్క, ఆదర=ఆదరముయొక్క, అర్పణంబులన్=ప్రకటనలచే, అమరుచునుండన్=వెలుగొందుచుండగా, వేడుకను=వేడుకతో, అరుదుగా=ఉపచార మొనర్చిరి=ఉపచారములు చేసిరి, దీవనలు+ఎలమి నిచ్చిరి=మిక్కిలిగా దీవనలు ఇచ్చిరి.

తాత్పర్యము : ప్రభావంతులైన వారు తమతమ అధికమైన కోర్కెలు, అనురాగము, ఆదరము, ప్రకటించి మిక్కిలిగా ప్రకాశించుచుండగా అరుదైన ఉపచారములు చేసి అధికముగా దీవనలిచ్చిరి.

భారత : తమతమ, మహాశర=దివ్యాస్త్రముల యొక్క, సాదర+అర్పణంబులన్=ఆదరముతో అందించి, కరమమరుచు నుండన్=వేడుకను, అరుదుగ=ఉపచార మొనర్చిరి, సప్రభులై=ఇంద్రునితోకూడి, దీవన లెలమి నిచ్చిరి.

తాత్పర్యము : తమ తమ దివ్యాస్త్రములను అర్జునునికి సాదరముగా అర్పించుట వలన మిక్కిలి ప్రకాశించుచుండగా వేడుకతో అరుదైన ఉపచారములు చేసిరి. ఇంద్రునితో కూడి దీవనలిచ్చిరి.

తే. అంత నాత్మపురస్థితిఁ గొంతకాల
ముండి తమ కార్యములకొద లుడిపి చనుట
గోరి వారలు దనుఁ దోడుకొంచుఁ జనఁగఁ
జనియె వేడ్కఁ దదావాసజగతి కతఁడు. 69

రామా : అంత=ఆ తరువాత, ఆత్మపురః=తన ముందరదైన, స్థితి=స్థితిని, కొంత కాలముండి, తమ కార్యముల కొదలు=తమ పనుల యొక్క కొఱవలు, ఉడిపి చనుట గోరి=తీర్చి వెళ్ళుటను కోరి, వారలు=ఆ మునులు, తనున్=రాముని,

తోడుకొంచున్+చనగన్=తీసికొని వెళ్ళుచుండగా, అతడు=ఆ రాముడు, తత్+ఆవాస జగతికి తాను నివసించదగిన ప్రదేశమునకు, వేడ్కన్ చనియెన్=వేడుకతో వెళ్ళెను.

తాత్పర్యము : అంతట రాముడు తన ముందరి స్థితిని గమనించి కొంతకాలముండి, తమ కోర్కెల కొదవలను తీర్చి వెళ్ళమని ఆ ఋషీశ్వరులు కోరి తనను తోడ్కొని వెళ్ళగా తాను నివసించు ప్రదేశమునకు వేడుకతో వెళ్ళెను.

భారత : అంతన్=ఆ తరువాత, ఆత్మపురస్థితిని=స్వర్గస్థితిచే, కొంత కాలముండి, తమ కార్యముల కొదలుడిపి, చనుటగోరి, వారలు=దేవతలు, తను తోడుకొనుచు చనగచినియె వేడ్క, అతడు తదావాస జగతికి.

తాత్పర్యము : అంతట స్వర్గ స్థితిలో కొంతకాలముండి తమ కార్యముల యొక్క కొదవలు తీర్చి చనగోరి దేవతలు అర్జునుని తోడ్కొని వెళ్ళగా తన నివాస ప్రదేశమునకు అర్జునుడు వెళ్ళెను.

కం. అందు నమందశుభోదయ
మొందఁ గనిబిడౌజుఁ డలరు చుండె సుమిత్రా
నందనజనకసుతానిశ
సందర్శితనవనవోల్లసద్భజనరతిన్. 70

రామా : అందున్=ఆ వనమందు, అమంద=అధికమైన, శుభోదయమొందన్= శుభములు సంప్రాప్తించగా, నిబిడ=సాంద్రమైన, ఓజుడు=తేజస్సుగల రాముడు, సుమిత్రానందన=లక్ష్మణుడు, జనకసుత=సీత, అనిశసందర్శిత=మిక్కిలి చూచుట వలన, నవనవ+ఉల్లసత్+భజనరతిన్=కొత్తకొత్తగా విరిసిన సేవలచే, అలరు చుండెను=ప్రకాశించుచుండెను.

తాత్పర్యము : ఆ అరణ్యమునందు అధికమైన శుభములు కలుగగా సాంద్రమైన తేజస్సుగల రాముడు, లక్ష్మణుడు, సీత నిత్యము తన సేవలయందు కొత్తదనమును చూపగా అలరుచుండెను.

భారత : అందున్=ఆ స్వర్గమునందు, అమంద శుభోదయమొందన్=మిక్కిలి శుభముల ప్రాప్తి, కని=చూచి, బిడౌజుడు=ఇంద్రుడు, సుమిత్ర=మంచి మిత్రులకు, అనందన జనక=ఆనందమును కలిగించు, సుత=కుమారుడైన అర్జునునిచే, అనిశ=ఎల్లప్పుడు, సందర్శిత నవనవోలసత్ భజనరతిన్ అలరుచుండె.

తాత్పర్యము : ఆ స్వర్గము నందు అధికమైన శుభములు కలుగగా చూచి ఇంద్రుడు సన్మిత్రులకు ఆనందకరుడైన అర్జునుడు ఎల్లప్పుడు కనబరచిన భజన రతి చేత అలరుచుండెను.

విశేషణము : బిడౌజుడు - బిడౌజాః, పాకశాసనః - అని అమరము.

సీ. ఆసక్తిఁ దనరినవాసవసేవామి
షానుభవనిరంతరానువృత్తి
నడఁగక పేర్చుపేరాసఁ గుందెడియుర్వ
శీతలోదరిపరిస్ఫీతతరస
కామసంభ్రమత నొక్కతె యహిమాంశువం
శాకల్పు మైనయారాకుమారుఁ
డున్న చోటికిఁ దమి నొక్కనాఁ డేతెంచి
కెళవున నుండి యాకృతివిలాస

తే. మరసి చూచి విశృంఖలస్మరశరార్తిఁ
బూనె నాసురవనిత దాఁ గాన యోగ్య
మైనకాంతాకృతి వహించి కానుపించె
సిగ్గుఁ జిఱునవ్వుఁ జూడ్కులఁ జెన్నుమీఱ 71

రామా : ఆసక్తిన్ తనరి=ఆసక్తితో కూడి, నవ+ఆసవసేవ=కొత్తదైన మద్యపానము యొక్క, ఆమిష+అనుభవ=మాంసభక్షణముయొక్క, నిరంతర+ అనువృత్తిన్=మాటిమాటికి స్వీకరించుటచే, అడగకపేర్చు=అణగక అతిశయించు,

పేరాసన్=అధికమైన ఆశతో, కుందెడి=బాధపడెడి, ఉరు+అశీతల+ ఉదరి=గొప్పది, చల్లదనములేని కడుపుగలది, ఒక్కతె=ఒక రాక్షసి (శూర్పణఖ) పరిస్ఫీత=సమగ్రమైన, తరస=మాంసమందుగల, కామ=కోరిక యొక్క సంభ్రమతన్=త్వరపడుటచే, అహిమాంశు=సూర్యుని యొక్క వంశ=వంశమునకు, ఆకల్పమైన=అలంకారమైన, ఆ రాకుమారుడు=ఆ రాముడు, ఉన్న చోటికిని=ఉన్న ప్రదేశమునకు, ఒక్కనాడు= ఒకరోజు, తమిన్=కోరికతో, ఏతెంచి=వచ్చి, కెళవున నుండి=సమీపమున నుండి, ఆకృతి విలాసము=రూపవిలాసవిశేషమును, అరసి చూచి=లోతుగా చూచి, విశృంఖల=విజృంభించిన, స్మరశర+ఆర్తిన్=మన్మథుని బాధను, పూనెన్=పొందెను, అసురవనిత=రాక్షస స్త్రీ, తాన్+కాన్=తాను కాబట్టి, యోగ్యమైన=ఉచితమైన, కాంతాకృతి వహించి=స్త్రీరూపమును ధరించి, చూడ్కులన్=చూపులయందు, సిగ్గున్+చిరునవ్వు=సిగ్గు చిరునవ్వు, చెన్నుమీర=ప్రకాశించగా, కానుపించె=కనిపించెను.

తాత్పర్యము : ఆసక్తి మీరగా కొత్తదైన మద్యపానము, మాంసభక్షణము నిరంతరము సేవించుట యందు అధిక ఆశగల గొప్ప వేడి కడుపుగల (తృప్తిలేని) ఒక రాక్షసి సమగ్రమైన మాంసమునందు కోరిక యొక్క త్వరితగతిచే సూర్యవంశమునకు అలంకార ప్రాయుడైన, రాముడున్న చోటికి ఒకనాడు కోరికతో వచ్చి సమీపమున నిలిచి రాముని ఆకార విలాసమును చూచి అధికమైన కామార్తిచే తాను రాక్షస స్త్రీ కావున సందర్భోచితమైన స్త్రీ రూపమును ధరించి, చూపులయందు, సిగ్గు, చిరునవ్వు అందముగా కనిపించగా నిలిచెను.

విశేషణము : అమిషా – 'పలలంక్రవ్య మామిషా' అని అమరము.

భారత : ఆసక్తి దనరిన=ఆసక్తి కలిగిన, వాసవసేవా=ఇంద్రుని సేవించుట యనెడి, మిష=వ్యాజముచే, అనుభవ=సందర్శనము యొక్క, నిరంతరానువృత్తిన్= నిరంతరము వచ్చి పోవుటచే, అడగకపేర్చు=అణగక అధికమగుచున్న, పేరాసన్=కుందెడి, ఉర్వశీ తలోదరి=ఊర్వశి అనెడు స్త్రీ, పరిస్ఫీతతర=ఘనమైన, సకామ=మన్మథసహితమైన, సంభ్రమతన్=సంభ్రమముచే, ఒక్కతెయ=ఒకర్తుకయే, హిమాంశువంశ=చంద్రవంశమునకు, ఆకల్పమైన=భూషణమైన, ఆ రాకుమారుడు=

అర్జునుడు, ఉన్నచోటికి, తమిన్=రాత్రియందు, ఒక్కనాడేతెంచి, కెళవున నుండి, ఆకృతి విలాసమరసి, చూచి, విశృంఖల స్మరశరార్తిబూనె, ఆ+సురవనిత=ఆ దేవకాంత, తాన్=తాను, కానయోగ్యమైన=వర్ణనీయమైన, కాంత=మనోహరమైన, ఆకృతి వహించి=ఆకారమును ధరించి, చూపులన్=సిగ్గు చిరునవ్వు, చెన్నుమీర=కానుపించె.

తాత్పర్యము : ఆసక్తి గలిగిన ఇంద్రుని సేవించుట అను మిషచే మాటిమాటికీ సందర్శించుటచే అణగక విజృంభించిన పేరాసచే బాధపడెడి ఊర్వశి అను వనిత ఘనమైన మన్మథసహితమైన సంభ్రమము గల్గి తానొక్కతయే అర్జునుడున్న చోటికి రాత్రియందు వచ్చి, ఆ అప్సరస వర్ణనీయము, మనోహరము అయిన ఆకారమును ధరించి చూపులలో సిగ్గు, చిరునవ్వు అందము లొలికించగా కనిపించెను.

వ. ఇట్లు గానుపించి పరస్పరసందర్శన సమయసముచిత సంభాష ణంబులు నడపి తన మదిం బొదలెడు మదనవికారంబు తెఱం గెఱింగించిన నతండు. 72

అర్థతాత్పర్యము రెండింటికి సమానము.

రామా ఇట్లు కనుపించి=ఈ విధముగా కనిపించి, పరస్పరసందర్శన సమయ=ఒండొరులు చూచిన సమయమునకు, సముచితసంభాషణంబులు నడపి=తగినమాటలాడి, తనమదిన్=శూర్పణఖ మనస్సులో (ఊర్వశి మనస్సులో), పొదలెడు=అతిశయించు, మదనవికారంబు=మన్మథుని వికారము, తెఱంగు+ ఎఱింగించిన=తీరును తెలుపగా, అతండు=ఆ రాముడు (ఆ అర్జునుడు)

తాత్పర్యము : ఈ విధముగా శూర్పణఖ (ఊర్వశి) కన్పించి ఒండొరుల సందర్శన సమయమునకు తగిన మాటలాడి తన (శూర్పణఖ / ఊర్వశి) మనస్సులో తిరిగెడు. మన్మథ వికారము యొక్క తీరును తెలియజేయగా ఆ రాముడు (అర్జునుడు).

తే. తనకుదారయోగితకల్మితగఁ దెలుపుచు
మదనుజవశకలితనిజమతిని బ్రబలు

మనసుచేత నాచతురగామిని నెఱయఁగ
నానలేకతన్గదియ రా మానుపుచును. 73

రామా : తనకున్=రామునకు, దారయోగితకల్మి=భార్య ఉన్నదను విషయమును, తగన్ తెలుపుచు=తగిన విధముగా తెలుపుచు, మత్+అనుజ=నా తమ్ముడైన లక్ష్మణునికి, వశకలిత=అధీనముగా చేయబడిన, నిజమతిని=కోరి (లక్ష్మణుని కోరి) ప్రబలుమన=ప్రబలుమనగా, సుచేతన=మంచి బుద్ధిచే, చతురగామిని=చతురురాలైన ఆ స్త్రీ, నెఱయగ=మిక్కిలి, ఆనలేక=తాళలేక, తన్+కదియరాగ=తనను సమీపించగా, మానుపుచును=అడ్డుపడుచు.

తాత్పర్యము : రాముడు తనకు భార్య యుండు విషయమును శూర్పణఖకు తెలిపి, నా తమ్ముడైన లక్ష్మణునికి అధీనముగా చేయబడిన మనస్సుతో ప్రబలుమనగా, మంచి బుద్ధిచేత ఆ చతురురాలైన స్త్రీ మిక్కిలి ఆనలేనిదై లక్ష్మణుని కదియుటకు రాగా మాన్పుచు (ముందరి పద్యముతో అన్వయము)

భారత : తనకు+ఉదార=అర్జునునకు ఉదారమైన, యోగిత=యోగిత్వము యొక్క, కల్మిన్=కలిమిని, తగన్ తెల్పుచు=తగిన విధముగ తెలియజేయుచు, మదను=మన్మథుని యొక్క, జవ=వేగముచేత, శకలిత=భేధింపబడిన, నిజమతిని=తన మనస్సుగల, ఆచతురగామిన్=ఆ ఊర్వశిని, ప్రబలు మనసుచేత=అధికమైన మనసుచే, ఆనలేక=తాళలేక, తన్గదియరా=తనను కౌగలింపరాగా, మానుపుచును=అడ్డుపడుచు (ఊర్వశితో పల్కెనని అన్వయము)

తాత్పర్యము : తనకు ఉదారమైన యోగిత్వముయొక్క కలిమిని తెలుపుచు మన్మథుని వేగముచే భేదింపబడిన మనస్సుగల ఊర్వశిని, ప్రబలమైన మనస్సుచే తాళలేక తనను కదియ రాగా అడ్డుపడుచు –

సీ. జ్యేష్ఠసౌభ్రాత్రసుస్థితి లక్ష్మణుఁడు వల్కె
నరయక యిటువచ్చి తబల నన్ను

బ్రహ్మచర్యస్థితి భజియింపఁ బరమతా
పసనాథసత్యాజ్ఞ పసఁ బనిచిన
నాయగ్రజునియోగమీ యోజఁ జెఱుచుకో
నర్హమె మగిడిపొమ్మనినవలపు
పొలుపుగా రాము నూల్కొలుపుచుఁ గదిసి య
తం డట్ల పలుక నెందాఁక గుట్టు

ఆ. జరిపె దనుచుఁ దిరిగి తిరిగి పైకొనుకోర్కి
నతనినతనిమదవదసమవిశిఖ
దళితహృదయ యగుచుఁ దెలచియందు నొకింత
గలఁక లేమి చూచి నెలఁత గనలె. 74

రామా : జ్యేష్ఠసౌభ్రాత్ర=అన్నయైన రాముని, సుస్థితిన్=కలిగినటువంటి, లక్ష్మణుడు, పల్కెన్=పలికెను, అబల=ఓ శూర్పణఖ, బ్రహ్మచర్యస్థితిన్=బ్రహ్మచర్య దీక్షతోనున్న, నన్ను=నన్ను, అరయక=తెలియక, భజియింప ఇటు వచ్చితి=కొలుచుటకు ఇట్లు వచ్చితివి, పరమతాప=మిక్కిలి తాపముచే, సనాథ=కూడిన, సతీ=భార్య యొక్క, ఆజ్ఞపసన్=ఆజ్ఞ యొక్క పసచే, పనిచిన=పంపిన, నా అగ్రజుని=నా అన్నరామునితోడి, యోగము=అదృష్టమును, ఈ+ఓజన్=ఈ విధముగ, చెఱచుకోన్=చెడగొట్టుకొనుట, అర్హమె?=తగునా, మగిడి పొమ్మనినన్=తిరిగి వెళ్ళమనగా, వలపు పొలుపుగా=ప్రేమ అతిశయింపగా, రామున్=రాముని, నూల్కొలుపుచు=ఒప్పించుటకు, కదిసి= సమీపించి, అతండు=ఆ రాముడును, అట్లపలుక=అదే విధముగా మాట్లాడగా, ఎందాక=ఎప్పటి వరకు, గుట్టు జరిపెదు+అనుచు=రహస్యము కొనసాగించెదవు అనుచు, తిరిగి తిరిగి=రాముని వద్దకు లక్ష్మణుని వద్దకు తిరిగి తిరిగి, పైకొను కోర్కి=అతిశయించిన మోహముచే, అతని+అతనిన్=రామలక్ష్మణులపై, మదవత్= మదించిన, అసమవిశిక=మన్మధుని బాణములచే, దళితహృదయ+అగుచు= వికసించిన హృదయముగలదై, తెలచి=ప్రార్థించి, అందున్ ఒకింత కలకలేమి=వారిలో

కలత లేకుండుటను, చూచి, నెలత=శూర్పణఖ, కనలె=కోపించెను.

తాత్పర్యము : జ్యేష్ఠ సోదరుని కలిగిన లక్ష్మణుడు ఇట్లు పలికెను. ఓ అబలా! నన్ను తెలియక ఇటు వచ్చి బ్రహ్మచర్య స్థితిలో నున్న నన్ను సేవించుటకు వచ్చితివి. తాపముతో కూడిన భార్య ఆజ్ఞ పసచే నిన్ను పంపిన నా జేష్ఠుని యోగమును ఈ విధముగా నీవు చెరచుకొనుట తగునా? తిరిగి వెళ్ళుమనగా ప్రేమాధిక్యముతో రాముని ఒప్పించుటకు సమీపించి, అతడును అదే విధముగా పలుకగా ఎంతవరకు రహస్యమును జరిపెదవని అనుచు వారిరువురి చుట్టు తిరిగి ప్రబలిన కోరికతో రామలక్ష్మణుల వద్దకు తిరిగి తిరిగి మదించిన మన్మధుని బాణములచే గాయపరచబడిన హృదయము గలదియై ప్రార్థించుచు వారు కలత పడకుండుటను చూచి శూర్పణఖ కోపించెను.

భారత : జ్యేష్ఠ సౌభ్రాత్ర సుస్థితి=అన్నలు కలిగిన, లక్ష్మణుడు=లక్ష్మీవంతుడైన అర్జునుడు, పల్కెను, అరయక ఇటువచ్చితి=తెలియక వచ్చితిని, అబల=ఓ ఊర్వశీ, నన్ను=అర్జునుని, బ్రహ్మచర్యస్థితి=బ్రహ్మచర్య వ్రతమును, భజియింప=స్వీకరించుటకు, పరమతాపసనాథ=వ్యాసులయొక్క, సత్యాజ్ఞపసన్=గొప్ప ఆజ్ఞయొక్క బలిమిచే, పనిచిన=పంపిన, నా అగ్రజు=ధర్మరాజు, నియోగము=కార్యము, ఈ యోజన్+ చెరుచుకో నర్హమే, మగిడి పొమ్మనినన్=తిరిగి వెళ్ళుమనగా, వలపు పొలుపు= రాగాతిశయము, గారాము=ప్రేమ, నూల్కొలుపుచు=ప్రకటించుచు, కదిసి=ఊర్వశిని చేరి, అతండట్ల పలుక=అర్జునుడదే విధముగా మాట్లాడగా, ఎందాక గుట్టుజరిపెద వనుచు, తిరిగి తిరిగి, పైకొనుకోర్కి=అతిశయించిన కోరికచే అతనిని=అర్జునుని, అతనిమ=తనుత్వములేని, దవత్=దావాగ్నివలె, అసమవిశిఖ=మన్మధ బాణములకు, దళితహృదయయగుచు=బాధతో కూడిన హృదయము కలదై, తెలచి=ఒకింత కలకలేమి అందు చూచి, నెలత కనలె=ఊర్వశి కోపించెను.

తాత్పర్యము : అన్నల సుస్థితితో లక్ష్మీసంపన్నుడైన అర్జునుడు ఇట్లు పలికెను : ఓ ఊర్వశీ! నన్ను గూర్చి తెలియక ఇట్లు వచ్చితివి. బ్రహ్మచర్యవ్రత దీక్షను పాటించమని పరమతాపసుడైన వ్యాసుని ఆజ్ఞాగాంభీర్యమును, నా అన్న ధర్మజుని నియోగమును

ఈ విధముగా చెఱచుకొనుట అర్థమే! నీవు తిరిగి వెళ్లుము అనగా, ప్రేమాధిక్యము, నెనరులను ప్రకటించుచు అర్జునుని సమీపించి, అతడు ఆ విధముగా మాట్లాడగా ఇట్లనెను. ఎంతదనుక ఈ రహస్యమును జరిపెదవు. అని మాటిమాటికి పైకొను కోరికతో తనుత్వములేని మన్మధుని నిశిత బాణములు దావాగ్నివలె హృదయ విదారకము కాగా ప్రార్థించుచు, అతని యందు కొంచెము కూడ కలత లేమిని చూచి ఊర్వశి కోపించెను.

సీ. ఏమని చెప్ప నిం పెసఁగెడు నునుఁబల్కు
        లలర నేత్రైకపర్వాంగలక్ష్మిఁ
    నొప్పురాకాసితద్యుతిమానితానన
        యంబుజాత్యుచితరూపంబు లైన
    దృక్పాణిపదగతుల్ దీపింపఁగ మహోగ్ర
        గూఢగంధంబులు రూఢిఁ బర్వ
    మేను సాంద్రతరసార్ద్రానులేపనముచే
        నవగుణాధిక్యవైభవము సూపఁ
తే. బ్రేమమదనలీలలపయిఁ బెరిఁగి పెరిఁగి
    మది గలంపంగ నిట్టట్టు గదిసి కదిసి
    సప్రకర్షబీభత్సాత్మకప్రజనిత
    వికృతియై తుదఁ గోపంబు వెలయఁ బలికె. 75

రామా : ఏమని చెప్ప=ఏమని చెప్పవచ్చును, ఇంపెసగెడు=అందమైన, నునుపల్కులు=మెత్తని మాటలు, అలరన్=ప్రకాశించగా, నేత్ర+ఏకపర్వ+అంగలక్ష్మిన్+ఒప్పు=కంటికి ఇంపైన శరీరసౌందర్యముచే ప్రకాశించు, రాకాసి=శూర్పణఖ, తత్+ద్యుతి=ఆ మనుష్య స్త్రీరూపకాంతిని, మాని=వదలి, తాను=శూర్పణఖ, అనయంబు=నిరంతరము, జాతి+ఉచిత రూపంబులైన=రాక్షసజాతికి సరియగు, దృక్+పాణిపదగతుల్=నేత్రములు, పాదములు, చేతులు కనిపించునట్లుగ,

మహాస్ర=బలునెత్తురులచే, గూఢ=నిండిన, గంధంబులు=వాసనలు, రూడిన్+పర్వ=గాఢముగా వ్యాపించగా, మేను=శరీరము, సాంద్ర=దట్టమైన, తరస=మాంసము యొక్క, ఆర్ద్ర+అనులేపనముచేన్=తడిసినవమై పూతచే, అవగుణాధిక్య వైభవము=అవగుణముల యొక్క గొప్ప వైభవమును చూపన్, ప్రేమము=ప్రేమ, అదనలీలలపైన్=తినుటపై, పెరిగి పెరిగి=అతిశయించి, మదిన్+కలంపంగ=మనస్సును కలతపెట్టగా, ఇట్టట్టు=అటునిటు, కదిసికదిసి=దగ్గరకు సమీపించి, సప్రకర్ష=ధైర్యముతోకూడిన, బీభత్స+ఆత్మక=జుగుప్సాకరముగ, ప్రజనిత=పుట్టిన, వికృతియై=వికారముకలదియై, తుదన్=చివరకు, కోపంబు వెలయెన్=కోపము కనిపించునట్లుగ, పలికెన్=పలికెను.

తాత్పర్యము : ఏమని చెప్పుదును. అందమైన లేత పలుకులు అలరగా, కంటి కింపైన శరీర సౌందర్యముతో నొప్పు శూర్పణఖ ఆ మనుష్య స్త్రీరూప కాంతిని వదలి తాను నిత్యము రాక్షసజాతి కనుకూలమైన రూపములైన చూపులు, చేతులు, పాదములు ప్రకాశింపగా పలు నెత్తురులచేత ఆవృతమైన, సాంద్రమైన మాంసపు గూఢమైన వాసనలు అధికముగా వ్యాపించగా, శరీరము దట్టమైన మాంసాను లేపనముచే అవగుణముల వైభవమును చూపగా ప్రేమ భక్షణక్రియలపై తీవ్రమై మనసును కలతబెట్టగా అటునిటు కదిసి ప్రకటించబడిన జుగుప్సారూపము నుండి పుట్టిన వికారముగలదై, చివరకు కోపము ప్రకటముకాగా నిట్లు పలికెను.

భారత : ఏమని చెప్ప, ఇంపెసగెడు నునుబల్కులలర, నేత్రైకపర్వాంగ లక్ష్మినొప్పు, రాకాసితద్యుతి=పున్నమి చంద్రునివలె, మానిత=బహూకరింపబడిన, ఆనన=ముఖముగలది, అంబుజ=పద్మములకు, అత్యుచిత రూపంబులైన=మిక్కిలి తగిన సౌందర్యముగలవైన, దృక్ పాణిపదగతులు=నేత్ర హస్తపదముల విలాసరీతులు, దీపింపగా=ప్రకాశించగా, మహాస్రక్=కల్పవృక్ష పుష్పమాలికలచే, ఊఢ=వహించబడిన, గంధంబులు=వాసనలు, రూఢిన్ పర్వన్=అధికముగా వ్యాపించగా, మేను=శరీరము, సాంద్రతర=మిక్కిలి దట్టమైన, స+ఆర్ద్ర=సాత్త్విక స్వేదముగల, అనులేపనముచే=మైపూతచే, నవ=కొత్తదైన, గుణాధిక్య వైభవము సూపన్=గుణముల యొక్క అధిక

వైభవమును చూపగా (చెమటతో తడిసిన మైపూతకు పరిమళము హెచ్చు), మదనలీలల పయిన్=మన్మథ విలాసములపై, ప్రేమ పెరిగి పెరిగి=ప్రేమ అతిశయించి, మదిన్=కలంపంగ, ఇట్టట్టు కదిసి కదిసి, సప్రకర్ష=ధైర్యముతో కూడిన, బీభత్సాత్మకున్=అర్జునుని మనస్సునకు, అప్రజనిత=పుట్టింపబడని, వికృతయై=వికారముగలదై, తుదన్ కోపంబు వెలియపలికె.

తాత్పర్యము : ఏమని చెప్పుదును. అందమైన లేబలుకులు ప్రకాశింపగా కంటికి ఇంపుగా కనిపించు శరీర సౌందర్యముతో నొప్పుచు, పున్నమి చంద్రునివలె బహూకరింపబడిన ముఖము గలదియు, పద్మములవలె మిక్కిలి తగిన సౌందర్యముగల నేత్ర హస్త పదముల యొక్క విలాసరీతులు ప్రకాశింపగా కల్పవృక్ష పుష్పమాలికలచే వహింపబడిన వాసనలు దట్టముగా వ్యాపింపగా మిక్కిలి దట్టమైన సాత్విక స్వేదముగల మైపూతలచే శరీరము కొత్తదైన గుణాధిక్య వైభవము చూపగా మన్మథ విలాసములపై ప్రేమ పెరిగి పెరిగి ధైర్యవంతుడైన అర్జునుని మనస్సునకు వికారము పుట్టింప లేనిదై చివరకు కోపము ప్రకటించుచు ఊర్వశి పలికెను.

చం. అలవి యెఱుంగలేక యిత రాంగనలంబలెనన్న నిమ్మెయిం
గలఁచుట యుక్తమే యొదవుఁ గాక భవత్కృతదుష్టచేష్టితం
బులకు ఫలంబు నేఁడొకటి పూర్ణముగానుపభోగ్యమైకడున్
జలమున నెందు నీమగతనంబు కడంకలరూపుమాలుటల్. 76

రామా : అలవి=శక్తి, ఎఱుంగలేక=తెలిసికొనలేక, ఇతర+అంగనలన్‌బలె= ఇతర స్త్రీలవలె, నన్ను=శూర్పణఖను, ఈ+మెయిన్=ఈ విధముగా, కలచుట=బాధించుట, యుక్తమే=సరియగునా, భవత్+కృత=నీవు చేసిన, దుష్టచేష్టితంబులకు=కఠినమైన పనులకు, ఫలంబు=ఫలితము, నేడు+ఒకటి=ఈనాడు ఒకటి, పూర్ణముగా=పూర్తిగా, ఉపభోగ్యమై=అనుభవించదగినదై, కడున్=మిక్కిలి, చలమున=పట్టుదలతో, ఎందున్=అన్ని ఎడల, నీ మగతనంబు=నీ శౌర్యము, కడంకల=పరాక్రమముల, రూపుమాలుటల్=సంహరించుట, ఒదవుగాక=కలుగుగాక!

తాత్పర్యము : నా శక్తిని తెలిసికొనలేక, ఇతర స్త్రీలవలె నన్ను ఈ విధముగా కలత పెట్టుట యుక్తమా! నీవు చేసిన దుష్టచర్యలకు ఫలితము ఈనాడు ఒకటి పూర్ణముగా అనుభవింపదగినదై పట్టుదలతో ఎందును నీ మగతనము పరాక్రమము నశించునుగాక (చంపెదను).

భారత : అలవి ఎఱుంగలేక ఇతరాంగనలంబలె నన్ను నిమ్మెయిన్ కలచుట యుక్తమే, భవత్కృత దుష్ట చేష్టితంబులకు ఫలంబు ఉపభోగ్యమై కడున్ చలమున, ఏడొకటి=ఒక ఏడాది, పూర్ణముగా=పూర్తిగా, మగతనంబు=పురుషత్వము, కడంకల రూపుమాలుటల్=పేడితనము, ఒదవుగాక=వచ్చునుగాక.

తాత్పర్యము : నా శక్తిని తెలిసికొనలేక ఇతర స్త్రీలవలె నన్ను ఈ విధముగా భావించుట యుక్తమా! నీవు చేసిన దుష్ట చేష్టితములకు ఫలితముగా ఏడాది నిండు పర్యంతము నీ మగతనము రూపుమాపుట అనుభవించెదవు గాక! (పేడితనము వచ్చునుగాక)

వ. అని పలికి తదనంతరంబ. 77

అర్థము : అని మాట్లాడి తరువాత

సీ. మది చపలతఁ దన్ను నెదిరిఁ గానమని సీ
తాదేవరామలా స్యాదితత్వ
విశ్రుతినాసయై వేల్పుల దనరాక
పోకలు గాంచి యుబ్బునఁ జెలంగ
నుండనేరక మర్త్యయోగేచ్ఛఁ జని యిట్లు
వచ్చెనే యని కన్న వారు నవ్వ
సిగ్గు లే కేమని యగ్గలికను జన
స్థానంబు చేరి తత్సంశ్రయఖర

తే. దూషణాదులచేత నా దుర్లలితము
లంతకంతకు దీపింప నాత్మవార్త
జరిపెదను జాతివికృతి చేష్టలు దివిజుల
ప్రీతి నుడిగించె ననుచింతఁ బెట్టి మదిని. 78

రామా : మదిచపలతన్=మనస్సులోని చాపల్యముచే, తన్ను+ఎదిరిన్=తనను, ఎదుటి వారిని, కానమిని=తెలిసికొనలేకపోవుటచే, సీతాదేవర=సీతకు మరదియైన లక్ష్మణుని యొక్క, అమల=స్వచ్ఛమైన, అసి=ఖడ్గముచే, ఆదితత్వ=మిక్కిలి ఖండితత్వముచే (అంటగోయబడినదై) విశ్రుతినాసయై=చెవులు ముక్కులేనిదై, వేల్పులు=దేవతలు, తన రాకపోకలు గాంచి=తాను రాకపోకలు సాగించుట చూచి, ఉబ్బున చెలంగగన్=ఆవేశముతో, ఉండనేరక=పట్టలేక, మర్త్యయోగేచ్ఛన్=మానవ సంయోగముపై కోరికతో, చని=వెళ్ళి, ఇట్లు వచ్చెనే=ఈ విధముగా వచ్చెనేయని, కన్నవారు నవ్వ=చూచినవారు నవ్వగా, సిగ్గులేక+ఏన్=సిగ్గులేక నేను, మని=బ్రతికి, అగ్గలికను=ఆధిక్యముతో, జనస్థానంబు చేరి=ఖరుని పట్టణమునకు పోయి, తత్+సంశ్రయ=అందున్న ఖరదూషణాదుల ఖరదూషణాదులయొక్క, చేతనా దుర్లలితములు=బుద్ధి, దుశ్చేష్టలు, అంతకంతకు దీపింపన్=మిక్కిలి అతిశయింపగా, ఆత్మవార్తన్=తన వృత్తాంతమును, జరిపెదన్=నడిపించెదను, జాతివికృత చేష్టలు= రాక్షసజాతి వికారచేష్టలచే, మదినిపెట్టి=మనస్సులో పెట్టి, అనుచింతన్=అనుగత విచారమును, (అను-ఉపసర్గ), దివిజుల=దేవతల, ప్రీతిని=ప్రియమును, ఉడిగించె=నశింపజేసెను.

తాత్పర్యము : మనస్సులో చాపల్యముచే తనను, ఎదుటివారిని గుర్తింపలేక, సీతమఱదియైన లక్ష్మణుని ఖడ్గము యొక్క మిక్కిలి ఖండితత్వముచే, చెవులు, ముక్కులేనిదై దేవతలు తన రాకపోకలు గమనించి, ఉబ్బున నుండగా, ఉండబట్టలేక, మానవ సంగమమును గోరి వెళ్లి ఇటుల వచ్చెనేయని చూచినవారు నవ్వగా, సిగ్గులేక నేను బ్రతికితినని, ఆధిక్యభావముతో జనస్థానమునకు చేరి అక్కడ నివసించు ఖరదూషణాదులచే బుద్ధి దుశ్చేష్టలు అధికముకాగా, తన వృత్తాంతమును జరిపెదనను

అనుగత విచారముతో రాక్షసజాతి వికృత చేష్టలచే దేవతల ప్రీతిని ఉడిగించెను.

భారత : మదిచపలత, తన్ను నెదిరిగానమిని, ఇసీ=నిందావాక్యము, తా=తాను (ఊర్వశి) దేవరామ=దేవతాస్త్రీ, లాస్యాది=నృత్తగీతవాద్యముల యొక్క, తత్త్వ=సిద్ధాంత జ్ఞానముయొక్క, విశ్రుతిన్=ప్రసిద్ధిచే, ఆసయై=ఆశపుట్టి, వేల్పులు, తన రాకపోకలు గాంచి ఉబ్బున చెలంగ, ఉండనేరక, మర్త్యయోగేచ్ఛన్+చని=ఇట్లు వచ్చెనేయని, కన్నవారు, నవ్వ=సిగ్గులేక, ఏమని, అగ్గలికను జనస్థానంబుచేరి, ఆధిక్యముతో సభకు చేరి, తత్+సంశ్రయ=ఆ సభ ఆశ్రయముగాగల జనుల యొక్క, ఖర=క్రూరములైన, దూషణాదులచేత=నిందలచే, నా=ఊర్వశి, దుర్లలితములు=చెడ్డ వలపులు, అంతకంతకు దీపింప, ఆత్మవార్త=ఆత్మభరణమును, జరిపెదను, జాతివికృత చేష్టలు=అప్సరో జాతికి తగని చేష్టలు, దివిజుల ప్రీతి, నుడిగించె, అనుచింతన్=అనెడి విచారమును, మదినిబెట్టి=నివాసమున కరిగెను (ముందు పద్యం).

తాత్పర్యము : మనస్సులోని చాపల్యముతో తన్ను ఎదుటివారిని తెలిసికొాన లేకపోవుటచే ఇసీ! తాను దేవతాస్త్రీ నృత్య గీత వాద్యముల సిద్ధాంత జ్ఞానము యొక్క ప్రసిద్ధిచే ఆశపుట్టి వచ్చెనేయని దేవతలు తన రాకపోకలు చూచి ఉబ్బుచుండగా, ఉండలేక మానవసంయోగముపై కోరికతో వెళ్లి ఇట్లు వచ్చెనేయని చూచువారు నవ్వగా సిగ్గులేక ఏమని సభకు వెళ్లి, తన చెడ్డవలపులు అంతకంతకు ప్రకాశింపగా ఆత్మభరణమును జరిపెదనని, అప్సరోజాతికి దగని చేష్టలు చూపి దేవతల ప్రీతిని ఉడిగించెను – అను విచారమును మనసులో బెట్టి నివాసమున కరిగెనని ముందరి పద్యముతో అన్వయము.

కం. అనివార్యముఖరవాహిని
దనవార్త్తపురఃప్రయాణతన్ వెడలఁగ రా
మనివాసమున కరిగె మ
న్యునిరూఢతఁ గదలి యుద్ధృతోత్సాహగతిన్. 79

రామా : అనివార్యము=అణపరాని, ఖరవాహిని=ఖరునిసేన, తనవార్త=తాను

వచ్చెడి వార్త, పురః ప్రయాణతన్+వెడలగన్=ముందుగా వెడలగా, రామ నివాసమున కరిగె=రాముడున్న ప్రదేశమునకు వెళ్లెను, మన్యు=రోషము యొక్క, నిరూఢతన్=పూర్తిచే, యుత్+ధృత+ఉత్సాహగతిన్=యుద్ధమునందు కలిగిన ఉత్సాహగమనముచే, కదలి.

తాత్పర్యము : అణపరాని ఖరుని సేన తాను వచ్చెడి వార్తను ముందుగానె తెలిపి రామనివాసమునకు వెళ్లెను. రోషము నిండిన యుద్ధమునందు కలిగిన ఉత్సాహ గమనముచే కదలి –

భారత : అనివార్య=వారింప శక్యముగానిదై, ముఖర=మ్రోగిపోవునట్లుగా, వాహిని=ప్రవహించుచున్న (ఎంత దాచినను తెలియు), తనవార్త=పురః ప్రయాణతన్, వెడలగ=రామ, ఊర్వశి, మన్యునిరూఢతన్=శోకముయొక్క గాఢత్వముతో, ఉద్ధృత=పెకలింపబడిన, ఉత్సాహగతిన్=ఉత్సాహముతో గూడిన గమనముచే, కదలి=కదలి, నివాసమున కరిగె.

తాత్పర్యము : వారింప శక్యముగానిదై మ్రోగిపోవునట్లుగా ప్రవహించుచున్న తనవార్త ముందుగా ప్రయాణించి వెళ్లగా ఊర్వశి తన నివాసమునకు వెళ్లెను. శోకము యొక్క గాఢతతో పెకలింపబడిన ఉత్సాహగమనముతో కదలి నివాసమున కరిగెను.

సీ. అది యంతయును విని యపుడు వేణొకచంద
 మైచింత నున్న యత్యాత్మ ఖేద
జనకుననుంగుపట్టిని దగఁ బిల్చి నీ
 యీశాపదానంబు నేనెఱుఁగుదు
మదిచింత వలదు నీ కిది యనిష్టసమాగ
 మము గాదు నాదగుమాటఁజేసి
ఘనమోదమున నుండు మనుచు జిష్ణుఁడు సుమి
 త్రానందనుండు దేర్చెఁ బూనియంత
ఆ. సారతరబలారి శాసనోద్దీప్తసం
రంభవిభవుఁ డగుచురామవిభుఁడు

భుజవశీకృతాజివిజయుండు వేల్పుల
జయజయస్వనాతిశయము నిగుడ. 80

రామా : అది+అంతయును+విని=అపుడు, వేఱొకచందమై=మఱొక విధముగా, చింతన్+ఉన్న=బాధతో కలిగిన, అతి+ఆత్మఖేదన్=చాలా విచారముగల, జనకుని+అనుంగుపట్టిన్=జనకుని ప్రియపుత్రిక అయిన సీతను – (లక్ష్మణుడు అనెడి మాట), తగన్+పిల్చి=మిక్కిలిగా పిలిచి, నీ+ఈశ=నీ రాముని యొక్క, అపదానంబు= పౌరుషము, నేనెఱుగుదు=నాకు తెలియును, మదిన్=మనసులో, చింతవలదు= బాధవలదు, నీకు, ఇది, అనిష్ట సమాగమము+కాదు=ఇష్టము లేని రాక కాదు, నాదగుమాటన్+చేసి=నా మాట విని, ఘనమోదమునన్=మిక్కిలి సంతోషముతో, ఉండుము+అనుచు, జిష్ణుడు=జయశీలుడైన, సుమిత్రానందనుండు=లక్ష్మణుండు, తేర్చెన్=తెలియజెప్పెను, పూని, అంత, సారతరబలారి=మిక్కిలి బలముగల శత్రువుల యొక్క, శాసన=శిక్షించుటయందు, ఉద్దీప్త=ప్రకాశించెడి, సంరంభవిభవుడు+అగుచు= అధిక సంతోషము గలవాడగుచు, భుజవశీకృత=భుజబలముచే వశీకరింపబడిన, ఆజివిజయుండు=యుద్ధమునందు జయము గలవాడు, రామవిభుడు=రాముడు, వేల్పుల=దేవతల, జయజయస్వన+అతిశయము=మిక్కిలిదైన జయజయ శబ్దములు, నిగుడన్=వ్యాపించగా –

తాత్పర్యము : అది యంతయును విని మఱొక విధముగా బాధతో కూడిన చాల విచారముగల సీతను తగిన రీతిలో పిల్చి (లక్ష్మణుడనెను). నీ రాముని పౌరుషము నేనెఱుగుదును. మనసులో చింతించవలదు, నీకిది ఇష్టములేని రాకకాదు. నా మాటవిని అధికసంతోషముతో నుండుమని జయశీలియైన లక్ష్మణుడు తెలియజెప్పెను. అంతట పూనికతో మిక్కిలి బలముగల శత్రువులను శిక్షించుటయందు ప్రకాశించెడి అధిక సంతోషముగలవాడై భుజబలముచే వశీకరింపబడి యుద్ధమునందు జయముగల రాముడు దేవతల జయజయధ్వానములు వ్యాపించగా –

భారత : అది యంతయును విని, అపుడు వేఱొకచందమై, చింతనున్న= అతి+ఆత్మ ఖేదజనకున్=ఆత్మకు మిక్కిలి దుఃఖమును కలిగించు, అనుంగుపట్టిని=

అర్జునుని పిల్చి, నీ, ఈ, శాపదానంబు=శాపమిచ్చుటను, నేనెఱుంగుదు=మదిచింత వలదు, నీకిది, అనిష్ట=ప్రియముగాని, సమా=సంవత్సరమందు, ఆగమము= రాకగలది కాదు, నాదగుమాటజేసి, ఘనమోదమున ఉండుమనుచు, సుమిత్రానంద నుండు=మంచి మిత్రులకు ఆనందము కలిగించు, జిష్ణుడు=ఇంద్రుడు, తేర్చెన్= ఊరడించెను, పూని=అంత, సారతర, బలారి=ఇంద్రునియొక్క, శాసనోద్దీప్త= శాసనముచే ప్రకాశించు, సంరంభవిభవుడగుచు, రామవిభుడు=మంచి కాంతి గలవాడు, భుజవశీకృత, ఆజి=యుద్ధముగలవాడు, విజయుండు=అర్జునుడు, వేల్పుల జయజయ స్వనాతిశయమునిగుడ,

తాత్పర్యము : అది అంతయును విని అపుడు మరొక విధముగా చింతించుచు ఆత్మఖేదమును పుట్టించు అర్జునుని పిలిచి (ఇంద్రుడనెడి మాట) నీకు ఈ శాపమిచ్చుటను నేనెఱుగుదును. మనస్సులో చింతవలదు. నీకు ఈ శాపము ప్రియముగాని సంవత్సరమందు రాకగలది కాదు. (నీకు ఇష్టము వచ్చినపుడు వచ్చును) నా మాట విని నీవు సంతోషముతో నుండుమని మిత్రులకానందమును కలిగించి ఇంద్రుడు వూరడించెను. అంతట సారవంతమైన ఇంద్రుని శాసనముచే ప్రకాశించెడి సంరంభముగలవాడు, మంచి కాంతిగలవాడు, భుజబలముచే వశీకరించబడిన యుద్ధముగలవాడు అయిన అర్జునుని చూచి దేవతల జయజయధ్వానములు అతిశయించెను.

తే. సర్వదివ్యాస్త్రదుర్వారసారయుతని
వాతకవచాదిరక్షోర్జితాతులరణ
విహరణోత్సాహదైవతవిమతసేన
పై నడరిచెందు బెండాడెఁ బ్రభుయుతముగ. 81

రామా : సర్వదివ్యాస్త్ర=సమస్తమైన అమోఘ అస్త్రములచే, దుర్వార= ఎదిరింపరాని, సారయుత=బలముతో కూడిన, నివాత=గాలిదూఱని, కవచాది= కవచము మొదలైన వాటిచే, రక్ష+ఊర్జిత=రక్షణచే సంపన్నమైన, అతులరణవిహరణ+ ఉత్సాహ=మిక్కిలి యుద్ధవిహార సంరంభముచే, దైవత విమత సేనపైన్=రాక్షససేనపై,

అడరి=లంఘించి, ప్రభుయుతముగ=ఖరాదులతో కూడిన సేనను, చెండుబెండాడెన్= చీల్చి చెండాడెను.

తాత్పర్యము : సమస్తమైన దివ్యాస్త్రములచే ఎదిరింపరాని బలముతోగూడి, గాలి దూఱని కవచాదుల రక్షణచే సంపన్నమైన యుద్ధవిహారసంరంభముచే రాక్షససేనపై లంఘించి ఖరాదులతో కూడిన సేనను రాముడు చీల్చి చెండాడెను.

భారత : సర్వదివ్యాస్త్ర, దుర్వారసారయుత, నివాతకవచారి రక్షః=నివాత, కవచాదులైన రాక్షసులచే, ఆర్జిత=సంపాదింపబడిన, రణవిహారణోత్సాహ, దైవతవిమతసేనపై ప్రభుయుతముగ, అడరి, చెండుబెండాడె.

తాత్పర్యము : సమస్త దివ్యాస్త్రములచే ఎదిరింపరాని బలముగల నివాతకవచాది రాక్షసులచే సంపాదింపబడిన యుద్ధవిహార సంరంభమునుగల రాక్షససేనను అర్జునుడు చీల్చి చెండాడెను.

కం. తమిఁ దద్ధ్వంసనిమిత్త
ప్రమదదశాస్యుఁ డగునాసురప్రభుకడ కేఁ
గి మనోమోదోచితసం
భ్రమతం బ్రణమిల్లె నతని పాదంబులకున్. 82

రామా : తమిన్=కామముతో, తత్+ధ్వంసనిమిత్త ప్రమద=ఆ విధముగా ఖరాదుల వధకు కారణమైన స్త్రీ – శూర్పణఖ, దశాస్యుడగు=పది తలలు గల, ఆసుర ప్రభుకడకు+ఏగి=రాక్షసరాజగు రావణుని వద్దకేగి, మనః=మనస్సునందు, అమోద+ఉచిత సంరంభతన్=దుఃఖమునకు తగిన సంరంభముతో, అతని పాదంబులకున్=రావణుని పాదములకు, ప్రణమిల్లెన్=నమస్కరించెను.

తాత్పర్యము : కామముతో ఆ విధమైన ఖరాదుల వధకు కారణమైన శూర్పణఖ పది తలలుగల రాక్షసుడైన రావణుని వద్దకు వెళ్లి మనస్సులోని దుఃఖమునకు తగిన సంరంభముతో పాదములకు నమస్కరించెను.

భారత : తమిన్=కోరికతో, తద్ధ్వంస=ఆ రాక్షససంహారము, నిమిత్త=కారణముగా గల, ప్రమదదశ=సంతోషావస్థగల, ఆస్య=ముఖముగలవాడైన, ఆ=ఆ, సురప్రభు=ఇంద్రుని, కడకు=వద్దకు, ఏగి, మనోమోదోచిత=మనస్సునకు సంతోషమునకు తగిన, సంభ్రమతన్=సంభ్రమముగలవాడై, అతని పాదంబులకు=(ఇంద్రుని) పాదములకు ప్రణమిల్లె.

తాత్పర్యము : కోరికతో ఆ రాక్షస సంహార నిమిత్తమై సంతోష ముఖముగలవాడైన ఇంద్రుని వద్దకు అర్జునుడు వెళ్లి, మనస్సునకు సంతోషముతో సంభ్రమముగలవాడై ఇంద్రుని పాదములకు నమస్కరించెను.

ఆ. అతఁడు తన యవరజయాకర్ణ నాసాస్ర
ములు నిజాక్షులవఘవిలసనమ్ము
గడు నిగుడ్చ నడిగి యడిగి తత్కథితస
భార్యరామవృత్తకార్యుఁ డగుచు. 83

రామా : అతడు=రావణుడు, తన, అవరజ=చెల్లెలయిన శూర్పణఖ యొక్క ఆకర్ణనాసాస్రములు=చెవులు, ముక్కులు అంతట నిండిన నెత్తురులు, నిజ+అక్షులన్=తన కనులయందు, అఘవిలసనమ్ము=దుఃఖోద్రేకమును, నిగుడ్చన్=హెచ్చింపగా, అడిగి+అడిగి=విచారించి, తత్=ఆ శూర్పణఖచే, కథిత= తెలుపబడిన, సభార్య=సీతా సమేతుడైన, రామ=రాముని యొక్క, వృత్త=అతీతమైన, కార్యుడు+అగుచు=కార్యముగలవాడగుచు.

తాత్పర్యము : రావణుడు తన చెల్లెలయిన శూర్పణఖ ముక్కు, చెవుల నంతట నిండిన నెత్తురు తన కనులకు దుఃఖోద్రేకమును హెచ్చింపగా అడిగి అడిగి తెలిసికొని, ఆ శూర్పణఖ తెలిపిన సీతాసమేతుడైన రాముని యొక్క అతీత కార్యముగల వాడగుచు.

భారత : అతడు=ఇంద్రుడు, తనయ=కుమారుడైన అర్జునుని, వర=శ్రేష్ఠమైన, జయ=జయము యొక్క, ఆకర్ణనా=వినుటచే, సాస్రములు=ఆనంద బాష్పములతో గూడిన, నిజాక్షులు, అనఘవిలసనమ్ము=గొప్ప విలాసమును, కడునిగుడ్చన్=అడిగి,

అడిగి, తత్+కథిత=అర్జునుడు చెప్పిన, సభార్య=సభయందలి పెద్దలకు, రామ=ఆనందకరమైన, వృత్త=వృత్తాంతముయొక్క, కార్యుడగుచు=రాక్షసులతో యుద్ధముగలవాడగుచు.

తాత్పర్యము : ఇంద్రుడు తన కుమారుడైన అర్జునుని శ్రేష్ఠమైన జయమును గూర్చి వినుటచే ఆనందబాష్పములతో తన కనులకు గొప్ప విలాసము కలిగింపగా, అడిగి, అడిగి ఆ అర్జునుడు చెప్పిన (మాటలు) సభలోని పెద్దలకు హృద్యమైన వృత్తాంతములు కాగా రాక్షసులతోడి యుద్ధము గలవాడై. (ముందరి పద్యముతో అన్వయము).

కం. తన కారుణ్యము మిక్కిలిఁ
గనుదామరగమిఁ దలిర్పఁగా గ్రక్కున లే
చి నిజాసనార్ధభాగం
బునఁ దనయున్నతగభీరమూర్తిమనుచుచున్. 84

రామా : తనకు=రావణుని, ఆరుణ్యము=ఎఱ్ఱదనము, మిక్కిలి, కను+తామరగమిన్=తామలరవంటి రెండు కనులయందు, తలిర్పగన్=కనిపించగా, గ్రక్కునలేచి=వెంటనే లేచి, నిజ=తన యొక్క, ఆసన్+అర్థభాగంబునన్=సింహాసన సగభాగమున తన+ఉన్నత గభీర=తనదైన ఉన్నతము, గంభీరమునైన, మూర్తిన్+ ఉనుచుచున్=శరీరమును నిల్పి (యుద్ధ సన్నద్ధుడై)

తాత్పర్యము : తన కనుదామర యుగమునందు ఎఱ్ఱదనము కన్పించగా వెంటనే లేచి తన సింహాసన సగభాగమున తన ఉన్నత గభీరమైన శరీరమును నిల్పి (యుద్ధ సన్నద్ధుడాయెను).

భారత : తన=ఇంద్రుని, కారుణ్యము=దయ, మిక్కిలి, కనుదామరగమిన్+ తలిర్పగా=గ్రక్కునలేచి, నిజ=తన యొక్క, ఆసన+అర్థభాగంబున=సింహాసనముపై సగభాగమున, తనయున్=అర్జునుని, నతగభీరమూర్తిన్=వినయముతో కూడిన, గంభీరమూర్తిని, ఉనుచుచున్=నిల్పి.

తాత్పర్యము : ఇంద్రుని దయచే మిక్కిలి కనుదామర యుగము ప్రకాశింపగా వెంటనే లేచి, తన అర్థ సింహాసనముపై అర్జునుని, వినయముతో కూడిన గంభీర శరీరమును నిలిపెను (సింహాసనము) కూర్చుండజేసెను.

తే. దివ్యకోటీరమాహరతీవ్రశక్తి
యుద్ధసహునకు నాకీశుఁడొసఁగె నీన
రుండు మద్బంధువై రమారూఢి నిర్వ
హించెనెఱవేరెఁ జెప్పెడిదేమి యనుచు. 85

రామా : (రావణుడనుకొనుమాట) దివ్యకోటీ=దేవతా సమూహముయొక్క, రమా=సంపదను, హర=హరించెడి, తీవ్రశక్తిన్=అధిక శౌర్యమును, యుద్ధసహునకున్=యుద్ధములో సహింపగలిగిన, నాకున్=తనకు (రావణునకు) ఈశుడు+ఒసగెన్+ఈశ్వరుడిచ్చెను, ఈనరుండు=ఈ రాముడు, మత్+బంధువైరము=నా జ్ఞాతులతో ద్వేషమును, ఆరూఢిన్=నిశ్చయముగా, నిర్వహించె=జరిపెను, నెఱవేరె=చేసెను, చెప్పెడిదేమి=చెప్పుటకు ఏమి ఉన్నది, అనుచు,

తాత్పర్యము : రావణుడిట్లనుకొనెను. దేవతాకోటి సంపదను హరించెడి అధిక శౌర్యమును యుద్ధము నోర్చుకొనగల నాకు పరమేశ్వరుడిచ్చెను. ఈ రాముడు నా జ్ఞాతులతో ద్వేషమును తీవ్రముగా నిర్వహించెను. నా కోరిక నెఱవేరెను. ఇంక చెప్పెడిదేమున్నది అనుచు –

భారత : దివ్య=దివ్యమైన, కోటీరము=కిరీటమును, ఆ–హరతీవ్ర శక్తియుద్ధ సహునకున్=ఆ హరుని తీవ్రశక్తిగల యుద్ధము నోర్చిన అర్జునునకు నాక+ఈశుడు =దేవేంద్రుడు, ఒసగె=ఇచ్చెను, ఈ నరుండు=ఈ అర్జునుడు, మత్+నాకు, బంధువై, రమారూఢి=తన ఐశ్వర్యమును, నిర్వహించెను=నిలిపెను. నెఱవేరె చెప్పెడిదేమి యనుచు.

తాత్పర్యము : ఆ హరుని తీవ్రశక్తిగల యుద్ధమునవోర్చిన అర్జునునకు దేవేంద్రుడు దివ్యమైన కిరీటమును ఇచ్చెను. ఈ అర్జునుడు నాకు బంధువై నా

ఐశ్వర్యమును నిలిపెను. నా (కోరిక) నెఱవేరెను ఇంక చెప్పెడిదేమి అనుచు –

సీ. అప్పుడు దనమదియందుఁ దద్విజయవా
ర్తాశ్రవణంబుచే నశ్రమోత్థ
మగుమన్యుకలననిలాత్మజయమలస
ద్రూప ప్రవృత్తిమాధుర్య మడఁపఁ
ద్వరితభవ్యస్వాంతవర్తనోచితతీర్థ
యాత్రసల్పితపోమహత్త్వసాధు
సహచరీకృతసింహశరభశార్దూలకు
మారీచరాక్షసుమత్తతరుణ
తే. హరిణమై రామపర్ణ శాలాంచితవన
భూములబెడంగుదృక్పర్వముగ మెలఁగుచుఁ
బ్రబలుమార్తాండసంతతి ప్రభువు మోస
పుచ్చుటకు నంచితామోద మచ్చుపడఁగ. 86

రామా : అప్పుడు, తన మదియందు=తన మనస్సులో, తత్=ఆ రాముని యొక్క, విజయ వార్తా శ్రవణంబుచే=విజయవార్తను వినుట వలన, అశ్రమ=తగ్గని, ఉత్థమగు=పుట్టిన, మన్యుకలనన్=కోపాతిశయమును, ఇలాత్మజ=సీతయొక్క, అమల=నిర్మలమైన, సద్రూప=చక్కని రూపము, ప్రవృత్తి=వార్తయొక్క, మాధుర్యము=సొంపును, అడపన్=అణచగా, త్వరిత=శీఘ్రముగ, భవ్య=కాగల, స్వ=తన యొక్క, అంత వర్తనా=నాశన కార్యక్రమమునకు, ఉచిత=తగిన, తీర్థ=రేవు అయిన (ద్వారమైన), యాత్ర=ప్రయాణమును, సల్పి=కొనసాగించి, తపోమహత్వ=తపస్సుయొక్క గొప్పతనముచే, సాధు=సాధువైన వానిని, సహచరీకృత=కలసిమెలసి తిరుగుచున్న, సింహశరభ శార్దూలకు=సింహములు, శరభములు, వార్దూలములు కలవానిని, మారీచ రాక్షసున్=మారీచుడను రాక్షసుని, మత్త తరుణ హరిణమై=మదించిన అందమైన జింకయై, రామపర్ణశాల=రాముని

యొక్క పర్ణశాల, అంచిత వనభూములన్=అందమైన వన భూములలో, బెడంగు=ఒప్పిదమైన, దృక్+పర్వముగన్=కంటికింపుగా, మెలగుచు=తిరుగుచు, ప్రబలు=అతిశయించెడు, మార్తాండ సంతతి ప్రభువున్=సూర్యవంశపు రాజైన రాముని, మోసపుచ్చుటకున్=మోసగించుటకు, అంచి=పంపి, తాన్=తాను (రావణుడు) మోదము అచ్చుపడగ=సంతోషము అతిశయించగ –

తాత్పర్యము : అప్పుడు ఆ రాముని విజయవార్తను వినుట వలన కలిగిన కోపమహిమను సీత నిర్మలమైన అందమైన రూపమును గూర్చిన వార్తా మాధుర్యము అణచగా, శీఘ్రముగా కాగల తన నాశనమునకు తగిన ద్వారమైన ప్రయాణమును చేసి, తపోమహిమచే సాధువైనవాడు, సింహశరభశార్దూలములు కలిసి మెలిసి జీవించు (ఆశ్రమము) కలవాడు. మారీచుడను రాక్షసుని అందమైన లేడి రూపములో రాముని పర్ణశాల సమీపప్రాంతములలో నయనానందకరముగా తిరుగుచు సూర్యవంశ ప్రభువైన రాముని మోసపుచ్చుటకు పంపి రావణుడు సంతోషము ప్రకటింపబడునట్లు –

భారత : అప్పుడు=అర్జునుడు ఇంద్రుని వద్ద వున్న సమయములో, తద్విజయవార్తా=అర్జునుని విజయవార్తను, అశ్రవణంబుచే=వినకపోవుటచే, అశ్రమ=ఉత్థమ, మన్యుకలనన్, అనిలాత్మజ=భీమునియొక్క యమ=నకుల సహదేవుల యొక్క, లసత్=ఒప్పుచున్న, రూపప్రవృత్తి=సౌందర్యము నడకల, మాధుర్యము=మనోహరతను, అడపన్=అణచగ, త్వరిత=తీవ్ర పడుచున్న, భవ్య=శుభమైన, స్వాంతవర్తన=మనోవ్యాపారమునకు, ఉచిత=తగిన, తీర్థయాత్ర సలిపి=తీర్థయాత్రను జరిపి, తపో మహత్వ=తపోమహిమచే, సాధు=లెస్సయైన, సహచరీకృత=సహాయముగా చేయబడిన, సింహశరభశార్దూల=సింహశరభ శార్దూలములయొక్క, కుమారి=పెంటి పిల్లలయందు, చరాక్ష=తగులుచున్న కన్నులుగల (సాదరముగ చూచు), సుమత్త=బాగా మదించిన, తరుణ హరిణమై=లేడి పిల్లలుగలదై, రామా=అందమైన, పర్ణశాలాంచిత=పర్ణశాలలకు సమీపములోని, వనభూములన్=వన భూములలో, బెడంగు, దృక్+పర్వముగన్ మెలగుచున్, మార్తాండ సంతతి ప్రభువున్=ధర్మజుని, మోసపుచ్చుటకు, అంచితామోదమచ్చుపడగన్.

తాత్పర్యము : అర్జునుడు ఇంద్రుని వద్ద నున్న సమయములో అర్జునుని విజయవార్త వినకుండుటచే తగ్గక జనించిన కోపాతిశయమును భీమ నకుల సహదేవుల అందమైన సౌందర్యము నడకల మనోహరత్వము అణచగా (అర్జునుని వియోగము భీమాదుల సందర్శనముచే తగ్గగా) తీవ్రత గలిగిన శుభప్రదమైన మనోవ్యాపారమునకు తగిన తీర్థయాత్రలు సలిపి తపోమహత్వముచే లెస్స అయిన సహాయముగా చేయబడిన సింహ శరభశార్దూలముల పెంటి పిల్లలను సాదరముగా చూచుచు జాతివైరమును విడిచి సింహాదుల పిల్లలపై లేడి పిల్లలెక్కుచు ఒప్పునట్టి పర్ణశాలల సమీప వనభూములు ఒప్పగా నేత్రపర్వమై చరించుచు ప్రబలు ధర్మజుని మోసపుచ్చుటకు మిక్కిలి సంతోషము ప్రకటించుచు జటాసురుడు వచ్చెను అని ముందరి పద్యముతో అన్వయము.

కం. ఘనదర్పోన్మీలితబహు
మునిజటుఁ డనుపరమకలుషమూర్తి యసురకాం
తినికేతనమై యతిభా
వనియతిఁ బ్రకటించునట్టి వర్ణ్యాకృతితోన్. 87

రామా : ఘనదర్ప=అధికమైన త్రుళ్ళుచే, ఉన్మీలిత=పెకలించి పారవేయబడిన, బహుముని జటుడు=అనేక మునుల జడలుగలవాడు, అనుపరమ=అణగుట లేని, కలుషమూర్తి=పాపపు శరీరముగలవాడు, అసుర=రాక్షసుడు, కాంతి=కాంతికి, నికేతనమై=నివాసమై, యతిభావనియతిన్=సన్యాసిత్వ నియమమును=ప్రకటించునట్టి, వర్ణ్య=వర్ణింపదగిన, ఆకృతితోన్=ఆకారముతో –

తాత్పర్యము : అధికమైన పటాటోపముచే పెకలించి పారవేయబడిన అనేకమంది మునుల జడలుగలవాడు, అణగని పాపశరీరముగలవాడు, అయిన రాక్షసుడు సన్యాస నియమమును ప్రకటించునట్టి ఆకారముతో

భారత : ఘనదర్ప, ఉన్మీలిత=చెఱుపబడిన, బహుముని=అనేకమంది మునులుగలవాడు, జటుడు+అను=జటాసురుడను, పరమ కలుషమూర్తి=మిక్కిలి పాపాత్ముడు, అసురకాంతినికేతనమై, యతి భావనియతిన్=ప్రకటించునట్టి,

వర్ణి=బ్రహ్మచారి యొక్క, ఆకృతితోన్=ఆకారముతో –

తాత్పర్యము : మిక్కిలి దర్పముచేత చెఱుపబడిన అనేకమంది మునులుగల జటాసురుడనెడి పాపాత్ముడైన రాక్షసుడు, రాక్షస కాంతికి నివాసమై సన్యాసిత్వ నియమమును ప్రకటించు బ్రహ్మచారి ఆకారముతో – (వచ్చెననిముందరికి అన్వయము).

వ. తదాశ్రమంబునకు వచ్చె నప్పుడు. 88

తాత్పర్యము : ఆ ఆశ్రమమునకు అప్పుడు వచ్చెను.

కం. కుతుకంబున మహితనయా
పతితదనుజవంచనప్రపంచనమృగధీ
చతురిమము లేకతానా
శ్రితబుద్ధిం జూచి యుల్లసిల్లెడుమదితోన్. 89

రామా : కుతుకంబున=కుతూహలముతో, మహితనయా=సీతయొక్క పతి=రాముని, తత్+అనుజ=ఆయన తమ్ముడైన లక్ష్మణుని, వంచన=మోసపుచ్చుటకు ప్రపంచన=ప్రకటింపుచున్న, మృగ=మృగరూపమైన, ధీచతురిమము=బుద్ధి చాతుర్యములను, ఏకతానాశ్రితబుద్ధిన్=ఏకాగ్ర చిత్తమగునట్లుగా ఆశ్రయింపబడిన బుద్ధిచే, చూచి, ఉల్లసిల్లెడు=సంతోషించు, మదితోన్=మనస్సుతో –

తాత్పర్యము : కుతూహలముతో సీతాపతియైన రాముని, అతని తమ్ముడైన లక్ష్మణుని మోసపుచ్చుటకు ప్రకటితమైన మృగరూప బుద్ధి చాతుర్యములతో ఏకాగ్ర చిత్తముగల బుద్ధిచే సంతోషించు మనస్సుతో – ముందరి పద్యమున కన్వయము.

భారత : మహిత=శ్రేష్ఠమైన, నయ=ధర్మమార్గముచే, ఆపతిత=వచ్చిన, దనుజ=జటాసురుని యొక్క, వంచన ప్రపంచన=కపట ప్రతిపాదన యొక్క, మృగ=తెలియుటయందు, ధీ, బుద్ధి యొక్క, చతురిమము=చాతుర్యము, లేక, తాను=ఆ రాక్షసుడు, ఆశ్రిత బుద్ధిన్+చూచి=ఆప్తునివలె చూచి, ఉల్లసిల్లెడు మదితోన్.

తాత్పర్యము : శ్రేష్ఠమైన ధర్మమార్గముచే వచ్చిన జటాసురుని వంచన ప్రతిపాదనను తెలియు బుద్ధి చాతుర్యములేక ఆ రాక్షసుని ఆప్తునివలె చూచి సంతోషముతోగూడిన మనస్సుతో –

కం. క్షితిజనపతి సన్నిధియం
దతనిమహితవృత్తిఁ జేర ననుకూలించెన్
మతియతి విశ్వాససమ
న్వితగ దృఢతరాఘవసతి నిశిచరుఁ డంతన్. 90

రామా : క్షితిజన్=సీతను, అపతిసన్నిధియందున్=భర్త సన్నిధిలేనియెడ, అతనిమ=తనుత్వములేని, హితవృత్తిన్=మంచివానివలె, చేరన్=సమీపించగా, రాఘవసతి=సీత, యతివిశ్వాస=సన్యాసి యనెడు నమ్మకముతో, మతిన్=బుద్ధిలో, సమన్వితగన్=కూడినదై యుండగా, దృఢతన్=భయములేక, అంతన్, నిశిచరుడు=రావణుడు.

తాత్పర్యము : భర్త సన్నిధిలోలేని సీతను తనుత్వములేని దానివలె భావించి, మంచివానివలె సమీపించగా, సీత అతడు సన్యాసియను నమ్మకముగల బుద్దితోకూడినదై భయము లేకయుండెను. అంతట ఆ రావణుడు – ముందరి పద్యము –

భారత : క్షితిజనపతి=ధర్మరాజు, సన్నిధియందు=సమీపములో, అతనిన్=జటాసురుని, మహితవృత్తిన్=గొప్ప విధముగా, చేరన్=సమీపించుటకు, అనుకూలించెన్=సమ్మతించెను, మతిన్=మనస్సులో, అతి విశ్వాస సమన్వితగతిన్=అధిక విశ్వాస యుక్తముగా, దృఢతర=ఘనమైన, అఘ=పాపములకు, వసతి=వసతియైన నిశిచరుడు=జటాసురుడు, అంతన్.

తాత్పర్యము : ధర్మరాజు తన సన్నిధిలో జటాసురుడు గొప్పగా సమీపించుటకు సమ్మతించెను. మనస్సులో అధిక విశ్వాసయుక్తముగా ఘనమైన పాపములకు నిలయమైన జటాసురుడు అంతట –

తరళ. గుణవిదూరత సంధిలన్ శ్రుతి ఘోరనిష్ఠురదుష్టభా
షణము లాడుచుఁ దద్వసత్యుటజంబుఁ జొచ్చి స్వరూపభీ
షణతనాయమనందనున్న తశౌర్యవిశ్రుతతో సగ
ర్హణతఁ బట్టి హరించెఁ దత్ప్రమదాపహారము మున్నుగాన్. 91

రామా : గుణవిదూరత సంధిలన్=రాముడు దూరముగా వెళ్లగా శ్రుతిఘోర=చెవులకు కఠినమైన, నిష్ఠుర దుష్టభాషణములాడుచు=నిందాపూర్వకమైన చెడ్డమాటలు పలుకుచు, తత్=ఆ రాముని యొక్క, వసతి=నివాసమైన, ఉటజంబున్=పర్ణశాలను, చొచ్చి=ప్రవేశించి, స్వరూప=తన రాక్షసరూపముచే, భీషణతన్=భయంకరత్వముచే, అను-న్నత శౌర్య విశ్రుతితో=నీచమైన పరాక్రమ ఖ్యాతితో (వంచనతో) ఆయమన్=సీతను, సగర్హణతన్=నిందతోకూడినవాడై, ఆయమన్=సీతను, అందన్=ఆ పర్ణశాలయందు, తత్ప్రమద=సీతా సంతోషమును, అపహారము మున్నుగాన్=ముందుగా హరించునట్లు, పట్టి హరించెన్=పట్టుకొని దొంగిలించెను.

తాత్పర్యము : రాముడు దూరముగా వెళ్ళగా చెవులకు కఠినమైన నిందాపూర్వక చెడు మాటలు పలుకుచు ఆ రాముడు నివసించు పర్ణశాలను ప్రవేశించి తన రాక్షస రూపముచే భయంకరమై నీచమైన పరాక్రమ ప్రసిద్ధితో సీతను అక్కడే పట్టి ఆమె సంతోషము ముందుగా హరింపబడునట్లుగా హరించెను.

భారత : గుణవిదూరత సంధిలన్=భీముడు దగ్గరగా లేకుండుటచే, శ్రుతిఘోరనిష్ఠుర దుష్టభాషణము లాడుచు, తత్=ఆ ధర్మజుని, వసతి+ఉటజంబున్=చొచ్చి, స్వరూపభీషణతన్, నత=అణగిన, శౌర్యవిశ్రుతితో=వంచనతో, సగర్హణతన్=నిందతో, ఆయమనందనున్=ధర్మజుని, తత్+ప్రమద=ఆ ద్రౌపదిని, పట్టి=పట్టుకొని, అపహారము మున్నుగా హరించె.

తాత్పర్యము : భీముడు దగ్గరగా లేకుండుటను చూచి, చెవులకు ఘోరముగా నిందాపూర్వకమైన చెడు మాటలు పలుకుచు ధర్మజుని నివాసమైన పర్ణశాలను జటుడు ప్రవేశించి భయంకరమైన తన రాక్షస రూపముచే అణగిన పరాక్రమముతో వంచన

పూర్వకముగ, నిందతో కూడినవాడై ముందుగా ధర్మజుని, అతని పత్ని ద్రౌపదీ సహితముగ పట్టుకపోయెను.

కం. నానాప్రకారదీనవ
చోనిచయము నడపుధర్మ సూతిని సతి న
ద్దానవవరుఁ డట్లు నిజ
స్థానమునకుఁ గొనుచు గగనసరణిం జనఁగన్. 92

రామా : నానాప్రకార=అనేక రకములైన, దీనవచోనిచయము=దీనమైన మాటల సముదాయము, నడపు=పలుకు, ధర్మసూతిని=ధర్మమునకు కారణమైన, సతిని=సీతను, ఆ+దానవవరుడు=ఆ రావణుడు, అట్లు, నిజస్థానమునకు=లంకకు, కొనుచు=తీసికొని, గగనసరణిన్=ఆకాశమార్గములో, చనగన్=వెళ్లగా.

తాత్పర్యము : అనేక ప్రకారములైన దీనమైన మాటలు పలుమార్లు పలుకు ధర్మనిలయమైన సీతను ఆ రావణుడు అట్లు లంకానగరమునకు తీసికొని ఆకాశ మార్గమున వెళ్లగా.

భారత : నానాప్రకార దీనవచోనిచయము నడపు, ధర్మసూతిని=ధర్మజుని, సతిన్=ద్రౌపదిని, అద్దానవవరుడు=ఆ జటాసురుడు, అట్లు నిజ స్థానమునకు గొనుచు గగన సరణిన్ చనగన్.

తాత్పర్యము : అనేక విధములుగా దీనమైన మాటలు పలుకు ధర్మజుని, ద్రౌపదిని ఆ జటాసురుడు ఆ విధముగా తన స్థానమునకు తీసికొని ఆకాశమార్గమున వెళ్లుచుండగా.

వ. అది యంతయు విని కోపోద్దీపితుం డగుచు నడ్డంబు పఱతెంచి. 93

అర్థము : (రెంటికీ సమము) అదియంతయు విని, కోపోద్దీపితుండగుచు =మిక్కిలి కోపించినవాడై, అడ్డంబు పఱతెంచి=అడ్డముగా వచ్చి.

తాత్పర్యము : అది యంతయు విని మిక్కిలి కోపించినవాడై అడ్డముగా వచ్చి.

చం. తిరుగుము పోకుపోకు మని తిట్టుచు వాని నెదిర్చి విక్రమో
ద్ధురుఁ డగుచు మహాబలసుతుండపతత్త్రపదోర్జిత ప్రహా
రరభసభీషణం బగుదురం బొనరించె జటాయు వంత నా
నిరుపమబాహుసాహసవినిద్రునిచేత నడంగె నెంతయున్. 94

రామా : వానిన్=ఆ రావణుని, తిరుగుము=వెనుదిరుగుము, పోకుపోకుము= వెళ్ళకుము, అని తిట్టుచు, ఎదిర్చి=ఎదిరించి, విక్రమ+ఉద్ధురుడగుచున్=అతిశయించిన పరాక్రమము గలవాడై, మహాబల=అధిక బలముగల, సు=మంచి, తుండ=ముఖము యొక్క (ముక్కు), పతత్త్ర=రెక్కల యొక్క, పద=పాదముల యొక్క, ఊర్జిత=దృఢములైన, ప్రహార=తాడనముచే, రభస=వేగముతో కూడిన, భీషణంబగు=భయంకరమైన, దురంబు=యుద్ధమును, జటాయువు, ఒనరించె=చేసెను, అంతన్=ఆ తరువాత, ఆ నిరుపమబాహుసాహసవినుద్రిచేత=అధికమైన బాహువులుగల రావణుని సాహసోపేతముచే, ఎంతయున్=మిక్కిలి, అడంగెన్=నొచ్చెను.

తాత్పర్యము : రావణుని పోకు పోకుము, వెనుదిరుగుము అని తిట్టుచు, ఎదిరించి, పరాక్రమోపేతుడై అధిక బలముగల మంచి ముక్కుతో, రెక్కలతో, పాదములతో దృఢముగా కొట్టుచు వేగముగ భయంకరమైన యుద్ధమును జటాయువు చేసెను. అంతట అనేక బాహువులుగలిగిన రావణుని సాహసముచే నొచ్చెను.

భారత : వానిన్=ఆ జటాసురుని, తిరుగుము, పోకుపోకుమని తిట్టుచు, ఎదిర్చి, విక్రమోద్ధురుడగుచు, మహాబల=వాయువు యొక్క, సుతుండు=భీముడు, అపతత్=జారనట్టి, త్రప=లజ్జగల, దోః=బాహువులచే, జిత=అభ్యస్తములైన, ప్రహార రభస భీషణంబగుదురంబు, ఒనరించె, అంతన్, ఆ నిరుపమ బాహు సాహస వినిద్రునిచేత=అసమానమైన బాహు పరాక్రమము కలిగిన భీమునిచేత, జట+ఆయువు=జటాసురుని యొక్క, ఆయువు=ఎంతయున్, అడంగె=నశించెను. (మరణించెను).

తాత్పర్యము : భీముడు ఆ జటాసురుని తిరుగుము పోకుపోకుము - అని తిట్టుచు పరాక్రమాతిశయముచే ఎదిరించి శౌర్యముతో బాహుప్రహారములచే వేగముగ భయంకరమైన యుద్ధమును చేసెను. అసమానమైన బాహు సంపదగల అతనిచే జటాసురుని ఆయువు నశించెను (మరణించెను).

వ. అక్కాలంబునందు. 95

తాత్పర్యము : ఆ సమయమున

సీ. తన ప్రియమును వేడ్క పెనుపు శోభిలఁ గృష్ణ
సారంబు సౌవర్ణ సారసమధి
కశ్రీలఁ గ్రాల నొక్కటి దైవగతిఁ జూచి
తాదృగజ్జముల కుత్కంఠ వెంచి
నలిఁ దదానయనంబునకుఁ బంప దానిజే
యంగ నబ్బకదానవాంతకుండు
రామభద్రుండు గరంబు దూరంబుగా
నరిగి యంతటను దామరలు దృష్టి
తే. కొనరు గైకొని పౌలస్త్య ఘననియుక్త
తచ్ఛమూరుదర్పమడంచి త్రాసచకిత
దారవచనాగతభ్రాతృదర్శనమున
మానసములోన మోదంబు పూనె నంత. 96

రామా : తన ప్రియ=సీత, ముని=మునుపు, వేడ్కపెనుపు శోభిలన్=వేడుక, పెంపు=అతిశయించగా, కృష్ణసారంబు=లేడి, సౌవర్ణ=సువర్ణమువలె, సార=శ్రేష్ఠములైన, సమధిక=మిక్కిలి అధికమైన, శ్రీలన్=కాంతులచే, క్రాలన్=ఒప్పుగా, ఒక్కటి=ఒకదానిని, దైవగతి, చూచి=విధివశమున చూచి, తాన్=తాను (సీత), దృక్+అబ్జములకు= నేత్రపద్మములకు,ఉత్కంఠ పెంచి=కుతూహలమును పెంచి (కోరి), నలిన్=మిక్కిలి,

తత్+ఆనయనంబునకున్=ఆ మృగమును తెచ్చుటకు, పంపన్=పంపగా, దాని చేయంగన్=దానిని తెచ్చుటకు, అబ్బక=వశముగాక, దానవాంతకుండు=రాక్షస సంహారకుడైన, రామభద్రుండు=రాముడు, కరంబు=మిక్కిలి, దూరంబుగా నరిగి=దూరముగా వెళ్ళి, అంతటను=వెంటనే, తాన్=తాను (రాముడు), మరలు దృష్టికిన్=తిరిగి వచ్చెడు ప్రయత్నముతో, ఒనరుగైకొని=ఇంపుబూని, పౌలస్త్య=రావణునిచే, ఘన నియుక్త=నిర్బంధించి నియోగింపబడిన, తచ్చమూరు=ఆ మాయ మృగము యొక్క దర్పమడంచి=పొగరును అణచి (సంహరించి), త్రాస=చకిత, భయముచే చలించిన, దార వచన=సీత మాటలచే, ఆగత=వచ్చిన, భ్రాతృ దర్శనమున=లక్ష్మణుడు కనిపించుటచే, మానసమున=మనస్సులో, అంత, అమోదంబు బూనె=ఖేదమును పొందెను.

తాత్పర్యము : మునుపు తన ప్రియ సీత వేడుక అతిశయింపగా సువర్ణమువలె భ్రమగలిగించు మృగము యొక్క అధికకాంతులను చూచి తన కనుదమ్ములకు కుతూహలము గలిగించి, దాని నపేక్షించి, దానిని తెచ్చుటకు దైవ వశమున రాముని బంపగా, అది దొరకక రాముడు చాలా దూరము వెళ్ళి తిరిగి మరలి వచ్చు నుద్దేశముతో వుండగా, రావణునిచే నిర్బంధముగా నియోగింపబడిన ఆ మాయామృగమును సంహరించి భయకంపితయైన సీత మాటలచే వచ్చిన లక్ష్మణుని చూచి రాముడు ఖేదమును పొందెను.

భారత : తన ప్రియమును వేడుక పెంపును శోభిల్లగా, కృష్ణ=ద్రౌపది, సారంబు=శ్రేష్ఠమైన, సౌవర్ణ సారసము=బంగారు తామరలను, అధికశ్రీలన్, గ్రాలన్=ఒక్కటి, దైవగతి చూచి, తాదృక్=అటువంటి, అబ్జములకు=పద్మములకు, ఉత్కంఠ పెంచి, నలిన్, తదానయనంబునకున్, పంప, దాని చేయంగ, ఆ+బక దానవాంతకుడు=ఆ బకాసురుని చంపిన భీముడు, రామభద్రుండు=భద్రముతో నొప్పినవాడు, కరంబు దూరంబుగా నరిగి, అంతటను, తామరలు=పద్మములను, దృష్టికొనరు, కంటికింపైన వానిని, కైకొని=స్వీకరించి, పౌలస్త్య=కుబేరునిచే, ఘననియుక్త=అధికముగా పంపబడిన, తత్=ఆ విధముగా వచ్చిన, చమూ=సేనల

యొక్క, ఉరుదర్పమడంచి=గొప్ప గర్వమును అడచి, త్రాస చకిత, దార వచన=ద్రౌపది మాటలచే, ఆగత=వచ్చిన, భ్రాతృదర్శనమున=అన్నదమ్ములను చూచుటచే, మోదంబు బూనెన్=దర్శించెను, అంత.

తాత్పర్యము : ద్రౌపది ప్రియముగ వేడుక మీరగా శ్రేష్ఠమైన సౌగంధిక పుష్పమును (బంగారు తామరను) మిక్కిలి అందముగా కనిపించగా ఒక దానిని విధివశమున చూచి, అట్టి పుష్పములమీద కుతూహలమును పెంచి, దానిని తెచ్చుటకు పంపగా అందుకు వెళ్ళిన బకాంతకుడైన భీముడు భద్రముగలవాడై చాలా దూరము వెళ్ళి అక్కడ తన కంటికింపైన తామరలు స్వీకరించి కుబేరుడు పంపిన యుద్ధసన్నద్ధమై వచ్చిన సేనల అధిక దర్పమును అణచి భయకంపితులై ద్రౌపది వాక్యముల వలన వచ్చిన తన సోదరుల దర్శనముచే సంతోషమును పొందెను. ఆ తరువాత -

కం. ముగుద యెఱుంగక పంచినఁ
దగునే యట్లేగుదేరఁ దమ్ముఁడ యౌద్ధ
త్యగరిష్ఠయక్షరక్షో
విగాఢ మీయడవి యిది వివేకము తెఱఁగే. 97

అర్థతాత్పర్యములు రెండింటికి సమానము.

అర్థము : ఎఱుగక=తెలియక, ముగుద=సీత (ద్రౌపది), పంచిన=పంపగా, తమ్ముడ=లక్ష్మణా! (భీమా), ఇట్లు+అరుగుదేర=ఈ విధముగా వచ్చుట, తగునే=తగునా? ఔద్ధత్య గరిష్ఠ=అతిశయించిన గర్వముగల, యక్షరక్షోవిగాఢము= యక్షులు, రాక్షసులతో నిండినది, ఈ+అడవి=ఈ అరణ్యము, ఇది వివేకము, తెఱగే=మార్గమా?

తాత్పర్యము : ఓ లక్ష్మణా! (భీమా) నిన్ను సీత (ద్రౌపది) తెలియక ఇట్లు పంపగా వచ్చుట తగునా? అధిక గర్వముగల యక్షరాక్షసులతో నిండినది ఈ అడవి గదా. ఇది వివేకమైన మార్గమా?

వ. అని యతనిం బలుకుచు. 98

అర్థము : అని అతనితో మాట్లాడుచు

ఆ. అంత నిజమహాశుగాధిక్యసంప్రాప్తి
శంసిసవ్యసాచిసముపగమవి
యోజితవ్యథత్వ మొదవ వైవస్వత
సంతతినృపలోకసత్తముండు. 99

రామా : అంత=అంతట, నిజ=తన, మహాశుక=అధికశోకముయొక్క, ఆధిక్య=అతిశయము వలన, సంప్రాప్తిన్=కలిగిన, శంసి=చెప్పుచున్నదై, సవ్య=ఎడమ దిక్కును, సాచి=అడ్డముగా సాగిన, సముపగమ=రాకగల, వి=పక్షుల అపశకున ములచే, యోజిత=కూర్చబడిన, వ్యథత్వము=బాధ, ఒదవన్=కలుగగా, వైవస్వత సంతతి=సూర్యవంశమునందలి, నృపలోకసత్తముడు=రాజేంద్రుడైన రాముడు.

తాత్పర్యము : అంతట తన అధిక శోకాధిక్యముచే కలిగిన, ఎడమ దిక్కునకు అడ్డముగా సాగి పక్షులు అపశకునములతో వచ్చుటవలన కూర్చబడిన బాధ కలుగగా సూర్యవంశరాజ శ్రేష్ఠుడైన రాముడు.

భారత : అంతట, నిజమహాశుగ=తన పాశుపతాద్యస్త్రములచే, అధిక సంప్రాప్తిన్=మహత్వసిద్ధిచే, శంసి=చెప్పుచున్న, సవ్యసాచి=అర్జునుని యొక్క, సముపగమ=రాకచే, వియోజిత=పోగొట్టబడిన, వ్యథత్వము+ఒదవ=బాధ కలిగినవాడై, వైవస్వత సంతతి నృపలోక సత్తముడు=ధర్మరాజు.

తాత్పర్యము : అంతట తన పాశుపతాద్యస్త్రములచే మహత్వసిద్ధిని తెలియజేయు అర్జునుని రాకచే పోగొట్టబడిన బాధ కలవాడై ధర్మరాజు...

సీ. తిరిగి వచ్చి యొకప్డు దీర్ఘ కాలాదర్శ
నావస్థఁ జెందనియతివశకలి

తార్తిఁ బావనిఁ గాన కడవులవెదకుచు
నంతఁ గానంబడి యాత్మహితత
నెరపుజటాయుర్వి నేతపదంబుల
జాడను జనిచని సకలకాన
నోగ్ర జంతుత్రాసయోజనాయతదోఃప్ర
భావభీమాంగకబంధమర్ద

తే. నాతిదీప్తబలాధిక్యుఁ డగుచు నున్న
దారుణాహితాద్భుతదేహుఁ దత్ప్రదుష్ట
రూపభరణనిమిత్తర్షి శాపశంసిఁ
త్రిదశపదవాసిఁ జూచి పార్థివవరుండు. 100

రామా : తిరిగి వచ్చి, ఒకప్డు=ఒకనాడు, దీర్ఘకాలాదర్శనావస్తన్+చెందని =ఎక్కువ కాలము చూడని, అతివన్=సీతను, పావనిన్=పవిత్రమైన దానిని, శకలిత+ఆర్తిన్=ఆపదలను మరలించుదానిని, కానక=చూడక, అడవుల వెదకుచు, అంతన్, కానన్‌బడి=అడవిలో పడి, ఆత్మహితత=తన మేలును, నెఱపు=చూపించు, జటాయుర్వినేత=జటాయువు అనెడి పక్షిరాజు యొక్క పదంబుల జాడను=వాక్యముల ననుసరించి, చని చని=వెళ్ళి వెళ్ళి, సకల కామన=సమస్తమైన అడవులలో నున్న, ఉగ్రజంతు=సింహాది మృగములను, త్రాస=భయపెట్టెడి, యోజనాయతదోః+ ప్రభావ=దీర్ఘ బాహువుల యొక్క ప్రభావములచే, భీమాంగ=బలిష్ఠమైన శరీరముతో కూడిన, కబంధ=కబంధుని యొక్క, మర్దన=మర్దించుటచే, అతిదీప్త=మిక్కిలి ప్రకాశించు, బలాధిక్యుడగుచు=మిక్కిలి బలముగలవాడై, ఉన్న=హరించబడిన, దారుణ=దారుణమైన, అహిత=హితము కాని, అద్భుతదేహున్=ఆశ్చర్యకరమైన శరీరముగల రాక్షసుని, తత్+ప్రదుష్ట=ఆ విధముగ మిక్కిలి కష్టమైన, రూపభరణ=రూపమును ధరించుటకు, నిమిత్త=కారణమైన, ఋషిశాపశంసిన్= ఋషిశాపమును తెలిపెడివానిని, త్రిదశ పదవాసిన్=ఆకాశమున నిలిచిన వానిని

(గంధర్వ రూపమును ధరించిన కబంధుని) పార్థివవరుండు=రాముడు చూచి –

తాత్పర్యము : తిరిగి వచ్చి ఒకనాడు దీర్ఘకాలము చూడకుండుటచే సకల ఆపదలను మరలించు పవిత్ర హృదయయైన సీత కనిపించక, అడవులలో వెదకుచు, అంతలో అడవిలో పడి యున్న జటాయువను పక్షిరాజు యొక్క మాటల సరళిని బట్టి చాలా దూరము వెళ్ళి సమస్తమైన అడవులలో వున్న క్రూరజంతువులను భయపెట్టెడి దీర్ఘబాహువులచే భయంకరాకారముగల కబంధుని మర్దనచే ప్రకాశించెడి బలాధిక్యతచే హరింపబడిన రాక్షస దేహముగలవానిని అట్లే మిక్కిలి కష్టమైన రూపమును ధరించుటకు నిమిత్తమైన ఋషిశాపమును తెలిపెడి గంధర్వ రూపమును పొందిన ఆ కబంధుని రాముడు చూచి –

భారత : తిరిగి వచ్చి, ఒకప్డు, దీర్ఘకాల+అదర్శనావస్థ చెందన్, నియతివశ=అదృష్టవశముచే, కలిత=పొందబడిన, ఆర్తిన్=పీడగలవానిని, పావనిన్=భీముని, కానక=అడవుల వెదకుచు, అంతన్‌కానంబడి, ఆత్మహితత నెఱపు=తన శుభమును తెలుపు, జటాయుః=జటాసురుని యొక్క ఆయువును, వినేత=అణచిన భీముని, పదంబుల జాడను=అడుగుల జాడను, చని చని, సకల కాననోగ్రజంతు, త్రాస, యోజన=పుట్టించుట యందు, ఆయత=అధికమైన, దోఃప్రభావ=భుజశక్తిగల, భీమ=భీముని యొక్క, అంగక=శరీరమును, బంధ=కట్టుటలోను, మర్దన=పీడించుటలోను, అతిదీప్త బలాధిక్యుడగుచు, ఉన్న=ఉండిన, దారుణ=భయంకరమైన, అహితా=సర్పత్వముతచే, అద్భుత దేహున్, తత్=ఆ, ప్రదుష్టరూప భరణనిమిత్త, ఋషిశాపశంశిన్=సప్త ఋషుల శాపమును చెప్పుచున్న నహుషుని, పార్థివవరుండు=ధర్మరాజు, చూచి –

తాత్పర్యము : తిరిగి వచ్చి ఒకనాడు చాల తడవు కనిపించకుండుటచే అదృష్టవశముచే పొందగలిగిన పీడగలవానిని, భీముని చూడలేక అడవులలో వెదకుచుండగా, అంతట కనిపించి, తన హితమును తెలియజేయువానిని జటాసురుని ఆయువును హరించిన భీముని అడుగు జాడలలో వెళ్ళి సమస్తమైన అరణ్యములలో క్రూర జంతువులకు భయమును పుట్టించు అధిక భుజశక్తిగల భీముని శరీరమును

బంధించుటయందును పీడించుట యందును మిక్కిలి బలాధిక్యత గలవాడైయుండి భయంకరమైన సర్పత్వమువలె ఆశ్చర్యకరమైన శరీరముగలవానిని ఆదుష్టమైన రూపమును ధరించుటకు కారణమైన సప్తఋషుల శాపమును గూర్చి చెప్పుచున్న నహుషుని ధర్మరాజు చూచి -

తే. అతనిఁ బూర్వనామాదిక మడిగి వినుచు
సరవితోడఁ దచ్ఛాపమోచననిమిత్త
ము లగుప్రశ్నోత్తరములు వొల్పలరఁ బ్రీతి
జరిపెఁ గృతకృత్యత నతండు సనియె దివికి. 101

రామా : అతనిన్=కబంధుని, పూర్వనామ+ఆదికము=అంతకు ముందు పేరు మొదలైనవి, అడిగి వినుచు=అడిగి తెలిసికొనుచు, సరవితోడన్=క్రమముగా, తత్+శాపవిమోచన=ఆ శాపమును తొలగించుటకు, నిమిత్తములగు=కారణములగు, ప్రశ్న+ఉత్తరములు=ప్రశ్నలు, సమాధానములు, పొల్పు+అలరన్=అందముగా, ప్రీతిన్ జరిపె=ప్రీతితో చేసెను, అతండు=ఆ కబంధుడు, కృతకృత్యతన్=ఫలించిన కోరికగలవాడై, దివికి చనియె=స్వర్గమునకు వెళ్లెను.

తాత్పర్యము : ఆ కబంధుని అంతకు ముందు పేరు మొదలైన వివరము లడిగి తెలిసికొనుచు క్రమముగా ఆ శాపమును తొలగించుటకు కారణములగు ప్రశ్నోత్తరములను అందముగా ప్రీతితో చేసెను (రాముడు). ఆ కబంధుడు కృతకృత్యుడై స్వర్గమునకు వెళ్లెను.

భారత : అతనిన్=ఆ నహుషుని, పూర్వనామాదికమడిగి వినుచు, సరవితోడ, తత్=ఆనహుషుని శాపవిమోచన నిమిత్తములగు, ప్రశ్నోత్తరములు=ప్రశ్నలు, సమాధానములు (ధర్మరాజు), పొల్పలరప్రీతి జరిపె, అతండు=నహుషుడు కృతకృత్యుడై దివికి చనియె.

తాత్పర్యము : ఆ నహుషుని పూర్వనామము మొదలైనవి అడిగి క్రమముగా ఆ నహుషుని శాపవిమోచనమునకు కారణములగు ప్రశ్నోత్తరములను

నహుషుడడుగగా ధర్మరాజు ప్రీతితో జరిపెను. నహుషుడు ఫలించిన కోరికగలవాడై స్వర్గమునకేగెను.

కం. వనదేవత లర్చించిరి
పనుపడఁ దచ్ఛాపమోక్షపరిమోచితభీ
మునిజననుతు నానృపనం
దనునిశుభానిలతఁ జలలతాకుసుమములన్. 102

రామా : తత్=ఆ కబంధునియొక్క, శాపమోక్ష=శాపవిమోచనముచే, పరిమోచిరీతభీ=విడిపింపబడిన భయముగల, మునిజననుతున్=మునులచే ప్రశంసించబడిన, ఆ నృపనందనునిన్=ఆ రాముని, శుభ+అనిలతన్=చల్లని గాలులతో, చలలతా కుసుమములన్=కదలిన లతలు, పుష్పములతో, పనుపడన్=సిద్ధపడి, వనదేవతలు, అర్చించిరి=కొలిచిరి.

తాత్పర్యము : ఆ కబంధుని శాపవిమోచనముచే తొలగిన భయముగల మునులచే ప్రశసింపబడిన ఆ రాముని - చల్లని గాలులతో కదలిన లతల పుష్పములతో సిద్ధపడి వనదేవతలు కొలిచిరి.

భారత : తత్=ఆ నహుషుని యొక్క, శాపమోక్ష, పరిమోచిత, భీమ=భీముని, భీముడుగల, జననుతుని=జనుల ప్రశంసకు లోనైన, ఆ నృపనందనుని=ధర్మరాజును, శుభానిలతన్, చలలతాకుసుమములన్, వనదేవతలర్చించిరి.

తాత్పర్యము : ఆ నహుషునకు శాపవిమోచనము కల్గించిన భీముడుగలవాడై, జనుల ప్రశంసలకు పాత్రుడైన ఆ ధర్మరాజును చల్లనిగాలుల కదలికచే లతా కుసుమములతో వనదేవతలు అర్చించిరి.

వ. ఇవ్విధంబున. 103

తాత్పర్యము : ఈ విధముగా

తే. అడవులఁ జరించునాభవ్యు నరయ వచ్చె
నంతటను శివతేజోమయస్వరూపుఁ
డై వెలయుహరి యాత్మేశుఁ డనుపమహిత
బుద్ధివర్తన మెంతయుఁ బొల్పుమీఱ. 104

రామా : అడవులన్+చరించు=అడవులలో తిరుగు, ఆభవ్యున్=ఆ రాముని, అంతటను, శివతేజోమయస్వరూపుడై=రుద్రవీర్యముతో జన్మించిన, వెలయు=ప్రకాశించు, హరి=వానరుడైన హనుమంతుడు, ఆత్మ+ఈశుడు=తన ప్రభువైన సుగ్రీవుడు, అనుపన్=పంపగా, మహితబుద్ధి వర్తనము=గొప్పదైన మానసికస్థితిని, ఎంతయు పొల్పుమీఱ=ఎంతయు నిశితముగా, అరయన్+వచ్చె=తెలిసికొనుటకు వచ్చెను.

తాత్పర్యము : అడవులలో సంచరించు ఆ రాముని అంతట రుద్ర వీర్యముతో జన్మించి ప్రకాశించు హనుమంతుడు తన ప్రభువైన సుగ్రీవుడు పంపగా, రాముని గొప్ప మానసిక స్థితిని ఎంతయు నిశితముగా తెలిసికొనుటకు వచ్చెను.

భారత : అడవుల చరించు, ఆభవ్యున్=ఆ ధర్మజుని, అరయన్=చూచుటకు, అంతటను, శివ=శుభమైన, తేజోమయ స్వరూపుడై=జ్యోతిర్మయమైన ఆకారముగలిగిన, హరి=శ్రీకృష్ణుడు, ఆత్మ=జీవులకు, ఈశుడు=కర్త, అనుపమ=సమానముగాని, హితబుద్ధివర్తనన్=మేలు చేయు కోరికతో, ఎంతయు పొల్పుమీఱ, వచ్చె.

తాత్పర్యము : అడవులలో తిరుగు ఆ ధర్మజుని చూచుటకు అంతట జ్యోతిర్మయమైన ఆకారముగల జీవులకు కర్తయైన శ్రీకృష్ణుడు అసమానమైన హితము చేయగోరి ఎంతో అందముగా వచ్చెను.

కం. వచ్చి తగురీతి దర్శన
మిచ్చి తదీయ మగువృత్త మెల్ల వినియెఁ దాఁ
జెచ్చెరఁ గుశలప్రశ్న స
ముచ్చారణపూర్వకముగ నుచిత ప్రౌఢిన్. 105

రామా : వచ్చి=హనుమ వచ్చి, తగురీతి దర్శనమిచ్చి=తగిన విధముగా కన్పించి, తదీయమగు=ఆ రామునికి చెందిన, వృత్తమెల్లన్=దశరధుడు పంపినది మొదలు సీతాపహరణ కథ యంతయు, తాన్+వినియె=తాను వినెను (హనుమంతుడు), చెచ్చెర=వెంటనే, కుశల ప్రశ్న సముచ్చారణ పూర్వకముగ= యోగక్షేమముల నడిగి ముందుగా తెలిసికొని, ఉచితప్రౌఢిన్=తగిన రీతిలో –

తాత్పర్యము : హనుమంతుడు వచ్చి తగిన విధముగా కనిపించి, ఆ రామునికి చెందిన సమస్త వృత్తాంతమును తాను వినెను. వెంటనే కుశల ప్రశ్నలు ముందుగా తెలిసికొని తగిన రీతిలో –

భారత : వచ్చి=కృష్ణుడు వచ్చి, తగినరీతి దర్శనమిచ్చి, తదీయమగు=ఆ ధర్మజుని వృత్తమెల్లన్=కథయంతయు, వినియె, తాన్=కృష్ణుడు, చెచ్చెర, కుశల ప్రశ్న సముచ్చారణ పూర్వకముగ, ఉచితప్రౌఢిన్.

తాత్పర్యము : కృష్ణుడు వచ్చి తగినరీతిగా దర్శనమిచ్చి, ఆ ధర్మజుని వృత్తాంతమంతయు వినెను. తాను వెంటనే కుశల ప్రశ్నలు ముందుగా తగిన రీతిలో అడిగి.

కం. విని తనదువృత్త మంతయు
వినిపించి పరస్పరార్థ విధి నిష్టాలా
పనిరూఢి జరుగ నపు డా
తనిమది మాటబడిఁ దెలిసి తనుమదిలోనన్. 106

రామా, భారతములకు సమానము.

విని, తనదు వృత్తమంతయు=హనుమంతుడు/కృష్ణుడు తన వృత్తాంతమంతయు వినిపించి, పరస్పర+అర్థవిధిన్=ఉభయులకు తగిన రీతిలో, ఇష్టాలాపనిరూఢి=తగిన విధముగా మాట్లాడు రీతిలో, జరుగన్=నడువగా, అపుడు, ఆతని=హనుమంతుని/కృష్ణుని, మాటబడిన్=మాట తీరును, తెలిసి, తనమదిలోనన్=తన మనస్సులో –

తాత్పర్యము : హనుమంతుడు / కృష్ణుడు వారి మాట విని, తన వృత్తాంతమంతయు వినిపించి ఉభయులకు తగిన రీతిలో ఉచితముగా మాట్లాడి, అపుడు హనుమంతుని / కృష్ణుని మాటతీరును తెలిసి తన మనస్సులో -

చం. అనిమిషరాట్తనూభవభుజాతిశయ ప్రతికారనిత్య చిం
తను రవినందనుం దనకు నచ్చినబంటుగ నేలి తత్ప్రియం
బనయము సల్పుచుం బ్రబలు నాత్మరిపుం దుదిఁ దా జయింపఁజా
ల ననుమతి న్భజించుట యలంఘ్యత నీతనియందుఁ దోఁ చెడున్.
107

రామా : (హనుమంతుడు భావించిన విధముగా)

అనిమిషరాట్+తనూభవ=ఇంద్రుని కుమారుడైన వాలి యొక్క, భుజాతిశయ=బాహుబలముయొక్క, ప్రతికార=ప్రతి క్రియయందుగల, నిత్య చింతనున్=నిత్యవిచారముగలవానిని, రవినందనున్=సూర్యకుమారుడైన సుగ్రీవుని, తనకు=వాలికి, నచ్చిన బంటుగన్+ఏలి=మెచ్చిన సేవకుడుగా - (నమ్మినబంటుగా) భావించి, తత్+ప్రియంబు=సుగ్రీవుని ప్రీతిని, సల్పుచున్=చేయుచు, ప్రబలున్= బలవంతుడైన, ఆత్మరిపున్=రావణుని, తుదిన్=ఆ తరువాత, జయింపన్= సంహరించుటకు, చాలన్=మిక్కిలి, అనుమతిన్=అనుసరించిన బుద్ధితో, భజించుట= సేవించుట, అలంఘ్యతన్=సులభముగా, ఈతని యందు, తోచెడిన్=కన్పించుచున్నది.

తాత్పర్యము : హనుమంతుడు భావించిన విధముగా - వాలి బహుబలము యొక్క ప్రతిక్రియ యందుగల నిత్యవిచారముగల సుగ్రీవుని తనకు నమ్మినబంటుగా ఏలి, ఆ సుగ్రీవునికి ప్రీతి గలిగించుచు బలవంతుడైన తన శత్రువైన రావణుని ఆ తర్వాత సంహరించుటకు మిక్కిలి అనుసరించిన బుద్ధితో సేవించుట సులభముగా ఈతని యందు కన్పించుచున్నది.

భారత : అనిమిషరాట్+తనూభవ=అర్జునుని యొక్క, భుజాతిశయ ప్రతికార, నిత్యచింతన్=నిత్య విచారముతో, రవినందనున్=కర్ణుని, నచ్చిన బంటుగానేలి,

తత్ప్రియంబు, అనయము, చల్పుచున్, ప్రబలు=ప్రబలెడినట్టి, ఆత్మరిపున్=దుర్యోధనుని, తుదిన్=అజ్ఞాతవాసము చివరలో, తాను=ధర్మజుడు, జయింపజాలను, అనుమతిన్=భజించుట, అలంఘ్యత=దాటరానిదని, ఈతనియందు=కృష్ణునియందు, తోచెడున్.

తాత్పర్యము : ధర్మజుడిట్లు భావించెను. అర్జునుని యొక్క బాహుబలాధిక్యతను గూర్చిన నిత్యవిచారముతో కర్ణుని తనకు నచ్చిన బంటుగా భావించి అతనికి ప్రీతిని కలిగించుచు ప్రబలిన దుర్యోధనుని, తమ అజ్ఞాతవాసానంతరము ధర్మజుడు జయింపజాలునను ఆలోచనతో కృష్ణుని భజించుట తప్పనిసరియని తలంచెను.

వ. అని యూహించి యతనితోడ. 108

అని భావించి హనుమంతునితో/కృష్ణునితో.

మ. నలు వొప్పన్బవమానసూతి యనియె న్నందన్మనస్థైర్యభం
గులు భావింపఁగ భూచరప్రవర మీకున్ మాకు వర్ధిల్లుని
శ్చల సౌహార్దవిశేషవర్తన లిఁకం జర్చింపఁగా నెట్టిశ
త్రులనుం ద్రుంచుట యెంతకార్య మని చేతోవృత్తిఁ దర్కించెదన్. 109

రామా : నలువొప్పన్=అందముగా, పవమానసూతి=హనుమంతుడు, అనియెన్, నందత్=సంతోషించుచున్న, మనః=మనస్సు యొక్క, స్థైర్యభంగులు= ధైర్యవిధము, భావింపగన్=ఆలోచింపగా, భూచరప్రవర!=రాజశ్రేష్ఠా (రామా), వర్తనలు=స్నేహపూర్వకమైన విశేషపు నడకలు, ఇకన్=ఇకపై, చర్చింపగా= ఆలోచింపగా, ఎట్టి శత్రులన్=ఎటువంటి శత్రువులనైన, త్రుంచుట=చంపుట, ఎంత కార్యమని=ఎంతటిపనియని, చేతోవృత్తిన్=మనస్సులో, తర్కించెదన్=ఆలోచించెదను.

తాత్పర్యము : అప్పుడు అందముగా హనుమంతుడిట్లు అనెను. సంతోషించు మనస్సు యొక్క ధైర్యవిధానము ఆలోచింపగా, రామా! మీకు, మాకు అతిశయించును.

నిలకడగల సౌహార్ద పూర్వకమైన విశేషపు నడకలు ఇకపై చర్చింపగా ఎటువంటి శత్రువులనైన సంహరించుట ఎంతటిపనియని మనస్సులో భావించెదను.

భారత : శ్రీకృష్ణుడు అనుమాట, నలువొప్పన్, పవమానసూతి=భీముని యొక్క, అని=యుద్ధమును, ఎన్నన్=యోజించినగాని, తత్+మనః స్థైర్యభంగులు=భీముని యొక్క మనోధైర్య విధానమును, భావింపగ, భూచర ప్రవర! ధర్మజా! మీకున్, మాకు వర్ధిల్లు, నిశ్చల సౌహార్ద విశేష వర్తనలికన్, చర్చింపగా, ఎట్టి శత్రులన్, ద్రుంచుట ఎంత కార్యమని, చేతోవృత్తి తర్కించెదన్.

తాత్పర్యము : శ్రీకృష్ణుడనెడిమాట=అందముగా భీముని యొక్క యుద్ధమును యోజించినగాని అతని మనోధైర్య విధానమును భావింపగా ధర్మజా! మీకు, మాకు వర్ధిల్లు నిలకడగల స్నేహపూర్వక విధానమును చర్చింపగా ఎట్టి శత్రువులనైనను సంహరించుట ఎంతటి కార్యమని మనస్సులో ఆలోచించెదను.

మ. ఇటుము న్నుర్వరఁ బర్వుచున్న విజయోదీర్ణ ప్రతాపాద్భుతో
త్కటవార్తల్ రిపుకోటికిం బిడుగులై గర్జిల్లెడు న్నీకు నెం
తటివాఁడైన నెదిర్చి ప్రాణములతోఁ దాఁ గ్రమ్మఱన్ లేమి ప్ర
స్ఫుట మోభూపయరాతిచేష్టలు భవ ద్భ్రూభంగపర్యంతముల్. 110

రామా : ఇటు=ఈ విధముగా, మున్ను=పూర్వము, ఉర్వరన్=భూమియందు, పర్వుచున్న=వ్యాపించిన, విజయ=విరోధులను జయించుటచే, ఉదీర్ణ=ప్రకటములైన, ప్రతాప=శౌర్యము యొక్క, అద్భుత+ఉత్కట వార్తల్=ఆశ్చర్యకరమైన మదించిన వార్తలు, రిపుకోటికిన్=శత్రు సమూహమునకు, పిడుగులై, గర్జిల్లెడున్=ధ్వనించుచున్నవి, నీకు=నిన్ను, ఎంతటి వాడైనను, ఎదిర్చి, ప్రాణములతో, తాన్=తాను, క్రమ్మరన్‌లేమి= తిరిగి వెళ్ళలేకపోవుట, ఓ భూపా!=ఓ రామా!, ప్రస్ఫుటము=స్పష్టము, అరాతి చేష్టలు=శత్రువుల చేష్టలు, భవత్=నీ యొక్క, భ్రూభంగ=బొమ్మముడి, పర్యంతముల్=వరకే.

తాత్పర్యము : ఓ రామా! ఇంతకు ముందు భూమిపై వ్యాపించిన నీ విజయ సంబంధమైన శౌర్యాద్భుతములతో అధికమైన వార్తలు శత్రుసముదాయమునకు పిడుగులై గర్జించుచున్నవి. ఎంతటి వాడైనను నిన్ను ఎదిరించి ప్రాణములతో వెళ్ళలేకుండుట స్పష్టము. శత్రువుల చేష్టలు నీ బొమముడి పర్యంతమే!

భారత : ఇటమున్ను, ఉర్వర పర్వుచున్న, విజయ=అర్జునుని యొక్క (మిగతా సమానము) – ఓ భూపా=ఓ ధర్మరాజా!

తాత్పర్యము : ఓ ధర్మరాజా! ఇంతకు ముందే లోకములో వ్యాపించిన అర్జునుని ప్రకటమైన శౌర్యము నిండిన ఆశ్చర్యకర వార్తలు, శత్రుకోటికి పిడుగులై గర్జిల్లుచున్నవి. ఎంతటి వాడైనను నిన్ను ఎదిరించి ప్రాణములతో తాను వెళ్ళలేకపోవుట స్పష్టము. శత్రువుల చేష్టలు నీ బొమముడి పర్యంతమే.

కం. అని పలికి యంత రవినం
దనచింతాభారనిరసన నిమిత్తములై
తనరారెడు వాక్యములా
యనవలనన్ వినుచు నలరె నజ్జనవిభుఁడున్. 111

రామా : అని పలికి, అంత, రవినందన=సుగ్రీవుని యొక్క, చింతాభార=చింతతో నిండిన, నిమిత్తములై=మనసును ఊరార్చుటకై, తనరారెడు=అందమైన, వాక్యములు=మాటలు, ఆయన వలనన్=హనుమంతుని వలన, వినుచు, ఆ+జన విభుండున్=ఆ రాముడు, అలరెన్=ప్రకాశించెను.

తాత్పర్యము : అని పలికి అంతట సుగ్రీవుని చింతాభారమును పోగొట్టు నిమిత్తములైన వాక్యములు, ఆయన వలన వినుచు రాముడు అలరెను.

భారత : అని పలికి, అంత, రవినందన=కర్ణుని వలన కలిగిన, చింతాభార=నిరసన నిమిత్తములై, తనరారెడు వాక్యములు, ఆయన వలనన్=శ్రీకృష్ణుని ద్వారా, అజ్జనవిభుడున్=ధర్మరాజు, వినుచున్+అలరెను.

తాత్పర్యము : అని మాట్లాడి ఆ తరువాత కర్ణుని వలన కలిగిన చింతా భారమును తొలగించుటకు సరిపోవు మాటలు కృష్ణుని వలన ధర్మజుడు వినుచు అలరారెను.

చం. మన మలరారఁగాఁ దనరు మాధవుమైత్రికి యుక్తమైన ప
ల్కెనయఁగఁ బల్కి వీడ్కొలిపి యీహనుమంతుఘనార్య ధర్మవ
ర్తనభృశఖిన్ను నన్నుఁ గడు రంజిలఁ జేసె నితండు వచ్చి యి
ట్లనుఁ గుఁదనంబు సూపునె య టంచుఁ దదుత్సుకతం బ్రవర్తిలెన్. 112

రామా : మనము+అలరారగ=మనస్సు సంతోషించగ, తన=హనుమంతుని యొక్క, రుమాధవు=సుగ్రీవుని యొక్క, మైత్రికి=స్నేహమునకు, యుక్తమైన=ఉచితమైన, పల్కు=మాటలను, ఎనయగ పల్కి=అందముగ మాట్లాడి, వీడ్కొలిపి=పంపి, ఈ హనుమంతు=ఈ హనుమంతుని యొక్క, ఘన=గొప్పదైన, ఆర్యధర్మవర్తన=శ్రేష్ఠమైన ధర్మప్రవర్తన, భృశ=మిక్కిలి, ఖిన్నున్=దుఃఖించుచున్న, నన్ను=రాముని, కడున్+రంజిలన్+చేసె=మిక్కిలి సంతోషింపజేసెను, ఇతండు వచ్చి=హనుమంతుడు వచ్చి, ఇట్లు=ఈ విధముగ, అనుగు+తనంబు=బంధుత్వము, చూపునె+అటంచు=చూపించునాయని, తత్+ఉత్సుకతన్=ఆ హనుమంతుని యందుగల వేడుకచే, ప్రవర్తిల్లెన్=సంచరించెన్.

తాత్పర్యము : మనస్సునకు సంతోషము కలుగగా తన సుగ్రీవుని యొక్క స్నేహమునకు సరియగు మాటలు పలికి, వీడ్కొలిపి, ఈ హనుమంతుని గొప్ప శ్రేష్టమైన ధర్మప్రవర్తనము మిక్కిలి దుఃఖించుచున్న నన్ను సంతోషింపజేసెను. ఈ విధముగ అతడు వచ్చి ఇట్లు బంధుత్వమును చూపునేయని ఆ వేడుకతో సంచరించెను.

భారత : మనమలరారగ, తనరు=ఒప్పెడు, మాధవుమైత్రికి=శ్రీకృష్ణుని స్నేహమునకు, యుక్తమైన, పల్కు, ఎనయగబల్కి, వీడ్కొల్పి, ఈహన్=కోరికచే, మంతు=అపరాధముచే, ఘన=ఘనమైన, అరి=శత్రువైన దుర్యోధనుని యొక్క,

అధర్మవర్తనన్=అధర్మముతో కూడిన ప్రవర్తనచే, భృశఖిన్ను, నన్నున్, కడురంజిలజేసె, ఇతండు వచ్చి=కృష్ణుడు వచ్చి (మిగతా సమానము).

తాత్పర్యము : మనసును సంతోషింపజేయు కృష్ణుని మైత్రికి తగిన పలుకులు పలికి కృష్ణుని సాగనంపి, కోరికచేత ఇతడు అపరాధముచే ఘనమైన శత్రువగు దుర్యోధనుని అధర్మ ప్రవర్తనచే, మిక్కిలి ఖిన్నుడనైన నన్ను సంతోషింపజేసెను. కృష్ణుడు వచ్చి ఈ విధముగ బంధుత్వమును చూపెనుగదాయని అతనిపైగల వేడుకతో ధర్మజుడు ప్రవర్తిల్లెను.

తే. అంతటను భవ్యనవ్యసఖ్య ప్రకటన
భృశసుఖితకర్ణ శకునివా గ్వశగుఁ డగుచు
వాలితమ్ముఁడు నిజకార్య వర్తనలకుఁ
గడుఁ బ్రధానమంత్రస్థితి నడపుచుండ. 113

రామా : అంతటను=ఆ తరువాత, వాలి తమ్ముడు=సుగ్రీవుడు, భవ్య=కాగల, నవ్య=క్రొత్తదైన, సఖ్య=రామునితో స్నేహముయొక్క ప్రకటన=తెలుపుటచే, భృశ=మిక్కిలి, సుఖిత=సుఖింపజేయబడిన, కర్ణ=విననింపైన, శకునివాక్=పక్షి వాక్కుల యందు, వశగుడగుచున్=ప్రసంగముగలవాడై, నిజకార్యవర్తనలకు=తన పనులు కొనసాగుటకు, కడున్=మిక్కిలి, ప్రధాన=ప్రధానులతో, మంత్రస్థితిన్=మంతనములను, నడుపుచుండ=జరుపుచుండగ.

తాత్పర్యము : ఆ తరువాత సుగ్రీవుడు కాగల నూతన రామసఖ్య ప్రకటనముచే మిక్కిలి సుఖింపజేయబడిన కర్ణములు గలవాడై శకునపక్షుల వాక్కులయందు ప్రసంగపరుడై తన ప్రధానులతో మంత్రాంగమును నడుపుచుండగా.

భారత : అంతటన్, వాలి, మీరి, తమ్ముడు, భవ్యనవ్యసఖ్యప్రకటన=భవిష్యత్తులో కొత్తగా ఏర్పడిన స్నేహ ప్రకటనచే మిక్కిలి సుఖించిన కర్ణ, శకుని, వాక్ వశుడగుచు=మాటలకు లోబడి (మిగతా సమానము).

తాత్పర్యము : ఆ తరువాత కాగల నూతన స్నేహ ప్రకటనచే మిక్కిలి సుఖించి (దుర్యోధనుడు) కర్ణుడు శకుని మాటలకు లోబడి తన తమ్ముడైన దుశ్శాసనుడు తన పనులకు మిక్కిలి ప్రధానమైన మంత్రాంగమును నడుపుచుండగా -

సీ. ఎలమిఁ బొంగుచు మహా బలసంతతిసమగ్ర
సంభ్రమ మొప్పఁగఁ జని వినిశ్చ
లత రాఘవేశుఁ డుద్ధతహృదయారిదు
ర్యోధనుండు కళత్ర యుతుఁడు ననుజ
యుతుఁడు నై నిజనితాంతోజ్జ్వలతేజోమ
హాస్ఫూర్తిభీమనరాదుల నుడి
కింపఁ దదాస్పదీకృతవనంబులఁ బ్రవ
ర్తిలుచుండ నతని దేవులఁ జెఱ యను

తే. దారుణార్తి చెందుటయు నా ధర్మ సూతి
తద్విముక్తికై తమ్ముల సద్విధి నల
రించి యప్పుడు ఘనయశశ్శ్రీల నేల
వచ్చుటయు యుక్త మగుటయు వరుసఁ దెలిపె. 114

రామా : ఎలమిన్=పొంగుచు=మిక్కిలి సంతోషించుచు, మహాబల సంతతి=వాయుపుత్రుడైన హనుమంతుడు (సుగ్రీవునితో ననెడుమాట), సమగ్ర సంభ్రమమొప్పగ=మిక్కిలి ఆశ్చర్యము కలుగగా, చని=వెళ్లి, వినిశ్చలతన్=నిలకడగా, రాఘవేశుడు=రాముడు, ఉద్ధతహృదయ=గర్వించిన హృదయములుగల, అరి=శత్రువులచే, దుర్యోధనుండు=యుద్ధము సేయ శక్యముగానివాడు, కళత్రయుతుడు=సీతా సమేతుడు, అనుజయుతుడు=లక్ష్మణునితోగూడి, నిజ=తన యొక్క, నితాంత=మిక్కిలి, ఉజ్జ్వల తేజః=మిక్కిలి ప్రకాశవంతమైన, మహాస్ఫూర్తి=స్ఫురణము, భీమ=భయంకరమైన, నరాదులన్=నరభోజనులను, ఉడికింపన్=పీడించినట్లుగా, తత్=ఆ రాక్షసులచే, ఆస్పదీకృత=ఆక్రమించబడిన, వనంబులన్=అడవులలో, ప్రవర్తిలుచుండ=

తిరుగుచుండగా, అతని దేవులన్=అతని భార్య సీతను, చెఱయును=చెరబెట్టుటయును, దారుణ+ఆర్తిన్=మిక్కిలి పీడను, చెందుటయు=పొందుటయు, ఆ ధర్మసూతి=ఆ ధర్మమునకు కారణమైన రాముడు, తత్+విముక్తికై=ఆమెను విడిపించుటకు, తమ్ము=తమను, లసత్విధిన్+అలరించి= మిక్కిలి గొప్ప రీతిలో, అలరించి, అప్పుడు, ఘనయశః+శీల=మిక్కిలి కీర్తి సంపదలతో, ఏలవచ్చుటన్=రక్షింప వచ్చుటను, యుక్తమగుటయు=ఉచితమని, వరుస తెలిపె.

తాత్పర్యము : మిక్కిలి ఉప్పొంగుచు హనుమంతుడు అధికమైన సంతోషముతో వెళ్లి – (సుగ్రీవుని కిట్లనెను), నిశ్చయ బుద్ధితో రాముడు గర్వించిన హృదయములు గల శత్రువులకు యుద్ధము సేయనలవి గానివాడు, సీతాలక్ష్మణ సమేతుడైన రాముడు తన అధిక తేజోప్రకాశము యొక్క మహాస్ఫూర్తితో భయంకరులైన రాక్షసులను పీడించునట్లుగా, ఆ రాక్షసుల కాకరమైన వనములలో తిరుగుచుండగా సీతను చెరబట్టుట యను పీడను చెందిన రాముడు సీతను విడిపించుటకై తమను కీర్తి సంపదలతో రక్షింపవచ్చుట ఉచితముగానున్న వరుసను తెలిపెను.

భారత : ఎలమి+పొంగుచు, మహాబల సంతతి=గొప్ప చతురంగ బలసమూహము యొక్క సమగ్ర సంభ్రమమొప్పగ, చని, వినిశ్చలతర=స్థిరతరములైన, అఘవేశుడు=పాప ప్రవేశముగలవాడు, ఉద్ధత హృదయారి=గొప్పవైన అంతశ్శత్రువులు గలవాడు, దుర్యోధనుండు, కళత్రయుతుడు=భార్యాసమేతుడు, అనుజయుతుడునై= సోదరులతో కూడినవానిని, నిజనితాంతోజ్జ్వల తేజోమహాస్ఫూర్తిన్=తన గొప్ప పరాక్రమ స్ఫురణతో, భీమనరాదులన్=భీముడు, అర్జునుడు మొదలైనవారిని, ఉడికింపన్= విచారపెట్టునట్లు, తత్+అస్పదీకృత వనంబుల=వారు నివసించు వనములలో, ప్రవర్తిలుచుండన్, అతనిన్=దుర్యోధనుని, దేవులన్=అతని స్త్రీలను, చెఱయను దారుణార్తి చెందుటయున్=వారికి చెఱయను బాధ కలుగగా, తమ్ములన్= భీమాదులను, ఆ ధర్మసూతి=ఆ ధర్మరాజు, తత్+విముక్తికై=వారిని విడిపించుటకు, సద్విధినలరించి, అప్పుడు ఘనయశశ్శ్రీలనేలన్, వచ్చుటయు యుక్తమగుటయు= ఉచితమని, వరుస తెలిపె.

తాత్పర్యము : మిక్కిలి ఉప్పొంగుచు గొప్ప చతురంగ బలముల సంభ్రమముతో స్థిరములైన పాపములుగలిగి, గొప్పవైన అంతః శత్రువులుగల దుర్యోధనుడు భార్యాసమేతుడు, సోదర సమేతుడై గొప్ప పరాక్రమ స్ఫురణతో భీమనరాదులు నివసించు వనములలో వారిని పీడించుటకు సంచరించుచుండగా, దుర్యోధనుని స్త్రీలను చెఱగొనగా భీమాదులను ఆ ధర్మరాజు వారి విముక్తిని మంచి మాటలతో అలరించి తమ కీర్తి సంపదతో వారిని రక్షించుట యుక్తమని క్రమముగా తెలిపెను.

వ. తెల్పి యిట్లనియె 115

మ. మును తత్పార్థివు చేసినట్టిచరితంబుల్ రాక్షసౌద్ధత్యఖం
డనపాండిత్య ధురంధరంబు లవి యెన్నం బెక్కు తాదృక్ప్రవ
ర్తనుకార్యంబున కిట్టివేళ మనకార్య ప్రస్తుతత్వం బెలర్ప
నొగిం గూడుకొనంగఁ గల్గుట మహాభాగ్యంబుగా కల్పమే. 116

రామా : మును=ఇంతకుముందు, తత్ పార్థివు=రాముని యొక్క, చేసినట్టి చరితంబుల్=చేసిన కార్యములు, రాక్షస+ఔద్ధత్య ఖండన=రాక్షసుల యొక్క గర్వమును అణుచునట్టి, పాండిత్య ధురంధరములు=పరాక్రమోపేతములు, అవిఎన్నన్=వాటిని లెక్కింపగా, పెక్కు=అధికము, తాదృక్+ప్రవర్తను కార్యంబునకు=అటువంటి రాముని పనికి, ఇట్టివేళ=ఈ సమయమున, మన కార్య ప్రస్తుతత్వంబు=మనము సహకరించు ప్రస్తావన, ఎలర్పన్=మిక్కిలి, ఒగిన్కూడు కొనంగగల్గుట=సహకరించునవకాశము కలుగుట, మహాభాగ్యంబుగాక=గొప్ప అవకాశముగాక, అల్పమే=సామాన్యమా!

తాత్పర్యము : (సుగ్రీవా) ఇంతకు ముందు రాముడు చేసిన పనులు రాక్షసుల గర్వము నణచుటలో నేర్పు బలిమి గలిగినవి పెక్కు గలవు. ఆ విధమైన ప్రవర్తనగల రాముని పనికి ఈ రోజు మనకవకాశము కలుగుట మహాభాగ్యముగాక సామాన్యమా!

భారత : మును, తత్ పార్థివు చేసినట్టి చరితంబుల్=దుర్యోధనుడు చేసిన అకృత్యములు, రాక్షసాధిక్యతను మించిన నేర్పు బలిమి కలిగినవి. అనేకములు కలవు. అట్టి నడవడికగల దుర్యోధనుని కార్యమునకు ఇట్టివేళన్=ఈ చరనున్న సమయములో,

మనకు=పాండవులకు, ఆర్యప్రస్తుతత్వంబెలర్పన్=ఘనులను ప్రసిద్ధి పొందుటకు, ఒగిన్‌కూడు కొనంగ గల్గుట మహాభాగ్యంబుగాక, అల్పమే!

తాత్పర్యము : ఇంతకు ముందు దుర్యోధనుడు చేసిన పనులు రాక్షస కృత్యములకంటె మించినవి పెక్కు గలవు. అట్టి నడవడిగల దుర్యోధనుని పనికి అతడు ఈ విధముగ చెఱనున్న సమయమున మనకు గొప్పవారను పేరు వచ్చుటకు కలిసి వచ్చిన మహాభాగ్యముగాక సామాన్యమా!

తే. అని యనుపమానదోర్బల ఘనతఁజేసి
యొకడ యాచెఱ విడిపింప నోపు నమర
శూరుఁ డాదిత్యకులరాజసూనుఁ డేమి
చెప్ప సయిదోడు ప్రాపు సుస్థిరతఁ దనర. 117

రామా : అనుపమాన=సరిలేని, దోర్బల ఘనతజేసి=బాహు పరాక్రమముచే, అని=యుద్ధమును చేసి, ఒకడ=ఒక్కడే, ఆ చెర విడిపింప నోపునమరన్=పొందికగా ఆమెను చెర నుండి విడిపింపగలవాడు, ఏమి చెప్ప=చెప్పుటకు ఏమున్నది, సయిదోడు=లక్ష్మణుని యొక్క ప్రాపు=అండ, సుస్థిరతన్ తనర=గట్టిగా లభించగా, ఆదిత్యకులరాజసూనుడు=సూర్యవంశపు రాముడు, శూరుడు=పరాక్రమవంతుడు.

తాత్పర్యము : అసమానమైన బాహుబల సంపదచే యుద్ధమునుచేసి ఒక్కడే ఆమె చెరను విడిపింపగల సమర్థుడు అతనికి లక్ష్మణుని అండ స్థిరముగా నుండగా ఆ రాముని పరాక్రమము ఏమని చెప్పుదును.

భారత : అని=ఇట్లు పలికి, అనుపన్=పంపగా, మాన=ధైర్యము యొక్క, దోర్బల=భుజముల యొక్క ఘనతన్‌చేసి=గొప్పదనముచే, అమరన్, ఒకడ=ఒక్క అర్జునుడే, ఆ చెర=దుర్యోధనుని చెరను విడిపింపనోపు, శూరుడు=పరాక్రమవంతుడైన, ఆదిత్య కులరాజసూనుడు=భానువంశపు అర్జునుడు, సయిదోడు=భీముని యొక్క ప్రాపు=అండ, సుస్థిరతన్, తనర, ఏమిచెప్ప.

తాత్పర్యము : ఇట్లు చెప్పి పంపగా ధైర్యముతో కూడిన భుజబల పరాక్రమముచే

దుర్యోధనుని విడిపించుటకు ఒక్కడే సమర్థుడైన శూరుడైన అర్జునుడు సమర్థుడు. భీముని అండ స్థిరముగా అతనికుండగా ఇంక చెప్పెడిదేమున్నది.

విశేషణము : మాన – 'మానశ్చిత్త సమున్నతిః' అని అమరము.

శా. దుర్వారస్వచమూఘనధ్వజమరుద్ధూతాభ్రతిగ్మాంశుగం
ధర్వున్ దర్పితుఁ జిత్రసేను ఖరునిన్ దండించి విడ్పించె హృ
ద్గర్వాసాధుసుయోధను న్ని జభుజౌద్ధత్యప్రథల్ దిక్కులం
బర్వంగా సకళత్ర సోదరపరిప్రాప్తవ్యథాసంగమున్. 118

రామా : దుర్వార=కఠినమైన, స్వచము=తన సేనయందున్న, ఘనధ్వజ= గొప్పవైన పతాకముల యొక్క, మరుత్=వాయువుచేత, ధూత=చలింపజేయబడిన, అభ్ర=ఆకాశమునందున్న, తిగ్మాంశుగంధర్వున్=సూర్యుని గుఱ్ఱములవంటి గుఱ్ఱములుగల వానిని, దర్పితున్=గర్వించిన, చిత్రసేనున్=చిత్రములైన సేనలుగల, ఖరునిన్=ఖరుడను రాక్షసుని, దండించి=సంహరించి, హృత్‌గర్వ=మనస్సులో గర్వముచే, అసాధు=ధూర్తులైన, సుయోధ=మంచి భటులను, నుత్=విరియగొట్టి, నిజ=తనయొక్క, భుజ+ఔద్ధత్యప్రథల్=భుజబలపరాక్రమకీర్తులు, దిక్కులన్+ పర్వంగా=దిక్కులందు వ్యాపింపగా, సకళత్ర=సమస్తమైన, త్రస=ప్రాణముల యొక్క, ఉదర=కడుపులందున్న, పరిప్రాప్త=పొందిన, వ్యథాసంగమున్=వ్యథ+అసంగమున్= వ్యథయొక్క పొందమిని, విడ్పించె=పోగొట్టెను.

(సకళత్ర సోదర=భార్య, సోదరులయందు సంతోషమును పోగొట్టెను).

తాత్పర్యము : ఘోరమైన తన సేనల యొక్క గొప్ప పతాకముల గాలిచే చలింపజేయబడిన ఆకాశమునందలి సూర్యుని గుఱ్ఱములవంటి గుఱ్ఱములుగలవానిని, విచిత్రములైన సేనలుగల వానిని ఖరుడను రాక్షసుని సంహరించి హృదయములోని గర్వముచే ధూర్తులైన సద్భటులను విరగగొట్టెడి తన భుజపరాక్రమ కీర్తి దిక్కులకు వ్యాపించగా సమస్తమైన ప్రాణుల యొక్క కడుపులలో వున్న వ్యధను తొలగించెను. (ఖరుని చంపి వాని సోదర కళత్రాదుల సంతోషమును పోగొట్టెనని మరొక అర్థము).

భారత : దుర్వార స్వచమూ ఘన ధ్వజమరుద్ధూతాభ్ర, తిగ్మాంశున్=సూర్యుడు గలవానిని (ఆయన సేన వలన సూర్యునికిని ఆకాశమున నిల్వరాదు) గంధర్వున్=గంధర్వుని, దర్పితున్=గర్వించిన, చిత్రసేనున్=చిత్రసేనుడను వానిని, ఖరునిన్=క్రూరుని, దండించి, హృద్గర్వ=హృదయమునందలి గర్వముచే, అసాధు=చెడ్డవాడైన, సుయోధనున్=దుర్యోధనుని, నిజభుజౌద్ధత్య ప్రభల్=దిక్కులన్ పర్వంగ, సకళత్ర సోదర=భార్య తమ్ములతోకూడ, పరిప్రాప్త=పొందబడిన, వ్యధాసంగమున్=కలిగిన బాధను, విడ్పించెన్=పోగొట్టెను.

తాత్పర్యము : భరింపరాని తన సేనయందున్న గొప్ప పతాకముల యొక్క గాలిచే చలింపజేయబడిన ఆకాశమందలి సూర్యుడు గలవానిని, గర్వించిన చిత్రసేనుడను క్రూర గంధర్వుని శిక్షించి హృదయమందలి గర్వముచే చెడ్డవాడైన దుర్యోధనుని భార్య సోదరులతో కలిగిన వ్యథను పోగొట్టెను.

సీ. అతనిమహితబలోదగ్రత్వమున వాలి
క్రొవ్వినతనయసంకోచిత మగు
మహిమఁ బేర్చినవాఁడుమనుజేశవర్యుఁ డూ
ర్జితశాసనప్రౌఢిసింధురాజు
తద్భార్య నొకనాఁడు దళశాల నొంటిను
న్నపుడు గోరికుచేష్టనాక్రమించి
ఘనమనోవిభ్రాంతి గాక వయోరూప
ధారణంబున మించు దానవుండు
తే. దానవానిమిషావార్యతన్మహోశు
గానలజ్వాల వెనుకొనఁగా నటవిని
వర్తనకు నొండుగతి లేక వందురుచును
గావున న్రామ నన్నేలు కరుణ ననుచు. 119

రామా : అతని=రాముని యొక్క మహితబల+ఉదగ్రత్వమున=గొప్ప పరాక్రమాతిశయముచే, వాలిక్రొవ్వు=వాలి గర్వము, ఇనతనయ=సుగ్రీవా! సంకోచితమగున్=అణగును, మహిమన్+పేర్చినవాడు=గొప్పదనము కూడినవాడు, మనుజ+ఈశ్వరవర్యుడు=రాముడు, ఊర్జితశాసన ప్రౌఢిన్=అతిశయించిన శిక్షావిధితోగూడిన బలముచే, సింధురాజు=వరుణుని బోలినవాడు, తత్+భార్యను=ఆ రాముని భార్యను, ఒకనాడు, దళశాలన్=పర్ణశాలలో, ఒంటిన్+ఉన్నప్పుడు=ఒంటరిగా నున్నపుడు, గోరికుచేష్టన్=గోరుతో దుశ్చేష్టచే, ఆక్రమించి=చేరి, ఘనమనః +విభ్రాంతిన్=గొప్పదైన మనస్సుకు భ్రమగలిగిన, కాకవయోరూప=కాకి అనెడి పక్షిరూపమును, ధారణంబున మించు దానవుండు=ధరించి వెలుగు రాక్షసుడు (కాకాసురుడు), దానవ=రాక్షసులకు, అనిమిష=దేవతలకు, అవార్య=వారించుటకు శక్యముగాని, తత్=ఆ రాముని, మహాశుగ+అనలజ్వాల=బాణాగ్నిజ్వాల, వెనుకొనగ= వెంబడింపగా, అట=అక్కడ, వినివర్తకున్=త్రిప్పుటకు (బాణాగ్నిని) ఒండుగతిలేక= మరొక మార్గములేక, వందురుచు=విచారించుచు, నన్=నన్ను, కావు=రక్షింపుము, రామ=ఓ రామా!, కరుణన్=దయతో, ఏలు=అనుచు= కాపాడుమనుచు (శరణాగతుడై).

తాత్పర్యము : ఆ రాముని గొప్ప బలాధిక్యతచే వాలి గర్వము సుగ్రీవా! అణగును. గొప్పదనముతో గూడిన రాముడు అతిశయించిన తన శిక్షావిధితో గూడిన బలముచే వరుణుని బోలిన రాముని భార్య ఒకనాడు పర్ణశాలలో ఒంటరిగా ఉన్నపుడు గోటితో (ముక్కు కొనతో) చేరి మనస్సుకు భ్రమ కలిగిన కాకి రూపమును ధరించి వచ్చిన కాకాసురుడు రాక్షసులకు, దేవతలకు వారింపశక్యముగాని, ఆ రాముని బాణాగ్ని జ్వాల వెంబడింపగా దానిని త్రిప్పుటకు అక్కడ మరొక మార్గములేక విచారముతో నన్ను ఓ రామా! రక్షింపుము! దయతో కాపాడుమనుచు –

విశేషణము : కాకవయోరూప – ఖగబాల్యాదినోర్వయః – అని అమరము.

మహాశుగ – ఆశుగౌవాయునిశిఖౌ – అని అమరము.

భారత : అతనిమ=శరీరములేని, హితబలోద్రగత్వమున=ఒప్పిన బలసంపద,

వాలి=మీరి, క్రొవ్విన=కొవ్విన, తన=తన యొక్క, రాజు, ఊర్జిత శాసన ప్రౌఢిన్, సింధురాజు=సైంధవుడు, తత్+భార్య=ఆ పాండవుల భార్య ద్రౌపదిని, ఒకనాడు, దళశాలన్+ఒంటినున్నపుడు, కోరి=కామించి, ఘనమనోవిభ్రాంతిగాక=గొప్పదైన మానసిక భ్రాంతితోగాక, వయోరూప=వయస్సు, సౌందర్యము యొక్క, ధారణంబున మించుదానవు=ధారణతో ప్రకాశించుదానవు, ఉండుదానవా?=ఉండగలవా?, నిమిష=క్షణమేని, అవార్యతన్, మహాశున్=గొప్ప శోకమనెడి, అనలజ్వాల=అగ్నికీలలు, వెనుకొనగా=అనుసరింపగా, అటవిని=అరణ్యముతో, వర్తనకున్=జీవనమునకు, బందుగతిలేక, వందురుచున్ (ఉండుదానవా?) కావునన్, రామ!=ఓ స్త్రీ! (ద్రౌపదీ!) నన్ను, కరుణ, అనుచు=అంకురింపజేసి, ఏలుము=కాపాడుము.

తాత్పర్యము : శరీరములేని గొప్ప బలపరాక్రమముచే మీరి కొవ్విన తన స్ఫుటమైన గొప్ప శాసన ప్రౌఢిగల మహిమతోగూడినవాడు, సింధురాజైన సైంధవుడు, పాండవుల భార్యను ఒకనాడు వారి పర్ణశాలలో ఒంటరిగా నుండగా కామించి గొప్పదైన మానసిక భ్రాంతితోగాక వయస్సు, సౌందర్యమును ధరించుటచే మించుదానవు - ఉండగలవా - అనుచు క్షణమైనను వారించుటకు శక్యముగాని దగుటచే అధిక శోకమును అగ్నిజ్వాల అనుసరింపగా అడవిలో జీవనమునకు మరొక మార్గములేక దుఃఖించుచుండు దానవా? అటు గావున ఓ ద్రౌపదీ కరుణను అంకురింపజేసి నన్నేలుము (అని సైంధవుడు) పలికెను.

సీ. అసమాస్త్ర శిఖినిదయావృష్టి నార్చి హృ
త్తాప మెల్లను దీఱఁ దన్ను మనుచు
నాథులులేమి నెంతయుఁ బ్రేలుచును సాధ్వ
సమ్మతివికృతోక్తి ముమ్మరముగ
శరణాగతుం డయి సరగునఁ దద్రామ
ఘనఘృణార్ణవ మన మునుఁగఁబట్టి
కొనిపోయె నాత్మీయతనువును మగుడ నా
వింటిబల్మిఁ బరిభవించి త్రిప్పఁ

ఆ. గలఁడె భీముఁ డైనబల భేదిసుతుఁ డైన
నితరుఁ డైన వీరుఁ డెవ్వఁ డైన
నని కడంక నమ్మహాబలాన్వితుఁడు రా
జన్యవరుఁడు యాత్ర సలుపునపుడు. 120

రామా : అసమాస్త్రశిఖిన్=అధికమైన బాణాగ్నిని, దయావృష్టిన్=దయ అనెడు వర్షముతో, ఆర్చి=కాపాడి, హృత్+తాపము+ఎల్లను=మదిలో తాపమంతటిని, తీఱన్=తీరునట్లుగా, తన్ను=తనను, మనుచు=కాపాడు, నాధులులేమిన్=రక్షించువారు లేకుండుటచే, ఎంతయు ప్రేలుచును=మిక్కిలి బాధపడుచు, సాధ్వసమ్ము=భయము, అతివికృతోక్తిన్=మిక్కిలి దీనత్వముతోకూడిన మాటలతో, ముమ్మరముగ=మించినవాడై, శరణాగతుండయి=శరణు కోరినవాడై, సరగునన్=వెంటనే, తత్+రామ=ఆ రాముని యొక్క, ఘన=గొప్పదైన, ఘృణా+అర్ణవమున=దయ అనెడి సముద్రమున, మునుగన్+పట్టి=మునుగుట వలన, ఆత్మీయ తనువును=తన శరీరమును, మగుడన్+కొనిపోయెన్=తిరిగి తీసికొనిపోయెను, నాన్=అనగా, వింటి=వింటిని, బల్మిన్=బలముతో, భీముడైన=భయంకరుడైన, బలభేదిసుతుడైనన్=వాలియైనను, ఇతరుడైన=మిగిలిన, వీరుడెవ్వడైన=ఏ వీరుడైనను, పరిభవించి=అవమానపరచి, ఆ+మహాబల+అన్వితుడు=ఆ మహాబలసంపన్నుడు, రాజన్యవరుడు=రాముడు, యాత్ర+చలుపునపుడు=యాత్ర చేయునపుడు, అనికడంకన్=యుద్ధ సన్నాహమును, త్రిప్పగలడె=మరలింపగలడా?

తాత్పర్యము : అధికమైన బాణాగ్ని నుండి దయావర్షముతో కాపాడి హృదయతాపమునంతయు తీరునట్లుగా తనను (కాకాసురుని) కాపాడి రక్షించు నాధులు లేకపోవుటచే, కాకాసురుడు ఎంతగానో ప్రేలుచు, భయము మించగా అధిక దైన్యముతో గూడిన వికారముతోగూడిన మాటలచే త్వరత్వరగా శరణుగోరి వెంటనే ఆ రాముని గొప్పదైన దయా సముద్రములో మునుగబట్టి తన శరీరమును విడిచి పోయెనని వింటిని. భయంకరుడైన వాలియైనగాని, ఇతర వీరులెవరైనగాని బలిమితో దానిని సహించి – ఆ మహాబలవంతుడైన రాముడు యుద్ధ సన్నాహము

చేయునపుడు పూనికతో త్రిప్పగలడా?

విశేషణము : సాధ్వసము – భీతిర్భీస్సాధ్వసంభయమ్ అని అమరము.

భారత : అసమాస్త్ర=మన్మధుడనెడి, శిఖిన్=అగ్నిని, దయావృష్టినార్చి, హృత్తాపమెల్లను, తీరన్, తన్నుము=పాదప్రహారము చేయుము (శృంగారచేష్ట), అనుచు, నాధులులేమి=భర్తలు లేకుండుటచే, ఎంతయు ప్రేలుచును=ఎంతగానో వదరుచు, సాధు=సత్పురుషులకు, అసమ్మతి=సమ్మతిలేని, వికృతోక్తిన్=వికారపు మాటలచే, శరణాగతుడై=ఇంటిలో ప్రవేశించి, సరగునన్, తత్+రామన్=ఆ ద్రౌపదిని, ఘనఘృణార్ణవమునన్=గొప్పదైన జుగుప్సా సముద్రములో, మునుగన్=మునుగుచుండగా, పట్టికొనిపోయె=బలాత్కారముగా తీసికొని వెళ్లెను (అప్పుడు సైంధవుడనుకొనుమాట), నా వింటిబల్మిని=నా విల్లు యొక్క బలమును, పరిభవించి=అణచి, భీముడైనను, బలభేదిసుతుడైనను=అర్జునుడైనను, ఇతరుడైన, వీరుడెవ్వడైనన్=ధర్మజనకుల సహదేవులలో ఎవరైనను, ఆత్మీయతనువున్=తమ భార్యను త్రిప్పగలడె, అని–యాత్ర సలుపునడు=అని ముందుకు కదలుచుండగా –

తాత్పర్యము : మదనాగ్నిని దయావర్షముతో నార్చి తన్నుము–అనుచు, భర్తలు లేకుండుటచే ఎంతయు వదరుచు సత్పురుషులకు అసమ్మతమైన వికారపు మాటలతో ఇంటిలో ప్రవేశించి వెంటనే ఆ ద్రౌపదిని గొప్ప జుగుప్సా సముద్రములో మునుగజేసి బలాత్కారముగా పట్టుకొనిపోయెను. (అప్పుడా సైంధవుడనెడిమాట), నా వింటి బలమును అణచి ఆ భీముడైనను, అర్జునుడైనను, ధర్మజ నకుల సహదేవులైనను తమ భార్యను విడిపించుకొనగలరా? – అని ముందుకు సాగునపుడు.

విశేషణము : తన్నుము=తెలుగు పదము – పాదప్రహారమను శృంగారచేష్ట, అమరములో ఈ క్రింది వివరణ.

1) సాలక్తకేన, నవపల్లవకోమలేన, పాదేన నూపురవతా మణిశింజితేన, యస్తాడ్యతే ప్రణయాపరాధోత్సేంగీకృతో భగవతామకరధ్వజేన
2) శరణాగతుడయి – శరణు గృహరక్షిత్రోః – అని అమరము.

కం. అనివారితవ్యథాసం
జననం బగురామవార్త స్వజనము చెప్పన్
విని సంభ్రమ మొదవంగం జ
య్యనసాసుగ్రీవకపిహితాధిక చింతన్. 121

రామా : అని=ఇట్లని, వారిత=వారింపబడిన, వ్యథా=విచారము యొక్క సంజననంబగు=పుట్టువుగల, రామువార్త=రాముని వృత్తాంతమును, స్వజనము=హనుమంతుడు, చెప్పన్+విని=చెప్పగా విని, సంభ్రమము+బదవగ= ఆశ్చర్యము కలుగగా, చయ్యనన్=వెంటనే, ఆ సుగ్రీవకపి=ఆ సుగ్రీవుడను కపిరాజు, హిత+అధిక చింతన్=మేలును అధికముగా చేయగోరి.

తాత్పర్యము : ఇట్లని పలికి, తొలగింపబడిన విచారము గలిగిన రాముని వృత్తాంతమును హనుమంతుడు చెప్పగా విని, ఆశ్చర్యము కలుగగా వెంటనే ఆ సుగ్రీవుడను కపిరాజు రామునికి మేలు చేయవలెనను కోరికతో.

భారత : అనివారిత=తొలగింపరాని, వ్యథా సంజననంబగు, రామవార్తన్= ద్రౌపదీ వృత్తాంతమును, స్వజనము=తమవారు, చెప్పన్, విని, సంభ్రమ మొదవగా, చయ్యన ఆ సుగ్రీవకున్=మంచి కంఠముగల ఆ ద్రౌపదికి, అపిహిత+ప్రకటమైన, ఆధికిన్=మనోవ్యధగలదానికి, అంచితన్=సంతోషముచే (ఎంచుచు)

తాత్పర్యము : తొలగింపరాని విచారము కలిగిన ద్రౌపదీ వృత్తాంతమును తమవారు చెప్పగా విని ఆశ్చర్యము కలుగునట్లుగా వెంటనే మంచి కంఠముగల ఆ ద్రౌపదికి కలిగిన మనోవ్యధను సంతోషముచే నెంచుచు అని ముందరికి అన్వయము.

విశేషణము : ఆధి – పుంస్యాధిర్మానసే వ్యథా అని అమరము.

సీ. శుభమగుచంద మెంచుచు మంగళావహ
స్వనపత్ర రథగతి సౌష్ఠవమునం

జిత్తంబు రంజిల్ల శీఘ్రయానంబున
నరిగి యానృపునిఁ బ్రహర్ష మొప్ప
గనియప్డు భీమవిక్రమశక్ర సుతదర్ప
యమనవరణనిష్ఠసమధిక మగు
తద్బలవిభవంబు తాఁ జూడఁగా మించి
వర్తిల్ల మానవేశ్వరవరుండు

తే. ధర్మ రాజితజయమహోత్సాహుఁ డగుచు
నుగ్రజవనైకబాణప్రయోగమహిమ
నచలసంఖ్యాతాలంబుల నధికసార
తరుల ధరఁ గూల్చెఁ జూపఱు వెఱఁగుపడఁగ. 122

రామా : శుభమగుచందము=శుభము కలుగు విధానమును, ఎంచుచు=భావించుచు, మంగళావహ=శుభప్రదమైన, స్వన=వాక్కులుగల, పత్రరథ=పక్షుల యొక్క, గతిసౌష్ఠవమునన్=మంచి నడకలచే, (శకునములు లెస్సగా కన్పించగా), చిత్తంబురంజిల్లన్=మనసు సంతోషింపగా, శీఘ్రయానంబునన్=త్వరితగతితో, అరిగి=వెళ్లి, ఆనృపునిన్=ఆ రాముని, ప్రహర్షమొప్పన్=సంతోషము కలుగగా, కని=చూచి, అప్డు=అప్పుడు, భీమ విక్రమ=భయంకర పరాక్రమముగల, శక్రసుత=వాలి యొక్క, దర్ప=గర్వమును, యమ=అణచెడి, నవరణనిష్ఠచే=క్రొత్తదైన యుద్ధమునందు, సమధికమగు=అధికమైన, తత్+బలవిభవంబు=ఆయన పరాక్రమ వైభవమును, తాన్=సుగ్రీవుడు, చూడన్+కామించి=చూడదలచి, వర్తిల్లన్=ప్రవర్తించగా, మానవ+ఈశ్వరవరుండు=రాముడు, ధర్మ=వింటిచే, రాజిత=ప్రకాశించిన, జయమహోత్సాహుడగుచు=జయముచే అధికోత్సాహము గలవాడై ఉగ్రజవనైక=తీవ్ర వేగముతో, బాణప్రయోగమహిమన్=బాణమును ప్రయోగించుటచే, అచలసంఖ్య=ఏడు అంకెగల, తాలంబులన్=తాటి చెట్లను, చూపరు=చూచువారు, వెఱగుపడగ=భయపడునట్లు, అధిక సారతరుల=మంచి చేవమ్రానులను, ధరన్=నేలపై, కూల్చెన్=పడగొట్టెను.

తాత్పర్యము : శుభము కలుగు రీతిని భావించుచు, మంగళకరమైన వాక్కులుగల శకునపక్షుల యొక్క మంచినడకలచే మనసు సంతోషింపగా త్వరత్వరగా వెళ్లి ఆ రాముని సంతోషముతో చూచి అప్పుడు భయంకర పరాక్రమముగల వాలి దర్పమును అణచెడి నూతన యుద్ధనిష్ఠ అధికముకాగా, రాముని బలవైభవమును సుగ్రీవుడు చూడగోరి ప్రవర్తించగా, ఆ రాముడు తన వింటిచే జయోత్సాహము ప్రకాశింపగా తీవ్రవేగముగల బాణములు ప్రయోగించుటచే ఏడు సంఖ్యగల తాటిచెట్లను చేవగలవానిని చూపరులు భయపడునట్లు నేలగూల్చెను.

భారత : శుభమగు చందమెంచుచు, మంగళావహ, స్వన=సకిలింతలుగల, పత్ర=గుఱ్ఱముల యొక్క, రథగతి సౌష్ఠవమున్=రథగమన వేగముచే, చిత్తంబు రంజిల్లన్, శీఘ్రయానంబున, అరిగి, ఆనృపునిన్=సైంధవుని, ప్రహర్షమొప్పన్, కని, అప్డు, భీమవిక్రమ=భీముని పరాక్రమమును, శక్రసుతదర్ప=అర్జునుని పరాక్రమమును, యమ=ఆమడలైనకులసహదేవుల, నవరణనిష్ఠన, సమధికమగు, తత్=ఆ సైంధవుని, బలవిభవంబు, తాచూడగా మించి, వర్ధిల్లున్, మానవేశ్వరవరుండు=రాజైన, ధర్మరాజు, ఇతజయ=పొందబడిన జయముచే, మహోత్సాహుడగుచు, ఉగ్ర=తీవ్రమైన, జవన=వేగముగల, ఏక=ముఖ్యమైన, బాణప్రయోగ మహిమన్, అచలసంఖ్యతా= చలింపని యుద్ధముగలవారౌటచే, ఆలంబుల=అవలంబించినవారిని, అధికసారతరులన్=ప్రబల శ్రేష్ఠులను, చూపఱు వెఱగుపడగ, ధరన్+కూల్చెన్.

తాత్పర్యము : శుభమైన రీతిని భావించుచు మంగళకరమైన సకిలింతలతో కూడిన గుఱ్ఱములు కట్టిన రథగమన వేగమునకు మనసు రంజిల్లగా వేగ గమనముచే వెళ్లి, సైంధవుని సంతోషముతో చూచి, అప్పుడు భీమార్జునుల పరాక్రమము, నకుల సహదేవుల నూతన యుద్ధ సంరంభము అధికముకాగా వారి బలవైభవమును తాను చూడగా మించి ప్రవర్తిల్లగా, రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు పొందిన జయముచే చాల నుత్సాహము గలవాడై తీవ్ర వేగముగల ప్రధాన బాణ ప్రయోగమహిమచే చలింపని యుద్ధనీతి నవలంబించిన ప్రబల శ్రేష్ఠులను చూచువారు నివ్వెరపడునట్లు నేల గూల్చెను.

సీ. అకలుషాత్మప్రమదాప్తి నుబ్బుచు వాలి
తమ్ముఁ డాసింధు భూధవకుమారు
సఖ్యాతిబలముపసం దగుల్పడఁజేసి
యన్న యహీనదర్పాధికతలు
మనుజాధినాథుసమ్యక్ప్రయుక్తవిశిఖ
త్వంబున భంగించి తప్పకతని
పనుపునఁ గ్రమ్మఱఁ దనకీశబల మెందుఁ
గడు ననుకూల మై నడచుటకును

తే. రంజిలుచు రామకార్యవర్తనకుఁ దగిన
యట్టిమాటల నాహ్లాద మాచరించె
నంత నురువనవాసకాలాంత మగుడు
నుపరికృత్యంబునకు మహోద్యోగుఁ డయ్యె. 123

రామా : అకలుష=పంకిలముగాని, ఆత్మ=తన యొక్క, ప్రమద+ఆప్తి= సంతోషము కలిగి, ఉబ్బుచు=పొంగుచు, వాలి తమ్ముడు=సుగ్రీవుడు, ఆసింధుభూధవకుమారు=నాలుగు సముద్రములచే చుట్టబడిన రాజకుమారుడైన రాముని, సఖ్య=స్నేహము యొక్క, అతిబలముపసన్=మిక్కిలి బలసంపదచే, తగుల్పడన్+చేసి=కలుగుటచే, అన్న=వాలి యొక్క, అహీన=తక్కువగాని, దర్ప+అధికతలు=గర్వాతిశయము, మనుజాధినాథు=రామునిచే, సమ్యక్+ప్రయుక్త= లెస్సగా ప్రయోగింపబడిన, విశిఖత్వమున్=బాణముగలవాడై భంగించి=చంపించి (వాలిని), తప్పక=క్రమముగా, అతని పనుపున=రాముని ఆదేశముతో, క్రమ్మఱ=తిరిగి, తన, కీశబలము=వానరసేన, ఎందున్=అన్ని యెడల, కడున్=మిక్కిలి, అనుకూలమై నడచుటకును=అనుకూలించుటకు, రంజిలుచు=సంతోషించుచు, రామకార్య వర్తనకు=రాముని పనికి తగిన విధముగా, తగిన యట్టిమాటలన్=ఉచితరీతిని మాటలచే, ఆహ్లాదము+ఆచరించె=సంతోషమును కలిగించెను, అంతన్=అంతట,

ఉరువన=వర్షమునకు, వాస=నివాసమైన, కాల=కాలము యొక్క అంతము= శరత్కాలము, అగుడున్=అగుటవలన, ఉపరికృత్యంబునకు=తరువాతి పనికి, మహోద్యోగుడయ్యె=తీవ్రమైన ప్రయత్నము చేసెను.

తాత్పర్యము : కలుషితముగాని తన సంతోషముచే పొంగుచు సుగ్రీవుడు చతుస్సముద్ర పరివేష్ఠితుడైన రాముని స్నేహమను అధిక బలసంపదచే వాలి యొక్క అధికమైన గర్వాతిశయమును రామునిచే లెస్సగా ప్రయోగింపబడిన బాణముగలవాడై వాలిని చంపించి, క్రమముగా రాముని ఆదేశముతో తిరిగి తన వానరసేన అన్ని యెడల రాముని కార్యనిర్వహణను అనుకూలించుటకు (దండెత్తి సీతనుహరించెదమను) తగిన మాటలాడి రామునకు సంతోషము కలిగించెను. తర్వాత శరత్కాలము అగుటవలన దానికి తగిన ప్రయత్నము చేసెను.

భారత : అకలుషా=పతివ్రతయైన, ఆత్మప్రమదా=ద్రౌపది యొక్క, ఆప్తిన్=ప్రాప్తిచే, ఉబ్బుచు=పొంగుచు, వాలి=మీరి, తమ్ముడు=భీముడు, ఆ సింధుభూధవకుమారు=సైంధవుని సఖ్యాతి, బలముపసన్=స్నేహబలసంపదచే, తగుల్పడజేసి, అన్న, అహీనదర్పాధిక, తలున్=స్వరూపముగలవానిని, మనుజాధినాధుని=సైంధవుని, సమ్యక్ ప్రయుక్త=మిక్కిలిగా, విశిఖిత్వంబునన్+ భంగించి=శిఖను కోసి, తన పనుపునన్, క్రమ్మఱన్=తిరిగి రాగా, తనకున్, ఈశ బలము=ఈశ్వరానుగ్రహము, కడుననుకూలమై నడచుటకును, రంజిలుచు, ఆర్యవర్తనకు=సద్వర్తన గలదానికి, రామకు=ద్రౌపదికి, తగిన యట్టిమాటలచే, ఆహ్లాద మొనరించెను=సంతోషము కలిగించెను, అంతన్, ఉరువనవాస కాలాంతమగుడు= గొప్పదైన వనవాస కాలము పూర్తి యగుటచే ఉపరికృత్యమునకు, మహోద్యోగుడయ్యె.

తాత్పర్యము : పతివ్రతయైన ద్రౌపది ప్రాప్తించుటచే పొంగుచు, భీముడు సైంధవుని స్నేహబల సంపదచేగూడి గొప్ప గర్వాధిక స్వరూపముగల సైంధవునికి మిక్కిలిగా శిఖకోసి తన ఆదేశముచే తిరిగి రాగా, తనకు ఈశ్వరానుగ్రహము మిక్కిలి అనుకూలముగానున్నదని సంతోషించుచు, సద్వర్తనగల ద్రౌపదికి తగిన మాటలచే సంతోషము కలిగించెను. అంతలో గొప్పదైన అరణ్యవాస కాలము పూర్తి యగుటచే

తరువాతి కార్యమునకు తగిన ప్రయత్నము నారంభించెను.

వ. అప్పుడు. 124.

కం. చూపట్టి నిర్ణిరోధది
శాపతితాభినుతభానుసంతతిచోద్యం
బై పరcగ హరిణభావము
కైపు వడసి మిగుల వింతగతినెలయించెన్. 125

రామా : శరత్కాలవర్ణన, చూపట్టి=కన్పించి, నిర్ణిరోధ=అవిచ్ఛిన్నముగా, దిశా=దిక్కులయందు, పతిత=వ్యాపించిన, అభినుత=స్తుతింపబడిన, భానుసంతతి= కిరణ సముదాయము, చోద్యంబై పరగ=ఆశ్చర్యకరము కాగా, హరిణ భావము=తెల్లదనము యొక్క, కైపు=విలాసమును, వడసి, మిగులన్, వింతగతిన్=వింత మార్గములో, నెల=చంద్రుడు, ఇంచెన=ఇంపాయెను.

తాత్పర్యము : అవిచ్ఛిన్నముగా దిక్కులయందు వ్యాపించిన స్తుతింపబడిన కిరణ సముదాయము ఆశ్చర్యకరము కాగా తెల్లదనము యొక్క విలాసమును పొంది మిక్కిలి వింత మార్గములో చంద్రుడు ఇంపాయెను.

భారత : చూపట్టి, నిర్ణరోధ=అడ్డంకిలేని, దిశాపతితా=దిక్పతిత్వముచే, అభినుత=పొగడబడిన, భానుసంతతి=యముడు, చోద్యంబై పరగన్, హరిణభావము=లేడి రూపము యొక్క కైపువడసి=అందమును పొంది, మిగులన్, వింతగతిన్, ఎలయించెన్=బ్రాహ్మణుని మోసపుచ్చెను.

తాత్పర్యము : కన్పించి, అడ్డంకిలేని దిక్పాలకత్వముచే పొగడబడిన యముడు ఆశ్చర్యకరముగా లేడి రూపము యొక్క అందమును పొంది వింతరీతిలో బ్రాహ్మణుని మోసపుచ్చెను.

సీ. భాసురశృంగలీలాసముత్కృష్టమ
హారణితాఖిన్న సారసద్ధ్వి

జప్రార్థితవ్యవస్థాపనం బై కడు
నాహరిణము దిరం బగుపొలుపున
విలసిల్లుచున్న యావేళయందును రాజు
దమ్ములు నతులితోత్కర్ష శాలి
బాణాసనశరప్రపంచంబు విస్ఫూర్తిఁ
బరఁగంగఁ దవిలి వెంబడి నలసిరి

తే. మివుల వర్తిల్లెఁ దచ్ఛరదవసరభస
లీల సత్కృష్ణసారరత్నా లఘుమహి
మకుఁ దృణకణాయమానమై మానసంబు
గడుఁజలింపంగ నివ్వెఱపడియె నృపుఁడు. 126

రామా : భాసుర=ఒప్పుచున్న, శృంగ=ప్రాధాన్యము యొక్క, లీలా=విలాసముచే, సముత్కృష్ట=మిక్కిలి గొప్పవి అయిన, మహారణిత=అధిక స్వరముగల, అఖిన్న=సంతోషపడుచున్న, సారసద్విజ=బెగ్గురు పక్షుల యొక్క, ప్రార్థిత=కోరబడిన, వ్యవస్థాపనంబై=నిలిపిన (సారస పక్షులింకను ఈ శరత్కాల మొప్పుచుండవలెనని కోరెను), కడున్=మిక్కిలి, హరిణ=శుభ్రమైన, ముదిరంబు=మేఘము, అగుపొలుపునన్+ విలసిల్లుచున్న, అయిన ఒప్పిదముచే శోభిల్లుచున్న, ఆ వేళయందును, రాజు=చంద్రుడు, తమ్ములును=పద్మములు, అతులిత+ఉత్కర్ష=మిక్కిలి ఉత్సాహవంతమైన, శాలి=రాజనము యొక్కయు, బాణా=గోరంట యొక్కయు, ఆసన=వేగిమ్రాకుల యొక్కయు, శర=రెల్లు యొక్కయు, ప్రపంచంబు=మహిమ, విస్ఫూర్తిన్+పరగన్=శోభిల్లగా, తవిలి, వెంబడి=లగ్నమై, వెంటనే, అల సిరి=ఆ కాంతి, మివులవర్థిల్లె=మిక్కిలి వ్యాపించెను, తత్=ఆ శరత్+అవసర=శరత్కాలమందున్న, భసలీ=భృంగస్త్రీలనెడి, లసత్+కృష్ణ=ఒప్పుచున్న నీలిరంగుగల, సారరత్న=శ్రేష్ఠమైన రత్నముల యొక్క, అలఘు మహిమకు=గొప్ప మహిమకు, తృణకణాయమానమై= హరింపబడి, మానసంబు=మనస్సు,

కడున్+చలింపంగన్=మిక్కిలి చలింపగా, నృపుడు=రాముడు, నివ్వెఱపడియె= ఆశ్చర్యపోయెను.

తాత్పర్యము : శరత్కాలవర్ణన, విరహబాధ. ప్రాధాన్యముతో నొప్పుచు, విలాసముచే మిక్కిలి శ్రేష్ఠములైన అధిక స్వరముతో సంతోషపడుచున్న బెగ్గురు పక్షులచే కోరబడినదై నిలిచిన మిక్కిలి శుభ్రమైన మేఘముచే విలసిల్లుచున్న ఆ శరత్కాలమున చంద్రుడును, పద్మములును, రాజనములు, గోరంటలు, వేగిమ్రాకులు, రెల్లు మహిమచే కూడిన స్ఫూర్తి లగ్నమైన ఆ శరత్కాలకాంతి భృంగ స్త్రీల నీలవర్ణ శ్రేష్ఠరత్నముల అధిక మహిమకు హరింపబడినవై మనసు చలింపగా ఆ రాముడు ఆశ్చర్యపోయెను.

విశేషణము : ముదిరము – ఘనజీమూతముదిరజలముగ్ధూమయోనః అని అమరము.

శాలి – శాలయః కలమాద్యాశ్చ అని అమరము.

బాణా – నీలీ ఝుంటీద్వయోర్బాణా అని అమరము.

ఆసన – సర్జకాసన బంధూక పుష్ప ప్రియక జీవికాః అని అమరము

భారత : భాసుర, శృంగ=కొమ్ముల యొక్క, లీలా=క్రియచే (రాచుకొనుటచే), సముత్=బ్రాహ్మణుని సంతోషముతో, కృష్ణ=హరింపబడిన, మహత్=అధికమైన, అరణితా=అరణిగలవాడౌటచే, ఖిన్న=దుఃఖించు, సార=శ్రేష్ఠుడైన, సత్+ద్విజ=గొప్ప బ్రాహ్మణునిచే, ప్రార్థిత వ్యవస్థాపనంబై=కోరిన కోర్కె గలిగి, కడున్, ఆ హరిణము=ఆ జింక, తిరంబగు పొలుపున=స్థిరమైన వైభవముతో, విలసిల్లుచున్న, ఆ వేళయందును, రాజు=ధర్మరాజును, తమ్ములు=భీమాదులును, అతులితోత్కర్షన్, శాలి=ఒప్పుచున్న, బాణాసన=విండ్ల యొక్క, శరప్రపంచంబు=బాణముల వ్యాపారము, విస్ఫూర్తిన్+ పరగంగ=ప్రకాశింపగా, తవిలివెంబడి=వెంటబడి, అలసిరి=అలిసిపోయిరి, తత్=ఆ పాండవుల యొక్క, శరదవ=దావాగ్నివంటి బాణముల, సరభసలీల=శీఘ్రపు వ్యాపారము, సత్=లెస్స అయిన, కృష్ణ సారరత్న=మృగశ్రేష్ఠము యొక్క, అలఘుమహిమకు, తృణకణాయమానమై=గడ్డి పరకతో సమానముగా, మానసంబు కడుచలింపన్, నృపుడు=ధర్మరాజు, నివ్వెఱపడియె.

తాత్పర్యము : కొమ్ముల రాపిడిచే అరణిని హరించి బ్రాహ్మణుని సంతోషమును హరింపగా అధికముగా దుఃఖించుచున్న శ్రేష్ఠమైన సద్బ్రాహ్మణునిచే ప్రార్థింపబడి, ఆ హరిణము స్థిరముగా నుండగా ధర్మజుడు, భీమాది సోదరులు మిక్కిలి ఉత్కర్షతో విండ్ల నుండి బాణములను వదలిన వ్యాపార విస్ఫూర్తి వెంటదగిలి అలసిరి. ఆ పాండవుల దవాగ్నివంటి బాణముల శీఘ్ర వ్యాపారము, లెస్సయయిన మృగ శ్రేష్ఠము యొక్క గొప్ప మహిమలను తృణప్రాయము చేయగా ధర్మజుడు మనసు చలించి నివ్వెఱపడెను.

సీ. విప్రకార్యము గాని వెతఁ జేసి కరము దు
స్సహ మైనకాండవర్షశ్రమమున
నదటేది కలఁకనీరాని తమ్ములు ఘన
కాలమహిమచేసి నోలిఁ బొలియ
మగుడంగ మనిపె వారిగురుప్రసాదంబు
దనయుక్తి సామర్థ్యఘనతచేతఁ
జాలంగఁ బడసి తత్సమయంబునందిత
కామాళి యాగుణఘనతనుండు
తే. విరహితాపకారంబు తద్విభవ మతను
వికసనము నెవ్వరిమనంబునకు నొనర్ప
దారయఁగ నది య ట్లుండె నపుడు నృపుని
యుపరికృత్యంబునకుఁ దగఁ దపనసుతుఁడు. 127

రామా : విప్రకార్యముగాని=మాన్పుటకు సాధ్యముగాని, వెతన్+చేసి=బాధ వలన, కరము=మిక్కిలి, దుస్సహమైన=భరింపరాని, కాండవర్షశ్రమమునన్=ఉదక వర్షము వలన బాధచే, అదటు+ఏది=బిరుదుచెడి, కలకనీరు=కలుషితమైన నీటిని, అని=పొంది, తమ్ములు=పద్మములు, ఘనకాల=వర్షాకాలముయొక్క, మహిమన్+చేసి=మహిమచే, ఓలిన్=వరుసగా, పొలియన్=అణగగా, మగుడంగ=

మరలునట్లు, మనిపె=రక్షించెను, వారి=నీటి యొక్క గురుప్రసాదంబు=బాగా తేరుటను, తన=తనయొక్క, యుక్తిసామర్థ్య=కలిసిన సామర్థ్యముయొక్క, ఘనతచేత=గొప్పదనముచే, చాలంగబడసి=సరిపడునట్లు పొంది, తత్ సమయంబు=ఆ శరత్కాలము, నందిత కామాళి=సంతోషింప చేయబడిన, ఆ గుణఘనతనుండు=ఆ గుణముయొక్క ఆధిక్యతతోనుండు, విరహితాపకారంబు=విరహులకు తాపము కలుగజేసెడి, తత్=ఆ శరత్కాలముయొక్క, విభవము=గొప్పతనము, అతను వికసనమున్=మన్మథుని వికాసమున, ఎవ్వరి మనంబునకు+ఒనర్పదు=ఎవరి మనస్సుకు అట్లు చేయదు!, ఆరయగ=చూడగా, అది=యట్లుండె, అపుడు=ఆ శరత్కాలమునందు, నృపుని=రాముని, ఉపరికృత్యంబునకున్=రావణునిపై దండెత్తుటకు, తపనసుతుడు=సుగ్రీవుడు, తగన్=తగిన విధముగా.

తాత్పర్యము : మాన్పుటకు శక్యముగాని మిక్కిలి దుస్సహమైన వర్షపునీటి వలన అలమటచే చెడి కలుషితమైన నీటిని పొంది పద్మములు వర్షాకాల మహిమచే ప్రకాశమును కోల్పోగా, నీరు లెస్సగా తేరుటచే శరత్ సంపర్కముచే ఆ శరత్కాలము సంతోషించిన తుమ్మెదలు గలదియై తిరిగి రక్షించెను. గుణాధిక్యముచే ఉండెడి విరహులకు తాపము చేసెడి ఆ శరత్ ఋతు వైభవము మన్మథుని వికసనముచే ఎవ్వరి మనస్సును బాధింపదు? ఆలోచింపగా అది అట్లుండెను. ఆ శరత్కాలము నందు రాముని కార్యమైన రావణునిపై దండెత్తుటకు సుగ్రీవుడు - పంపెనని ముందరి పద్యముతో అన్వయము.

కం. అజ్ఞాతవాస మహితన
యాజ్ఞాపనరామభాషణార్పిత కార్య
ప్రజ్ఞులను జేసి యనిపె ని
జాజ్ఞాకరణైకశరణు లగువారిఁ దగన్. 128

రామా : అజ్ఞాతవాస=తెలియబడని ఉనికిగల (తెలియని ఉనికిగల) మహితనయ=సీతాదేవికి, జ్ఞాపన=గుర్తులు చెప్పెడి, రామభాషణ=రాముని మాటలచే,

అర్పిత=పెట్టబడిన, కార్యప్రజ్ఞలను జేసి=కార్యముపై పట్టుదలగల వారినిగాజేసి, నిజ+ఆజ్ఞాకరణ=తన ఆదేశమును నిర్వహించుటయే, ఏకశరణులగువారిన్= ముఖ్యాధారముగా తనకు అధీనమైన వారిని, తగన్=తగిన రీతిలో, అనిపెన్=పంపెను.

తాత్పర్యము : జాడ తెలియని సీతాదేవి గుర్తులు చెప్పిన రాముని వాక్యములచే కార్యదీక్ష కలవారినిజేసి తన ఆదేశమే ప్రధానముగా తనకు అధీనులైన వారిని, తగ పంపెను.

భారత : అజ్ఞాతవాస మహిత=గొప్పదైన అజ్ఞాతవాసమందలి, నయ=నీతి యొక్క ఆజ్ఞాపన=ఉపదేశించుటచే, రామ=మనోహరములైన, భాషణార్పిత=మాటలచే కూర్చబడిన, కార్యప్రజ్ఞులను=కార్యము చేయు సమర్థులనుగా, చేసి, (వరములిచ్చి) నిజాజ్ఞాకరణైక శరణులగువారిన్=పాండవులను, తగన్=అనిపె.

తాత్పర్యము : గొప్పదైన అజ్ఞాతవాసమందలి నీతి నుపదేశించుటచే మనోహరములైన మాటలు కూర్చబడిన (హితోపదేశముతో కూడిన వరములిచ్చి) కార్యము చేయు సమర్థులనుగాచేసి, తన ఆదేశమునకు అధీనమైన వారినిగా చేసి పాండవులను తగురీతిలో పంపెను.

ఆ. అపుడు వారుమహిజనావిధితస్థితిఁ
జేయుటకుఁ దదుక్తి చేకొని కడు
నుల్లముల నుదంచితోత్సాహు లగుచును
వివిధదిక్పురముల వెదకి చూచి. 129

రామా : అపుడు, వారు=వానరులు, మహిజను=సీతను, అవిధితస్థితిన్=సీత దిక్కు తెలియుట కొరకు, చేయుటకు, తత్+ఉక్తిని చేకొని=రాముని మాటననుసరించి, కడున్+ఉల్లములన్=మనస్సులందు మిక్కిలిగా, ఉదంచిత+ఉత్సాహులగుచును=మిక్కిలి ఉత్సాహవంతులగుచు, వివిధదిక్+పురముల=నానా దిక్కులందలి నగరములను వెదకి చూచి.

తాత్పర్యము : అపుడు ఆ వానరులు సీతయున్న దిక్కు తెలిసికొనుటకు రాముని మాటను అనుసరించి, మనస్సులందు మిక్కిలిగా ఉత్సాహవంతులై నానాదిక్కులందలి నగరములను వెదకిచూచి.

భారత : అపుడు, వారు=పాండవులు, మహిజన=భూమిమీది జనులచే, అవిధిత=తెలియబడని, స్థితిన్=అజ్ఞాతవాసమును, చేయుటకు, తత్=ఆ యముని యొక్క, ఉక్తి+చేకొని=మాటననుసరించి, ఉదంచితోత్సాహులగుచును, వివిధదిక్ పురములన్=నానాదిక్కులందలి ఏ నగరమునకు (పోవుదమని), ఉల్లములన్= మనసులో, వెదకిచూచి=ఆలోచించి.

తాత్పర్యము : అప్పుడు పాండవులు జనులకు తెలియని అజ్ఞాతవాసమును చేయుటకు ఆ యముని మాటననుసరించి అధికోత్సాహముగలవారై, అన్ని దిక్కులయందలి నగరములను మనసులో బాగా ఆలోచించి -

కం. అతిసత్త్వస్థవిరాటవి
తతనగరచితప్రచారతను మది కెక్కన్
ధృతి నరసి రామభార్యను
సతిఁ గానకకాంతిభంగచణతనులీలన్. 130

రామా : అతిసత్వ=మిక్కిలి జంతువులుగల, స్థవిరాటవి=జీర్ణారణ్యములచే, తట=వ్యాపింపబడిన, నగ=పర్వతముల యందు, రచిత=చేయబడిన, ప్రచారతను= ప్రచారములుగలవారై, (ఉపచారములు గలవారై), మదికెక్కన్=మనసునకెక్కునట్లుగా, ధృతిన్=పట్టుదలతో, అరసి=వెదకి, సతిన్=సతియైన, రామభార్యను=రాముని భార్యను, కానక=చూడలేక, కాంతి భంగచణ=కాంతి హానిచే తెలియబడిన, తను=శరీరముల యొక్క, లీలన్=లీలచే (వివర్ణులై) చనిరని ముందు పద్యముచే అన్వయము.

తాత్పర్యము : అధికమైన జంతువులుగల జీర్ణారణ్యములచే వ్యాపింపబడిన పర్వతముల యందు ఉపచారముగలవారై సీతను గానక కాంతిహానిచే శరీరములు వివర్ణముకాగా చనిరి.

భారత : అతిసత్వస్థ=మిక్కిలి సాత్విక గుణముగల, విరాట=విరాటరాజుచే, వితత=విస్తరింపబడిన (పోషింపబడిన), నగర=మత్స్యనగరమునందు, చిత=సంపాదింపబడిన, ప్రచారతన్=నివాసముచే, మదికెక్క=మనసునకు ఎక్కగా, భృతినరసి=నిశ్చయించుకొని, రామ=ఒప్పెడిది అయిన, భార్యను=ద్రౌపదిని, సతిన్=పతివ్రతను, కానక కాంతి=కనకపుకాంతిని, భంగచణ=జయించుటచే ప్రసిద్ధమైన, తను లీలన్=దేహ విలాసముగలదానిని.

తాత్పర్యము : అత్యంత సాత్విక గుణముగల విరాట రాజుచే పోషింపబడిన మత్స్యనగరము నందు నివాసమును సంపాదించి అక్కడికి వెళ్ళెదమని మనస్సులో నిశ్చయించుకొనిరి. అందమైన ద్రౌపదిని కనకపు కాంతిని జయించిన శరీర విలాసముతో నున్న పతివ్రతను (కనుగొనిరి).

కం. వనితామణి నురుశుభగుణఁ
గనుఁగొని దాస్యోచితవిధిగరిమము మిగులఁ
జనలేమ యకట యిఁకఁ దద
వనిపాలపురస్థితిఁ బ్రవర్తిలు టెట్టో. 131

రామా : వనితామణిన్=సీతను, ఉరుశుభగుణన్=మిక్కిలి శుభగుణములు గలదానిని, కనుగొని చనలేమ=చూచి పోలేమా?, దాస్యోచిత=సేవకా వృత్తికి తగిన, విధిగరిమము=విధానము యొక్క గొప్పతనము, మిగులన్, అకటన్, ఇక, తత్ అవనిపాల=ఆ రామసుగ్రీవుల యొక్క, పురస్థితిన్=ముందర నిలిచి, ప్రవర్తిలుటెట్టొ=నడచుకొనుట ఎట్లో?

తాత్పర్యము : (వానరు లనుకొను మాటలు) శుభగుణములుగల సీతను చూడకుండ వెళ్ళలేముగదా! సేవకా వృత్తి విధానములో అకటా ఇకపై ఆ రామసుగ్రీవుల ముందర నిలిచి నడచుట ఎట్లో!

భారత : ఉరు శుభగుణను, వనితామణిని=గొప్ప శుభగుణములుగల ద్రౌపదిని, కనుగొని=చూచి, దాస్యోచితవిధిన్=సేవకా వృత్తికి తగిన వ్యాపారముచే,

గరిమము=గౌరవము, మిగులన్ చనన్=మిక్కిలి తగ్గగా, లేమ=ఈ ద్రౌపది, తదవని పాల పురస్థితిన్=ఆ విరాటరాజు పట్టణమున నుండగా, ప్రవర్తిల్లుటెట్లో.

తాత్పర్యము : శుభగుణప్రదయైన ద్రౌపదిని చూచి దాస్యవృత్తిచే గౌరవము కోల్పోయెడి ఈ ద్రౌపది విరాటరాజు పట్టణమున నుండునపుడు ప్రవర్తించుట ఎట్లో గద?

తే. ఏము పనివార మనుచుఁ దద్భూమిపాలు
కడకు మన మేఁగువార మేకరణి నతని
యుల్లమున కెడయక ప్రవర్తిల్ల నేర్తు
మనువిచారంబుచే నాకులాత్ము లగుచు. 132

రామా+భారత సమానము : తత్+భూమి పాలు, కడకు=రాముని వద్దకు / విరటుని వద్దకు, ఏము పనివారమనుచు=మేము సేవకులమని, మనము ఏగువారము=మనము (వానరులు/పాండవులు) వెళ్ళుదము, ఏ కరణిన్=ఏ విధముగా, అతని ఉల్లమునకు=రాముని/విరటుని మనస్సునకు, ఎడయక=నొప్పికలగని రీతిలో, ప్రవర్తిల్ల నేర్తుము=నడుచుకొనగలము, అను విచారంబుచే=అనెడి దిగులుచే, ఆకులాత్ములగుచు=చెదిరిన మనసుగలవారై.

తాత్పర్యము : వానరులు/పాండవులు ఆ రాముని/విరాటుని వద్దకు మేము సేవకులమని ఏ విధముగా వెళ్ళుదము. అతని మనసు ఎడయకుండునట్లు ఎట్లు నడచుకొనగలవారమను చింతచే మనసునకు వ్యథకలవారై.

వ. పదంపడి తమ తోఁచిన యుత్తరంబులచే నొండొరులచింత
డిందుపఱుచుచుం దద్దిశాభిముఖు లై చని రప్పుడు. 133

రామా+భారత సమానము - పదంపడి=తరువాత, తమ తోచిన యుత్తరంబులచే=తమకు తోచిన ప్రతిసమాధానములచే, ఒండొరుల చింతన్= ఒకరికొకరి బాధను, డిందు పఱుచుచున్=తగ్గించుకొనుచు, తత్+దిశాముఖులై, ఆ దిక్కునకు (వానరులు/పాండవులు) చనిరప్పుడు.

తాత్పర్యము : ఆ తరువాత వారు (వానరులు/పాండవులు) తమకు తోచిన సమాధానములచే పరస్పరము చింతను తొలగించుకొనుచు ఆ దిక్కునకు వెళ్ళిరి. అప్పుడు

కం. మరుదాత్మ జముఖ్యులు ధ
ర్మరాజుదెసనరయు వారుమగుడక యంతః
కరణములఁ బర్వుచింతా
భరములతోఁ జలిపి రగ్రపథగమనంబున్. 134

రామా : మరుత్+ఆత్మజముఖ్యులు=హనుమంతుడు మొదలైన ముఖ్యవానరులు, ధర్మరాజు దెసన్=దక్షిణ దిక్కునందు, అరయువారు=వెదకెడివారు, మగుడక= వెనుదిరుగక, అంతఃకరణములన్=మనస్సులందు, పర్వు=కలుగు, చింతాభరములతో= చింతాభారముతో, అగ్రపథ గమనంబున్=ముందరి దారి నడకను, సలిపిరి=చేసిరి.

తాత్పర్యము : దక్షిణపు దిశయందు వెదకు హనుమదాది వానరవీరులు వెనుదిరుగక మనస్సులో కలుగు చింతాభారముతో ముందరి దారివైపు నడక సాగించిరి.

భారత : మరుదాత్మజ ముఖ్యులు=భీమాదులైన పాండవులు, ధర్మరాజు దెసన్=ధర్మజుడు ఏ విధముగా నడచునో అని, అరయువారు=విచారించువారు, మగుడక=వదలక, అంతఃకరణముల పర్వు చింతాభరములతో, అగ్రపథ గమనంబున్, సలిపిరి.

తాత్పర్యము : భీమాది పాండవులు ధర్మరాజు ఏ విధముగా పరులను కొలిచెడినో అని విచారించుచు తమ నిశ్చయమును వదలక మనస్సులో కలుగు చింతాభారముతో ముందు దారిని నడచిరి.

కం. ఈతెఱఁగునఁ జనునంతటఁ
జేతోవీథి న్నిజార్థసిధ్యనుగుణసం

పాతిఖగోక్తులముద ము
ద్భూతంబుగవింత లగువపురభిఖ్యలతోన్. 135

రామా : ఈ తెఱగున=ఈ విధముగా, చనునంతట=వెళ్ళుచుండగ, చేతో వీధిన్=మానసవీధిలో, నిజార్ధసిద్ధి+అనుగుణ=తమ కోరిక నెరవేరుటకు అనుకూలముగా, సంపాతిన్=సంపాతియను, ఖగోక్తుల=పక్షిమాటలచే, ముదము= సంతోషము, ఉద్భూతంబుగా=కలుగగా, వింతలగు=వింతయైన, వపుః=శరీర, అభిఖ్యలతోన్=కాంతితో.

తాత్పర్యము : ఈ విధముగా వెళ్ళుచుండగా మనోవీధిలో తమ కోరిక సిద్ధించుటకు అనుగుణముగా సంపాతియను పక్షి మాటలు సంతోషమును కలిగింపగా వింతయగు శరీర కాంతితో (నున్నసంపాతిని చూచి)

భారత : ఈతెఱగున, చనునంతట, చేతో వీధిన్ నిజ=పాండవుల యొక్క, అర్ధసిద్ధి+అనుగుణ=కోరికలు నెరవేరుటకు అనుగుణముగా, సంపాతి= సంచరించుచున్న, (శకునములను చూపు) ఖగ=పక్షుల యొక్క, ఉక్తులన్=శబ్దములచే, ముదముద్భూతంబుగ వింతలగు వపురభిఖ్యలతోన్.

తాత్పర్యము : ఈ విధముగా పాండవులు వెళ్ళుచుండగా మనో వీధిలో తమ కోరికలు సిద్ధించుట కనుగుణముగా పక్షుల శబ్దములు శకునములు పలుకుచుండగా వింతమైన శరీర కాంతులచే పాండవులు -

వ. ముందరికిం జనిచని. 136

ముందరికిన్ చనిచని=ముందుకు వెళ్ళివెళ్ళి

కం. వారలు గనుఁగొని రతివి
స్తారాద్భుతమత్స్య రాజధానిని లవణాం
భోరాశిఁ గాళిమగుణో
దారతచే మించువనచయముగలదానిన్. 137

రామా : వారలు=వానరులు, అతి విస్తార=మిక్కిలి విస్తారముగల, అద్భుత= ఆశ్చర్యకరమైన, మత్స్యరాజ=తిమి తిమింగలాదులకు, ధానిన్=స్థానమైనదానిని, కాళిమగుణ=నల్లనైన గుణముచే, ఉదారతచే=ఉదారముగా, మించు=మించెడి, వనచయము=నీటి సమూహము, కలదానిన్=కలిగిన, లవణాంభోరాశిన్= సముద్రమును, కనుగొనిరి=చూచిరి.

తాత్పర్యము : వానరులు అతి విస్తారము అద్భుతమునై తిమితిమింగలాదులకు నెలవై నల్లదనపు ఉదారతచే మించెడి జలసముదాయముగల సముద్రమును చూచిరి.

భారత : వారలు=ధర్మజాదులు, అతి విస్తారాద్భుత=మిక్కిలి విస్తరించి ఆశ్చర్యకరమైన, మత్స్యరాజధానిని=విరాటుని రాజధానిని, కాళిమగుణోదారతచే, నల్లదనముచే లవణాంభోరాశిన్=సముద్రమును, నించు=జయించెడి, వనచయము=తోటలు, కలదానిన్=కనుగొనిరి.

తాత్పర్యము : ధర్మజాదులు అతి విస్తారమై ఆశ్చర్యకరమై నల్లదనముచే సముద్రమును మించిన తోపులుగల మత్స్యరాజధానిని చూచిరి.

వ. అంత 138

ఉ. ఆవనరాశి దాఁటి తగునట్టిక్రమంబున విశ్వవిద్విష
ద్రావణపాలితం బగుపురంబు జనాంతరదుర్దమస్వతే
జోవిభవాభిగుప్తిమయిఁజొచ్చి మరుత్తనయుండు తద్విభుం
డేవెత లేక యుండఁ బ్రజనేలు తెఱంగున కాత్మ మెచ్చుచున్. 139

రామా : ఆవనరాశిన్=ఆ సముద్రమును, దాటి, తగునట్టి క్రమంబున్=తగిన రీతిలో, విశ్వవిద్విషత్=సకల లోకములకు శత్రువైన, రావణ=రావణునిచే, పాలితంబగు=పాలింపబడెడి, పురంబు=లంకా నగరమును, జనాంతరదుర్దమ= అన్యజనులకు భేదింపరాని, స్వతేజోవిభవ=తన తేజస్సుయొక్క వైభవముచే, అభిగుప్తమయిన్=గోప్యముగా, చొచ్చి=ప్రవేశించి, మరుత్+తనయుండు= హనుమంతుడు, తత్+విభుండు=రావణుడు, ఏవెత లేకుండ=ఏ విధమైన కష్టములు

లేకుండ, ప్రజన్+ఏలు తెఱంగునకు=ప్రజలు పాలించురీతికి, ఆత్మమెచ్చుచున్= మనస్సులో మెచ్చుకొనుచు...

తాత్పర్యము : ఆ సముద్రమును లంఘించి తగిన రీతిలో సకల లోకములకు శత్రువైన రావణునిచే పాలింపబడు లంకా నగరమును అన్యులు ప్రవేశింపరాని దానిని తన తేజోవైభవముతో గోప్యముగా ప్రవేశించి హనుమంతుడు ఆ రావణుడు ఏవిధమైన కష్టము లేకుండ ప్రజలను పాలించు విధమునకు మనస్సులో మెచ్చుకొనుచు...

భారత : ఆవనరాశిన్=ఆ వన సమూహమును, దాటి, తగినట్టి క్రమంబునన్= తగిన వేషాంతరములచే, విశ్వవిద్విషత్=సకల శత్రువులను, రావణ=పారద్రోలుటచే, పాలితంబగు పురంబు=పాలించబడు విరాటనగరమును, జనాంతరదుర్గమ, స్వతేజోవిభవ, అభిగుప్తిమయిన్=దాచిపెట్టి, చొచ్చి, మరుత్+నయుండు=మరుత్తుని యొక్క నీతిగల, తద్విభుండు=విరటుడు, ఏవెత లేకయుండ, ప్రజనేలు తెఱంగునకు, ఆత్మమెచ్చుచున్.

తాత్పర్యము : ఆ వనసముదాయమును దాటి తగిన వేషాంతరములచే పాండవులు సకల శత్రువులను పారద్రోలి పాలించు విరాట నగరమును, అన్యులచే ప్రవేశింపరాని దానిని, తమతమ తేజోవిభవమును దాచిపెట్టి ప్రవేశించి మరుత్తువంటి నయముగల ఆ నగరవిభుడైన విరటుడు ప్రజలకు ఏవిధమైన బాధ కలుగకుండ పాలించుటకు మనస్సులో మెచ్చుకొనుచు...

సీ. అతని లీలాద్భుతరతి రాజనీతిశా
స్త్రప్రసంగాదులు సలుపు నెడలు
నభిమతభక్ష్య భోజ్యాదిపాక విశేష
చణసూదకర్మ ప్రసక్తి యెడలు
శుద్ధాంతకన్యల సురుచిరనాట్యశి
క్షణవినోదంబులు జరుపు నెడలు

గాంధర్వగతిశిక్ష గావించు నెడలు న
త్యంతమాహారక్షణాదివిధులఁ

తే. గ్రాలు నెడలును గ్రమమునఁ గాంచి తత్త
దర్థగతి నాశ్రయించి రయంబుమీఱ
నవనిజాతను నైపుణీవిస్మృతి మెఱసి
పరు లెఱుఁగకుండ నేగురు భవ్యధృతిని. 140

రామా : అతని=రావణుని యొక్క, లీలాద్భుత=విలాసములతో కూడి ఆశ్చర్య జనకముగానున్న, రతి రాజనీతిశాస్త్ర=శృంగార శాస్త్రముల యొక్క, ప్రసంగాదులు= మాటలు, చలుపు నెడలు=చేయు ప్రదేశము, అభిమత=ఇష్టమైన, భక్ష్యభోజ్య= భక్ష్యములు, భోజ్యములు మొదలైన, పాక విశేషచణ=వంటలో నేర్పరితనమును, సూదకర్మ ప్రసక్తియెడలు=వంటల నేర్పరితనమును గూర్చిన ప్రసంగము చేయు ప్రదేశములు, శుద్ధాంతకన్యల=అంతఃపుర కాంతల, సురుచిర=అందమైన, నాట్యశిక్షణ వినోదంబులు=నాట్యమును నేర్పించు వినోదమును, జరుపు నెడలు=జరిపించు ప్రదేశములు, గాంధర్వగతి=సంగీతవిద్యయొక్క, శిక్షగావించు=నేర్పించు, నెడలు=ప్రదేశములు, అత్యంతము=మిక్కిలి, ఆహార=భోజనము, క్షణాది=ఉత్సవములు మొదలైన, విధులన్=సందర్భములలో, క్రాలునెడలును=ప్రవర్తించు ప్రదేశములు, క్రమమున=వరుసగా, తత్‌తత్+అర్థగతిన్=వాటివాటికి అర్థమైన విధానములో, కాంచి=చూచి, రయంబుమీరన్=వేగముగ, అవనిజాతను=సీతను, ఆశ్రయించి= ఉద్దేశించి, నైపుణీవివృతిన్=నేర్పుతోకూడిన రహస్య వర్తనముచే, పరులెరుగ కుండన్= ఇతరుల కంటబడకుండ, మెఱసి=ప్రకాశించి, గురుభవ్య ధృతిని=ఉత్తమమైన ధైర్యముతో –

తాత్పర్యము : రావణుని యొక్క విలాసములతో కూడిన ఆశ్చర్యజనకమైన శృంగార శాస్త్ర ప్రసంగములు చేయు ప్రదేశములను, ఇష్టమైన భక్ష్యభోజ్యాదిపాక విశేషములు, వంటలు తయారు చేయు ప్రదేశములను, అంతఃపుర కాంతలు అందముగా నాట్యశిక్షణను విలాసముగా జరుపు ప్రదేశములను, సంగీత

విద్యాభ్యాసమును చేయు ప్రదేశములను, అత్యంతము ఆహారము ఉత్సవాదులను నిర్వహించు ప్రదేశములను క్రమముగా చూచి వాటికనుగుణముగా నడచి, వేగముగా సీత నుద్దేశించి ఇతరుల కంటబడకుండ గొప్పదైన పురాకృత ధైర్యముతో (హనుమ చరించెను).

భారత : అతని=విరాటుని యొక్క, లీలాద్భుత, రతి=ప్రీతి యొక్కయు, రాజనీతి శాస్త్ర=రాజనీతి శాస్త్రములయొక్క, ప్రసంగాదులు సలుపునెడలు=ప్రసంగములు చేయు ధర్మరాజును, అభిమత భక్ష్యభోజ్యాదిపాక విశేష చణసూదకర్మ ప్రసక్తి ఎడలు= వంటలలో నేర్పరితనమును ప్రకటించు పాకశాస్త్ర నిపుణుడు భీముని, శుద్ధాంతకన్యల=అంతఃపుర కాంతల, సురుచిర నాట్యశిక్షణ వినోదంబులు జరుపు నెడలు=అందముగా నృత్యశిక్షణను నేర్పించు అర్జునుని, గాంధర్వగతిశిక్ష=అశ్వ సంబంధమైన గమనశిక్షను చేయు నకులుని, అత్యంత=మిక్కిలి, మాహా=ఆవుల యొక్క, రక్షణాది విధులన్=రక్షించు విధులలో, క్రాలు నెడలను=ప్రవర్తించు సహదేవుని, క్రమమునగాంచి, తత్తదర్హగతిన్=వారి వారికి తగిన రూపవర్తనలను, అయంబు మీరన్=భాగ్యవశమున, నవ=క్రొత్తదైన, నిజ=తమదైన, అతను=అనల్పమైన, నైపుణీ= నేర్పు యొక్క, వివృతిన్=విశేషమైన గోపనముచే, మెరసి, పరులెరుగకుండ=జనులకు తెలియకుండ, ఏ గురు=పాండవులైదుగురు, భవ్యధృతిని=దివ్యమైన ధైర్యముతో, ఆశ్రయించిరి=పొందిరి.

తాత్పర్యము : విరాటుని విలాసవంతమైన అద్భుతము ప్రీతికరములైన రాజనీతి శాస్త్ర ప్రసంగములను జరుపు ధర్మరాజును, ఇష్టములైన భక్ష్యభోజ్య పాక విశేషములతో కూడిన వంటలు చేయు భీముని, అంతఃపుర కాంతలకు అందముగా నాట్యశిక్షణ వినోదముగా జరుపు అర్జునుని, అశ్వ సంబంధమైన గమన శిక్షను కావించు నకులుని, గోవుల రక్షణ విధులను నిర్వహించు సహదేవుని, క్రమముగా చూచి, వారివారికి తగిన వర్తనలచే ఇష్టానుసారము జరుగుచుండగ నిత్యనూతనమై స్వకీయమై అనల్పమైన నేర్పుతో విశేష గోపనముచే ఇతరులెరుగకుండ పాండవులైదుగురు విరటుని ఆశ్రయించిరి.

కం. అంతటఁ దద్రామనృపతి
కాంతాసందర్శనాభి కాంక్షాసహిత
స్వాంతతఁ దరియించుచు శు
ద్ధాంతక్రీడావనస్థ యగు తద్దేవిన్. 141

రామా : అంతట=తరువాత, తత్+రామనృపతికాంత=సీత యొక్క, సందర్శనాభికాంక్ష=చూడవలెననెడి కోరికతో, సహిత స్వాంతత=మనసుగలవాడై, తరియించుచు=దాటుచు, శుద్ధాంత క్రీడావనస్థయగు=అంతఃపురమునకు చెందిన అశోకవనము నందున్న, తద్దేవిన్=ఆ సీతను.

తాత్పర్యము : తరువాత సీతాదర్శనముపై కోరికతో మనసుగలవాడై దాటుచు అంతఃపురమునకు చెందిన అశోకవనము నందు ఆ దేవిని (చూచెను).

భారత : అంతట, తత్+రామ=ద్రౌపది, నృపతికాంత=సుధేష్ణ యొక్క, సందర్శనాభికాంక్షా సహితస్వాంతత=దర్శనము చేసుకొనవలెననెడి కోరికగల మనస్సుతో, తరియించుచు=వెళ్ళుచు, శుద్ధాంతక్రీడావనస్థయగు=అంతఃపురమునకు చెందిన ఉద్యానవనములో నున్న, తత్+దేవిన్=ఆ సుధేష్ణను (చూచెను).

తాత్పర్యము : అంతట ద్రౌపది సుధేష్ణను చూడవలెననెడి కోరికగల మనస్సుతో వెళ్ళి అంతఃపురములోని ఉద్యానవనములో ఆ దేవిని చూచెను.

కం. చేరి పొడగాంచి యాయమ
చేరిక నతిగూఢతను భజించి వసించెన్
సైరంధ్రీ భావమునఁ ద
దారూఢప్రీతి మొగము దగఁ గైసేయన్. 142

రామా : చేరి పొడగాంచి=వెళ్ళి చూచి, ఆయమ=సీతయొక్క, చేరికను=కలయికను, సైరంధ్రీ భావమునన్=సైరంధ్రీ భావనలచే, తదారూఢప్రీతి=అప్పుడే మొలిచిన సంతోషము, మొగము తగకైసేయన్=ముఖమునకు అలంకారము తేగా,

అతి గూఢతను=అత్యంత రహస్యముగా, భజించి=కొలిచి, వసించెన్=నిలిచెను.

తాత్పర్యము : చేరి ఆమెను చూచి ఆమె కనిపించుటచే సైరంధ్రీ భావనలచే అప్పుడు మొలచిన సంతోషము ముఖమునకు అలంకారమును తెచ్చి పెట్టగా అత్యంత రహస్యముగా సేవించి నిలిచెను.

భారత : చేరి, పొడగాంచి, ఆయమ చేరికను=సుధేష్ణను కలిసి, అతిగూఢతను=రహస్యముగా, సైరంధ్రీ భావమున=సేవకభావమున-(సైరంధి పేరుతో) తదారూఢ ప్రీతి మొగముతగ గైసేయన్, భజించి, వసించెను.

తాత్పర్యము : చేరి సైరంధ్రిని చూచి సైరంధ్రీ అను పేర సేవకావృత్తితో అప్పుడే మొలచిన సంతోషము ముఖమునకు అలంకారప్రాయము కాగా అత్యంత రహస్యముగా సేవించి నిలిచెను.

ఆశ్వాసాంత పద్యములు.

శా. పారేమాయవిజృంభమాణ పరమబ్రహ్మాత్మ మధ్యేహృద
బ్జారాధ్యామలదివ్యమంగళ నిజాంగాజస్ర సాక్షాత్క్రియా
ధౌరంధర్యమహత్త్వ పాత్రితగుణాధః కారితాష్టాంగయో
గారూఢిప్రథమాన మౌనిజనభాగ్య శ్రీసముజ్జృంభణా. 143

అర్థం : పారేమాయ=మాయ నతిక్రమించిన తర్వాత, విజృంభమాణ=ప్రకాశించుచున్న, పరబ్రహ్మాత్మ=నిర్గుణబ్రహ్మ స్వరూపా!, మధ్యేహృదబ్జ=హృత్ పద్మమధ్యమున, ఆరాధ్య=భజింపదగిన, అమల=స్వచ్ఛమైన, దివ్యమంగళ=దివ్యమైన శుభ స్వరూపమైన, నిజాంగ=నిజస్వరూపముయొక్క, అజస్రసాక్షాత్+క్రియా=నిత్యసాక్షాత్కారముయొక్క, ధౌరంధర్య=ధరించెడు చాతుర్యముచే, మహత్త్వ=మహిమకు, పాత్రిత=పాత్రముగా చేయబడినవారై, గుణ+అధఃకారితా=త్రిగుణములను తిరస్కరించెడి వారగుటచే, అష్టాంగయోగ=సాంఖ్యయోగమందుగల, ఆరూఢి=అతిపరిచయముచే, ప్రథమాన=ప్రసిద్ధులైన, మౌనిజన=మునీశ్వరుల యొక్క, భాగ్యశ్రీ=అదృష్టసంపదను, సముజ్జృంభమాణా=ప్రకాశింపజేయువాడా!

తాత్పర్యము : మాయనతిక్రమించిన తర్వాత ప్రకాశించు నిర్గుణబ్రహ్మస్వరూపా! హృత్పద్మమధ్యమున భజింపదగిన స్వచ్ఛము, దివ్యశుభ స్వరూపమునయిన నిజస్వరూప నిత్య సాక్షాత్కార చాతుర్యమహిమకు పాత్రము చేయబడినవారై త్రిగుణములను తిరస్కరించుచు సాంఖ్యయోగమందుగల అతి పరిచయముచే ప్రసిద్ధులైన మునీశ్వరుల అదృష్టాతిశయమును ప్రకాశింపజేయువాడా!

కం. ఆధునిక సాధు నికరస
మాధిదురారాధితా మహత్తర వార్తా
రోధార్థవిహితమచ్చి
త్తాధిగమా పెద్దవేంకటాధిపసుగమా. 144

అర్థం : ఆధునిక=ఇప్పటివారైన, సాధు=సజ్జనుల యొక్క, నికర=సముదాయమునకు, సమాధి=యోగనిష్ఠచే, దురారాధితా=ఆరాధింప శక్యముగానివాడవై, మహత్తరవార్తా=మిక్కిలి ప్రసంగముల, రోధార్థ=నిరాకరణ నిమిత్తమై, విహిత=చేయబడిన, మత్+చిత్తాధిగమా=నా హృదయమునందున్నవాడా!, పెద్ద వేంకటాధిప=పెద వేంకటాద్రిచే సుగమా=లెస్సగా తెలియబడినవాడా!

తాత్పర్యము : ఆధునికులైన సజ్జన సమూహమునకు యోగనిష్ఠచే ఆరాధింప శక్యముగానివాడవై నావంటి వారికి ప్రసన్నమైన వాడవుగనుక నిన్ను ఆరాధింప శక్యముగాదు. కనుక పెద వేంకటాద్రిచే లెస్సగా తెలియబడినవాడా!

కవి ఈ గ్రంధమును ఆకువీటి తిమ్మ ప్రభువు కుమారుడైన పెద వెంకటాద్రి కంకితమిచ్చెను.

మత్త : భూధరాధిప కన్యకామణి పుణ్యపాదపయోజలా
క్షైధితారుణ గైరికద్యుతి హేమకూట విహారలీ
లాధికాదర సాధుసాధిత హైమవత్యనురంజనా
రాధితస్మర మోచితాత్మ పురాతనాప కృతిస్మృతీ. 145

అర్థము : భూధరాధిప=హిమవంతుని యొక్క కన్యకామణి=కుమార్తెయయిన పార్వతియొక్క, పుణ్య=పవిత్రములైన, పాదపయోజ=పాదపద్మములందున్న, లాక్షా=లత్తుకచే, ఏధిత=వృద్ధి పొందింపబడిన, అరుణ=ఎర్రనైన, గైరికద్యుతి=జేగురు కాంతులుగల, హేమకూట=హేమకూట పర్వతమందు, విహారలీలా=క్రీడా విలాసమందు, అధికాదర=మిక్కిలి ఆదరము గలవాడా!, సాధుసాధిత=సత్పురుషులకు వశమైనవాడా!, హైమవతీ+అనురంజనీ=గౌరియొక్క ప్రేమపురస్సరముగా నడుగుకొనుటచే, ఆరాధిత=పార్థింపబడినవాడవై, స్మర=మన్మధుని నిమిత్తమై, మోచిత=విడిపింపబడిన, ఆత్మ=తన నిమిత్తమై, పురాతన=పూర్వకృతమైన, అపకృతి=అపకారము యొక్క, స్మృతి=స్మరణ కలవాడా!

తాత్పర్యము : హిమవంతుని కుమార్తెయైన పార్వతి పాదపద్మములందున్న లత్తుకచే వృద్ధిపొంది ఎఱ్ఱనైన జేగురుకాంతిగల హేమకూట పర్వతముపై క్రీడా విలాసము నందు మిక్కిలి ఆదరముగల వాడా! సత్పురుషులకు వశుడా! గౌరీదేవీ ప్రేమచే నడిగిన ప్రార్థనతో మన్మధుని తిరిగి బ్రతికించిన స్మరణగలవాడా!

గద్యము : ఇది నిఖిలసూరిలోకాంగీకార తరంగిత కవిత్వ వైభవ పింగళి యమరనార్యతనూభవ సౌజన్య జేయసూరయనామధేయ ప్రణీతంబైన రాఘవపాండవీయమునందుఁ దృతీయాశ్వాసము.

గద్యము : ఇది శ్రీమన్మదన గోపాల కృపాకటాక్ష సంప్రాప్త సారసారస్వత సంపదానందనంద వరకులక్షీర పారావార రాకాసుధాధామ ముద్దరాజ గణపయామాత్య పెదరామధీమణి ప్రదర్శింతంబైన రాఘవ పాండవీయా దర్శంబునందుఁ దృతీయా శ్వాసము.

చతుర్థాశ్వాసము

కం. శ్రీ రుచిర తుంగభద్రా
తారాస్పద యాకువీటితిమ్మాగ్రతనూ
జారాధితనిత్యదయాం
కూర విరూపాక్ష హేమకూటాధ్యక్షా! 1

అర్థం : శ్రీరుచిర=సౌభాగ్య సంపదతో, తుంగభద్రాతీర+ఆస్పద=తుంగభద్రానదీ తీరమునందలి, ఆకువీటి తిమ్మాగ్ర తనూజ=ఆకువీటి తిమ్మప్రభువు పెద్దకుమారునిచే, ఆరాధిత=ప్రార్థింపబడు, నిత్యదయానుకూల=ఎల్లప్పుడు దయావీక్షణములుగల, హేమకూటాధ్యక్షా!=హేమకూట పర్వతమునందు నెలకొన్న, విరూపాక్ష=విరూపాక్ష స్వామీ!

తాత్పర్యము : సంపదలతో అందమైన తుంగభద్రా నదీ తీరమునందు వశించు ఆకువీటి తిమ్మప్రభువు పెద్దకుమారునిచే ఆరాధింపబడుచు నిత్యదయా వీక్షణములుగల హేమకూటాధిపతియైన ఓ విరూపాక్ష స్వామీ!

వ. అవధరింపు మక్కాలంబున 2

తాత్పర్యము : వినుము. ఆ సమయమున

కం. తన యేలికసాని కడకుఁ
దనరుఘనైశ్వర్యరక్షితదనుజుఁ డఘవ
ర్తనుఁ డేతెంచిన నప్పా
వని పతిహితవృత్తి నడఁగి వర్తిలె మిగులన్. 3

రామా : తన ఏలికసాని కడకున్=సీత వద్దకు, తనరు=ఒప్పు, ఘన+ఐశ్వర్య=గొప్ప సంపదచే, రక్షిత=రక్షింపబడిన, దనుజుడు=రాక్షసులుగల, అఘ

వర్తనుడు=పాపకర్ముడు అయిన రావణుడు, ఏతెంచిన=రాగా, పావని=హనుమంతుడు, పతిహితవృత్తి=రాముని కార్యమును దృష్టిలో వుంచుకొని, అడగి=అణగి, మిగులన్వర్తిలె=మిక్కిలి ప్రవర్తించెను.

తాత్పర్యము : తన ప్రభువైన రాముని భార్య సీత వద్దకు గొప్ప ఐశ్వర్యముచే రక్షింపబడిన రాక్షసులుగల పాపకర్ముడైన రావణుడురాగా హనుమంతుడు రావణునికి సీతకు మధ్య జరుగు సంభాషణను వినగోరి, అణగియుండునట్లు ప్రవర్తించెను.

భారత : తన ఏలికసాని కడకు=తన రాణియైన సుధేష్ణ వద్దకు, తనరు ఘనైశ్వర్య=గొప్ప సంపదచే నొప్పు, రక్షి=రక్షించెడివాడు, తదనుజుడు=సుధేష్ణ తమ్ముడైన కీచకుడు, అఘవర్తనుడు, ఏతెంచినన్=రాగా, ఆ+పావని=ఆ పతివ్రతయైన ద్రౌపది, పతిహితవృత్తిన్=భర్తల మేలుకోరి, మిగులన్ అడగివర్తిలె=మిక్కిలి అణగి ప్రవర్తించెను.

తాత్పర్యము : సుధేష్ణ వద్దకు ఐశ్వర్య శోభితుడైన పాపకర్ముడైన ఆమె తమ్ముడు కీచకుడు రాగా ఆ ద్రౌపది తన భర్తల మేలుకోరి అణగి ప్రవర్తిల్లెను.

వ. అప్పుడు 4

చం. అతనుఁడు తత్సతిద్యుతిసహాయతనెంతయుఁ గ్రొవ్వి యవ్విని
ర్జితరిపు నింద్రజిద్గురువిజృంభితవైభవు దేహసారత
ర్జితశతకోటిసింహబలు సిగ్గు సెడం గడుఁ గాసి సేసె న
ద్భుతముగదా యెసంగునెడఁ బొల్లగు నెవ్వరియెట్టిపెంపులున్ 5

రామా : అతనుడు=మన్మథుడు, తత్+సతిద్యుతి సహాయతన్=సీత యొక్క శరీర కాంతిచే, ఎంతయుక్రొవ్వి=మిక్కిలి గర్వించి, ఆ+వినిర్జితరిపు=శత్రువులను జయించిన ఆ, ఇంద్రజిత్ గురున్=ఇంద్రజిత్తు తండ్రియైన రావణుని, విజృంభిత వైభవున్=అతిశయించిన విభవముగల వానిని, దేహసార=శరీరపు పొంగుచే, తర్జిత=జయింపబడిన, శతకోటి సింహబలున్=శతకోటి సింహముల బలముగలవానిని, సిగ్గు+చెడన్=సిగ్గు చెడునట్లుగా, కదుగాసిసేసె=మిక్కిలి బాధించెను,

ఎసంగునెడ=కామించినపుడు, ఎవ్వరి=ఎవరి, ఎట్టి పెంపులున్=అన్ని విధములైన ఆధిక్యములు, పొల్లగు=వ్యర్థములగుట, అద్భుతముగదా!=ఆశ్చర్యకరముగదా!

తాత్పర్యము : ఆ సీతాదేవి శరీరకాంతిచే ఎంతయు క్రొవ్విన మన్మథుడు శత్రువులను జయించిన రావణుని, విజృంభించిన వైభవముగల వానిని శరీర సౌష్ఠవముచే జయింపబడిన శతకోటి సింహబలముగల వానిని, సిగ్గు చెడునట్లుగా బాధించెను.

భారత : అతనుడు, తత్సతిద్యుతి సహాయతన్=ఆ ద్రౌపది శరీరకాంతిచే, ఎంతయుక్రొవ్వి, అవ్వినిర్జితరిపున్, ఇంద్ర=ఇంద్రుని, జిత్=జయించిన, గురు=అధికమైన, విజృంభిత=విస్తరించిన, వైభవు=వైభవముగలవానిని, దేహసారతర్జిత=శరీర సౌష్టవముచే జయింపబడిన, శతకోటిన్=వజ్రాయుధముగల వానిని, సింహబలున్=కీచకుని, సిగ్గుసెడన్కడుగాసిసేసె, ఎసంగునెడ=ఎవ్వరి ఎట్టి పెంపులున్, పొల్లగు=అద్భుతముగదా.

తాత్పర్యము : ద్రౌపది శరీర కాంతి సహాయముచే ఎంతయో క్రొవ్విన మన్మథుడు – శత్రువులను జయించి, ఇంద్రుని గెలిచి అధికమైన విస్తరించబడిన వైభవముగలిగి శరీర సౌష్ఠవముచే గెలువబడిన వజ్రాయుధముగల కీచకుని సిగ్గు చెడునట్లుగ బాధించెను. కామించినపుడు అందరి ఆధిక్యతలు వ్యర్థములగుట ఆశ్చర్యకరము గదా!

విశేషణము : ఇందులో అర్థాంతరన్యాసాలంకారము కలదు.

సీ. అట్లనంగుఁడు నొంప నద్దురాత్ముండు పా
తివ్రత్యనిధి నాసతీలలామ
ననుచితోక్తులు పెక్కులాడి యల్గించియు
దీని నెట్లైన సాధించి నాదు
ప్రాణంబు రక్షింపుఁ డని దూతికల స్వస
న్మానగాంభీర్యహీనత నెరఁగుచుఁ

దా వెండియును జెప్పఁ దగునట్టిసద్బుద్ధు
లప్పనివారించి చెప్పవెఱచి

తే. తనకు ననుకూల మయినచందంబు నడపెఁ
బెచ్చు పెరిఁగెడుతమకంబుపేర్మిఁ దాన
యాకెఁ బలుమాఱుఁ జేరి పేదఱపు లఱచి
యును మనోజవికారవర్తనలు సలిపె. 6

రామా : అట్లు+అనంగుడు=ఆ విధముగా మన్మథుడు, నొంపన్=బాధింపగా, ఆ+దురాత్ముడు=రావణుడు, పాతివ్రత్యనిధిన్=పాతివ్రత్యమునకు స్థానమైన, ఆ సతీలలామన్=సీతతో, అనుచితోక్తులు=ఉచితము కాని మాటలు, పెక్కులు+ఆడి=ఎక్కువగా మాట్లాడి, అల్గించియు=కోపము వచ్చునట్లు చేసియైనను, దీనినెట్టైనన్=ఈ సీతను ఏ విధముగానైనను, సాధించి=బాధపెట్టి, నాదు ప్రాణంబు రక్షింపుడు, అని=అని పలికి, దూతికల=కావలివారల, స్వసన్మాన గాంభీర్యహీనతన్=తన అభిమానపు గాంభీర్యమును వదలి, ఎరగుచు=ప్రవర్తించుచు, తావెండియును చెప్పన్=తాను మరల చెప్పగా, తగునట్టి సద్బుద్ధలు=తగిన మంచి బుద్ధులు, అప్పనిన్=ఆ ప్రయోజనమును, వారించి చెప్ప వెఱచి=కాదని చెప్పుటకు భయపడి, తనకు ననుకూలమయిన, చందంబు నడిపె=విధముగా ప్రవర్తించెను, పెచ్చు పెరిగెడు=అతిశయించెడు, తమకంబు పేర్మిన్=కామవృద్ధిచే, తాన=రావణుడే, ఆకెన్=సీతను, పలుమారు చేరి=మాటిమాటికి సమీపించి, పేదఱపులఱచియును=వ్యర్థముగా మాట్లాడియును, మనోజ వికారవర్తనలు=మన్మధవికారచేష్టలు, సలిపె=చేసెను.

తాత్పర్యము : ఈ విధముగా మన్మథుడు బాధింపగా ఆ రావణుడు పతివ్రతా శిరోమణియైన సీతతో అనుచితమైన మాటలు మాటలాడి కోపము తెప్పించి సీతనెట్లయిన సాధించి నా ప్రాణములు రక్షింపుడని దూతికలతో అభిమాన గాంభీర్యమును వీడి మాటిమాటికీ చెప్పుచు తగిన మంచి బుద్ధులు ఆ ప్రయోజనమును వారించి చెప్పుటకు

భయపడి తన కనుకూలమైన విధమున ప్రవర్తిల్లెను. అతిశయించిన కామముచే తానే ఆమెను పలుమారులు సమీపించి పేదఱపులు అఱచి మన్మథ వికార చేష్టలు చేసెను.

భారత : అట్లు+అనంగుడు నొంప, అద్దురాత్ముండు=కీచకుడు, పాతివ్రత్యనిధిన్, ఆ సతీలలామన్=ద్రౌపదితో, అనుచితోక్తులు పెక్కులాడి, అల్గించియు, దీనినెట్లైన సాధించి, నాదుప్రాణంబు రక్షింపుడని, దూతికలన్=పరిచారికలను, స్వసన్=అక్కయైన సుధేష్ణను, మానగాంభీర్యహీనత నెరగుచుతావెండియును చెప్పన్, తగునట్టి సద్బుద్ధులు=ఉచితమైన మంచి బుద్ధులను, అప్ప=అక్కయైన సుధేష్ణ, నివారించి=అడ్డుపడి, చెప్పవెఱచి= చెప్పుటకు భయపడి, తనకు ననుకూలమైన చందంబు నడపె, పెచ్చు పెరిగెడు తమకంబు పేర్మిన్, తాన=ఆ కీచకుడే, ఆకెన్=ద్రౌపదిని, పలుమారు చేరి పేదఱపు లఱచియును=మనోజ వికారవర్తనలు సలిపె.

తాత్పర్యము : ఆ విధముగా మన్మథుడు బాధింపగా కీచకుడు పాతివ్రత్య నిధియైన ద్రౌపదితో అనుచితములైన మాటలు పెక్కులు మాట్లాడి ఆమెకు కోపము తెప్పించి – 'దీనిని ఏవిధముగానైనను లోబరచి నా ప్రాణములు రక్షింపుమని' దూతికలను, అక్కయైన సుధేష్ణను అభిమాన రహితముగా ప్రాధేయపడెను. ఆమె తగిన సద్బుద్ధులు చెప్పి అతనిని నివారించి చెప్పుటకు భయపడి తనకనుకూలమైన రీతిలో ప్రవర్తించెను. కీచకుడు అతిశయించిన కామముచే ద్రౌపదిని పలుమార్లు కలిసి పేదఱపులఱరచి మనోవికారములైన పనులు చేసెను.

విశేషణము : స్వసా – భగినీస్వసా అని అమరము.

వ. అప్పు డప్పతివ్రతాతిలకంబు 7

రామా : అప్పుడు సీత

భారత : అప్పుడు ద్రౌపది

సీ. ఓరిమూఢాత్మ దుశ్చారిత్ర నీత్రుళ్ళు
టయ కాని బుద్ధి నేమియు నెఱుఁగవు
బ్రతికెడుచందంబు భావింప వేవురు
నాకీశులైన గంధర్వవరులు
చర్చింప బహులక్షశతసంఖ్య లైనరా
క్షసయక్షముఖు లెన్నికకు మిగిలిన
మన్నాథదోర్బలాభ్యున్నతి నడఁగక
మించఁ జాలరు నిగ్రహించిరేనిఁ
తే. దత్పరాక్రమ మిదె నీమదంబు నడఁప
నున్నయది నీకు మననాస యుండెనేని
శరణు చొరుము తదంఘ్రితామరసములకుఁ
దడయ కిపు డిట్లు కృత మైన తప్పు గావ. 8

రామా : ఓరి మూఢాత్మా=ఓరి మూఢమనస్కుడా!, దుశ్చారిత్ర=చెడ్డ ప్రవర్తనగల రావణా!, నీత్రుళ్ళుటయకాని=నీ దుర్భాషలే కాని, బుద్ధినేమియు=మనసులో ఇతరములేమియు, బ్రతికెడు చందంబు=బ్రతికెడు విధమును, భావింపన్=విచారించుకొనుటను, ఎఱుగవు=తెలిసికొనలేవు, వేవురు=వేలసంఖ్యలైన, నాకీశులైనన్=దేవేంద్రులైనను, గంధర్వవరులు=గంధర్వ శ్రేష్ఠులైనను, చర్చింపన్=ఆలోచించగా, బహులక్షశత సంఖ్యలైన=లక్షలాది సంఖ్యలోనున్న, రాక్షస యక్షముఖులు=రాక్షసులు యక్షాదులు, ఎన్నికకు మిగిలిన=గణింపదగిన, మత్+నాథ=నాపతియైన రాముని, దోర్బల+అభ్యున్నతిన్=బాహుబలముచే, నిగ్రహించిరేని=ఎదిరించినచో, అడగక మించజాలరు=నశింపక తప్పదు, తత్+పరాక్రమము=రాముని పరాక్రమము, ఇదే=ఇప్పుడే, నీ మదంబున్=నీ గర్వమును, అడపనున్నయది=అణగద్రొక్కనున్నది, నీకు, మనన్=జీవించుటకు, ఆస యుండెనేని=ఆశ కల్గినచో, ఇపుడిట్లు=ఇప్పుడు ఈ విధముగా, కృతమైన=చేసిన, తప్పుగావ=తప్పును రక్షించుటకు, తత్+అంఘ్రి

తామరసములకు=రాముని పాదపద్మములకు, తడయక=ఆలసింపక, శరణుచొరుము= శరణు వేడుము.

తాత్పర్యము : ఓరీ! మూఢాత్మా! చెడు ప్రవర్తనగల రావణా! నీ దుర్భాషలే కాని బుద్ధిలో బ్రతికెడు విధమును ఆలోచింపవు. వేయిమంది దేవేంద్రులు, గంధర్వ శ్రేష్ఠులు, లక్షలాది సంఖ్యలోగల రాక్షస యక్షాదులైనను, గణనకెక్కిన రాముని బాహుబలపరాక్రమమును ఎదిరించిరేని నశింపక తప్పదు. ఇప్పుడే రాముని పరాక్రమము నీ మదమును అణపగలదు. జీవించు ఆశ నీకున్నచో ఇప్పుడు ఈ విధముగా చేసిన తప్పు నుండి రక్షించుటకు ఆలసింపక ఆ రాముని పాదపద్మములను శరణు వేడుము.

భారత : ఓరి మూఢాత్మా!, దుశ్చారిత్ర=కీచకా, నీ త్రుళ్ళుటయకాని= బుద్ధినేమియు నెరుగవు, బ్రతికెడు చందంబు భావింపవు, నాకు+ఈశులైన=నాకు భర్తలైన, ఏవురు=ఐదుగురు, గంధర్వవరులు, చర్చింప, బహులక్ష శతసంఖ్యలైన=రాక్షస యక్షముఖులు, ఎన్నికకు మిగిలిన, మత్+నాథ=నా భర్తల, దోర్బలాభ్యున్నతి నడగక మించజాలరు, నిగ్రహించిరేని, తత్ పరాక్రమము, ఇదె నీ మదంబు నడపయున్నది, నీకు మన నాస యుండెనేని, ఇపుడిట్లు కృతమైన తప్పుగావ, తడయక, తత్=నా భర్తల, అంఘ్రితామరసములకు శరణుచొరుము.

తాత్పర్యము : ఓరి మూఢాత్మా! దుశ్చరిత్రగల కీచకా! నీ వాగుడు మాటలే కాని, బుద్ధినేరవు. బ్రతికెడి విధమును ఆలోచింపవు. నా భర్తలైన ఐదుగురు గంధర్వ శ్రేష్ఠులు ఆలోచింపగా లక్ష శత సంఖ్యలకు మించిన యక్ష రాక్షసాధులైనను లెక్కింపగా నా భర్తల బాహు పరాక్రమమునకు అణగక మించజాలరు. నిగ్రహించిరేని వారి పరాక్రమము ఇప్పుడే నీ మదమును నశింపజేయ బోవుచున్నది. జీవింపవలెనను ఆశ నీకు కలదేని ఇప్పుడు ఈ విధముగా నీవు చేసిన తప్పు నుండి కాపాడుటకు ఆలస్యము చేయక వారి పాదపద్మములను శరణు వేడుము.

వ. అను మాటలు విని వాఁడనాదరదుర్విలాసంబున వెడనవ్వు
నివ్వటిల్ల నవ్వరవర్ణిం గనుంగొని 9

రామా : అను మాటలు విని=సీత చెప్పిన మాటలు విని, వాడు=రావణుడు, అనాదర దుర్విలాసమున=లెక్కింపని పొగరుబోతుతనముచే, వెడనవ్వు=వెకిలినవ్వు, నివ్వటిల్లన్=వ్యక్తము కాగా, ఆ+వరవర్ణిన్=సీతను, కనుంగొని=చూచి,

తాత్పర్యము : సీత మాటలు విని రావణుడు నిర్లక్ష్యపు విలాసముతోకూడిన వెడనవ్వు నవ్వి సీతను చూచి.

భారత : వాడు=కీచకుడు, ఆ వరవర్ణిన్=ద్రౌపదిని.

తాత్పర్యము : ఆ విధముగా మాట్లాడిన ద్రౌపది పలుకులను విని కీచకుడు నిర్లక్ష్యముతో కూడిన విలాసపు వెడనవ్వు నవ్వి ద్రౌపదిని చూచి.

ఉ. బేలవు గావె నీవు వెఱపించెదు వీరినివారిఁబోలె న
న్నోలలితాంగి నాకు నిలనోపరు రుద్రముఖానిలామర
ల్వాలుఁ గుయుక్తు బిందులఁ దలంకఁ దలంకెదఁ గాని తావక
భ్రూలతికాధనుస్స్ఫురద పూర్వ విజృంభణమన్మథోద్ధతిన్. 10

రామా : ఓ లలితాంగీ=ఓ సీతా! నీవు, బేలవుగావె=అమాయకురాలవుకావా? వీరిని వారిన్‌బోలె=ఇతరులవలె, వెఱపించెదు=భయపెట్టెదవు, నాకు, రుద్రముఖ=శివునితో కూడిన, అనిల+అమరుల్=వాయువుతో కూడిన దేవతలు, నిల నోపరు=నిలువనేరరు, చాలున్=చాలును, తావక=నీ యొక్క భ్రూలతికా=బొమముడి యనెడు, ధనుః+స్ఫురత్+అపూర్వ విజృంభణ=ధనుస్సును బోలిన గొప్ప అతిశయముతో ప్రకాశించెడి, మన్మథ+ఉద్ధతిన్=మన్మథుని తీవ్రతచే, కుయుక్తు బిందులన్=కుయుక్తులతోడి దంతక్షతములకు, తలంకన్ తలంకెదన్‌కాని=చలించుటకు భయపడెదనుకాని, చాలున్=చాలును.

తాత్పర్యము : ఓ సీతా నీవెంతటి అమాయకురాలవు? ఇతరులనువలె నన్ను భయపెట్టుచున్నావు. నన్ను రుద్ర అనిలేంద్రులు కూడా ఎదిరింపలేరు. ధనుస్సును మించిన నీ బొమముడిచే మన్మదోద్దీపనము కలిగి నీ దంతక్షతములచే చలించుటకు భయపడెదను. చాలును.

భారత : అర్థము సమానము.

తాత్పర్యము : ఓ ద్రౌపదీ! అని సంబోధన.

చం. విను మిఁకఁ బెక్కు లేల యలివేణి నిజంబుగ నీకృపావలో
కన మిపు డబ్బకున్న రతికాంతునిచే నిమిషంబు నిల్వనో
ప నని రసోద్ధతిం బలుకఁ బావని యాసతి వాఁడు బల్మిఁ బ
ట్టునొ యనుశంక యప్పుడు గడుం బొడమం దనయాత్మలోపలన్.

రామా : అలివేణీ=ఓ సీతా! వినుము+ఇకన్+పెక్కులు+ఏల=ఇంక అనేక మాటలేల? వినుము, నిజంబుగ=నిజముగా, ఇపుడు, నీ కృపావలోకనము=నీ దయాదృష్టి, అబ్బకున్న=కలగనిచో, రతికాంతునిచే=మన్మథునిచే, నిమిషంబు, నిల్వనోపనని=నిలువజాలనని, రస+ఉద్ధతిన్=కామోద్రేకముచే, పలుకన్=మాట్లాడగా, పావనియు=హనుమంతుడు, ఆసతి=సీతను, వాడు=రావణుడు, బల్మిన్+పట్టునొయనుశంక=బలవంతముగా పట్టుకొనునేమో యను అనుమానము, అప్పుడు, కడున్+పొడమన్=కలుగగా, తన+ఆత్మలోపలన్=తన మనస్సులో (ననుకొనెడి మాట).

తాత్పర్యము : ఓ సీతా! ఇంక వేయి మాటలేల? నిజముగా నీ దయాదృక్కులు నాకు ఇప్పుడు లభించనిచో మన్మథునిచే నేను నిముషమైనను నిలువలేనని కామోద్రేకముతో పలుకగా, ఆ సీతను రావణుడు బలవంతముగా పట్టుకొనునేమో యను అనుమానముతో హనుమంతుడు తన మనస్సులో (అనుకొనిన మాట).

భారత : అలివేణి=ఓ ద్రౌపదీ! వినుమిక మాటలేల? నిజంబుగ, నీ కృపావలోకనము, ఇపుడబ్బకున్న, రతికాంతునిచే, నిమిషంబు, నిల్వనోపనని, రసోద్ధతిన్ పలుకన్, పావని=పవిత్రురాలైన, ఆసతి=ద్రౌపది, వాడు=కీచకుడు, బల్మిబట్టునొయను

శంక యప్పుడు కడుం బొడమం దనయాత్మ లోపలన్.

తాత్పర్యము : ఓ ద్రౌపదీ! ఇంక మాటలేల! వినుము! నిజముగా నీ దయాదృష్టి నాకు ఇప్పుడు లభించనిచో మన్మథునిచే నిమిషమైనను నిల్వనేరను – అని కీచకుడు పలుకగా పవిత్రురాలైన ద్రౌపది – వాడు బలవంతముగా తనను పట్టుకొనునేమోయను అనుమానముతో తన మనస్సులో

కం. తతభీమభుజబలంబున
నితనిమదం బడcపకున్న నెంతయు విపరీ
తత వచ్చుc దప్ప దిపుడను
మతిc బూని మరల్చె దమిత మన్యుత్వరతన్. 12

రామా : తత్=మిక్కిలి, భీమ=భయంకరమైన, భుజబలంబున= బాహు బలముచే, ఇతని మదంబు=ఇతని గర్వము, అడపకున్న=అణచకున్నచో, ఎంతయు, విపరీతత వచ్చున్=వైపరీత్యము కలుగును, ఇప్పుడు తప్పదు, అను=అనెడి, మతిన్+పూని=మనస్సుతో, దమితమన్యుత్వరతన్=అణచబడిన రోషాతిశయము గలవాడై, మరల్చె=మరల్చెను.

తాత్పర్యము : మిక్కిలి భయంకరమైన తన బాహుబలముచే (హనుమంతుడు) ఇతని గర్వము (రావణుని) అణచకున్నచో విపరీతములు కలుగును. ఇపుడు తప్పదు అనెడి మనస్సుతో అణచబడిన రోషాతిశయమును మరల్చెను. (సముదాయించుకొనెను)

భారత : తత్+విస్తరించిన, భీమభుజ బలంబునన్=భీముని బాహుబలముచే, ఇతని మదంబడపకున్న నెంతయు, విపరీతతవచ్చు, తప్పదు, ఇపుడు, అనుమతిన్+పూని=అంగీకారమును చూపి, మిత=మితమైన, మన్యుత్వరతన్= కోపమును, మరల్చెదన్=కీచకుని తిరుగనంపెదను.

తాత్పర్యము : ద్రౌపది అనుకొన్న మాటలు.

“విస్తరించిన భీముని బాహుబలముచే కీచకుని మదమును అణచనిచో

ఎంతయైన వైపరీత్యము కలుగుట తప్పదు. ఇప్పుడు నా అంగీకారమును చూపి మితమైన కోపాతిశయముగలదాననై కీచకుని వెనుకకు పంపెదను"

కం. అనివార్యమాణరోషం
బున నవనిజయుక్తిధార్ఢ్యము దలిర్పఁగ న
మ్మనసిజవశు ఖలు మగుడిం
చి నితాంతము నడలె నతని చేఁతకు నంతన్. 13

రామా : అనివార్యమాణ=నివారింప శక్యముగాని, రోషంబున=కోపముతో, అవనిజయు=సీత, నవ=కొత్తదైన, యుక్తిదార్ఢ్యము=మాటల దిట్టతనము, తలిర్పగ=కలుగగా, ఆ+మనసిజవశు=ఆ మన్మధవశుడైన రావణుని, ఖలున్=దుష్టుని, మగుడించి=త్రిప్పి పంపి, అంతన్, అతని చేతకు=అతని పనులకు, నితాంతము=మిక్కిలి, అడలెన్=విచారపడెను.

తాత్పర్యము : నివారింప శక్యముగాని కోపముతో సీత కొత్తగా తెచ్చుకొన్న మాటల దిట్టతనముచే (తిట్టి పంపుట) ఆ మన్మధవశుడైన దుష్టుడగు రావణుని త్రిప్పి పంపి, అతని పనులకు మిక్కిలి విచారించెను.

భారత : అని=ఈ విధముగా ద్రౌపది మనస్సులో అనుకొని, వార్యమాణ రోషంబునన్=కోపమణచుచు, నవయుక్తిదార్ఢ్యము తలిర్పగన్, ఆమునసిజవశున్, ఖలుని=దుష్టుడైన కీచకుని, మగుడించి, అతని చేతకు అంతన్ నితాంతము సడలెన్.

తాత్పర్యము : ఈ విధముగా ద్రౌపది తన మనస్సులో భావించి, కోపమును అణచుకొని, కొత్తగా తెచ్చి పెట్టుకున్న మాటలదిట్టతనము కలుగగా ఆ మదనావేశపరుడైన కీచకుని వెనుకకు మరల్చి, అతని చేష్టలకు మిక్కిలి విచారించెను. అంత

ఆ. సూపకారవృత్తి దీపింప మారుతి
యున్న వాసమార్తిఁ జెన్నుదొరుఁగు

నగ్గుణాభిరామ దగ్గఱి తద్దర్శ
నము యథోచితవిధి నమరఁ జేసి. 14

రామా : సు=లెస్సయైన, ఉపకారవృత్తి=ఉపకార వర్తనము, దీపింపన్=ప్రకాశించునట్లు, మారుతియున్=హనుమంతుడు, నవ=కొత్తదైన, అసమ=అధికమైన, ఆర్తిన్=పీడచే, చెన్ను దొరుగు=ఖిన్నురాలైన, ఆ+గుణాభిరామన్=ఆ సీతను, డగ్గఱి=సమీపించి, తత్+దర్శనము=ఆమె దర్శనము, యథోచితవిధిన్=తగిన రీతిలో, అమరన్+చేసి=కలుగునట్లు చేసి.

తాత్పర్యము : మిక్కిలి ఉపకార వర్తనము ప్రకాశించునట్లు హనుమంతుడు, కొత్తదై అధికమైన పీడచే ఖిన్నురాలైన ఆ సీతను సమీపించి తగిన రీతిలో ఆమె దర్శనము కలుగునట్లు చేసి –

భారత : సూపకారవృత్తి=వంటలవానివలె, దీపింప=ప్రకాశించు, మారుతియున్న=భీముడున్న, వాసము=గృహమును, ఆర్తి చెన్నుదొరగు=పీడచే ఖిన్నురాలైన, ఆ గుణాభిరామ=ద్రౌపది, డగ్గఱి, తద్దర్శనము యథోచిత విధి నమరజేసి.

తాత్పర్యము : వంటలవానివలె ప్రకాశించు భీముడున్న గృహమును పీడచే ఖిన్నురాలైన ద్రౌపది సమీపించి తగిన రీతిలో నతనిని దర్శించి

వ. నిజవృత్తం బెల్ల నెఱింగించి తనరాకచందంబు వివరించి యి
ట్లనియె. 15

రామా : హనుమంతుడు తన చరిత్రనెల్ల సీతకు తెలియజేసి, తన సముద్రలంఘన విధమును తెలిపి ఇట్లనెను.

భారత : ద్రౌపది తన వృత్తాంతమును భీమునకు తెలిపి, తన రాకకుగల కారణమును వివరించి, ఇట్లనెను.

శా. కల్యాణీభవదీశ్వరాజ్ఞమహిమం గల్గె న్ని రాఘాటబా
హుళ్యాత్యుద్ధతజంతుఘోరవనవాసోదన్వదుల్లంఘనా

కల్యాణాతిశయంబు నాకుఁ దుద వాక్సంకోచనం బేల ని
స్తుల్యత్వద్వరశక్తి గల్గ మన కెందు న్లే వసాధ్యార్థముల్. 16

రామా : కల్యాణీ=ఓ సీతామాతా, భవత్+ఈశ్వర=నీ పతియైన రాముని, ఆజ్ఞ మహిమన్=ఆ దేశమహిమచే, నిరాఘాట=తడవులేని, బాహుళ్య=అధికమైన, అతి+ఉద్ధత=మిక్కిలి తీవ్రములైన, జంతు=జంతువులచే, ఘోర=ఘోరమైన, వన=నీటికి, వాస=స్థానమైన, ఉదన్వత్=సముద్రము యొక్క, ఉల్లంఘనా=దాటుటయనెడి, కల్యాణ=శుభము యొక్క, అతిశయంబు=ఆధిక్యము, నాకు=హనుమకు, కల్గ=కలుగగా, తుదన్=చివరకు, వాక్+సంకోచనంబేల?=మాటలలో కొరతఏల? నిస్+తుల్య=సాటిలేని, త్వత్+వరశక్తికల్గన్=నీ ప్రియుడైన రాముని యొక్క శక్తి కలుగగా, మనకు, అసాధ్య+అర్థముల్=సాధింపలేని పనులు, ఎందున్ లేవు=ఎక్కడను లేవు.

తాత్పర్యము : ఓ సీతా కల్యాణీ! నీ పతియైన రాముని ఆదేశ మహత్వము కలిగి తడవులేని మిక్కిలి బహుళమైన ఉద్ధతములైన జంతువులచే నిండిన ఘోరమైన నీటికి స్థానమైన సముద్ర లంఘనమనెడి శుభాధిక్యము నాకు కలుగగా చివరగా మాటలలో కొరతయేల? సాటిలేని నీ భర్త రాముని శక్తి కలుగగా మనకు ఎక్కడను అసాధ్యములైన పనులు కలుగవు – అని హనుమ చెప్పెను.

భారత : కల్యాణీభవత్=శుభమగు, ఈశ్వరాజ్ఞ మహిమన్=భగవదాదేశ మహిమచే, నిరాఘాట బాహుళ్యాత్యుద్ధత జంతుఘోర, వనవాస=అరణ్యావాసమనెడి, ఉదన్వత్+ఉల్లంఘనా=సముద్రమును దాటుటయను, కళ్యాణాతిశయంబు – కల్గె, నాకు, తుదన్, వాక్+సంకోచనంబేల? నిస్తుల్య=సాటిలేని, త్వత్=నీ యొక్క, వర=శ్రేష్ఠమైన, శక్తి=సామర్థ్యము, కల్గన్=అసాధ్యార్థముల్=సాధింపలేని ప్రయోజనములు మనకెందున్ – లేవు.

తాత్పర్యము : భగవదాదేశ మహిమచే శుభమగుచున్న అడ్డులేని బహుళ జంతు ఘోరమైన అరణ్యావాసమనే సముద్రమును దాటుటయను శుభాతిశయము కలిగెను. నాకు తుదకు మాటలలో సంకోచమేల? సాటిలేని నీ శ్రేష్ఠమైన సామర్థ్యము

కలుగగా మనకు సాధింపలేని ప్రయోజనములు లేవు అని ద్రౌపది పలికెను.

కం. అతిశీఘ్రమె తెగఁజూడుము
హతగుణు నీద్రోహి నోర్చు నదియే యకటా!
యతివ భవత్ప్రియబాహా
ద్ధతిదురహంకారు లైనదస్యులచేఁతల్. 17

రామా : అతిశీఘ్రమె=త్వరగా, హతగుణున్=చెడ్డ గుణములుగల, ఈ ద్రోహిన్=రావణుని, తెగ చూడుము=చావజూడుము. అతివ=ఓ సీతా!, అకటా, భవత్+ప్రియ=నీ భర్తయైన రాముని, బాహూద్ధతి=బాహుబలము, దురహంకారులైన=చెడ్డ గర్వముగల, దస్యులచేతల్=శత్రువుల దుశ్చేష్టలు, ఓర్చునదియే=ఓర్చుకొనగలమా?

తాత్పర్యము : ఓ సీతా! నీ భర్తయైన రాముని బాహుబలముచే త్వరగా ఈ చెడుగుణములగల ద్రోహియైన రావణుని చావజూడుము. దురహంకారులైన శత్రువుల దుశ్చేష్టలు ఓర్చుకొనగలమా? అని హనుమ పలికెను.

భారత : ద్రౌపది భీమునితో – హతగుణున్, ఈ ద్రోహిన్, అతి శీఘ్రమె, తెగజూడుము, అకటా! భవత్ప్రియ=నీ ప్రియురాలైన, అతివ=ద్రౌపది, బాహూద్ధతిన్, దురహంకారులైన, దస్యులచేతల్, ఓర్చునదియే

తాత్పర్యము : అకటా! చెడు గుణములుగల ఈ ద్రోహియైన కీచకుని అతి త్వరలో తెగజూడుము. నీ ప్రియురాలైన అతివకై బాహుబలముచే దురహంకారులైన శత్రువులను ఓర్చుకొనగలమా – అని ద్రౌపది భీమునితో ననెను.

సీ. ఇదియొండు నాపల్కు మదిఁ జేర్చు మాత్మ బ
లఖ్యాతిసంపద ల్దనర వచ్చి
దృఢదర్పు నీద్రోహిఁ దెగటార్చు నీవార్త
వినఁబడినప్పుడ మనవిభుండు

మనతోడఁగూడఁ గ్రమ్మఱ నగణ్యమహావ
నీరాజ్యసౌఖ్యసంచారములకుఁ
జనుట ధ్రువం బిది సమయంబు గావున
నీ వంతవట్టును నెమ్మనమున

ఆ. మఱువ కోయవార్యమానసతీవ్రతా
ధిక్య మేర మీఱు తెగువ కిపుడు
సొరక తునుమవలయుఁ జిమ్ములోలోన న
త్యంతమన్యుసంభ్రమాతిశయము. 18

రామా : ఇదియొండు=ఇది ఒకటి, నా పల్కు, మదిన్+చేర్చుము=మనసున భావింపుము, మనవిభుండు=రాముడు, ఆత్మబలఖ్యాతి సంపదల్=తన సేనా సమూహ సంపదలతో, తనరవచ్చి=కూడి వచ్చి, దృఢదర్పున్=గొప్ప గర్వముగల, ఈ ద్రోహిన్=ఈ రావణుని, తెగటార్చున్=సంహరించును, నీ వార్త వినబడినప్పుడు=నీ వార్త తెలిసినంతనే, మనతోడగూడ, క్రమ్మఱన్=తిరిగి వెళ్లి, అగణ్య=గణింప లెక్కకురాని, మహా+అవనీరాజ్య=గొప్పదైన, రాజ్యము యొక్క, సౌఖ్య సంచారములకు=సుఖప్రదమైన ప్రయాణములకు, చనుట=వెళ్లుట, ధ్రువంబు=తథ్యము, ఇది సమయంబు గావున=పదునాలుగేండ్ల అరణ్యవాస సమాప్తిమయిన తగిన సమయము గావున, నీ వంతవట్టును=నీవు అప్పటివరకు, మఱువక, ఓ=ఓ! అవార్యమాన=వారింపరాని మనసును, సతీవ్రత+ఆధిక్య=పాతివ్రత్యము యొక్క గొప్పదనము గలదానా!, మేరమీఱు తెగువకున్=మరణ సాహసమునకు, ఇపుడు, సొరక=ప్రయత్నింపక, చిమ్ములో లోనన్=లోపల ప్రవహించు, అత్యంత=గొప్పదైన, మన్యు=శోక రోషముల యొక్క, సంభ్రమాతిశయము=తీవ్రతల ఆధిక్యమును, తునుమవలయు=నశింపజేయవలెను.

తాత్పర్యము : ఈ నా మాట నొకదానిని మనసున భావింపుము. రాముడు తన ఖ్యాతిగల సేనాసమూహ సంపదలతో తరలి వచ్చి అధికగర్వముగల ఈ రావణుని

సంహరించును. నీ వార్త వినబడినంతనే మనతోగూడ తిరిగి వెళ్లి గణింపరాని గొప్ప రాజ్య సంపదలలో సుఖప్రదమైన ప్రయాణములకు వెళ్లుట తథ్యము. అరణ్యవాస సమాప్తికిది తగిన సమయము గావున, నీవంత వరకు ఓ సీతాదేవీ! మఱువక వారింపరాని మనసుతో గూడిన పాతివ్రత్యము యొక్క గొప్పదనము గలదానా! మరణ సాహసమునకు ఇప్పుడు ప్రయత్నింపక లోలోపల వెలిగ్రక్కు శోక రోషముల తీవ్రాధిక్యమును నశింపజేయవలెను. (హనుమంతుడు సీతతో చెప్పిన మాటలివి)

విశేషణము : మన్యు – మన్యుర్దైన్యేక్రతౌక్రుధి – అని అమరకోశము.

భారత : అది యొందు నా పల్కుమది జేర్చుము, ఆత్మ=నీ యొక్క బలఖ్యాతి సంపదల్=బలముతో గూడిన అధిక ప్రసిద్ధులు, తనరన్=ప్రకాశింపగా, వచ్చి, దృఢదర్పున్, ఈ ద్రోహిన్=కీచకుని, తెగటార్చు=చంపు, నీవార్త వినబడినప్డ=నీ వార్త వినగానే, మన విభుండు=ధర్మరాజు, మహత్=గొప్ప, వనరాజీ=వనపంక్తుల యొక్క, అసౌఖ్య సంచారములకు=సుఖములేని ప్రయాణములకు, చనుటధ్రువంబు, ఇది సమయంబు గావున=ఇది మనము చేసికొన్న నియమముగాన, నీవంత వట్టును నెమ్మనమున మఱువక=అప్పటి వరకు నీ మనసులో ఎచ్చరిక తప్పక, ఓ+అవార్య మానవతీ వ్రతాధిక్య!=ఓ వారింపరాని మానమే వ్రతముగా గలదానా! ద్రౌపదీ! మేర మీఱు తెగువనిపుడు సొరక=కట్టడిని దాటుటకు ప్రయత్నింపక, చిమ్ములోలోన, అత్యంత మన్యు సంభ్రమాతిశయము, తునుమవలయు.

తాత్పర్యము : ద్రౌపదీ భీముల సంభాషణ.

నేను చెప్పెడి ఒక మాటను మనసున చేర్పుము. నీ బలకీర్తి సంపదలతో ప్రకాశింపగా వచ్చి అధిక గర్వముగల ఆ కీచకుని చంపు నీ వార్త వినగానే ధర్మరాజు గొప్ప వనపంక్తుల యందు శ్రమతో గూడిన ప్రయాణములకు వెళ్లుట తథ్యము. ఇది మనము చేసికొన్న సమయముగాన, అంత వరకును నీ మనసులో ఎచ్చరిక తప్పక ఓ మానవతీపతివ్రతా శిరోమణీ! ద్రౌపదీ! కట్టడిని అతిక్రమించుటకు ప్రయత్నింపక మనస్సులో గలిగిన శోకరోషాతిశయమును నశింపజేయవలెను.

ఆ. తగదు మిగుల నిచటఁ దడయఁగ సంకేతి
తం బగుసమయంబు దప్పకుండ
నే దిరిగి యరిగెద నీవు నావెంబడి
నడువవలయుఁ దాల్మి సడలనీక. 19

రామా : మిగులన్+ఇచట=ఇచ్చట మిక్కిలిగా, తడయన్=ఆలసించుట, తగదు, సంకేతితంబగు సమయంబు=రాముడు పరిమితి పెట్టిన కాలము తప్పకుండ, నేన్=(గనుము) నేను, తిరిగియరిగెద=తిరిగి వెళ్లెదను, నీవు=నీవు (సీత) తాల్మి సడలనీక=ఓర్పు వదలకుండ, ఆ వెంబడిన్=నేను చెప్పిన ప్రకారము, నడువవలయు.

తాత్పర్యము : ఇచ్చట నేను ఎక్కువ ఆలసింపరాదు. రాముడు (వానరులకు) పెట్టిన పరిమిత కాలము దాటకుండ, నేను తిరిగి వెళ్లెదను. నీవు ఓర్పు వదలకుండ నేను చెప్పిన ప్రకారము నడువవలయును.

భారత : మిగులన్, ఇచట, తడయన్=తగదు, సంకేతితంబగు సమయము=వచ్చెదనని కీచకునితో చెప్పిన వేళ, తప్పకుండ, నే తిరిగి యరిగెద=నేను తిరిగి వెళ్లెదను, తాల్మి సడలనీక=కోపము లేని, నీవు నా వెంబడి నడువవలయు.

తాత్పర్యము : ద్రౌపది భీమునితో –

ఇక్కడ నేను ఎక్కువ కాలము ఉండరాదు. కీచకునకు నేను చెప్పిన వేళకు తప్పకుండునట్లు తిరిగి వెళ్లెదను. కోపములేని రీతిలో నీవు నావెంబడి నడువవలయును.

ఆ. అని పలికి భవద్వరాత్మకు నామాట
యొప్పగుట కొరక గుఱు తొసఁగు మనియె
నిచ్చెఁ దత్పతిప్రహిత మైననమ్మిక
యుంగరంబు సతికి నుబ్బు మెఱయ. 20

రామా : అని పలికి, భవత్+వర=నీ పతియైన రాముని, ఆత్మకున్=మనస్సునకు,

నామాట=నేను చెప్పిన మాట, ఒప్పగుటకున్=నమ్మకము కలుగుటకు, ఒక గురు తొసగుమనియె=ఒక గుర్తునిమ్మని కోరెను, తత్ పతిప్రహితమైన=ఆ సీతాపతి పంపిన, నమ్మిక=నమ్మకము కొఱకైన, ఉంగరంబు=ముద్రికను, సతికిన్=సీతకు, ఉబ్బు+మెఱయ=సంతోషము కలుగునట్లు, ఇచ్చెన్=ఇచ్చెను.

తాత్పర్యము : హనుమంతుడా విధముగా పల్కి నీ పతియైన రాముని మనస్సునకు నా మాటలు నమ్మకము కలుగుటకు ఒక గుర్తు నిమ్మని కోరెను. ఆ సీతాపతి పంపిన నమ్మకము కలిగించు ఉంగరమును సీతకు సంతోషము కలుగునట్లుగా హనుమంతుడిచ్చెను.

భారత : అని పలికి, భవత్=నీ యొక్క వరాత్మకు=గొప్ప మనస్సునకు, నా మాట ఒప్పగుటకు=నేను చెప్పిన మాట సమ్మతియైనందుకు, ఒక గురు తొసగుమనియెన=ఒక వాగ్దానము నిమ్మనెను, తత్+పతి=ఆ భీమునిచే, ప్రహితమైన=ఇవ్వబడిన, నమ్మికయున్=నమ్మకము, కరంబు=మిక్కిలి, సతికిన్=ద్రౌపదికి, ఉబ్బుమెరయ, సంతోషము కలుగునట్లుగా, ఇచ్చె=భీముడిచ్చెను.

తాత్పర్యము : అని ద్రౌపది పలికి నీ ఘనమైన మనస్సునకు నేను చెప్పిన మాట సమ్మతియైనందుకు ఒక వాగ్దానము నిమ్మని కోరెను. ఆ భీమునిచే యివ్వబడిన నమ్మకము ద్రౌపదికి మిక్కిలి సంతోషమును కలిగింపగా భీముడిచ్చెను.

కం. అనిలజుఁ డధికతమస్థితి
నొనరెడితమి రామదుఃఖ ముడుపుటకు నయం
బునఁ దత్సతీశిరోమణి
గొని చనఁగనియమితదర్పగురు సంభ్రముఁడై. 21

రామా : అనిలజుడు=హనుమంతుడు, అధికతను=మిక్కిలి అధికమైన మర్యాదచే, ఒనరెడి=ఒప్పెడి, తమిన్=వేడుకచే, రామదుఃఖము+ఉడుపుటకు=రాముని యొక్క శోకమును తొలగించుటకు, నయంబున=వినయముతో, తత్+సతీ శిరోమణి+గొని=ఆ సీతాదేవి శిరోమణిని తీసుకొని, అమిత=అధికమైన,

దర్పగురు=మిక్కిలి గర్వముచే, సంభ్రముడై=ఆశ్చర్యముగలవాడై, సనగని=వెళ్ళువాడై.

తాత్పర్యము : హనుమంతుడు మిక్కిలి అధికమైన మర్యాదతో ఒప్పిన వేడుకచే రాముని దుఃఖమును పోగొట్టుటకు నయముగా సీతాదేవి శిరోమణిని తీసుకొని అమితమైన గొప్ప గర్వముచే కూడిన ఆశ్చర్యము కలిగి వెళ్ళువాడై.

భారత : అనిలజుడు=భీముడు, అధిక=గొప్పదైన, తమః=అంధకారము యొక్క స్థితిన్=నిలుకడచే, ఒనరెడి=ఒప్పిన, తమిన్=రాత్రియందు, రామ=ద్రౌపదిని, తత్+శిరోమణిన్=ఆ పతివ్రతారత్నమును, నియమిత=అణచబడిన, దర్ప=గురు సంభ్రముడై, చనగ=వెళ్ళగా.

తాత్పర్యము : భీముడు మిక్కిలి చీకటి నిండిన రాత్రియందు ద్రౌపది దుఃఖమును బాపుటకు నయమగు రీతిలో అణచబడిన గొప్ప దర్పముతో కూడిన ఆశ్చర్యముగలవాడై ఆ పతివ్రతా శిరోమణిని తీసుకొని వెళ్ళగా.

కం. పోరికిఁ దివిరి యరిగె బ
లీబ్బరముచే వనవిఘాతలీల నెఱపుచున్
ధీరత దనరఁగ లంకా
ద్వారగతుం డగుచుఁ బేర్చె వైరివధరతిన్. 22

రామా : పోరికిన్+తివిరి=యుద్ధమును కోరి, బల్‌బీరముచే=మిక్కిలి అహంకారముతో, వన విహారలీల=అశోక వనమును నాశనము చేయు విలాసము, నెఱపుచు=నడుపుచు, తనరగ=ఒప్పిన, ధీరతన్=ధైర్యముతో, అరిగె=వెళ్ళెను, లంకా ద్వార గతుండగుచు=లంకా ద్వారమునకు వెళ్ళి, వైరివధరతిన్=రాక్షసులను సంహరించు కోరికతో, పేర్చె=అతిశయించెను.

తాత్పర్యము : అశోకవనమును నాశనము చేయు లీలావిలాసమును నడుపుచు మిక్కిలి అహంకారముతో హనుమ యుద్ధమును కోరి వెళ్ళెను. శత్రు సంహారమును కోరి ధైర్యము కూడిరాగా లంకా ద్వారమును చేరి అతిశయించెను.

భారత : బల్‌బీరము చేవన్=అహంకార సారముచే, పోరికిన్ తివిరి అరిగె=భీముడు యుద్ధమును కోరి వెళ్ళెను, అవిఘాతలీల నెఱపుచున్=తనకడ్డులేని రీతిగా ప్రవర్తించుచు, ధీరత తనరన్=ధైర్యము కూడిరాగా, కలంక=అపవాదమునకు, అద్వార=ప్రవేశ హేతువుగాని, గతుండు+అగుచున్=గమనముగలవాడై, రహస్య గమనము గలవాడై, వైరివధ రతిన్=కీచకుని సంహరించుట అను వేడుకను, పేర్చెన్=పెంచెను.

తాత్పర్యము : భీముడు అహంకారపు చేవచే యుద్ధమునకు తనకడ్డులేని రీతిగా బయలుదేరెను. ధైర్యముతో కూడి తమ అపవాదమునకు కారణభూతముకాని గమనముగలవాడై (రహస్య వర్తనముచే) కీచక వధయను వేడుకను పెంచెను.

వ. అంత

ఉత్సాహ : తమముచే నొకించుకయునుదలము గానమి న్నితాం
తము నిజాంగనాశనఫలదర్పకోపకప్తసం
భ్రమముతోడఁ దన్నుఁ జెనకఁ బరఁగుసింహబలులస
త్సమరమతులలీల మెఱయఁ జంపెఁ జిత్రవధరతిన్. 24

రామా : తమముచేన్=అజ్ఞానముచే, ఒకించుకయున్=కొద్దిగా కూడ, తలముగానమిన్=స్వరూపము తెలియకపోవుటచే, నితాంతము=మిక్కిలి, నిజాంగ=తమ శరీరముల యొక్క, నాశనఫల=నాశనము ఫలముగాగల, దర్ప=గర్వముచే, కోప=కోపముచే, క్లుప్త=చేయబడిన, సంభ్రమము తోడన్=ఆశ్చర్యముతో, తన్నున్ బెనకన్=హనుమంతుని ఎదిరించుటకు, పరగు=ప్రయత్నించు, సింహబలులన్=సింహములవంటి బలముగలవారిని, సత్+సమరమతులన్=యుద్ధమందు మిక్కిలి మనసుగలవారైన రాక్షసులను, లీలమెఱయన్=విలాసముగా, చిత్రవధరతిన్=చిత్రముగా చంపు కోరికతో, చంపెన్=చంపెను.

తాత్పర్యము : అజ్ఞానముచే హనుమంతుని స్వరూపము కొద్దిగానైనను తెలియకపోవుటచే మిక్కిలిగా తమ శరీరముల నాశనము ఫలముగాగల గర్వము

కోపముచే చేయబడిన సంభ్రమముగలవారై తనను ఎదిరించుటకు వచ్చిన యుద్ధమందు మిక్కిలి మనసుగల సింహబలులైన రాక్షసులను చిత్రవధ కోరికతో చంపెను.

భారత : తమముచేన్=చీకటిచే, తలముగానమిన్=స్త్రీ పురుషుల స్వరూప భేదము కానరాకుండుటచే, నితాంతము=అధికమైన, నిజాంగన=ద్రౌపదియందలి, ఆశను=అపేక్షచే, అఫల=నిష్ఫలమైన, దర్పక+ఉపక్లుప్త=మన్మధకృతమైన, సంభ్రమము తోడన్, అధిక భ్రమతోకూడి, తన్నున్+చనక బరగు=భీముని ఎదిరించుటకు ప్రయత్నించు, సింహబలు=కీచకుని, లసత్ సమరము=మిక్కిలి యుద్ధములో, అతులలీల మెఱయన్=లీలా విలాసముగా, చిత్రవధరతిన్=చిత్రవధ చేయు రీతిలో, చంపెన్=చంపెను.

తాత్పర్యము : చీకటి యగుటచే స్త్రీ పురుషుల స్వరూపభేదము తెలియకపోవుటచే ద్రౌపది యందలి మిక్కిలి అపేక్షచే నిష్ఫలమైన మన్మధకృతమైన సంభ్రమముతో కూడి భీముని ఎదిరించుటకు వచ్చిన కీచకుని యుద్ధమునందు లీలా విలాసముచే చిత్రవధపై కోరికతో చంపెను.

విశేషణము : తలము - 'అధస్స్వరూపయోరస్త్రీతలంస్యాత్' - అని అమరకోశము. ఉత్సాహ వృత్తమునకు ఛందముః ప్రతిపాదమున 7 సూర్యగణములు ఆపైన ఒక గురువు కలది. 5వ గణము మొదటి అక్షరము యతి 'స' గణము, 'హ' గణము అనునవి సూర్యగణములు.

వ. తదనంతరంబ మఱియును. 25

తర్వాత మరియు

ఆ. శక్తిమత్త దనుజసంఘ మక్షాంతమై
పొలిసెఁ బవనపుత్త్రుభుజబలమున
నతనికాంతకాగ్రహప్రేరణంబుచేఁ
గరము కీడొనర్చు కడఁకఁజేసి. 26

రామా : శక్తి=బలిమచే, మత్త=మదించిన, దనుజ=రాక్షసుల యొక్క, సంఘ=సమూహము, అక్షాంతమై=అక్షకుమారుడు చివరివాడుగా, పవనపుత్త్ర= హనుమంతుని యొక్క, భుజబలమునన్=పరాక్రమముచే, అంతక=యముని సంబంధమైన, ఆగ్రహ=ఆగ్రహము యొక్క ప్రేరణంబుచేన్=యమ ప్రేరణచే, అతనికిన్=ఆ హనుమంతునికి, కరము=మిక్కిలి, కీడొనర్చుకడకన్+చేసి=కీడు చేసెదనను ప్రయత్నము నడపుటచే, పొలిసెన్=నశించెను.

తాత్పర్యము : బలిమిచే మదించిన రాక్షస సమూహము అక్షకుమారుడు చివరివాడుగా హనుమంతుని పరాక్రమముచే యముని ఆగ్రహ ప్రేరణచే ఆ హనుమంతునికి మిక్కిలి కీడు చేసెదనను ప్రయత్నము చేయుటచే నశించెను.

భారత : శక్తిమత్=బలిష్ఠులగు, తత్+అనుజ సంఘము=కీచకుని తమ్ములందరు, అక్షాంతమై=ఓర్పులేనివారై, అతని కాంతకున్=భీముని పత్నియైన ద్రౌపదికి, కీడొనర్చు కడకజేసి, కరము, పవనపుత్త్ర భుజబలమునన్=భీముని బాహుపరాక్రమముచే పొలిసెన్=నశించిరి.

తాత్పర్యము : బలిష్ఠులైన కీచకుని తమ్ములందరు ఓర్పులేనివారై ద్రౌపదికి కీడు చేసెదమను ప్రయత్నము చేసి భీముని బాహు పరాక్రమముచే నశించిరి.

తే. విబుధకంటకకీచకవిపినమునకు
దావవహ్నిగా నాత్మప్రతాపమహిమ
నెఱపె వాయుజుఁ డన్యుల కెఱుకపడక
యుండ లోలోనఁ బొగడె బుధోత్కరంబు. 27

రామా : విబుధకంటక=రాక్షసులనెడి, కీచక విపినమునకున్= వెదురుటడవులకు, దావవహ్నిగాన్=దావాగ్నిగా, వాయుజుడు=హనుమంతుడు, ఆత్మప్రతాప మహిమన్=తన శౌర్యమహిమను, నెఱపెన్=చూపెను, బుధోత్కరంబు= దేవతల సమూహము, అన్యులకున్=రాక్షసులకు, ఎఱుకపడక యుండన్= తెలియనట్లుగా, లోలోన, పొగడె.

తాత్పర్యము : విబుధులకు కంటకము కల్గించు వెదురుటడవుల వంటి రాక్షసులకు దావాగ్నిగా హనుమంతుడు తన ప్రతాప మహిమను చూపెను. రావణభీతులైన దేవతల సమూహము రాక్షసులకు తెలియని రీతిలో లోలోపల పొగడిరి.

భారత : విబుధ కంటక=సజ్జనద్వేషులైన, కీచక=కీచకులనెడి, విపినమునకున్= అడవికి, దావవహ్నిగా, ఆత్మప్రతాప మహిమన్, వాయుజుడు=భీముడు, అన్యులెరుగకుండ=ఇతరులకు తెలియని రీతిలో, లోలోన=రహస్యముగా, నెఱపెను=జరిపెను, బుధోత్కరంబు=సజ్జనుల సముదాయము, పొగడె.

తాత్పర్యము : సజ్జనులకు కంటకప్రాయులైన కీచకులనెడి అడవిని దావాగ్నివలె తన ప్రతాప మహిమను చూపి భీముడు ఇతరులెరుగకుండ రహస్యముగా నాశనము చేసెను. బుధుల సముదాయము పొగడిరి.

తే. తత్సహోదరసంప్రవర్తనము జరిగె
నప్పురములోనగూఢమై యంత నేఁడు
ముగిసివచ్చె దానవరాజి మోదకాల
మనుచు సంతస మందె వాతాత్మజుండు. 28

రామా : తత్=ఆ హనుమంతుని యొక్క, సహః=బలిమి వలన, దర=భయము యొక్క, సంప్రవర్తనము=వృత్తాంతము, ఆ+పురములోను=లంకయందు, అగూఢమై=ప్రకటితమై, జరిగెన్=జరిగెను, అంత, దానవ=రాక్షసుల యొక్క, రాజ=పంక్తుల యొక్క, మోదకాలము=సంతోష సమయము, నేడు=ఈ రోజు, ముగిసివచ్చె+అనుచు=ముగిసినదని, వాతాత్మజుండు=హనుమంతుడు, సంతసమందె=సంతోషించెను.

తాత్పర్యము : ఆ హనుమంతుని బలము వలన భయముతో ఆ వృత్తాంతము లంకయందు బాహాటముగా జరిగెను. అంతట రాక్షస పంక్తులయొక్క సంతోషకాలము ఈనాటితో ముగియవచ్చెనని హనుమంతుడు సంతోషపడెను.

భారత : తత్+సహోదర=ఆ భీముని సహోదరులైన ధర్మరాజాదుల, సంప్రవర్తనము=నడక, అప్పురములోనన్=విరాట పట్టణమున, గూఢమై= రహస్యముగా, జరిగెను=నడచెను, అంతను=ఆ తరువాత, ఏడు=అజ్ఞాతవాస సంవత్సరము, ముగిసివచ్చె=తీరిపోవు సమయము వచ్చెను, దానన్=అట్లు ముగియుట వలన, వర=శ్రేష్ఠమైన, ఆజి=యుద్ధము చేతనైన, మోదకాలము+అనుచు=సంతోష సమయమని, వాతాత్మజుండు=భీముడు, సంతసమందె=సంతోషించెను.

తాత్పర్యము : విరాటుని పట్టణమందు భీముని తోబుట్టువులైన ధర్మరాజాదుల ప్రవర్తన అజ్ఞాతముగా జరిగెను. ఆ సంవత్సరము ముగియవచ్చుట వలన శ్రేష్ఠమైన యుద్ధము చేయు సంతోష కాలము వచ్చెనని భీముడు సంతోషించెను. (యుద్ధమున శత్రుసంహారము చేసి రాజ్యము చేకొనవచ్చునని సంతోషపడెను).

సీ. వ్యథఁ జేయుతత్సత్త్వవార్తాశ్రుతినిగ్లేశ
పడుచుఁ దత్సంగరభంగపరత
నుత్తమద్రవిణసంపత్తి పౌలస్త్యుండు
దుర్యోధనుఁడు రోషదూషితుండు
తత్పురిలోపల ధర్మజభీమసం
క్రందనజయముల కలిమి యెంచి
జనులు మెచ్చఁగఁ బేర్చు శౌర్యాఢ్యునాహవ
కృతిసుశర్మబలోపచితధనుఃప్ర
తే. ణాదతులితాంబునిధి మేఘనాదుఁ బనిచె
నతఁడు నేఁగి హరిన్నుతో గ్రాజిఁ బట్టె
నవ్విరటుడాసిగెలుపునఁ గ్రొవ్వుభటులు
దన్మహాగోగణాగ్రహోద్భటత నడువ. 29

రామా : వ్యథన్+చేయు=బాధించు, తత్+ఆ హనుమంతునియొక్క,

సత్త్వవార్తా=బల వృత్తాంతమును, శ్రుతిని=వినుటచే, క్లేశపడుచు=బాధపడుచు, తత్ సంగర=ఆ హనుమంతుని యుద్ధమును, భంగపరతన్=చెఱచుట కొఱకై, ఉత్తమ ద్రవిణ=ఉత్తమ బలసంపత్తిగల, దుర్యోధనుడు=యుద్ధము చేయుటకు శక్యము కానివాడు, రోషదూషితుండు=కోపము ఆక్రమించినవాడు, పౌలస్త్యుండు=రావణుడు, తత్+పురిలోపలన్=లంకలో, ధర్మజ=వింటి వలన పుట్టిన, భీమ=భయంకరములైన, సంక్రందన జయముల కలిమి=ఇంద్రుని జయించిన సంపదగల, జనులు మెచ్చగ, పేర్చు, అతిశయించు, శౌర్యాఢ్యు=బలముగలవానిని, ఆహవకృతిన్= యుద్ధక్రీడ యందు, సు=లెస్స అయిన, శర్మన్=సుఖముగల వానిని, బలోపచిత=బలముచే వృద్ధిపొందింపబడిన, ధనుః ప్రణాద=ధనుష్టంకారముచే, తులిత=సరిపోల్చబడిన, అంబునిధిన్=సముద్రము గల వానిని, మేఘనాదున్= ఇంద్రజిత్తును, పనిచెన్=పంపెను, అతడున్=ఆ ఇంద్రజిత్తును, ఏగి=వెళ్ళి, హరిన్=హనుమంతుని, నుత=స్తుతింపదగిన, ఉగ్ర=ఉగ్రమైన, ఆజిన్=యుద్ధమందు పట్టెన్=పట్టుకొనెను, తత్=ఆ హనుమంతుని యొక్క, మహా+ఆగః=గొప్ప అపరాధముల, గణ=సమూహముయొక్క, గ్రహ+ఉద్భటత=అధికతర ప్రాప్తి, నడువన్=ప్రవర్తింపగా, క్రొవ్వుభటులు=మదించిన రాక్షసులు, అటు డాసి=అతని దగ్గరకు వెళ్ళి, గెలుపునన్=గెలుపుచే, నవ్విరి.

తాత్పర్యము : బాధింపజేసెడి ఆ హనుమంతుని బలవృత్తాంతమును వినుటచే అతని యుద్ధమును చెఱచుట కొఱకు ఉత్తమ బలసంపత్తి కలవాడు, పోరశక్యముగాని వాడునైన రావణుడు లంకా నగరములో వింటి వలన బుట్టిన భయంకర నాదములతో యుద్ధమున ఇంద్రుని అనాయాసముగ జయించిన బలవృద్ధి గలవానిని, ధనుష్టంకారముచే సరిపోల్చబడిన సముద్రముగల వానిని ఇంద్రజిత్తును పంపెను. అతడు ఆ హనుమంతుని తీవ్రమైన పొగడ్తకెక్కిన యుద్ధమునందు పట్టుకొనెను. ఆ హనుమంతుని మహాపరాధముల సమూహము ప్రాప్తించగా క్రొవ్విన భటులు అతనిని సమీపించి జయముతో నవ్విరి.

భారత : తత్=ఆ పాండవుల యొక్క, సత్వ=ఉనికిని గూర్చిన, వార్తా= వృత్తాంతము, అశ్రుతిన్=వినబడకపోవుటచే, తత్ సంగర=ఆ పాండవుల ప్రతిజ్ఞను,

భంగపరతన్=చెఱచునుద్దేశ్యముతో, ఉత్తమద్రవిణ=శ్రేష్ఠ ద్రవ్యముల, సంపత్తిన్=సంపదలచే, పౌలస్త్యుండు=కుబేరునివంటి, దుర్యోధనుడు, రోషదూషితుండు, తత్+పురిలోపలన్=మత్స్యనగరమందు, ధర్మజ, భీమ, సంక్రందనజ=అర్జునుని, యముల=నకుల సహదేవులు, కలిపి=ఉండుటను, ఎంచి=తలపోసి, జనులు మెచ్చగ పేర్చు, శౌర్యాఢ్య=బలముతో కూడిన, ఆహవకృతిన్=యుద్ధమున నేర్పరియైన, సుశర్మన్=సుశర్మను, ధనుఃప్రణాద=వింటి ధ్వనిచే, తులిత=సరిపోల్చబడిన, అంబునిధి=సముద్రునియొక్క, మేఘ=మేఘముల యొక్క, నాదు=ధ్వనిగలవానిని (సుశర్మన్) పనిచెన్=పంపెను, అతడును=సుశర్మయు, ఏగి=వెళ్ళి, సరిత్= దిక్కుల యందు, నుత=స్తోత్రము చేయబడిన, ఉగ్రాజిన్=ఘనయుద్ధమునందు, డాసి=సమీపించి, అవ్విరటున్=ఆ విరాట రాజును, పట్టెను=పట్టుకొనెను, తత్=ఆ విరాటుని యొక్క, మహాగోగణ=గొప్ప గోసమూహమును, గ్రహ=పట్టుటచేనైన, ఉద్భటతన్=ఔద్ధత్యముచే, నడువన్=ప్రవర్తింపగా, గెలుపున క్రొవ్వుభటులు, పట్టెన్=పట్టెను.

తాత్పర్యము : ఆ పాండవుల ఉనికిని గూర్చిన వృత్తాంతము వినబడకపోవుటచే ఆ పాండవప్రతిజ్ఞను చఱచు నుద్దేశ్యముతో శ్రేష్ఠద్రవ్యముల సంపదగల కుబేరునివంటి దుర్యోధనుడు మత్స్యనగరమునందు ధర్మజ భీమార్జున నకుల సహదేవులుండుటను భావించి వింటి ధ్వనిచే యుద్ధమునందు నేర్పరియైన సముద్రునితో పోల్చదగిన మేఘధ్వనిని పోలిన సుశర్మను పంపెను. ఆ సుశర్మ దిక్కులయందు పొగడ్తకెక్కిన ఘనయుద్ధమందు ఆ విరాట రాజును పట్టుకొనెను. అతని భటులు ఆ విరటుని మహా గో సమూహమును పట్టుటచేత కలిగిన ఔద్ధత్యముచే నడచిరి. (తన సేన విరాట రాజు గో సమూహమును పట్టుకొనిపోగా, తాను విరటుని పట్టుకొనెను).

వ. అంత 30

ఉత్సాహ : సర్వపూజ్యు డైనిజాజ్ఞ జరుగ నాతనిం జటా
యుర్విఘాతి యమరణక్రియోత్కతా సహాయుఁ డై

పర్వుచు విడిపించెఁ దద్విపక్షమృత్యువాల ము
ద్గర్వుఁ డగుచు శుష్మదీపితముగఁ జేసి వేడ్కతోన్. 31

రామా : సర్వపూజ్యయై=అందరిచే పూజింపబడుచు, నిజ+ఆజ్ఞ=తన ఆదేశము, జరుగన్, ఆతనిన్=హనుమంతుని, జటాయుః+విఘాతి=జటాయువును గాయపరచిన రావణుడు, అమరణ=మరణరహితమైన, క్రియా=ప్రయోజనమును (దండన విధించుటతో), ఉత్కతా=ఉత్సాహము, సహాయుడై=కూడినవాడై, పర్వుచు= ఉండి, తత్+విపక్షమృత్యు=ఆ శత్రువులకు మృత్యువైన హనుమ, వాలము=తోకను, ఉత్+గర్వుడగుచు=మిక్కిలి గర్వముగలవాడై, శుష్మదీపితముగజేసి= అగ్నిని ముట్టించి, వేడ్కతోన్=వేడుకతో, విడిపించె=వదలెను.

తాత్పర్యము : సకల జనులకు పూజార్హమైన తన ఆదేశము నడువగా రావణుడు హనుమంతునికి మరణము తప్ప దండన విధించు ఉత్సాహముకలవాడై శత్రుమృత్యువైన హనుమంతునికి తోకను మిక్కిలి గర్వముతో అగ్నిని ముట్టించి వేడ్కతో విడిపించెను.

విశేషణము : రావణుని ఉత్సాహమును పింగళి సూరన ఉత్సాహవృత్తములో వర్ణించెను.

భారత : సర్వపూజ్య, ఐనిజ=యమపుత్రుడైన ధర్మరాజు యొక్క, ఆజ్ఞ=జరుగన్, ఆతనిన్=విరటుని, జటాయుర్విఘాతి=జటాసురుని చంపిన భీముడు, యమ=నకుల సహదేవుల యొక్క, రణక్రియ=యుద్ధక్రీడయందు, ఉత్కతా=ఉత్సాహము సహాయుడై, తత్=ఆ విరటుని, విపక్ష=శత్రువుల, మృత్యువు=మృత్యువైన భీముడు, ఆలము= యుద్ధమును, ఉద్గర్వుడగు, శుష్మదీపితముగ=పరాక్రమ ప్రకాశముచే ఆతని విడిపించెను.

తాత్పర్యము : తన ఆదేశము సర్వజనులకు పూజనీయమైయుండగా ధర్మజుడు ఆ విరాటుని భీముడు, నకుల సహదేవుల సహాయము యుద్ధమున తోడుకాగా యుద్ధమును పరాక్రమముచే ప్రకాశింపజేసి వేడుకతో విరటుని విడిపించెను.

విశేషణము : 'శుష్మ – ద్రవిణంతరస్సహో బలశౌర్యాణిస్థామ శుష్మంచ' అని అమరము.

సీ. మహితధర్మనియమ మాహాత్మ్యభూతన
యానుగ్రహాభిగుప్తాంగుఁ డగుచు
శూరోత్తముఁడు వాయుసుతుఁ డంత నిల కతి
గాఢప్రమోద సంఘటనదొరక
లంకపెంపెల్ల డీల్వడిచె నిశ్చలజయ
వైభవోదయ మహావాలహస్త
చండహేతివిలాస సరభసగ్రస్తస
మస్తవిద్వేషిధామౌఘుఁ డగుచు

ఆ. నత్యనల్పదర్ప మమర విపక్షయూ
ధపునిఁ బట్టి బలకదంబకమును
సరకుగొనక ప్రబలసత్త్వ సాహసములు
చూపఱకుఁ గరంబు చోద్యపఱుప. 32

రామా : మహిత=గొప్పదైన, ధర్మనియమ=ధర్మనియతిచే, మాహాత్మ్య=మహత్వముగల, భూతనయ=సీత యొక్క అనుగ్రహ=దయచే, అభిగుక్త=రక్షింపబడిన, అంగుడగుచు=శరీరము గలవాడై, శూరోత్తముడు=పరాక్రమవంతుడైన, వాయుసుతుడు=హనుమంతుడు, అంతన్=తరువాత, ఇలకు=భూమికి, అతి గాఢప్రమోద సంఘటన దొరక=మిక్కిలి సంతోషకరమైన సంఘటన లభింపగా, లంక పెంపెల్లె=లంకానగర సౌభాగ్యమునంతటిని, నిశ్చల జయవైభవ+ఉదయ=స్థిరమైన విజయ వైభవ ప్రకాశముతో, మహావాలహస్త=గొప్పదైన తోకయందున్న, చండహేతి విలాస=తీవ్రమైన అగ్నిప్రకాశముచే, సరభసగ్రస్త=శీఘ్రముగా దహింపబడిన, సమస్త విద్వేషి=సకల శత్రువుల యొక్క, ధామ+ఓగుడగుచున్=గృహ సముదాయముగలవాడై, అతి+అనల్పదర్పము=గొప్పదైన పరాక్రమముచే, విపక్ష యూధకుని=రావణుని, పట్టిన్=కుమారుడైన ఇంద్రజిత్తును, బల కదంబకమును=శత్రుసేనలను, సరకుగొనక=లెక్కింపక, ప్రబలసత్వ సాహసములు=గొప్పవైన బల

పరాక్రమములు, చూపఱకు=చూచువారికి, కరంబు=మిక్కిలి, చోద్యపఱుప=ఆశ్చర్యము కలిగింపగా, డీల్+పరిచె=శోషింపజేసెను.

తాత్పర్యము : గొప్పదైన ధర్మ నియమముల మహత్వముచే నొప్పు మహత్వముగల సీతానుగ్రహప్రాప్తిచే రక్షింపబడిన శరీరభాగములుగల పరాక్రమశాలియైన హనుమంతుడు అంతట భూమికి మిక్కిలి సంతోషకరమైన సన్నివేశము లభించునట్లు తన నిశ్చలమైన జయవైభవముగల గొప్పదైన తోకయందున్న తీవ్రాగ్ని ప్రకాశముచే శీఘ్రముగా దహింపబడిన శత్రువుల సహస్త గృహసముదాయమును దహించి తన గర్వముచే రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు బలసంపదను లెక్కింపక తన ప్రబలమైన సాహస పరాక్రమములు చూచువారికి మిక్కిలి ఆశ్చర్యము కలిగింపగా లంకానగర సౌభాగ్యము నంతటినీ డీలుపడజేసెను.

భారత : మహిత=గొప్పదైన, ధర్మ=యముని యొక్క, నియమ మాహాత్మ్య=కట్టడి యొక్క ప్రభావముచే, భూత=పొందబడిన, నయ=నీతి యొక్క, అనుగ్రహ= అనుకూలతచే, అభిగుప్త=దాచబడిన, అంగుడగుచు=అంగముగలవాడగుచు, వాయు సుతుడు=భీముడు, శూరోత్తముడు, అంత నిలక=ఆ విరటుని విడిపించినంతనే, నిలుపక, అతిప్రగాఢ ప్రమోద సంఘటన, దొర=విరాటుని యొక్క, కలంక పెంపెల్ల= విచారాతిశయమునంతటిని, నిశ్చలజయ వైభవోదయ, మహా+ఆవాల=అధిక స్థానమైన, హస్త=హస్తమందున్న, చండహేతివిలాస=తీవ్రమైన విలాసముచే, సరభస=సంభ్రమము కలుగునట్లుగా, గ్రస్త=మ్రింగబడిన, సమస్త విద్వేషిధామౌఘుడగుచు=సమస్త శత్రు ప్రతాప సముదాయము గలవాడై, అత్యనల్పదర్పమమర, విపక్ష యూథకుని=సుశర్మను, పట్టి=పట్టుకొని, బలకదంబకమును=సరకుగొనక, ప్రబల సత్వ సాహసములు, చూపఱకు, కరంబు చోద్యపరుప, డీల్ పరిచె.

తాత్పర్యము : గొప్పదైన యముని కట్టడి మహత్వముచే పొందబడిన నీతి యొక్క అనుకూలతచే దాచబడిన శరీరముగలవాడై భీముడు విరటుని విడిపించుటతోనే తృప్తిపడక మిక్కిలి సంతోషమును కలిగించునట్లుగా విరటుని విచారాధిక్యతను శమింపజేసెను. స్థిరమైన జయవైభవమునకు అధిక సాధనమైన తన హస్తమందున్న

తీవ్ర హేతి విలాసముచే సంభ్రమపడునట్లు మ్రింగబడిన సమస్త శత్రుప్రతాప సముదాయముగలవాడై సుశర్మను పట్టుకొని సేనాసముదాయమును లెక్కింపక తన ప్రబలమైన ధైర్యసాహసములు చూపరులకు మిక్కిలి ఆశ్చర్యమును కలిగింపగా విచారమునంతటినీ శమింపజేసెను.

కం. ఈగతి దక్షిణదిశయం
దాగోగ్రహదుష్టచేష్టు నధిపప్రమదై
కాగారికు నిర్ధామునిఁ
గా గర్వ మడంచి విడిచె గాడ్పుకొడుకొగిన్. 33

రామా : ఈగతిన్=ఈ విధముగా, దక్షిణ దిశయందున్=దక్షిణపు దిక్కునందు, (అన్ని దిక్కులలో వానరులు వెదుకబోగా, దక్షిణ దిక్కునందు) ఆగః=పాపమనెడి, గ్రహ=భూతావేశముచే, దుష్టచేష్టున్=చెడ్డ చేష్టలుగల, అధిప=రామునియొక్క, ప్రమద=సీతను, ఐకాగారికుని=చోరుడైన రావణుని, నిర్ధామునిగా=గృహరహితునిగా, గర్వమడంచి=గర్వమును అణచి, గాడ్పు కొడుకు=హనుమంతుడు, ఒగిన్ విడిచెన్=అంతట వదలిపెట్టెను.

తాత్పర్యము : ఈ విధముగా దక్షిణ దిక్కునందు వెళ్ళిన హనుమంతుడు పాపమనెడి భూతావేశముచే దుష్టమైన చేష్టలుగల రావణుని, సీతను అపహరించిన వానిని గృహరహితునిగా చేసి (లంకను కాల్చి) గర్వమణచి విడిచిపెట్టెను.

భారత : ఈగతిన్=దక్షిణ దిశయందు, ఆ=ఆవిధముగా, గోగ్రహ దుష్టచేష్టున్= దక్షిణ గోగ్రహణము చేసిన సుశర్మను, అధిప=విరటునియొక్క, ప్రమద= సంతోషమును, ఐకాగారికుని=చోరుని, నిర్ధామునిగా=తేజస్సు లేనివానిగా, గాడ్పు కొడుకు=భీముడు, గర్వమడంచి విడిచె.

తాత్పర్యము : ఈ ప్రకారముగా దక్షిణ గోగ్రహణము చేసిన దుష్టచేష్టలుగల సుశర్మను, తమ ఏలికయైన విరటుని సంతోషమును హరింపజేసిన వానిని భీముడు తేజోహీనునిగా చేసి గర్వము అణచి విడిచెను.

తే. ఇట్లు రిపుభయంకరబలోదీర్ణుఁ డగుచు
నవనిజశుభ ప్రవృత్తి మానవ విభునకుఁ
బరమ సంతోష మొనరింప మరలెఁ బురికి
హర్ష మొదవంగ సప్రభుఁ డగుచు నతఁడు. 34

రామా : ఇట్లు=ఈ విధముగా, రిపుభయంకర=శత్రువులకు భయము కలుగునట్లుగా (రాక్షసులకు), బలోదీర్ణుడగుచు=బలవంతుడై, అవనిజ=సీత యొక్క, శుభప్రవృత్తిని=శుభవార్తచే, మానవవిభునకు=రామునకు, పరమ సంతోష మొనరింపన్=మిక్కిలి సంతోషము కలిగించుటకు, పురికిన్=లంకనుండి, హర్ష మొదవంగన్=సంతోషముగా, సప్రభుండగుచున్=ప్రకాశముతో కూడినవాడై, అతడు=హనుమంతుడు, మరలెన్=వెనుదిరిగెను.

తాత్పర్యము : ఈ విధముగా శత్రువులకు భయమును కలిగించు రీతిగా బలసంపద కలవాడై సీత శుభవార్తను రామునకు తెలిపి పరమ సంతోషమును కలిగించుటకు లంక నుండి తిరిగి పోగలిగితిని గదా అని ప్రభాసమేతుడై హనుమ సంతోషముతో మరలెను.

భారత : ఇట్లు రిపుభయంకర బలోదీర్ణుడగుచు, నవ=నూతనమైన, నిజ=తన యొక్క, శుభ ప్రవృత్తి=శుభ ప్రవర్తన, మానవ విభునకు=విరటునకు, పరమ సంతోష మొనరింపన్, సప్రభుండగుచు=విరటునితో కూడి, అతడు=భీముడు, హర్ష మొదవంగ, పురికి మరలె=మత్స్యనగరమునకు మరలె.

తాత్పర్యము : ఈ విధముగా శత్రు భయంకరమైన బలోద్దీప్తిగలవాడై తన నూతన శుభ ప్రవర్తనము (వంటలు చేయుటగాక యుద్ధము చేయుటయను వింత ప్రవర్తనము) విరటునకు పరమసంతోషము కలిగింపగా భీముడు విరటునితో కలిసి సంతోషముగా మత్స్య నగరమునకు తిరిగి వెళ్ళెను.

వ. అట్టి సమయంబున. 35

కం. ఉత్తర గోగ్రహరిపుసుమ
హత్తర వార్తాప్రచార మప్పురి ప్రజకున్
దత్తామోదంబై బల
వత్తర తాపమును మదిని వర్తిలఁ జేసెన్. 36

రామా : ఉత్తరగ=ఉత్తర దిక్కునకు పోవునట్టి, ఉగ్ర=భయంకరుడైన, హరిపు=వానరశ్రేష్ఠుడైన హనుమంతుని, సుమహత్తర=మిక్కిలి గొప్పదైన, వార్తాప్రచారము=ప్రసంగము, ఆ+పురిప్రజకున్=లంకలోని వారికి, దత్త=ఇవ్వబడిన, ఆమోదంబై=సంతోషముగలదై, బలవత్తర తాపమును=గొప్ప తాపమును, మది=మనస్సులో, నివర్తిలజేసెన్=పోగొట్టెను.

తాత్పర్యము : ఉత్తర దిక్కునకు బయలుదేరి వెళ్ళు భయంకరుడైన హనుమంతుని (గూర్చిన) మిక్కిలి అరుదైన వార్తా విశేషము లంకా నగరమునందలి ప్రజలకందరికిని సంతోషమునందించి బలిష్టమైన తాపమును మనస్సులో పోగొట్టెను.

భారత : ఉత్తర గోగ్రహరిపు=ఉత్తర గోగ్రహణము చేసిన దుర్యోధనుని యొక్క, సుమహత్తర=గొప్పదైన, వార్తా ప్రచారము=వృత్తాంతము, ఆ+పురిప్రజకున్=విరాట నగరములోని జనులకు, దత్త+అమోదంబై=సంతోషరహితమై, బలవత్తార తాపమును మదిని, వర్తిలజేసెన్.

తాత్పర్యము : ఉత్తర గోగ్రహణము చేసిన దుర్యోధనుని గొప్ప వృత్తాంతము విరాటనగరములోని జనులకు సంతోషరాహిత్యమును కలిగించి మనస్సున బలవంతమైన తాపమును కలుగజేసెను.

ఉ. ఆతతవేగయానమున నంతట నావిలసద్బలుండు గో
త్రాతనయాభిదర్శనవిధానముదంచితవృత్తియై సము
ద్యోతిలనేఁగి కాంచి రయ మొప్పఁగఁ బల్కె నృపాలసూనుని
ర్ధూతతరాఘు నుత్తరుగురుస్ఫుట సంభ్రమచిత్తుఁ జేయుచున్. 37

రామా : ఆతతవేగ=మిక్కిలి వేగముగా, యానమునన్=ప్రయాణించుటచే, ఆ+విలసత్+బలుండు=మిక్కిలి బలముగల ఆ హనుమంతుడు, గోత్రాతనయా=సీత యొక్క, అభిదర్శనవిధాన=చూచుటచే, ముత్=సంతోషముచే, అంచితవృత్తియై=ఒప్పెడి ప్రవర్తనగలవాడై, సముద్యోతిలన్=శోభిల్లునట్లు, ఏగి=వెళ్ళి, కాంచి=చూచి, నృపాలసూనుని=రాముని, నిర్ధూతతర=అధికము కాని, అఘు=దుఃఖముగలవానిని, నుత్త=పోగొట్టబడిన, రుక్+ఉరు=గొప్పతాపముగల, స్ఫుట=స్పష్టమైన, సంభ్రమచిత్తున్= ఆశ్చర్యకరమైన మనస్సుగల వానినిగా, చేయుచున్, రయమొప్పగ పల్కె=వెంటనే పలికెను.

తాత్పర్యము : అధిక వేగముగల గమనముచే లెస్స బలిమిగల ఆ హనుమంతుడు అంతట సీతా సందర్శన విధానముచే కలిగిన సంతోష ప్రవర్తనముకలవాడై, ప్రయత్నించి, వెళ్ళి పోగొట్టబడిన గొప్ప తాపముగలిగి, స్ఫుటమైన సంభ్రమముతోకూడిన మనసుగల వానిని చేసి రామునితో వేగముగా ఇట్లు చెప్పెను.

భారత : ఆతతవేగ=అధిక వేగముగల, యానమునన్=రథముచే, అంతట, ఆవిల=అమలమైన, సద్బలుండు=బలవంతుడు, గోత్రాత=గవాధ్యక్షుడు, నయ=నీతిచే, అభిదర్శన విధానము=ద్వారాపాలాదుల స్వాగతము, ఉదంచిత వృత్తియై=మర్యాద గలదై, సముజ్యోతిలన్=శోభిల్లగా, ఏగి=వెళ్ళి, కాంచి, నిర్ధూతతర=అధికముకాని, అఘు=దుఃఖముకల, నృపాలసూనుని=విరాటుని కుమారుడైన, ఉత్తరు=ఉత్తరుని, గురుస్ఫుట=మిక్కిలి ప్రకాశమైన, సం+భ్రమ=ఆగ్రహముగల, చిత్తున్+చేయుచు= చిత్తముగల వానిని చేసి, రయమొప్పగ పల్కె.

తాత్పర్యము : శీఘ్ర వేగముగల రథముచే అమలమైన బలముగలవాడు, పొరుపత్తెముగల వాడునై, నీతిచే ద్వారపాలాదుల స్వాగతమర్యాదగలదై శోభిల్లగా వెళ్ళి చూచి, అధికముకాని, దుఃఖముగల విరాటపుత్రుడైన ఉత్తరుని, మిక్కిలి ప్రకాశమైన కోపముగల మనసు గలవానినిగా చేయుచు వెంటనే ఇట్లు పలికెను.

విశేషణము : గోత్రా – 'గోత్రాకుఃపృథివీ, పృధ్వీ' అని అమరము.

యానము – 'యానంగతౌ వాహనేచ' అని వి.

గోత్రాత – గోవులను రక్షించు గవాధ్యక్షుడు.

సంభ్రమ – 'సమౌసంవేగ సంభ్రమౌ' అని అమరము.

సీ. వ్యథ లెల్లఁ దీఱ దేవర మహామహిమ వి
లోకింపఁ గంటి నస్తోకగుణతఁ
బరఁగుభూమిజనాధిపతపతన యాయకలంక
సున్న దిశాంతద్విషన్ని కాయ
వెసమన మొదవులాలసమానకురుబల
యత్నా వరుద్ధంబు లగుచుఁ జనని
తాంతాకులీభవత్ప్రాణవాయువులతో
వనరెడు నేను నివ్వార్తఁ జెప్పఁ

ఆ. బాఱుతెంచితి నని ప్రత్యభిజ్ఞానస
మర్పణమున నతనిమదియొడఁబడఁ
దా నెఱిఁగినకొలఁది నానారివృత్తాభి
ధానకథ లొకింతతడవు నడపె. 38

రామా : వ్యథలెల్లన్=బాధలన్నియు, తీఱన్=తీరగా, దేవర మహామహిమన్=దేవర యొక్క (రాముని) గొప్ప మహత్వముచే, అస్తోకగుణతన్+పరగు=ప్రశంసార్హమైన గుణములతో నొప్పు, భూమిజన్=సీతను, విలోకింపన్కంటిన్=చూచితిని, ఆధి=మనోవ్యథయందు, పతన=పాటుగలది (తన్మగ్నయై), ఆయక=ఆ సీత, లంకన్=లంకలో, ఉన్నది, శాంతద్విషన్నికాయ=అణపబడిన శత్రుసముదాయము గలవాడా! మనము=మనమందరము, వ్యసన్=వేగముగ, ఒదవులాలసన్=పొందెడి కొఱకే, మానక=వదలక, ఉరుబల=గొప్ప బలముతో, యత్న=ప్రయత్నముచే, అవరుద్ధంబులగుచున్=అవరోధము కలిగించుచు, చనని=వెళ్ళని, తాంత=

బడలినవియై, ఆకులీ భవత్=వ్యాకులములగుచున్న, ప్రాణవాయువులతో, వనరెడున్=ఏడ్చుచున్నది, ఏను=నేను, ఈ+వార్త చెప్పన్=ఈ వార్త చెప్పుటకు పాఱుతెంచితినని=పరుగెత్తి వచ్చితినని, ప్రత్యభిజ్ఞాన=గుర్తుగా (సీత) తిరిగి ఇచ్చిన, శిరోరత్నము=శిరోరత్నమును, సమర్పణమున=సమర్పించుటచే, అతని మది యొడబడన్=రాముని మనస్సు రంజిల్లునట్లు, తానెఱిగిన కొలదిన్=తనకు తెలిసినంత వరకు, ఆ నారి=సీత యొక్క వృత్తాభిధాన కథలు=వృత్తాంతమునకు చెందిన గాథలు, ఒకింత తడవు నడపె=ఆయనకు సమ్మతమగునంత వరకు, నడపె=నడపెను.

తాత్పర్యము : మానసిక చింతనలన్నియు తీరునట్లుగా దేవర మహా మహిమచే అధికగుణసంపదచే నొప్పు సీతామాతను కనుగొంటిని. మనోవ్యథయందు మగ్నమైన ఆ సీతను శత్రు సముదాయమును అణచగల ఓ రామా! లంక యందున్న ఆమె మనము వచ్చుట కొరకే మానక బలవంతమైన ప్రయత్నముచే అవరోధములు కలిగి బడలినవియై వ్యాకులములగుచున్న ప్రాణవాయువుల తోడ్పాటుతో విలపించుచున్నది. (మనము వత్తుమని ప్రాణములు నిలబెట్టుకొని వున్నది) నేను ఈ వార్తను చెప్పుటకు పరుగున వచ్చితిని అని చెప్పి గురుతుగా ఆమె తిరిగి ఇచ్చిన శిరోరత్నమును సమర్పించి రాముని మనస్సు అంగీకరించునట్లుగా సీతకు సంబంధించిన గురుతుగాగల కథలు రామునికి సమ్మతమగునంతవరకు చెప్పెను.

విశేషణము : వాల్మీకి రామాయణములో సుందరకాండలో ఈ శ్లోకపాదమున్నది : 'దృష్టా సీతేతి తత్వతః' అను పాదమునకు కంటి అను పదమును సూరనవాడి ఔచిత్యమును పాటించెను.

భారత : వ్యథలెల్ల తీర, దేవర మహా మహిమను=ప్రభువు గొప్పదనముచే, విలోకింపగంటిని, అస్తోకగుణతన్‌పరగు, భూమి జనాధిపతనయ=ఓ ఉత్తరకుమారా! అకలంక=కళంకములేని రీతిగా, నున్న=పోగొట్టబడిన, దిశాంత=దిక్కుల అంతము లందుగల, ద్విషన్నికాయ (ద్విషత్+నికాయ)=శత్రు సమూహముగలవాడా! వ్యసన్+ వేగిరముగ, మన మొదవులు=మన ఆవులు, అలసమాన=మిక్కిలి ప్రకాశించుచున్న, కురుబలయత్న=కౌరవబలముల ప్రయత్నముచే, అవరుద్ధంబులగుచున్=

తోలుకొనిపోబడినవై, చనన్=పోగా, నితాంత=మిక్కిలి, ఆకులీభవత్=తొట్రుబడుచున్న ప్రాణవాయువులతో, వనరెడు=ఒప్పుచున్న, నేను, ఇవ్వార్త చెప్ప, పాఱుతెంచితిని= పరిగెత్తి వచ్చితిని, అని, ప్రత్యభిజ్ఞాన=గుర్తులను, సమర్పణమునన్=తెలుపుటచే, అతనిమది యొడబడ=ఉత్తరుని మనస్సు అంగీకరించునంత వరకు, తానెఱిగినకొలది, నానా=నానావిధములైన, అరి+వృత్త=శత్రువుల ప్రవర్తనల యొక్క, అభిధాన=పేర్ల, కథలు, ఒకింత తడవు నడపె.

తాత్పర్యము : బాధలన్నియు తీరునట్లుగా ఓ విరాట రాకుమారా! దేవర మహా మహిమను చూడగంటిని. అకలంకమైన రీతిలో దిశాంతముల వరకు తరుమ బడిన శత్రు సముదాయముగలవాడా! మన గోవులు మిక్కిలి ప్రకాశవంతమైన కౌరవసేనలచే తోలుకొనిపోగా మిక్కిలి తొట్రుపడుచున్న ప్రాణవాయువులతో ఒప్పుచున్న నేను ఈ వార్త చెప్పుటకు పరుగెత్తి వచ్చితిని అని కౌరవ సేనల గుర్తులు తెలుపుటచే నానా విధములైన శత్రు ప్రవర్తనలను, వారి పేర్లతో కూడిన కథలను చెప్పెను.

(గోవులను రక్షించు వ్యక్తి గోగ్రహణమును గూర్చి, కౌరవ బలమును గూర్చి తానెరిగిన కొలది వారి పేర్లు చెప్పెను).

వ. పదంపడి ఇట్లనియె. 39

రామా : మరియు హనుమంతుడిట్లనెను.

భారత : మరియు గోరక్షకుడు ఉత్తరునితో ఇట్లనెను.

ఆ. అలఘు మాననీయబల విడిపింపుమా
యావులబలు మేటియైనతదప
హారిc గలుషకలుషితాత్మసుయోధను
న్మదవిమూఢుదురముననువధించి. 40

రామా : అలఘుమాన=గొప్ప అభిమానముగల రామా!, మాయావుల

బలుమేటి యైన=మాయావంతులలో శ్రేష్ఠుడైన, తదపహారి=సీతనపహరించిన రావణుడు, కలుషకలుషితాత్మ=పంకిలమైన మనస్సుగల, సుయోధ=మంచి యోధులను, నుత్=ఓడించునట్టి, మదవిమూఢున్=మదముచే మూర్ఖుడైన రావణుని, దురమునను వధించి=యుద్ధమున చంపి, నీయబల=సీతను, విడిపింపు=విడిపించుము.

తాత్పర్యము : ఓ అభిమానధనా! మాయావులలో శ్రేష్ఠుడైన పరమ కలుషితాత్ముడైన వానిని మంచి యోధులను ఓడించిన మదముచే మూఢుడైన సీతాపహారి రావణుని యుద్ధమున వధించి నీ అబలను విడిపింపుము.

భారత : అలఘుమాననీయబల!=గొప్ప బల సంపన్నతగలవాడా! కలుష కలుషితాత్మ, సుయోధనున్=దుర్యోధనుని, మదవిమూఢున్=మదముచే మూర్ఖుడైన వానిని, బలమేటి యైన=గొప్పదైన బలముతో, తదపహారిన్=ఆ గోవులను అపహరించినవానిని, దురమునను వధించి, ఆవుల విడిపింపుమా!

తాత్పర్యము : ఓ అసమాన బలసంపదగల ఉత్తరా! పరమ కలుషితాత్ముడైన దుర్యోధనుని, మదముచే మూఢుడైన వానిని యుద్ధమున వధించి ఆ ఆవులను విడిపింపుము.

ఆ. విను మొకింత దడసినను గార్య మిఁకఁ దప్పుఁ
గాన వేగఁ గదలి వాని గెలుము
గర్వయుక్తదనుజకర్ణ భీష్మేష్వాస
గురురణాతిమహిమఁ గరము మించి. 41

రామా : వినుము, ఒకింత=కొంచెము, తడసినను=ఆలస్యమైనను, కార్యమిక తప్పుగాన=పని చెడునుగాన, వేగన్=ఉదయముననే, కదలి=బయలుదేరి, గర్వయుక్త=గర్వముతోకూడిన, దనుజ=రాక్షసులకు, కర్ణభీష్మ=చెవులకు కఠినమైన, ఇష్వాస=వింటి యొక్క, గురురణ=అధికమైన నారీధ్వనిచే, అతిమహిమన్=గొప్ప మహిమచే, కరము మించి=మిక్కిలి ప్రకాశించి, వాని గెలుము=రావణుని గెలువుము.

తాత్పర్యము : ఓ రామా! వినుము. కొంచెమాలస్యమైనను కార్యము చెడును గావున ఉదయముననే కదలి గర్వయుక్తులైన రాక్షసులకు శ్రవణ కఠోరమైన వింటినారి గుణ ధ్వనిచే అతిమహిమతో మిక్కిలి మించి ఆ రావణుని గెలువుము.

భారత : వినుమొకింత తడసినను కార్యమిక తప్పుగాన, వేగన్ కదలి=శీఘ్రముగా పోయి, గర్వయుక్=గర్వముతోకూడిన, తదనుజ=దుశ్శాసనుని యొక్కయు, కర్ణ భీష్మ ఇష్వాసగురు=కర్ణుడు, భీష్ముడు, ద్రోణాచార్యుల యొక్క, రణాతి మహిమన్=యుద్ధమహత్వమును, కరము మించి, వానిన్=దుర్యోధనుని, గెలుము=గెలువుము.

తాత్పర్యము : ఉత్తర కుమారా! వినుము. కొంచెము ఆలస్యమైనను కార్యము తప్పిపోవునుగాన, వెంటనే కదలిపోయి, గర్వముతో నిండిన దుశ్శాసనుని, కర్ణ భీష్మద్రోణాల యుద్ధ మహత్వమును మించి దుర్యోధనుని గెలువుము.

కం. అకట భవద్గురుసేవా
దిక మిపు డేమియుఁ బురస్థితిం బరఁగమి ని
న్నొకయించుకయును గుఱిసే
యక యిమ్మెయిఁ జెనకి తలఁకఁ డతఁడు సెడు మదిన్. 42

రామా : అకట, భవత్=నీయొక్క (రాముని), గురు=గొప్పదైన, సేనాదికము=సేనాసమూహము, ఇపుడేమియు, పురస్థితిన్ పరగమిని=ముందర కనిపింపకుండుటచే, నిన్నొక ఇంచుకయును, గురిసేయక=లెక్కింపక, ఇమ్మెయిన్=ఈ విధముగా, చెనకి=ద్రోహము చేసియు, అతడు=రావణుడు, చెడు మదిన్=చెడ్డ మనస్సుతో, తలకడు=భయపడడు.

తాత్పర్యము : అకటా! గొప్పదైన నీ సేనాసమూహమును గూర్చి ముందుగా తెలియకుండుటచే ఇప్పుడు నిన్ను ఏమాత్రమును లక్ష్యపెట్టక ఈ విధముగా ద్రోహము చేసియు చెడ్డమనసుతో రావణుడు భయపడడు.

భారత : అకటా, భవత్+గురు=నీ తండ్రియు, సేనాదికము=సేనలు మొదలైన చతురంగ బలములు ఇపుడేమియు, పురస్థితిన్ పరగమిని=పట్టణములో లేకపోవుటచే, ఒక ఇంచుకయును=ఏమాత్రమును, అతడు=దుర్యోధనుడు, ఇమ్మెయిన్‌చెనకి, చెడు మదిన్, తలకడు.

తాత్పర్యము : అకటా! ఉత్తరకుమారా! నీ తండ్రియు సేనతోకూడిన చతురంగ బలములు నగరములో లేకుండుటచే ఒకింతయు లక్ష్యపెట్టక ఈలాగున ద్రోహము చేసియు చెడ్డమదితో చలింపడు.

ఆ. అని యతండు దీపితౌద్ధత్యభాషలు
వలుకఁ దనబలంబుకొలఁది గాన
కధిక మై తనర్పనాహవోత్సాహంబు
పూనె రాచపట్టి మేనువొంగ. 43

రామా : అని, అతండు=హనుమంతుడు, దీపిత+ఉద్ధత్యభాషలు=ప్రకాశించెడి గర్వముతో కూడిన మాటలు, పలుకన్=మాట్లాడగా, తన బలంబుకొలది=తన సేనల పటుత్వము, అధికమై తనర్పన్=గొప్పదిగా కనిపించగా, రాచపట్టి=రాముడు, మేను+పొంగన్=శరీరము ఉప్పొంగగా, ఆహవ+ఉత్సాహంబు+పూనె=యుద్ధమునకు ఉత్సాహమును పొందెను.

తాత్పర్యము : అని హనుమంతుడు గర్వోన్నతితో కూడిన మాటలు పలుకగా వానరసేనల బలము అడవికి అధికమై ఒప్పగా రాముడు శరీరముప్పొంగగా యుద్ధోత్సాహమును పొందెను.

భారత : అని, అతండు=పశులకాపరి, దీపితౌద్ధత్య భాషలు పలుకన్, తన బలంబు కొలదిగానక=తన బలాబల చింతలేక, రాచపట్టి=ఉత్తరుడు, మేనుపొంగ, ఆహవోత్సాహంబు, అధికమై తనర్ప, పూనె.

తాత్పర్యము : పశుపాలకుడు ఆ విధముగా ఉద్రేకభరితమైన మాటలు పలుకగా తన బలాబలముల ఆలోచన లేక ఉత్తరుడు అధికమైన యుద్ధోత్సాహమును శరీరముప్పొంగగా పూనెను.

సీ. ఈరీతిఁ బగఱపై నేఁగ ససంభ్రమ
స్వాంతుఁ డై తద్వేళ యంత నరయ
జోకమై దొరకెఁ దచ్ఛుభలగ్న మతిజిష్ణుఁ
డాయుత్తరుఁడు జయయాత్రఁ గదలె
మహనీయశుద్ధాంత మంజులాస్య ప్రవ
ర్తనగురుభావార్హ తనువికారు
ననఘుక్షత్రాచారమునకు నానాకీశ
సంతతిఁ గొని యాత్రసలుపువాని
తే. నానృపాలకుమారకు నంతట రణ
సాధ్వసమశక్తికతమున సంశ్రయించె
దృష్టి కరుదైన యొకవింతతేజ మమర
రిపులయౌద్ధత్యవద్బలశ్రేణి మెఱయ. 44

రామా : ఈ రీతిన్=ఈ విధముగా, పగఱపైన్+ఏగ=శత్రువులపై యుద్ధమునకు వెళ్ళుటకు, ససంభ్రమస్వాంతుడై=వేగముతో కూడిన మనసుగలవాడై, తద్వేళన్=ఆ సమయమున, అంతన్ అరయన్=ఆలోచింపగా, తత్+శుభలగ్నము, ఆ యాత్రకు సరిపడు శుభలగ్నము, జోకమై దొరకెన్=ఉత్తమముగా దొరికెను, అతిజిష్ణుడు=మిక్కిలి జయశీలుడైన, ఆ యుత్తరుడు=శ్రేష్ఠుడైన రాముడు, జయయాత్రన్ కదలె=జయము సాధించు యాత్రకు బయలుదేరెను, మహనీయ=గొప్పదైన, శుద్ధాంత=సీతయొక్క, మంజుల+ఆస్య=అందమైన ముఖముయొక్క ప్రవర్తన=నడవడికచే, గురు=అధికమైన, భావ=అభిప్రాయమునకు, అర్హ=తగిన, తను వికారు=శరీర వికారముగల వానిని (సీతా విరహముచే శరీరమునకు కృశత్వము, పాండుత్వము కలిగినవానిని) అనఘున్=శ్రేష్ఠమైన, క్షత్రాచారమునకున్=యుద్ధమునకు, నానా=బహు విధములైన, కీశసంతతిన్గొని=వానరసేనలను చేర్చుకొని, యాత్ర సలుపువాని=యాత్ర చేయువానిని, ఆ నృపాలకుమారకున్=రాముని, అంతట, రణ=యుద్ధమునకు, సాధు=సమర్థమైన,

అసమశక్తికతమున=అసమానమైన శక్తివలన, దృష్టికరుదైన=కంటికి ఆశ్చర్యకరమైన, ఒక వింత తేజము=ఒక వింత కాంతి, అమర రిపుల=రాక్షసుల, ఔద్ధత్యవత్=ఉద్ధతితో కూడిన, బలశ్రేణి=సేనా సమూహము, లయం=సంహారమందు, మెఱయన్=ప్రకాశింపగా, సంశ్రయించె=పొందెను.

తాత్పర్యము : ఈ విధముగా అంతట లెస్సగా విచారింపగా శత్రువులపై యుద్ధమునకు వెళ్ళుటకు వేగముతో కూడిన మనస్సుగలవాడై ఆ సమయమున నుండగా ఒక శుభలగ్నము దొరకెను. జయశీలుడైన రాముడు జైత్రయాత్రకు కదలెను. మహనీయమైన సీత సుందర ముఖసౌందర్యముచే (వేగైన) అభిప్రాయమునకు తగిన శరీర వికారముగలవాడు. యుద్ధమునకు నానావానర సమూహమును చేర్చుకొని యాత్ర సలిపెను. రాక్షససంహారమునందు యుద్ధము చేయుటకు సమర్థమైన అసమానశక్తిగల ఉద్ధతిగల వానరసైన్యము మెరయగా కంటికరుదైన ఒక వింత తేజము రాముడు పొందెను.

విశేషణము : శుద్ధాంత – ఈ పదప్రయోగము శ్రీ శంకరాచార్యుల శ్లోకమునకు ఛాయ.

శ్లో. కుందస్మితం కుటిలకుంతల మిందుచూడం
ఛందశ్శికాభరణ చారు పదారవిందం
కందర్పదర్ప కలికాంకుర కాలమేఘ
మంతఃపురం పురరిపోరవలోకయామః

భారత : ఈ రీతిని, పగరపైనేగ, ససంభ్రమస్వాంతుడై, తద్వేళ, యంతన్=సారధిని, అరయన్=వెదుకగా, తత్=ఆ ఉత్తరుని యొక్క, శుభ=శ్రేయస్సునందు, లగ్నమతి=లగ్నమైన మనస్సుగలవాడు, తద్వేళన్, జోకమై, జిష్ణుడు=అర్జునుడు (బృహన్నల), దొరకెన్=దొరకెను, ఆ+ఉత్తరుడు, జయయాత్రగదలె, మహనీయ, శుద్ధాంత=అంతఃపురమునందు, మంజు=మనోహరమైన, లాస్యప్రవర్తన, నృత్తగీతాది ప్రచారములకు, గురుభావ=గురువగుటకు, అర్హ=తగిన, తను వికారము గలవాని=పేడివానిని, అనఘున్=గొప్పవానిని, ఆ నాకీశసంతతిని=అర్జునుని, క్షత్తృ=సారధి

యొక్క, ఆచారమునకు=పనికి, కొని=తీసికొని, యాత్ర సలుపువాని=అంతటన్, ఆ నృపాలకుమారకున్=ఆ ఉత్తరుని, రణ=యుద్ధమునకు, రిపుల=దుర్యోధనాదుల యొక్క, ఔద్ధత్యవత్ బలశ్రేణి=ఉద్ధతితోకూడిన సేనాసమూహము, మెరయన్ కనిపించగా దృష్టికరుదైన, ఒక వింత తేజ మమరన్=సాధ్వసము, భయము, అశక్తికతమున=శక్తి లేకపోవుటచే, సంశ్రయించె=పొందెను.

తాత్పర్యము : ఈ విధముగా శత్రువులపై యుద్ధమునకు వేగముగా బయలుదేరు మనసుగలిగి ఆ సమయమున సారథి కొరకు వెదుకగా అతని శుభమును కోరు జిష్ణుడు దొరకెను. ఆ ఉత్తరుడు జయయాత్రకు బయలుదేరెను. గొప్పదైన అంతఃపురమున మనోహరముగా నృత్తగీతాది ప్రచారములు చేయు గురువగుటకు తగిన శరీర వికారముగల పేడివానిని - అర్జునుని సారథిగా వ్యవహరించుటకు తీసికొని ఉత్తరుడు జయ యాత్రకు బయలుదేరెను. అంతట దుర్యోధనాదుల బలవత్తర సేనలను చూచి ఉత్తరుడు భయము పొందెను.

సీ. అతనిసముద్వేగ తతచేష్టమాననా
నాకీశసంతతి నలుపు మెఱసి
పంతంబు లాడియు నెంతయు నాత్మస్వ
భావప్రభావసంప్రకటనోక్తి
నలరించియును ముదితాత్ముఁ గావించుచు
నారాచకొమరుని యంతఁ గాఁగఁ
గైకొని ప్రస్తుత ఘనయుద్ధకార్యంబు
నిజబాహుబలమున నిర్వహించు
తే. పూన్కితో వీరరసలక్ష్మి వొదల నడచె
నాయనఘవర్తనునిశివాఖ్యతరు నిహిత
మైననిజధర్మమును జూపి యధికమోద
సహితుఁ జేయుచుఁ దత్పరిగ్రహము మెఱయ. 45

రామా : అతని, సముత్+వేగ=సంతోష వేగముతో కూడునట్లుగా, తతచేష్టమాన=గొప్ప విధముగా చేష్టలు చేయుచున్న, నానాకీశసంతతిన్=వివిధములైన వానర సమూహము, అలుపుమెఱసి=కోపించి, పంతంబులాడియు=వాదులాడియు, ఎంతయు, ఆత్మస్వభావ=తమ వానరజాతి సహజ లక్షణముల, ప్రభావ సంప్రకటన+ఉక్తిన్=ప్రభావమును తెలియజేయు మాటలతో, అలరించియును=శోభిల్లజేసి, ముదిత+ఆత్మున్+కావించుచు=సంతోషించిన మనస్సుగల వానినిగా చేయుచు, ఆ రాచకొమరుడు=ఆ రాముని, నియంతన్+కాగ=నియామకునిగా (నాయకునిగా), కైకొని=స్వీకరించి, ప్రస్తుత ఘనయుద్ధ కార్యంబు=ఇప్పటి గొప్ప యుద్ధకార్యమును, నిజబాహుబలమున=తన బాహువుల బలముతో, నిర్వహించు పూన్కితో=జరుపు ప్రయత్నముతో, ఆ+అనఘువర్తనుని=ఆ పాపరహిత ప్రవర్తనగల, శివాఖ్యతరుని=మిక్కిలి శుభ నామధేయముగలవానిని, హితమైన=అనుకూలమైన, నిజధర్మమును=మర్కటజాతి ధర్మమును, చూపి, అధిక మోదసహితున్+చేయుచు=మిక్కిలి సంతోషింపజేసి, తత్=ఆ రఘురాముడు, పరిగ్రహము మెఱయన్=విల్లు పుచ్చుకొని, వీరరసలక్ష్మి+పొదలన్=వీరరసలక్ష్మి ప్రకాశింపగా, నడచె=నడచెను.

తాత్పర్యము : అతని సంతోష వేగముతో కూడిన చేష్టలు చేయు నానావానర సమూహము కోపించి, వాదులాడి, వానరజాతి సహజ లక్షణముల ప్రభావమును తెలియజేయు మాటలతో అలరించి, సంతోషించిన మనస్సుగలవానినిగా జేయుచు, ఆ రాముని తమ నాయకునిగా స్వీకరించి ప్రస్తుత ఘనయుద్ధ కార్యమును నిర్వహించు ప్రయత్నముతో ఆ అనఘువర్తనుడైన శుభనామధేయముగలవానికి హితమైన వానరజాతి ధర్మమును చూపి మిక్కిలి సంతోషింపజేసిరి. ఆ రఘురాముడు వింటినందుకొని వీరరసలక్ష్మితో ప్రకాశింపగా నడచెను.

భారత : అతని=ఉత్తరుని యొక్క, సముద్వేగ=భయముతోగూడిన, తత్=ఘనమైన, చేష్ట=పనిని, మానన్=మానుటకై, ఆ నాకీశసంతతి=ఇంద్రజుడైన అర్జునుడు, అలుపుమెఱసి=కోపించి, పంతంబులాడియు, ఎంతయు, ఆత్మస్వభావ ప్రభావ సంప్రకటనోక్తి=తన యొక్క స్వభావపు ప్రకటన చేయు మాటలతో,

అలరించియును, ముదితాత్ముగావించుచు, రాచకొమరుని=ఉత్తరుని, యంతగాగన్=సారథినిగా కైకొని, ప్రస్తుత ఘనయుద్ధకార్యంబు, నిజబాహుబలమున నిర్వహించు పూన్కితో, ఆయనఘవర్తనుని=ఉత్తరుని, శివాఖ్యతరు=శమీవృక్షమునందు, నిహితమైన=దాచిపెట్టబడిన, నిజధర్మమును=తన గాండీవమును, చూపి, అధికమోద సహితుజేయుచు, తత్పరిగ్రహము మెఱయన్=ఆ విల్లు పుచ్చుకొనుటచే, వీరరసలక్ష్మి, పొదల నడచె.

తాత్పర్యము : ఉత్తరుని భయముతో కూడిన గొప్ప చేష్టలు మాన్పుటకై అర్జునుడు కోపించి, వాదులాడి ఎంతగానో తన సహజ ప్రభావ ప్రకటనము చేయునట్లుగా మాట్లాడి అలరించి సంతోషింపజేసి ఉత్తరుని సారథినిగా చేసికొని ప్రస్తుత యుద్ధఘన కార్యమును తన బాహు సంపత్తిచే నిర్వహించు ఉద్దేశ్యముతో ఉత్తరునికి శమీ వృక్షమునందు దాచబడిన గాండీవమును చూపి మిక్కిలి సంతోషింపజేసి ఆ విల్లు పుచ్చుకొని వీరరసలక్ష్మి ప్రకాశింపగా నడచెను.

ఆ. రామవిభుఁడు జిష్ణుఁ డీమాడ్కిఁ జని యను
సృతమనోరథహరిగతి నలరుచుఁ
ద్వరితగతివిరోధివాహినీ వరవిజృం
భణము గరము గానఁబడఁగ డాసె. 46

రామా : జిష్ణుడు=జయశీలుడైన, రామవిభుడు=రాముడు, ఈమాడ్కిన్జని=ఈ విధముగా వెళ్ళి, అనుసృత=అనుసరింపబడిన, మనోరథ=మనస్సుగల, హరిగతిన్=వానరుల నడకతో, అలరుచున్=సంతోషించుచు, త్వరితగతిన్=వేగముగా, విరోధి=శత్రువైన, వాహినీవర=సముద్రుని యొక్క, విజృంభణము=ఉప్పొంగుట, కరము కానబడగ=మిక్కిలి కనిపించగా, డాసెన్=సమీపించెను.

తాత్పర్యము : జయశీలుడైన రాముడు తనననుసరించిన మనఃప్రవృత్తిగల వానరుల నడకచే సంతోషించుచు వేగముగా విరోధియైన సముద్రుడు ఉప్పొంగుట కనిపించగా సమీపించెను.

భారత : రామ విభుడు=రాముని వంటి వైభవముగల (మంచుకాంతిలేని), జిష్ణుడు=అర్జునుడు, ఈ మాడ్కిన్ చని, అనుసృతమనః=అనుసరింపబడిన మనస్సుగల (మనస్సున కనుకూలమైన), రథహరిగతి=రథమునకు కట్టిన గుఱ్ఱముల గమనముచే, అలరుచు, త్వరితగతిన్, విరోధివాహినీ=శత్రుసేనల, విజృంభణము=అతిశయము, కరము, కానబడగ డాసె.

తాత్పర్యము : రాముని వంటి వైభవముగల అర్జునుడు ఈ విధముగా వెళ్ళి తన మనస్సున కనుకూలముగా గల రథాశ్వగమనముచే ప్రకాశించుచు వేగముగా శత్రుసేనల విజృంభణము కనిపించినట్లుగా సమీపించెను.

సీ. ఇట్లు సువ్యక్తిఁ బొల్పెసఁగునాతనిరాక
పొల్పు మీఱఁగ లంకఁ బుణ్యజనులు
వెరవిడిగాఁడె యీనరుఁ డల్కఁజేసి దు
ర్ణయమున వచ్చుచున్నాఁడు సమయ
రక్షోపహతి నేయ రామికానందక
టా నియతి యలంఘ్యమని వగచిరి
మఱికొంద ఱిది యేమి మాటలు మనపాటి
పరికింప నేరఁడే యురువివేక
ఆ. శాలి యతఁడు యుద్ధ కేళికాలంబని
నిజభుజబలలక్ష్మి నెగడఁ బగఱ
నుక్కడంప వచ్చుచున్నాఁడు గాని యీ
తలఁపు దృఢము గాదు తెలియుఁ డనిరి. 47

రామా : ఇట్లు=ఈ విధముగా, సువ్యక్తిన్=స్పష్టముగా, పొల్పెసగు=ప్రకాశించు, ఆతనిరాక=రాముని రాక, పొల్పు మీరగ=ప్రకాశింపగా, లంకన్=లంకలో, పుణ్యజనులు=రాక్షసులు, వెరవిడిగాడె=ఉపాయ హీనుడుగదా, ఈనరుడు=రాముడు,

అల్కజేసి=కోపించి, దుర్ణయము=దుర్నీతితో, సమయన్=మరణించుటకు, వచ్చుచున్నాడు, రక్షః+అపహతి=రాక్షసుల సంహారమును, చేయరామిన్=చేయలేకపోవుటను, కానండకటా=తెలియలేకపోవుచున్నాడు గదా!, నియతి=విధి (భాగ్యము), అలంఘ్యము=దాటలేనిది, అని వగచిరి=అని దుఃఖించిరి, మరికొందరు, ఇదియేమి మాటలు, మనపాటి=మనవలె, పరికింపనేరడే=తెలిసికొనలేడా! అతడు=రాముడు, ఉరువివేకశాలి=మిక్కిలి తెలివిగలవాడు, యుద్ధకేళికా=యుద్ధవిహారమునకు, ఆలంబిని=ఆధారమైన, నిజభుజ బలలక్ష్మి=తన బాహుబల సంపత్తి, నెగడన్=ప్రకాశింపగా, పగఱన్=శత్రువులను, ఉక్కడంప=నాశనము చేయుటకు, వచ్చుచున్నాడు గాని, ఈ తలపు=ఈ ఆలోచన, దృఢముగాదు=నిశ్చయము గాదు, తెలియుడు, అనిరి.

తాత్పర్యము : ఈ విధముగా సువ్యక్తమై ప్రకాశించు రాముని రాక వెలుగగా, లంకలోని రాక్షసులు ఉపాయహీనుడు ఈ రాముడు గదా! కోపించి దుర్నీతితో రాక్షస సంహారము చేయలేని స్థితిని తెలిసికొనలేకున్నాడు గదా! అని బాధపడిరి. మరి కొందరు - ఇవి ఏమి మాటలు - మనపాటి తెలివి అతనికి లేదా! అతడు మిక్కిలి వివేకశాలి. యుద్ధ విహారమునకు ఆధారమైన తన భుజ బలసంపత్తి మెరయగా శత్రు సంహారమునకు వచ్చుచున్నాడుగానీ, ఈ విధమైన ఆలోచన నిశ్చయము కాదు తెలియుడని పలికిరి.

భారత : ఇట్లు, సువ్యక్తిన్ పొల్పెసగు=వేషాంతరము లేక తనను వ్యక్తపరచుకొనిన, ఆతని రాక=అర్జునుని రాక, పొల్పుమీర, కలంకన్=విచారముతో, పుణ్యజనులు=ద్రోణాదులు, వెరవిడిగాడె, ఈ నరుడు=ఈ అర్జునుడు, అల్కజేసి, దుర్ణయమున, వచ్చుచున్నాడు, సమయరక్ష=అజ్ఞాతవాస రక్షణముయొక్క, అపహతి సేయరామి=అపవాదము తొలగుట, కానండకట, నియతి, అలంఘ్యమని వగచిరి, మిగతా సమానము.

తాత్పర్యము : ఈ విధముగా తన రూపము వ్యక్తమగునట్లుగ అర్జునుని రాక ప్రకాశించగా ద్రోణాదులు విచారముచే ఇట్లనుకొనిరి - అర్జునుడు ఎంత

ఉపాయహీనుడు? కోపముచే పొరబాటున వచ్చుచున్నాడు. అజ్ఞాతవాస సమయోల్లంఘనము చేయుట, అవిలంఘ్యము గదా అని బాధపడిరి. మరి కొందరు – ఇవి ఏమి మాటలు అతడు మనపాటి ఆలోచింపలేడా! వివేకశాలి అయిన అతడు యుద్ధ విహారమునకు ఆధారమైన తన భుజబల సంపదచే శత్రు సంహారము చేయుటకు వచ్చుచున్నాడుగానీ, ఈ విధమైన ఆలోచన సరికాదు.

విశేషణము : పుణ్యజన – 'యాతుధానః పుణ్యజనః' అని అమరము.

వ. ఇత్తెఱంగున. 48

తాత్పర్యము : ఈ విధముగా

తే. ముసగెసలఁ బోరుగురుభీష్మముఖులసఖుల
నాత్మసైన్యరక్ష శ్రేష్ఠులైనవారిఁ
జూచి యధిపతి యెక్కడిసుద్దు లనుచు
నడిగి వారందులోఁ దగినంతఁ జెప్ప. 49

రామా : ముసగెసలన్=ప్రీతి పూర్వకమగు మాటలతో, పోరు=యుద్ధము చేయు, గురు=అధికమైన, భీష్మముఖులన్=భయంకర ముఖములుగల, సఖులన్=హితులను, ఆత్మసైన్యరక్షః శ్రేష్ఠులైనవారిన్=తన సేనలోని రాక్షస వీరులను చూచి, అధిపతి=రావణుడు, ఎక్కడి సుద్దులనుచు=ఎక్కడి మాటలనుచు, అడిగి=వారందులో తగినంత చెప్ప.

తాత్పర్యము : ప్రీతి పూర్వకమైన సంభాషణలతో యుద్ధము చేయు అధిక భయంకర ముఖములు గలవారిని, సఖులను తన సేనలలోని రాక్షస శ్రేష్ఠులైనవారిని రావణుడు చూచి ఇవి ఎక్కడి సుద్దులని అడిగి – వారు తగినరీతిని చెప్పగా –

భారత : ముసగెసలన్, పోరు, గురు=ద్రోణాచార్యుడు, భీష్మముఖుల=భీష్మాదులైన, సఖులన్=తన హితులను, అధిపతి=దుర్యోధనుడు, ఆత్మసైన్య=తన సేనలలో, రక్షశ్రేష్ఠులు=రక్షించువారిలో గొప్పవారిని, చూచి, ఎక్కడి సుద్దులనుచు

అడిగి=వారందులో, తగినంత చెప్ప.

తాత్పర్యము : ప్రీతి పూర్వకమైన మాటలతో యుద్ధము చేయు భీష్మద్రోణాది సఖులను, తన సేనలను రక్షించు శ్రేష్ఠులను దుర్యోధనుడు చూచి. ఇవి ఎక్కడి సుద్దులని అడిగి, వారు దానికి తగిన రీతిలో సమాధానము చెప్పగా -

వ. ఆకర్ణించి వెండియుం బలువురు పలుదెఱంగుల గుజగుజ
లాడుచందంబున భావించి యందఱకు ని ట్లనియె. 50

రెండింటికి సమానము -

తాత్పర్యము : వారి మాటలు విని అందులో పలువురు పలురకములుగా గుసగుసలాడు తీరును గమనించి అందరితో రావణుడు / దుర్యోధనుడు ఇట్లనియెను.

ఆ. ఎన్నఁగానరాద్యపేక్షితార్థమ కాదె
నరునిరాక యిది మనంబులందుఁ
దక్కుగతిగఁ గొనుట దగ దేరికిని మన
యర్థసిద్ధి యగుట కలరవలయు. 51

రామా : ఎన్నగా=ఆలోచింపగా, నరాది=నరులను, అపేక్షితార్థమకాదే= భక్షించెడి రాక్షసుల కోసమే గదా! నరునిరాక=రాముని రాక, ఇది మనంబులందున్= దీనిని మనస్సులందు, తక్కుగతిగన్=మరొక విధముగా, ఏరికిని=ఎవ్వరికిని, కొనుట తగదు=భావించుట సరికాదు, మన అర్థసిద్ధి అగుటకు=మన ప్రయోజనము నెరవేరుటకు, అలరవలయు=ప్రయత్నించవలెను.

తాత్పర్యము : ఆలోచింపగా నరులను భక్షించెడి రాక్షసుల కోసమే గదా ఈ రాముని రాక. ఇది మనస్సులో మరొక విధముగా ఎవ్వరును భావించుట తగదు. మన ప్రయోజనము సిద్ధించుటకు ప్రయత్నించవలెను.

భారత : ఎన్నగానరు=విచారించుకొనలేరు, ఆది=మొదట మనము వచ్చునపుడు, నరుని రాక=అర్జునుని రాక, ఆపేక్షితార్థమకాదె=కోరుకున్నదే గదా!

ఇది మనంబులందు, తక్కుగతిగకొనుట, తగదు, ఏరికిని, మన అర్థసిద్ధి అగుటకు, అలరవలయు.

తాత్పర్యము : మీరు విచారించుకొనలేరు! మనము వచ్చునపుడు అర్జునుని రాక మనము కోరుకున్నదే గదా! దీనిని మనస్సులందు మరొక విధముగా భావించుట ఎవ్వరికిని తగదు. మనమాసించిన ప్రయోజనసిద్ధి కలుగుటకు ప్రయత్నించవలెను.

తే. అసమయాత్మోద్ధతిపిశాచియన్ను గొల్ప
బుద్ధిసెడి వచ్చుచున్నాఁడు వొడవడంగి
పోఁగలాఁ డిదిగోఁ దనపోతరమునఁ
గ్రమ్మఱం గాన కితఁడు సభ్రాతృకముగ. 52

రామా : అసమ=సరిలేని, ఆత్మోద్ధతి పిశాచి=తన ఔన్నత్యమనెడి పిశాచము, అన్నుగొల్పన్=ఒడలెరుగరాకుండ చేయగా, బుద్ధి చెడి, వచ్చుచున్నాడు, పొడవు+ అడంగి= గర్వము తగ్గి, ఇదిగో, తన పోతరమున=తన మదమున, క్రమ్మరన్ కానక= తిరిగిపోలేక, ఇతడు=రాముడు, సభ్రాతృకముగ=లక్ష్మణునితోకూడి, పోగలాడు= వెళ్ళగలడు.

తాత్పర్యము : సరిలేని ఆత్మబలోన్నతి అనెడు పిశాచి శరీరమెరుగకుండ చేయగా, బుద్ధి చెడి (యుద్ధమునకు వచ్చుచున్నాడు. తన గర్వమణగి తిరిగి పోలేక రాముడు లక్ష్మణునితో కూడి ఇదిగో పోగలడు. (రాక్షసులను కొనిన మాట)

భారత : అ సమయ=చేసుకొన్న నియమము దాటిన, ఆత్మోద్ధతి పిశాచి, అన్ను గొల్పన్, బుద్ధిసెడి వచ్చుచున్నాడు, ఇదిగో, పోతరమున=తన మదముచే, క్రమ్మరన్, కానకున్=అడవులకు, సభ్రాతృకముగా=సోదరులతో కలిసి, పోగలాడు.

తాత్పర్యము : చేసికొన్న సమయము అనెడి గర్వోన్నతి పిశాచము ఒడలెరుగకుండ చేయగా (అర్జునుడు) బుద్ధి చెడి వచ్చుచున్నాడు. అణగియుండి తన మదముచే ఇతడు సోదరులతో కలిసి ఇదిగో! తిరిగి అడవులకు వెళ్ళగలడు.

సీ. అన నప్పు డెన్నిక నమరశత్రు విభీష
ణుఁడు భీష్ముఁ డనుశంక నులిమి వైచి
పలుకుఁ బంతము మీఱఁ గలనికినాయిత
పడువార మెల్లను బడుట గాని
మన కింక సమయమన్మాట లే దిది యెంచ
వలదు నీ వజ్ఞాతవాసముచిత
మగునీతి ముగియించి యాజికి నఱమెద
వాభీలరణతేజుఁ డాతఁ డతని

ఆ. మార్కొనుట భరంబు మహితనయాత్యాగ
మునఁ జలింపక మన మనికి నిలువ
యత్న మాచరింపు మన్యులబుద్ధిచే
సరకుగొనక యునికి జూడ గాదు. 53

రామా : అనన్+అప్పుడు=అట్లు పలికినపుడు, ఎన్నికన్=లెక్కించినవాడై, అమరశత్రు=రావణుని, విభీషణుడు, భీష్ముడను శంక=భయంకరుడనెడి విచారమును, నులిమివైచి=మాని, పలుకున్=మాట్లాడెను, పంతము మీర=పట్టుదలతో, కలనికి=యుద్ధమునకు, ఆయితపడువారము=సిద్ధపడుచున్నాము, ఎల్లను పడుటకాని=మనము సిద్ధపడుటేగాని, మనకు ఇంక, సమయము=చావము, అన్+మాటలేదిది+ఎంచవలదు=మరణము లేదని భావింపవలదు, నీవు అజ్ఞాతవా?= నీవు ఎఱుగనివాడవా?, సముచితమగు నీతి=తగిన పద్ధతిలో, ముగియించి=ముగించి, ఆజికిన్=యుద్ధమునకు, అఱమెదవు=ప్రయత్నము చేయుచున్నావు, ఆతడు=ఆ రాముడు, ఆభీలరణతేజుడు=భయంకరమైన యుద్ధప్రతాపముగలవాడు, అతని మార్కొనుట=ఎదిరించుట, భరంబు=కష్టము, మహితనయా త్యాగమునన్=సీతను విడుచుట యందు, చలింపక=ఆలోచింపక (సీతను వదలి) మన=మన యొక్క, మనికి=బ్రతుకును, నిలువ=నిలుపుటకు, యత్నమాచరింపుము=ప్రయత్నింపుము,

అన్యులబుద్ధిచే=ఇతరుల మాటలచే, సరకు గొనక=లెక్కింపక, ఉనికి=ఉండుట, జాడగాదు, యుక్తము గాదు.

తాత్పర్యము : అని ఇట్లు రాక్షసులు మాట్లాడగా విభీషణుడాలోచించి రావణుడు భయంకరుడను విచారమును వదలి ఇట్లు పలికెను. పట్టుదలతో మనము యుద్ధమునకు బయలుదేరుట కేవల ప్రయత్నమే. మనమిక చావము అను ఆలోచన వలదు. నీకు తెలియనిదా! తగిన రీతిలో పరిష్కరించక యుద్ధమునకు ప్రయత్నము చేయుచున్నావు. రాముడు భయంకరమైన యుద్ధప్రతాపము గలవాడు. సీతను విడుచుట అను ఆలోచన చేసి మన బ్రతుకులు నిలుచు ప్రయత్నము చేయుము. ఇతరుల మాటలు విని అతనిని లెక్కబెట్టకుండుట మంచిది కాదు.

భారత : అననప్పుడు, ఎన్నిక నమరన్=లెక్కపెట్టినవాడై, శత్రు విభీషణుడు, శత్రువులకు భయంకరుడైన భీష్ముడు+అను=భీష్ముడిట్లనెను, శంకనులిమివైచి= సందేహమును వీడి, పలుకున్=పలికెను, పంతము మీర, కలనికి, ఆయిత పడువారము, ఎల్లను పడుటకాని, మనకింక, సమయమన్ మాటలేదు=చేసికొన్న సమయ పాలనము అను మాట లేదు, ఇది ఎంచవదు=దానిని భావించవలదు, నీవు, అజ్ఞాతవాసము, ఉచితమగు నీతి ముగియించి=తగిన రీతిలో పూర్తి చేసి, ఆజికిన్, అఱిమె=నడచెను, దవాభీల రణతేజుడు=దావానలము వంటి భయంకరమైన యుద్ధ ప్రతాపము కలవాడు, ఆతడు=అర్జునుడు, అతని, మార్కొనుట భరంబు, మహిత=గొప్పదైన, నయ=నీతి యొక్క ఆ త్యాగమునన్=విడువకుండుట యందు, చలింపక=స్థిరమైనవాడై, మనము=కౌరవులు, అనికిన్+నిలువన్=యుద్ధమునకు నిలుచునట్లు, యత్నమాచరింపుము=ప్రయత్నించుము, అన్యులబుద్ధిచే, సరకు గొనక, ఉనికి జాడగాదు.

తాత్పర్యము : అట్లు వారు పలుకగా శత్రు భయంకరుడైన భీష్ముడు లెక్కించి అనుమానమును త్రుంచి ఇట్లు పలికెను. పంతముతో మనము యుద్ధమునకు సన్నాహపడుచున్నాము. మనకు ఇక సమయము దాటలేదను మాటలేదు. అజ్ఞాతవాసమును ఉచితమగు నీతిచే ముగించి యుద్ధమునకు నడచెను. భయంకర

యుద్ధ ప్రతాపముగల అర్జునుని ఎదిరించుట కష్టము. గొప్పదైన నీతియందు స్థిరమై మనము యుద్ధమునకు నిలుచునట్లు ప్రయత్నించుము. ఇతరుల మాటలు విని అతనిని లెక్కింపకుండుట మంచిది కాదు.

చం. తొలుతటినుండియు న్వలదు దుర్జయవైరము మాను మంచు ని
చ్చలుఁ జెవి నిల్లు గట్టుకొని చాటితి నన్ను గణింప వైతి పె
న్బలియునితోడిపో రిది యుపస్థిత మయ్యె నగర్వబుద్ధి నా
పలుకిcక నైనఁ గైకొను మపాయ మగున్ దురహంక్రియోద్ధతిన్.

రామా/భారత : దుర్జయ వైరము=జయింపరాని వారితో శత్రుత్వము, వలదు=వద్దు, మానుమంచు=వదలుమని, తొలుతటి నుండియు=మొదటి నుండి, నిచ్చలు=నిత్యము, చెవినిట్లుగట్టుకొని, చాటితి=చెప్పితిని, నన్ను=విభీషణుని/భీష్ముని, గణంపవైతి=లెక్కింపనేరవైతివి, పెన్+బలియునితోడి=గొప్ప బలవంతునితో, పోరిది=ఈ యుద్ధము, ఉపస్థితమయ్యె=ముందు నిలిచెను, అగర్వబుద్ధిన్=గర్వములేని మనసుతో, నా పలుకు=నా మాట, ఇకనైనన్ కైకొను=స్వీకరించుము, దురహం క్రియోద్ధతిన్=దురహంకారముతో, అపాయమగున్.

తాత్పర్యము రెండింటికి సమానము -

తాత్పర్యము : అజేయుడై శత్రువుతో యుద్ధము వలదని, మానుకొనమని మొదటి నుండియు చెవినిల్లు గట్టుకొని చెప్పితిని. నన్ను (విభీషణుని/భీష్ముని) లెక్కింపవైతివి. గొప్ప బలిష్ఠుడైన వీరునితో యుద్ధమిపుడు తటస్థించెను. గర్వములేని బుద్ధితో ఇకనైన నా మాట వినుము. దురహంకారముచే అపాయమగును.

వ. అనుటయు నతనిం గటాక్షించి. 55

అనగా అతనిని దయదలచి.

తే. ఇనతనూభవుఁ డధిపున కిచ్చకముగఁ
బలికె నెపుడును రిపుపక్షపాతభాష

లుడుగవైతి వింకే మనియెడిది నిన్ను
నాప్తుఁ డనియున్న దొర వెఱ్ఱి యనుటగాక. 56

రామా/భారత : ఇనతనూభవుడు=ప్రభుపుత్రుడైన ఇంద్రజిత్తు/కర్ణుడు, అధిపునకు=రావణునకు/దుర్యోధనునకు, ఇచ్చకముగ బలికె=ప్రియముగా మాట్లాడెను, రిపుపక్షపాత భాషలు=శత్రువుల పక్షమున మాట్లాడుటను, ఎపుడును, ఉడుగవైతి=వదలకుంటివి, ఆప్తుడనియున్న దొర=స్నేహితుడైయున్న ప్రభువు, వెఱ్ఱియనుటగాక, ఇకేమనియడెది నిన్ను=నిన్ను ఇంకేమనియెదను.

తాత్పర్యము : రెంటికి సమానము -

ఇంద్రజిత్తు/కర్ణుడు రాజునకు ఎల్లప్పుడు ప్రీతిగా మాట్లాడెను. శత్రువుల పక్షమున మాట్లాడుటను వదలకుంటివి. ఆప్తుడైన దొర వెఱ్ఱియనుటవలెగాక నిన్ను అనుటకు ఇంకేమున్నది (విభీషణుని / భీష్ముని).

కం. ఒక నరుని విక్రమము మా
టికిఁ బొగడెద వింత కడుఁ గడిందిగమనయే
లికకుఁ గలయోధవీర
ప్రకరము నీకేల దృష్టి పట్టదు చెపుమా. 57

రామా / భారత : ఒక నరుని=ఒక మనుష్యుని యొక్క / అర్జునుని యొక్క, విక్రమము=పరాక్రమము, మాటికి, వింతకడు గడిందిగ=వింత గలుగునట్లుగా, పొగడెదవు, మన ఏలికకుగల=రావణునికి / దుర్యోధనునికి గల, యోధవీర ప్రకరము=యుద్ధవీరుల సముదాయము, నీకేల=నీకెందుకు, దృష్టిపట్టదు చెపుమా=కనిపించదో చెప్పుము.

తాత్పర్యము : ఓ విభీషణా/భీష్మా! ఒక మనుష్యుని యొక్క (అర్జునుని యొక్క) పరాక్రమమును మాటిమాటికీ వింత గొలుపునట్లు పొగడెదవు. మన రాజునకు గల యుద్ధవీరుల సముదాయము నీకెందులకు గోచరింపదు.

ఆ. ఇట్టి మాటలాడునట్టి మాన్యులనిండ్ల
కడనయుండి మనకుఁ గార్యసిద్ధి
గలుగఁగోరుఁ డనుట గా కిటువంటిక
ర్జములకుఁ బిలిపింపఁ జనునె దొరకు. 58

రామా / భారత : ఇట్టి మాటలాడునట్టి, మాన్యులను=గౌరవార్హులను, ఇండ్లకడన యుండి=ఇంటిలోనే వుండి మనకు కార్యసిద్ధి కలుగగోరుదు, అనుటగాక=ఇటువంటి, కర్జములకు=పనులకు, పిలిపింపన్, దొరకు చనునె=ప్రభువునకు తగునా!

తాత్పర్యము : ఈ విధముగా మాటలాడు పెద్దలను ఇండ్ల వద్దనే వుండి మనకు కార్యసిద్ధి కలుగునట్లు కోరుకొనుమని చెప్పుట గాక, ఇటువంటి పనులకు పిలిపించుట ప్రభువుకు తగునా!

వ. అనవుడు నతం డతని నధిక్షేపించి యధిపతి కిట్లనియె. 59

అతడు=విభీషణుడు/భీష్ముడు, అధిక్షేపించి=ఆక్షేపించి, అధిపతికి=రావణునికి/ దుర్యోధనునికి, ఇట్లనియె.

ఆ. ఇట్టిపడుచు మాట లెడఁదఁ గైకొనక నీ
వాత్మరక్ష కొఱకు నాశ్రయింపు
గురుకృపాదు లైన గుణములప్రోకల
రాజనందనుల మహాజిచణుల. 60

రామా : ఇట్టి పడుచు మాటలు=ఈ విధమైన బేలమాటలు, ఎడదగైకొనక= మనసున పెట్టక, నీవు=రావణుడు, ఆత్మరక్ష కొరకు=నిన్ను నీవు రక్షించుకొనుట కొరకు, గురు కృపాదులైన=అధికమైన దయాదులు కలిగిన, గుణముల, ప్రోకలన్=రాసులైనవారిని, రాజనందనులన్=రామలక్ష్మణులను, మహాజి చణుల=ఘోర యుద్ధమునందు నిపుణులైన వారిని, ఆశ్రయింపు=వేడుకొనుము.

తాత్పర్యము : ఈ విధమైన బేలమాటలను నీవు మనసున కెక్కించు కొనక ఆత్మ రక్షణ కొరకై అధిక దయాశాలురు, సద్గుణరాసులు అయిన రామలక్ష్మణులను ఆశ్రయింపుము.

భారత : ఇట్టిపడుచు మాటలెడదగైకొనక, నీవాత్మ రక్షకొరకు, గురు కృపాదులైన=ద్రోణుడు కృపుడు మొదలైన, గుణముల ప్రోకలన్, మహాది చణులన్, రాజనందనులన్=రాజును సంతోషపరుచు వారిని ఆశ్రయింపుము.

తాత్పర్యము : ఈ విధమైన బేలమాటలు మనసున పెట్టక నీవు ఆత్మ రక్ష కొరకు గుణరాసులు ఘోర యుద్ధ నిపుణులు రాజునకు సంతోషము కలిగించునటువంటి వారైన ద్రోణకృపాదులను ఆశ్రయింపుము.

వ. వార లిట్టి యవివేకివచనంబులకు వశవర్తివై వర్తిల్లు నీయపరాధంబునం గ్రోధించి వచ్చుచున్న వారమ్మహానుభావులు గావరేనిం దత్తాదృగ్దివ్యబాణధనంజయ ప్రతాపంబున భవద్బలాంగంబులకుం గరంబు గీడ్పాటు వాటిల్లెనని తలంచెద నని పలికి వెండియుం బెక్కుఁ దెఱంగుల బుద్ధి సెప్పి యప్పుడు. 61

రామా : వారలు=రామలక్ష్మణుడు, ఇట్టి=ఈ విధముగా, అవివేకి వచనంబులకు, వశవర్తివై=లోనై, వర్తిల్లు=ప్రవర్తించు, నీ అపరాధంబునన్=నీ దోషముకు, క్రోధించి=కోపించి వచ్చుచున్నవారు, అమ్మహానుభావులు, కావరేని=సహింపరేని, తత్+తాదృక్=ఆ విధమైన, దివ్యబాణ=దివ్యబాణములనెడి, ధనంజయ=అగ్ని యొక్క, ప్రతాపంబునన్=అధికమైన సెగచే, భవత్+బలాంగంబు లకున్=నీ సేనాసమూహమునకు కరంబు కీడ్పాటు వాటిల్లె=మిక్కిలి చెడ్డ కలిగెను, అని తలంచెద=అని పలికి, వెండియున్=పెక్కు తెరంగులన్=అనేక రకములుగా, బుద్ధి చెప్పి, అప్పుడు :

తాత్పర్యము : రామలక్ష్మణులు ఈ విధముగా నీవు ఈ అవివేకి మాట్లాడిన మాటలకు లోనై ప్రవర్తించు నీ దోషమునకు కోపించి వచ్చుచున్నారు. ఆ

మహానుభావులు నిన్ను కావరేని ఆ విధమైన దివ్యబాణముల అగ్ని ప్రతాపము వలన నీ సేనా సమూహమునకు మిక్కిలి నాశనము కలుగునని నేను భావించెదనని విభీషణుడు పలికి మరియు అనేక విధములుగా రావణునకు బుద్ధి చెప్పి - అప్పుడు.

భారత : వారలు=ద్రోణకృపాదులు, ఇట్టి అవివేక వచనంబులకు=ఈ విధమైన అవివేకపు మాటలకు, వశవర్తివై వర్తిల్లు=నీ అపరాధంబునన్, క్రోధించి వచ్చుచున్నవారు=కోపము తెచ్చుకొనుచున్నారు, అమ్మహానుభావులు కావరేని, తత్తాదృక్=ఆ విధముగా ప్రసిద్ధమైన, దివ్యబాణ=పాశుపతాస్త్రాది=దివ్యాస్త్రములుగల, ధనంజయ=అర్జునుని యొక్క ప్రతాపంబున, మిగతా సమానము -

తాత్పర్యము : ద్రోణకృపాదులు ఈ విధముగా అవివేకపు వచనములకు లోనై ప్రవర్తించు నీ అపరాధమునకు, కోపము తెచ్చుకొని వచ్చుచున్నారు. ఆ మహానుభావులు కాపాడనిచో ఈ విధముగా ప్రసిద్ధమైన పాశుపతాది దివ్యాస్త్రములుగల అర్జునుని ప్రతాపముచే నీ సేనా సమూహమునకు మిక్కిలి నాశనము కలుగునని భావించెదనని భీష్ముడు పలికి మరియు అనేక రకములుగా బుద్ధి చెప్పి అప్పుడు.

తే. అతని బహుకర్ణ పరుషవాక్యముల నెడసి
యు న్నతనుతాచలోత్సాహయుక్తు ధర్మ
గురునిరఘువీరవరుఁ జేరి కొలిచి తత్కృ
పాదరము చెంద నంచితామోద మొంది. 62

రామా : అతని=రావణుని, బహు=బహుళములైన, కర్ణపరుష=కర్ణకఠోరము లైన, వాక్యములన్=మాటలచే, ఎడసి=నొచ్చుకొని, ఉన్నత=ఘనమైన, నుత=స్తుతమైన, అచల=చలింపని, ఉత్సాహయుక్తున్=ఉత్సాహముతో కూడిన వానిని, ధర్మగురుని= కోదండమును దీక్షగా ధరించిన, రఘువీరవరున్=రాముని, చేరి కొలిచి, తత్+కృపాదరము=ఆ రఘునాధుని కృపచేత, ఆదరము చెందన్=తనను పొందగా, అంచిత=ఒప్పుచున్న, ఆమోదమొంది=సంతోషమును పొంది.

తాత్పర్యము : రావణుని కర్ణ కఠోరములైన పలువాక్యములచే నొచ్చుకొని గొప్పగా స్తుతింపదగిన స్థిరమైన ఉత్సాహముతో కూడిన కోదండ దీక్షా గురువైన రాముని చేరి కొలిచి, ఆ రాముని దయతో కూడిన ఆదరము పొందినవాడై సంతోషమును పొందెను.

భారత : అతని=దుర్యోధనుని, బహుకర్ణ=కర్ణుని యొక్క, పరుష వాక్యములనెడసియున్న, తనుత=లఘుత్వముచే, చల=చలించిన, ఉత్సాహయుక్తు, నిరఘు=నిష్కల్మషుని, ధర్మగురునిన్=ద్రోణాచార్యుని, చేరి కొలిచి, తత్ కృపన్=ఆ కృపాచార్యుని యొక్క, ఆదరము చెందన్=ఆదరము పొందుట కొఱకు, అంచి=పంపి, తాన్=దుర్యోధనుడు మోదమొంది.

తాత్పర్యము : దుర్యోధనుని కర్ణుని పరుష వాక్యములతో నొచ్చుకొని లఘుత్వముచే చలించిన ఉత్సాహము కల్గిన నిష్కల్మషుడైన ద్రోణాచార్యుని చేరి కొలిచి కృపాచార్యుని ఆదరమును పొందుటకు పంపి దుర్యోధనుడు సంతోషించి –

వ. అంత. 63

రామా : విభీషణుడు కొలువ వచ్చిన తర్వాత –

భారత : దుర్యోధనాధుల ఆలోచనా సమయములో –

తే. మృదుతఁ బని గామి గని రోసి పొదివె నంప
వాన నాదిత్యకులరాజవరసుతుండు
తనయెదుట గోత్రనరికట్టుకొని విడువని
వాహినులఱేనిగుండియవడిఁ గలంగ. 64

రామా : మృదుతన్=నెమ్మదిమాటలచే, పనిగామి+కని=పని కాకుండుట చూచి, రోసి=కోపించి, ఆదిత్య కులరాజవరసుతుండు=రాముడు, తన ఎదుటన్=రాముని ముందు, గోత్రన్+అరికట్టుకొని=నేలను అడ్డుకొని, విడువని, వాహినులరేని=సముద్రుని, గుండియ=గుండె, వడికలంగ=మిక్కిలి చలింపగా,

అంపవాన=బాణవర్షమును, పొదివె=పొదివెను.

తాత్పర్యము : మెత్తని మాటలచే పని కాకుండుటను చూచి కోపించిన సూర్యవంశపు రాజైన రాముడు తన ఎదుట భూమి నరికట్టుకొని విడువని సముద్రుని గుండె చలించునట్లు బాణ వర్షము పొదివెను.

భారత : మృదుతన్ పనిగామి, కనిరోసి, ఆదిత్య కులరాజు=ఇంద్రుని యొక్క, వరసుతుండు=అర్జునుడు, తన ఎదుట, గోత్రన్=గో సమూహమును, అరికట్టుకొని =విడువని, తేని=దుర్యోధనుని యొక్క, గుండియ కలంగన్=గుండెలదరునట్లు, వాహినులన్=సేనలను, అంపవానన్, పొదివెను.

తాత్పర్యము : మెత్తని మాటలతో పని కాకుండుటను చూచి కోపించిన అర్జునుడు గో సమూహమును తరలించి విడువని దుర్యోధనుని గుండెలదురునట్లుగా సేనలను అంపవానచే ఆక్రమించెను.

విశేషణము : గోత్ర – 'గోత్రా కుఃపృధివీ పృధ్వీ' అని అమరము.

గవాం సమూహో గోతా అనియు అర్థము.

వ. అప్పుడు. 65

కం. అవిదితవిఘ్ను నరవరా
స్త్రవిభగ్నాంగమ్ము లగుచు రహితమహాగో
నివహత నాకులగతిఁ జెం
దె వెలయఁగఁ దదుగ్ర కాండదృఢసత్త్వంబుల్. 66

రామా : అవిదిత=తెలియని, విఘ్ను=విఘ్నముగల, నరవర=రాముని యొక్క, అస్త్ర=అస్త్రములచే, విభగ్న+అంగమ్ములగుచు=తునిగిన శరీరభాగములు గలది అగుచు, తత్=ఆ సముద్రుని యొక్క, ఉగ్ర=భయంకరమైన, కాండ=నీటిలో వున్న, దృఢ సత్త్వంబుల్=బలిష్టమైన జంతువులు, రహిత=విడువబడిన, మహత్=గొప్పదైన, ఆ గోనివహతను=పాప సముదాయముగలవగుటచే, నాకుల=దేవతల యొక్క,

గతి చెందెన్=దేవ లోకమునకు పోయెను.

తాత్పర్యము : తెలియని విఘ్నముగల రాముని అస్త్రములచే తునిగిన శరీరముగలవియై ఆ సముద్రుని లోతైన ఉదకమందున్న దృఢమైన జంతువులు గొప్ప పాపసంఘములు తొలగి దేవలోకమునకు పోయెను.

భారత : అవి=ఆ సేనలు, దితవిఘ్న=ఖండింపగల విఘ్నముగల (వారింపరానివై) నర=అర్జునుని యొక్క, వరాస్త్రములచే=దివ్యమైన అస్త్రములచే, విభగ్న=తునిగిన, అంగమ్ములగుచు=రథతురగాదులు గలవియై, గోనివహత=గో సమూహము, మహత్=అధికమైన, తత్=ఆ అర్జునుని యొక్క, ఉగ్ర=ఉగ్రములైన, కాండ=బాణములను, దృఢ సత్వంబుల్=గట్టి బలముతో, వెలయగ, ఆకులగతి చెందెన్=వ్యాకులము చెందెను.

తాత్పర్యము : ఆ సేనలు వారింపరాని అర్జునుని దివ్యాస్త్రములచే విరిగిన రథతురగాదులు గలవియై అధికమై గోసముదాయమును విడిపించిన అర్జునుని తీవ్రమైన బాణములచే దృఢమైన బలమును పొంది వ్యాకులపడెను.

వ. తదనంతరంబ. 67

తరువాత

సీ. మఱియు నుద్ధతచేష్ట మానకురుబలాబ్ధి
యసదృశాశ్చర్యపదాతిబహుల
హరివారణాధిక పరిపూర్ణ దిఙ్ముఖం
బగుచుఁ బైపయిఁ బేర్చుపొగరు సూచి
యలుక హెచ్చగురు భీష్మాహిమకరసంత
తులు మొద ల్గాఁ గడుదుర్దమగతిఁ
దనరారువారి సత్త్వము లెల్లఁ బొలియఁ ద
దంతర్గతక్ష్మాభృదవయవములు

తే. భేదిల నతండు దనదైన బెట్టిదంపు
టంపజడి పెంపు చూపి యే పణఁచె నతని
తీవ్రతకు నోడి యంతనదీప్రభుండు
గళిత ధైర్యుండు నతిభయాకులుఁడు నగుచు. 68

రామా : మరియును, ఉద్ధతచేష్ట=గర్వించిన చేష్ట, మానక=వదలక, ఉరుబలాబ్ధి= గొప్ప బలముగల సముద్రుడు, అసదృశ=సాటిలేని, ఆశ్చర్య= ఆశ్చర్యమునకు, పద=స్థానమైన, అతిబహు=మిక్కిలి తరుచైన, లహరి=అలలుగల, వాః=నీటి యొక్క, రణాధిక్య=అధికమైన మోతల యొక్క, పరిపూర్ణదిక్+ముఖంబగుచు=నిండిన దిక్కులు ముఖములు గలదియై, పైపయి=పైపైన, పేర్చు=చూపు, పొగరు చూచి=గర్వమును చూచి, అలుక హెచ్చన్=కోపము మీరగా, గురు=అధికమైన, భీష్మ=భయంకరములైన, అహి=సర్పములును, మకర సంతతులు=మొసళ్ళ పిల్లలు, మొదల్గాన్=మొదలైన, కడుదుర్గమ గతిన్=మిక్కిలి భయంకరముగా, తనరారు=ఒప్పు, వారి సత్వములెల్లన్= నీటిలోని జంతువులన్నియు, పొలియన్=నశింపగా, తత్=ఆ సముద్రుని యొక్క, అంతర్గత=లోపలనున్న, క్ష్మాభృత్=మైనాకాది పర్వతముల యొక్క, అవయవములు= శరీరములు, భేదిలన్=ఖండింపబడగా, అతండు=రాముడు, తనదైన, బెట్టిదము+ అమ్ము+జడి పెంపు చూపి=బలమైన బాణవర్షముయొక్క ఆధిక్యతను చూపి, ఏపు+అణచెన్=గర్వమును అణచెను, అతని తీవ్రతకు నోడి=రాముని వేగమునకు భయపడి, అంతన్=వెంటనే, నదీ ప్రభుండు=సముద్రుండు, గళిత ధైర్యుండు=సడలిన ధైర్యముగలవాడును అగుచు, అతి భయాకులుడు=మిక్కిలి భయముతో కూడినవాడునై.

తాత్పర్యము : మరియు తన గర్వమును మానక మిక్కిలి బలముగల సముద్రునకు సాటిలేని ఆశ్చర్యమునకు స్థానమై మిక్కిలి తరచైన అలలుగల నీటిమోతచే దిక్కులు నిండినవియై అధిక భయముతో సర్పములు, మొసళ్ళ సంతతులు కలిగి, జల జంతువులు మడిసెను. ఆ సముద్రుని లోపలనున్న మైనకాది పర్వతముల అవయవములు ఖండింపబడగా రాముడు గర్వమడచెను. అంత ధైర్యమును వీడి

అతి భయముతో కూడినవాడై సముద్రుడు - కాన్పించెనని ముందరి పద్యముతో అన్వయము.

భారత : మరియు, ఉద్ధత=అధికమైన గర్వముతో, చేష్టమాన=వ్యాపించుచున్న, కురుబలాబ్ధి=సముద్రము వంటి కురుసేనలు, అసదృశ=ఆశ్చర్య, పదాతి=బంటులచే, బహుల=అధికమైన, హరి=గుర్రముల చేతను, వారణ+అధిక=ఏనుగుల ఆధిక్యము చేతను, పరిపూర్ణ దిఙ్ముఖంబగుచు, పైపయి, పేర్చు పొగరుసూచి, అలుక హెచ్చన్, గురు=ద్రోణాచార్యులు, భీష్మ=భీష్ముడు, అహి మకర సంతతులు=కర్ణుడు, మొదలుగా, కడున్, దుర్దమగతి తనరారు, వారి సత్వములెల్ల, పొలియ, తదంతర్గతక్ష్మాభృదవయవములు, భేదిల=రాజుల శరీరములు నొచ్చుకొనగా, అతండు=అర్జునుడు, తనదైన బెట్టిదంపు, అంప జడిపెంపు చూపి, ఏపణచె, అతని తీవ్రతకు నోడి, అంతన్, అదీప్రభుండు=దీపింపని కాంతి గలవాడు, గళిత ధైర్యుండు, అతిభయాకులుడునగుచు.

తాత్పర్యము : గర్వించునట్లుగా వ్యాపించుచున్న కురుబల సముద్రము, బంట్లు, గుఱ్ఱములు, ఏనుగులచే అసమానమైన, ఆశ్చర్యకరమైన రీతిలో దిక్కులు నిండిన వగుచు పైపైన పెరిగిన గర్వమును చూచి కోపము హెచ్చగా ద్రోణభీష్మ కర్ణాదుల యొక్క దర్పమును, నశింపజేసి, ఆ సేనలలోని రాజుల శరీరములు సడలగా తన బాణవర్షమును కురిపించి వారి అతిశయమును అణచెను. అతని తీవ్రతకు ఓడి దీపింపని కాంతిగలవాడు చెదిరిన ధైర్యముగలవాడు మిక్కిలి భయముగలవాడునై (ఉత్తరుడు).

ఆ. పురుషమూర్తితోడఁ బ్రోవైనదైన్యంబు
వోలెఁ గానుపించి భూవరుండ
నీకసాధ్య మొకటి లేకున్కి యారసి
బెట్టిదంపుగుండె బెదరఁ బాఱె. 69

రామా : పురుషమూర్తి తోడ=పురుషుని ఆకారముతో, ప్రోవైన దైన్యంబు ఓలె=దీనత్వము రూపుకట్టినట్లుగా, కానుపించి=కనిపించి, సముద్రుడనెడి

మాటలు–భూవరుండ=ఓ రామా, నీకసాధ్యము ఒకటి, లేకున్కి=లేకపోవుటచే, ఆరసి=చూసి, బెట్టిదము+గుండె=ఉద్ధతిగల గుండె, బెదర బారె=భయపడెను.

తాత్పర్యము : పురుషాకారములో దీనత్వము రూపుగట్టినట్లు కనిపించిన సముద్రుడిట్లనెను. ఓ రామా! నీకసాధ్యమైనది ఏమియు లేకుండుట చూసి బలమైన నా గుండె బెదరెను.

భారత : పురుషమూర్తి తోడ ప్రోవైన=పురుషాకారములో నున్న, దైర్యంబు ఓలె=దీనునివలె, కానుపించి, భూవరుండు=దుర్యోధనుడు, అనీక=యుద్ధముచే, సాధ్యమొకటి–లేకున్కి=సాధించినది ఏమియు లేకుండుటచే, ఆరసి, బెట్టిదంపు గుండె, బెదరబారె.

తాత్పర్యము : పురుషాకారమును ధరించిన దైన్యమువలె కనిపించి దుర్యోధనుడు యుద్ధముచే సాధించినది ఏమియు లేకుండుటను చూచి ఉద్ధతిగల గుండెతో బెదరివెళ్ళెను.

వ. దానంజేసి. 70

సీ. ఇదె నీకు శరణు సొచ్చెద శాంతుఁడవు గమ్ము
        వెదక నీకెవ్వరు నెదురు లేర
    పార్థదర్పమున నీపస గాన కి ట్టెది
        ర్చినవారిదోషంబు గనియె ఫలము
    నిఁకఁ గావు మర్థింతు నే నోయఖండద
        యాసముద్రుండ నాయందుఁ గరుణ
    నడవఁ గట్టి పగఱ నడఁగించితే నేమి
        చెప్ప నమోఘవాంఛితుఁడ నగుదు
ఆ. హరివిగాక నీవు నరమాత్రుఁడవె యని
    యంత వినయభక్తు లతిశయిల్లఁ

బాదపద్మములకుఁ బ్రణుతి గావించిన
నమ్మహాత్ముఁ డతని నాదరించె. 71

రామా : ఇదె నీకు శరణు జొచ్చెద, శాంతుడవుకమ్ము, వెదకన్=నీ కెవ్వరు ఎదురు లేరు అపార్థదర్పమున=పొరబడిన దర్పముచే, నీపసగానక=నీ శక్తిని తెలసుకొనలేక, ఇట్టు+ఎదిర్చిన=ఈ విధముగా తలపడిన, వారి దోషంబు=నీటి దోషంబు, కనియె, ఫలము=ఫలితమును పొందిరి, ఇక కావుము=ఇంక రక్షింపుము, అర్థింతున్=వేడెదను, ఓ అఖండదయా=గొప్ప దయగలవాడా!, సముద్రుండ=నేను సముద్రుడను, నాయందు=కరుణ నడవన్=దయ జూపి గట్టిపగర నడగించితేన్=క్రూర శత్రువులను నశింపజేసినచో, ఏమి చెప్పన్=ఏమి చెప్పుదును, అమోఘవాంఛితుడన్ అగుదుం=నా కోరికలెల్ల సిద్ధించిన వాడనగుదును, నీవు=(రాముడు), హరివిగాక=సాక్షాత్తు విష్ణుడవుగాక, నరమాత్రుండవే=మనుష్య మాత్రుడవా! అని=అంత, వినయభక్తులు, అతిశయిల్లు=హెచ్చుగా, పాదపద్మములకు, ప్రణుతి గావించిన, నమస్కరింపగా, అమ్మహాత్ముడు=ఆ రాముడు, అతని నాదరించె=అతనిని గౌరవించెను.

తాత్పర్యము : నేనిదె నిన్ను శరణు వేడెదను. శాంతింపుము. ఆలోచింపగా నిన్నెదిరించుటకు ఎవ్వరు సరిగారు. పొరబడిన దర్పముచే నీశక్తిని లెక్కింపక ఈ విధముగా ఎదిరించిన ఉదక దోషము తగిన ఫలమును పొందెను. నిన్ను వేడుచున్నాను. నన్ను రక్షింపుము. ఓ మహా దయాపరుడా! నేను సముద్రుడను. నాపై దయ చూపి బలవంతులైన శత్రువులను నశింపజేసినచో ఏమని చెప్పుదును? నాకోరికలెల్ల సిద్ధించును. నీవు విష్ణువువే గాక సామన్య మానవమాత్రుడవా? అని వినయభక్తులు హెచ్చుగా సముద్రుడు పాదపద్మములకు సాష్టాంగ నమస్కారము చేయగా రాముడు అతనిని ఆదరించెను.

భారత : ఓ అఖండ దయా సముద్రుండ=గొప్ప దయా సముద్రుడా! ఇదె నీకు శరణుజొచ్చెద, శాంతుడవు కమ్ము, వెదక నీకెవ్వరు ఎదురులేర, పార్థ=ఓ అర్జునుడా! దర్పమున, నీ పసగానక, ఇట్టెదిర్చిన, వారి దోషంబు=దుర్యోధనాదుల దోషము, కనియె ఫలము=ఫలితమును పొందెను, ఇక కావుము, నేను అర్థింతు=నేను

ప్రార్థించెదను (ఉత్తరుడనిన మాట), నాయందు కరుణ నడవ, గట్టిపగర నడగించితె, ఏమి చెప్ప, అమోఘ వాంఛితుడనగుదు, హరివిగాక, నీవు నరమాత్రుడవె=సామాన్యుడవా, అని, యంత=సారధియైన ఉత్తరుడు, వినయ భక్తులతిశయిల్ల=పాద పద్మములకు ప్రణుతి గావించిన, అమ్మహాత్ముడు=అర్జునుడు, అతనిన్=ఉత్తరుని, ఆదరించె.

తాత్పర్యము : ఓ అతిదయాసముద్రుడా! నేనిదె నీకు శరణు వేడెదను. శాంతింపుము. ఆలోచించినచో నీకు సరి ఎవ్వరు లేరు. ఓ పార్థా! గర్వించి నీశక్తి తెలియక ఇట్లు ఎదిరించిన దుర్యోధనాదుల దోషమునకు తగిన ఫలము కలిగెను. నిన్ను ప్రార్థించుచున్నాను. నన్ను రక్షింపుము. నాయందు దయ చూపి బలవంతులైన శత్రువులను నశింపజేసితివి. ఇంక చెప్పెడిదేమున్నది. నా కోరికలెల్ల సిద్ధించెను. నీవు సాక్షాత్తు హరివిగాక సామాన్య మానవుడవా – అని సారధియైన ఉత్తరుడు భక్తి వినయములు హెచ్చుగా పాదపద్మములకు సాష్టాంగపడగా అర్జునుడు ఉత్తరుని ఆదరించెను.

తే. తదభిమతపద్ధతిని వారితరణలీల
పెంపు మీఱంగ దక్షిణాభిముఖగమన
మాచరించె మున్నెట్లట్ల హరివితతని
యంతయై నడపుచు నిజావ్యాహతేచ్ఛ. 72

రామా : తత్=ఆ సముద్రుని యొక్క, అభిమత పద్ధతిని=కోర్కె ప్రకారము (సేతువు గట్టి), వారి=నీటిని, తరణలీలన్=సులభముగా దాటుటకు, పెంపు మీరంగ=శోభతో కూడినవాడై, మున్ను+ఎట్లు+అట్ల=ఇంతకు ముందువలె, హరి వితతి=వానర సమూహమును, నియంతయై=నాయకుడై నడపుచు, నిజ+అవ్యాహత+ఇచ్ఛన్=తన అడ్డులేని కోరికతో, దక్షిణాది ముఖగమనము=లంక మీదికి ప్రయాణమును, ఆచరించె=చేసెను.

తాత్పర్యము : ఆ సముద్రుని కోరిక మేరకు సేతువును గట్టి జలములను

లీలగా దాటుటకు సౌలభ్యము కలుగగా ఇంతకు ముందువలె వానర సమూహమునకు నియామకుడై అడ్డులేని తన కోరిక నడచునట్లు దక్షిణ దిక్కు వైపు (లంకకు) కదలెను.

భారత : తదభిమత పద్ధతిని=ఉత్తరుడు కోరినట్లే, వారిత=వారింపబడిన, రణలీల=యుద్ధ విలాసము, పెంపు మీరగాన్=అతిశయింపగా, మున్నెట్లట్ల, నిజ వ్యాహతేచ్ఛ=తన బలమైన కోరికతో, యంతయై=సారథియై, హరివితతిని= గుఱ్ఱములను, నడపుచు, దక్షిణాభిముఖ గమనము=ఉత్తరము నుండి దక్షిణపు దిక్కునకు, ఆచరించె=కదలెను.

తాత్పర్యము : ఉత్తరుడు కోరిన విధముగా యుద్ధ విలాసమును వారించిన శోభతో మునుపటివలె తన ఎడతెగని కోరికతో సారథియై గుఱ్ఱములను నడపుచు దక్షిణ దిక్కునకు తిరిగెను.

సీ. సముచితసరణి ని ట్లమరవై రాటన
గరిమనశ్లాఘ్యంబుగాఁ గొని కడు
నెఱి దలిర్పఁ గలఁక నిర్ముక్తిధీరత
నందనభిద్యోతితాత్మ సత్ప్ర
భావతఁ బరఁగుచుఁ బాండురాజసుతులా
తతకీర్తివిభవుండు తద్విభుండు
తీర్ణాతికృచ్ఛ్రమహార్ణవుండుగ విని
వారితరిపుదర్పభారు లైన
తే. వారినాప్తులఁ గడు నంత గారవించెఁ
దత్పురీనాయకుఁడు నిజాస్థానమంట
పమున నలఘుప్రగల్భవాక్ప్రకటితస్వ
భావవర్తనులై పేర్చు ప్రథితబలుల. 73

రామా : సముచిత సరణిన్=తగిన రీతిలో, ఇట్లు, అమరవైర=రాక్షసుల

యొక్క, అటన గరిమను=గొప్ప సంచారమును, అశ్లాఘ్యంబుగాగొని=లెక్కసేయక, కడునెఱిదలర్పగ=మిక్కిలి నైపుణ్యముతో, లంక=లంకానగరము, నిర్ముక్త, ధీరతనందన్=తల్లడిల్లగా, అభిజ్యోతిత=ప్రకాశించుచున్న, ఆత్మసత్ ప్రభావతన్=తన మంచి ప్రభావముచే, పరగుచు=నడచుచు, పాండు=తెల్లనైన, రాజు=చంద్రుడు, సుతుల=వంటి పోలికగల, ఆతత కీర్తి విభవుడు=విస్తరించిన కీర్తి వైభవముగలవాడు, తత్ విభుండు=రాముడు, తీర్ణ=దాటబడిన, అతికృచ్ఛ్ర=మిక్కిలి ఘోరమైన, మహార్ణ వుండుగ=సముద్రము దాటినవాడుగా, వినివారిత=వారించబడిన, రిపుదర్పభారులైన వారిన్=శత్రువుల గర్వమణచగలవారిని, తత్పురీ నాయకుడు=రావణుడు, నిజాస్థాన మండపమున=తన ఆస్థానమండపమున, అలఘు ప్రగల్భ=గొప్ప పటుత్వముగల, వాక్+ప్రకటిత=మాటలను వెల్లడించు, స్వభావ వర్తనులై పేర్చు=స్వభావము కలిగి రాణించు, ప్రథితబలుల=బలముచే కీర్తి నొందినవారిని, ఆప్తులన్=స్నేహితులను, కడున్, అంత=అంతట, గారవించె.

తాత్పర్యము : ఈ విధముగా తగిన రీతిలో రాక్షసుల సంచారాధిక్యమును లెక్క చేయక మిక్కిలి శోభిల్లగా లంక తల్లడిల్లునట్లు తెల్లని చంద్రుని పోలికగల కీర్తి వైభవముగల రాముడు ఘోరమైన సముద్రమును దాటెనని విని ఆ లంకాధిపతియైన రావణుడు తమ ప్రగల్భ వాక్యములచే ప్రకటితమైన స్వభావ వర్తనముగల బలవంతులైన ఆప్తవర్గమును తన సభా మండపమున మిక్కిలి గౌరవించెను.

భారత : సముచిత సరణిని=ఇట్లు, వైరాటనగరి=విరాట నగరమును, మనశ్లాఘ్యంబుగా గొని=మనసునకు పొగడునట్లుగా, కడు నెఱిదలిర్ప=మిక్కిలి అందముగా, కలంక=భయముచే, నిర్ముక్త=విడువబడిన, ధీరతన్=ధైర్యముచే, అందున్=ఆ పట్టణమున, అనభిద్యోతిత=ప్రకాశింపని, ఆత్మసత్ ప్రభావతను=తమ గొప్ప ప్రభావమును గలవారై, పరగుచున్=ప్రవర్తించుచు, పాండురాజ సుతులు=పాండవులు, ఆ తతకీర్తివిభవుండు, తత్ విభుండు=విరటుడు, తీర్ణ=తరింపబడిన, కృచ్ఛ్ర+మహార్ణవుండుగా=మహాపదలనెడి సముద్రముగల వాడుగా, వినివారిత=మిక్కిలి నివారింపబడిన, రిపు=శత్రువుల యొక్క, దర్పభారులైనన్= గర్వాతిశయముగలవారైనను, వారిన్=వారిని, తత్ పురీనాయకుడు=విరటుడు, అలఘు

ప్రగల్భ వాక్ప్రకటిత స్వభావ వర్తనులై, పేర్చు, ప్రథితబలుల, అంతన్=కడు గారవించె.

తాత్పర్యము : ఇట్లు తగిన రీతిలో విరాటనగరముయొక్క మనసునకు స్తుతిపాత్రముగా చేసి మిక్కిలి అందముగా వెళ్ళి ఎవరు తెలిపినారో అనెడి భయము పొందిరి. ధైర్యమును వదలి ఆ పట్టణమున ప్రకాశింపని తమ సత్ప్రభావముకలవారై పాండవులు పరగు చుండిరి. ఆ పట్టణమునకు రాజైన విరటుడు మహాపదలనెడి సముద్రమును తరించి గర్వాతిశయము గలవారైనను శత్రువులను మిక్కిలి నివారించి ఆ పాండవులను తన కొలువ కూటమునందు ప్రగల్భ వాక్కులచే ప్రకాశింపచేయబడిన తమ స్వభావ వర్తనులు కలవారినిగా పాండవులను ఆప్తులవలె గౌరవించెను.

వ. ఇట్లు వివిధసంభావనాసంతోషితస్వాంతులం గావించి వారికిఁ దనకు నక్కాలంబున. 74

తాత్పర్యము : ఈ విధముగా అనేక రకములైన సంభావనలచే వారిని సంతోషపరచి ఆకాలమున వారికిని, తనకు –

కం. సమరాగ మనస్ఫూర్తికి
నమరువచోగతుల నరవరాత్మజునిప్రసం
గమయి తనకన్యయయు
క్తిమహితనయ నొసఁగ ననుమతి దలిర్పంగాన్. 75

రామా : సమర=యుద్ధము యొక్క, ఆగమనస్ఫూర్తికిన్=రాకకు, అమరు=తగిన, వచోగతులన్=మాటల తీరుచే, నరవరాత్మజుని=రాముని, ప్రసంగమయి=ప్రసక్తిచే, అన్య=శత్రువైన, నయ=నీతిగల (నీతి విరుద్ధమైన) యుక్తిన్=ఉపాయముచే, మహినయన్=సీతను, ఒసగను=విడువను, అను=అనెడి, మతి=మనస్సు, తనకు తలిర్పంగాన్=రావణునకు తోచగా.

తాత్పర్యము : యుద్ధమునకు వచ్చుచున్న రాముని ప్రసక్తి వచ్చి, నీతివిరుద్ధమైన ఆలోచనతో సీతను తిరిగి విడువను అను బుద్ధి రావణునకు కలుగగా –

భారత : సమరాగ=సమానమైన అనురాగముగల, మనస్స్ఫూర్తికిన్=మనసుగలవాడై, నర=అర్జునుని, వరాత్మజుని=కుమారుడైన అభిమన్యుని గూర్చి, వచోగతుల నమరు=మాటల సందర్భములో, ప్రసంగమయి=ప్రసంగముగాగ, తన కన్యను=తన కుమార్తె అయిన ఉత్తరను, అయయుక్తి=భాగ్య సంపదచే, మహిత=గొప్పదైన, నయ=నీతిగల దానిని, ఒసగన్=ఇచ్చుటకు, అనుమతి దలిర్పగాన్=అనుమతి లభించగా.

తాత్పర్యము : సమానమైన ప్రేమగల మనస్సుతో అర్జునుని కుమారుడైన అభిమన్యుని గూర్చి మాటల సందర్భములో ప్రసక్తిరాగా తన కుమార్తె అయిన ఉత్తరను, భాగ్యసంపదచే గొప్ప నీతిగల దానిని ఇచ్చుటకు అనుమతి పొడమగా –

కం. తనదుహిత కార్య పథవ
ర్తను లగువారుఁ దనకోర్కితమి గని యింపుల్
దనరార సుభద్రానం
దనవరణోత్సవము నడపఁ దగు నని పలుకన్. 76

రామా : తనదు=రావణుని యొక్క, హితకార్య పథవర్తనులగును=ఇష్టమైన పనులు చేయువారును, తన కోర్కి తమిగని=తన కోరిక యొక్క మోహమును చూచి, ఇంపుల్ తనరార=అందముగా కనిపించగా, సు=లెస్సయైన, భద్ర=శుభమును, ఆనంద=ఆనందమును కల్గి, నవ=కొత్తదైన, రణోత్సవము=యుద్ధక్రీడ, నడపన్ తగునని=నడపవచ్చునని, పలుకన్=పలుకగా.

తాత్పర్యము : రావణుని హితమును కోరి నడచువారును, అతని కోరిక తీవ్రతను గమనించి సొంపుగా లెస్స అయిన శుభమును, ఆనందమును కల్గిన నూతన యుద్ధక్రీడ నడపదగునని పలుకగా (తన ఆప్తుల మాటలచే రావణుడు దృఢోత్సాహుడయ్యెను)

భారత : తన దుహితకు=ఉత్తరకు, ఆర్యపథవర్తనులగువారును=సత్ప్రవర్తనగల పాండవులు, తన కోర్కె తమిగని=తన కోరికయందలి గాఢతను చూచి, ఇంపున్

తనరార=అందముగా, సుభద్రానందన=అభిమన్యునియొక్క, వరణోత్సవము= వివాహము, నడపదగునని=చేయవచ్చునని, పలుకన్=చెప్పగా.

తాత్పర్యము : ఉత్తరకు సత్ప్రవర్తనగల పాండవులు విరటుని కోరిక యందలి గాఢతను చూచి శుభప్రదముగా అభిమన్యుని వివాహము జరుపవచ్చునని చెప్పగా –

తే. తద్విధానంబునకు దృఢోత్సాహుఁ డయ్యెఁ
దనయకల్యాణ విధి ప్రయత్నమునఁ జేసి
రయముతో వారు నాత్మీయమయినమిత్ర
బంధుపరివారతతిఁ గూర్చి ప్రౌఢి మెఱయ. 77

రామా : తద్విథానంబునకున్=ఆ యుద్ధ ప్రక్రియకు, తన=రావణుని యొక్క, అకల్యాణవిధి=దురదృష్ట ప్రయత్నమునన్‌జేసి, ప్రయత్నముతో, వారు=రాక్షసులు, రయముతో=వేగముగా, ఆత్మీయమయిన మిత్రబంధుపరివార తతిన్‌గూర్చి= మిత్రులు, బంధువులు సేవకుల సముదాయమును చేర్చి, ప్రౌఢిమెరయన్=ధీరత్వముతో నుండగా, దృఢోత్సాహుడయ్యెన్=దృఢమైన ఉత్సాహము కలిగినవాడాయెను.

తాత్పర్యము : ఆ విధముగా రావణుని యుద్ధ ప్రక్రియకు తన దురదృష్టపు ప్రయత్నము వలన రాక్షసులు వేగముగా సన్నిహితులైన బంధుమిత్ర పరివారాదులను చేర్చి ధీరత్వముతో నుండగా రావణుడు దృఢమైన ఉత్సాహము కలవాడాయెను.

భారత : తద్విధానంబునకున్=వివాహ కార్యమునకు, విరటుడు, దృఢోత్సాహుడయ్యె=అధిక ఉత్సాహముకలవాడాయెను, వారును=పాండవులు, ఆత్మీయమయిన మిత్రబంధుపరివారతతిన్=బంధుమిత్ర పరివారములను, కూర్చి=పిలిపించి, ప్రౌఢిమెరయన్, తనయ=కుమారుడైన అభిమన్యుని, కల్యాణ విధి ప్రయత్నమున= వివాహ ప్రయత్నమును, అయముతో=శుభముగా, చేసిరి.

తాత్పర్యము : వివాహ ప్రక్రియకు విరాటుడు అధిక ఉత్సాహవంతుడాయెను. పాండవులును తమకు ఆత్మీయులైన బంధుమిత్ర పరివారమును పిలిపించి, ప్రౌఢిమతో అభిమన్యుని వివాహ కార్యప్రయత్నమును శుభముగా చేసిరి.

వ. అంతఁ బ్రతిపక్ష విజయంబునకు నుచితసమయం బగుట
భావించి. 78

తాత్పర్యము : అంతట ప్రతిపక్షమువారిని జయించుటకు తగిన సమయము వచ్చినదని భావించి –

కం. అతులితతేజుఁడు వైవ
స్వతసంతతి రాజవరుఁడు చతురనయ సమా
హృతఘనతర హరికుంజర
శతాంగవిస్ఫూర్తి శోభిసైన్యముతోడన్. 79

రామా : అతులితతేజుడు=మిక్కిలి తేజస్సుగల, వైవస్వతసంతతి= మనువంశము నందలి, రాజవరుడు=రాముడు, చతురనయ=మిక్కిలి నేర్పుతో, సమాహృత=కూర్పబడిన, ఘనతర=అత్యధికులైన, హరి కుంజరశత=వేలకొలది వానరుల, అంగవిస్ఫూర్తిన్= కదలికచే, శోభి=ఒప్పుచున్న, సైన్యముతోడన్=సేనలతో.

తాత్పర్యము : మహాపరాక్రమముగల రాముడు మిక్కిలి నైపుణ్యముగా కూర్చబడిన అత్యధికులైన వేలకొలది వానర సమూహపు కదలికచే ఒప్పుచున్న సేనలతో –

భారత : అతులిత తేజుడు, వైవస్వ సంతతి రాజవరుడు=మనువంశరాజైన ధర్మజుడు, చతురనయసమావృత=మిక్కిలి నైపుణ్యముగా సమీకరించిన, ఘనతర= గొప్పదైన హరి=గుర్రములు, కుంజర=గజములు, శతాంగ=రథముల యొక్క, విస్ఫూర్తిశోభన్=ప్రకాశించు శోభతో కూడిన, సైన్యము తోడన్.

తాత్పర్యము : మహా పరాక్రమవంతుడైన ధర్మజుడు మిక్కిలి నిపుణతతో కూర్చిన రథగజ తురగాదుల ప్రకాశముతో శోభిల్లు సైన్యముతో –

విశేషణము : శతాంగ – 'శతాంగస్స్యందనోరథః' – అని అమరము.

కం. నడచి యుపప్లావ్యపురం
బు డగ్గఱి వనప్రదేశముల బలచయముల్
విడియించి తనప్రతాపము
కడునఖిలదిగంచలములఁ గ్రమ్ముకొనంగన్. 80

రామా : నడచి, ఉపప్లావ్య=చుట్టు సముద్రముగల పురము - లంకను, దగ్గరి=సమీపించి, వన ప్రదేశముల, బలచయముల్=వానర సేనలను, విడియించి=నిలిపి, కడునఖిల=మిక్కిలి, దిగంచలముల=దిక్కుల అంచులయందు, తన ప్రతాపము, క్రమ్ముకొనంగన్=వ్యాపింపగా,

తాత్పర్యము : రాముడు వానర సేనలతో చుట్టూ సముద్రముగల లంకను సమీపించి వన ప్రదేశములలో సేనాసమూహమును విడియించి అన్ని దిగంతములయందును తన ప్రతాపము వ్యాపింపగా -

భారత : నడచి, ఉపప్లావ్యపురంబు=ఉపప్లావ్యమను పురంబును, దగ్గరి, మిగతా సమానము.

తాత్పర్యము : ధర్మజుడు ఉపప్లావ్యపుర సమీపమునకు నడచి వన ప్రదేశములందు సేనలను విడియించి, తన ప్రతాపము మిక్కిలిగా వ్యాపింపగా -

వ. అమ్మహానుభావుం డప్పుడు. 81

రాముడు / ధర్మజుడు

కం. నీతిమయిఁ దనకు భూమిజ
నాతతపరివాద భరనిరాతంకాత్ముం
డై తిరుగ విడువ కాజికిఁ
గౌతూహలి యగువిపక్షుగర్వము వినియెన్. 82

రామా : నీతిమయిన్=నీతితో, ఆతత=వ్యాపించిన, పరివాదభర=నిండిన

అపవాదముపట్ల, నిరాతంక=భయములేని, ఆత్ముండై=ఆత్మకలవాడై, తనకు= రామునకు, భూమిజన్=సీతను, తిరుగ విడువక=అప్పగింపక, ఆజికి=యుద్ధమునకు, కౌతూహలియగు=వేడుకగల, విపక్షు గర్వము=రావణుని గర్వము, వినియెన్=వినెను.

తాత్పర్యము : నీతి మార్గములో తనపై వ్యాపించిన అపవాదాతిశయమునందు భయములేని ఆత్మగలవాడై తనకు సీతను అప్పగింపక యుద్ధమునందు వేడుకగల రావణుని గర్వమును గూర్చి రాముడు వినెను.

భారత : నీతిమయిన్=నీతి మార్గములో, తనకు=ధర్మజునకు, భూమిన్= భూమిని, జన=జనులచే, ఆతత=వ్యాపించిన, పరివాదభర, నిరాతంకాత్ముండై, తిరుగ విడువక, మిగతా సమానము. విపక్షుగర్వము=దుర్యోధనుని గర్వము.

తాత్పర్యము : నీతివంతముగా తమకు భూభాగమును తిరిగి సమర్పించక జనులలో విస్తరించిన అపవాద భయము లేక యుద్ధమునకు వేడుకపడు దుర్యోధనుని గర్వమును గూర్చి ధర్మజుడు వినెను.

చం. సదయతఁజేసి హింసలకుఁ జాలక యింకను మంచిమాటఁ దే
ర్చెద నని రాయబార మనిచెం దగ సంధివిధానచింతనం
గదురుచిరాభివర్ణ్యశమ గౌరవ కీర్తిజగంబు నిండఁగో
విదనుతనీతిదక్షు హరివీరవరేణ్యువచోవిచక్షణున్. 83

రామా : సదయతజేసి=దయతో కూడినవాడై, హింసలకు చాలక=హింసాపద్ధతి నవలంబించక, ఇంకను, మంచి మాటను, తేర్చెదనని=ఉద్ధరించెదనని, సంధి విధానచింత=సంధి చేసుకొను పద్ధతిలో, అంగదు=అంగదుని, రుచిరాభివర్ణ్య= అందముగా పొగడదగిన, శమగౌరవకీర్తి=దయ తలచుచున్నాడనెడు కీర్తి, జగంబునిండన్=లోకమంతట వ్యాపించగా, కోవిదనుత=పండితులచే పొగడబడు, నీతిదక్షున్=నియమములందు దక్షతగలవానిని, వచో విచక్షుణున్=మాట నేర్పరిని, హరివరేణ్యున్=వానరశ్రేష్ఠుని, తగ రాయబారమనిచెన్=తగిన విధముగా రాయబారమునకు పంపెను.

తాత్పర్యము : రాముడు దయతో రావణుని హింసలను లెక్కింపక ఇంకను మంచి మాటలతో ఉద్ధరించెదనని సంధి కోసమై గొప్పగా వర్ణింపదగిన ఓర్పుతో కూడిన గౌరవముచే వచ్చిన కీర్తి లోకమంతయు నిండగా (రావణుని వంటి ద్రోహిని దయదలచుచున్నాడనెడు కీర్తి) పండితులచే పొగడబడు నీతికోవిదుడు, మాట నేర్పరియు అయిన వానరశ్రేష్ఠుని తగిన రీతిలో రాయబారము పంపెను.

భారత : సదయతజేసి, హింసలకు చాలక, ఇంకను మంచిమాట తేర్చెదనని, తగ సంధి విధాన చింతనన్, కదురు=పొందెడి, చిరాభివర్ణ్య=మిక్కిలి పొగడదగిన, శమగౌరవకీర్తి, జగంబునిండ, కోవిదనుత, నీతిదక్షు, వచోవిచక్షుణున్, వీరవరేణ్య=వీరులలో శ్రేష్ఠుని, హరిన్=కృష్ణుని, రాయబార మనిచెన్.

తాత్పర్యము : ధర్మజుడు హింసలను లెక్కింపక దయతోకూడిన వాడై ఇంకను మంచి మాటలతో పనిని సాధించెదమని తగిన రీతిలో సంధి విధానమను ఆలోచనను పొంది మిక్కిలి పొగడదగిన దయా గౌరవముచే కలిగిన కీర్తి లోకములు వ్యాపింపగా పండితులచే పొగడబడు నీతిదక్షుని, మాట నేర్పరిని, వీరులలో శ్రేష్ఠుడు అయిన శ్రీకృష్ణుని రాయబారమునకు పంపెను.

తే. అతఁడు నుచితగతి భ్రాజియై చని ప్రభు
చరితదుర్ణయవ్యధమానకరిపురజను
లనిశమును గుందువా రంతఁ దనదురాక
కార్య మెంచి యానీతిక కరము మెచ్చ. 84

రామా : అతడును=అంగదుడును, ఉచితగతి=తగిన రీతిలో, భ్రాజియైచని=ప్రకాశవంతముగా వెళ్ళి, ప్రభుచరితదుర్ణయ=రావణుడు చేసిన దోషముతో కూడిన, వ్యధ=బాధను, మానక=విడువక, హరిపుర=లంకయందున్న, జనులు, అనిశమును=నిరంతరము, కుందువారు=బాధపడువారు, అంతన్, తనదురాక=అంగదుని రాక, కార్యమెంచి=పనిని గమనించి, ఆ నీతిక=రాయబార నీతికి, కరము మెచ్చ=మిగుల మెచ్చగా – ముందరికి అన్వయము.

తాత్పర్యము : అంగదుడు తగిన రీతిలో ప్రకాశవంతముగా లంకకు వెళ్ళి రావణుడు చేసిన దోషముతో కూడిన బాధను విడువక, లంకలోనున్న జనులు నిరంతరము బాధపడువారు తన రాక వలన జరుగు కార్యమును గణించి రాయబార నీతిని మిక్కిలి ప్రశంసింపగా –

భారత : అతడు=కృష్ణుడు, ఉచితగతి భ్రాజియైచని, ప్రభుచరిత=దుర్యోధనుడు చేసిన, దుర్ణయవ్యథమాన=తప్పుడు పనులచే బాధపడుచున్న, కరిపుర జనులు=హస్తినాపుర వాసులు – మిగతా సమానము.

తాత్పర్యము : కృష్ణుడు తగిన రీతిలో ప్రకాశవంతముగా వెళ్ళి దుర్యోధనుడు చేసిన ద్రోహపు పనులచే నిరంతరము బాధపడువారు తనరాక రాయబారము కోసమని భావించి ఆ నీతిని మిక్కిలి ప్రశంసింపగా –

ఉ. సాధుకృత ప్రవేశుఁ డయి సాహసవత్తర చిత్తశత్రు దు
ర్యోధను నింద్రజిద్గురు మహోజ్జ్వల వైభవగర్వితు న్బలో
త్సేధసముద్ధతుం డగువిధిం గృతదర్శనుఁ డైనవాని మా
నాధికుఁ జూచి యిట్టను మహాసభలో జను లందఱు న్వినన్. 85

రామా : సాధు=లెస్సగా, కృతప్రవేశుడయి=ప్రవేశించి, సాహసవత్తర=మిక్కిలి సాహసవంతమైన, చిత్తశత్రు=మనసుగల శత్రువులకు, దుర్యోధను=పోరశక్యముగాని వానిని, ఇంద్రజిత్ గురుని=రావణుని, మహోజ్జ్వల=గొప్ప ప్రకాశవంతమైన, వైభవగర్వితున్=విభవముతో గర్వించినవానిని, బలోత్సేధ=బలౌన్నత్యముచే, సముద్ధతుండగువిధిన్=గర్వించిన రీతిలో, కృతదర్శనుడైనవాని=తనను (అంగదుని) చూచిన, మానాధికున్=అభిమానవంతుడైన రావణుని చూచి, మహాసభలో, జనులందరున్, వినన్, ఇట్టను=ఇట్లనును.

తాత్పర్యము : లెస్సగా ప్రవేశించిన వాడై మిక్కిలి సాహసవంతుడైన మనసుగల శత్రువునకు పోరశక్యముగాని వానిని ప్రకాశవంతమైన వైభవముచే గర్వించిన వానిని, బలౌన్నత్యముచేత గర్వించిన వానిని, తనను చూచిన అభిమానధనుడైన రావణుని

చూచి మహాసభలో జనులందరు వినునట్లుగా ఇట్లనెను.

భారత : సాధు=సత్పురుషులచే, కృతప్రవేశుడయి=స్వాగతింపబడి, సాహసవత్తర=మిక్కి యుద్ధతములైన, చిత్తశత్రు=చిత్తశత్రువులు గలవానిని, ఇంద్రజిత్=ఇంద్రుని జయించిన, గురు=అధికమైన, మహా=ఉత్సవములచే, ఉజ్వల వైభవ=ప్రకాశించు వైభవముచే, గర్వితుని=గర్వించినవానిని, బలోత్సేధ సముద్ధతుండగు విధిన్, కృతదర్శనుడైనవాని=తనను చూచిన, మానాధికున్=అభిమానధనుడైన, దుర్యోధనున్=దుర్యోధనుని, చూచి, మహాసభలో, జనులందరున్ వినన్, ఇట్టను.

తాత్పర్యము : సత్పురుషులచే స్వాగతించబడి మిక్కిలి యుద్ధతములైన మానసిక శత్రువులుగల వానిని, ఇంద్రుని గెలిచిన అధికవైభవముచే గర్వించినవానిని బలౌన్నత్యముచే మిక్కిలి ఉద్ధతుడైన శ్రీకృష్ణుని దర్శించిన అభిమానధనుడైన దుర్యోధనుని చూచి కౌరవ సభలో జనులందరు వినునట్లుగా ఇట్లనెను.

తే. క్షాంతిజయశోభిరాముఁ దనంతబలుఁడు
ధర్మసూతి యిప్పుడును నీదౌష్ట్య మాత్మ
నెన్నక నయోక్తి నినుఁ దేర్ప నన్నుఁ బనిచె
వినుము నామాట దుర్మదావేశ ముడిగి. 86

రామా : క్షాంతిజయ=శాంతి జయములచే, శోభి=ఒప్పెడువాడు, రాముడు, అనంతబలుడు=మిక్కిలి బలముగలవాడు, ధర్మసూతి=ధర్మమునకు కారణభూతుడైన వాడు, ఇప్పుడును, నీ దౌష్ట్యము=నీ దుర్మార్గమును, ఆత్మనెన్నక=మనసులో లెక్కింపక, నయోక్తిన్=మంచి మాటలచే, నిను తేర్పన్=నిన్ను ఉద్ధరించుట కొరకు, నన్నున్+పనిచె=నన్ను పంపెను, దుర్మదావేశము+ఉడిగి=అహంకారముతో కూడిన ఆవేశమును వదలి, నామాట వినుము.

తాత్పర్యము : శాంతి జయములచే శోభిల్లు ధర్మమునకు కారణభూతమైన, అనంత పరాక్రముడైన రాముడు ఇప్పుడు కూడ నీ దుర్మార్గమును మనసులో లెక్కింపక

నయమైన మాటలచే నిన్నుద్ధరించుటకు నన్ను పంపెను. అహంకారపూరితమైన ఆవేశమును వదలి నామాట వినుము - అని అంగదుడనెను.

భారత : క్షాంతిజ=శాంతి వలన పుట్టిన, యశః=కీర్తిచే, అభిరాముడు= శోభిల్లువాడు, అనంతబలుడు, దర్మసూతి=ధర్మజుడు మిగతా సమానము.

తాత్పర్యము : "శాంతి వలన కలిగిన కీర్తిచే శోభిల్లు అనంతబల సంపన్నుడు అయిన ధర్మజుడు ఇప్పుడు కూడ నీ దుర్మార్గమును మనసులో లెక్కింపక నీతివర్తనచే నిన్ను తేర్చుటకు నన్ను పంపెను. దురహంకారముతో కూడిన ఆవేశమును వదలి నామాట వినుము" అని కృష్ణుడు పలికెను.

చం. నియతముగాఁగ నీ విపుడు నిన్నును నీవిభవంబు నీమహా
న్వయమును గాచికోవలసినన్ మగుడన్ విను మట్ల విక్రమ
క్రియమయి మాయచే నపహరించిన భూమిజనాదరార్హ ని
శ్చయుఁడ దగునన్న రేశ్వరునిశాసనమిట్టిద నీకుఁ జెప్పితిన్. 87

రామా : నీవు=రావణా! నీవు, నియతముగాగ=క్రమము తప్పక, ఇపుడు, నిన్నును, నీ విభవంబు=నీ సంపదలను, నీ మహాన్వయమును=నీ గొప్ప వంశమును, కాచికోవలసినన్=రక్షించుకోదలచినచో, అట్ల=ఆ విధముగా, విక్రమ క్రియమయి= పరాక్రమముచే, మాయచే, నపహరించిన, భూమిజను=సీతను, మగుడన్విడు=తిరిగి విడువుము, ఆదరార్హ=ఆదరింపదగిన, నిశ్చయుడగు=నిశ్చయముగల, అన్నరేశ్వరుని= ఆ రాముని, శాసన మిట్టిద=శాసనము ఇదే, నీకు చెప్పితిన్.

తాత్పర్యము : ఓ రావణా! నీవిపుడు క్రమముగా నిన్ను, నీ వైభవమును, నీ గొప్ప వంశమును రక్షించుకోదలచినచో ఆ విధముగా పరాక్రమము చూపి మాయచే అపహరించిన సీతను తిరిగి విడువుము. ఆదరమునకు పాత్రుడైన నిశ్చయ బుద్ధిగల ఆ రాముని శాసనము ఇదేనని నీకు చెప్పితిని.

భారత : అంతా సమానము. భూమి=భూమిని (రాజ్యమును).

తాత్పర్యము : ఓ దుర్యోధనా! క్రమముగా నీవు ఇప్పుడు నిన్ను, నీ సంపదను నీ గొప్ప వంశమును రక్షించుకోదలచినచో ఆ విధముగా పరాక్రమముతో కూడిన మాయాజూదమున అపహరించిన రాజ్యమును తిరిగి వదలుము. ఆదరపాత్రుడైన ఆ ధర్మజుని శాసనము ఇదేనని నీకు చెప్పితిని.

కం. భీమార్జున బాహుబలో
ద్దామత నీ వెఱిఁగినదియ తజ్జయశాలిన్
దా మిక్కిలి శౌర్యోన్నతి
చే మించినమేటి యతనిఁ జెనకి బ్రతికెదే. 88

రామా : భీమ=భయంకరమైన, అర్జున=కార్తవీర్యార్జుని యొక్క, బాహుబలోద్దామత=భుజశక్తి, నీవెరిగినదియ=నీకు తెలిసినదే, తత్+జయశాలిన్=ఆకార్తవీర్యుని జయించిన పరశురాముని, తాన్=రాముడు, మిక్కిలి, శౌర్యోన్నతిచేన్=పరాక్రమముచే, మించిన=జయించిన, మేటి=రఘురాముడు, అతనిన్=అతనిని, చెనకి=ఎదిరించి, బ్రతికెదే=బ్రతుకగలవా.

తాత్పర్యము : భయంకరమైన కార్తవీర్యార్జునుని భుజశక్తి నీకు తెలిసినదే (ఆయనతో యుద్ధము చేసినావు గనుక). ఆ కార్తవీర్యుని జయించిన పరశురాముని తన పరాక్రమముచే మించినవాడు రఘుపతి. అతని నెదిరించి బ్రతుకగలవా!

భారత : భీమ, అర్జున, బాహుబలోద్దామత, నీ వెరిగినదియ, (ఘోషయాత్రా గోగ్రహణములందు), తజ్జయ=వారి జయములచే, శాలిన్, తాన్, మిక్కిలి, శౌర్యోన్నతిచే మించిన, అతనిన్=ఆ ధర్మజుని, చెనకి బ్రతికెదే.

తాత్పర్యము : భీమార్జునుల బాహుబల సంపద నీకు తెలిసినదే! వారి జయములచే, మిక్కిలి పరాక్రమముచే అధికుడైన మేటి ధర్మజుడు. అతనిని ఎదిరించి బ్రతుకగలవా!

చం. విను పలుమాట లేల యలవేలుపు మూఁకలలోన నేనియున్
వెనుకకు వీఁగఁబాఱకొక వీరుఁడు సైపఁగలాఁడె యల్క చూ
పినకులుఁ డించుకంత సమపేక్షితసంగర కేలియై నిగు
డ్చినఁబటు ఘోరసాయక విజృంభణ మన్యులకోర్వ నెట్లగున్. 89

రామా : పలుమాటలేలవిను=పెక్కుమాటలెందుకు వినుము. అల=ఆ, వేలుపు మూకల లోన నేనియున్=దేవతా సమూహములోనైనను, వెనుకకు వీగబాఱక= వెనుకకు ఓడి పారిపోక, ఒక వీరుడు=ఒక వీరుడైనను, సైపగలాడె=ఓర్చుకొనగలడా, అల్క చూపి=కోపించి, ఇనకులుడు=రాముడు, ఇంచుకంత=ఏ కొద్దిపాటియైనను, సమపేక్షిత=కోరిన, సంగరకేలియై=యుద్ధక్రీడను కోరినవాడై, నిగుడ్చిన=వదలిన (ఎక్కుబెట్టిన), పటుఘోర=మిక్కిలి తీవ్రమైన, సాయక విజృంభణము=బాణముల విహారము, అన్యులకున్=ఇతరులకు, ఓర్వనెట్లగున్=ఎట్లు ఓర్చుకొనగలరు.

తాత్పర్యము : రావణా! పెక్కుమాటలేల? వినుము. కోపించిన రాముడు కొద్దిపాటి యుద్ధక్రీడను కోరినవాడై ఎక్కుపెట్టిన తీవ్ర బాణ విజృంభణను దేవతా సమూహములో ఒక వీరుడైనను ఓడి వెనుకకు పాఱక ఓర్చుకొనగలరా? ఇతరులు ఓర్చుకొనుట ఎట్లగును.

భారత : పలుమాట లేల విను, అల్క చూపి=కోపించి, నకులుడు, ఇంచుకంత=కొద్దిపాటి, సమపేక్షిత సంగరకేలియై, నిగుడ్చిన, పటుఘోరసాయక, విజృంభణము, అల వేలుపు మూకల లోననేనియున్, వెనుకకు వీగబారక, ఒక వీరుడు సైపగలాడె, అన్యుల కోర్వనెట్లగున్.

తాత్పర్యము : దుర్యోధనా! పలుమాటలేల వినుము. కోపించిన నకులుడు ఇంచుక యుద్ధక్రీడపై ఆసక్తి కలిగి తీవ్రమైన బాణ సముదాయమును వదలినచో ఆ దేవతా సమూహములోని ఒక వీరుడైనను వెనుకకు భయపడి పాఱక ఓర్చుకొనగలడా! మరి ఇతరులకు ఎట్లు ఓర్వనగును.

కం. తదనుజుని బాహుబల సం
పదయును సాయకవిహార పాండిత్య మహా
భ్యుదయమును బంటుతనమును
మదిఁ దలఁచిన గుండె వగులు మార్తుర కెల్లన్. 90

రామా–భారత=అర్థము సమానము.

తదనుజుని=లక్ష్మణుని/పాండవుల బాహుబల సంపదయును=భుజశక్తియును, సాయక విహార పాండిత్య మహాభ్యుదయమును=బాణములు వదలుటయందలి నైపుణ్యమును, బంటుతనమును=పరాక్రమమును, మది దలచిన=మనస్సులో భావించినంతనే, మార్తురకెల్లన్=శత్రువులందరికిని, గుండె పగులు.

తాత్పర్యము : ఆ లక్ష్మణుని/పాండవుల బాహుబల సంపదయు, బాణములు వదలు నైపుణ్యమును, పరాక్రమమును మనస్సున ఆలోచించి నంతనే శత్రువుల గుండె పగులును.

ఉ. నీవు మదుక్తనీతి మది నిల్పుము జీవితరక్షణార్థి వై
రావణదంతి వాహను సురప్రభు గెల్చిన గెల్వ వచ్చు దు
ర్భావవిచేష్ట మానకురు రాజకుమారక భీమబాహులీ
లావిధి కగ్గ మైన నవిలంఘ్యమునాకము సంధి మేలగున్. 91

రామా : రావణ=రావణా! నీవు, మదుక్తనీతి=నేను చెప్పిన నీతిని, జీవితరక్షణార్థివై=జీవితమును నిలుపుకొనువాడవై, మదినిల్పుము=మనస్సు పెట్టుము, దంతివాహను=ఏనుగును వాహనముగాగల, సురప్రభున్=ఇంద్రుని, గెల్చిన=గెలవవచ్చు, దుర్భావ=దుష్ట స్వభావము యొక్క, విచేష్టమానక=పనిని వదలి, ఉరురాజకుమారక=గొప్ప రాముని, భీమ=భయంకరమైన బాహులీలావిధికి=భుజశక్తికి, అగ్గమైన=లోనైనచో, నాకము=స్వర్గము, అవిలంఘ్యము=దాటరానిది, సంధి మేలగున్.

తాత్పర్యము : రావణా! నీవు నీ మదిలో నేను చెప్పెడి మాటలు ప్రాణములు కాపాడుకొనుటకై నిలుపుము. నీవు ఐరావతము వాహనముగా గల ఇంద్రునైనను గెలిచిన గెలువవచ్చును. నీ మనస్సులోని చెడు భావముల చేష్టలు మానుము. గొప్పవాడైన రాముని బాహువిలాసమును ఎదిరించినచో స్వర్గము దాటరానిదౌను. సంధి చేసికొనుట మేలగును.

భారత : కురురాజకుమారక!=దుర్యోధనా! మదుక్తనీతి, జీవిత రక్షణార్థి, వైరావణ, దంతి=ఐరావతము, వాహను=వాహనముగాగల, సురప్రభు, గెల్చిన గెల్వవచ్చు=మిగతా సమానం.

తాత్పర్యము : దుర్యోధనా! నీ జీవితమును రక్షించుకొన గోరి నా మాటలను వినుము. ఐరావతము వాహనముగాగల ఇంద్రునైనను గెలిచిన గెలువవచ్చును. నీ మదిలో చెడు భావములు వదలుము. భీముని బాహుపరాక్రమమును ఎదిరించినచో స్వర్గము దాటరానిదగును. సంధి మేలగును.

వ. అను పల్కు లాకర్ణించి యా దురాగ్రహగ్రస్తుండు తత్సమయ
సముద్దీపితకోపాటోపంబు లోలోపలన యడంచి కొనుచు
శుష్కహసితంబు ముఖంబునకుం దెచ్చుకొని. 92

రామా+భారత – సమానము.

అనుపల్కులు, ఆకర్ణించి=విని, ఆ దురాగ్రహగ్రస్తుండు=రావణుడు / దుర్యోధనుడు, తత్+సమదు=ఆ సమయమున కలిగిన, సముద్దీపిత కోపాటోపంబు= అధికమైన కోపమును, లోలోపలన, అడంచికొనుచు=అణచుకొనుచు, శుష్క హసితంబు=వ్యర్థపు నవ్వును ముఖంబునకున్, తెచ్చుకొని.

తాత్పర్యము : అను పలుకులను విని ఆ దురాగ్రహముతో నిండిన రావణుడు/ దుర్యోధనుడు ఆ సమయమునందు కలిగిన అధిక కోపమును లోలోపల అణచుకొనుచు వ్యర్థపు నవ్వును ముఖముపై తెచ్చుకొని –

కం. కొలఁది గన కెట్టివారుం
బెలుచన దవుదవ్వులందు బెదరించియ మూ
లల వేయించికొనంగాఁ
దలఁచెద రిది కాలగుణమొ దైవఘటనయో. 93

రామా+భారత సమానము : కొలదిగనక=తమ అల్పత్వమును తెలిసికొనలేక, ఎట్టివారును, పెలుచన=ఆటోపముతో, దవుదవ్వులందు=దూరదూరముగా, ఎదిరించియ=బెదిరించి, మాలల వేయించికొనంగా తలచెదరు=ఆధిపత్యమును కోరుకొనెదరు. ఇది కాలగుణమొ=ఇది కాలమాహాత్మ్యము, దైవఘనటయో=దైవ సంకల్పమో.

తాత్పర్యము : తమ అల్పత్వమును తెలిసికొనలేక ఆటోపముతో దూరదూరములలో నిలిచి బెదిరించి ఆధిపత్యమును కోరుకొనెదరు. ఇది కాలమాహాత్మ్యమో లేక విధి సంకల్పమో!

వ. అని యాదూతకృత్యధౌరేయు నుపలక్షించి. 94

రెంటికి సమానము –

తాత్పర్యము : అని ఆ దూతకార్య నిర్వహణకు వచ్చిన అంగదుని / కృష్ణుని చూచి –

చం. బలుములు సూపి యిట్టు నటుఁ బల్కితి వెట్టిహరీ పరోక్తముల్
వలుకనె కానిబుద్ధి మఱి పాఱదు నిన్నతఁ డుర్విపాలుగా
వలసి యి టాడఁ బంపె విడువన్ మహిజన్మముఁ బౌరుషంబు ని
ర్మల ధృతియుం బొగడ్తగన మార్కొన రమ్మను చూచె దన్నియున్.

రామా : వెట్టి హరీ!=వెట్టివానరా!, బలుములు సూపి=పరాక్రమములను చూపి, ఇట్టునటు పల్కితి, ఇరుపక్షములను గూర్చి తెలిపితివి, పరోక్తముల్=ఇతరుల మాటలు, పలుకనె కాని=చెప్పుటయే కాని, బుద్ధిమరి పారదు=నీ బుద్ధి స్వయముగా

పని చేయదు, నిన్ను=అంగదుని, అతడు=రాముడు, ఉర్విపాలుగావలసి=నేలపాలు గావలసి, ఇటాడబంపె=ఈ విధముగా మాట్లాడుటకు బంపెను, మహిజన్=సీతను, విడువన్=వదలను, మము=మమ్ములను, పౌరుషంబు, నిర్మల ధృతియున్=స్వచ్ఛమైన ధైర్యముతో, పొగడ్తగన్=ప్రశంసించదగినట్లుగా, మార్కొన రమ్మను=ఎదిరించుటకు రమ్మనుము, అన్నియున్=చూచెద.

తాత్పర్యము : ఓ వెట్టి వానరా! ఉభయ పక్షముల బలపరాక్రమములను గూర్చి మాట్లాడితివి. ఇతరుల మాటలు వల్లించుటయేగాని నీ బుద్ధి స్వయముగా పని చేయదు. నిన్ను రాముడు నేల పాలుగావలసి ఈ విధముగా మాట్లాడుటకు పంపెను. సీతను నేను వదలను. పౌరుషము, ధైర్యము పొగడ్తకెక్కునట్లుగా మమ్మెదిరించుటకు రమ్మనుము. అన్నియు నేను చూచెదను.

భారత : వెట్టిహరీ=వెట్టి కృష్ణా! మిగతా సమానము – అతడు=ధర్మజుడు, ఉర్విపాలు=భూభాగమును, మహి=భూమిని, విడువన్=ఇవ్వను, జన్మము, పౌరుషము, నిర్మల ధృతి, మిగతా సమానము.

తాత్పర్యము : ఓ వెట్టికృష్ణా! నీవు ఉభయపక్షముల సైన్యమును గూర్చి పలికితివి. ఇతరుల మాటలు వల్లించుటయేగాని, నీ బుద్ధి స్వయముగా నడువదు. నిన్ను ఆ ధర్మజుడు భూభాగము (రాజ్యభాగము) కావలెనని యిట్లు మాట్లాడుటకు పంపెను. నేను భూమి పాలు ఇవ్వను. తమ జన్మము, పరాక్రమము, ధైర్యము పొగడ్తకెక్కునట్లుగా మమ్ము ఎదిరించుటకు రమ్మనుము. ఆపైన అన్నియు చూచెదను.

ఉ. కొండొకయుండు చోటువలెఁ గొంకక బింకముతో నరుండు భీ
ముండని నీవు మాటికి సమున్నతి నెన్నెదు కర్ణభీష్మ కో
దండగురు ప్రతాపవితత ప్రథనప్రథ నొప్పు మధ్యలో
ద్దండత యించు కైన మదిఁ దార్ప విదేమిటినేర్పు సెప్పుమా. 96

రామా : అంగదా!, కొండొక యుండుచోటువలె=రాక్షస రాజ్యములో ఉన్నానని, కొంకక=భయపడక, బింకముతో=పట్టుదలతో, నరుండు=సామాన్య మానవుడు,

భీముండని=పరాక్రమవంతుడని, నీవు, మాటికి=మాటిమాటికీ, కర్ణభీష్మ=చెవులకు కఠోరముగా వినిపించు, కోదండ గురుప్రతాప=రాముని కోదండము యొక్క గొప్ప పరాక్రమమును, సమున్నతి నెన్నెదు=గొప్పగా పలికెదవు, వితతప్రథన ప్రథన్=విస్తరించిన యుద్ధ ప్రసిద్ధిచే, ఒప్పు, మత్+బలోద్దండత=నా పరాక్రమమును, ఇంచుకైన=కొద్దిగానైన, మదిదార్పవు=మనసులో భావించవు, ఇదేమిటి నేర్పు చెపుమా?=ఇది యేమి తెలివితేటలో చెప్పుము.

తాత్పర్యము : అంగదా! ఎలుగని చోటని కొద్దిగా కూడ భయపడక బింకముతో సామాన్య మానవుడు భయంకరుడని నీవు మాటిమాటికి కర్ణ కఠోరములైన రాముని కోదండ ప్రతాపమునే గొప్పగా చెప్పెదవు. విస్తారమైన యుద్ధ ప్రసిద్ధిచే ఖ్యాతికెక్కిన నా బల పరాక్రమములను కొద్దిగా కూడా మనసున భావించవు. ఇదేమి నేర్పు? చెప్పుము.

భారత : ఒండు చోటువలె=ఎలుగని చోటువలె, కొండొక=కొంచెము కూడ బింకముతో, నరుండు భీముండని=అర్జునుడు, భీముడు అని, మాటికి సమున్నతి నెన్నెదు. కర్ణ భీష్మ=కర్ణుడు భీష్ముల, కోదండగురు=ద్రోణాచార్యుల యొక్క ప్రతాప వితత ప్రథన పథన్=ప్రతాపాతిశయముగల యుద్ధ ప్రసిద్ధిచే, మిగతా సమానము.

తాత్పర్యము : శ్రీకృష్ణా! ఎలుగని చోటువలె కొంచెము కూధ భయపడక బింకముతో భీమార్జునలని నీవు మాటి మాటికి గొప్పలు చెప్పెదవు. కర్ణ భీష్మద్రోణాదుల పరాక్రమముగల యుద్ధ ప్రసిద్ధిచే నొప్పు నా బల పరాక్రమములను, కొద్దిగా కూడ మనసులో ఊహించవు. ఇదేమి నేర్పు చెప్పుము.

చ. అనుటయు నమ్మదాంధునకు నాహరి యిట్లను నాదుమాట నీ
మనమున కిప్పు డొప్పగునె మత్తవిరోధివరూధినీ సతుల్
పెనుకువ దక్కి చిక్కువడ భీమధనంజయభాసురప్రతా
పనవ సమృద్ధితోఁ గదియుబల్లిదు నావిభుఁ జూచునంతకున్. 97

రామా : అనుటయు=అనగా, అమ్మదాంధునకు=రావణునకు, ఆ

హరి=అంగదుడు, ఇట్లను, నాదుమాట, నీ మనమునకు, ఇప్పుడు+ఒప్పగునె=ఇప్పుడు సమ్మతించునా, మత్త విరోధి=మదించిన శత్రువుల యొక్క, వరూధినీ సతుల్=సేనా సమూహములు, పెనుకువ తక్కి=బలము తగ్గి, చిక్కువడన్=చిక్కుకొనగా, భీమ=భయంకరమైన, ధనంజయ=అగ్ని సమానమైన, భాసుర ప్రతాప=కాంతివంతమైన పరాక్రమము యొక్క, నవసమృద్ధితో=కొత్త వైభవముతో, కదియు=ఎదుర్కొను, బల్లిదున్=పరాక్రమవంతుడైన, నా విభున్=రాముని, చూచునంతకున్=చూచు నప్పటికి.

తాత్పర్యము : అట్లు పలికిన రావణునితో అంగదుడు ఇట్లనెను. నా మాటలు నీ మనస్సున కిప్పుడు సరిగా తోచవు. మదించిన శత్రుసేనాసమూహము బలము తగ్గి చిక్కుపడి భయంకరమైన అగ్ని సమానమైన ప్రకాశవంతమైన ప్రతాప నూతన సమృద్ధితో ఎదుర్కొను బలిష్ఠుడైన ఆ స్వామిని చూచునప్పటికి –

భారత : అనుటయు, అమ్మదాంధునకు=దుర్యోధనునకు, ఆ హరి=కృష్ణుడు, ఇట్లనున్, మత్తవిరోధివరూధినీసతుల్, పెనుకువదక్కి, చిక్కువడు, భీమ ధనంజయ=భీమార్జునుల, భాసురప్రతాప నవ సమృద్ధితో, కదియు బల్లిదున్, ఆ విభున్=ధర్మరాజును, చూచునంతకున్, చూచునప్పటి వరకు, నాదుమాట, నీ మనమునకు, ఇప్పుడొప్పగునె.

తాత్పర్యము : అనగా దుర్యోధనునితో కృష్ణుడు ఇట్లనెను. మదించిన శత్రు సేనా సమూహము బలము తగ్గి చిక్కుపడగా భీమార్జునుల బలపరాక్రమ నూతనోత్తేజముతో ఎదుర్కొను పరాక్రమవంతుడైన ధర్మజుని చూచునంత వరకు నా మాటలు నీ మనసునకు ఇప్పుడు సరిపడునా?

చ. అమితచమూసమూర్జితుఁడ నంచు నహంకృతి మానవేమొ న
వ్యమదవిభూతి నీవెఱుఁగ వానరనాయకులాజిచేఁతకై
యమరినవా రనేకులు మహాబలు లవ్విభునొద్ద నీయధ
ర్మమ యిటమీఁద నెల్లెడల మాకు సహాయము నిన్నుఁ ద్రుంపగన్.

రామా : అమితచమూసమూర్జితుడననుచు=మిక్కిలి సేనాసమూహము యొక్క

బలముగల వాడనని, అహంకృతి=అహంకారమును, నవ్యమద విభూతి=నూతనమైన గర్వాతిశయమును, మానవేమొ=వదలుకొనవేమో, నీ వెఱుగన్=నీకు తెలియునట్లుగా, ఆజిచేతకై=యుద్ధము చేయుటకై, వానర నాయకులు, అనేకులు, మహాబలులు, అవ్విభునొద్ద=రాముని వద్ద, అమరినవారు=సమకూరినారు, నీయధర్మమ=నీ అధర్మమే, ఇటమీద=ఇకపై, నిన్ను ద్రుంపగన్=నిన్ను చంపుటకు, ఎల్లెడలన్=అన్ని చోట్ల, మాకు సహాయము.

తాత్పర్యము : రావణా! గొప్ప సేనల సంపదకలవాడనని నూతన గర్వాతిశయమును, అహంకారముతో వదలుకొనలేవేమో! నీకెఱుక పడునట్లు వానర నాయకులు మహాబల సంపన్నులు అనేకులు యుద్ధము చేయుటకై ఆ రాముని వద్ద అమరినారు. నిన్ను సంహరించుటకు ఇకపై అన్ని చోట్ల మాకు సహాయము.

భారత : అమితచమూసమూర్జితుడనంచు, నవ్యమద విభూతి, అహంకృతి మానవేమొ, నీ వెఱుగవా=నీకు తెలియదా? నరనాయకులు=రాజశ్రేష్ఠులు, అవ్విభునొద్ద=ధర్మజుని వద్ద, మిగతా సమానము.

తాత్పర్యము : దుర్యోధనా! మిక్కిలి సేనా సమూహముగల వాడనని నూతన మదముతో కూడిన ఐశ్వర్యమును అహంకారముతో వదలుకొనలేవేమో? నీకు తెలియదా? విరాట ద్రుపదాదులైన మహాబల సంపన్నులయిన నరనాయకులు పెక్కురు యుద్ధము చేయుటకై ధర్మజుని వద్ద చేరినారు. నిన్ను చంపుటకు ఇకపై అన్ని ఎడలను నీ అధర్మమే మాకు సహాయకారి.

వ. అని మఱియు ననేకప్రకారంబుల నీతియు బలిమియు మహోద్ధతియుఁ దోఁప హితంబు దెలిపి విఫల ప్రయత్నుండై. 99

రామా + భారత=సమానము

అని మరియు అనేక విధములుగా నీతిని, బలమును, పరాక్రమమును తెలియునట్లు హితవు చెప్పి ప్రయత్నము విఫలమైనవాడై.

తే. అకట నెఱయ నీయాత్మనాశకునికర్ణ
దౌష్ట్య మెట్టిదొ నామాట దగుల దనుచు
విసివి యాదర్పదుష్టమానసునిగురుని
వారణోద్యుక్తి వెండియు వఱలఁ బలికె. 100

రామా : అకట=అకటా!, నెఱయన్=విచారింపగా, ఈ ఆత్మనాశకుని=ఆత్మ ఘాతకుడైన రావణునియొక్క, కర్ణ=చెవుల, దౌష్ట్యము=అవగుణము, ఎట్టిదో= ఎటువంటిదో, నామాట, తగులదనుచు=చెవికెక్కదనుచు, విసివి=విసిగి, ఆదర్ప దుష్టమానసుని=రావణుని, గురు=అధికమైన, నివారణోద్యుక్తి=వారించెదనను ప్రయత్నముచే, వెండియు వరలన్=మరల ప్రకాశమగునట్లు, పలికె=పలికెను.

తాత్పర్యము : అకటా! ఆత్మ ఘాతకుడైన రావణుని చెవుల అవగుణమెట్టిదో నామాట చెవికెక్కదు అనుకొని విసిగి రావణుని మిక్కిలి వారించెదనను ప్రయత్నముతో మరియు ప్రకాశమగునట్లు పలికెను.

భారత : అకట, నెఱయ, ఆశకుని కర్ణ దౌష్ట్యమెట్టిదొ=శకుని కర్ణుల దుర్మార్గము ఎటువంటిదో, నీ ఆత్మన్=నీ మనసునకు, నామాట తగులదనుచు, విసివి, ఆ దర్ప దుష్ట మానసుని=దుర్యోధనుని, గురుని=తండ్రియైన ధృతరాష్ట్రుని, వారణోద్యుక్తి, యుద్ధ నివారణ ప్రయత్నముచే, వెండియు వరల బలికె.

తాత్పర్యము : అకటా! ఆలోచింపగా ఆ శకుని కర్ణుల దుర్మార్గమెట్టిదో నీ ఆత్మకు నా మాట చెవి కెక్కుటలేదు అని కృష్ణుడు విసిగి దుర్యోధనుని తండ్రియైన ధృతరాష్ట్రునితో యుద్ధ నివారణ ప్రయత్నమునకు మరల ప్రకాశముగా ఇట్లు పలికెను.

తే. నీదు పిన్న తమ్ముండు సునీతివిదురుఁ
దతనిబుద్ధిమార్గంబు నీ కభిమతంబు
గానియప్పుడ మఱి యాస గలదె నిన్నుఁ
దెలుపఁ బూనుట నోరిచాపలము గాక. 101

రామా : నీదు పిన్న తమ్ముండు=విభీషణుడు, సునీతి విదురుడు=చక్కని నీతి తెలిసినవాడు, అతని బుద్ధిమార్గంబు=అతని మనసు ప్రకారము నడచుట, నీకభిమతంబు=నీకిష్టము, కాని యప్పుడు=కానప్పుడు, మరి ఆసకలది=మరి ఆశ కలదా? నిన్ను తెలుపబూనుట=నీకు తెలియజెప్పుట, ఓరి=ఓ రావణా! చాపలము గాక=చపలత్వము గదా!

తాత్పర్యము : నీ తమ్ముడు విభీషణుడు చక్కని నీతి తెలిసినవాడు, అతని బుద్ధి ననుసరించుట, నీకిష్టము లేనపుడు నీకు చెప్పబూనుట ఓరీ! చపలత్వముగాక మఱొక ఆశగలదా!

భారత : నీదు పిన్నతమ్ముండు=నీ చిన్న తమ్ముడు, సునీతి=మంచి నీతిగల విదురుఁడు, అతని బుద్ధి మార్గము నీకభిమతంబుగాని యప్పుడ, మఱి యాసగలదె, నిన్ను తెలుపబూనుట, నోరి చాపలముగాక=నోటి చపలత్వముగాక.

తాత్పర్యము : నీ చిన్న తమ్ముడు చక్కని నీతిగల విదురుడని బుద్ధిమార్గము ననుసరించుట నీకిష్టము లేనప్పుడు నీకు తెలియజెప్పుట నోటి చాపలముగాక మరొక ఆశగలదా!

వ. అతం డేతదుపద్రవప్రారంభ కాలంబున. 102

తాత్పర్యము : అతడు ఆ ప్రమాద ప్రారంభ సమయములో -

కం. అన్న వటుమీఁద రాజవు
నిన్నోఁగా దనుట నాదునేరమి యైనం
గన్నది యనకున్నను విన
కున్నను గపటమదిమనకు నొండొరులయెడన్. 103

రామా : అన్నవు, అటు మీద రాజవు, నిన్ను, ఔన్+కొదనుట=ఔను కాదు అనుట, నాదు నేరమియైనన్=నా దోషమే అయినను, కన్నది=చూచినది, అనకున్నను, మాట్లాడకున్నను, వినకున్నను, మనకు, ఒండొరులయెడన్=పరస్పరము,

కపటమది=అది దోషము.

తాత్పర్యము : రెండింటికి సమానము.

నీవు అన్నవు. అంతేగాక రాజువు. నిన్ను కాదనుట నా నేరమే అయినను చూచినది మాట్లాడకుండుట వినకుండుట మన ఉభయుల యెడ అది కపటము (రామాయణార్థమున విభీషణుడు, భారతార్థమున విదురుడు పలికిన మాటలు)

తే. అరయ నేరి కి ట్ట ట్టని యాడుకొనఁగ
రానియట్టిది శ్రీరామరామ నీకు
మారుదుశ్చేష్టితంబు నివారితముగఁ
జేయకునికి యొప్పదు దానఁ జేటు వొందు. 104

రామా : అరయన్=చూడగా, ఏరికిన్=ఎవరికైనను ఇట్టిట్టని, ఈ విధముగా, ఆడుకొనరాని యెట్టిది=నిందింపరానట్టిది, శ్రీరామరామ=సీత, నీకు=రావణునకు, మారు దుశ్చేష్టితంబు=మన్మధుని చెడ్డకార్యము, నివారితముగన్=నివారించునట్లుగ, చేయకునికి=చేయకపోవుట, ఒప్పదు=తగదు, దానన్=దాని వలన, చేటు పొందు=చెడ్డ కలుగును.

తాత్పర్యము : ఆలోచింపగా ఎవరికైనను ఇటువంటిదని నిందింపరాని యట్టిది సీత. నీవు మన్మధుని దుశ్చేష్టలు నివారింపనిచో దానివలన చేటు కలుగును.

భారత : అరయన్, ఏరికిట్టిట్టని ఆడుకొనగరానియట్టిది=చెప్పిన పాపము వచ్చును, శ్రీరామరామ=రామరామ! నీకుమారు=అంగదుని, దుశ్చేష్టితంబు= నివారితముగ చేయకునికి, ఒప్పదు=అడ్డు పడకుండుట మంచిది కాదు, దానన్ చేటు పొందు.

తాత్పర్యము : శ్రీరామరామ! అరయగ చెప్పిన పాపము వచ్చును. నీవు నీ కుమారుడైన దుర్యోధనుని దుశ్చేష్టలను నివారింపకుండుట తగదు. దాని వలన చేటు కలుగును.

ఉత్సాహ : అనయవృత్తి దనకుఁ దాన యహితుఁ డగుచు సర్పదం
శన మొనర్చు టన్నమున విషంబు నిడుట సింధుపా
తనముసేఁత సతికిఁ గీడు దలఁచు టరసి చూడు పా
వనికి నింత కినుక వెనుచువానికులము ద్రుంగదే. 105

రామా : అనయవృత్తిన్=అవివేకముచే, తనకుతాన=తనకుతానే, అహితుడగుచు=ఆత్మద్రోహి అగుచు, సర్పదంశన మొనర్చుట=పాముచే కఱపించుకొనుట, అన్నమున విషంబునిడుట, సింధు పాతనముసేత=సముద్రములో పడుట, సతికిన్+కీడు తలచుట=పరస్త్రీ వాంఛ, అరసి చూడు=తలచుకొనుము, పావనికిన్=సీతకు, ఇంతకినుక పెనుచు=ఇంత కోపమును తెప్పించు, వాని కులము, ద్రుంగదె=నశించదా!.

తాత్పర్యము : అవివేకముచే తనకు తానే ఆత్మద్రోహియగుచు పాముచే కఱపించుకొనుట, అన్నములో విషము పెట్టుకొనుట, సముద్రములో పడుట, పరస్త్రీ వాంఛ అవగుణములు ఆలోచింపగా సీతకు ఈ విధముగా కోపమును పెంచువాని కులము నశించదా! (అని విభీషణుడనెను).

భారత : అనయవృత్తిన్=అధర్మ వ్యాపారముచే, తనకుగాను అహితుడగుచున్=కారణము లేకయే శత్రుడగుచు, సర్ప దంశనము ఒనర్చుట, అన్నమున విషంబునిడుట=అన్నములో విషము కలుపుట, సింధుపాతనముసేత= మడుగులో ద్రొబ్బుట, సతికిన్=ద్రౌపదికి, కీడు దలచుటను, అరసిచూడు= ఆలోచించుకొనుము, పావనికిన్=భీమునికి, మిగతా సమానము.

తాత్పర్యము : అధర్మ వ్యాపారముచే కారణము లేకయే శత్రుత్వమును పెంచుకొనుట, పాముచే కరపించుట, అన్నములో విషము కలుపుట, మడుగులో ద్రొబ్బుట, ద్రౌపదికి కీడు దలచుటను తలచుకొనుము. భీమునకు ఇంత కోపమును పెంచువాని కులము నాశనము కాదా! అని కృష్ణుడనెను.

కం. విను! పెక్కు లేల విడువుము
జనసమ్మతమతివి దేహజననామయమున్
దనయుదిత కీర్తిఁ గులవ
ర్తనఁ బ్రజలను లక్ష్మిఁ బ్రోచుప్రభున కిది దగున్. 106

రామా : విను=అన్నా! వినుము, పెక్కులేల=అనేకములైన మాటలేల? జనసమ్మతమతి=జనులకిష్టమైన బుద్ధిచే, విదేహజను=సీతను, విడువుము, అనామయమున=సుస్థితిని, తన, ఉదిత=ప్రసిద్ధమైన, కీర్తిన్=కీర్తిని, కులవర్తనన్=కులసంప్రదాయముచే, ప్రజలను, లక్ష్మిని, బ్రోచుప్రభునకు=రక్షించు ప్రభునకు, ఇది తగున్.

తాత్పర్యము : రావణా! వినుము. పెక్కు మాటలేల? ప్రజలకు సమ్మతమైన విధముగా సీతను విడువుము. సుస్థితిచే ప్రసిద్ధమైన కీర్తిని తన కుల సంప్రదాయమును అనుసరించి ప్రజలను లక్ష్మిని కాపాడు ప్రభునకు సీతను విడుచుట తగును.

భారత : విను=మామా! ధృతరాష్ట్రా! వినుము, పెక్కులేల, జనసమ్మతమతివి=ప్రజల కోరికను మన్నించు వాడవు, దేహజనన=దేహమున పుట్టిన, ఆమయమున్=తెగులును, దితకీర్తిన్=ఖండింపబడిన కీర్తిగల వానిని, తనయున్=దుర్యోధనుని, విడువుము=మిగతా సమానము.

తాత్పర్యము : జనుల కోరిక ననుసరించి నడుచుకొను ధృతరాష్ట్రా! మాటలు పెక్కులేల వినుము. శరీరమున పుట్టిన తెగులు వంటి వానిని ఖండించబడిన కీర్తిగల వానిని దుర్యోధనుని విడువుము. కులసంప్రదాయము ననుసరించి ప్రజలను సంపదను రక్షించు ప్రభువునకు ఇది తగును.

కం. మన కురువంశ క్షోభము
గనికని వారింప కునికి కార్యము గా దొ
క్కనిరూఢదురాగ్రహబు
ద్ధిని విడుచుట మేలొ కులము దెగుటయ మేలో. 107

రామా : మన=మనకు ఉరు=అధికమైన, వంశక్షోభము=కులనాశనమును, కనికని=చూచి, వారింప కునికి=అడ్డుపడ కుండుట, కార్యముగాదు=చేయతగిన పనికాదు, ఒక్క నిరూఢ దురాగ్రహ బుద్ధిని=ఒక పట్టుదలగల కోపపు బుద్ధిని, విడుచుట మేలొ=వదలుట మేలా!, కులము తెగుటయ మేలో=వంశ నాశనము మేలా!

తాత్పర్యము : మనకు కలుగ బోవు అధిక వంశనాశనమును చూచుచు నివారింపకుండుట మంచిది కాదు. ఒక పట్టుదలగల ఆగ్రహ బుద్ధిని విడుచుట మంచిదా లేక కులనాశనము మంచిదా?

భారత : మన, కురువంశ క్షోభము=కురువంశ నాశనము, కనికని వారింపకునికి కార్యముగాదు, ఒక్కనిన్=ఒక దుర్యోధనుని, రూఢిపాదుకొన్న, దురాగ్రహ బుద్ధిని=చెడ్డ కోపము గలవానిని, మిగతా సమానము.

తాత్పర్యము : మన కురువంశ నాశనమును చూచుచు నివారింపకుండుట ఉచితము కాదు. పాదుకొన్న దురాగ్రహ బుద్ధిగల ఒక దుర్యోధనుని విడుచుట మేలో? కులనాశనము మేలో! ఆలోచించుకొనుము.

కం. అని మఱియుఁ దఱిమి చెప్పఁగ
నను వైనటు లెల్లఁ జెప్ప నది యాతనికం
టెను మఱి యెవ్వఁడు నే మని
నినుఁ దెలిపెడిఁ జెడియెఁ గులము నీకతనఁ దుదన్. 108

రామా / భారత : అనిమరియు, తఱిమి చెప్పగ=విడమరచి చెప్పగా, అనువైనటులెల్ల చెప్పన్=తగిన రీతిలో చెప్పగా, అది, ఆతని కంటెను, మరి ఎవ్వడు, ఏమని నిను తెలిపెడి=నీకు చెప్పెదను, కులము నీక తన తుదన్=వంశము చివరకు నీవలన (రావణుడు/ధృతరాష్ట్రుడు) చెడియెన్=చెడిపోయెను.

తాత్పర్యము : రెండికి సమానము - అని మరియు తగిన రీతిలో అన్ని విషయములను విడమరిచి చెప్పగా అతనికంటె మరొకడు లేడు. నీకేమని చెప్పెదను.

నీ వలన చివరకు కులము చెడిపోయెను.

కం. అని పలికి వెండియును నా
తనిపట్టినచలము రాజ్యదర్పవికారం
బును సైఁపక యుడికించుట
కనయము నుద్ధతమనస్కుఁ డగుచుం బలికెన్. 109

రామా : అని పలికి, వెండియును, మరియు, ఆతని=ఆ రావణుని, పట్టిన చలము=పట్టిన పట్టుదల, రాజ్యదర్ప వికారంబును=రాజగర్వముచే కలిగిన వికారమును, సైపక=సహింపక, ఉడికించుటకు=కోపము తెప్పించుటకు, ఉద్ధత మనస్కుడగుచున్= ధైర్యముగల మనస్సు గలవాడై, అనయము=అధికముగా, పలికెన్=పలికెను.

తాత్పర్యము : అని పలికి మరియు రావణుడు పట్టిన పట్టుదలను, రాజ్యగర్వ వికారమును ఓర్చుకొనలేక అతనికి కోపము తెప్పించుటకై ధైర్యమనస్కుడై మిక్కిలిగా ఇట్లు మాట్లాడెను.

భారత : అని పలికి వెండియు, ఆతని=ధృతరాష్ట్రుని యొక్క పట్టిని+అ=కొడుకైన దుర్యోధనునిచే, మిగతా సమానము.

తాత్పర్యము : అని పలికి కృష్ణుడు మరియు దుర్యోధనునినే ఉద్దేశించి అతని పట్టుదల, రాజ్య వికార గర్వము ఓర్చుకొనలేక అతనిని ఉడికించు మనస్సు దృఢముగా కలిగి మిక్కిలి ఇట్లు పలికెను.

కం. సుబలాత్మజమాయాద్యూ
తబలంబున నమర సంపదలు గొని యెంతేఁ
బ్రబలి తది నేఁడు నిలువదు
ప్రబలాహవభీమనరవరభుజోద్ధతిచేన్. 110

రామా : సుబలాత్మజా=బలవంతుడైన ఇంద్రజిత్తుయొక్క, మాయాది=

మాయాదులచే, ఊతబలంబునన్=వ్యాపించిన బలముచే, అమర సంపదలు గొని దేవతల సంపదలు తీసుకొని, ఎంతేన్+ప్రబలితి=ఎంతో గర్వించితివి, అది=ఆ ప్రాబల్యము, ప్రబల=అధికమైన, ఆహవ భీమ=భయంకరమైన యుద్ధమునందు, నరవర=రాముని యొక్క, భుజోద్ధతిచేన్=బాహుపరాక్రమముచే, నేడు నిలువదు.

తాత్పర్యము : బలవంతుడైన నీ కుమారుడైన ఇంద్రజిత్తు యొక్క మాయాదులచే వ్యాపించిన బలముచే దేవతల సంపదలు హరించి నీవెంతో ప్రబలినావు. ఆ ప్రాబల్యము అధికమైన యుద్ధరంగమున భయంకరుడైన రాముని భుజబల పరాక్రమముచే నేడు నిలువదు.

భారత : సుబలాత్మజ=శకునియొక్క మాయాద్యూత బలమున=మాయాజూద బలముచే, అమరన్=తగిన విధముగా, సంపదలు గొని=రాజ్యమును హరించి, ఎంతే ప్రబలితి, అది=ఆ జూదము, ప్రబల=ప్రబలమైన, ఆహవ=యుద్ధముగల, భీమ=భీముని యొక్క, నర=అర్జునుని యొక్క, వర భుజోద్ధతిచేన్=శ్రేష్ఠమైన బాహు పరాక్రమముచే, నేడు నిలువదు.

తాత్పర్యము : శకుని మాయాజూదబలముచే తగిన విధముగా రాజ్య సంపదలను గ్రహించి ప్రబలితివి. ఆ జూదము ప్రబలమైన యుద్ధముగల భీమార్జునుల అధిక బాహుబల పరాక్రమముచే నేడు నిలువదు.

చం. ఘనముగ నాత్మ నాఁటితనకాంతపరాభవ మల్కఁ బెంపఁగా
ననయముఁ బేర్చు రాజమణి యాశుగసంతతి నీదు పెద్దత
మ్మునినెదురొమ్ము నెత్తురు సముద్ధతిఁ గ్రోల నినుం గృతోరుభం
గుని నొనరింపఁజూచె దిదిగోఁ గలహంబ యభీష్టమేనియున్.
111

రామా : ఘనముగ=గొప్పగ, ఆత్మన్=మనసులో, నాటి=గుచ్చుకొని, తనకాంత=సీతయొక్క పరాభవము=అవమానముచేతనైన, అల్కను=కోపమును, పెంపగాన్=తీర్చుకొనుట కొఱకు, అనయము=నిరంతరము పేర్చు రాజమణి=

ఎక్కుబెట్టు రాముని, అసుగ సంతతి=బాణసముదాయము, నీదుపెద్ద తమ్ముని=కుంభకర్ణుని, ఎదురొమ్ము నెత్తురు=గుండె నెత్తురు, సముద్ధతిన్ గ్రోలన్=విజృంభించి త్రాగుటకు, నినున్=రావణుని, కృతోరుభంగుని=అధికమైన పరాజయము గలవానినిగా, ఒనరింపజూచెదు చేయగా చూచెదవు, ఇదిగో, కలహంబ=శత్రుత్వమే, అభీష్టమేనియున్=కోరిక గలిగినచో.

తాత్పర్యము : గొప్పగా తన మనస్సులో గ్రుచ్చుకొనిన సీత అవమానముచే పెరిగిన కోపమును తీర్చుకొనుటకు మిక్కిలి పేర్చిన రాముని బాణ సంపదలు నీవు యుద్ధమే కోరుకొనినచో నీ పెద్ద తమ్ముడైన కుంభకర్ణుని గుండె నెత్తురులు గ్రోలి నిన్ను అధిక పరాజయము కలిగినవానినిగా చేయగా చూచెదవు.

భారత : ఘనముగ, ఆత్మ, నాటి=ఆ జూదమునాడు, తనకాంత పరాభవము=ద్రౌపదికి జరిగిన అవమానము, అల్క పెంపగాన్=అవమానమును అధికము సేయగా, అనయము=పేర్చు, ఉగ్రుడగుచున్న, రాజమణి=రాజశ్రేష్ఠుడైన, ఆశుగసంతతి=వాయునందనుడైన భీముడు, నీదు పెద్దతమ్ముని=దుశ్శాసనుని, ఎదురొమ్ము=గుండె, నెత్తురు=రక్తము, గ్రోలన్=త్రావగా, నినున్=దుర్యోధనుని, కృత+ఊరుభంగుని=తొడలు విరిగిన వానినిగా, ఒనరింపన్ చూచెదు, కలహంబ అభీష్టమేనియున్.

తాత్పర్యము : దుర్యోధనా! జూదము నాటి ద్రౌపదీ పరాభవము ఘనముగా తన ఆత్మలో కోపమును అధికము సేయగా మిక్కిలి ఉగ్రుడగుచున్న రాజశ్రేష్ఠుడైన భీముడు నీ పెద్దతమ్ముడైన దుశ్శాసనుని ఎదురొమ్ము నెత్తురు విజృంభించి తాగగా నీ తొడలు విరుగగొట్టగా నీకు యుద్ధమే ఇష్టమేని ఇదిగో చూచెదను.

చం. అని నమితప్రతాపుఁ డగునాతనితమ్ముని మేఘనాదభం
జనకృతి దేవదత్త జయశబ్దవివర్ధిత సింహనాద మెం
దును గొదలేక నీకు నిదెదుస్సహకర్ణ నిపాతసూచి యై
వినఁబడు గుండె దిగ్గురన వేగిర మేల దురంబ కోరినన్. 112

రామా : అని, అమితప్రతాపుడగు=మిక్కిలి పరాక్రమవంతుడైన, ఆతని తమ్మని=లక్ష్మణునియొక్క, మేఘనాదభంజన=ఇంద్రజిత్తును వధించుటచే, కృతి=కృతకృత్యులైన, దేవ=దేవతలచేత, దత్త=చేయబడిన, జయశబ్ద=జయ జయ ధ్వానములచే, వివర్ధిత పెంపొందిన=సింహనాదము, అట్టహాసము=ఎందును కొదలేక, ఏమాత్రము కొదువలేక, నీకు, ఇదె, దుస్సహ=సహింపరాని, కర్ణనిపాత=శ్రవణప్రదేశముగల, సూచియై=సూదియై, గుండె దిగ్గురన=గుండె గుభిల్లుమనగా, వేగిరము=వెంటనే, వినబడు, ఏల, దురంబ కోరినన్=యుద్ధమునే కోరినచో.

తాత్పర్యము : అమిత పరాక్రమశాలియైన లక్ష్మణునిచే ఇంద్రజిత్ వధచే కృతకృత్యులైన దేవతలు చేసిన జయజయ ధ్వానములు పెరిగి అట్టహాసమై, యుద్ధము కోరినచో ఎక్కడను కొదువలేని రీతిలో నీవు సహింపరాని విధముగా చెవులకు సూదియై గుండె దిగ్గురనునట్లు వేగముగా వినిపించును.

భారత : అని, అమితప్రతాపుడగు, ఆతని తమ్మని=భీముని తమ్ముడైన అర్జునుని, మేఘనాదభంజన=మేఘనాదమును ఖండింపగల, కృతి=సమర్థమైన, దేవదత్త=దేవదత్తముయొక్క, జయశబ్ద=జయ సమయ శబ్దముచే, వివర్ధిత= పెంపొందిన, సింహనాదము, ఎందునుకొదలేక నీకు నిదె, దుస్సహ=సహింపరాని, కర్ణ=కర్ణుని యొక్క, నిపాత=పాటును, సూచియై=సూచించునదై, వినబడును, మిగతా సమానము.

తాత్పర్యము : అని కృష్ణుడు పలికి – మిక్కిలి ప్రతాపవంతుడైన భీముని తమ్ముడైన అర్జునునియొక్క మేఘనాద భంజనమందు సమర్థమైన దేవదత్తము యొక్క జయశబ్దముచే వృద్ధి పొందిన సహింపరాని కర్ణుని భంగపాటును సూచించునదియై నీవు యుద్ధముచే కోరినచో నీ గుండె దిగ్గురనునట్లు త్వరగా వినపడును.

మరొక అర్థము – భీమునియొక్క, అర్జునునియొక్క మేఘగర్జనమును భంజించుటకు సమర్థవంతమైన జయశబ్దముచే అర్జునుని దేవదత్త ధ్వని వృద్ధి పొందింపబడును. అర్జునుడు కర్ణుని సంహరించెడి సమయమందు భీముడు దుస్సహుని సంహరించి సింహనాదము చేయును.

కం. వారలసంగర మిట్టిది
యీరీతిం దెలుపనేల యెఱుఁగంబడదే
యారయ నిది నీకు నతి
క్రూరమహాకపట భవదురోదర వేళన్. 113

రామా : వారల=రామలక్ష్మణులయొక్క, సంగరము=యుద్ధము, ఇట్టిది, ఈ రీతిన్=ఈ విధముగా, తెలుపనేల, ఆరయ, ఇది నీకు, అతిక్రూర మహాకపట=మిక్కిలి క్రూరమైన కపటరావణా!, భవత్=నీ యొక్క, ఉరః=వక్ష స్థలమును, దరవేళను= వ్రక్కలించునపుడు, ఎఱుగన్ బడదే=తెలియకుండునా.

తాత్పర్యము : అతిక్రూర కపట బుద్ధిగల రావణా! రామలక్ష్మణుల యొక్క యుద్ధము ఇటువంటిది. విచారింపగా ఇది నీకు నీ వక్ష స్థలమును వ్రక్కలించునపుడు తెలియకుండునా!

భారత : వారల=భీమార్జునుల యొక్క, సంగరము=ప్రతిజ్ఞ, ఇట్టిది, అతిక్రూర మహా=మిక్కిలి క్రూరమైన, కపటభవ=కపటముగా జనించిన, దురోదరవేళను=జూద సమయమునందు, మిగతా సమానము.

తాత్పర్యము : భీమార్జునుల ప్రతిజ్ఞ ఇటువంటిదేనని ఈ విధముగా తెలుపనేల? మిక్కిలి క్రూరమైన కపట జూద సమయమునందు ఇది నీకు తెలియదా?

విశేషణము : దురోదర – 'ఫణే, ద్యూతో, దురోదరః' అని అమరము.

వ. అని పలికి యప్పుడు దన్నుం జుట్టుముట్టుకొని పట్ట నిగ్రహించుటకు నుగ్రయోధుల నాగ్రహంబున నియోగించు నద్దురాత్ముదుర్వివేకంబునకు నవ్వి నిర్విశంక సమాకులితసంరంభ విజృంభితుండై మేనువెంచి. 114

రామా+భారత సమానము.

తాత్పర్యము : అని పలికి తనను అంగదుని/కృష్ణుని చుట్టుముట్టుకొని పట్టి బంధించుటకు తీవ్ర పరాక్రమముగల యోధులను కోపముతో పురికొల్పు ఆ రావణుని/

దుర్యోధనుని చెడు వివేకమునకు నవ్వి ఏ విధమైన శంకలేని రీతిలో మిక్కిలి ఉత్సాహముతో విజృంభించినవాడై శరీరమును పెంచి -

చం. తనువున సర్వలోకచయదర్శనచిత్రమహత్త్వ మెంతయుం
దనర విరాట్ప్రకార సముదంచితుఁడై తనుఁ బట్టఁగ్రమ్మువాం
డ్రను ఘనఘోరహుంకృతినిరస్తులఁ జేసి నభోధ్వగామితా
భినుతయశో విశేషమునఁ బేర్చుచు నేఁగె నియోక్తృపాలికిన్. 115

రామా : తనువునన్=శరీరమునందు, సర్వలోకచయ=సమస్త జన సముదాయము యొక్క, దర్శన=దృష్టికి, చిత్ర=విచిత్రమైన, మహత్త్వము=గొప్పతనము, ఎంతయున్+తనరన్=మిక్కిలి ప్రకాశింపగా, విరాట్ప్రకార=పక్షిరాజువలె, సముదంచితుడై=ఎగిసినవాడై, తను+పట్టన్=తనను పట్టుకొనుటకు, క్రమ్మువాండ్రను=చుట్టుముట్టిన వారిని, ఘన ఘోర హుంకృతిన్=గొప్పదైన మహా హుంకారముచే, నిరస్తులజేసి=నిర్వీర్యులనుజేసి, నభోధ్వగామిత=ఆకాశగమనముచే, అభిమత=పొగడబడిన, యశో విశేషమున=కీర్తివైభవముచే, పేర్చుచు=వృద్ధి పొందుచు, నియోక్తృ పాలికిన్=రాముని వద్దకు, ఏగెను=వెళ్ళెను.

తాత్పర్యము : అంగదుడు తన శరీరమును సకలజనసముదాయ దృష్టికి చిత్రమైన విశేషము ఎంతయో ప్రకాశింపగా పక్షిరాజువలె ఎగసి, తనను పట్టదలచుకొని చుట్టుముట్టినవారిని గొప్ప హూంకారముచే భయపడజేసి ఆకాశ గమనముచే మిక్కిలి పొగడదగిన విశేషముతో వృద్ధి పొందుచు రాముని వద్దకు వెళ్ళెను.

భారత : తనువునన్=దేహమునందు, సర్వలోకచయ=సమస్త జగత్తులయొక్క, దర్శన=చూపులచే, చిత్ర మహత్త్వము=విచిత్రమైన గొప్పదనము, ఎంతయున్+తనర, విరాట్=విశ్వరూపము యొక్క ప్రకార=స్వరూపముచే, సముదంచితుడై=ఒప్పినవాడై, నభోధ్వగ=ఖేచరులచే, అమిత+అభినుత=మిక్కిలి పొగడబడిన, యశోవిశేషమున పేర్చుచు, నియోక్తృపాలికిన్=ధర్మజుని వద్దకు, ఏగెన్.

తాత్పర్యము : తన శరీరమున సమస్త జగత్తుల యొక్క దర్శనముచే గొప్ప

మహత్వము ఎంతయు ప్రకాశింపగా విశ్వరూపముచే ఒప్పినవాడై, తనను పట్టుటకు చుట్టుముట్టిన వారిని తన ఘోర హూంకారముచే భయభ్రాంతులను చేసి ఖేచరులచే మిక్కిలి పొగడ్తలకెక్కిన యశోవిశేషముతో ధర్మరాజు వద్దకు వెళ్ళెను.

వ. ఏఁగి యన్నరేంద్రునకుఁ దన పోయివచ్చిన కార్యంబు తెఱం
గెఱింగించి యిట్లనియె. 116

తాత్పర్యము : సమానము – వెళ్ళి ఆ రామునికి/ధర్మజునికి తాను పోయి వచ్చిన పని తీరును తెలిపి ఇట్లనెను.

కవిరాజవిరాజితము.

తిరము విపక్షమదోద్ధతి నీవు దుదిం దెగఁజాలవు గాని వెసన్
గురుకృపశాంతనవోక్తులఁ దేర్చియుఁ గొంకకయేనితవుం దగవున్
బిరుసును జూపియనేక విధంబులఁ బెక్కులు పల్కియుఁ జూచితి నీ
కరుణకుఁ బాత్రుఁడు గాఁడు పదింబదిగాఁ గని వచ్చినవాఁడఁ దుదన్.
117

రామా + భారత : నీవు=రావణుడు/దుర్యోధనుడు, విపక్షు=శత్రువుల, మదోద్ధతి=గర్వోన్నత్యముచే, వెసన్=మిక్కిలి, గురుకృపన్=అధిక కృపచే, తుదిన్=చివరకు, తెగజాలవు=సంహరింపబడవు, తిరము=స్థిరము, శాంత=శాంతమైన, నవోక్తుల=కొత్త మాటలచే, తేర్చియు=చెప్పి చూచియు, కొంకక=భయపడక, ఏనితవున్దగవున్=ఎన్ని రీతులుగానో, బిరుసునుజూపి=గట్టిగా చెప్పి, అనేక విధంబుల, పెక్కులు పల్కియు చూచితి=అనేక మాటలు మాట్లాడి చూచితిని, నీ కరుణకు=రాముని/ధర్మజుని, పాత్రుడుకాడు=యోగ్యుడు కాడు, తుదన్=చివరకు, పదింపదిగా=అనేకమారులు, కని వచ్చినవాడన్=చూచి వచ్చినాను.

తాత్పర్యము : రావణా/దుర్యోధనా! నీవు అధికమైన కృపచే శాంతముతో కూడిన మాటలచే (గురుడు, కృపుడు, భీష్ముడు) చెప్పిన మాటలచే శత్రువుల గర్వోన్నతికి

చివరకు సంహరింపబడవనుట నిశ్చయము - అని అనేక విధములుగా భయపడక తగిన రీతిలో గట్టిగా పెక్కుమాటలు మాట్లాడి వచ్చినాను. అతడు నీ కరుణకు యోగ్యుడు కాడని చివరకు పెక్కుమార్లు చూచి వచ్చితిని. (భారతార్థమున శాంతనవ=భీష్ముడు)

విశేషణము : కవిరాజ విరాజితమునకు ప్రతిపాదమున ఒక 'న' గణము, 6 'జ' గణములు, ఒక 'వ' గణము ఉండవలెను.

వ. అనిన విని మనకు నుచితంబైన వర్తనంబు నడపితి మిటమీఁద
నతని పాలఫలం బెట్లు గావలయు నట్లయ్యెడు నని పలుకుచు నొక్క
శుభముహూర్తంబున. 118

తాత్పర్యము : అనిన విని మనకు సరియైన పని మనము చేసితిమి. ఇక మీదట అతని (రావణుడు/దుర్యోధనుడు) కర్మఫలము ఎట్లుండిన అట్లగునని రాముడు/ధర్మరాజు పలికి ఒక శుభముహూర్తమున -

తే. తనకుదార సోదర భావమునను రణస
హాయముగఁ దివిరెడువీరు ననలజాతు
మిగులఁ గాననీలసమాఖ్య మెఱయువాని
భూనుతాజిధృష్టద్యుమ్ను సేన గావ. 119

రామా : తనకు+ఉదార=తనకు మిక్కిలి, సోదర భావమునను=సోదరునివలె, రణ సహాయముగన్=యుద్ధమునందు తోడుగా, తివిరెడు=నిలుచు, వీరున్=వీరుని, అనలజాతున్=అగ్ని కుమారుని, మిగులన్ కానన్=మిక్కిలి స్ఫుటముగా కనిపించు, నీలసమాఖ్య=నీలుడను పేరుతో, మెఱయువాని=ప్రకాశించువాని, సేనగావ=సేనలను రక్షించుటకు, భూనుత=లోకముచే ప్రశంసించబడు, ఆజి=యుద్ధమునందు, ధృష్ట=దిట్టయైన, ద్యుమ్నునిన్=బలముగలవానిని.

తాత్పర్యము : తనకు మిక్కిలి సోదర భావముతో యుద్ధమునందు సహాయకారిగా నుండు వీరుని లోకముచే ప్రశంసించదగు రీతిలో యుద్ధమునందు దిట్టమైన బలము

గలవానిని వీరుడైన అగ్నికుమారుడైన నీలుడను పేరుతో స్పష్టముగా ప్రకాశించువానిని – అభిషిక్తుని చేసెను.

భారత : తనకు=ధర్మజునకు, ఉదార సోదర భావమునన్=భార్య తమ్ముడైన, రణసహాయముగతివిరెడు, వీరున్, అనలజాతున్=అగ్నియందు పుట్టినవానిని, మిగులకాన=అనీల సమాఖ్యన్=తెల్లని కీర్తిచే మెరయువాని, భూనుత+ఆజ= లోకమునందు ప్రశంసకు అర్హుడైన, ఆజి=యుద్ధము గలవానిని, సేనగావ, ధృష్టద్యుమ్నున్=దృష్టద్యుమ్నుని.

తాత్పర్యము : తనకు బావయై యుద్ధమున సహాయుడుగా నుండు వీరుని, అగ్నియందు పుట్టినవానిని మిక్కిలి ధవళకీర్తిచే ప్రకాశించువానిని లోకము ప్రశంసించు యుద్ధ నిపుణుని సేనాధిపతిగా ధృష్టద్యుమ్నుని అభిషిక్తుని చేసెను.

వ. అభిషిక్తుంజేసి సంవిహితసకలసన్నాహుం డై. 120

తాత్పర్యము : అభిషేకించి సమస్త సన్నాహములతో కూడినవాడై.

ఆ. అనికి నుగ్రమై మహారిపురాజిరా
నంతవనచయంబు లన్నియుఁ జిఱు
నుగ్గుగాఁ బదహతి నుఱుమాడుసేనతో
నాజిరంగమునకు నతఁడు నడచె. 121

రామా : అనికి=యుద్ధమునకు, ఉగ్రమై=తీవ్రమై, మహారిపు=అధికమైన, అరిపుర=శత్రుపురమైన లంక యొక్క, అజిర=ప్రాంగణముల యందుండు, అనంత వనచయములు=బహుళములైన ఉద్యాన వనాదులు, అన్నియున్, పదహితిన్= పాదతాడనముచే, చిరునుగ్గుగా=నశించగా, నుఱుమాడు సేనతో=నాశనము చేయు సేనతో, అతడు=రాముడు, ఆజిరంగమునకు=యుద్ధమునకు, నడచె=నడచెను.

తాత్పర్యము : యుద్ధమునకు తీవ్రమైన లంకాపుర ప్రాంగణములందు అధికములైన ఉద్యానవనాదులను పాద తాకిడిచే నుగ్గునుగ్గు చేసి ముందు కురుకు సేనతో రాముడు యుద్ధరంగమునకు బయలుదేరెను.

భారత : మహారిపురాజిరాన్=శత్రు సమూహము రాగా, అతడు=ధర్మజుడు – మిగతా సమానము.

తాత్పర్యము : యుద్ధమునకు తీవ్రముగా శత్రుసమూహము రాగా ఉద్యానవనములన్నియు సేనల పాద తాకిడిచే నుగ్గు చేయునట్లు ముందు కురుకు సేనలతో ధర్మజుడు యుద్ధ రంగమునకు నడచెను.

ఆ. తెగువ నిట్లు నడచి మిగులఁ జేరికలంక
ముక్తధృతివిలాసముగఁ గడంకఁ
బోరు నడపె దృఢమనోరథహరికుంజ
రోగ్రబలము గొలిపియాగ్రహమున. 122

రామా : తెగువన్=ధైర్యముతో, ఇట్లు=ఈ విధముగా, లంక=లంకా నగరము, విలాసముగన్=తల్లడిల్లునట్లుగా, మిగుల చేరికను=అత్యంత సమీపమున, నడచి, కడంకన్=ప్రయత్నముచే, దృఢమనోరధ=గట్టి మనసుగల, హరికుంజర=వానర శ్రేష్ఠుడైన=సుగ్రీవుని యొక్క, ఉగ్రబలము గొలిపి=తీవ్రమైన బలమును పెరరేచి, ఆగ్రహమున=కోపముతో, పోరు నడపె=యుద్ధము చేసెను.

తాత్పర్యము : ధైర్యముతో ఇట్లు లంకా నగరము తల్లడిల్లునట్లుగా అత్యంత సమీపముగా నడచి, దృఢమనస్కుడైన సుగ్రీవుని ఉగ్రబలమును ప్రేరేపించి ప్రయత్న పూర్వకముగా యుద్ధమును నడపెను.

భారత : తెగువనిట్లు నడచి, మిగులచేరి, కలంకముక్త=నిష్కళంకమైన, ధృతిన్=ధైర్యముతో కూడిన, విలాసముగన్=వయ్యారముగా, దృఢమనః=దిట్టమైన మనస్సుగల, రథహరి కుంజర=రథములు, ఏనుగుల యొక్క, ఉగ్రబలము=తీవ్రమైన సేనను, కొలిపి=ఉద్రేకపరచి, మిగతా సమానము.

తాత్పర్యము : ధైర్యముతో ఈ విధముగా నడిచి దగ్గరగా చేరి నిష్కలంకమైన ధైర్య విలాసముచే దృఢ మనస్సుగల రథహరికుంజరములచే కూడిన తీవ్రమైన సేనను ఉద్రేకపరచి కోపముతో ప్రయత్నపూర్వకముగా యుద్ధమును నడపెను.

కం. అమ్మనుజేంద్రునిబలవ
 ర్గమ్ము మొదలినాఁడు భీష్మరక్షోర్జితద
 ర్పమ్మునఁ గవియుసుయోధను
 తమ్ములఁ జతురంగసైన్యతతుల జయించెన్. 123

రామా : అమ్మనుజేంద్రుని=రాముని యొక్క, బలవర్గమ్ము=సేనా సముదాయము, భీష్మ=భయంకరమైన, రక్షః=రాక్షసులచే, ఆర్జిత=సంపాదింపబడిన, దర్పమ్మున=గర్వముచే, కవియు=ఎదుర్కొను, సుయోధ=సద్భటులచే, నుతమ్ముల=స్తుతింపబడిన, చతురంగసైన్యతతులన్=చతురంగ బలసముదాయమును, మొదలినాడు=తొలిరోజు, జయించెన్=జయించెను.

తాత్పర్యము : రామునియొక్క సేనాసంపదలు భయంకరులైన రాక్షసులచే సంపాదింపబడిన గర్వమును ఎదుర్కొని సద్భటులచే స్తుతింపబడిన చతురంగబలముల సముదాయమును తొలినాడు జయించెను.

భారత : అమ్మనుజేంద్రుని=ధర్మజుని, బలవర్గమ్ము, భీష్మ=భీష్ముని, రక్ష=రక్షణచే, ఊర్జిత=సంపాదింపబడిన, దర్పమ్మున=గర్వముచే, కవియు=ఎదిరించు నట్టి సుయోధను తమ్ములన్=దుశ్శాసనాదులను, చతురంగ సైన్య తతులను, మొదలినాడు జయించెను.

తాత్పర్యము : ధర్మజుని సేనలు భీష్ముని రక్షణచే సంపాదించబడిన గర్వముచే ఎదిరించునట్టి దుశ్శాసనాదులను చతురంగ సేనాసముదాయమును తొలినాడు జయించెను.

సీ. ఆనృపాలశ్రేష్ఠుఁ డవ్వేళనురుమాధ
 వప్రేమకృతవిజయ ప్రకర్ష
 మరయుచు నంగదశరభకేసరిగజ
 ర్ష భశతబలిసమీరణసుతాజి

కేళీమహత్త్వ మీక్షించుచు నుగ్రసం
పాతిదస్రసుతాచ్ఛభల్ల రాజ
వేగదర్శితనూర్జితాగణ్యదర్పంబు
చూడ్కుల కొసఁగుచు శూరతావి

తే. భాసి నుత్తమోజుఁ బరాసుఫణిశిఖండి
ననలసంభవు సైన్యేశు ననిఁ గరంబు
మగతనము సూపఁ గనుఁగొంచు మఱియు ద్రుపద
ముఖ్యులరణంబు గనుచు సమ్మోదమందె. 124

రామా : ఆ నృపాలశ్రేష్ఠుడు=రాముడు, ఆ+వేళను=యుద్ధ సమయమున, రుమాధవ=సుగ్రీవునియొక్క, ప్రేమ=నెనరుచే, కృత=చేయబడిన, విజయ ప్రకర్ష=గెలుపుయొక్క అతిశయమును, అరయుచున్=చూచుచు, అంగద, శరభ, కేసరి, గజ, ఋషభ, శతబలి=అంగదాదుల, సమీరణసుత=హనుమంతుని యొక్క, ఆజికేళీమహత్వము=యుద్ధవిలాసపు ఆధిక్యమును, ఈక్షించుచున్=చూచుచు, ఉగ్రసంపాతి=ఉగ్రుడైన సంపాతియొక్క, దస్ర సుత=మైందవ ద్వివిదుల యొక్క, అచ్ఛభల్లరాజ=భల్లూకపతియైన జాంబవంతుని యొక్క, వేగదర్శి=వేగదర్శి యొక్క, తను శరీరముల యొక్క, ఊర్జిత=సంపాదింపబడిన, అగణ్య దర్పంబు=అధికమైన బలమును, చూడ్కుల కొసగుచు=చూచుచు, శూరతా విభాసిన్=శౌర్యముచే నొప్పెడి, ఉత్తమ=శ్రేష్ఠమైన, ఓజున్=తేజస్సుగలవానిని, పర=శత్రువులయొక్క, ఆసు=ప్రాణములనెడి, ఫణి=సర్పములకు, శిఖండిన్=నెమలియైనవానిని, సైన్యేశున్=సేనాపతియైన, అనలసంభవున్=అగ్నిపుత్రుడైన నీలుని, అనిన్=యుద్ధమున, కరంబు=మిక్కిలి, మగతనము చూప=పరాక్రమమును చూపగా, కనుగొంచు=చూచుచు, మరియు, ద్రు=వృక్షములే, పద=స్థానముగా గల (వానరులలో) ముఖ్యుల=ప్రధానుల, రణంబు గనుచున్=యుద్ధమును చూచుచు, సమ్మోదమందె=సంతసించెను.

తాత్పర్యము : రాముడు యుద్ధసమయమున సుగ్రీవుని ప్రేమచే అందిన విజయాతిశయమును చూచుచు అంగద శరభకేసరి గజ ఋషభ శతబలి హనుమంతుల యొక్క యుద్ధ విలాసాధిక్యమును చూచుచు, ఉగ్రులైన సంపాతి మైందద్వివిదులు జాంబవంత వేగదర్శుల యొక్క శరీర బలిమిని చూచుచు, శ్రేష్ఠమైన తేజస్సుగల శత్రువుల ప్రాణములనెడి సర్పములకు నెమలివంటి నీలుని, వానరశ్రేష్ఠుల యుద్ధమును చూచుచు సంతోషించెను.

భారత : ఆ నృపాలశ్రేష్ఠుడు=ధర్మరాజు, ఆ+వేళ, ఉరు=అధికమైన, మాధవ=కృష్ణునియొక్క ప్రేమకృత=ప్రేమచే సాధింపబడిన, విజయ=అర్జునుని యొక్క, ప్రకర్షము=అతిశయమును, అరయుచు, అంగద=వేడుకచే, శరభ, కేసరి, గజ, ఋషభ, శత=శరభాది జంతువులవలె, బలి=బలము గల, సమీరణసుత= భీముని యొక్క, ఆజికేళీ మహత్త్వము=ఈక్షించుచు, ఉగ్ర=అధికమై, సంపాతి= పాఱుచున్న, దస్రసుత=నకుల సహదేవుల యొక్క, అచ్ఛ=స్వచ్ఛములైన, భల్లరాజ= బాణశ్రేష్ఠముల యొక్క, వేగ=వేగమును, దర్శితను=చూచువాడగుటచే, ఊర్జిత= అధికమైన, అగణ్యదర్పంబు=అధికమైన గర్వమును, చూడ్కుల కొనగుచు=చూచుచు, శూరతావిభాసి, ఉత్తమోజు=ఉత్తమోజుడనెడి పాంచాలుని, పర=శత్రువుల యొక్క, ఆశు=ప్రాణవాయువులకు, ఫణి=సర్పమైన, శిఖండిన్=శిఖండిని, అనలసంభవున్= అగ్నిలో పుట్టిన, సైన్యేశున్=దృష్టద్యుమ్నుని, అనిన్=యుద్ధమున, కరంబు మగతనము సూప కనుగొనుచు మరియు, ద్రుపదముఖ్యుల=ద్రుపదుడు మొదలైన వారి యొక్క, రణంబు గనుచు, సమ్మోదమందె.

తాత్పర్యము : ధర్మజుడు అధికమై కృష్ణుని ప్రేమచే చేకూరిన అర్జునుని అతిశయమును వేడుకచే చూచుచు శరభ, కేసరి, గజ, ఋషభ, శతముల వంటి బలముగల భీముని యుద్ధకేళీ మహత్త్వమును చూచుచు తీవ్రమై పారుచున్న నకుల సహదేవుల స్వచ్ఛములైన బాణరాజముల వేగము వల్ల సంపాదింపబడిన మిక్కిలి గర్వమును చూచుచు, శౌర్యముగల ఉత్తమోజుని, శత్రువుల ప్రాణములకు సర్పమువంటి శిఖండిని, దృష్టద్యుమ్నుని చూచుచు ద్రుపదాదుల యుద్ధమును చూచుచు సంతోషించెను.

విశేషణము : అంగద-అంగద నాథు మ్రింగిన వృకావలి తన్ వెసముట్టుకొన్న - అని తిక్కన ప్రయోగము, (వేడుక అను అర్థములో ప్రయోగము).

శా. క్షత్త్రాచారవిహారి యై విజయరక్షానిష్ఠc బెంపొందువి
శ్వత్రాతన్ విభు విష్ణు నారయుచు నాశ్చర్యంబు లిద్దేవుచా
రిత్రంబుల్ హరియూథచోదకత నీరీతిన్ వినోదించునే
చిత్రంబే గెలు పీబలాలి కని చూచెన్ ఖేచర వ్రాతముల్. 125

రామా : క్షత్రాచార=క్షత్రియాచారముచే, విహారియై=సంచరించు, విజయరక్ష=జయ సంపాదనమునందు, నిష్ఠన్=ఆసక్తిచే, పెంపొందు=అతిశయించు, విశ్వత్రాతన్=జగములను రక్షించు, విభున్=నాథుని, విష్ణున్=రాముని, ఆరయుచు=చూచుచు, ఖేచర వ్రాతముల్=ఆకాశమున సంచరించు ఖేచరుల సముదాయము, ఈ+దేవు చారిత్రంబుల్=ఈ రాముని కథలు, ఆశ్చర్యంబులు, ఈ రీతిన్=ఈ విధముగా, హరియూథ=వానర కులమును, చోదకతన్=నడుపుచు, వినోదించునే=చిత్రంబే, గెలుపు, ఈ బలాలికని=ఈ బలవంతుని కని, చూచెన్= చూచెను.

తాత్పర్యము : క్షత్రియాచారముచే విహరించు జయ సంపాదనాసక్తిచే అతిశయించు లోకరక్షకుడైన విభుడగు రాముని చూచుచు ఖేచర సముదాయము ఇట్లనుకొనెను. ఈ రాముని చరిత్రములు ఆశ్చర్యములు. ఈ విధముగా వానర సమూహమును నడపుచు వినోదించు ఈ బలవంతునికి గెలుపు చిత్రమా అని చూచిరి.

భారత : క్షత్ర=సారథి యొక్క, ఆచార=సారథ్యముచే, విహారియై=తిరుగు, విజయ=అర్జునుని యొక్క, రక్షానిష్టన్=రక్షించు దీక్షతో, పెంపొందు, విశ్వత్రాతన్, విభున్, విష్ణున్=శ్రీకృష్ణుని, ఆరయుచు, ఖేచర వ్రాతముల్, ఇద్దేవు చారిత్రంబుల్, ఆశ్చర్యంబులు, హరియోధ చోదకత=అశ్వములను త్రోలెడి, మిగతా సమానము.

తాత్పర్యము : తన సారథ్యముచే విహరించుచు అర్జునుని రక్షణ దీక్షగా

పెంపొందిన లోక రక్షకుడగు విభుడగు కృష్ణుని చూచుచు ఖేచర సముదాయము ఇట్లు భావించెను : ఈ కృష్ణుని కథలు చిత్రములు. అశ్వములను తోలుచు ఈ విధముగా వినోదించు ఈ బలశాలికి గెలుపు చిత్రమే! అని చూచిరి.

వ. అంత. 126

సీ. సింజినీనిర్ఘోషజితసముద్ర ధ్వని
మేఘనాదుండు సమిద్ధశక్తి
భీష్ముండు సందీప్తపృథుశౌర్య గుణమణి
వాహినీశుండు నిజాహవదశ
దివసాంతరచితాతి తీవ్రవిక్రమత శో
భిల్ల నెంతయు విజృంభించి వాఁడు
తన్మధ్యమునఁ బుట్టుతనసేనభంగంబు
నరిసేనగర్వంబు నడఁచి యడఁచి
తే. నాగభీషణబాణ ప్రయోగములను
భీమనరవరచేష్టలు బెండువడఁగఁ
దదనుజులసత్రపతాపంబు లొదుగువడఁగఁ
గట్టువటిచెఁ బల్మఱు నాజిఘనులు వొగడ. 127

రామా : సింజినీనిర్ఘోష=గుణధ్వనిచే, జిత=జయింపబడిన, సముద్ర ధ్వనిన్=సముద్ర ధ్వనిగల, మేఘనాదుండు=ఇంద్రజిత్తు, సమిద్ధ=ప్రకాశించుచున్న, శక్తిన్=శక్తిచే, భీష్ముండు=భయంకరుడు, సందీప్త=ప్రకాశించెడు, పృథుశౌర్యగుణమణి= గొప్ప పరాక్రమమను గుణములనెడు మణులకు, వాహినీశుండు=సముద్రుని వంటివాడు, నిజాహవదశన్=తన ముగ్ధావస్థగల, దివసాంత=రాత్రియందు, రచిత=రచింపబడిన, అతితీవ్ర విక్రమతన్=మిక్కిలి గొప్ప పరాక్రమముచే శోభిల్లన్=ప్రకాశించగా, ఎంతయు విజృంభించి=మిక్కిలి అతిశయించి, వాడు=

ఇంద్రజిత్తు, తత్+మధ్యమున బుట్టు=యుద్ధమధ్యములో కలిగిన, తన సేన భంగంబు=తన సేనల భంగపాటును, అరిసేన గర్వంబు=శత్రుసేనల గర్వమును, అడచి అడచి=నశింపజేసి, నాగ=నాగరూపములైన, భీషణ బాణ ప్రయోగములను= నాగపాశములచే, భీమ=ఘోరములైన, నరవర=రామునియొక్క చేష్టలు=పనులు, బెండువడగ=వ్యర్థముగాగ, తదనుళి=లక్ష్మణునియొక్క, లసత్+ప్రతాపంబులు= గొప్ప పరాక్రమములు, ఒదుగు బడగ=క్షీణించగా, ఆజిఘనులు=యుద్ధనిపుణులు, పల్మఱు=మిక్కిలి, పొగడన్, కట్టుపరచెన్=కట్టివేసెను.

తాత్పర్యము : గుణధ్వనిచే జయింపబడిన సముద్ర ధ్వనిగల ఇంద్రజిత్తు తనశక్తిచే భయంకరుడై ప్రకాశించు గొప్ప శౌర్య గుణములనెడు మణులకు సముద్రుని వంటివాడై తన ముగ్ధావస్థగల రాత్రియందు రచింపబడిన అతి తీవ్రమైన పరాక్రమముతో ప్రకాశించెను. మిక్కిలి విజృంభించిన ఇంద్రజిత్తు యుద్ధ మధ్యమున తన సేన భంగపాటును శత్రుసేనల గర్వమును అణచి నాగపాశములచే ఘోరములైన రాముని చేష్టలు డీలుపడగ లక్ష్మణుని మహా ప్రతాపము క్షీణింపగా యుద్ధనిపుణులైన వారు పలుమారు పొగడగా వారిని కట్టివేసెను (రామలక్ష్మణులను).

భారత : సింజినీ నిర్ఘోషజిత సముద్ర ధ్వని, మేఘనాదుండు=మేఘనాదములు చేయువాడు, సమిద్ధశక్తిన్, భీష్ముండు=భీష్ముడు, సందీప్త పృథుశౌర్య గుణమణి, వాహినీశుండు=సేనాపతి, నిజాహవ=తన యుద్ధముయొక్క, దశదివసాంతర=పది దినములలో, చిత=సంపాదింపబడిన, తీవ్రవిక్రమతన్=అధిక పరాక్రమముచే – మిగతా సమానము. నాగభీషణ=సర్పములవలె భయంకరములైన, బాణ ప్రయోగ ములను, భీమ=భీముని యొక్క, నరవర చేష్టలు=అర్జునుని పనులు, బెండువడగ, తదనుజుల=నకుల సహదేవుల, సత్+ప్రతాపంబులు=గొప్ప పరాక్రమములు, ఒదుగువడగ, మిగతా సమానము.

తాత్పర్యము : తన గుణధ్వనిచే జయింపబడిన సముద్ర ధ్వనియు మేఘనాదములును, గలవాడు అధికశక్తిచే ప్రకాశించు ఘనములైన శౌర్య గుణములు గలవాడు, సేనాపతియైన భీష్ముడు తన పది రోజుల యుద్ధములో సాధించిన తీవ్ర

పరాక్రమముతో శోభిల్లుచు మిక్కిలి విజృంభించెను. యుద్ధమధ్యమున కలిగిన తన సేనల భంగపాటును, శత్రుసేనల గర్వమును అణచి సర్పములవంటి భయంకరమైన బాణప్రయోగములచే భీమార్జునుల చేష్టలు డీలుపడగా నకుల సహదేవుల అధిక ప్రతాపము క్షీణింపగా యుద్ధ నిపుణులు పలుమారులు పొగడునట్లు కుంటుపరచెను.

చం. దొర ననుజాన్వితంబుగ సుదుర్దమదుర్దశఁ గుందఁజేసి యి
ట్లురువడిఁ బేర్చుశాత్రవురణోద్ధతి పెంపు సహింపలేక తా
సరగున దాని మాన్పహరిచక్రముఁ బూని యెదిర్చె నంతనే
మరలె నరాతియత్నగరిమం దనపూఁపు నివారితంబుగన్. 128

రామా : దొరను=రాముని, అనుజాన్వితంబుగ=లక్ష్మణునితోగూడ, సుదుర్దమదుర్దశన్=మిక్కిలి కష్టముతో, కుందన్+చేసి=బాధపెట్టి, ఇట్లు+ఉరువడిన్+పేర్చు=ఈ విధముగా తీవ్రముగా ఎదుర్కొను, శాత్రవు=ఇంద్రజిత్తుయొక్క, రణోద్ధతి పెంపు=యుద్ధతీవ్రతను, సహింపలేక, తాన్=రాముడు, సరగునన్=వెంటనే, దానిమాన్ప=ఆ ఉద్ధతిని తగ్గించుటకు, హరి చక్రముబూని, వానర సమూహమును తీర్చి, ఎదిర్చెన్=ఎదిరించెను, అంతనే=అంతటిలోనే, అరాతి=శత్రువులైన ఇంద్రజిత్తు యొక్క, యత్నగరిమన్=బాణ ప్రయోగాది ప్రయత్నములచే, తన పూఁపు=తన ప్రయత్నమును, నివారితంబుగన్=అరికట్టబడి, మరలెను=ఓర్వలేక వెనుకకు తీసెను.

తాత్పర్యము : రామలక్ష్మణులను మిక్కిలి దుర్దశకు లోనుచేసి ఈ విధముగా వేగముగా ఎదిరించిన ఇంద్రజిత్తు యుద్ధ తీవ్రతను సహింపలేక రాముడు వెంటనే దానిని మాన్పుటకు వానర సేనలను సమాయత్తము చేసి ఎదిరించెను. అంతనే ఇంద్రజిత్తు యొక్క బాణప్రయోగాది యత్నములచే తన ప్రయత్నము నివారించబడగా ఓర్వలేక వెనుకకు తీసెను.

భారత : దొరను=ధర్మజుని, అనుజాన్వితంబుగా=భీమార్జున నకుల సహదేవులతో సహా, శాత్రవు=భీష్ముని, తాన్=కృష్ణుడు, హరిచక్రము=సుదర్శన చక్రమును, నర+అతి యత్నగరిమన్=అర్జునుని ప్రార్థనచే, మిగతా సమానము.

తాత్పర్యము : ధర్మజుని, భీమాది సోదరులతో గూడ మిక్కిలి దుర్దశ నొందజేసి ఈ విధముగా తీవ్రముగా ఎదిరించు భీష్ముని యుద్ధ తీవ్రతను సహింపలేక కృష్ణుడు వెంటనే దానిని మాన్పుటకు సుదర్శన చక్రమును బూని ఎదిరించెను. వెంటనే అర్జునుని ప్రార్థనచే తన ప్రయత్నము నివారించబడగా వెనుదిరిగెను.

సీ. అట్లవార్య ప్రౌఢి నలరుపితామహు
వరశక్తిఁ బ్రబలుదీవ్యత్ప్రతాప
గుణశాలి విజయుండు కోదండఘననాద
సంపదుల్లాసితసకలనిజచ
మూసంతతిశిఖండి యేసె నారచితస
చ్ఛద్మసంగ్రామ ప్రచారుఁ డగుచు
వైరినృపాలకుమారుల హృదయంబు
లెంతయు భేదిల్ల నిద్ధవివిధ

ఆ. విశిఖవిసరనిబిడ వివిధ సమస్తమ
ర్మతనుజేసి యుద్ధమహిఁ బడంగ
నేసి గురుమనోవికాససంపాది యై
యాప్తబంధుజనుల నలరఁజేసె. 130

రామా : అట్లు, అవార్య ప్రౌఢిన్=వారింపరాని పరాక్రమముచే, అలరు=ప్రకాశించు, పితామహువరశక్తిన్=బ్రహ్మదేవుని వరప్రభావముచే, ప్రబలు=అతిశయించు, దీవ్యత్=ప్రకాశించుచున్న, ప్రతాపగుణశాలి=పరాక్రమ గుణములచే నొప్పుచున్న, విజయుండు=జయముగలవాడు, కోదండ=కోదండమనెడి, ఘననాద=మేఘము యొక్క శబ్దము యొక్క, సంపత్=సమృద్ధిచే, ఉల్లాసిత=సంతోషింపజేయబడిన, సకల నిజచమూ సంతతి=తన సమస్తమైన సేనా సంపదయనెడి, శిఖండి=నెమళ్ళుగల ఇంద్రజిత్తు, సచ్ఛద్మ=కపటముతో, ఆరచిత=కూర్చబడిన, సంగ్రామప్రచారుడగుచు=యుద్ధ సంరంభము కలవాడై

(మేఘములలో నుండి) ఏసి=బాణములు కురిపించెను, వైరినృపాల కుమారుల= శత్రురాజుల, హృదయంబులు, ఎంతయు భేదిల్ల=మిక్కిలి నొచ్చుకొనగా, ఇద్ధవివిధ=సమృద్ధములైన వివిధములైన, విశిఖ విసర=బాణ సమూహములచే, నిబిడ=నిండిన, వివిధ సమస్త మర్మతనుజేసి=వివిధములైన సకల మర్మ స్థానములు భేదించి, యుద్ధమహిన్=యుద్ధభూమిలో, పడంగనేసి=పడగొట్టి, గురు=రావణుని, మనో వికాస సంపాదియై=మనసునకు సంతోషమును కలిగించినవాడై, ఆప్త బంధు జనులన్=స్నేహితులు బంధువుల, అలరన్జేసె=సంతోషింపజేసెను.

తాత్పర్యము : ఆ విధముగా వారింపరాని బలముతో బ్రహ్మ వరప్రభావముచే ప్రకాశించు ప్రతాప గుణములతో విజయముగల కోదండమనెడి మేఘము యొక్క నాద సమృద్ధిచే సంతోషించిన తన సేనాసముదాయమనెడి నెమళ్ళుగల ఇంద్రజిత్తు కపటముతో మేఘములలో నుండి యుద్ధము నడుపుచు, శత్రురాజ కుమారుల హృదయములు ఎంతగానో భేదింపబడగా, సమృద్ధములైన వివిధ బాణ సమూహములచే, భేదింపబడిన సకలమర్మ స్థానములు కలవారినిగా చేసి, యుద్ధభూమిలో పడగొట్టెను. రావణుని మనసునకు సంతోషమును కలిగించి, స్నేహితులను బంధువులను అలరించెను.

భారత : అట్లవార్య ప్రౌఢినలరు, వరశక్తి ప్రబలు=దివ్యశక్తిచే ప్రకాశించు, పితామహున్=భీష్ముని, దివ్యత్ ప్రతాపగుణశాలి, విజయుండు=అర్జునుడు, కోదండ ఘననాద సంపదుల్లాసిత సకల నిజచమూసంతతి=తన కోదండము యొక్క గొప్ప నాద సంపదచే, ఉల్లసించు సేనా సమూహము గలవాడై, శిఖండి, ఏసెనాన్= ప్రేసెననగా, రచిత=కల్పించబడిన, సచ్ఛద్మ సంగ్రామ ప్రచారుడగుచు=కపట యుద్ధ ప్రచారము గలవాడై, మర్మ=ఆయములుగల, తనుజేసి=శరీరముగల వానిని జేసి, గురు=అధికమైన మిగతా సమానము.

తాత్పర్యము : ఆ విధముగా అసమాన ప్రతిభతో నలరు భీష్ముని దివ్యశక్తిచే ప్రబలు ప్రతాప గుణములతో ప్రకాశించు గుణశాలియైన అర్జునుని కోదండ ఘన నాద సంపదచే సమస్త సేనా సముదాయము ఉల్లసింపగా శిఖండి ఏసెనాయన్నట్లు

కపట యుద్ధ సంరంభియై శత్రురాజుల హృదయములు ఎంతయు భేదిల్లజేసెను. సమృద్ధములైన వివిధ బాణసముదాయముచే ఆయములుగల శరీరముగల వానిని జేసి యుద్ధ భూమిలో పడగొట్టెను. అధికమైన మానసికోల్లాసముతో స్నేహితులను బంధువులను అలరించెను.

కం. దీనతఁ దత్ప్రతిపక్షబ
లానీకము గుందుచుండె నారాత్రిఁ గడున్
మానసములార్తిఁ బొగులం
గా నిఁక నేదిబ్రతు కేదిగతియో యనుచున్. 131

రామా+భారత సమానము.

ఆ రాత్రి, కదున్=మిక్కిలి, మానసములు=ఆర్తిన్ పొగులంగ=బాధతో నిండగా, ఇక ఏది బ్రతుకు=ఇక ఏది గతియో, అనుచున్, తత్+ప్రతిపక్ష బలానీకము=ఆ శత్రుసేనల సముదాయము, దీనతన్=దైన్యముతో, కుందుచుండె=బాధపడుచుండెను.

తాత్పర్యము : ఆ రాత్రి మనస్సులకు మిక్కిలి బాధ కలుగగా 'ఇంక బ్రతుకేది, ఇంక గతి ఏది?' అని ఆ శత్రుసేనా సముదాయము దైన్యముతో దుఃఖించుచుండెను.

ఉ. అంతట నద్భుతంబు గరుడాగమనంబు నిరాకృతాహితా
త్యంతసమార్జితోర్జితజయాభ్యుదయం బయి భీష్మపాతసం
క్రాంతఘనవ్యధ న్నెఱయఁ గా మఱపింపఁ బునర్మహాజివి
క్రాంతి కుపక్రమించు విభుఁగాంచి దినేశసుతాదులుబ్బుచున్. 132

రామా : అంతట, అద్భుతంబు=ఆశ్చర్యకరముగా, గరుడాగమనంబు= గరుత్మంతుని రాకచే, నిరాకృత+అహిత=విడిపింపబడిన సర్పములుగలదై, అత్యంత=మిక్కిలి, సమార్జిత=సంపాదింపబడిన, ఊర్జిత జయాభ్యుదయంబయి= గెలుపుచే సంతోషమును కలిగించి, భీష్మ=భయంకరమైన, పాత=పాటుచే, సంక్రాంత=సంక్రమించిన, ఘనవ్యధన్=గొప్ప బాధను, నెఱయగా మరపింపన్=మిక్కిలి

మరపింపగా, పునః+మహాజి విక్రాంతికి=తిరిగి యుద్ధ విక్రమమునకు, ఉపక్రమించు, విభున్+కాంచి=రాముని చూచి, దినేశ సుతాదులు=సుగ్రీవాదులు, ఉబ్బుచున్=సంతోషించుచు.

తాత్పర్యము : అంతలో ఆశ్చర్యకరముగా గరుడుని రాకతో సర్పములన్నియు విడిపోగా గెలుపునందలి సంరంభము కలిగి భయంకరమైన పాటుచే సంక్రమించిన గొప్ప వ్యధమరపింపగా, తిరిగి యుద్ధ విక్రమమునకు ఉపక్రమించిన రాముని జూచి సుగ్రీవాదులు సంతసించిరి.

భారత : అద్భుతంబుగన్=ఆశ్చర్యకరముగా, రుట్=రోషము యొక్క, ఆగమనంబు=రాక, నిరాకృత=నిరాకరింపబడిన, అహిత=శత్రువులచే, అత్యంత=మిక్కిలి, సమార్జిత, ఊర్జిత, జయాభ్యుదయంబయి, భీష్మపాతమునే=భీష్ముడు పడిపోవుటచే, సంక్రాంత నుండి సమానము, దినేశసుతాదులు=కర్ణాదులు – సంభ్రమించిరి. విభుడు=దుర్యోధనుడు.

తాత్పర్యము : అద్భుతముగా కలిగిన రోషము కలుగుటచే నిరాకరింపబడిన శత్రువుల యొక్క మిక్కిలి సంపాదింపబడిన గెలుపునందలి ఉత్సాహముచే, భీష్ముడు పడుటచే కలిగిన మిక్కిలి వ్యధ మరిపింపగా తిరిగి యుద్ధ విక్రమమునకు ఉపక్రమించిన దుర్యోధనుని చూచి కర్ణాదులు (సంభ్రమించిరి).

వ. చేరి పొడగాంచి ప్రస్తుతసమరసన్నాహసముచిత ప్రకారంబున
సంభ్రమించి రంత నరుణోదయం బగుటయు. 133

రెండింటికి సమానము.

దానిని చూచి ప్రస్తుత యుద్ధ ప్రయత్నమునకు ఆశ్చర్యపడిరి – అంతట సూర్యోదయము కాగా.

కం. గురురక్షోర్జితదర్ప
స్ఫురణముచే శత్రుసైన్యములు మార్కొనఁ జె

చ్చెర వైవస్వతసంతతి
నరవరుఁ డొగి నద్దుర మ్మొనర్చె సబలుఁ డై. 134

రామా : గురు=అధికమైన, రక్షః+ఆర్జితదర్ప స్ఫురణముచే=సంపాదింపబడిన రాక్షసుల గర్వ స్ఫూర్తిచే, శత్రుసైన్యములను, మార్కొనన్=ఎదిరించుటకు, చెచ్చరన్=త్వరత్వరగా, వైవస్వత సంతతి నరవరుడు=రాముడు, బగిన్=ప్రయత్న పూర్వకముగా అ+దురము=ఆ యుద్ధమును, సబలుడై=సేనలతోగూడి, ఒనర్చెన్=చేసెను.

తాత్పర్యము : అధికముగా సంపాదింపబడిన రాక్షసుల గర్వస్ఫూర్తిచే శత్రు సైన్యములను ఎదిరించుటకు త్వరత్వరగా రాముడు ప్రయత్నించి ఆ యుద్ధమును సేనలతో గూడి చేసెను.

భారత : గురు=ద్రోణునియొక్క, రక్ష=రక్షణచే – మిగతా సమానము.

తాత్పర్యము : ద్రోణుని రక్షణచే కూడిన గర్వస్ఫూర్తితో శత్రుసైన్యములను ఎదుర్కొనుటకు వెంటనే దుర్యోధనుడు తన బలములతో కూడా ఆ యుద్ధమును చేసెను.

వ. అప్పుడు. 135

కం. అత్యంతము నవనిసుతా
పత్యతనుబలంబులోనఁ బస మీఱి మహా
దైత్యుఁ డనఁబరఁగు శూర
స్తుత్యుఁ డసమరోషవికృతి ధూమ్రాక్షుఁ డనిన్. 136

రామా : అత్యంతము=మిక్కిలి, అవనిసుతాపతి=రాముని యొక్క, అతను=అనల్పమైన, బలంబులోన, పసమీఱి=ఆధిక్యతను బొంది, మహాదైత్యుడు+అనన్+బరగు=గొప్ప రాక్షసుడని పేరొందిన, శూరస్తుత్యుడు=వీరులచే పొగడబడెడి, అనిన్=యుద్ధమునందు, అసమరోషవికృతిన్=అసమానమైన పౌరుష వికారముచే,

ధూమ్రాక్షుడు=పేరు.

తాత్పర్యము : రాముని యొక్క మిక్కిలి అనల్పమైన బలములో ఆధిక్యతను బొంది గొప్ప రాక్షసుడని పేరొంది, వీరులచే పొగడబడెడివాడు, యుద్ధములో అసమానమైన పౌరుష వికారము గలిగిన ధూమ్రాక్షుడను రాక్షసుడు –

భారత : అవనిసుత=నరకాసురుని యొక్క అపత్యతను=పుత్రత్వముచే, బలంబులోన, పసమీరి, మహాదైత్యుడనబరగు, శూరస్తుత్యుడు=భగదత్తుడు, అసమరోష వికృతిన్, అనిన్, ధూమ్ర+అక్షుడు=ఎఱ్ఱని కన్నులు గలవాడు.

తాత్పర్యము : నరకాసురుని యొక్క పుత్రుడైనందున శక్తిలో ఆధిక్యతను పొంది రాక్షసునితో సమానమైన భగదత్తుడు యుద్ధములో ఎఱ్ఱని కన్నులు గలవాడై అసమానమైన రోషవికారముచే (చరించెను).

తే. దళిత హరికుంజర శతాంగముల ధరిత్రిఁ
గప్పుచు యథామనోరథగతిఁ జరించె
నవనిజారూఢమదవారణ క్రియలకు
నిలువ లేకపార్థబలయోధులు దొలంగ. 137

రామా : దళిత=భేదింపబడిన, హరికుంజర=వానరముఖ్యుల యొక్క, శత=వందలాది (వానరుల) అంగములన్=అంగములచే, ధరిత్రిన్ కప్పుచు=భూమిపై నింపుచు, యథామనః=మనస్సును అతిక్రమింపని, రథగతిన్=రథచలనముచే, నవ=క్రొత్తదైన, నిజ+ఆరూఢ=తన దృఢమైన, మద=మదమునకు, వారణ క్రియలకున్=ఎదిరించుటకు నిలువ లేక, అపార్థ బలయోధులు=చెదిరిన బలముగల యోధులు, తొలంగన్=తొలగిపోగా, చరించె=తిరిగెను.

తాత్పర్యము : శతాధికమైన వానరముఖ్యుల అంగములను భేదించి నేలపై కప్పుచు మనస్సు నతిక్రమింపని రథగతిచే క్రొత్తదైన తన దృఢమైన మదమును ఎదిరించి నిలువలేక శక్తి హీనులైన యోధులు తొలగిపోగా చరించెను.

భారత : దళిత, హరికుంజర శతాంగములన్=గుఱ్ఱములు ఏనుగులు రథముచే, ధరిత్రిన్‌కప్పుచు, యథామనోరథగతిన్=తన ఇష్టము వచ్చిన రీతిలో, నవ, నిజరూఢ, మదవారణ=మత్తేభము యొక్క, క్రియలకున్=యుద్ధక్రియలకు, నిలువలేక, పార్థబల=అర్జునుని సేనయందుగల, యోధులు తొలంగన్, చరించె.

తాత్పర్యము : భేదింపబడిన రథాశ్వగజ బలములను నేలపై బడవేసి, తనకొత్తదైన రూఢమైన మత్తేభము యొక్క యుద్ధక్రియలకు అర్జునుని (ధర్మజుని) సేనయందలి యోధులు తొలగిపోగా చరించెను.

వ. అంత నంతయుం గనుంగొని. 138

తాత్పర్యము : అంతనంతయుం గనుంగొని.

క. తమకమున మరుద్వరసుతుఁ
డమితవ్యథఁ జెదరునిజబలాళి మగుడ దు
ర్దమరణజయశోభగద
త్తమహాశుండాలమునకుఁ దా నెదిరించెన్. 139

రామా : తమకమునన్=త్వరపడి, మరుత్=వాయువు యొక్క, వరసుతుడు=హనుమంతుడు, అమిత వ్యథన్=మిక్కిలి బాధతో, చెదరు=చెదరిపోవు, నిజబలాళి=తన సేనాసమూహము, మగుడన్=వెనుదిరుగగా, దుర్దమరణ=అణపశక్యముగాని యుద్ధమునందు, జయశోభగన్=జయలక్ష్మి గలదియై, దత్త=ఇయ్యబడిన, మహాశుండు=గొప్ప ఆశగలవాడు (విరిగిన సేన తిరిగి యుద్ధమునకు పూనుకొనుటకు ఆధారమైనవాడు) ఆలమునకున్=యుద్ధమునకు, తాను, ఎదిరించెన్=ఎదిరించెను.

తాత్పర్యము : వాయుపుత్రుడైన హనుమంతుడు త్వరపడి మిక్కిలి బాధతో చెదిరిపోయిన తన సేనాసమూహము వెనుదిరుగగా అణపశక్యముగాని యుద్ధమునందు వెనుదిరిగిన సేనలను యుద్ధమునకు పురికొల్పుటకు ఆధారమైనవాడై తాను ఎదిరించెను.

భారత : తమకమున్, మరుద్వర=ఇంద్రుని యొక్క సుతుడు=కుమారుడైన అర్జునుడు, దుర్దమ, రణజ=యుద్ధము వలన, యశో=యశస్సుగల, భగదత్త=భగదత్తుని యొక్క, మహాశుండాలమునకున్=సుప్రతీకమను ఏనుగును, తాను=ఎదిరించెను.

తాత్పర్యము : ఇంద్రుని యొక్క కుమారుడైన అర్జునుడు అణపశక్యముగాని యుద్ధము వలన చెదిరిన సేనలను కీర్తిగల భగదత్తుని యొక్క ఏనుగు సుప్రతీకమును తాను ఎదిరించెను.

తే. తొలఁగ కెడ సొచ్చుమానవాదుల సుశర్మ
యోధులను బాఱఁ ద్రోలి య ట్లురుభుజావి
భూతి నెదిరించునాకపికేతను నతఁ
డాజి నొప్పించి మడిసె వాహనముతోడ. 140

రామా : తొలగక=వదలక, ఎడసొచ్చు=ఎదిరించు, మానవాదులన్=మానవులను భక్షించెడి వారిని, సు=మిక్కిలి, శర్మ=సుఖమౌనట్లు (అనాయాసముగ), యోధులను=వీరులను, పారద్రోలి, ఇట్లు, ఉరుభుజావిభూతిన్=గొప్ప భుజబల పరాక్రమముచే, ఎదిరించు, ఆ కపికే=ఆ హనుమంతునికే, అతడు=ఆ ధూమ్రాక్షుడనెడు రావణుని మూలబలకర్తను, తనున్=తనను, ఆజిన్=యుద్ధమున, ఒప్పించి=అప్పగించి, వాహనముతోడ, మడిసె=చనిపోయెను.

తాత్పర్యము : తొలగిపోకుండ ఎదిరించు రాక్షస వీరులను అనాయాసముగా పారద్రోలి, ఈ విధముగా గొప్ప భుజబలపరాక్రమముచే ఎదిరించు ఆ హనుమంతునికే ఆ ధూమ్రాక్షుడు తనను యుద్ధమున అప్పగించి వాహనముతో మరణించెను.

భారత : తొలగక, ఎడసొచ్చు, మానవాదులన్=పంతములాడువారిని, సుశర్మ యోధులను=సంసప్తకులను, పారద్రోలి, ఇట్లు, ఉరుభుజావిభూతిన్, ఎదిరించు, ఆ కపికేతనున్=అర్జునుని, అతడు=భగదత్తుడు, ఆజిన్, నొప్పించి=యుద్ధమున బాధించి, వాహనముతోడ మడిసె.

తాత్పర్యము : తొలగిపోక ముందుకుసాగి పంతములాడు సంసప్తకులను పారద్రోలి, ఈ విధముగా మిక్కిలి భుజబలపరాక్రమముతో నెదిరించు అర్జునుని ఆ భగదత్తుడు యుద్ధమున నొప్పించి తన వాహనముతో గూడ చనిపోయెను.

వ. మఱియును. 141

కం. బహురక్షో భయసేనలు
విహితాజనిఁ ద్రెళ్ల నంత విలసిల్లె జగ
న్మహితాహవరుచిరక్షి
ప్రహస్తకోదండగురుతరస్ఫూర్తిగడున్. 142

రామా : బహురక్షః=పెక్కురు రాక్షసుల యొక్క, అభయ సేనలు=భయములేని సేనలు, విహిత+ఆజిని=గొప్ప యుద్ధములో, త్రెళ్లన్=నశింపగా, అంతన్, జగత్+మహిత=లోకము పొగడు, ఆహవ రుచిన్=యుద్ధపు వేడుకచే, రక్షి=రక్షించెడి, ప్రహస్త=రావణుని సేనాపతియైన ప్రహస్తుని యొక్క, కోదండ=కోదండము యొక్క, గురుతర స్ఫూర్తిన్=గొప్ప స్ఫూర్తితో, విలసిల్లె.

తాత్పర్యము : భయములేని పెక్కండ్రు రాక్షస సేనలు గొప్ప యుద్ధములో నశింపగా, అంతట లోకము పొగడు యుద్ధవేడుకచే రక్షించెడి ప్రహస్తుని కోదండము యొక్క గొప్ప స్ఫూర్తితో విలసిల్లెను.

భారత : బహురక్ష=మిక్కిలి రక్షణగల, ఉభయసేనలు, కౌరవ పాండవసేనలు, విహితాజిని త్రెళ్లక, జగన్మహిత, ఆహవ రుచిర=యుద్ధ ప్రకాశముచే, క్షిప్ర= వేగవంతమైన, హస్త=హస్తముగల, కోదండగురు=ద్రోణుని యొక్క, తరః=బలిమి యొక్క, స్ఫూర్తిన్, కడున్, విలసిల్లె.

తాత్పర్యము : మిక్కిలి రక్షణగల కౌరవ పాండవ సేనలు గొప్ప యుద్ధమునందు నశింపగా లోకప్రసిద్ధమైన యుద్ధప్రకాశముచే వేగవంతమైన హస్తముగల ద్రోణుని బలిమి యొక్క స్ఫూర్తిచే విలసిల్లెను.

సీ. ఆమేటి తనదు సైన్యమును బద్మవ్యూహ
భంగిc జూపట్టంగc బన్ని హతిక
రప్రహారప్రవర్తనలచేc జీకాకు
పఱుచుచుc గడుc జొచ్చి మఱచియాడు
వీరకుంజర జగద్వినుతవిక్రము ధనం
జయతనూజు సుభద్రసంతతి నవ
రోధించి బహుమహాయోధనవ్యాపార
శూరత ప్రాపుగాc బోరిపోరి
తే. గెలువ నోపక మిక్కిలి నలcగి యంత
నతనిధర్మ విహీనయుద్ధాతిశయము
చేతc జంపించెc దనుc దనసేనవారిc
గాచుకొన నొండుమార్గంబు గానలేక. 143

రామా : తనదు సైన్యమును=తన సేనలను, పద్మవ్యూహభంగిన్=పద్మసమూహమువలె, చూపట్టంగన్=కన్పించునట్లుగా, సన్నిహితిన్= పాదప్రహారములచే, కరప్రహార ప్రవర్తనలచే=చేతితో బాదెడి పనులచే, చీకాకు పఱచుచు=చీకాకు పెట్టుచు, కడున్+జొచ్చి=మిక్కిలి లోపలికి ప్రవేశించి, మఱచియాడు=తుత్తునియలు జేసి, వీరకుంజర=వీరయోధుడైన వానిని, జగద్వినుత విక్రమున్=లోకము పొగడు పరాక్రమముగలవానిని, ధనంజయ తనూజున్=అగ్నిపుత్రుడైన నీలుని, సు= లెస్సయయిన, భద్రసంతతిన్=శుభపరంపరలుగలవానిని, ఆమేటి=ప్రహస్తుడు, అవరోధించి=అడ్డుపెట్టి, బహుమహాయోధన=అనేకములైన గొప్ప యుద్ధముల యొక్క వ్యాపార శూరతన్=నడవడితోగూడిన పరాక్రమముచే, ప్రాపుగా=శక్తివంతముగా, పోరిపోరి=పోరాడి, గెలువనోపక=గెలువజాలక, మిక్కిలి నలగి=మిక్కిలి కోపించి, అంతన్, అతని=నీలుని యొక్క, ధర్మవిహీన=విల్లులేని, యుద్ధాతిశయముచేత= యుద్ధతీవ్రతచే, తనున్=తనను, తనసేనవారిన్=తన సేనలను, కాచుకొన,

ఒండుమార్గంబు=మరియొక మార్గము, కానలేక=కనిపించక, కరప్రహార ప్రవర్తనలచే=చేతులతో బాదుటచే, చంపించె=చంపించెను.

తాత్పర్యము : రాక్షససైన్యము పద్మసమూహామువలె కన్పించగా పాదప్రహారములచే నుఱచియాడుచున్న వీరకుంజరుడు చికాకు పరచుచు ప్రవేశించి లోకములు పొగడు పరాక్రమము గల అధిక శుభపరంపరలుగల నీలుని ఆ ప్రహస్తుడు అడ్డుపడి మిక్కిలి యుద్ధ పరాక్రమముతో పోరాడి గెలువలేక మిక్కిలి కోపించి విల్లులేని ఆ నీలుని చేతిదెబ్బలతో తన సేనలను చంపించెను. (ప్రహస్తుడు నొచ్చెను).

భారత : ఆమేటి=ద్రోణుడు, తనదు సైన్యమును, పద్మవ్యూహభంగిన్= పద్మవ్యూహమువలె, చూపట్టంగపన్ని=కన్పించునట్లు ఏర్పరచి, హతికర= నాశకరములైన, ప్రహార ప్రవర్తనలచేన్=ప్రహారముల నడవడికచే, చీకాకు పఱచుచు, కదుజొచ్చి, నుఱచియాడు, వీరకుంజర, జగద్వినుత విక్రమున్, ధనంజయతనూజున్= అభిమన్యుని, సుభద్ర సంతతిన్=సుభద్ర కుమారుని, అవరోధించి, మిగతా సమానము, అతనిన్=అభిమన్యుని, ధర్మవిహీన యుద్ధాతిశయముచేతన్=మిక్కిలి అధర్మ యుద్ధములో చంపించె.

తాత్పర్యము : ద్రోణుడు తన సేనలను పద్మవ్యూహమువలె కన్పించునట్లు ఏర్పరచి నాశకరములైన ప్రహారపు నడవడికచే చికాకు పరచుచు ప్రవేశించి లోకప్రసిద్ధమైన వీరకుంజరము, సుభద్రా తనయుడునైన అర్జునుని కుమారుడైన అభిమన్యుని అడ్డగించి మహాయోధుల ప్రక్రియలచే పరాక్రమవంతముగా పోరాడి, గెలువజాలక మిక్కిలి కోపించి, అంతట ద్రోణుడు తనను, తన సేనలను కాపాడుకొనుటకు వేరు మార్గము లేక అభిమన్యుని చంపించెను.

సీ. అతిశౌర్యపరసుశర్మాకృష్టవిజయతఁ
జేసి నానాపార్థసేన లపుడు
రౌద్రవరోల్లాస రాజితు నక్షయ
ధృతి సింధునాయకుఁ దీవ్రశక్తి

నాకీశు దృఢరణోత్సేకుని మించి తో
ద్పడలేక యొదుగ నాబలియుఁ డట్ల
డ్రుంగెను విరథుఁ డై తుదను దుశ్శాసన
తనుజగదాహతి ననయముఁ బ్రతి

ఆ. కోటి లేనినాదు కొమరున కిప్పాటు
వెలసె నకట! యిది యవార్య మనుచు
వేఁగె వానిచావు విని యంత జిష్ణుండు
ఖండితారిపంక్తికంధరుండు. 144

రామా : అతిశౌర్య=మిక్కిలి పరాక్రమముగల, పర=కపులచే, సుశర్మ=మిక్కిలి సుఖమైనట్టి, ఆకృష్ట=తిప్పబడిన, విజయతన్+చేసి=జయము కలుగుటచే, నానా=అనేక విధములైన, అపార్ధ సేనలు=విరిగిన రాక్షస సేనలు, అపుడు, రౌద్రవర+ఉల్లాస రాజితున్=రౌద్రమైన ఉల్లాసముచే ప్రకాశించు, అక్షయ ధృతిన్=అక్షయమైన ధైర్యముచే, సింధు నాయకున్=సముద్రుని వంటి వానిని, తీవ్రశక్తిన్=బలమైన శక్తిగలవానిని, ఆకీశున్=ఆ వానరుడైన నీలుని, దృఢరణోత్సేకుని=మిక్కిలి దృఢమైన యుద్ధోత్సాహము గలవానిని, మించి=అతిశయించి, తోద్పడలేక=ఎదిరించలేక, ఒదుగన్=తలవంచగా, ఆ బలీయుడు=ప్రహస్తుడు, అట్ల=ఆ విధముగా, డ్రుంగెను=నశించెను, తుదను= చివరకు, విరథుడై=రథములేని వాడై, దుశ్శాసనతను=శిక్షింప శక్యముగానివాడై, జగదాహతిని=లోకసంహారముచే, అనయము=మిక్కిలి, ప్రతి కోటిలేని=ఎదురులేని, నాదు=నా యొక్క, కొమరునకు=ఒప్పిదమునకు, ఇప్పాటు=ఈ భంగపాటు, వెలసెనకట=కలిగెను గదా! ఇది, అవార్యమనుచు=తప్పదని, వాని చావు విని, అంత, జిష్ణుండు=జయశీలుడైన, ఖండితారి=శత్రుసంహారము చేయగల, పంక్తి కంధరుండు=రావణుండు, వేగె=బాధపడెను.

తాత్పర్యము : మిక్కిలి పరాక్రమవంతులైన కపులచే అప్రయాసముగా రాక్షస సేనలు గెలువబడెను. నానా విధములుగా విరిగిన రాక్షససేనలు అపుడు రౌద్రమైన

మిక్కిలి ఉల్లాసముచే ప్రకాశించుచు అక్షయమైన ధైర్యసంపదలో సముద్రునివంటి తీవ్రశక్తిగల నీలుని యుద్ధ దృఢత్వమును మించి ఎదిరించలేక ఒదుగగా ఆ ప్రహస్తుడు విరథుడై చివరకు ఆ విధముగా నశించెను. 'శిక్షింపశక్యముగాని లోక సంహారకుడై ఎదిరించు వారు లేని నా ఒప్పిదమునకు ఈ విధమైన భంగపాటు కలిగెను గదా! ఇది అనివార్యము' అనుచు అతని మరణ వార్తను విని జయశీలుడు, శత్రు సంహారకుడు అయిన రావణుడు బాధపడెను.

భారత : అతిశౌర్యపర=మిక్కిలి పరాక్రమవంతుడైన, సుశర్మ=సుశర్మచే, ఆకృష్ట=వెడలదీయబడిన, విజయతన్+చేసి=అర్జునుడుగలవాడై (అభిమన్యునకు విశేషణము) నానా=నానావిధములైన, పార్థసేనలు=పాండవసేనలు, అపుడు, రౌద్రవరోల్లాస=రుద్ర సంబంధమైన వరము యొక్క ఉల్లాసముచే, రాజిత, అక్షయ ధృతిన్=అధిక ధైర్యముగల వానిని, తీవ్రశక్తిన్, నాకీశున్=ఇంద్రుని బోలిన వానిని, దృఢ రణోత్సేకుని మించి, తోడ్పడ లేక=ఒదుగన్, ఆ బలీయుడు=అభిమన్యుడు, దుశ్శాసన తనుజ=దుశ్శాసనుని కుమారుడైన లక్ష్మణుని యొక్క గదాహతి=గదవేటుచే, అట్ల, విరథుడై, త్రుంగెను, అనయము, ప్రతికోటిలేని, నాదు కొమరునకు=నా కుమారునికి, ఇప్పాటు వెలసెనకట, ఇది అవార్యమనుచు, వాని చావు విని, అంత, ఖండితారి పంక్తి=ఖండింపబడిన శత్రువుల వరుసల, కంధర=కంఠములు గల జిష్ణుండు=అర్జునుడు, వేగెన్=బాధపడెను.

తాత్పర్యము : మిక్కిలి పరాక్రమవంతుడైన సుశర్మచే వెడలదీయబడిన అభిమన్యుని నానా విధములైన పాండవ సేనలు, శివుని వరము యొక్క ఉల్లాసముచే ప్రకాశించుచు మిక్కిలి ధైర్యముచే, తీవ్రశక్తిచే ఇంద్రుని బోలి యుద్ధము నందు దృఢమైన ఆధిక్యముగల సైంధవుని మించి ఎదిరించలేక ఒదుగగా దుశ్శాసనుని కుమారుడైన లక్ష్మణుని గదా ప్రహారముచే అభిమన్యుడు నేలవాలెను. ఎన్నడు శత్రుకోటిలేని నాకుమారునకు ఈ విధమైన భంగపాటు అకటా! కలిగెను గదా! ఇది అనివార్యమని వాని చావు విని శత్రుసేనల కంఠమును ఉత్తరించు అర్జునుడు బాధపడెను.

వ. ఇట్లు శోకసంతప్తమానసుం డగు నతనిఁ గనుంగొని. 145

తాత్పర్యము : రెండింటికి సమానము -

ఈ విధముగా దుఃఖోద్వేగముతో కూడిన మనసుగల రావణుని/అర్జునుని చూచి -

ఉ. ఊహ గలంగి యిట్లడల నూరక యేటికి నాహవక్రియా
సాహసవర్తనంబుతఱిఁ జావులు క్రొత్తలె చాలు నిట్టిదు
ర్మోహ మికం త్యజింపుము సముత్కటశోకవిషాదహేతువై
దేహిఁ గరంబు గీడ్పఱుచు దీనితగుల్ మది నెంచి చూచినన్. 146

రామా : ఊహకలంగి=ఆలోచనలతో వ్యాకులపడి, ఇట్లు=ఈ విధముగా, ఊరక=వ్యర్థముగా, అడలన్-ఏటికి=బాధపడుట ఎందులకు, ఆహవక్రియా సాహస వర్తనంబు తరిన్=యుద్ధక్రీడయందలి సాహసపు పనుల సమయములో, చావులు క్రొత్తలే=మరణములు కొత్తవియా, చాలునిట్టి దుర్మోహము=ఈ విధమైన చెడు మోహము చాలును, సముత్కట=మిక్కిలి, శోక విషాదహేతు=దుఃఖమునకు, విషాదమునకు కారణమైన, వైదేహిన్=సీతను, ఇకన్ త్యజింపుము=ఇంక వదిలి పెట్టుము, దీని తగుల్=మోహాసక్తి, మదినెంచి చూచినన్=మనసులో భావించినచో, కరంబు=మిక్కిలి, కీడు+పరచు=చేటు చేయును.

తాత్పర్యము : రావణా! విషాదముతో ఈ విధముగా ఊరకే బాధపడుట ఏల? యుద్ధ క్రీడయను సాహసపు పనిలో మరణములు క్రొత్తలా? ఈ విధమైన చెడు మోహము ఇక చాలును. మిక్కిలి శోక విషాదములకు కారణభూతమైన సీతను వదలిపెట్టుము. ఆలోచించినచో ఆమె తగులము మిక్కిలి కీడు కలిగించును.

భారత : అర్థము సమానము. శోక విషాదహేతువై=శోక విషాదములకు కారణమై, దేహిన్=మనుష్యుని, దీని తగుల్=మోహాసక్తి.

తాత్పర్యము : అర్జునా! మనో వైకల్యము కలిగి ఈ విధముగా ఊరక బాధపడుట

ఎందులకు? యుద్ధక్రీడా సాహస వర్తనములో మరణములు నూతనమా! ఇంక చాలును. ఈ విధమైన చెడు మోహమును వదలిపెట్టుము. మోహాసక్తిగల మనుజునికి ఆలోచించి చూచినచో మిక్కిలి శోక విషాద హేతువైన చెడు మోహము కీడు కలిగించును.

కం. అని పెద్ద లైనయాప్తులు
దనుఁ దేర్పఁగ నుస్సు రనుచుఁ దలయూఁచి మనం
బునఁ దత్తదహితనృపవ
ర్తనచింతం గినుక బలిసి రాఁ దనలోనన్. 147

రెండింటికి సమానము.

అని పెద్దలైన ఆప్తులు, తనున్=రావణుని/అర్జునుని, తేర్పగా=ఊరటపరచగా, ఉస్సురనుచు, తలవూచి, మనంబున, తత్+తత్=ఆయా, అహిత నృపవర్తనచింతన్=హితము కాని రాజమార్గములో, తనలోనన్, కినుక బలిసిరాన్=కోపము హెచ్చుగా.

తాత్పర్యము : అని పెద్దలైన సన్నిహితులు రావణుని/అర్జునుని ఊరట చెందింపగా ఉస్సురని తలయూచి మనస్సులో ఆయా రకములైన హితముకాని రాజమార్గ ధోరణిలో తనలో కోపము హెచ్చుగా...

ఉత్సాహ : ఆదుకొన్న కావరమున నకట మనుజమాత్రుఁడీ
మేదినిపయి సింధురాజు మీఱి వచ్చి భీమ సే
నాది బహుసహాయచయము నాఁగి చెఱుచువాఁడె హా
నాదుపట్టినట్టిచలమునన్ గణింపఁ డేమియున్. 148

రామా : ఆదుకొన్న=మించిన, కావరమున=గర్వముతో, అకట, ఈ మేదినిపయి=ఈ భూమిపై, మనుజమాత్రుడు=మానవమాత్రుడు, సింధురాజు=సముద్రుని, మీరివచ్చి=దాటి, భీమసేనాది=భయంకరమైన సేనలు మొదలగువానిని, బహు సహాయచయము=మిక్కిలి సహాయపడు బృందమును, ఆగి=నిలువరించి,

చెఱచువాడె=నశింపజేయువాడే, హా! నాదు పట్టినట్టి=నేను చేపట్టిన, చలము= పంతమును, నన్=నన్ను (రావణుని) గణింపదు+ఏమియున్=ఏమాత్రము లెక్కింపదు.

తాత్పర్యము : అకటా! మించిన పొగరుతో భూమిపై ఒక మానవమాత్రుడు సముద్రమును దాటి ఉగ్రమైన సేనాసముదాయముతో వచ్చి ఆహా! నేను పట్టిన పంతమును, నన్ను ఏమాత్రము లెక్కింపదు గదా!

భారత : సింధురాజు=సైంధవుడు, భీమసేనాది=భీముడు మొదలైన, బహు సహాయచయము, నాదుపట్టిన్=నా కుమారుడైన అభిమన్యుని, అట్టిచలము=ఆ విధమైన పంతమును, నన్=నన్ను – మిగతా సమానము.

తాత్పర్యము : అకటా! ఈ భూమిపై ఒక మానవ మాత్రుడైన సైంధవుడు మిక్కిలి కావరముతో మీరి భీమసేనాదులతో కూడిన బహువిధ సహాయ బృందముతో కదలివచ్చి ఆహా! నా కుమారుడైన అభిమన్యుని ఆ విధమైన పంతముతో కూల్చువాడే! అట్టి పంతమును, నన్ను ఏమాత్రము లెక్కింపదు గదా!

వ. అని యుగ్గడించి యందులకేమి యన్నియుం జిక్కనయ్యెడు నని
రోషవేగంబున రోజుచు నందఱు విననిట్లనియె. 149

రెండింటికి సమానము –

అని యుగ్గడించి=అని మాట్లాడి, అందులకేమి=దానికేమి, అన్నియున్, చిక్కనయ్యెడునని=సరిపడునని, రోషవేగంబున=తీవ్రమైన కోపముతో, రోజుచు= ఉద్రేకపడుచు, అందరు విననిట్లనియె.

తాత్పర్యము : అని పలికి రావణుడు/అర్జునుడు దానికేమి అన్నియు సరిపడునని తీవ్రమైన కోపముతో ఉద్రేకపడుచు అందరు వినునట్లు ఇట్లు పలికెను.

కం. ధృతి నేన కూల్తు నరిసం
హతిఁ బాఱఁగఁ దఱిమి తఱిమి యాసింధుమహీ

పతితలసద్బలవత్సై
న్యతనూఖండముల జంబుకాదులు దనియన్. 150

రామా : నేన=నేనొక్కడనే (రావణుడు) ధృతిన్=ధైర్యముతో, అరిసంహతిన్=శత్రు సమూహమును, పారగ తరిమి తరిమి=పరుగెత్తునట్లు తరిమికొట్టి, ఆ సింధు=సముద్ర పర్యంతమైన, మహి=భూమియందు, పతిత=పడిన, లసత్+బలవత్=ప్రకాశించు బలవంతమైన, తనూఖండములన్=శరీర భాగములచే, జంబుకాదులు=నక్కలు మొదలైనవి, తనియన్=తృప్తిపడునట్లుగా, కూల్తున్=కూల్చెదను.

తాత్పర్యము : నేనొక్కడనే ధైర్యముతో పారద్రోలి తరిమి సముద్ర పర్యంతమైన భూమియందు పడిన ప్రకాశవంతము, బలిష్ఠము అయిన శత్రు సమూహముల శరీర భాగములచే నక్కలు మొదలైనవి తృప్తిపడునట్లు కూల్చివేసెదను.

భారత : ఆ సింధు మహీపతి=సైంధవుడు, తలన్=తలను, కూల్తును.

తాత్పర్యము : నేనొక్కడనే (అర్జునుడు) ధైర్యముతో శత్రుసమూహములను పారద్రోలి తరిమి తరిమి సైంధవుని తల యొక్క ప్రకాశవంతము, బలిష్ఠము అయిన శరీర భాగములను నక్కలు మొదలైనవి తృప్తిపడి తినునట్లు కూలవేసెదను.

తే. వినుఁడు నాపంత మిదె నేఁడు వేగయుక్త
గతి నలిగి యానృపుని నేలఁ గలపువాఁడె
నలినమిత్రునస్తమయంబునకు మునుపుగ
భానుపుత్త్రాదితత్పక్షబలముఁ దఱిమి. 151

రామా : రావణుడు పలుకు మాటలు.

నా పంతము, ఇదె, వినుడు, నేడు, వేగయుక్తగతిన్=వేగముతో కూడిన రీతిలో అలిగి=కోపించి, ఆ నృపుని=రాముని, నలిన్=వేడుకతో, అమిత్రు=రాముని యొక్క అస్తమయంబునకున్=నాశనమునకు, మునుపుగ=ముందుగా, భానుపుత్త్రాది=సుగ్రీవుడు మొదలైన, తత్+పక్షబలమున్=ఆ శత్రుపక్షమువారి సేనలను,

తఱిమి=పోరాడి, నేలన్+కలుపువాడె=నేలగూల్చువాడను.

తాత్పర్యము : ఇదే నా పంతము వినుడు, నేడు వేగవంతమైన రీతిలో కోపించి రాముని మరణమునకు ముందే సుగ్రీవాది శత్రుపక్ష సేనలను పోరాడి నేలగూల్చగలను (రావణుడను మాటలు).

భారత : అర్జునుని మాటలు – నేడు, వేగన్=తెల్లవారునంతలో, యుక్తగతిన్=తగిన రీతిలో, ఆ నృపుని=సైంధవుని, నలినమిత్రు=సూర్యుని యొక్క అస్తమయంబునకు మునుపుగా=అస్తమించులోపల, భానుపుత్రాది=కర్ణుడు మొదలైన, మిగతా సమానము.

తాత్పర్యము : అర్జునుడిట్లనెను : నా పంతమును వినుడు. నేడు తెల్లవారినను తగిన రీతిలో కోపించి సూర్యాస్తమయమునకు ముందే కర్ణాది ఎదుటి పక్షమువారి సైన్యమును తరిమి నేలగూల్చువాడను.

తే. ఏఁ గడఁగి యిట్లు గావింపనేని బెలుచఁ
జత్తు రుగ్రాజిభాసురజ్వలనమునకు
శలభత వహించి యస్మాకసైన్యపతులు
విద్విషత్సైనికులు సముద్వీక్షఁ జూడ. 152

రామా : ఏన్=నేను (రావణుడు) కడగి=ప్రయత్నించి, ఇట్లు కావింపనేని=ఇట్లు చేయనిచో, పెలుచన్=సులభముగా, ఉగ్ర+ఆజి భాసురజ్వలనమునకు, తీవ్రమైన యుద్ధప్రతాపమనెడి అగ్ని జ్వాలలకు, శలభత వహించి=మిడతలవలె, విద్విషత్=శత్రువైన రాముని యొక్క, సైనికులు, సముత్+వీక్షన్చూడ=సంతోషముతో కూడిన చూపులతో చూడగా, అస్మాక=మనసంబంధులైన, సైన్యపతులు=సేనాధిపతులు, చత్తురు.

తాత్పర్యము : నేనట్లు చేయనిచో తీవ్రమైన యుద్ధప్రతాపాగ్ని కీలలలో రాముని సైనికులు సంతోషముతో చూడగా మన సేనాధిపతులు మిడుతలవలె చనిపోయెదరు. (నేనట్లు చేయనిచో జయము కలుగదని భావము).

భారత : ఏను=అర్జునుడు, కడగియిట్లు కావింపనేని, అస్మాక సైన్యపతులు=మన సైన్యాధిపతులు, విద్విషత్ సైనికులు, సముద్వీక్షన్ చూడ=తలలెత్తి చూడగా, రుక్=దీప్తుల యొక్క, రాజి=పంక్తులచే, భాసురజ్వలనమునకు=కాంతివంతమైన జ్వాలలకు, పెలుచన్ చత్తు.

తాత్పర్యము : నేనట్లు చేయనిచో మన సేనాధిపతులు, శత్రు సేనలు తలలెత్తి చూడగా దీప్తుల యొక్క పంక్తులచే భాసురమైన జ్వాలలకు సులభముగా మరణించెదను.

వ. అని పలికి పలికినట్ల బెట్టిదంపుఁ బెంపుసొంపు పొంపిరివోవ సన్నద్ధుండై యుద్ధయాత్ర గావించి యావీరకంఠీరవుం డకుంఠ విక్రమోత్సేకంబున ననేక యోజనవిస్తార దారుణంబుగాఁ బన్ని నపరబలవ్యూహంబునందు సాహసోల్లాసభాసితశరాసన కళావిశేషంబున నీసు నెఱపుచుం దెఱపి గొని రథంబు వఱపించి యొఱపువఱపున నడ్డగించు పగఱ యెడ్డుగడ్డుతికి చించుకొని తనతోన చొచ్చునిచ్చలంపు టెచ్చరిక చాలక యక్కడక్కడం దలపడి వెలివెలిన పోరు నిజయోధవీరులకు దూరదృశ్యమానకేతన ద్యోతనంబునం బ్రీతి యొనంగుచు. నిశాత నిజశర వ్రాతపాతంబులచేత భూతలంబున నవిరళంబుగా నొరగిన హరికుంజర శతాంగ శకలంబులచేత వికలత్వంబు నొందక యమందస్యందన ప్రచారంబు సారథ్యాశ్చర్యచర్యామహిమ మహనీయహరి నైపుణోద్దీపితా టోపంబై యేపుచూపం బ్రతాపంబు మెఱసి రణవిహరణ రణరణిక విజృంభణాస్తంభ సంభ్రమ బంభ్రమ్యమాణ చండ కోదండదండ కుండలీభావావినాభావ సుభగంభావుక శరప్రయోగ వేగచాతుర్యాశ్చర్య దశభుజయుగ యుగళవిగళి తాగళిత జయదర్పవిభవుం డగుచు నభినవసరణి నురవడించె నప్పు డప్పర బలంబునందుఁ గొందఱు. 153

రామా : అని పలికి=అని రావణుడు పలికి, పలికినట్ల=చెప్పినట్లే, బెట్టిదము+ పెంపు+సొంపు=క్రౌర్యము యొక్క తీవ్రత, పొంపిరి+పోవ= అతిశయింపగా, సన్నద్ధుండై=తయారై, యుద్ధ యాత్ర గావించి, ఆ వీర కంఠీరవుండు=రావణుడు, అకుంఠ=మొక్కవోని, విక్రమ+ఉత్సేకంబున= జయోత్సాహముతో, అనేక యోజన విస్తారదారుణంబుగా=అనేక యోజనముల పర్యంతము మిక్కిలిగా, పన్ని=మోహరించి, అపర బలవ్యూహంబునందు=శత్రు సేనా వ్యూహములో, సాహస+ ఉల్లాసభాసిత= సాహస క్రీడచే ప్రకాశించు, శరాసన కళా విశేషంబున=బాణ నైపుణ్యముచే, ఈసు నెఱపుచున్=కోపమును ప్రకటింపుచు, తెఱపిగొని=మార్గము నేర్పరచుకొని, రథంబు పరపించి=రథమును పరుగెత్తించి, ఒఱపు పఱపున=ఉపాయశక్తిచే, అడ్డగించు, పగర=శత్రువుల, ఎడ్డు గడ్డు ఉరికి చించుకొని=అవరోధములను దాటి, తనతోన, చొచ్చు=ప్రవేశించు, నిచ్చలము= ఎచ్చరిక=నిశ్చలమైన హెచ్చరిక, చాలక=సరిపోక, అక్కడక్కడన్, తలపడి=ఎదిరించి, వెలి వెలినపోరు=బహిరంగముగా పోరాడు, నిజయోధ వీరులకు=తన యుద్ధవీరులకు, దూరదృశ్యమాన=దూరముగా కనిపించు, కేతన ద్యోతనంబునన్=పతాకము యొక్క కాంతిచే, ప్రతి యొసంగుచు= సంతృప్తిపరచుచు, నిశాత=తీవ్రమైన, నిజశరవ్రాత పాతంబులచేత=తన బాణ సముదాయములను వదలుటచే, భూతలంబునన్= భూమిపై, అవిరళంబుగాన్= మిక్కిలిగా, ఒరగిన=నేలవాలిన, హరి కుంజరశత=వందలాది వానరసేనల, అంగశకలంబులచేత=శరీరభాగములచే, వికలత్వంబు నొందక=కలవరపడక, అమందస్యందన ప్రచారంబు=వేగముగా నడచు రథము యొక్క కదలిక, సార+ధీ+ఆశ్చర్యచర్యా మహిమన్=ఆశ్చర్యకరముగా నడుపు బుద్ధి శక్తి, మహనీయ=గొప్పదైన, హరినైపుణ=వానరుల నైపుణ్యమునకు, ఉద్దీపిత+ ఆటోపంబై=ప్రకాశించిన ఆటోపమై, ఏపుచూపన్=విజృంభింపగా, ప్రతాపంబు మెఱసి=పరాక్రమించి, రణవిహరణ=యుద్ధక్రీడలో, రణరణిక విజృంభణాస్తంభ= కోరికల అతిశయముతో కూడిన స్తంభనముచే, సంభ్రమ= ఆశ్చర్యకరముగా, బంభ్రమ్యమాణ=మాటిమాటికీ పరిభ్రమించుచున్న, చండకోదండ దండ=తీవ్రమైన కోదండము నుండి వెలువడిన, కుండలీభావ=బాణప్రయోగ, అవినాభావ=పరస్పర,

శుభగంభావుక=సౌభాగ్యముతో నిండిన, శరప్రయోగ=బాణ ప్రయోగము యొక్క, వేగ చాతుర్య=వేగముతో కూడిన చతురతను, ఆశ్చర్య=ఆశ్చర్య పరచుచు, దశభుజయుగ యుగళ=ఇరువది చేతుల నుండి, విగళితాగళిత=వదలిన, జయదర్ప=విజయ గర్వముతో, విభవుండగుచు=ప్రకాశించుచు, అభినవ సరణిన్=కొత్త రీతిలో, ఉరవడించెన్=వేగిరపడెను, అప్పుడు, ఆ+పరబలంబునందు=శత్రు సైన్యమునందు, కొందరు.

తాత్పర్యము : అని రావణుడట్లు పలికి క్రూరత్వము దీపింపగా సన్నద్ధుడై యుద్ధయాత్ర గావించి ఆ వీరపుంగవుడు మొక్కవోని పరాక్రమముచే అనేక యోజనముల దూరము విస్తరించి దారుణముగా పన్నిన శత్రువ్యూహమునందు సాహసోపేతమైన బాణప్రయోగ క్రీడచే కోపమును ప్రకటించుచు మార్గము నేర్పరచుకొని రథమును నడపి చుట్టుపట్ల అడ్డగించు శత్రుసేనాసమూహమును చీల్చుకొని తనతో ప్రవేశించు ఎదిరి బలమును అక్కడికక్కడ తలపడి బయట యుద్ధము చేయు తన యుద్ధవీరులకు దూరముగా కనిపించు తన పతాక దీప్తిచే ప్రీతి కలిగించుచు తీవ్రమైన తన బాణ సముదాయ ప్రయోగముచే నేలపై మిక్కిలిగా ఒరిగిన శతాధిక వానర శరీర భాగములచే వైకల్యము పొందక తన రథగమన శ్రేష్ఠతచే బుద్ధికి ఆశ్చర్యమును కలిగించుచు వానరుల యుద్ధనైపుణిని అతిక్రమించు పరాక్రమము ప్రకటించుచు యుద్ధమునందు కాంక్షాతిశయముచే విజృంభించి సంభ్రమపరచి మాటిమాటికి పరిభ్రమించు తీవ్రమైన కోదండబాణ ప్రయోగమును పరస్పర సౌభాగ్య భావన కలిగించు విధముగా శరప్రయోగమును చతురతతో ఆశ్చర్యకరముగా ఇరువది చేతుల నుండి విడివడిన విజయ గర్వముతో వైభవమును పొంది కొత్త రీతిలో వేగిరపడెను. అప్పుడు వానరసేనలలో కొందరు –

భారత : సారధ్య+ఆశ్చర్య చర్యామహిమ=సారధ్యము యొక్క ఆశ్చర్యకరమైన మహిమచే, శరప్రయోగ వేగచాతుర్యాశ్చర్య, దశ=అవస్థగల, భుజయుగళయుగళ= పూనుగాండ్లవంటి రెండు భుజముల యొక్క – అర్జునుని పరముగా మిగతా సమానము.

కం. వేమఱు మనగుర్వశ్వ
త్థామలకీఘోరవీరతరుబాణకదం
బామితవర్షముదుస్తర
మై మెఱసెఁ దదప్రభేద్యుఁడయ్యె నితండున్. 154

రామా : వేమఱు=పలుమార్లు, మన=మన యొక్క, గురు=వ్రేగైన, అశ్వత్థ=రావి, ఆమలకీ=ఉసిరిక, ఘోరవీరతరు=పెద్దమద్ది, బాణ=గోరంట, కదంబ=కడిమి చెట్లయొక్క, అమితవర్షము=అధికముగా ప్రయోగించుట, దుస్తరమై=తరింపరానిదై మెఱసె=ప్రకాశించెను, ఇతండున్=ఈ రావణుడును, తత్=ఆ తరువర్షముచే అప్రభేద్యుడయ్యెన్=జయింప శక్యముగాని వాడాయెను.

తాత్పర్యము : మన భారమైన రావి, ఉసరిక, పెద్దమద్ది, గోరంట, కడిమి చెట్లను అధికముగా (వానరవీరులు) ప్రయోగించుట భరింపరానిదై మెఱసెను. రావణుడును ఆ తరువర్షముచే జయింప శక్యముగాని వాడాయెను.

భారత : వేమఱు, మన, గురు=ద్రోణాచార్యులు, అశ్వత్థామలకు, ఈ వీరతరు=వీరశ్రేష్ఠుడైన అర్జునునియొక్క, బాణకదంబము=బాణసమూహముల యొక్క, అమితవర్షము, దుస్తరమై, మెఱసెన్, ఇతండునున్=అర్జునుడును, తత్=ఆ బాణవర్షముచే, అప్రభేద్యుడయ్యెన్=భేదింపరానివాడాయెను.

విశేషణము : రెండవ పాదమున 'తా' అను అక్షరమునకు ప్రాది యతి వేయబడినది (తరుబాణ) తిక్కన 'శ్రీయనగౌరి' అను అవతారిక పద్యములో ఆంధ్ర మహాభారతమున రెండవ పాదమున భ, ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి" అను చోట ప్రాది యతి వేసెను.

తే. కొంద ఱతిరయప్రేరితస్యందనాశ్వ
కర్ణ ముఖ్యోగ్రతరుల మోఘుతకుఁ దలఁకఁ
గొందఱు మననృపాలునిగురుకృపకృత
వర్మ ధర్మవర్తన గాచు వగవ మనఁగ. 155

రామా : కొందరు=కొందరు వానరులు, అతిరయ=మిక్కిలి వేగముగా, ప్రేరిత=ప్రయోగింపబడిన, స్యందన=నెమ్మి చెట్టును, అశ్వకర్ణ=మద్దిచెట్టును, ముఖ్య=మొదలైన, ఉగ్ర=భయంకరమైన, తరుల=చెట్లయొక్క, మోఘతకున్=వ్యర్థత్వమునకు, తలకన్=చలింపగా, కొందఱు, మననృపాలుని=రాముని, గురు=అధికమైన, వర్మ=కవచముయొక్క, ధర్మవర్తనన్=ప్రకారవృత్తిగల, కృపకు=దయకు, కాచు=రక్షించు, వగవము=బాధపడము, అనగ=అని చెప్పగా.

తాత్పర్యము : కొందరు వానరులు మిక్కిలి వేగముగా ప్రయోగించిన నెమ్మి, మద్దిచెట్లు మొదలుగాగల భయంకరములైన వృక్షములు వ్యర్థమగుటకు చలింపగా, మరికొందరు రాముని అధిక దయాకృతమైన కవచ ప్రకారముగల వృత్తిని చూచి బాధపడబోమని చెప్పగా –

భారత : స్యందనాశ్వ=రథాశ్వములుగల, కర్ణముఖ్య=కర్ణుడు మొదలైన, ఉగ్రతరుల=మిక్కిలి కోపించిన వారి యొక్క, మోఘతకున్=ఓటమికి, తలక, కొందరు, మననృపాలుని=దుర్యోధనుని, గురుకృపకృతవర్మ=ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు కృతవర్మల యొక్క, ధర్మవర్తన=ధనుర్వ్యాపారము, కాచు, వగవమనగ.

తాత్పర్యము : కొందరు మిక్కిలి వేగముగా ప్రయోగించిన రథాశ్వములుగల కర్ణాది ముఖ్యులైన అత్యుగ్రుల ఓటమికి చలింపగా, మరి కొందరు దుర్యోధన, ద్రోణ, కృప, కృతవర్మల ధనుర్వ్యాపారము మనలను రక్షించును, బాధపడమనగా.

తే. కొంద ఱినతనూజాదుల క్రోవిలోనఁ
ప్రాణములు గల్గఁ దెలియుండి బ్రతికెద
నీలగజముఖ్యబల మదె నిగుడి పొదివె
శాత్రవుని నంచుఁ గొందఱు సంతసిలఁగ. 156

రామా : కొందరు, ఇనతనూజాదుల=సుగ్రీవాదులయొక్క, క్రోవిలోనన్=మూసలో, ప్రాణములుగల్గన్, తెలియుండి=తెలివిగలిగి, బ్రతికెదమన, నీలగజముఖ్య బలము=నీలుడు, గజుడు మొదలైన వారి సేనలు, అదె, శాత్రవుని=శత్రువును,

నిగుడిపొదివె=తీవ్రముగా ఎదిరించెను, అంచు=అనుచు, కొందరు సంతసిలగ=కొందరు సంతోషించగా.

తాత్పర్యము : కొందరు సుగ్రీవాదుల మూసలో ప్రాణములు గలుగగా తెలివి పొంది నీలగజ ముఖ్యుల సేనలు అదుగో రావణుని తీవ్రముగా ఎదిరించెనని మరికొందరు సంతోషింపగా.

భారత : కొందరు, ఇనతనూజాదుల=కర్ణాదుల యొక్క, నీల=నల్లనైన గజ=గజములు, ముఖ్య=మొదలుగాగల.

తాత్పర్యము : కొందరు కర్ణాదుల మూసలో ప్రాణములు కలుగగా తెలివిని పొంది బ్రతికెదమనగా నల్లనైన గజములు మొదలుగాగల సేనలు శత్రువును ఇదె తీవ్రముగా ఎదిరించిరని కొందరు సంతోషింపగా.

వ. మఱియు ననేకు లనేక ప్రకారంబులఁ దత్తద్రణసమయ సముదయజయపరాజయ ప్రతీతివశంబునఁ బలుకుచుండ నతండు సర్వదుర్వారదోర్విలాసగర్వంబున నుల్లసిల్లుచు.
157

రామ భారత : సమానము.

మఱియు, అనేకులు, అనేక ప్రకారంబులన్=అనేక విధములుగా, తత్+తత్+రణ సమయ=ఆ యుద్ధసమయమునందలి, సముదయ=సమూహము యొక్క, జయ పరాజయము=జయము, అపజయము అను, ప్రతీతివశంబునన్= ఖ్యాతివశమున, పలుకుచుండన్, అతండు=రావణుడు/అర్జునుడు, సర్వదుర్వార=మిక్కిలి సహింపరాని, దోః+విలాస గర్వంబునన్=భుజబలగర్వముచే, ఉల్లసిలుచు= సంతోషించుచు.

తాత్పర్యము : మరియు అనేక ప్రకారములుగా ఆ యుద్ధ సమయమునందలి సమూహ జయాపజయముల ఖ్యాతిని పలుకుచుండగా రావణుడు/అర్జునుడు మిక్కిలి సహింపరాని భుజబలగర్వముచే సంతోషించుచు.

వనమయూరము :

సారనిజచాప గుణశబ్దసమనుప్ర
జ్యారసికశూరతరసాత్య కిరణాగ్ర
క్రూరతరశాత్కృతినిరూప్య గమనుండై
చేరి యవికారధృతిసింధునృపుఁ జూచెన్. 158

రామా : సార=శ్రేష్టమైన, నిజచాపగుణశబ్ద=తన దనుష్టంకారమును, సమనుప్రజ్యా=వెంబడించుటకు, రసిక=రుచిగలవియై, శూర=శూరుల యొక్క, తరస=మాంసములచే, అతి=మిక్కిలి, అకిరణ=కిరణసహితములైన, అగ్ర=ములుకులుగల, క్రూరశ=క్రూరములైన శరముల యొక్క, శాత్కృతి=శత్రుధ్వనులచే, నిరూప్య=తెలియదగిన, గమనుండై=గమనముగలవాడై, చేరి, అవికారధృతిన్=వికారములేని ధైర్యముచే, సింధు=సముద్రమైన, నృపున్=రాముని, చూచెన్.

తాత్పర్యము : శ్రేష్ఠమైన తన ధనుష్టంకారముచే వెంబడించు రుచిగల శూరుల మాంసములచే మిక్కిలి కిరణ సహితములైన ములుకులుగల (శత్రు మాంసములచే కప్పబడినవి) శత్రుధ్వనులచే ఎరుగదగిన గమనము గలవాడై వికారములేని ధైర్యముచే సముద్రుని బోలిన రాముని చూచెను.

భారత : సాత్యకి=సాత్యకి యొక్క, రణాగ్ర=యుద్ధముఖమందు, సింధు నృపున్=సైంధవుని మిగతా సమానము.

తాత్పర్యము : శ్రేష్ఠమైన తన ధనుష్టంకారమును వెంబడించుటలో నేర్పరియైన శూరశ్రేష్ఠుడగు సాత్యకి యొక్క యుద్ధముఖము నందు నిష్ఠురములైన బాణముల యొక్క శత్రు ధ్వనులచే తెలియదగిన గమనము గలవాడై అర్జునుడు చేరి అవికారమైన ధైర్యముగల సైంధవుని చూచెను. (తన బాణప్రయోగ ధ్వనుల జాడను బట్టి సాత్యకి వెంబడిరాగా అర్జునుడు సైంధవుని ఎదిరించెను).

విశేషణము : వనమయూర వృత్తమునకు ప్రతి పాదమున – భ, జ, స, మ, గగ అను గణములు 9వ అక్షరము యతి స్థానము.

వ. అంత. 159

తే. తివిరి గురుకృతవర్మాదిధృతివిలసిత
విగ్రహస్ఫూర్తిఁ గడు మించి విజయసత్స
హాయతాలోలుఁ డయి వచ్చు నలఘుమన్యు
దశముఖుని భీము నర్కనందనుఁడు దాఁకె. 160

రామా : ప్రయత్నించి, గురు=అధికముగా, కృత=చేయబడిన, వర్మాది=కవచము మొదలుగాగల సాధనముల యొక్క, ధృతి=ధారణముచే, విలసిత=ప్రకాశించు, విగ్రహస్ఫూర్తిన్=శరీర స్ఫురణచే, కడుమించి=మిక్కిలి అధికమై, విజయ=గెలుపే, సత్సహాయతా=లెస్స సహాయము కలవాడగుటచే, అలోలుడయి=భయములేనివాడై, వచ్చు=వచ్చుచున్న, అలఘుమన్యున్=అధికకోపముగల, భీమున్=భయంకరమైన, దశముఖుని=రావణుని, అర్కనందనుడు=సుగ్రీవుడు, తాకె=ఎదిరించెను.

తాత్పర్యము : ప్రయత్నపూర్వకముగా అధికముగా చేయబడిన కవచాది సాధనముల ధారణచే మిక్కిలి ప్రకాశించు శరీరస్ఫూర్తిచే గెలుపే లెస్స సహాయముగా గలవాడై భయములేక అచలుడై వచ్చు అధిక కోపముగల భయంకరుడైన రావణుని సుగ్రీవుడు ఎదిరించెను.

భారత : తివిరి, గురు=ద్రోణాచార్యుల, కృతవర్మాది=కృతవర్మ మొదలైన వారి యొక్క, ధృతి విలసిత=ధైర్యముచే ప్రకాశించు, విగ్రహస్ఫూర్తిన్=యుద్ధస్ఫురణచే, కడు మించి, విజయ=అర్జునునియొక్క, సత్సహాయతా=మంచి సహాయముచే, లోలుడై=అపేక్షగలవాడై, వచ్చు, అలఘుమన్యుదశ=మిక్కిలి రోషావస్థగల, ముఖుని=ముఖముగలవానిని, భీమున్=భీముని, అర్కనందనుడు=కర్ణుడు, తాకె=ఎదిరించెను.

తాత్పర్యము : ప్రయత్నపూర్వకముగా ద్రోణకృతవర్మాదుల ధైర్యముచే విలసితమైన యుద్ధ స్ఫూర్తిచే అర్జునునకు సహాయముగా నిలిచిన అధిక రోషావస్థ

ముఖముగల భీముని కర్ణుడు ఎదిరించెను.

మ. మిహిర ప్రోద్భవుఁ డిట్లు శాత్రవునిలక్ష్మిన్ సైఁప కుగ్రాచలా
గ్రహతం జేసి కడుం గలంచుటకు వీఁకం దాఁకి తద్ఘోరబా
ణహతిన్ సాధనహీనతం బొరసి ప్రాణత్యాగపర్యంతదు
స్సహపీడన్భజియించెఁ బల్మఱు సుహృజ్జాలంబు జాలింబడన్. 161

రామా : మిహిరప్రోద్భవుడు=సూర్యపుత్రుడు సుగ్రీవుడు, ఇట్లు, శాత్రవుని లక్ష్మిన్=శత్రు సంపదను, సైపక=ఓర్చుకొనలేక, ఉగ్ర=ఘనమైన, అచలాగ్ర=పర్వత శిఖరముచే, హతన్=నశించినదిగా, చేసి, కడున్ కలంచుటకు=మిక్కిలి కలతబెట్టుటకు వీకన్తాకి=తీవ్రముగా ఎదిరించి, తత్+ఘోర బాణహతిన్=అతని తీవ్రమైన బాణముల తాకిడిచే, సాధనహీనతన్=శక్తిహీనతను, ఒరసి=పొంది, సుహృత్+ జాలంబు=స్నేహితులందరు, జాలిన్ బడన్=కరుణించినట్లు, ప్రాణత్యాగ పర్యంత= ప్రాణములు వదలి వేయునట్లు, దుస్సహపీడన్=భరింపరాని పీడచే, పల్+మరు= పెక్కుమారులు, భజియించె=బాధపడెను.

తాత్పర్యము : సుగ్రీవుడు ఇట్లు రావణుని ఐశ్వర్యమును సహింపక ఘనమైన పర్వత శిఖరముచే నశించునట్లుగా చేసి మిక్కిలి కలతపెట్టుటకు తీవ్రముగా ఎదిరించి రావణుని ఘోరమైన బాణముల తాకిడిచే శక్తిహీనతను పొంది హితులందరు జాలి పడునట్లు ప్రాణములు వదిలి వేయునట్లు సహింపరాని పీడను పొందెను.

భారత : మిహిరప్రోద్భవుడు=సూర్యపుత్రుడు కర్ణుడు, శాత్రవునిలక్ష్మిన్=భీముని జయలక్ష్మిని, సైపక, ఉగ్ర, అచల=స్థిరమైన, ఆగ్రహతన్ చేసి=కోపముగలవాడై, తత్+ఆ భీముని యొక్క మిగతా సమానము.

తాత్పర్యము : కర్ణుడు ఈ విధముగా భీముని ఐశ్వర్యమునకు ఓర్చుకొనలేక ఉగ్రము, స్థిరము అయిన కోపముగలవాడై అతనిని కలతబెట్టుటకు తీవ్రముగా ఎదిరించి ఆ భీమునియొక్క ఘోరమైన బాణముల తాకిడిచే సాధన హీనతను పొంది తన మిత్రసముదాయము జాలిని చూపునట్లు ప్రాణత్యాగ పర్యంతము మిక్కిలి పీడను పొందెను.

వ. అంత. 162

తే. వాయుసూనుండు ధృతకరవాలహస్త
విహృతిచాతురిఁ బ్రతివీరు విశిఖవృష్టిఁ
దొలఁగ జడియుచు సాహసం బలర నతని
యరదమునకు లంఘించి శౌర్యంబు మెఱయ. 163

రామా : వాయుసూనుండు=హనుమంతుడు, ధృతకర=ధరించిన హస్తముల యొక్క, వాలహస్త=తోకలయొక్క, విహృతిచాతురిన్=విహారచాతుర్యముచే, ప్రతి వీరు=శత్రువుయొక్క, విశిఖవృష్టిన్=బాణవర్షమును, తొలగన్=తప్పించుకొనుటకు, జడియుచు=భయపడుచు, సాహసంబు+అలర=సాహసము కన్పించునట్లు, అతని అరదమునకు=రావణుని రథముపై, శౌర్యంబు మెఱయ=పరాక్రమము ప్రకాశించు నట్లు, లంఘించి=ఎగిరి.

తాత్పర్యము : హనుమంతుడు తన తోక, హస్తముల యొక్క విహార చాతుర్యముచే రావణుని బాణవర్షమును తప్పించుకొనుటకు భయపడి సాహసము మీరగా రావణుని రథముపైకి ప్రతాపముతో లంఘించి –

భారత : వాయుసూనుండు=భీముడు, ధృత=ధరించబడిన, కరవాల= ఖడ్గముగల, హస్తవిహృతి చాతురిన్=హస్త విహారచాతుర్యముచే, మిగతా సమానము.

తాత్పర్యము : భీముడు చేత ధరించిన ఖడ్గ విహార చాతుర్యముచే శత్రుబాణ వర్షమును తప్పించుకొనుటకు భయపడి సాహసము మీరునట్లు అతని రథముపైకి పరాక్రమము మెఱయునట్లు లంఘించి –

విశేషణము : వాలహస్త – 'వాలహస్తస్తువాలధిః' అని అమరము.

కం. అహితుని నాశ్చర్యకర
ప్రహరణవిధిఁ జాల డీలువఱిచె నతండున్
రహిఁ దిరుగఁ దెచ్చుకొని వి
గ్రహచేష్ట లడంగ నొంచెఁ గరువలిపట్టిన్. 164

రామా : అహితుని=శత్రువును, ఆశ్చర్యకర ప్రహరణ విధిన్=ఆశ్చర్యమును గొలుపునట్టి దెబ్బలచే, చాలడీలువరిచె=మిక్కిలి నొప్పించెను, అతండున్=రావణుడును, రహిన్=తెలివిని, తిరుగన్ తెచ్చుకొని=తిరిగి తెచ్చుకొని, కరువలి పట్టిన్=హనుమంతుని, విగ్రహ చేష్టలు=శక్తి సామర్థ్యములు, అడంగన్=మూర్ఛిల్లునట్లు, నొంచెన్=బాధించెను.

తాత్పర్యము : హనుమంతుడు ఆశ్చర్యకరమైన ప్రహారములచే రావణుని మిక్కిలి డీలుపడునట్లు చేసెను. రావణుడును తెలివి పొంది హనుమంతుని సామర్థ్యము అణగునట్లు చేసి బాధించెను.

భారత : అహితునిన్=కర్ణుని, ఆశ్చర్య=అబ్బురమైన, కర=హస్తమునందుగల, ప్రహరణ విధిన్=ఆయుధ వ్యాపారముచే, చాల డీలుపరచె, కరువలి పట్టిన్=భీముని, విగ్రహ చేష్టలు=శరీర చేష్టలు, అడంగన్=మూర్ఛపోవునట్లుగా, నొంచె

తాత్పర్యము : భీముడు తన హస్తమందుగల ఆశ్చర్యకరమైన ఆయుధ వ్యాపారముచే కర్ణుని మిక్కిలి డీలుపడజేసెను. కర్ణుడును తిరిగి తెలివి తెచ్చుకొని భీముని శరీర చేష్టలు అణచి మూర్ఛిల్లునట్లుగా బాధించెను.

కం. నొంచి తదవసరజాతా
చంచలఘనమన్యు వహ్నిసంతతిఁ దనుఁ గా
రించుచు నపు డెంతయు నల
యించు మహాశత్రు భీము నిట్లని పలికెన్. 165

రామా : నొంచి=బాధించి, తదవసర=ఆ సమయమునందు, జాత=కలిగిన, అచంచల=స్థిరమైన, ఘనమన్యున్=అధిక కోపముగలవానిని, తనున్=తన శరీరమును, కారించుచున్=తపింపజేయుచు, అపుడు, ఎంతయు, అలయించు=శోషింపజేయు, మహాశత్రు=మహాశత్రువులకు, భీమున్=భయంకరుడైనవానిని, వహ్ని సంతతిన్=నీలునితో, పలికెన్=పలికెను.

తాత్పర్యము : ఆ విధముగా బాధించి ఆ సమయమున కలిగిన స్థిరమైన అధిక కోపముగలవానిని తనను తపింపజేయుచు అపుడెంతయు శోషింపజేయుచున్న

మహాశత్రువులకు భయంకరుడైన నీలునితో నిట్లు పలికెను.

భారత : ఘనమన్యు=అధిక శోకమనెడి, వహ్ని సంతతిన్=అగ్ని సమూహముచే, భీమున్=భీమునితో మిగతా సమానము.

తాత్పర్యము : ఈ విధముగా బాధించి అధిక శోకమనెడి అగ్ని సమూహముచే తన శరీరమును తపింపజేయుచు అపుడెంతయు శోషిలజేయు మహాశత్రువైన భీమునితో ఇట్లు పలికెను.

కం. కానలఁ గాయలుఁ బండ్లు
నూనముగా మెసఁగి బ్రతుకకోరీ నీలా
వానరునకు నీకును గుఱి
యైనను మద్బలము నొరయ నర్హం బగునే. 166

రామా : ఓరీ నీలా=ఓరి నీలుడా! కానలన్=అడవులయందు, కాయలున్ పండ్లు=పండ్లుకాయలు, అనూనముగా మెసగి=అధికముగా తిని, బ్రతుకక, వానరునకు, నీకును, గుఱియై=కనిపించుకొని, ననున్=నన్నును, మద్బలమును=నా బలమును, ఒరయన్=ఎదిరించుట, అర్హంబగునే=సాధ్యమా!

తాత్పర్యము : ఓరీ నీలా! అడవులయందు పండ్లుకాయలు అధికముగా మెసగి బ్రతుకక వానరుడవైన నీవు నాకు కనిపించి నన్ను, నా బలమును ఎదిరించుట అర్హమా!

భారత : ఓరి=తుచ్ఛుడా! నీలావు=నీ బలిమి, ఆ నరునకున్=ఆ అర్జునునకును, మిగతా సమానము.

తాత్పర్యము : ఓరి భీమా! వనములందు కాయలుపండ్లు అమితముగా తిని బ్రతుకక నీ బలిమి ఆ అర్జునునకును నీకును ఎదిరించిన నా బలము తగ్గించుటకు అర్హమగునా!

చ. ఒరయుటకున్ ఫలంబు దగనొందితి పొమ్మని యమ్మహోభుజుం
బరుసపు మాటలన్ దహనబాణహతిన్ హృదయంబు సాల నొం
చి రహితచేష్టుఁ జేసి విడిచెన్ నికటంబున నయ్యెడన్ రిపు
స్ఫురణకృశానుజక్రియలు సూచుచు రామునితమ్ముఁ డెంతయున్. 167

రామా : ఒరయుటకున్=ఎదిరించినందుకు, ఫలంబు=ఫలితమును, తగన్+ఒందితి=తగినట్లు పొందితివి, పొమ్మని=చత్తువుగాక అని, ఆ+మహోభుజున్=ఆ పరాక్రమవంతుడైన నీలుని, పరుసపు మాటలన్=కఠినమైన మాటలచే, దహనబాణ=ఆగ్నేయాస్త్రము యొక్క, హతిన్=తాకిడిచే, హృదయంబు, చాలనొంచి=మిక్కిలి ఛేదించి, రహితచేష్టుని చేసి=చేష్టలుడిగినవానినిగా చేసి, విడిచెన్=వదలెను, అయ్యెడన్=అప్పుడు ఆ ప్రదేశమున, నికటంబున=సమీపమున, రిపుస్ఫురణ=రావణుని స్ఫూర్తిన్, కృశానుజ=అగ్నికుమారుడైన నీలుని, క్రియలు జూచుచు=మూర్ఛిల్లుటను చూచి, రాముని తమ్ముడు=ఆ లక్ష్మణుడు, ఎంతయు= మిక్కిలి (సంభ్రమపడెను).

తాత్పర్యము : నన్ను ఎదిరించుటకు తగిన ఫలమును పొందితివి పొమ్మని పరుషమైన మాటలతో, ఆగ్నేయాస్త్రమును వదలి హృదయమును భేదించి నీలుని చేష్టారహితుని చేసి విడిచెను. అక్కడ సమీపములోనున్న లక్ష్మణుడు రావణుని స్ఫూర్తిని నీలుడు మూర్ఛిల్లుటను చూచి –

భారత : పరుసపు మాటలు, అన్=అనెడి, దహన బాణహతిన్=దహనము యొక్కయు, బాణము యొక్కయు దెబ్బచే, హృదయంబు చాలనొంచి, రహితచేష్టుజేసి విడిచెన్, రిపుస్ఫురణ=భూరిశ్రవసు ప్రతాపముచే, కృశ=క్షీణించిన, అనుజక్రియలు= తమ్ముడైన సాత్యకి చేష్టలు, చూచుచు, రాముని తమ్ముడు=బలరాముని తమ్ముడైన కృష్ణుడు.

తాత్పర్యము : నన్నెదిరించుటకు తగిన ఫలము బొందితివి పొమ్మని ఆ

పరాక్రమవంతుని పరుషపు మాటలనెడి దహనము యొక్కయు, బాణము యొక్కయు తాకిడిచే హృదయమును మిక్కిలి నొప్పించి చేష్టారహితునిజేసి విడిచెను. సమీపముననే అప్పుడున్న భూరిశ్రవసు ప్రతాపముచే క్షీణించిన సాత్యకి చేష్టలను చూచుచు శ్రీకృష్ణుడు అంతట –

వ. ససంభ్రమాకులుం డై 168

తాత్పర్యము : మిక్కిలి ఆశ్చర్యముతో నిండినవాడై

తే. చూడు మటు నరవరజయస్ఫూర్తి నార్చె
వైరిసేన భూరిశ్రవోదారుణరణ
మహిమదనుజబలశ్రీలు మడఁగ నింత
టను రిపుఁ గరంబు దెగవ్రేయకునికి గీడు. 169

రామా : లక్ష్మణుడు రామునితో అనెడి మాటలు :

నరవర=రామా! అటు చూడుము, జయస్ఫూర్తిన్=విజయము కలుగునట్లు – వైరిసేనన్=శత్రుసైన్యమును, భూరి=అధికమైన, శ్రవోదారుణ=వినుటకు భయంకరమైన, రణ=శబ్దము యొక్క, మహిమన్=ఆధిక్యముచే, ఆర్చెను=మ్రోసెను, దనుజబల=రాక్షస బలముయొక్క, శ్రీలు=విలాసములు, మగడన్=అణగునట్లుగా, రిపున్=రావణుని, ఇంతటన్=ఇంతలో, కరంబు=మిక్కిలి, తెగవ్రేయకునికి= సంహరింపనిచో, (చేయి తెగ వ్రేయనిచో అని కూడ అన్వయము), కీడు=చేటు కలుగును.

తాత్పర్యము : రామా! అటు చూడుము. విజయస్ఫూర్తితో అధికముగా వినుటకు భయంకరమైన శబ్దాధిక్యముచే శత్రుసైన్యము మ్రోసెను. రాక్షసబల విలాసములు అణగునట్లుగా రావణుని ఇంతలో అధికముగా తెగ వేయనిచో కీడు గలుగును.

భారత : కృష్ణుడర్జునినితో అనిన మాటలు :

నర!=అర్జునా! వరజయస్ఫూర్తిన్=శ్రేష్ఠమైన విజయస్ఫురణతో, భూరిశ్రవః

=భూరిశ్రవసునియొక్క, దారుణరణమహిన్=దారుణమైన యుద్ధభూమియందు, మత్+అనుజ=నా తమ్ముడైన సాత్యకి యొక్క, బలశ్రీలు=బల సంపదలు, మడగన్, వైరిసేన, ఆర్చెన్, ఇంతటను, రిపు=శత్రువైన భూరిశ్రవసుని, కరంబు=హస్తమును తెగవ్రేయకునికి కీడు.

తాత్పర్యము : అర్జునా! అటు చూడుము, శ్రేష్ఠమైన విజయస్ఫూర్తితో భూరిశ్రవసునియొక్క దారుణ యుద్ధభూమిలో నా తమ్ముడైన సాత్యకియొక్క బలసంపదలు అణగిపోవునట్లు శత్రుసేనలు మ్రోసెను. ఇప్పుడు భూరిశ్రవసుని హస్తమును తెగవేయనిచో కీడు వాటిల్లును.

తే. అనుచుఁ దా నన్నమాటఁ జేకొని తడయక
ఘనభుజుండు సుమిత్రనందనుఁడు జిష్ణుఁ
డరిఁ గరము గుంటువడ నేయ ననుజుగెలుపు
గాంచి మోదించె నంత నటించుచక్రి. 170

రామా : అనుచు, తాను=లక్ష్మణుడు, అన్నమాటను=రాముని వాక్యమును, చేకొని=అనుమతి పొంది, తడయక=ఆలసింపక, ఘనభుజుండు=బాహు పరాక్రమముగల, సుమిత్రనందనుడు=లక్ష్మణుడు, జిష్ణుడు=జయశీలియై, అరిన్=రావణుని, కరము=మిక్కిలి, కుంటుపడసేయ=బాధించునట్లు బాణములు వేయగా, నరతన్=మనుష్యత్వమును, నటించుచక్రి=నటించు విష్ణువైన రాముడు, అనుజు గెలుపుగాంచి=లక్ష్మణుని జయమును చూచి, మోదించె=సంతోషించెను.

తాత్పర్యము : అనుచు, రాముని వాక్యమును అనుమతిగా పొంది ఆలసింపక బాహుపరాక్రమముగల జయశీలియైన లక్ష్మణుడు రావణుడు మిక్కిలి కుంటుపడునట్లు బాణములు వేయగా, మనుష్యత్వమును నటించు రాముడు లక్ష్మణుని గెలుపు చూచి సంతసించెను.

భారత : అనుచు, తానన్నమాటను=తానాడిన మాటను, చేకొని, సుమిత్రనందనుడు=బంధుప్రియుడైన, జిష్ణుడు=అర్జునుడు, అరి=భూరిశ్రవసునియొక్క,

కరంబును=మిక్కిలి, కుంటుపడ చేయన్=బాధింపగా, అనుజుగెలుపు=సాత్యకి గెలుపును, నరతనటించు=మానవత్వమును నటించు, చక్రి=కృష్ణుడు, కాంచి, మోదించె –

తాత్పర్యము : అనుచు తానాడిన మాటను చేకొని బంధుప్రియుడైన అర్జునుడు భూరిశ్రవసుని మిక్కిలి బాధింపగా సాత్యకి గెలుపును చూచి మానవత్వమును నటించు కృష్ణుడు సంతోషించెను.

వ. మఱియుం దద్రణం బతిభయంకరం బయి ప్రవర్తిల్లె. 171

తాత్పర్యము : మఱియు ఆ యుద్ధము మిక్కిలి భయంకరంబుగా నడచెను.

ఉ. అంతట రాముతమ్ముఁడు దిగంతసమీపగుఁ డైనయట్టిభా
స్వంతు తెఱంగు గాంచి తనశత్రునికాయము సొంపు మీఱన
త్యంతము నేసి యేసి తదుదగ్రశరంబుల రేసి రేసి య
శ్రాంతతఁ బోరుజిష్ణురిపుసత్త్వము నారయుచున్ మనంబునన్.
172

రామా : అంతట, రాముతమ్ముడు=లక్ష్మణుడు, దిగంత సమీపగుడైన=దిక్కుల యొక్క అంతమునకు దగ్గరవాడైన, భాస్వంతు తెఱంగు=సూర్యుని విధము (రక్త వర్ణము)వలె, కాంచి=చూచి, తన శత్రుని=రావణుని, కాయము సొంపు మీఱగాన్=శరీరము రక్తమయము కాగా, అత్యంతము=మిక్కిలి, ఏసిఏసి=బాణములు వదలి, తత్+ఉదగ్రశరంబుల=ఆ తీవ్రమైన బాణములను, రేసిరేసి=ప్రయోగించి, అశ్రాంతతన్=విశ్రాంతిలేని రీతిలో, పోరు=పోరాడు, జిష్ణురిపుసత్త్వము=రావణుని బలమును, మనంబునన్=మదిలో, ఆరయుచున్=ఆలోచించుచు.

తాత్పర్యము : అంతట లక్ష్మణుడు సూర్యాస్తమయ సమయమందలి సూర్యునివలె రక్తవర్ణములో నున్న రావణుని శరీరము (రక్తమయము కాగా)పై మిక్కిలి బాణములు వదలి, ఆ తీవ్రబాణములను ప్రయోగించి, నిరంతరము పోరాడు రావణుని బలమును మదిలో ఆలోచించుచు.

భారత : అంతట, రాముతమ్ముడు=కృష్ణుడు, భాస్వంతు=సూర్యునియొక్క తెఱుగుగాంచి=అస్తమయమగుట చూచి, (ఇకపై అర్జునుని పరము), తన శత్రుని కాయము=తన శత్రుసముదాయము, సొంపుమీఱ, అత్యంతము నేసియేసి... జిష్ణు=అర్జునుని, రిపు=కర్ణాదుల యొక్క – మిగతా సమానము.

తాత్పర్యము : అంతట శ్రీకృష్ణుడు అస్తమయ సమయ సూర్యుని విధము చూచెను. అర్జునుడు తన శత్రు సముదాయము (శత్రుని శరీరము) సొంపు మీరునట్లు తీవ్ర బాణములను ప్రయోగించి, నిరంతరము పోరాడు అర్జునుని, కర్ణాదుల యొక్క బలమును చూచుచు మనస్సులో ఆలోచించుచు –

తే. సమదదోషాహితుల ఘోరసాయకముల
వానరానీకమును మున్నుగా నఱకుచు
గెలిచె భానుసుతాదియోధుల నరాతి
విపులభుజశక్తి కొదగాన వెదకియైన. 173

రామా : సమదదోషాహి=క్రూరసర్పములే, తుల=సమానముగాగల, ఘోరసాయకముల=తీవ్రబాణములచే, వానరానీకమును=వానర సముదాయమును, మున్నుగా=ముందుగా నఱకుచు, భానుసుతాదియోధులన్=సుగ్రీవాది యుద్ధ వీరులను, అరాతిభుజశక్తి=రావణుని బాహుబలమును, కొదగానన్=కొదవగా, వెదకియైన=వెదికిపట్టి, గెలిచె.

తాత్పర్యము : క్రూరసర్పములతో సమానమైన తీవ్రబాణములచే వానర సముదాయమును ముందుగా ఖండించుచు సుగ్రీవాది యుద్ధవీరులను, రావణుని భుజబలశక్తి కొదవగా వెదకి గెలిచెను.

భారత : సమదరోషాహితుల=క్రూర శత్రువులయొక్క, ఘోర=తీవ్రములైన, సాయకములవాన=బాణవర్షమును, రానీక=రానివ్వక, మునుమున్నుగా=ముందుగా భానుసుతాది యోధుల=కర్ణాదివీరుల, నర=అర్జునుని యొక్క, అతి విపుల=విస్తారమైన, భుజశక్తి..... నఱకుచు గెలిచె.

తాత్పర్యము : క్రూర శత్రువుల యొక్క తీవ్ర బాణ వర్షమును రానివ్వక ముందుగా కర్ణాది వీరులను తన విపులభుజశక్తి కొదవనట్లు వెదకి నరకుచు గెలిచెను.

తే. హరులు దగదొట్టి మెలcగ లే వనినవాజి
తృష్ణ వారించె నిపు డీయతిప్రతాపుc
డద్భుతంబుగ నవనిశాతాస్త్రనిహతి
గ్రొచ్చి కీలాలములు వెల్లిగొన వెలార్చి. 174

రామా : హరులు=వానరులు, తగదొట్టి=ధైర్యముగా, మెలగలేవు, అనిన్=యుద్ధమునందు, నవ=క్రొత్తదైన, ఆజితృష్ణన్=తిరిగి యుద్ధము చేసెదననెడు కోరికను, వారించెను=అణచెను, ఇపుడు, ఈ+అతి ప్రతాపుడు=ఈ గొప్ప ప్రతాపముగలవాడు, అద్భుతంబుగ, నవ=వింతలైన, నిశాత=తీక్ష్ణములైన, అస్త్రనిహతి=దివ్యాస్త్రముల ప్రహారముచే, గ్రొచ్చి=గుదులుగావేసి, కీలాలములు=నెత్తురులు, వెల్లిగొన=ప్రవహించినట్లు, వెలార్చి=చేసి.... (సరి లేక వారించి)

తాత్పర్యము : వానరులు యుద్ధమున ధైర్యముగా మెలగలేవు. తిరిగి యుద్ధము చేసెదనను కోరికను అణచెను. రావణుడు ఆశ్చర్యకరముగా వింతలైన తీక్షణ దివ్యాస్త్రములు ప్రయోగించగా (వానరులు వదలిన పర్వతములు నుగ్గు చేసినవి) వాటి ప్రహారములచే గుదులుగా వ్రేసి నెత్తురులు ప్రవహింపగా (సరి లేక వారించెను)

భారత : హరులు=గుఱ్ఱములు, కీలాలములు వెల్లిగొనునట్లుగా=రక్తము ప్రవహించునట్లు, అవనిన్=భూమిని, శాత=వాడియైన, అస్త్రనిహతిన్=అస్త్రముల ప్రయోగముచే, గ్రొచ్చి=భేదించి, వాజితృష్ణ=గుఱ్ఱముల దప్పికను, వారించె=పోగొట్టెను.

తాత్పర్యము : గుఱ్ఱములు ధైర్యముగా మెలగలేవనిన, అర్జునుడు అద్భుతముగా భూమిపై వాడియైన బాణప్రయోగముచే భేదించి రక్తప్రవాహముచే గుఱ్ఱముల దప్పికను పోగొట్టెను.

విశేషణము : ఆంధ్ర భాషాభూషణములో – హరులు మెలగలేవు – అను ప్రయోగమునకు ఉదాహరణ సూత్రము గలదు.

స్థావర, తిర్యక్ పదములకు క్రియలు ఏకవచనములు, దేవమనుష్యాది క్రియలు ఏకవచన, బహు వచనములు కలుగును.

సీ. మును పిమ్మహాయోధుఘనసంగరోత్సాహ
సన్నాహసంపత్తి విన్నది మొద
లాప్తసేనాది సహాయ సంగత్యవి
రతినిబిడౌజుండు రాజరాజు
సింధురాజు బ్రదుకు సెడకుండ రక్షించు
కొనుటకు నతి యత్నమునఁ బరఁగుట
దెలిసియు నిబ్బలాధికుని జయద్రథు
సద్యోవథార్హునిఁ జంపుటకును
తే. బ్రతినయం బే నొనర్పక పార్థబాణ
ములనె ప్రొద్దు గ్రుంకెడు దాఁకఁ బోరు జరుపు
చున్న విజయహాని జనింప కున్నెయకట!
శత్రునకు దర్పకాలమై సత్త్వ మెక్క. 175

రామా : మునుపు=పూర్వము, ఈ+మహాయోధున్=రావణుని యొక్క, ఘనసంగర+ఉత్సాహ సన్నాహ=యుద్ధమునందలి గొప్ప ఉత్సాహ సంరంభపు, సంపత్తి=సంపద, విన్నది మొదలు, ఆప్తసేనాది సహాయ సంగతి=హితులైన సేనా సహాయ విషయమును, అవిరతిని=ఎడతెగకుండుటచే, బిడౌజుండు=ఇంద్రుడును, రాజరాజు=కుబేరుడును, సింధురాజు=వరుణుడును, బ్రదుకు+చెడకుండ= రక్షించుకొనుటకు, అతియత్నమున+పరగుట+తెలిసియు=ప్రచ్ఛన్నులై ఉన్నారని తెలిసియు, ఈ+బలాధికుని=ఈ అధికబలవంతుని, జయత్=ఉత్కృష్టమైన, రథున్=రథముగలవానిని, సద్యో=ప్రొద్దుగుంకక మునుపే, వధ+అర్హునిన్=చంపదగిన రావణునిని, చంపుటకును, ప్రతినయంబు=ఇతర ఉపాయమును, ఏను=నేను, ఒనర్పక=చేయక, అపార్థ బాణములనె=నిరర్థకములైన బాణములచేతనే,

ప్రొద్దుగ్రుంకెడుదాక=అస్తమించునంతవరకు, పోరు జరుపుచున్న=యుద్ధము చేయుచున్నచో, శత్రునకు=రాక్షసులకు, దర్పకాలమై=రాత్రి కాలము దర్పకాలమై, సత్త్వమెక్క=బలము అతిశయిపంగా, విజయహాని=అపజయము, జనింపకున్నె యకట!=కలుగకుండునా అకటా!

తాత్పర్యము : పూర్వము రావణుని యొక్క యుద్ధోత్సాహ సంరంభ సంపదను గూర్చి విన్నది మొదలు మన హితులైన సేనాదుల సహాయ సంగతి ఎడతెగకుండుటచే ఇంద్ర కుబేరవరుణులు బ్రదుకు చెడిపోకుండ తమనుతాము రక్షించుకొనుటకు ప్రచ్ఛన్నులైయున్నారని తెలిసియు ఈ రావణుని సర్వోత్కృష్టమైన రథము గలవానిని, ప్రొద్దుగ్రుంకక మునుపే చంపదగినవానిని, ఉపాయేతరములు నేను చేయక, నిరర్థకములైన బాణములచేతనే సూర్యాస్తమయము వరకు అకటా! యుద్ధము చేయుచున్నచో రాక్షసులకు బలము పెరుగు రాత్రి కాలము దర్పకాలమైనచో జయమునకు హాని కలుగుకుండునా?

భారత : ఇమ్మహాయోధు=అర్జునుని యొక్క, ఘన=గొప్పదైన, సంగర=ప్రతిజ్ఞచే, మిగతా సమానము, అవిరతిన్=వదలకపోవుటచే, నిబిడౌజుండు=గాఢమైన తేజస్సుగల, రాజరాజ=దుర్యోధనుడు, సింధురాజు=సైంధవుని, జయద్రథున్=సైంధవుని, పార్థబాణములనె=అర్జునుని బాణముల వలననే.

తాత్పర్యము : మునుపు అర్జునునియొక్క గొప్ప ప్రతిజ్ఞాసన్నాహ సంపద విన్నది మొదలు కర్ణాదుల బలముల యొక్క సంగతిని విడువకుండుటచే మిక్కిలి తేజముగల దుర్యోధనుడు సైంధవుని ప్రాణములు పోకుండ రక్షించుకొనుటకు ప్రచ్ఛన్నముగా నుంచిన విషయము తెలిసియు బలాధికుడైన సైంధవుని ప్రొద్దుగ్రుంకక మునుపే చంపుటకు అర్హమైన వానిని చంపుటకు నేను ఉపాయాంతరము చేయక అర్జునుని బాణములతోనే సూర్యాస్తమయమగు వరకు నేను యుద్ధము జరుపుచున్నచో అర్జునునికి కీడు కలిగి శత్రువునకు బలము పెరిగి అకటా! దర్పకాలము అగును గదా.

విశేషణము : సంగర – 'ప్రతిజ్ఞాజి సంవిదాపత్సుసంగరః' – అని అమరము.

వ. అని తలపోసి. 176

అని ఆలోచించి (లక్ష్మణుడు/శ్రీకృష్ణుడు)

తే. కరము భానుబింబము మాయఁగప్పె నభము
నంబకముల రాగమునఁ బెంపారుచూడ్కిఁ
బ్రతిభటుఁడు సూచి నరుఁ డింక గ్రమ్మగ్గ కెట్టుఁ
బూన్కి విడఁ డని సంరంభమును వహింప. 177

రామా : రాగమున=ఎఱ్ఱనైన, పెంపారుచూడ్కిన్=తీవ్రమైన చూపులచే, ప్రతిభటుడు=రావణుడు, చూచి, నరుడు, మనుష్యుడు, ఇంక గ్రమ్మగ్గక+ఎట్టు=ఇంక ఎట్లు నశింపక, పూన్కి విడడని=పట్టుదల వదలడని, సంరంభమును వహింప= తొందరపడగా, కరము=మిక్కిలి, భానుబింబము=సూర్యబింబము, మాయన్=మాగుడు పడునట్లు, అంబకములన్=బాణములచే, నభము=ఆకాశమును, కప్పె=కప్పి వేసెను.

తాత్పర్యము : లక్ష్మణు డీవిధముగా నాలోచింపగా, ఎఱ్ఱనైన చూపులచే రావణుడు చూచి ఈ మనుష్యుడు ఇంక గ్రమ్మగ్గక పట్టు వదలడని తొందరపడగా, సూర్యబింబము మాగుడుపడునట్లు ఆకాశమును బాణములతో గప్పెను.

భారత : అంబకముల=కనుల యొక్క, రాగమునన్=అనురాగముచే, ప్రతిభటుడు=సైంధవుడు, నరుడు=అర్జునుడు, మాయన్=మాయచే.

తాత్పర్యము : కృష్ణుడీవిధముగా ఆలోచించి, నేత్రముల అనురాగముచే అతిశయించిన చూపులతో సైంధవుడు చూచి అర్జునుడు ఇకపై నశింపక ఏ విధముగా ప్రతిజ్ఞ వదలడని సంరంభము చూపగా మాయచే సూర్యబింబమును కప్పి వేసెను.

వ. ఇట్లు గప్పిన. 178

సీ. మదిలోనమిత్రాస్తమయ కాంక్ష మిక్కిలిఁ
గలిమిఁ దద్దిశ నంబకప్రయుక్తి

సలుపుచుఁ దత్కాలచాపలోపహతాత్మ
రక్షణుం దగువానిఁ బ్రచురబంధు
సింధురాజును బలోర్జితు మేఘనాదగు
రున్న్య క్రియాసహక్రూరభీమ
సేనాతిమాత్రోరుసింహ నాదములచే
నతివిశ్రుతంబుగ నాక్రమించి

తే. బిట్టు సమయించె ధృతిఁ బాకభేదిముఖ్య
ఖేచరులు గన్నులారంగఁ జూచి మెచ్చ
సప్రగల్భ రామావరజప్రయుక్త
విడియపటుశర వ్యాపార విలసనంబు. 179

రామా : మదిలోన=మనస్సులో, అమిత్ర=శత్రువుయొక్క, అస్తమయ కాంక్ష=నాశనమునందుగల, కాంక్ష=కోరిక, మిక్కిలి కలిమి=మిక్కుటముగా నుండుటచే, తత్+దిశన్=ఆ లక్ష్మణుడుండెడి దిక్కున, అంబక ప్రయుక్తి సలుపుచు=బాణ ప్రయోగమును చేయుచు, తత్+కాల=ఆ యుద్ధసమయమునందు, చాపలోప=విల్లు పోవుటచే, హతమైన=నశించిన, ఆత్మరక్షణుండగువానిన్=స్వీయరక్షణగలవానిని, ప్రచురబంధు=అధికబంధువయిన, సింధురాజును=సముద్రుడు గలవానిని, బలోర్జితున్=బలముచే నిండిన, మేఘనాదగురున్=రావణుని, న్యక్రియా=తిరస్కారమును, అసహ=ఓర్వని, క్రూర=క్రూరములు, భీమ=భయంకరములునైన, సేనా=వానరసేనలయొక్క, అతిమాత్రోరు=మిక్కిలి విస్తారమైన, సింహనాదములచే, అతివిశ్రుతంబుగ=మిక్కిలి ప్రసిద్ధమగునట్లుగా, ఆక్రమించి, పాకభేది ముఖ్యఖేచరులు=ఇంద్రాది దేవతలు, కన్నులారంగన్+చూచి, మెచ్చన్, సప్రగల్భ=మిక్కిలి పరాక్రమము గల, రామావరజ=లక్ష్మణునిచే, ప్రయుక్త=ప్రయోగింపబడిన, విజయ=జయము నందు, పటు=సమర్థములైన, శరవ్యాపార విలసనంబు=బాణ ప్రయోగ విలాసము, ధృతిన్=రావణుని ధైర్యమును, బిట్టుసమయించె=మిక్కిలి నశింపజేసెను.

తాత్పర్యము : మనస్సులో శత్రునాశనమునందుగల కోరిక మిక్కుటముగా నుండుటచే ఆ లక్ష్మణుడుండు దిక్కు వైపు బాణప్రయోగము చేయుచు, యుద్ధ సమయమునందు తన విల్లు పోవుటచే స్వీయరక్షణ నశించి, మిక్కిలి బంధువర్గములోని వాడైన సముద్రుడుగలవానిని, బలముచే ప్రకాశించు రావణుని తిరస్కారమును ఓర్వని క్రూర, భయంకరములైన వానరసేనలు విస్తరించిన సింహనాదములచే మిక్కిలి ప్రసిద్ధమగునట్లుగా ఆక్రమించి ఇంద్రాది దేవతలు కనులార చూచి మెచ్చునట్లు మిక్కిలి పరాక్రమముగల లక్ష్మణుడు ప్రయోగించిన జయసమర్థమగు బాణప్రయోగ విలాసము రావణుని ధైర్యమును మిక్కిలి నశింపజేసెను.

భారత : మదిలోన, మిత్ర=సూర్యుని యొక్క, అస్తమయ కాంక్ష=అస్తమించు కోరిక, మిక్కిలి కలిమి, తత్+దిశన్=పడమటి దిక్కునందు, అంబకప్రయుక్తి=కంటి చూపును, సలుపుచు=ప్రసరింపజేయుచు, తత్కాలచాపల=ఆ సమయము నందలి చాపలముచేత, ఉపహత=చెఱచుకోబడిన, ఆత్మరక్షణుండగువాని=తన రక్షణ కలిగినవానిని, ప్రచుర బంధున్=శ్రేష్ఠమైన బంధువులు గలవానిని, సింధురాజును= సైంధవుని, బలోర్జితు, మేఘనాద=మేఘధ్వని యొక్క, గురున్యక్క్రియా=అధిక తిరస్కారమందు, సహ=సమర్థములు, క్రూర=క్రూరములునైన, భీమసేన=భీమసేనుని యొక్క, సింహనాదముచే, పాకభేది=ఇంద్రుడు, ముఖ్య ఖేచరులు=దేవతలు, రామావరజ=కృష్ణునిచే, విజయ=అర్జునుని యొక్క, మిగతా సమానము.

తాత్పర్యము : మనస్సులో సూర్యాస్తమయము మీది కోరిక కలిగియుండుటచే పడమటి దిక్కునందు దృష్టిసారించుచు ఆ సమయమునందలి చాపలముచేత చెరచుకోబడిన ఆత్మరక్షణగల వాడును ప్రసిద్ధ బంధువులుగల సైంధవుని, మేఘధ్వనిని తిరస్కరించుటలో అతి సమర్థములు క్రూరములునైన భీమసేనుని తీవ్రసింహ నాదములచే మిక్కిలి వ్యాప్తిగా నాక్రమించిన అర్జునుని బాణవ్యాపార విలాసము కృష్ణునిచే ప్రేరేపించబడిన అర్జునుని ప్రాగల్భ్యమును కనులార చూచి ఇంద్రాది దేవతలు సంతోషించునట్లు సైంధవుని కూల్చెను.

విశేషణము : అంబకము – అంబకం నేత్రశరయోః అని వి.

తే. సరగునఁ బునఃప్రకాశితచండధాముఁ
డగుచు విజయప్రతిజ్ఞ చొప్పవియ కుండ
నిలిపె నాసురకులవైరి నిజవిచిత్ర
శక్తినట్లు ము న్నేచిన శత్రు నడఁచి. 180

రామా : సరగునన్=త్వరగా, పునః ప్రకాశిత=తిరిగి ప్రకాశించిన, చండ ధాముడగుచున్=తీవ్రప్రతాపముగలవాడై, విజయ ప్రతిజ్ఞ చొప్పు=లంకలో చేసిన శత్రు సంహార ప్రతిజ్ఞ విధము, అవియకుండ=చెడకుండ, ఆ సురకులవైరి=ఆ దేవతల వైరి రావణుడు, నిలిపె=నిలిపెను. నిజ=తన యొక్క, విచిత్ర=విచిత్రమైన, శక్తిన్=శక్తియను నాయుధముచే, అట్లు=ఆ విధముగా, మున్ను=పూర్వము, ఏచిన=ఎదుర్కొనిన, శత్రున్=లక్ష్మణుని, అడచి=పడవేసి.

తాత్పర్యము : త్వరగా తిరిగి ప్రకాశించిన తీవ్ర ప్రతాపముగలవాడై, లంకలో తాను చేసిన ప్రతిన చెడిపోకుండ నిలిపెను. రావణుడు తన యొక్క శక్తి ఆయుధముచే తనను పూర్వము ఎదిరించిన లక్ష్మణుని పడవేసి –

భారత : చండధాముడగుచున్=సూర్యుడు గలవాడై, అసుర కులవైరి=కృష్ణుడు.

తాత్పర్యము : త్వరగా తిరిగి ప్రకాశించిన సూర్యుడుగలవాడై అర్జునుడు తన ప్రతిన చెడకుండ నిలుచునట్లు కృష్ణుడు తన విచిత్రమైన శక్తిచే ఆ విధముగా ముందు ఎదిరించిన సైంధవుని పడవేయునట్లు చేసెను.

వ. అప్పుడు. 181

మ. నును మేచాయలనాదుకూర్మి యనుజన్మున్ బాధ స్వప్నంబు నం
గన కొప్పొ రెడుపుణ్యమూర్తిఁ బ్రియు నుగ్రద్వేషిచే నివ్విధం
బున నేయించి మునుంగఁ జేసితిఁ గడున్ మూర్ఛాబ్ధిలో నక్కటా
యనుచున్ రాజులరాజు గుందె రవిపుత్రాదుల్ దనుం దేర్పఁగన్.
182

రామా : నునుమేచాయల=అందమైన శరీరకాంతిచే నుండు, నాదుకూర్మి అనుజన్మున్=నా ప్రియమైన సోదరుడు లక్ష్మణుని, బాధ, స్వప్నంబునన్ గనక=కలలోనైనను చూడలేక, ఒప్పారెడు=ఉండెడు, పుణ్యమూర్తిన్, ప్రియున్, ఉగ్రద్వేషిచేన్=తీవ్రముగా ద్వేషించువానిచే, ఇవ్విధంబున=ఇట్లు, ఏయించి=బాణములు వేసి, అక్కటా, మూర్ఛాబ్ధిలో=మూర్ఛయనెడు సముద్రములో, కడున్ మునుంగజేసితి=మిక్కిలి మునుగునట్లు చేసితివి, అనుచున్=అని, రవి పుత్రాదుల్=సుగ్రీవాదులు, తనున్=రాముని, తేర్పగన్=ఓదార్చగా, రాజుల రాజు=రఘురాముడు, కుందె=దుఃఖించెను.

తాత్పర్యము : అందమైన శరీరచ్ఛాయగల నా ప్రియసోదరుడైన లక్ష్మణుడు బాధను స్వప్నములోనైనను చూడక విలసిల్లు పుణ్యమూర్తిని, ప్రియుని ఈ విధముగా తీవ్రమైన ద్వేషిచేత పడగొట్టి అకటా నన్ను మూర్ఛయనెడి సముద్రములో పడవేసితివి గదా! అని రాముడు సుగ్రీవాదులు తనను ఓదార్పగా బాధపడెను.

భారత : నునుమేచాయల=అందమైన శరీరచ్ఛాయలతో నుండు, నాదుకూర్మియనుజన్=నా ప్రియసోదరి దుస్సలను, మున్=ఇంతకు ముందు ఎన్నడును, బాధన్=దుఃఖమును, స్వప్నంబునన్=కలలోనైనను, కనకొప్పారెడు, పుణ్యమూర్తి, ప్రియున్=పతియైన సైంధవుని, మిగతా సమానము. ఏయించి=చంపించి, రవి పుత్రాదుల్=కర్ణాదులు, రాజులరాజు=దుర్యోధనుడు.

తాత్పర్యము : అందమైన శరీరచ్ఛాయగల నా ప్రియసోదరి దుస్సల మునుపెన్నడు కలలోనైనను బాధ ఎఱుగని పుణ్యమూర్తి పతిని ఈ విధముగా తీవ్రముగా ద్వేషించువానిచే ఈ విధముగా చంపించి ఆమెను అకటా మూర్ఛా సముద్రములో మునుగజేసితివని కర్ణాదులు తనను ఓదార్చగా సుయోధనుడు బాధపడెను.

వ. తదనంతరంబ తద్దయు నుద్దీపితం బగు కోపాటోపంబు. 183

తాత్పర్యము : తర్వాత మిక్కిలి పెరిగిన కోపావేశముతో.

కం. వాయుజవనచర వాహనుఁ
డై యేపున నిజచమూచయంబు గడచి రాఁ
బోయెఁ బరిపంథిబలము న
పాయము వొందింతు నేన యనితమకమునన్. 184

రామా : వాయుజ=హనుమంతుడనెడి, వనచర=వానరము, వాహనుడై=వాహనముగా గలవాడై, ఏపునన్=పటిష్ఠముగా, నిజచమూచయంబు=తన సేనా సమూహము, కడచిరాన్=వెంటరాగా, పరిపంథిబలమును=శత్రుసేనలను, నేన=నేనే (రాముడు) అపాయము+పొందింతున్=నశింపజేసెదను, అని, తమకమునన్=త్వరగా...

తాత్పర్యము : హనుమంతుడను వానరము వాహనముగా గలిగి పటిష్ఠముగా తన సేనా సమూహము వెంటరాగా శత్రుసేనలను నేను నశింపజేసెదనని త్వరగా రాముడు..

భారత : వాయుజవన=వాయువేగముగలవియై, చర=చరించెడి, వాహనుడై=అశ్వములు గలవాడై, మిగతా సమానము, నేన=దుర్యోధనుడు.

తాత్పర్యము : వాయువేగముగలవియై చరించు వాహనములుగలవాడై పటిష్ఠముగా తన సేనాసమూహము వెంటరాగా నేనే త్వరగా శత్రుసేనల నశింపజేసెదనని దుర్యోధనుడు...

కం. ఆవీరుఁడు మును దనబా
ణావలిఁ బవనసుతు నొంచి యాత్మబలజయ
శ్రీ వెలయించిన నెంతయు
వైవస్వతసంతతినృపవర్యుఁడు గినిసెన్. 185

రామా : ఆ వీరుడు=రావణుడు, మును=ముందుగా, తన బాణావలిన్=తన బాణసముదాయముచే, పవనసుతున్=హనుమంతుని, నొంచి=బాధించి,

ఆత్మబలజయశ్రీ=తన బలసంపదను, వెలయించిన=ప్రకాశింపజేయగా, వైవస్వత సంతతి=సూర్యవంశపు, నృపవర్యుడు=రాజు అయిన శ్రీరాముడు, ఎంతయు+కినిసెన్=మిక్కిలి కోపించెను.

తాత్పర్యము : రావణుడు ముందుగా తన బాణసముదాయముచే హనుమంతుని బాధించి తన బలసంపదను వెలయించగా సూర్యవంశపు రాజైన రాముడు మిక్కిలి కోపించెను.

భారత : ఆ వీరుడు=దుర్యోధనుడు, పవనసుతున్=భీముని, నృపవర్యుడు=ధర్మజుడు.

తాత్పర్యము : దుర్యోధనుడు ముందుగా తన బాణసముదాయముచే భీముని బాధించి తన బలసంపదచే వెలయగా సూర్యవంశపురాజైన ధర్మజుడు మిక్కిలి కోపించెను.

ఉ. ఈ విధి నల్గి యానృపతి యేయుశరంబులఁ దద్విరోధి దాఁ
జేవ దొఱంగి సాధనవిశేషవిహీనతఁ జెంది కుందె మూ
ర్ఛావృతిచేత మే నెఱుఁగ కంతటఁ దత్ప్రతిబోధలబ్ధిచే
భావములోఁ గలంక చొరఁబాఱెఁ దదీయులకార్తి హెచ్చఁగన్. 186

రామా : ఈవిధిన్=ఈ విధముగా, అల్గి=కోపించి, ఆనృపతి+ఏయు=రాముడు వేసెడి, శరంబులన్=బాణములచే, తత్+విరోధి=శత్రువైన రావణుడు, తాన్=తాను, చేవదొఱంగి=బలముచెడి, సాధన విశేష విహీనతన్+చెంది=సైన్యము నశింపగా, మూర్ఛ+ఆవృతిచేత=మూర్ఛ ఆవరించుటచే, మేనెఱుగక=స్పృహతప్పి, కుందెన్=బాధపడెను, అంతటన్=తర్వాత, తత్+ప్రతిబోధలబ్ధిచేన్=ఆమూర్ఛ నుండి తెలివిడిచే, తదీయులకున్=తన లంకలోని వారికి, ఆర్తి హెచ్చగన్=బాధ అధికము కాగా, భావము=ఆలోచన, లోగన్=చిన్నబోగా, లంకన్=లంకలోనికి, చొర+పాఱెన్=పరుగెత్తెను.

తాత్పర్యము : ఈ విధముగా కోపించిన రాముడు సంధించిన బాణములచే రావణుడు శక్తిని కోల్పోయి సేనా సముదాయము నశింపగా బాధపడెను. తర్వాత మూర్ఛ నుండి తెలివిడి పొంది లంకలోని వారికి బాధ అధికమగునట్లు భావము చిన్నబోగా లంకలోనికి చొరబారెను.

భారత : ఆ నృపతి=ధర్మరాజు, తద్విరోధి=దుర్యోధనుడు, తత్+ఆ మూర్ఛ ఆవరించుటచే, తదీయులకున్=కర్ణాదులకు, కలంక=భయము, మిగతా సమానము.

తాత్పర్యము : ఈ విధముగా కోపించిన ధర్మజుడు వేసిన బాణములచే దుర్యోధనుడు బలము నశించి సేనాసముదాయవిహీనుడై మూర్ఛ ఆవరింపగా తెలివిడి కోల్పోయి బాధపడెను. తిరిగి మూర్ఛ నుండి ఎఱుక గలుగుటచే కర్ణాదులకు బాధ హెచ్చుగా భావములో భయము ప్రవేశించెను.

ఆ. అంతలోఁ బ్రదీప్తమైనయక్షపితశ
క్తిని గరంబు మూర్ఛ మునిఁగినట్టి
రాకొమరుఁడు లేచి రణమత్తుఁ డయ్యెఁ గూ
ల్చిన యతండు వెరఁగునను మునుంగ. 187

రామా : అంతలో, ప్రదీప్తమైన=ప్రకాశవంతమైన, అక్షపిత=అక్షకుమారుని తండ్రియైన రావణునియొక్క, శక్తిని=శక్తి యనెడు ఆయుధముచే, కరంబు=మిక్కిలి, మూర్ఛ మునిగినట్టి=మూర్ఛిల్లిన రాకొమరుడు, లక్ష్మణుడు=కూల్చిన యతండు, పడగొట్టిన రావణుడు, వెరగునను=ఆశ్చర్యములో, మునుంగ=మునగగా, లేచి, రణమత్తుడయ్యె=రణోన్మాదము కలిగిన వాడాయెను.

తాత్పర్యము : అంతలో రావణుని తీవ్రమైన శక్త్యాయుధముచే మిక్కిలిగా మూర్ఛిల్లిన లక్ష్మణుడు లేచి తనను కూల్చిన రావణుడు ఆశ్చర్యపడునట్లు రణోన్ముఖుడాయెను.

భారత : అక్షపిత=చెఱుపబడనటువంటి, శక్తిని=బలముచే, మిగతా సమానము.

తాత్పర్యము : అంతలో మిక్కిలి చెఱుపలేనటువంటి బలముచే మూర్ఛిల్లిన దుర్యోధనుడు లేచి తనను కూల్చిన ధర్మజుడు ఆశ్చర్యమున మునుగునట్లు రణమునందు అన్యవిచారము లేనివాడాయెను.

తే. తెలివి చేకొని యతఁ డంతఁ గడుఁ
బేరు కలయట్టితనయోధవీరవరుల
నుక్కు మడఁగఁ దత్తద్ద్వంద్వయుద్ధవిధిని
బిరుదు లై రిపు లడఁచుచుఁ బేర్చు టరసి. 188

రామా : తెలివి చేకొని=వివేకము తెచ్చుకొని, అతడు=రావణుడు, పలువురన్=పలువురు, కడున్ పేరుగల యట్టి=ప్రసిద్ధులైన, తనయోధ వీరవరుల=తన శ్రేష్ఠమౌన యుద్ధవీరులను, ఉక్కు మడగన్=పటుత్వము నశింపగా, తత్+తత్+ ద్వంద్వయుద్ధ విధిని=ఆయా ద్వంద్వ యుద్ధవిధానములో, బిరుదులై, శ్రేష్ఠులై రిపులడచుచు=శత్రువులనణచుచు, పేర్చుట=అతిశయించుట (జయించుట), అఱసి=చూచి.

తాత్పర్యము : తెలివి తెచ్చుకొని రావణుడు తన సైన్యములో ప్రసిద్ధులైన యోధ వీరులను ద్వంద్వ యుద్ధములో ఆయా వీరులను, బిరుదు మగలను శత్రువులను నణచుటకు ప్రతాప హీనులను చేయుటకు సిద్ధపరచుటను చూచి -

భారత : తెలివి చేకొని=మూర్ఛ తెలిసి, అతడు=దుర్యోధనుడు, రిపులు= పాండవులు, అడచుచు+పేర్చుట=జయించుటను, మిగతా సమానము.

వ. ప్రతి విధానం బన్వేషించి 189

తాత్పర్యము : ఎదుర్కొను మార్గమును వెదకి -

ఆ. అతివిశాలధృతిమహాద్రినిభానుజు
బహురణప్రయత్న భరవినిద్రుఁ
జేసి యరులత్రుళ్లు చెఱుపఁ బంచెద నని
యాత్మ నెంచి యతని నట్ల పనిచె. 190

రామా : అతి విశాలధృతిన్=మిక్కిలి విస్తారమైన ధైర్యముగల వానిని, అద్రినిభున్=పర్వతముతో సమానమైన వానిని, అనుజున్=తమ్ముడైన కుంభకర్ణుని, బహుకరణ=పెక్కు మోతల యొక్క, ప్రయత్న భర=ప్రయత్న భారముచే, వినిద్రున్+చేసి=మేల్కొనునట్లుచేసి, అరులత్రుళ్లు=శత్రువుల గర్వమును, చెరుపన్+పంచెదన్+అని=నశింపజేసెదనని, ఆత్మనెంచి=మనసులో భావించి, అతనిన్=కుంభకర్ణుని, అట్ల=ఆ విధముగా, పనిచె=పంపెను.

తాత్పర్యము : అత్యంతము విస్తారమైన ధైర్యముగలిగి పర్వత సమానుడైన కుంభకర్ణుని పెక్కు మ్రోతల ప్రయత్న భారముచే మేల్కొనునట్లు చేసి శత్రువుల గర్వము చెడగొట్టుటకు పంపెదనని మనసులో భావించి కుంభకర్ణుని ఆ రీతిగా పంపెను.

భారత : భానుజున్=కర్ణుని, బహురణ=గొప్ప యుద్ధముయొక్క, ప్రయత్న భర=ప్రయత్న భారము నందు, వినిద్రున్=జాగరూకుని, అరుల త్రుళ్లు=పాండవుల గర్వము.

తాత్పర్యము : అత్యంత విస్తారమైన ధైర్యముచే పర్వతమును బోలిన కర్ణుని బహు విధములైన యుద్ధప్రయత్న భారమునందు జాగరూకుని చేసి పాండవుల గర్వము చెఱచుటకు పంపెదనని మనసులో భావించి ఆ రీతిగా కర్ణుని నియోగించెను.

వ. పనిచిన నతండును నతిభయంకర సన్నాహంబుతోడ నాహవ క్రీడకు నురువడించె నప్పుడు తత్పరివారంబు. 191

అర్థము (రామా+భారత) అతి భయంకర సన్నాహంబుతోడ=మిక్కిలి భయంకరమైన ప్రయత్నముతో, అతండును=కుంభకర్ణుడు / కర్ణుడు, ఆహత క్రీడకు=యుద్ధ క్రీడకు ఉరువడించె=ముందుకు సాగెను, తత్+పరివారంబు=వారిసేనలు.

తాత్పర్యము : అట్లు పంపగా కుంభకర్ణుడు / కర్ణుడు మిక్కిలి భయంకరమైన ప్రయత్నముతో యుద్ధక్రీడకు ముందుకు సాగగా అప్పుడు వారి పరివారము –

చం. ప్రకటత నేఁడు నీ వనిభరంబు వహించితె కించిదంచిత
భ్రుకుటివిమౌక్తికీకృతవిరోధివధూకుచకుంభకర్ణ యా
జి కిటులు భీష్మరోషమునఁ జేరక తద్దశ వాసరంబు లూ
రక చనఁ జేసి తక్కట తిరంబుగ మమ్మిక నైనఁ గావవే. 192

రామా : నేడు, ప్రకటితన్=బయల్పడునట్లు, నీవు=(కుంభకర్ణుడు), అని భరంబు వహించితె, యుద్ధ భారమును ధరించితివే, కించిత్+అంచిత భృకుటిన్=కొద్దిపాటి బొమముడిచే, విమౌక్తీకృత=హారములు లేకుండా చేయబడిన, విరోధివధూ కుచ=శత్రువుల పత్నుల కుచములు గలవాడా! కుంభకర్ణ=కుంభకర్ణా! ఆజికి+ యుద్ధమునకు, ఇటులు=ఈ విధముగా, భీష్మ రోషమున=మిక్కిలి కోపముతో, చేరక=రాక, తద్దశన్=ఆ విధమైన నిద్రావస్థచే, వాసరంబులు=దినంబులు, ఊరక చనన్ చేసితి=వ్యర్థముగా గడపితివి, అక్కడ=అకటా, తిరంబుగ=స్థిరముగా, మమ్ము=ఇకనైన కావవే.

తాత్పర్యము : సేనలు కుంభకర్ణునితో ఇట్లనిరి : కుంభకర్ణా! నీవు నేడు ఈ విధముగా బహిరంగముగా యుద్ధభారమును భరించితివా! కొద్దిపాటి బొమముడి చేతనే విరోధి స్త్రీల కుచకుంభములు హారరహితముగా చేయువాడా! ఈ విధముగా యుద్ధమునకు తీవ్ర కోపముతో రాక వ్యర్థముగా దినములు గడిపితివి. ఇకనైనను అకటా మమ్ము స్థిరముగా రక్షింపవే!

భారత : విరోధి వధూ కుచకుంభ=శత్రు స్త్రీల కుచకుంభములు కలవాడా! కర్ణా=కర్ణుడా! భీష్మరోషమున=భీష్మునిపై కోపముతో, తత్=ఆ భీష్ముని యొక్క, దశవాసరంబులు=పది యుద్ధ దినంబులు–మిగతా సమానము.

తాత్పర్యము : పరివారము కర్ణునితో ఇట్లనిరి. కర్ణా! నేడు ఈ విధముగా యుద్ధ భారమును ధరించితివా! కొద్దిపాటి బొమముడిచే విరోధి స్త్రీల కుచకుంభములు హారరహితములుగా చేయు వాడా! భీష్మునిపై కోపముతో యుద్ధమునకు ఈ విధముగా పది దినములు రాక వ్యర్థము చేసితివి. ఇకనైనను అకటా మమ్ములను రక్షింపవే!

చం. నరుఁడని లెక్కసేయఁడు మనంబున శాత్రవు నమ్మహాత్మ్ముచే
యు రణముఁ బెక్కు చోట్లఁ గనియున్ మననాయకుఁ డేమిచెప్పని
ద్దురమును మున్ను గాఁదెలిపి తోడుగ ని న్నెటులైనఁదేక యి
ట్లరికృతభీష్మహాని ననయంబును దుర్బలుఁ డయ్యె నక్కటా! 193

రామా : మన నాయకుడు=రావణుడు, నరుడని=సామాన్య మానవుడని, మనంబునన్=మనస్సునందు, శాత్రవున్=శత్రువుని, లెక్క సేయడు=లెక్కింపడు, ఆ+మహాత్మునిచేయు=ఆ మహనీయుడు చేయు, రణమున్=యుద్ధముల్, పెక్కు చోట్లన్=అనేక సందర్భములలో, కనియున్=చూచియు, ఏమి చెప్ప= ఏమని చెపవచ్చు, నిద్దుర=నిద్రను, మును మున్నుగాన్ తెలిపి=ముందుగా తెలిపి, నిన్ను=కుంభకర్ణుని, ఎటులైనన్=ఏ విధముగా నైనను, తోడుగ తేక=సహాయముగా తీసుకొని రాక, అక్కటా, ఇట్లు, అరికృత=శత్రువు చేసిన, భీష్మహానిన్=భయంకరమైన హానిచే, అనయంబును=మిక్కిలి, దుర్బలుడయ్యె=బలహీనుడాయెను.

తాత్పర్యము : మన నాయకుడైన రావణుడు శత్రువైన రాముని నరునిగా మనసున భావించి లెక్క చేయడు. పెక్కు చోట్ల ఆ మహాత్ముడు చేయు యుద్ధములు చూచియు లెక్కింపడు. ఏమి చెప్పవచ్చును. మున్ముందుగా తెల్పి నిద్రలేపి నిన్నెటులైనను సహాయముగా తీసుకొని రాక ఈ విధముగా చేయబడిన భయంకరమైన హాని వలన మిక్కిలి బలహీనుడాయెను.

భారత : మనంబున=మనుస్సులో, నరుడు=అర్జునుడు, అనిన్=యుద్ధమందు, శాత్రవుని=శత్రువును, లెక్కసేయడు, ఏమి చెప్పన్=చెప్పుటకేమున్నది, ఈ దురమును=ఈ యుద్ధమును, భీష్మ హానిన్=భీష్ముడు లేకుండుటచే.

తాత్పర్యము : అర్జునుడు యుద్ధమునందు శత్రువులను మనస్సులో లెక్క చేయడు (తృణీకరించును) ఆ మహాత్ముడు చేయు యుద్ధములు పెక్కు చోట్ల చూచియు దుర్యోధనుడు ఏమి చెప్పవలయును, ఈ యుద్ధమును మును ముందుగా తెలిపి నిన్ను ఎటులైనను సహాయముగా తీసికొని రాక శత్రువులచే భీష్మ నాశనముచే

అకటా మిక్కిలి దుర్బలుడాయెను.

వ. అని మఱియుం దమ దొరలచావు లుగ్గడించి యివి యన్నియు మన ప్రభువునకుం బ్రభవించుట నీ యనాదరంబునఁ జేసి కాక నీవు గావలయునని యొనర్చిన ననిమిషుల కయిన ననివార్యంబు గాదె యని ప్రస్తుతించుచుఁ బరివేష్టించి యుత్సాహంబు దీపింపం జేయఁ బెంపొంది యమందవిక్రంబున నెందును నెదురులేక యాకడింది జోదు పరబలంబుల నేలం గలుపుచు బలుపు పొలుపు దెలుపుచుండె నప్పుడు. 194

వ॥ : తమ దొరల చావులు=తమ నాయకుల మరణములు, ఉగ్గడించి=చెప్పి, ప్రభవించుట=కలుగుట, మన ప్రభువునకున్=రావణునకు / దుర్యోధనునకు, నీ అనాదరంబునన్ చేసికాక=నిన్ను ఆదరించక పోవుటచే కాక, అని యొనర్చిన=యుద్ధము చేసిన, అనిమిషులకైనన్=దేవతలకైనను, అనివార్యంబుగాదె= శక్యము కాదు గదా!, అని ప్రస్తుతించుచు=అని స్తుతించుచు, పరివేష్టించి=చుట్టుగా నిలిచి, ఉత్సాహంబు దీపింపన్ చేయ=ఉత్సాహము కలుగునట్లు చేయగా, పెంపొంది=బలపడి, అమంద విక్రమంబునన్=మిక్కిలి పరాక్రమముతో, ఆకడింది జోదు=మిక్కిలి పరాక్రమవంతుడైన ఆ యోధుడు, పరబలంబులన్=శత్రుసేనలను, నేలన్ గరుపుచు=నశింపచేయుచు, బలుపు పొలుపు తెలుపుచు=పరాక్రమోన్నతిని ప్రకటించుచు.

తాత్పర్యము : అని మరియు తమ నాయకుల చావులను తెలిపి ఇవి అన్నియు మన ప్రభువైన రావణునకు / దుర్యోధనునకు కలుగుట నిన్ను అనాదరము చేయుటవలననే కాక నీవు యుద్ధము చేసినచో దేవలకైనను వారింప శక్యము కాదు కదా! అని ప్రస్తుతించుచు చుట్టు నిల్చి ఉత్సాహము పెరుగునట్లు చేయగా అమిత విక్రమముతో ఎందును ఎదురులేక ఆ మహావీరుడు శత్రుసేనలను నేల గఱపించుచు తన శక్తి సంపదను తెలియజేయుచుండెను. అప్పుడు –

సీ. ప్రత్యర్థిభద్రవారణఘటోత్కచలస
త్కంఠీరవమురీతిఁ గడుఁ బొదలెడు
నీవీరుఁ గుదియించి కావుము మనసేన
ననుహరిసార్థవాక్యములు రవిజుఁ
దలపడఁ దెలుపునంతన యానిశాటుఁ డం
గదధర్మ నందన గంధవహజ
నాసత్యసుతచమూనాథాదికపులక
స్ఫూర్తికారణ మైన పొలుపుతోడ

తే. దివసనాయకుపట్టిపైఁ గవిసి తత్ప్ర
హారియత్నంబు వైఫల్య మందఁజేసి
దివ్యబాణచక్రప్రాసతీక్ష్ణశక్తి
శూలముఖ్య ప్రయోగవిస్ఫురణ నెఱపె. 195

రామా : శత్రువులనెడి, భద్రవారణ=మదించిన ఏనుగులయొక్క, ఘటా=సమూహముపై, ఉత్క=వేడుక గలదియై, చల=లఘించుచున్న, సత్కంఠీరము రీతిన్=బలిష్ఠ సింహమువలె, కదున్ పొదలెడు=మిక్కిలి పరాక్రమించు, వీరున్=ఈ వీరుని, కుదియించి=కుదించి, మన సేనను, కావుము+అను=రక్షించుమను, హరిసార్థ=వానర సమూహముయొక్క, వాక్యములు=మాటలు, రవిజున్=సుగ్రీవుని, తలపడన్ తెలుపునంతన్=ఎదిరించుటకు సిద్ధపడునంతలో, ఆనిశాటుడు=ఆ రాక్షసుడు, అంగద=అంగదుడును, ధర్మ నందన=సుషేణుడును, గంధవహజ=హనుమంతుడును, నా సత్యసుత=మైందద్వివిదులును, చమూనాథ=సేనానాయకుడైన నీలుడును, ఆదికపులకు=మొదలైన వానరులకు, అస్ఫూర్తి కారణము=విచార హేతువు, ఐన పొలుపుతోడ=ఐన విధముతో, దివసనాయకు పట్టిపై=సూర్యుని కుమారుడైన సుగ్రీవునిపై, కవిసి=ఎదుర్కొని, తత్+ప్రహారియత్నంబు=ఆ వీరుని ప్రయత్నము, వైఫల్యము+అందజేసి=నశింపచేసి, దివ్య=దేవతలయొక్క, బాణచక్ర=బాణ

సమూహముయొక్క, ప్రాస=ఎదిరించుటయందు, తీక్ష్ణశక్తి=తీవ్రమైన శక్తిగల, శూలముఖ్య=శూలశ్రేష్ఠము యొక్క ప్రయోగ విస్ఫురణ నెఱపె=ప్రయోగించు స్ఫూర్తి కలిగించెను.

తాత్పర్యము : శత్రువులనెడి మదపుటేనుగుల సమూహాముపై వేడుక గలదియై లంఘించు బలిష్ఠమైన సింహమువలె మిక్కిలి పరాక్రమించు ఈ వీరుని కుదించి మన సేనలను కావుము-అను వానర సమూహపు వాక్యములతో సుగ్రీవుడు ఎదిరించుటకు సిద్ధపడెను. అంతలో ఆ రాక్షసుడు అంగద, సుషేణ, హనుమ, మైందద్వివిదనీలాది వానరులకు విచారము కలిగించు రీతిలో సుగ్రీవునిపై ఎదుర్కొని ఆ వీరుని ప్రయత్నమును విఫలముచేసి దేవతల బాణసమూహము నెదిరించుట యందు తీవ్రశక్తిగల శూలశ్రేష్ఠమును ప్రయోగించు స్ఫూర్తి కలిగించెను.

భారత : కృష్ణుడు పలికిన మాటలు

ప్రత్యర్థి భద్రవారణ!=శత్రువుల శుభములను నివారించువాడా!, ఘటోత్కచ=ఓ ఘటోత్కచ!, లసత్+కంఠీరవము రీతిన్, ఈ వీరున్, హరిసార్థ వాక్యములు=శ్రీకృష్ణుని ప్రయోజనకరవాక్యములు, రవిజున్=కర్ణుని, ఆనిశాటుడు=ఘటోత్కచుడు, అంగదన్=వేడుకచే, ధర్మనందన=ధర్మజుడును, గంధవహజ=భీముడును, నా సత్యసుత=నకుల సహదేవులను, చమూనాధ=సేనా నాయకుడైన ధృష్టద్యుమ్నుడును, ఆదిక=మొదలైన వారికి, పులకస్ఫూర్తి=రోమాంచము కలుగునట్లు (సంతోషమునకు) దివసనాయక పట్టిపై, కర్ణునిపై, దివ్యబాణ చక్ర=దివ్యమైన బాణములు, ప్రాస=ఈటెలును, శూలముఖ్య=శూలము మొదలైన ఆయుధముల ప్రయోగ స్ఫూర్తిని కలిగించెను.

తాత్పర్యము : కృష్ణుడిట్లనెను.

“శత్రు శుభములను వారించు ఓ ఘటోత్కచా! ప్రకాశించు సింహమువలె మిక్కిలిగా వర్తించు ఈ వీరుని (కర్ణుని) నశింపచేసి మన సేనలను రక్షింపుము” అను శ్రీకృష్ణుని సార్థక వాక్యములు కర్ణునిపై తలపడుటకు సిద్ధము చేయగా ఘటోత్కచుడు

వేడుకతో ధర్మజ, భీమ, నకుల సహదేవ ధృష్టద్యుమ్నాదులకు సంతోషాతిశయము కలుగునట్లు కర్ణునిపై తలపడి, ఆ వీరుని ప్రయత్నములు విఫలము చేసి దివ్యబాణములు, ఈటెలు, తీక్షణ శక్తిగల శూలములు మొదలైన ఆయుధముల యొక్క ప్రయోగ స్ఫూర్తిని కలిగించెను.

వ. అతండును దానికిఁ జలింపక సుస్థిరుం డయ్యె నప్పుడు 196

తాత్పర్యము : అతడు కూడా దానికి చలింపక స్థిరముగా నిలిచెను. అప్పుడు

తే. అంతరమునంద యాశుగ సంతతివడి
నందికొని త్రుంచె దై త్యేరితాయుధమును
దనుజుఁ డపరిమేయపలాశి ఘనశిలాభి
హతి నినజు నుగ్రమన్యుమూర్ఛితునిఁ జెసె. 197

రామా : అంతరమునంద=మధ్యలోనే, ఆశుగ సంతతి=హనుమంతుడు, వడిన్+అందుకొని=త్వరగా అందుకుని, దైత్య=కుంభకర్ణునిచే, ఈలిత= ప్రయోగింపబడిన, ఆయుధమును, త్రుంచె=నశింపజేసెను, అపరిమేయపలాశి=అధిక మాంస భక్షకుడైన, దనుజుడు=కుంభకర్ణుడు, ఘనశిలాభిహతిన్=గొప్ప రాళ్లదెబ్బచే, ఉగ్రమన్యున్=అధిక కోపముగల, ఇనజున్=సుగ్రీవుని, మూర్ఛితునిన్+చేసె= మూర్ఛిల్లునట్లు చేసెను.

తాత్పర్యము : మధ్యలోనే అందుకొని హనుమంతుడు కుంభకర్ణుడు ప్రయోగించిన ఆయుధమును నశింపచేసెను. అధిక మాంసభక్షుడైన కుంభకర్ణుడు గొప్ప శిలను విసిరి, అధిక కోపము గల సుగ్రీవుని మూర్ఛిల్లజేసెను.

భారత : ఆశుగ సంతతి=బాణ సముదాయము యొక్క, దైత్య=ఘటోత్కచునిచే దనుజుడు=ఘటోత్కచుడు, అపరిమేయ పలాశి=పెద్ద వృక్షముల యొక్క ఘన శిలా=దట్టమైన రాళ్ల యొక్క, అభిహతిన్=దెబ్బలచే, ఇనజున్=కర్ణుని, మూర్ఛితునిన్= వ్యాపింపబడిన వానినిగా చేసెను.

తాత్పర్యము : మధ్యలోనే బాణ సముదాయముయొక్క వేగము నందుకొని ఘటోత్కచునిచే ప్రయోగించబడిన ఆయుధమును త్రుంచెను. ఘటోత్కచుడు పెద్ద వృక్షములు, దట్టమైన రాళ్ల దెబ్బలచే కర్ణుని వ్యాపింపచేసెను.

వ. అంత నిలక యమ్మహాబలునిగృహీతుఁ
జేసి శత్రుబలవిజృంభణంబు
రూపుసెడ హరింతు నేపున నావార
లెల్లఁ జూచి సంతసిల్ల ననుచు. 198

రామా : అంతనిలక=అంతటితో ఆగక, ఆ+మహాబలునిన్=సుగ్రీవుని, గృహీతున్+చేసి= పట్టుకొని, శత్రుబల విజృంభణంబు=శత్రువు యొక్క బలోన్నతి, రూపుసెడ=నశించునట్లు, హరింతున్=కొనిపోయెదను, నా వారలెల్లన్=రాక్షసులందరు, ఏపునన్=మిక్కిలి, చూచి, సంతసిల్లన్+అనుచు=సంతోషించునట్లు=అనుచు.

తాత్పర్యము : అంతటితో నిలువక సుగ్రీవుని పట్టుకొని శత్రువు యొక్క బలాధిక్యతను నశింపచేసి రాక్షసులందరు చూచి సంతోషింపచేసికొని పోయెదననుచు.

భారత : ఆ+మహాబలున్=కర్ణుని, నిగృహీతున్+చేసి=నిగ్రహించి (అణచి)

తాత్పర్యము : అంతటితో నాగక కర్ణుని అణచి (నిగ్రహించి) శత్రుబలాధిక్యత నశించునట్లు, నీవారలందరు అది చూచి మిక్కిలి సంతోషించునట్లు హరించెదననుచు.

తే. రాక్షసుండు ఖేలాగతి భ్రాజి యగుచు
నర్కనందను నెత్తి బాహాంతరమున
నానఁగ మహాశుగంబులవాన గురిసెఁ
దద్బలంబుల మనములు దల్లడిలఁగ 199

రామా : రాక్షసుండు=కుంభకర్ణుడు, ఖేలాగతి=వినోదముగా, భ్రాజి యగుచున్=ఒప్పుచున్నవాడై, అర్కనందనున్=సుగ్రీవుని, ఎత్తి=ఎత్తుకొని, బాహాంతర మునన్=రొమ్మున, ఆనగన్=నిలుపుకోగా, తత్=ఆ సుగ్రీవుని యొక్క, బలంబులు=

సేనలు, మహత్=అధికమైన, శుక్=శోకముచే, అంబుల=కన్నీళ్ల, వాన కురిసె=వర్షము, మనములు తల్లడిల్లగ=మనసు బాధపడునట్లు, కురిసె=కురిసెను.

తాత్పర్యము : కుంభకర్ణుడు లీలావిలాసముగా నూపుచు సుగ్రీవుని ఎత్తి రొమ్ముపై నిలుపుకోగా ఆ సుగ్రీవుని బలశ్రేణికి అధికమైన శోకముచే మనసులు తల్లడిల్లగా కన్నీటి వర్షము కురిసెను.

భారత : రాక్షసుండు=ఘటోత్కచుడు, ఖ=ఆకాశమునందు, ఇలాగతిన్=భూమిపై సంచారము చేయుటచే, అర్కనందును=కర్ణునియొక్క, నెత్తిన్=శిరమునందు బాహాంతరమునన్=ఎదపైన, అనగన్=అనునట్లుగా, మహాశుగంబులవాన=బాణ వర్షమును, కురిసె=కురిపించెను.

తాత్పర్యము : ఘటోత్కచుడు ఆకాశమున, భూమిపైన సంచారముచే ప్రకాశించుచు క్రమముగా కర్ణుని శిరమునందును, వక్షస్థలమునందును అనునట్లుగా ఆ కర్ణుని సేనలమనములు తల్లడిల్లునట్లుగా బాణవర్షము కురిపించెను.

సీ. అరికిన ట్లగపడి యనిషేధనీయమా
 నుండై వివస్వత్తనూభవుండు
గడు నంతఁ దెలివొంది కటకటా వీఁ డింత
 చేయునే యేనిదె చెండివైతు
వెస వీని నత్యంత విశ్రుతినాసత్వ
 మును జెందునట్లుగా ననుచు రేసి
సరభసోత్థానుఁడౌ కరములసద్దశ
 నమ్ములనైపుణి ముమ్మరముగఁ

ఆ. దనతలఁచినయట్లు మనుజశార్దూలు న
వార్యమన్యువికృతవదనుఁ గాఁగ
నవయవములు వ్రచ్చి యభ్రమ్మునకుఁ బాఱ
నడచె వాఁడు పిడుగు నట్ల మ్రోయ. 200

రామా : అరికిన్=శత్రువునకు, అట్లు+అగపడి=ఆ విధముగా కనిపించి, అనిషేధ=అడ్డు లేకుండ, నీయమానుండై=కొనిపోబడుచున్నవాడై, వివస్వత+తనూభవుండు=సుగ్రీవుడు, కడున్=మిక్కిలి, అంతన్=అంతలోనే, తెలివొంది=మూర్ఛనుండి మేల్కొని, కటకటా, వీడు, ఇంతచేయునే, ఏను=నేను, ఇదె=ఇప్పుడే, చెండివైతు=ఖండించెదను, వెసన్=మిక్కిలి, వీనిన్=వీనిని, అత్యంత=మిక్కిలి, విశ్రుతి నాసత్వములను చెందునట్లుగా=విగతములైన చెవులు ముక్కు కలవానినిగా, చేయుదును, అనుచు, రేసి=చెలరేగి, సరభస=వేగముగా, ఉత్థానుడై=ఎగసి, కరములన్=చేతుల చేతను, సత్+దశనమ్ములన్=వాడియైన పండ్ల చేతను, నైపుణిన్=నిపుణతతో, తనతలచినయట్లు=తాను భావించినట్లు, అవార్య=వారింప శక్యముగాని, మన్యున్=కోపముగల వానిని, దనుజశార్దూలున్=కుంభకర్ణుని, వికృతవదనున్ కాగన్=వికారమైన ముఖముగల వానినిగా, అవయములు వ్రచ్చి=శరీర భాగములను చీల్చి, వాడు, కుంభకర్ణుడు, పిడుగునట్ల మ్రోయ=పిడుగువలె శబ్దము చేయుచు, అభ్రమ్మునకున్=ఆకాశమునకు, పాఱన్+అడచెన్=పరుగెత్తునట్లు గ్రుద్దెను.

తాత్పర్యము : శత్రువునకు ఆ విధముగా కనిపించి అడ్డుపడనీని రీతిలో కొనిపోబడుచున్న వాడైన సుగ్రీవుడు అంతలో మూర్ఛ తెలిసి, కటకటా! కుంభకర్ణుడు ఇంత చేయునే! నేనిదే వీనిని చెండాడి వీని ముక్కు చెవులు విగతములగునట్లు చేయుదునని చెలరేగి వేగముగా ఎగసెను. చేతులు, వాడి పండ్లచే త్వరత్వరగా తాను తలచినట్లు అతి కోపముగల రాక్షసుని వికార వదనము గల వానినిగా అవయవములను చీల్చి ఆకాశమున కెగురగా కుంభకర్ణుడు పిడుగు మ్రోయునట్లు సుగ్రీవుని గ్రుద్దెను.

భారత : అనిషేధనీయ=మాన్పుటకు శక్యముగాని, మానుండై=అభిమానము గలవాడై, వివస్వత్+తనూభవుండు=సూర్యుని కుమారుడైన కర్ణుడు, తెలివొంది=ధైర్యము తెచ్చుకొని, అత్యంత విశ్రుతి=మిక్కిలి ప్రసిద్ధి గల, నా=నా యొక్క (కర్ణుని) సత్త్వమును=బలమును (నా శౌర్యమునకు కీర్తి కలుగునట్లు), ఉత్థాన= ఉత్సాహము

గలవాడై, కరము=మిక్కిలి, అసత్=ఒప్పుచున్న, దశన్=రీతిలో, అమ్ముల నైపుణి=బాణ చాతుర్యముచే, దనుజశార్దూలున్=ఘటోత్కచుని, మన్యు=క్రోధముచే, అభ్రమ్మునకున్= ఆకాశమునకు, పాఱనడచెన్=పాఱద్రోలెను.

తాత్పర్యము : శత్రువునకు ఆ విధముగా కనిపించి మాన్పుటకు శక్యముగాని అభిమానముగల కర్ణుడు అంతలో ధైర్యము తెచ్చుకొని కటకటా! వీడు ఇంత చేయునే, నేనిదే చండాడెదను. వీనిని మిక్కిలిగా నా శౌర్యమునకు కీర్తి వచ్చునట్లు చండాడెదనని చెలరేగి అధికమైన ఉత్సాహము గలవాడై మిక్కిలిగా నొప్పు రీతిలో బాణ చాతుర్యమును ముమ్మరముగా తాను తలచినట్లుగా వదలి అధిక కోపముతో నున్న ఘటోత్కచుని అవయవములు చీల్చి వికార వదనుని చేసి ఆకాశమునకు పాఱద్రోలునట్లు చేయగా వాడు పిడుగువలె మ్రోయగా –

వ. అప్పు డప్పద్మబంధు నందనుండు. 201

తాత్పర్యము : ఆ సుగ్రీవుడు / కర్ణుడు

తే. ఈతెఱంగున ఘనదైత్యు చేత నొవ్వఁ
బొదవఁబడియునుఁ గ్రమ్మఱఁ బొదువనీక
చనియె ననిభృతప్రీతితో వినుతి సేయఁ
దనబలము గూడ దనుజుండు గనలె మిగుల. 202

రామా : ఈ తెఱంగున=ఈ విధముగా, ఘనదైత్యుచేతన్= కుంభకర్ణునిచే, నొవ్వన్=నొచ్చునట్లుగా, పొదవబడియును=పట్టుబడియు, క్రమ్మరన్+పొదువనీక= తిరిగి పట్టుబడక, అనిభృత=వ్యక్తమైన ప్రీతితో సంతోషముతో, వినుతి సేయన్= పొగడగా, తనబలము కూడన్= తనసేనలను కలియునట్లు, చనియె=వెళ్లెను, దనుజుండు=కుంభకర్ణుడు, మిగులకనలె=మిక్కిలి కోపించెను.

తాత్పర్యము : ఈ విధముగా కుంభకర్ణునిచే పట్టుబడి బాధింపబడినను తిరిగి పట్టుబడక వ్యక్తమైన ప్రీతితో తన సేనలు ప్రస్తుతింపగా వారిని కలియుటకు వెళ్లెను. కుంభకర్ణుడు కోపించెను.

భారత : ఘన దైత్యుచేత=ఘటోత్కచునిచే, క్రమ్మఱన్+పొదువన్= తిరిగి వానిని జయించుటకు, నీకచనియెన్=నీకొక్కనికే చెల్లెను, అని=అని పలికి, భృత=భరింపబడిన, దనుజుడు=ఘటోత్కచుడు, కనలెను.

తాత్పర్యము : ఈ విధముగా ఘటోత్కచునిచే బాధింపబడి పట్టుబడినను తిరిగి వానిని జయించుట నీకొక్కనికే చెల్లెను అని నిండిన సంతోషముతో ప్రస్తుతింపగా తన సేనలను కూడుటకు వెళ్లెను. ఘటోత్కచుడు మిక్కిలి మిక్కిలి కోపించెను.

ఉత్సాహ. కనలి యసుర ప్రళయకాలు కరణిఁ బేర్చి పగఱ బ
ల్మొనల కుఱికి యుఱికి గదియ మోది యాశుభక్షణం
బున మదించుతనకు జడిసి పోటుదొరలు దెరలఁగా
వనజమిత్రుసంతతి ననవద్యుఁ జేరెఁ బోరికిన్. 203

రామా : కనలి=కోపించి, అసుర=కుంభకర్ణుడు, ప్రళయకాలు కరణిన్ పేర్చి=ప్రళయకాలమునందలి కాలునివలె కోపించి, పగఱ=శత్రువుల, బల్‌మొనలకు=శక్తివంతమైన సేనలపైకి, ఉఱికి ఉఱికి=పరుగెత్తి, కదియమోది= సమీపించి కొట్టి, ఆశు=శీఘ్రమైన భక్షణంబున్=తినుటచే, మదించు=మదించిన, తనకు=కుంభకర్ణునకు, జడిసి=భయపడి, పోటుదొరలు=బలవంతులైన నాయకులు, తెరలగ=కలత పడగ, వనజ మిత్రు సంతతిన్=సూర్యవంశమునందలి, అనవద్యున్=ప్రశస్తి గల రామునితో, పోరికిన్=యుద్ధమునకు, చేరెన్=తలపడెను.

తాత్పర్యము : కోపించిన కుంభకర్ణుడు ప్రళయకాలునివలె ఎగసి శత్రుసేనల మీదికి ఉరికి వారిని మోది శీఘ్రముగా భక్షించుటచే మదించిన తనకు భయపడి బలవంతులైన దొరలు కలతపడగా సూర్యవంశపు రామునితో యుద్ధమునకు తలపడుటకు సమీపించెను.

భారత : అసుర=ఘటోత్కచుడు, ఆ=ఆ విధమైన, శుభలక్షణంబునన్ =శుభమైన ఉత్సవము నందే, మదించు తనకు, సంతోషించు తనకు, అనవద్యున్=కీర్తిగల, వనజమిత్రు సంతతిన్=కర్ణుని, చేరెన్=చేరెను.

వ. చేరి యి ట్లనియె 204

సీ. విను నీవు వాం(డ వీం(డను జయించితి నని
(క్రొవ్వకు మిచట న క్కొలఁదిఁబోఁడు
భూరి(ప్రతాప సిందూరయశశ్చామ
రాత్యలంకృతకకుబంతదంతి
కుంభకర్ణుఁడు రణ(క్రూరుండు భీమసు
తుండాహుతత్వదుద్దండబలుఁడు
బలురక్కసుఁడు పోరఁ (బబ్బినాఁ డిట్టిప
న్నెఱిఁగి మార్కొను మిప్పు డేఁ బృథురణ

తే. వైభవాలంబసదనుజ వధవిధి నినుఁ
గలఁచి యిదె (మ్రింగఁ గదిసితి నిలునిలు మని
(ప్రౌఢి గనుటకుఁ దగ దాశరథివరేణ్య
కర్ణ కఠినముల్ నీశౌర్య కథలు సభల. 205

రామా: కుంభకర్ణుడు రామునితో ననిన మాటలు –

విను=రామా! వినుము, నీవు=వాం(డ వీం(డను జయించితినని=నీవు వారిని వీరిని జయించితినని, (క్రొవ్వకుము=అహంకరించకుము, ఇచట ఆ+కొలదిపోడు=ఆ పరిమిత (ప్రతాపము, భూరి(ప్రతాప=గొప్ప (ప్రతాపమనెడి, సిందూర=సిందూరము చేతను, యశః=కీర్తియనెడి, చామర=వింజామరల చేతను, అతి+అలంకృత=మిక్కిలి అలంకరింపబడిన, కకుబంత=దిగంతములయందున్న, దంతి=గజములు గలవాడు, రణ(క్రూరుండు=యుద్ధమున (క్రూరుడైనవాడు, కుంభకర్ణుడు, భీమ=భయంకరమైన, సు+లెస్స అయిన, తుండ=ముఖమునందు, హుత=(వేల్చబడిన, నీయొక్క ఉద్దండ బలుడు=అధికబలము గలవాడు, బలురక్కసుడు=బలవంతుడైన రాక్షసుడు, పోరన్=యుద్ధమునందు, (ప్రబ్బినాడు=అతిశయించినాడు, ఇట్టి పన్ను ఎఱిగి=ఈ

విధమైన యుద్ధసన్నద్ధతను తెలిసికొని, మార్కొనుము=ఎదుర్కొనుము, ఇప్పుడు, ఏన్=నేను,పృధురణ వైభవ=అధికమైన యుద్ధ వైభవమునకు, ఆలంబ=అవలంబమైన, సత్=లెస్స అయిన, అనుజ=నీ తమ్ముడైన లక్ష్మణుని యొక్క, వధ విధిన్=చంపుటచే నినున్ కలచి=నిన్ను కలతబెట్టి, ఇదె=ఇప్పుడే మ్రింగన్, కదిసితి=మ్రింగుటకు సమీపించితిని, నిలునిలుమ=నిలువుము, అనిన్=యుద్ధమునందు, దాశరథివరేణ్యా=రామా!, ప్రౌఢి గనుటకున్ తగ=ప్రతాపమును చూచుటకు తగిన, సభలన్=సభలలో, నీ శౌర్య కథలు=నీ పరాక్రమ గాథలు, కర్ణ కఠినముల్=వినగూడకున్నవి.

తాత్పర్యము : రామా! వినుము, నీవు వారిని వీరిని జయించితినని బలియకుము. ఇక్కడ నీ పరిమిత ప్రతాపము. అధిక ప్రతాపమనెడి సిందూరము చేతను, కీర్తియనెడి వింజామరల చేతను మిక్కిలి అలంకరింపబడిన దిగ్గజములు గలవాడు, భయంకరమైన ముఖమందు వ్రేల్వాబడిన నీ ఉద్దండ బలముగలవాడు యుద్ధమున క్రూరుడైన ఈ బలవంతుడైన రాక్షసుడు, కుంభకర్ణుడు యుద్ధమునకు తరలినాడు. ఇట్టి యుద్ధ సన్నద్ధతను తెలిసికొని ఎదిరింపుము. నేను అధికమైన యుద్ధ వైభవమునకు ఆలంబమైన నీ తమ్ముడైన లక్ష్మణుని వధించుటచే నిన్ను కలత బెట్టి ఇప్పుడే మ్రింగుటకు సమీపించితిని. సభలలో నీ ప్రతాప గాథలు వినగూడకున్నవి.

భారత : ఘటోత్కచుడు కర్ణునితో అనిని మాటలు –

కుంభకర్ణ=కుంభకర్ణుడు, (కుంభ స్థలములు చెవులుగా గలవాడు), భీమ సుతుండు=ఘటోత్కచుడు, అహుత=భస్మము చేయబడిన, ఆలంబస=రాక్షసుని యొక్క (ఆలంబసుడు) ప్రౌఢి గనుటకు తగదు, ఆశ=పరాక్రమమును తెలిసికొను ఆశ తగదు, రథివరేణ్యా=కర్ణా! నీ శౌర్య కథలు=నీ పంతములు, కఠినముల్=చెల్లవు.

తాత్పర్యము : మహారథా కర్ణా! వినుము. నీవు వారిని వీరిని జయించితినని గర్వించకుము. ఇక్కడ నీ ప్రతాపము పరిమితము. అధిక ప్రతాపమనెడు సిందూరము చేతను కీర్తియను వింజామరల చేతను మిక్కిలి అలంకరింపబడిన దిగ్గజముల కుంభస్థలములు చెవులుగా కలవాడును, యుద్ధమున క్రూరుడు అయిన ఘటోత్కచుడు

నీ ఉద్దండ బలములను భస్మము చేయగల రాక్షసుడు. అతడు యుద్ధమున అతిశయించినవాడు. ఆ యుద్ధసన్నద్ధతను తెలిసి ఎదిరింపుము. ఇప్పుడే నేను అధిక యుద్ధ వైభవముగల ఆలంబాసురుని చంపి నిన్ను మ్రింగుటకు సమీపించితిని. నిలునిలుము అని నీ శక్తిని తెలిసికొనుటకు ఆశ తగదు (తొల్లిటివలె నీ రణ ప్రౌఢి నాముందర చెల్లదు) నీ పంతములు ఇక చెల్లవు.

కం. అని చూపఱ కద్భుతముగ
దనుజుఁడు యుద్ధంబు చేసి తచ్ఛక్తిఁ దుదన్
దనువుతగు లుడుపుకొనియెం
దనవారలు గలఁగఁ బగఱదళములు సెలఁగన్. 206

రామా : అని, చూపఱకు=చూచువారలకు, దనుజుడు=కుంభకర్ణుడు, అద్భుతముగా యుద్ధంబు చేసి, తత్=ఆ రాముని యొక్క శక్తిన్=బలిమిచే, తనవారలు=రాక్షససేనలు, కలగన్=కలత పడగా, పగఱదళములు=వానరసేనలు సెలగన్=విక్రమింపగా, తనువు తగులు=శరీర బంధమును, ఉడుపుకొనియెన్= వదలుకొనెను.

తాత్పర్యము : అని పలికి చూచువారలకు కుంభకర్ణుడు అద్భుతమగునట్లు యుద్ధము చేసి ఆ రాముని బలిమిచే, రాక్షస సేనలు కలత పడగా, వానర సేనలు సంతోషించగా శరీర బంధమును వదలెను (మరణించెను)

భారత : తత్=ఆ కర్ణుని యొక్క, శక్తిన్=ఇంద్రదత్త శక్తిచే, దనుజుడు=ఘటోత్కచుడు.

తాత్పర్యము : అని పలికి చూచువారలకు ఆశ్చర్యముగా యుద్ధము చేసి ఆ కర్ణుని యొక్క ఇంద్రదత్త శక్త్యాయుధముచే పాండవ సేనలు కలత పడగా, కౌరవ సేనలు విక్రమింపగా ఘటోత్కచుడు శరీరమును విడిచెను.

తే. అంత నత్యుగ్ర మగుపోరు గొంత జరుగ
నశ్రముఁ దతి కాయాభిఖ్యుఁ దఖిలరణక

ళాధికారి గాంభీర్యతోయధిఘటోద్భ
వుండు ద్రుపదముఖ్యులఁ బలువుర వధించె. 207

రామా : అంతన్, అతి+ఉగ్రమగు పోరు=తీవ్రమైన యుద్ధము, కొంత జరుగన్=కొంత నడవగా, అశ్రముడు=శ్రమలేనివాడు, అతికాయ+అభిఖ్యుడు=అతి కాయుడనే పేరుగలవాడు, అఖిల కళాధిక=మిక్కిలి నైపుణ్యముగల, అరి=శత్రువుల యొక్క, గాంభీర్య=గంభీరమనెడి, తోయధి=సముద్రమునకు, ఘటోద్భవుండు= ఆగస్త్యుడైనవాడు, ద్రుపదముఖ్యులన్=వానర శ్రేష్ఠులను, పలువురన్=పెక్కు మందిని, వధించె=చంపెను.

తాత్పర్యము : అంతట మిక్కిలి తీవ్రమైన యుద్ధము కొంత జరుగగా శ్రమలేనివాడైన అతికాయుడను పేరు గలిగినవాడు, యుద్ధ తంత్రమునందు శత్రువుల గాంభీర్య సముద్రము నౌపోశనబట్టెడి అగస్త్యుని వంటివాడు వానరశ్రేష్ఠులను పలువురను వధించెను.

భారత : అంతన్=ఘటోత్కచుడు నొచ్చిన తర్వాత, అతి=మిక్కిలి, కాయాభిఖ్య= శరీరకాంతిగలవాడు, అఖిల రణకళాధికారి=మిక్కిలి యుద్ధ తంత్రములందు నేర్పరి, ఘటోద్భవుండు=ద్రోణాచార్యుడు, ద్రుపదముఖ్యులన్= ద్రుపదుడు మొదలైనవారిని పలువుర వధించె.

తాత్పర్యము : ఘటోత్కచుడు నొచ్చిన తర్వాత తీవ్రమైన యుద్ధము కొంత జరుగగా దేహకాంతి తరగనివాడు, అత్యంత దేహకాంతి గలవాడు సమస్త యుద్ధ తంత్రనిపుణుడు గాంభీర్య సముద్రుడునైన ద్రోణాచార్యుడు ద్రుపదాది ముఖ్యులను పలువురను వధించెను.

విశేషణము : అభిఖ్య 'అభిఖ్యానామ శోభయోః' అని అమరము.

మ. అనివార్యుం డతఁ డంతటం దనయమిథ్యామృత్యువార్తా ప్రవ
ర్తనచేతంగురుమానసార్పితవిషాదగ్లాని యయ్యెందనుం
దనునిర్ముక్తునిఁ జేయుచున్ విశిఖసంధానాతివేగ ప్రపం
చనసౌమిత్రి యనేక యుద్ధకృతిధృష్టద్యుమ్నుఁ డేపారఁగన్ 208

రామా : అతడు=అతికాయుడు, అంతటన్=తర్వాత, అనివార్యుండు=నివారింప శక్యము గానివాడు, తన=తన యొక్క, విశిఖసంధాన=బాణప్రయోగమునందలి, అతివేగ=మిక్కిలి వేగము యొక్క, ప్రపంచనన్= విస్తరించుటచే, సౌమిత్రి=లక్ష్మణుడు, అనేక=పెక్కు, యుద్ధకృతి=యుద్ధక్రమమందు, ధృష్ట=దృఢమైన, ద్యుమ్నుడు= బలముగలవాడు, ఏపారగన్=విజృంభించగా, తనున్=తనను, తనునిర్ముక్తుని+ చేయుచున్=శరీర బంధము వీడునట్లు చేసి, తన= తన యొక్క, అమిధ్యా=సత్యమైన, మృత్యువార్తా=మృత్యువార్త యొక్క ప్రవర్తన చేతన్=వినిపించుటచే, గురు=తండ్రియైన రావణుని యొక్క, మానస+అర్పి=మనస్సునందు అర్పించిన, విషాదగ్లాని+అయ్యెన్= విషాదముతో కూడిన గ్లాని కలిగిన వాడాయెను.

తాత్పర్యము : అతికాయుడు మరణించెనను వార్తవిని రావణుడు విషాదము నొందెను. అనివార్యుడైన అతికాయుడు తన బాణ ప్రయోగవిస్తారముచేయగా లక్ష్మణుడు యుద్ధక్రియయందు దృఢ సత్త్వముగలవాడై ఏ పారగా అతికాయుని వధించి, తన సత్యమైన వార్త వినిపించుటచే తండ్రియైన రావణుని మనస్సునందు అర్పించిన విషాద గ్లానికి కారకుడాయెను.

భారత : అతడు=ద్రోణుడు, తనయ=కుమారుడైన అశ్వత్థామ యొక్క మిథ్యా=అసత్యమైన, మృత్యువార్తా ప్రవర్తనచేతన్=మరణించెనను వార్త వ్యాపించుటచే తనున్=తనను, తను నిర్ముక్తునిన్=దేహ నిర్ముక్తునిగా, చేయుచున్=తనకు తానే దేహము విడుచుచు, విశిఖ=బాణములను, సంధాన= వదలుటయందు అతివేగ=మిక్కిలి వేగముగా, ప్రపంచన= ప్రయోగమునందు, సౌమిత్రి=లక్ష్మణుడైనవాడు, అనేక యుద్ధ కృతి=మిక్కిలి యుద్ధములు చేయుటయందు నేర్పరియైన=ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు, గురు=అధికమగునట్లు (పెద్దల), మానస=మనస్సులందు, అర్పిత=కల్పించబడిన, విషాదగ్లాని=విషాదముచేతిగ్లాని గలవాడాయెను.

తాత్పర్యము : అంతట అనివార్యుడైన ద్రోణుడు తన కుమారుడైన అశ్వత్థామ అసత్యమరణ వార్త వ్యాపించుటచే తాను దేహనిర్ముక్తునిగా గావించుకొని బాణములు అతివేగముగా ప్రయోగించుటయందు లక్ష్మణుడైనవాడు, పెక్కు యుద్ధములందు

నేర్పరి అయిన ధృష్టద్యుమ్నుడు ఏపారగా, అధికమైన పెద్దల మనసులందు అర్పించిన విషాద గ్లాని గలవాడాయెను.

వ. అంత. 209

సీ. గురుదివ్యబాణచాతురిని మీఱినవాని
గారాపుఁబట్టి నఖండవిక్ర
మోగ్రునెంతయును దుర్యోధనుం డని గెల్పుఁ
దనకొనర్పఁగఁజాలు నని గణించి
యాతీవ్రబలుబహుభ్రాతృనాశకఠోర
తరమన్యుదశముఖుఁ డరివధమున
కత్యాదరతఁ బంచె నస్త్రనైపుణిఁజూపె
నతఁడును బ్రతివీరు లపగతరణ

తే. చేష్టలైరి తద్బ్రహ్మాస్త్రవిజృంభణమున
కెదురు లేక మూర్ఛన్మానమదము లడఁగఁ
దత్ప్రతివిధానకుశలాచ్యుతప్రయత్న
మున బిరుసు డింప కపు డొప్పె ననిలసుతుఁడు 210

రామా : గురు=అధికమైన, దివ్యబాణ చాతురిని=దివ్యమైన బాణ ప్రయోగ చాతుర్యముచే, అతిశయించినవానిని, గారాపున్+పట్టిన్=ప్రియపుత్రుని, అఖండ విక్రమ+ఉగ్రున్=అత్యంత పరాక్రమాతిశయముగలవానిని, ఎంతయును, దుర్యోధనుండని=యుద్ధము సేయ శక్యముగానివాడని, గెల్పు=జయము, తనకు+ ఒనర్పగన్+చాలునని=తనకు చేయగలవాడని, గణించి=లెక్కించి, ఆతీవ్రబలున్= ఆతీవ్రమైన బలము గలవానిని, బహుభ్రాతృనాశ=పెక్కురు సోదరులు నశించుటచే, కఠోర తరమన్యు=మిక్కిలి కోపముగలవానిని, దశముఖుడు=రావణుడు, అరివధమునకు=శత్రునాశనమునకు, పంచెన్=పంపెను, అతడును=ఆ ఇంద్రజిత్తుదు,

అస్త్రనైపుణిన్+చూపె=అస్త్రప్రయోగ నైపుణ్యమును జూపెను, ప్రతివీరులు=రామాదులు, అపగత=నశించిన, రణచేష్టలైరి=యుద్ధక్రియగల వారైరి, తత్=ఆ యింద్రజిత్తు యొక్క, బ్రహ్మాస్త్ర విజృంభణమునకు=బ్రహ్మాస్త్రము విజృంభించుటకు, ఎదురులేక=అడ్డులేక, మూర్ఛన్=మూర్ఛతో, మానమదములడగన్=మానము, గర్వము అణగగా తత్+ప్రతివిధాన=ఆ బ్రహ్మాస్త్రము యొక్క, ప్రతివిధాన=ప్రతి క్రియకు, కుశల=సమర్థమునై, అచ్యుత=స్థిరమైన, ప్రయత్నమున=ప్రయత్నముచే, బిరుసుడింపక=ధైర్యము కోల్పోక, అనిలసుతుడు=హనుమంతుడు, అపుడొప్పె=అప్పుడు ప్రకాశించెను.

తాత్పర్యము : అధికమైన దివ్యబాణ ప్రయోగనైపుణ్యముగల తన ప్రియ సుతుని మిక్కిలి విక్రమ తీవ్రతగల వానిని, యుద్ధము చేయుట యందు ఎంతయు శక్యముగాని వానిని, తనకు జయమును కలిగింపగలడని లెక్కించి పెక్కండ్రు తన సోదరుల నాశనమునకు తీవ్రముగా కోపించిన తీవ్ర బలముగల వానిని ఇంద్రజిత్తును రావణుడు శత్రువధమునకు మిక్కిలి ఆదరముతో పంపెను. అతడును అస్త్రవిద్యానైపుణ్యమును చూపగా రామాదులు విగత చేష్టలైరి. ఆ బ్రహ్మాస్త్రము యొక్క విజృంభణమును ఎదిరింపలేక మానమదములు నశింపగా మూర్ఛిల్లిరి. దానికి ఎదురు చేయుటయందు సమర్థము స్థిరమైన ప్రయత్నముచే హనుమంతుడు దాని పౌరుషమును తగ్గించుటకు యత్నించెను.

భారత : గురు=ద్రోణాచార్యుని, గారాపున్+పట్టి=అశ్వత్థామను, దుర్యోధనుండు=సుయోధనుడు, అనిన్=యుద్ధమునందు, బహుభ్రాతృనాశ కఠోరతర మన్యు దశ=పెక్కురు సోదరులు మరణించుటచే తీవ్రమైన కోపస్థితి గల, ముఖుడు=ముఖముగలవాడు (దుర్యోధనుడు), తత్బ్రహ్మ=ఆ బ్రాహ్మణుని యొక్క అస్త్ర విజృంభణమునకు=అస్త్రముల ప్రయోగమునకు, మూర్ఛత్=వ్యాపించుచున్న, తత్+ఆ బ్రాహ్మణుని యొక్క, ప్రతి విధానకుశల=ఎదిరించుటకు సమర్థుడైన, అచ్యుత=కృష్ణుని, ప్రయత్నమున, అపగత=విడువబడిన, రణచేష్టలైరి=యుద్ధక్రియ గలవారైరి, అనిలసుతుడు=భీముడు, బిరుసుడింపక యొప్పెన్=నమస్కరింపకుండెను.

తాత్పర్యము : దివ్య బాణప్రయోగ నైపుణ్యములో ద్రోణుని మించిన అశ్వత్థామ

తీవ్రమైన పరాక్రమ దర్పముతో యుద్ధమునందు గెల్చుటకు శక్యముగానివాడని, తనకు జయము చేకూర్చగలడని, లెక్కించి ఆ తీవ్ర బలుని పెక్కండ్రు సోదర నాశముచే తీవ్ర కోపస్థితిలో వున్న దుర్యోధనుడు శత్రువధకు అశ్వత్థామను ఆదరముతో పంపించెను. అతడు అస్త్ర విద్యానైపుణ్యము ప్రదర్శింపగా ఆ బ్రాహ్మణుని అస్త్ర విజృంభణముతో వ్యాపించిన శక్తి నెదిరింప లేక మదమానములు అణగెను. ఆ బ్రాహ్మణుని బాణమును త్రిప్పి కొట్టగల సమర్థుడైన కృష్ణుని ప్రయత్నముచే పాండవులు యుద్ధ క్రీడను విడిచి నారాయణాస్త్రమునకు నమస్కరించిరి. భీముడు నమస్కరింపకుండెను.

వ. అంత 211

ఆ. అతఁడు సకలసైన్యవితతిని సంజీవ
నౌషధీసమానయనవిహితపు
నఃప్రతిష్ఠగా నొనర్చి వర్ణనకెక్కు
శౌర్యవిక్రమనయ చర్యనడపె. 212

రామా : అతడు=హనుమంతుడు, సకలసైన్యవితతిని=సమస్త సేనా సముదాయమును, సంజీవ+ఓషధి=సంజీవనీ మూలికను, సమానయన=తెచ్చుటచే, విహితమైన=సిద్ధించిన, పునః+ప్రతిష్ఠగాన్=తిరిగి బ్రతుకుట గలవారినిగా, ఒనర్చి=చేసి, వర్ణనకెక్కు=ప్రశంసార్హముగా, శౌర్యవిక్రమ=అధిక సామర్థ్యముగల శౌర్యము యొక్క, నయచర్యన్=నీతి చర్యను, నడపె=జరిపెను.

తాత్పార్యము : హనుమంతుడు సకల సేనాసముదాయమును సంజీవనీ ఓషధులను తెచ్చుటచే పునరుజ్జీవితులను చేసి అధికశౌర్యముగల నీతిచర్యను నడిపెను.

భారత : అతడు=భీముడు, సంజీవనౌషధీసమాన=సంజీవనీ సమానమైనది, అనన్=అనునట్లు, శౌరి=కృష్ణుని యొక్క, అవిక్రమ=క్రమ రహితమైన, నయచర్యన్=నీతి మార్గమును, నడపె=నడపెను.

తాత్పర్యము : భీముడు సమస్త సేనాసముదాయమును సంజీవనితో సమానమైన విధముగా పునఃప్రతిష్టితము చేసి ప్రస్తుతికెక్కునట్లు కృష్ణుని క్రమరహితమైన నీతి మార్గముచే ఆయుధమును విడిచెను.

తే. అపుడు మనుజేంద్రముఖ్యు లాహరి నుతించి
రనఘ నీదుమహత్త్వ మేమని పొగడఁగ
వచ్చు నారాయణమహాస్త్రవైభవ మిటు
లఫలముగఁ జేసి రిపులక్రొ వ్వడఁచి తనుచు 213

రామా: అపుడు, మనుజ+ఇంద్రముఖ్యులు=రామాదులు, ఆహరిన్= హనుమంతుని, అనఘ=శ్రేష్ఠుడా! నీదుమహత్త్వము=నీ గొప్పదనమును, ఏమని పొగడవచ్చు, నారాయణ=నారాయణ! మహాస్త్రవైభవము=గొప్ప అస్త్రము యొక్క విభవమును, ఇటులు, అఫలముగన్+చేసి=విఫలము చేసి రిపులక్రొవ్వు= రాక్షసులమదమును, అడచితి+అనుచు=అణచితివని, నుతించిరి=స్తుతించిరి.

తాత్పర్యము : అప్పుడు రామాదులు హనుమంతునితో ఓ శ్రేష్ఠవానరా! నీ గొప్పదనమును ఏమని నారాయణా! పొగడగలము. మహాస్త్రవైభవమును ఈ విధముగా విఫలముచేసి రాక్షసుల మదము నణచితివని స్తుతించిరి.

భారత : మనుజేంద్రముఖ్యులు = ధర్మజాదులు, ఆహరిన్=కృష్ణుని

నారాయణ! నారాయణ!

తాత్పార్యము : అప్పుడు ధర్మజాదులు ఆ కృష్ణుని అనఘా! నీ గొప్పదనమునేమని పొగడవచ్చును. నారాయణ! అట్టి మహాస్త్రవైభవమును ఈ విధముగా విఫలము చేసి శత్రువుల మదమణచితివి అని స్తుతించిరి.

చ. అలఘువిపన్మహార్ణవము నట్లు తరించి పునర్మహోద్ధతిన్
వెలిగెడువారిఁ దద్రజని వేగ భయంకరలీలఁ దాఁకి పెం

పలరఁగఁబోరె వైరిచయ మర్క జుఁడందు వహించె మిక్కిలిన్
బలిమిఁ బ్రకంపితస్వపృతనాపరిపాలన కార్యభారమున్. 214

రామా :అలఘు=గొప్పదైన, విపత్+మహా+అర్ణవము=ఆపదయనెడి గొప్ప సముద్రమును, అట్లుతరించి=ఆ విధముగా దాటి, పునఃమహా+ఉద్ధతిన్=తిరిగి గొప్ప పరాక్రమముతో, వెలిగెడువారిన్=ప్రకాశించువారిని, తత్+రజని=ఆ రాత్రి యందు, వేగన్=వేగముగా, భయంకర లీలన్+తాకి=భయంకరమైన రీతిలో ఎదుర్కొని, పెంపు+అలరగన్=ఆధిక్యముతో, వైరిచయము=శత్రుసేనలు, పోరె=పోరాడెను, అర్కజుడు=సుగ్రీవుడు, మిక్కిలిన్=అధికముగా, అందు, బలిమిన్=పరాక్రమముతో, ప్రకంపిత=తిరుగు, స్వపృతనా=తన సేనలను, పరిపాలనాకార్యభారమున్=పరిపాలించు కార్య భారమును, వహించె=పూనెను.

తాత్పర్యము : గొప్పదైన ఆపదయనెడి మహా సముద్రమును ఆ విధముగా తరించి, తిరిగి గొప్ప పరాక్రమముతో వెలిగెడివారిని ఆ రాత్రి యందు వేగభయంకరమైన రీతిలో ఎదుర్కొని, ఆధిక్యముతో శత్రుసేనలు పోరాడెను. అందులో సుగ్రీవుడు ప్రధానముగా పరాక్రమముతో తిరుగు తన సేనలను పరిపాలించు కార్యభారమును పూనెను.

భారత : తత్+రజని=ఆ రాత్రి, వేగన్=తెల్లవారగా, అందు=ఆ యుద్ధమున, అర్కజుడు=కర్ణుడు

తాత్పర్యము : గొప్ప ఆపదయను మహా సముద్రమును ఆ విధముగా తరించి తిరిగి గొప్ప ఉద్ధతితో ప్రకాశించువారిని ఆ రాత్రి తెల్లవారగా భయంకరమైన రీతిలో ఎదిరించి శత్రుసేనలు ఆధిక్యముతో పోరు సల్పెను. ఆ యుద్ధమున కర్ణుడు మిక్కిలి బలసంపదతో తన సేనా పరిపాలనా కార్యభారముతో నిర్వహించెను.

మ. రవిపుత్త్రుం డని కిట్లు పూని ప్రతిగర్జద్వైరిసంహారక్షు
ప్తివి రాజచ్ఛరభీష్మకుంభజయశోభివ్యాప్తి మీఱెన్ మను

ష్యవిభుం డుబ్బఁగ నంత నాప్రబలదోషాచారితోఁబుట్టుగున్
భువిఁగూల్చెన్బవనాత్మజుండుబలిమిన్ దుశ్శాసనాభిఖ్యునిన్ 215

రామా : రవిపుత్రుండు=సుగ్రీవుడు, అనికి=యుద్ధమునకు, ఇట్లు పూని=ఇట్లు సిద్ధపడి, ప్రతిగర్జత్=ప్రతిధ్వనించుచున్న, వైర్గి సంహారక్లుప్తి=శత్రు సంహారముచే, విరాజిత్=ప్రకాశింపుచున్న, శర=బాణముల యొక్క, భీమ=భయంకరమైన, కుంభ=కుంభుడనెడి కుంభకర్ణుని కుమారుని యొక్క, జయ=జయముచే, శోభి=ఒప్పుచు, వ్యాప్తిన్=వ్యాపారముచే, మనుష్యవిభుండు=రాముడు, ఉబ్బగన్=సంతోషింపగా, మీఱెన్=అతిశయించెను, అంతన్=అంతట, ఆప్రబలదోషాచారి=ఆబలవంతుడైన రాక్షసునియొక్క, తోఁబుట్టుగున్=తమ్ముడైన నికుంభుని, బలిమిన్=బలవంతముగా, దుశ్శాసన=అణపరాని, అభిఖ్యునిన్= కాంతిగలవానిని,, పవనాత్మజుండు= హనుమంతుడు, భువిన్+కూల్చెన్=నేలపై పడవేసెను.

తాత్పర్యము : ఈ విధముగా సుగ్రీవుడు యుద్ధ సన్నద్ధుడై శత్రు సంహారముచే ప్రతిధ్వనించు ప్రకాశముచే భయంకరమైన కుంభుని జయించుటచే నొప్పు వ్యాపారముచే రాముడు సంతోషింపగా అతిశయించెను. ఆప్రబలుడైన రాక్షసుని తమ్ముడగు నికుంభుని, అణపరానికాంతి గలవానిని హనుమంతుడు నేలకూల్చెను.

వ. అంత 216

సీ. ఆహవమహిమకరాక్షయాతులసత్ప్ర
తాప మత్యంతమ్ము దనరఁ గనలి
సూర్యసంతతినరవర్యుండు సాహసో
ద్ధత్యశౌర్యాదిదుర్దాంతవృత్తిఁ
బ్రబలువానిని ధర్మ రాజువీడు సొరంగఁ
దటిమె బాణముల నెంతయుఁ గలంచి
తద్భ్రాతృభంగ మంతయు నప్పు డరసి వా
సవినిర్గతుం డయి సరభసమున

ఆ. స్వఃశ్రితనికురుంబవనశిఖి మేఘనా
దాభిధానుఁ డాబలాఢ్యుమీఁద
నడచి దుర మొనర్చె నభముననుండి ని
ర్జరులు బెగడ నిగుడు సాయకముల. 217

రామా:ఆహవమహిన్=యుద్ధ భూమిలో, మకరాక్షయాతు=మకరాక్షుడను ఖరాసురుని కుమారుని, లసత్+ప్రతాపము=ప్రకాశించు పరాక్రమము, అత్యంతమ్ము+తనరన్=మిక్కిలి ప్రకాశింపగా, కనలి=కోపించి, సూర్యసంతతి నరవర్యుండు=సూర్య సంతతికి చెందిన రాముడు, సాహస+ఔద్ధత్య=సాహసము యొక్క గొప్పదనమును, శౌర్యాది=పరాక్రమాదులచే, దుర్దాంతవృత్తిన్=అణచు రీతిలో, ప్రబలువానిన్=అతిశయించువానిని, ధర్మరాజు వీడు=యమలోకమునకు, చౌరంగన్ తరిమె=చంపెను, బాణములన్=బాణములచే, ఎంతయున్ కలంచి=మిక్కిలి నొప్పించి, తత్+భ్రాతృభంగము=వారి సోదరుల నాశనము, అంతయు, అప్పుడు, అఱసి=చూచి, వాస=ఇంటినుండి, వినిర్గతుండై=బయలు వెడలి, సరభసము=వేగముగా, స్వఃశ్రిత=దేవతలనెడి, నికురంబవన=సమూహమనెడి వనమునకు, శిఖి=అగ్నివంటి వాడు, మేఘనాద+అభిధానుడు=ఇంద్రజిత్తు, ఆబలాఢ్య మీదన్=సేనతో కూడిన రాముని మీద, నడచి, నభముననుండి=ఆకాశములో నిలిచి, నిగుడు సాయకముల=వదలిన బాణములచే, నిర్జరులు=దేవతలు, బెగడన్=భయపడగా, దురమొనర్చె=యుద్ధము చేసెను.

తాత్పర్యము : యుద్ధభూమియందు మకరాక్షుడను రాక్షసుని అధిక ప్రతాపము మిక్కిలి విస్తరింపగా కోపించి, రాముడు సాహసోన్నతితో పరాక్రమమును అణచు రీతిలో ప్రబలిన వానిని యమలోకమునకు బాణములతో కలతపెట్టి తరిమెను. తన సోదరుల నాశనము నంతయు చూచి గృహమునుండి బయలువెడలి దేవతా సమూహమనెడు వనమునకు అగ్నివంటి వాడైన ఇంద్రజిత్తు ఆ రాముని ఎదిరించి దేవతలు భయపడునట్లుగా వదలిన బాణములతో యుద్ధము చేసెను.

భారత : ఆహవ=యుద్ధముయొక్క, మహిమకర=ప్రభావితము చేయు, అక్షయ=నాశనములేని, అతుల=సాటిలేని, సూర్యసంతతి నరవర్యుండు=కర్ణుడు, ధర్మరాజున్=ధర్మనందనుని, వీడు చొరంగ తరిమెన్=ఇంటికి వెళ్లునట్లు తరిమెను, వాసవి=అర్జునుడు, నిర్గతుండై=బయటకు వచ్చి, స్వాశ్రిత=నిజాశ్రితులనెడు, నికురంబ=సముదాయమునకు, వనశిఖి=అడవి నెమళ్లకు, మేఘనాద=మేఘ నాదమువంటి, అభిధాన=పేరుగలవాడు (అర్జునుడు) మిగతా సమానము.

తాత్పర్యము : యుద్ధము యొక్క ప్రభావముచే అక్షయమును, సాటిలేనిదియు అయిన మిక్కిలి ప్రతాపము అధికముగా తనరగా కోపించి, కర్ణుడు సాహసోన్నతి చేతను, పరాక్రమాదుల చేతను, అణచు రీతిలో ప్రబలెడి ధర్మరాజును ఇల్లు చొచ్చునట్లు బాణములతో మిక్కిలి కలతపెట్టి తరిమెను. తన సోదరుల భంగపాటును అప్పుడు చూచి అర్జునుడు నిజాశ్రితులనెడు సముదాయమునకు అడవి నెమళ్లకు మేఘనాదము వంటి పేరుగల బలాఢ్యుడైన అర్జునుని ఎదిరించి బాణములు విడిచి ఆకాశమునందుండి దేవతలు భయపడునట్లు యుద్ధమొనర్చెను.

విశేషణము : శిఖా–'శిఖావళశ్శిఖీ కేకి' అని అమరము.

వ. ఇట్లు పోరిపోరి. 218

తాత్పర్యము : ఇట్లు తీవ్ర యుద్ధము చేసి.

ఉత్సాహ : వెరవు నీపుఁ జూపెడుప్రతివీరువిక్రమక్రియా
గరిమమును సహింపలేక కలను దొఱఁగిపోయి తాఁ
దిరిగి వచ్చె నీతఁ డింకఁ దెగువ మిగుల నెరప కె
ట్లరుగు ననుచు నహితబలము లలఁగి కలఁగఁ జెలఁగుచున్

రామా : ఇతడు=ఇంద్రజిత్తు, వెరవున్=భయమును, ఏపున్+చూపెడు= ఆధిక్యమును చూపెడు, ప్రతివీరు=శత్రువుయొక్క, విక్రమక్రియాగరిమ=పరాక్రమాతి శయమును, మును=ఇంతకుముందు, సహింపలేక=ఓర్వలేక, కలను=యుద్ధభూమిని,

దొలగిపోయి=వదలివెళ్లి, తాన్=తాను, తిరిగివచ్చె, ఇతడు+ఇంక=ఇతడిక, తెగువమిగుల=ధైర్యము అతిశయించునట్లు, నెఱపక=ప్రవర్తింపక, ఎట్లరుగు=ఏ విధముగా వెళ్లును, అనుచు, అహిత బలములు=శత్రుసేనలు, అలగికలగన్=కోపించి కలతపడగా, చెలగుచున్=ప్రవర్తించుచు.

తాత్పర్యము : భయమును అధిక్యమును చూపెడు శత్రువు యొక్క విక్రమాధిక్యతను సహింపలేక యుద్ధభూమిని వదలి వెళ్లి తాను తిరిగి వచ్చెను. అట్టి ఇతడు ఇంక తెగింపక ఏ విధముగా వెళ్లును అని శత్రుసేనలు కోపించి కలత చెంది ప్రవర్తించగా–

భారతము : సమానము

మ. బలదీప్తాశుగసంతతిప్రబలితస్ఫారప్రతాపోదయో
జ్జ్వలసంయద్రభసంబురుద్రుమఖసంచారక్రియన్ మీఱఁగా
నలఁగించెం బ్రతివీరునట్టియెడ నానాకీశసంతాన మ
య్యలఘుస్థేముఁడు దత్ప్రతాపశిఖి మాయంజేసి యార్చెందగన్

రామా : బలదీప్త=బలముచే ప్రకాశించు, ఆశుగసంతతి=హనుమంతునిచే, ప్రబలిత=ప్రబలముగా చేయబడిన, స్ఫార ప్రతాపోదయ+ఉజ్వల=మిక్కిలి ప్రతాపోదయముచే ప్రకాశించు, సంయత్=యుద్ధము యొక్క, రభసంబు=వేగము, ఉరు=అధికమైన, ద్రుమ=వృక్షములయొక్క, ఖసంచార క్రియన్=ఆకసమున విసరివేయుటచే, వీలుగా=మిక్కిలి ఒప్పుగా, ప్రతివీరున్=శత్రువును, అట్టి ఎడన్=ఆసమయమున, నానా=అనేకములైన, కీశసంతానము=వానర సమూహము, అలగించెన్=కలత పెట్టెను, ఆ+అలఘుస్థేముడు=మిక్కిలి పరాక్రమవంతుడైన ఆ ఇంద్రజిత్తు, మాయన్ చేసి=మాయతో, తత్ ప్రతాప శిఖిన్=ఆ ప్రతాపాగ్నిని, తగన్=తగిన రీతిలో, ఆర్చెన్=చల్లార్చెను.

తాత్పర్యము : బలముతో దీపించు హనుమంతునిచే ప్రబలముగా చేయబడిన మిక్కిలి ప్రతాపోదయముచే ఉజ్జ్వలమైన యుద్ధవేగమున అధికమైన వృక్షములను

ఆకసమునుండి విసరి వేయుచు అతిశయించి నానావానర సమూహము ఇంద్రజిత్తును నొప్పించెను. అధిక ధైర్యముగల ఆ ఇంద్రజిత్తు కూడా మాయతో ఆ ప్రతాపాగ్నిని చల్లార్చెను.

భారత : అశుగ సంతతి=బాణజాలముచే, సమ్యత్=యుద్ధమందుగల, రభసంబు=ఆటోపము, రుద్ర=శివుని యొక్క మఖసంచార క్రియన్=దక్షాధ్వరనాశన విధానము, ఆనాకీశ సంతానము=అర్జునుడు, ప్రతివీరుని=కర్ణుని, అయ్యలఘు స్థేముడున్=కర్ణుడును, తత్=ఆ అర్జునుని యొక్క, మిగతా సమానము.

తాత్పర్యము : బలముచే ప్రకాశించు బాణజాలముచే ప్రబలిన ప్రకాశించు ప్రతాపోదయముచే ఉజ్వలమైన యుద్ధము నందలి ఆటోపమును శివుడు దక్షాధ్వర ధ్వంసము చేసిన రీతిని మించగా అర్జునుడు కర్ణుని నొప్పించెను. కర్ణుడును మాయతో అర్జునుని ప్రతాపాగ్నిని చల్లార్చెను.

వ. అంత. 221

క. మాననిధి జిష్ణుఁడు సుమి
త్రానందనుఁ డన్నపను పుదంచితవృత్తిన్
మానసధృతిఁ బెనుపఁగ నరి
పైనడరి శరోగ్రవృష్టిఁ బరఁగించె వడిన్. 222

రామా : మాననిధి=అభిమానధనుడైన, జిష్ణుడు=జయశీలుడు అయిన, సుమిత్రా నందనుడు=లక్ష్మణుడు, ఉదంచితవృత్తిన్=తగిన రీతిలో, అన్నపనుపు=రాముని ఆజ్ఞ, మానసధృతిన్=మనస్సులో ధైర్యమును, పెనుపగా=పెంచగా, వడిన్=వేగముగా, అరిపైన అడరి=శత్రువు నెదిరించి, శర+ఉగ్రవృష్టిన్=తీవ్రమైన బాణవర్షమును, పరగించెన్=విసరెను.

తాత్పర్యము : మానధనుడు, జయశీలుడైన లక్ష్మణుడు రాముని ఆజ్ఞ తగిన రీతిలో మనసునకు ధైర్యము పెంచగా శత్రువు నధిగమించి వేగముగా తీవ్రమైన

బాణవర్షమును కురిపెంచెను.

భారత : సుమిత్ర=బంధువులకు, ఆనందనుడు=సంతోషమును కలిగించువాడు అయిన, మాననిధిజిష్ణుడు=మాననిధి అయిన అర్జునుడు, మిగతా సమానము ధృతిన్=సంతోషముతో.

తాత్పర్యము : మానదనుడు బందువులను సంతోషపెట్టెడివాడు అయిన అర్జునుడు ధర్మజుని ఆదేశముతో తగిన రీతిలో మనసులో సంతోషమును పెంచగా శత్రువుపై విజృంభించి వేగముగా తీవ్ర బాణవర్షమును కురిపించెను.

కం. శర వర్ష మిట్లు గురియుచుఁ
బరఁగుమహాబలజయానుభావస్థైర్య
స్ఫురణాఢ్యు నతని నతఁడున్
సరభసనారాచవృష్టి సంవృతుఁ జేసెన్. 223

రామా : శరవర్ష=బాణవర్షమును, ఇట్లు కురియుచున్+పరగు=ఈ విధముగా కురిపించుచు తిరుగు, మహాబలజ=హనుమంతుడు, యానున్=వాహనముగా గలవానిని, భావస్థైర్య స్ఫురణాఢ్యున్=స్థిరమైన భావముల స్ఫూర్తి కలవానిని, అతనిన్=లక్ష్మణుని, అతడున్=ఇంద్రజిత్తు కూడా, సరభస=వేగముగా వచ్చిన, నారాచవృష్టి=బాణ వర్షముచే, సంవృతున్+చేసెన్=ఆవరింపబడినవానినిగా చేసెను.

తాత్పర్యము : ఈ విధముగా బాణవర్షమును కురిపించుచు తిరుగు హనుమంతుడు వాహనముగా గల స్థిరభావ స్ఫూర్తి కలిగిన లక్ష్మణుని ఇంద్రజిత్తు తీవ్ర బాణవృష్టిచే ఆవరింపబడిన వానినిగా చేసెను.

భారత : మహత్=అధికమైన, బలజయ=బలము, జయముల యొక్క, అనుభావస్థైర్యస్ఫురణాఢ్యున్=అను భావస్థిరత్వ స్ఫూర్తితో కూడిన, అతనిన్=అర్జునుని, అతడున్=కర్ణుడును, మిగతా సమానము.

తాత్పర్యము : ఈ విధముగా ఆ శరవర్షము కురిపించుచు తిరుగు అధిక బలజయముల యొక్క భావస్థిరత అనెడి స్ఫూర్తితో కూడిన అర్జునుని కర్ణుడును తీవ్ర

బాణవర్షముచే ఆవరింపబడునట్లు చేసెను.

వ. ఇట్లు దలపడి. 224

తాత్పర్యము : ఇట్లు పోరాడి.

ఆ. సరిగఁ బోరి రక్కజపుజోదు లిరువురుఁ
గరియుఁ గరియుఁ బోలెఁ గడిఁదిలావు
గిరియు గిరియుఁ బోలె గెంటనితాల్మియు
హరియు హరియుఁ బోలె నదటు వొదల. 225

రామా : భారత : సమానము.

అక్కజపుజోదులు=పరాక్రమవంతులైన యోధులు, ఇరువురు=ఇద్దరు, కరియున్+కరియున్+పోలె=ఏనుగు ఏనుగుతో ఢీకొన్నట్లు, కడిదిలావు=మిక్కిలి బలము కలిగి, గిరియుగిరియు బోలె=కొండకొండతో ఢీకొనినట్లు, గెంటని తాల్మియు=నశించని ధైర్యముతో, హరియుహరియు బోలె=సింహముసింహముతో వలె, అదటుపొదల=గర్వము అతిశయింపగా, సరిగన్ పోరిరి=సమానముగా యుద్ధము చేసిరి

తాత్పర్యము : ఆ పరాక్రమ వంతులైన యోధులిద్దరూ మిక్కిలి బలముచే ఏనుగును ఏనుగును ఢీకొన్నట్లు, పర్వతమును, పర్వతము ఢీకొన్నట్లు సింహము సింహము నెదిరించనట్లు ధైర్యము మీరగా సమానముగా పోరాడిరి.

ఇంద్రజిత్తు / లక్ష్మణుడు - కర్ణార్జునులు పోరిరి.

సీ. ఒండొరులసరోషహుంకృతిఁ గెరలుచుఁ
గెరలితూపులవాన గురిసి కురిసి
శరవృష్టిఁ బ్రత్యస్త్రసమితిచే నఱకుచు
నఱికి పై నమ్ములు వఱపి పఱపి

సాధనవికలత సాధించి మించుచు
మించి నెమ్మేనులు నొంచి నొంచి
దివ్యాస్త్రములు సాలఁ దెగువమై నేయుచు
నేసి నిష్ఫల మైన రేసి రేసి

తే. లలి నొకరొకళ్లకడఁకల లక్ష్మణేంద్ర
జిత్తులాభీలశౌర్యులై చిత్రరణము
సలిపి రొకకొంతతడవు వాసవవిరోచ
నాత్మజులసామ్యవిస్ఫూర్తి యావహిల్ల 226

రామా : ఒండొరుల=పరస్పరము, సరోషహుంకృతిన్+కెఱలుచు=రోషముతో కూడిన హుంకారముతో చెలరేగి, కెరలి=చెలరేగి, తూపులవాన=బాణవర్షము, కురిసికురిసి=కురిపించి, శరవృష్టిన్=బాణవర్షముచే, ప్రతి+అస్త్రసమితిచే=దీటైన అస్త్రసముదాయముచే, నఱకుచు=ఖండించుచు, నఱికి=ఖండించి, పైన్=పై భాగమున, అమ్ములు=బాణములు, పరపిపరపి=వదలి, సాధన వికలతన్=సైన్యమును చికాకు పరచుటను, సాధించి=సాధ్యము చేసి, మించుచు=అతిక్రమించుచు, మించి=అతిక్రమించి, నెఱ+మేనులు=అందమైన శరీరములు, నొంచినొంచి=బాధించి, దివ్యాస్త్రములు=దివ్యములైన అస్త్రములను చాలన్=అధికముగా, తెగువమై=ధైర్యముతో, ఏయుచు=వేయుచు, ఏసి=వేసి, నిష్ఫలమైన=వమ్ముకాగా, రేసిరేసి=చెలరేగి, లలిన్=నేర్పుగా, ఒకరు+ఒకళ్ల=పరస్పరము, కడకలన్=ప్రయత్న పూర్వకముగా, లక్ష్మణ=లక్ష్మణుడును, ఇంద్రజిత్తులు=ఇంద్రజిత్తును, ఆభీరశౌర్యులై=మిక్కిలి పరాక్రమవంతులై, ఒక కొంత తడవు=కొంతసేపు, వాసవ=ఇంద్రునియొక్క, విరోచనాత్మజ=బలియొక్క, సామ్య విస్ఫూర్తి=పోలికయను స్ఫూర్తి, ఆవహిల్ల= ఆవహింపగా, చిత్రరణము సలిపిరి=విచిత్రమైన యుద్ధము చేసిరి.

భారత : లక్ష్మణ=లక్ష్మణుని యొక్కయు, ఇంత్రజిత్తుత్=ఇంద్రజిత్తు యొక్కయు, తుల=సమానత్వముచే, ఆభీర శౌర్యులై=భయంకర పరాక్రమముగలవారై, వాసవ

విరోచన=ఇంద్రసూర్యుల యొక్క, ఆత్మజులు=అర్జునుడు, కర్ణుడు

రెండింటికీ తాత్పర్యము : కర్ణార్జునులు పరస్పరము రోషహూంకారములతో ప్రవర్తిల్లుచు బాణవర్షము కురిపించి, ఆ బాణవర్షమును దీటైన అస్త్రములచే ఖండించుచు పైన బాణములు వదలి సేనా సముదాయమును వికలపరచి శరీరములను బాధించి వివిధ దివ్యాస్త్రములను తెగువతో వేసి, అవి నిష్ఫలముగా చేలరేగి పరస్పరము ప్రయత్నపూర్వకముగా లక్ష్మణుడు ఇంద్రజిత్తులతో సమానముగా కొంతసేపు అర్జునకర్ణులు విచిత్ర రణమును భయంకర పరాక్రమముతో సలిపిరి.

వ. అంత. 227

ఆ. చతురశల్యరచితసారథ్య యోగాధి
గతమదాతిశయు నఖండధైర్యుఁ
బ్రతిభటుని వధించెఁ బ్రథితాజివిజయుండు
రాముతమ్ముఁడు సురరాజు మెచ్చ. 228

రామా : చతుర=చాకచక్యము గల, శల్య=బాణములచే, రచితసారథ్య=చేయబడిన సారథియొక్క, అయోగ=వియోగముచేనైన, అధిగత=పోయిన మనోవ్యథచే, మదాతిశయున్=మిక్కిలి మదించిన, అఖండమైన=మిక్కిలి ధైర్యముగలవారిని, ప్రతిభటునిన్=ఇంద్రజిత్తును, ప్రథిత+ఆజివిజయుండు=ప్రసిద్ధికెక్కిన యుద్ధ విజయముకలవాడు, రాముతమ్ముడు=లక్ష్మణుడు, సురరాజు మెచ్చన్=ఇంద్రుడు మెచ్చునట్లుగ, వధించె=ఇంద్రజిత్తును వధించెను.

తాత్పర్యము : చతురమైన బాణప్రయోగముచే సారథిని వియోగము చేసి పోయిన మనోవ్యథచే మదాతిశయము కలిగిన అఖండ ధైర్యవంతుడునైన ఇంద్రజిత్తును యుద్ధవిజయమునందు ప్రసిద్ధికెక్కిన లక్ష్మణుడు ఇంద్రుడు మెచ్చుగా వధించెను.

భారత : చతుర=చాకచక్యము గల, శల్యరచిత సారథ్యయోగ=శల్యుని సారథ్య యోగము కలుగుట వలన, అధిగత=పొందబడిన, ప్రతిభటునిన్=కర్ణుని, విజ

యుండు=అర్జునుడు, రాముతమ్ముడు=కృష్ణుడు, వధించె=వధించెను.

తాత్పర్యము : చతురుడైన శల్యుని సారథ్యము వలన పొందిన మదాతిశయము గలిగి అతి ధైర్యవంతుడైన కర్ణుని యుద్ధమునందు ప్రసిద్ధికెక్కిన అర్జునుడు కృష్ణుడు, ఇంద్రుడు మెచ్చగా వధించెను.

సీ. అతిదుర్జయుం డైన ప్రతివీరు నిట్లు రూ
పణఁచి యబ్బలుమగం డన్న కడకుఁ
జని మ్రొక్క నన్న రేశ్వరుఁ డెత్తి కౌగిఁటఁ
జేర్చి యానందవిజృంభణమునఁ
బరఁగె నామఱునాఁడు ప్రౌఢిమద్రవిభుండు
ప్రదళితబహువైరి పం క్తిగళుఁడు
సేనాని యైనను శివుఁ డైనఁ గేశవుఁ
డైన నెదిర్చి నా యస్త్రములకుఁ

తే. బ్రాణములు వెచ్చ పెట్టక బ్రతికి పోవ
లేఁ డకట నాకు నరుఁ డేమిలెక్క యనుచుఁ
దనకురుబలౌఘరక్షావిధానమహిమ
గడఁకఁ బెనుపంగ నతనిపై నడచి పోరె 229

రామా : అతిదుర్జయుండైన=జయించుటకు మిక్కిలి శక్యముకాని, ప్రతి వీరున్=ఇంద్రజిత్తును, ఇట్లు రూపణచి=ఈ విధముగా రూపుమాపి, ఆ+బలుమగండు =లక్ష్మణుడు, అన్నకడకున్+చని=రాముని వద్దకు వెళ్లి మ్రొక్కన్=నమస్కరింపగా, ఆ+నరేశ్వరుడు=రాముడు, ఎత్తికౌగిటన్ చేర్చి= ఎత్తికౌగిలించుకొని, ఆనంద విజృంభణమునన్+పరగె=సంతోషాతిశయముతో ప్రవర్తిల్లెను, ఆ మరునాడు= రెండవరోజు, ప్రౌఢిమత్=ప్రకాశము గల, రవి=సూర్యుని, భ=కాంతివంటి కాంతి గలవాడు, ప్రదళిత=నశించిన, బహువైరి=పెక్కంద్రు శత్రువులు గల, పంక్తిగళుడు= రావణుడు, సేనానియైనను=కుమారస్వామియైనను, శివుడైనను, కేశవుడైనను, నా

అస్త్రములకు, ఎదిర్చి, ప్రాణములు, వెచ్చపెట్టక=వ్యయింపక, బ్రతికి పోవలేదకట, నాకు, నరుడు=మానవుడు, ఏమిలెక్క యనుచు, తనకు, ఉరుబల+ఓఘ=అధిక సేనా సమూహము యొక్క, రక్షా విధాన మహిమ, రక్షించు మహత్వ రీతిలో, కడకన్=రోషమును, పెనుపంగ=పెంచగ, అతనిపైయిన్, రామునిపై, నడచిపోరె=ఎదిరించి పోరాడెను.

తాత్పర్యము : జయించుటకు మిక్కిలి శక్యముకాని ఇంద్రజిత్తును ఈ విధముగా రూపుమాపి లక్ష్మణుడు రామునివద్దకు వెళ్లి నమస్కరింపగా రాముడు అతనిని ఎత్తి కౌగిలించుకొని ఆనందాతిశయముతో ప్రవర్తిల్లెను. ఆ మరునాడు ప్రకాశముతో సూర్యుని కాంతివంటి కాంతిగల శత్రుసేనలను సంహరించు రావణుడు ఇట్లనెను! 'కుమారస్వామి యైనను, శివకేశవులైనను నన్ను ఎదిరించి, నా అస్త్రములకు ప్రాణములొడ్డి బ్రతికి పోలేరు. నాకు సామాన్య మానవుడేమి లెక్క?' అనుచు తన అధిక సేనా సమూహమును రక్షించు రీతిని రోషమును పెంచి రామునిపై నెదిరించి పోరాడెను.

భారత : ప్రతివీరుడు=కర్ణుడు, అబ్బులుమగండు=అర్జునుడు, అన్నకడకు=ధర్మజుని వద్దకు, ప్రౌఢిన్=పరాక్రమముతో, మద్రవిభుండు=శల్యుడు, ప్రదళిత=నశించిన, బహువైరి పంక్తి=పెక్కండ్రుశత్రుసముదాయముయొక్క, గళుడు=గొంతులు కలవాడు, సేనానియై=సేనాధిపతియై, నరుడు=అర్జునుడు, కురుబలౌఘ=కౌరవ సేనా సముదాయముయొక్క, అతనిపై=ధర్మజునిపై–మిగతా సమానము.

తాత్పర్యము : జయించుటకు మిక్కిలి శక్యముకాని కర్ణుని ఈ విధముగా నేలగూల్చి అర్జునుడు ధర్మజుని వద్దకు వెళ్ళి నమస్కరింపగా, అతడు అర్జునుని ఎత్తి కౌగిట చేర్చుకొని ఆనందాతిశయముతో నుండెను. ఆ మరునాడు అనేకమంది శత్రువుల పంక్తుల గళములను సంహరింపగల పరాక్రమవంతుడైన శల్యుడు సేనాధిపతియై ఇట్లు పలికెను : "నన్ను శివుడైనను కేశవుడైనను ఎదిరించి నా అస్త్రములకు ప్రాణములు వదలక బ్రతికిపోలేడు. అకటా నాకు అర్జునుడేమి లెక్క యని" తన కౌరవసేనా సమూహ రక్షావిధానముతో రోషము పెంచగా ధర్మజుని ఎదిరించి పోరాడెను.

వ. అప్పుడు 230

తే. ఆ నృపతి సైన్యమును గదనాతిలోలు
భానుజులసద్భుజాశక్తి ప్రాపుగఁ గొని
యాఁగెఁ దచ్ఛల్య తేజంబు నతని నొంచె
నని విరూపాక్షుఁ డనఁ బర్వు నతఁడు మెఱసి. 231

రామా : ఆ నృపతి=రాముడు, సైన్యము=సేనలను, కదన+అతిలోలున్=యుద్ధమునందు మిక్కిలి ఆసక్తిగల, భానుజున్=సుగ్రీవుని యొక్క, లసత్ భుజాశక్తి=మిక్కిలి బాహు పరాక్రమమును, ప్రాపుగన్ కొని=అండగా తీసుకొని, తత్=రావణుని యొక్క, శల్య=బాణముల యొక్క తేజంబు+ఆగెన్=తేజస్సును ఆపెను, అతనిన్=సుగ్రీవుని, విరూపాక్షుడనన్=విరూపాక్షుడను పేరుతో, పర్వునతడు=ప్రసిద్ధికెక్కిన ఆ రాక్షసుడు, అనిన్=యుద్ధమునందు, మెఱసినొంచె=ప్రకాశించి బాధించెను.

తాత్పర్యము : రాముడు తన సైన్యమును యుద్ధప్రీతిగల సుగ్రీవుని మిక్కిలి భుజాశక్తి అండగా గొని ఆ రావణుని బాణముల తేజస్సును ఆపెను. సుగ్రీవుని విరూపాక్షుడను రాక్షసుడు విజృంభించి బాధించెను.

భారత : ఆ నృపతి=ధర్మరాజు, కదన=యుద్ధమందు, అతిలోలుభ=అతి ప్రియులైన, అనుజుల=తమ్ముల యొక్క, తత్+శల్య=ఆ శల్యునియొక్క, విరూపాక్షుడనన్=రుద్రుడనగా, పర్వు=ఒప్పెడి, అతడు=శల్యుడు, అతనిన్=ధర్మరాజును.

తాత్పర్యము : ధర్మరాజు తన సైన్యమును యుద్ధమునందు అతి ప్రియులైన తమ్ముల బాహు పరాక్రమ శక్తి అండగా గొని ఆ శల్యుని తేజస్సును నిలువరించెను. యుద్ధమునందు రుద్రునివలె ప్రకాశించు శల్యుడు ధర్మరాజును నొప్పించెను.

వ. ఇట్లు నొప్పించిన నిప్పులు గురియు కోపంబునఁ జూపు దీపింప
నాసమరశూరు నాలోకించి. 232

తాత్పర్యము : ఈ విధముగా బాధించి నిప్పులు గురియు కోపముతో తీక్షణమైన చూపులతో ఆ వీరుని చూచి -

ఆ. ఇతఁడు మామకాజి చతురతఁ దెగకపోఁ
డింక ననుచు నాప్తు లెల్లఁ జెలఁగ
మివులఁ గినుకఁ గెరలు రవిసూనునందను
భావ మపుడు వింత యై వెలింగె. 233

రామా : ఇతడు=విరూపాక్షుడు, మామక=నా సంబంధమైన, ఆజి చతురతన్=యుద్ధ నైపుణ్యముచే, ఇంక, తెగకపోడు=మరణించకపోడు, అనుచు, ఆప్తులెల్లన్ చెలగన్=సన్నిహితులందరు విజృంభింపగా, మిగులన్+కినుకన్+కెరలు= మిక్కిలి కోపముతో అతిశయించు, రవిసూనునందు=సుగ్రీవుని యందు, అపుడు, అనుభావము=ప్రభావము, వింతయై వెలింగె=వింతగా ప్రకాశించెను.

తాత్పర్యము : విరూపాక్షుడు నా సంబంధమైన యుద్ధచాతుర్యముచే ఇంక నశించగలడు అనుచు మిత్రులందరు విజృంభింపగా మిక్కిలి కోపముతో ప్రబలిన సుగ్రీవుని ప్రభావము అప్పుడు వింతగా ప్రకాశించెను.

భారత : ఇతడు=ధర్మరాజు, మామకున్=శల్యుని పట్లను, తెగకపోడు= ఆగ్రహింపక మానడు, రవిసూనునందను=ధర్మజుని యొక్క, భావము=ఆలోచన.

తాత్పర్యము : ధర్మరాజు శల్యుని యుద్ధచాతుర్యమును చూచి ఆగ్రహింపక మానడని సన్నిహితులందరు ప్రవర్తిల్లగా మిక్కిలి కోపముతో విజృంభించిన ధర్మజుని భావము అప్పుడు వింతగా కనిపించెను

వ. అవ్వీరశార్దూలంబు పెద్దయుంబ్రొద్దు దద్దయు నుద్దీప్తశౌర్యుండై. 234

తాత్పర్యము : ఆ వీరశ్రేష్ఠుడు ఎక్కువసేపు మిక్కిలి పరాక్రమోన్నతుడై.

కం. అని సేసి చేసి యంతట
మనమునఁ గడుఁ గెరలి యుద్ధ మహిమాతులునిన్
ఘనుఁ బ్రతివీరు విరూపా
క్షుని శక్తి ప్రౌఢిచేతఁ గూల్చి చెలంగెన్. 235

రామా : అనిసేసి చేసి=యుద్ధమును నిర్వహించి, అంతట=తరువాత, మనమునన్=మనస్సునందు, కడున్+కెరలి=మిక్కిలి కోపించి, యుద్ధమహిమన్=యుద్ధమహిమచే, అతులునిన్=సాటిలేనివానిని, ఘనున్=గొప్పవాడైన, ప్రతివీరున్=శత్రువునైన, విరూపాక్షుని=రాక్షసుని, శక్తి=తన బలముయొక్క, ప్రౌఢిచేత=పరాక్రమముచే, కూల్చి=సంహరించి, చెలంగెన్=సంతోషముతోనుప్పొంగెను.

తాత్పర్యము : యుద్ధమును తీవ్రముగా చేసి అంతట మనస్సులో మిక్కిలి కోపించి యుద్ధమహిమయందు సాటిలేని ఘనుడైన శత్రువగు విరూపాక్షుని తన బల ప్రౌఢిమచే చంపి సంతోషముతో నుప్పొంగెను.

భారత : మాతులునిన్=మేనమామయైన శల్యుని, విరూపాక్షుని=రుద్రుడిచ్చిన, శక్తిమహిమచే మిగతా సమానము.

తాత్పర్యము : యుద్ధమును తీవ్రముగా చేసి అంతట మనస్సులో మిక్కిలి కోపించి యుద్ధమహిమయందు మేనమామయైన శల్యుని, ఘనుడైన శత్రువును రుద్రుడిచ్చిన శక్తి మహిమచే చంపి సంతోషముతో నుప్పొంగెను.

కం. పరదుస్సహ శల్య మహో
దరనాశన మాచరించి తమసైనికులన్
గర మలరించినశౌర్య
స్ఫురితు నతనిఁ బొగడి రుబ్బుచున్ హరిముఖ్యుల్. 236

రామా : పర=శత్రువులకు, దుస్సహ=సహింపరాని, శల్య=బాణములుగల, మహోదర=మహోదరుడనెడి రాక్షసుని యొక్క, నాశనమాచరించి=చంపి,

అలరించిన=సంతోషపెట్టిన, శౌర్యస్ఫురితున్=పరాక్రమముచే ప్రకాశించు, అతనిన్=సుగ్రీవుని, హరిముఖ్యుల్=వానరవీరులు, ఉబ్బుచున్=సంతోషముతో, పొగడిరి.

తాత్పర్యము : శత్రువులు సహింపరాని బాణములుగల మహోదరుడనెడి రాక్షసుని చంపి సంతోషపెట్టిన పరాక్రమముతో ప్రకాశించు సుగ్రీవుని వానర ముఖ్యులు సంతోషముతో పొగడిరి.

భారత : పరదుస్సహ=శత్రువులు సహింపరాని, శల్యమహః=శల్యుని పరాక్రమము వలననైన, దర=భయము యొక్క, నాశనమాచరించి=పోగొట్టి, తమ సైనికులన్=పాండవ సేనలను, అతనిన్=ధర్మరాజును, హరిముఖ్యులు=కృష్ణాదులు పొగడిరి.

తాత్పర్యము : శత్రువులు సహింపరాని శల్యుని పరాక్రమము వలన కలిగిన భయమును పోగొట్టి పాండవ సేనలను మిక్కిలి అలరించిన పరాక్రమవంతుడైన ధర్మరాజును కృష్ణాదులు సంతోషముతో పొగడిరి.

తే. అంతఁ దద్భ్రాతృపుత్త్ర బలాతిశయము
దను మహాపార్శ్వబలనాశమున నలచఁగ
నుడుకుచున్న దుర్యోధను నుగ్రమన్యు
దశముఖు నులూకశకునిపాతము గలంచె. 237

రామా : అంతన్=అంతట, తత్+భ్రాతృపుత్ర=సుగ్రీవుని సోదరుని కుమారుడైన అంగదుని యొక్క, బలాతిశయము=మిక్కిలి పరాక్రమము, మహాపార్శ్వ=మహా పార్శ్వుడనెడు రాక్షసుని యొక్క, బలనాశమునన్=బలమును కూల్చుటచే, తనున్=తనను, నలచగన్=బాధింపగా, ఉడుకుచున్న=కోపించుచున్న, దుర్యోధనున్=యుద్ధము చేయుటకు శక్యముగాని వానిని, దశముఖున్=రావణుని, ఉలూక=గుడ్లగూబలు అనెడి శకున పక్షులయొక్క, పాతము=పాటు, కలంచెను= కలవరపెట్టెను.

తాత్పర్యము : అంతట ఆ సుగ్రీవుని సోదరకుమారుడైన అంగదుని పరాక్రమముచే మహాపార్శ్వుడనెడి రాక్షసుని కూలవేయుట తనను కలతపెట్టగా యుద్ధమున భయంకరుడైన రావణునికి గుడ్లగూబలపాటు అపశకునమాయెను.

భారత : తత్=ఆ ధర్మరాజు యొక్క, భ్రాతృ=తమ్ములైన భీమాదుల యొక్క, పుత్ర=ప్రతివింధ్యాది ద్రౌపదీతనయుల యొక్కయు, బల=ధృష్టద్యుమ్నాదుల బలము యొక్క అతిశయము=గొప్పతనము, తను=తనను, మహత్=అధికమైన పార్శ్వ=సేనల యొక్క, నాశమునన్=నాశనముచే, ఉడుకుచున్న దుర్యోధనుని, ఉగ్ర=తీవ్రమైన, మన్యు=శోకరోషములయొక్క, దశ=అవస్థగల, ముఖున్=ముఖము గలవానిని, ఉలూక=ఉలూకుడనెడు వాని, శకుని=శకుని యొక్కయు, పాతము=మరణము, కలంచెన్=కలచి వేసెను.

తాత్పర్యము : అంతట ఆ ధర్మరాజు తమ్ములైన భీమాదుల యొక్కయు పుత్రులైన ప్రతివింధ్యాదులు (ద్రౌపదీ తనయులు), ధృష్టద్యుమ్నాది సేనల అతిశయము తన పరివారము యొక్క అధిక నాశనముచే, కోపించిన దుర్యోధనుని మనసు కలచగా తీవ్రమైన శోక రోషముల అవస్థగల ముఖముగల దుర్యోధనునకు ఉలూకుడు, శకునుల మరణము వ్యాకులపరచెను.

సీ. ఆ దుష్టవర్తనుఁ దప్పటితుదకు ని
జానుజపుత్త్ర మిత్రాదు లొకఁడు
మిడివోక కలనిలో మడియుట యూహించి
వగచుచు నప్పుడు వైరినృపతి
ననుజవిభీషణోదగ్ర విక్రమసహా
యతవిజృంభించుమహా ప్రతాపుఁ
దలపడఁ జాలని తాంతధైర్యంబుతో
నరిగి ద్వైపాయన హ్రదమతల్లి

తే. కాగతిని దన్నృపతిబల శ్రీ గలంగ
నరిగి మునిఁగెఁ దత్కాండచయంబులోన
మునిఁగి యాఁగెను దనమేను మోయకుండ
దానిదిరమైన వాస్తంభ ధర్మపటిమ. 238

రామా : ఆ దుష్టవర్తనుడు=రావణుడు, అప్పటి తుదకు=ఆ యుద్ధ సమాప్తికి, నిజ+అనుజ పుత్రమిత్రాదులు=తన తమ్ములు పుత్రులు మిత్రులు మొదలైనవారు, ఒకడున్, మిడివోక=మిగలక, కలనిలో=యుద్ధములో, మడియుట+ఊహించి= మరణించుటను భావించి, వగచుచు=బాధపడుచు, అప్పుడు, అనుజ=తమ్ముడైన లక్ష్మణుడు, విభీషణ=విభీషణునియొక్కయు, విక్రమసహాయతన్=పరాక్రమ సహాయముచే, విజృంభించు=చెలరేగిన, మహాప్రతాపున్=మిక్కిలి పరాక్రమముగల, వైరి నృపతిన్=రాముని, తలపడన్ చాల=ఎదుర్కొనుటకు తగిన, నితాంత=అధికమైన, ధైర్యంబుతో, అరిగి=వెళ్ళి, ద్వైప=ద్వీప సంబంధమైన, అయన=మార్గమందుగల, హ్రదమతల్లికా=మంచి మడుగు, గతిని=ప్రకారమున, తత్+నృపతి=ఆ రాముని, బలశ్రీ=సేనాసంపద, కలంగ=కలతపడగా, అరిగి=నడచి, తత్+కాండచయంబు లోన=బాణసముదాయములో, మునిగె=మునిగెను, దానితిరమైన=ఆ బాణ సమూహమునకు స్థిరమైన, నవ=నూతనము, ఆస్తంభ=జాడ్యములేక ప్రకాశించు, ధర్మ=వింటి యొక్క పటిమన్=ప్రౌఢిమచే, ఆగెను=అస్త్రములకు ప్రత్యస్త్రముల వేసెను.

తాత్పర్యము : రావణుడు యుద్ధసమాప్తి సమయమునకు సోదరులు, పుత్రమిత్రాదులలో ఒక్కడు కూడ మిగలక యుద్ధములో మరణించుటను భావించి బాధపడెను. లక్ష్మణ విభీషణుల తీవ్ర పరాక్రమ సహాయముచే విజృంభించు మిక్కిలి ప్రతాపవంతుడైన రాముని ఎదిరింపజాలని అధిక ధైర్యముతో ద్వీపసంబంధమైన మార్గమునందలి మంచి మడుగువలె రాముని సేనాసంపదలు కలతపడగా ప్రవేశించి ఆ రాముని బాణసమూహములో మునిగెను. ఆ బాణసమూహము నూతనమైన జాడ్యము లేక ప్రకాశించు వింటి సామర్థ్యముచే శరీరము మోయలేనంతగా అస్త్రములకు ప్రత్యస్త్రములను వేసెను.

భారత : ఆ దుష్టవర్తనుడు=దుర్యోధనుడు, అనుజ=తమ్ముల యొక్క విభీషణ=భయంకరమైన, ఉదగ్ర=అధికమైన, వైరినృపతిన్=ధర్మరాజును, తలపడజాలని=ఎదిరింపలేని, తాంత=తగ్గిన ధైర్యముతో, ద్వైపాయన=ద్వైపాయన మనెడి, హ్రదమతల్లికిన్=హ్రదశ్రేష్ఠమునకు, ఆ గతిన్=ఆ విధముగా ఒంటరియై, తత్+నృపతి=దుర్యోధనుడు, తత్+ఆ మడుగు యొక్క, కాండ చయంబులోనన్=నీటిలో మునిగి, వాఃస్తంభన=జలస్తంభన విద్యచే, ధర్మ=ధర్మగుణముచే, దానిన్=ఆ నీటిలో, మేనుమోయకుండ=శరీరము పైకి తేలకుండ, ఆగెను=నిలిచెను.

తాత్పర్యము : దుర్యోధనుడు ఆ యుద్ధ సమాప్తి సమయమునకు తన సోదరులు, పుత్రులు, మిత్రులు ఒక్కడును మిగలక యుద్ధములో మరణించుటను భావించి బాధపడెను. అప్పుడు సోదరుల భయంకర పరాక్రమ సహాయముచే విజృంభించిన మహాప్రతాపవంతుడైన ధర్మజుని ఎదిరింపలేక, సడలిన ధైర్యముతో ద్వైపాయన హ్రదమును ప్రవేశించి దుర్యోధనుడు తన బలసంపద కలతపడగా ఆ నీటిలో మునిగెను. జలస్తంభన విద్యచే స్థిరముగా తన శరీరమును బయటపడకుండా నిలిచెను (లోపలనే నిలిచెను).

వ. అట్టి సమయంబున 239

చం. అయమితభీమశక్తివిహి తానుజపాతనుఁడై గృశించుచు
న్నయహతశోకుఁ డమ్మనుజ నాథుఁడు భీము మహావిపక్షు నెం
తయును విముక్తవిగ్రహు నొనర్చి సహోదరపీడ కేఁప్రతి
క్రియయొనరించు టెట్టొయను ఖేదమునం దురటిల్లెమిక్కిలిన్. 240

రామా : అయమిత=అడ్డుపెట్టబడని, భీమశక్తిన్=గొప్ప శక్తిచే, విహిత= సంపాదించిన, అనుజ=లక్ష్మణుని యొక్క, పాతనుడై=పతనము గలవాడై, కృశించుచున్=బాధపడుచు, నయ=నీతిచే, హతశోకుడు=శోకము నశించిన, ఆ+మనుజనాధుడు=రాముడు, భీమున్=భయంకరమైనవానిని, మహావిపక్షున్=గొప్ప శత్రువగు (రావణుని), ఎంతయును=మిక్కిలి, విముక్త=వదలిపెట్టబడిన,

వి(గహ=యుద్ధముగలవానినిగా, ఒనర్చి=పార(ద్రోలి, సహోదర పీడకు=సోదరుని బాధకు, ఏన్=నేను, (ప్రతి(క్రియ యొనరించుట=బదులు చెప్పుట, ఎట్టొయను= ఎట్లాయను, ఖేదమునన్=దుఃఖములో, మిక్కిలిన్=అధికముగా, దురటిల్లెన్= ఆ(గహించెను.

తాత్పర్యము : అడ్డపెట్టబడని మిక్కిలి భయంకరమైన శక్తిచే కొట్టబడిన లక్ష్మణుని పతనమును చూచి కృశించుచున్న నీతిచే (ఇది శోక సమయము కాదను నీతిచే) శోకమును వదలిన రాముడు భయంకరుడైన రావణుని ఎంతయు యుద్ధ విముక్తుని చేసి, పార(ద్రోలి నా తమ్ముని పీడించిన వానికి బదులు చెప్పుట ఎట్లను ఖేదముతో మిక్కిలి కోపించెను.

భారత : అయమిత=అణచబడని, భీమ=భీమునియొక్క, శక్తి=బలిమిచే, విహిత=చేయబడిన, అనుజ పాతనుడై=దుశ్శాసనాదుల నాశముగలవాడై, అహత=అణగని, శోకుడు=శోకముగలవాడైన, మనుజనాథుడు=దుర్యోధనుడు, మహావిపక్షున్=గొప్ప శ(తువైన, భీమున్=భీముని, ఎంతయును, విముక్త వి(గహున్=శరీరరహితునిగా, మిగతా సమానము.

తాత్పర్యము : అణపబడని భీముని బలిమిచే చేయబడిన దుశ్శాసనాదుల నాశనముగలవాడై కృశించుచున్న దుర్యోధనుడు అణగని శోకముగలవాడై భీముని శరీరరహితునిగా శరీర సోదర మరణమునకు తగిన (ప్రతి (క్రియ చేయుటెట్లాయని మిక్కిలి దుఃఖముతో కోపించెను.

సీ. అంతలావునఁ బేర్చి యనిలజుండు నిజాను
జ(ప్రాణదానంబు సలిపి తనదు
మదిలోనమోద సంపదలు నించుచు నుండ
నాన్నృపాలుఁ డిటని యాత్మ నెంచె
ఘనశౌర్యధైర్యవిఖ్యాతి మిక్కిలిని వ
ర్తిలుచుండ (బతుకుమందులనగమును

మానుగ వినివారితోనతాదోషస
త్త్వారూఢిని సమానుఁ డగుచుఁ దెచ్చె
తే. వంశమున కెల్లఁగీర్త్య భావంబు మిగుల
నీతఁడీతనిఁ దల్లి దానెట్టివేళఁ
గనియెనో యని జగతిలో ననుజనౌఘ
మెల్ల నవగుణాధికునిగా నెన్నకున్నె. 241

రామా : అంతన్=అంతటను, అనిలజుండు=హనుమంతుడు, నిజ+అనుజ= లక్ష్మణుని యొక్క ప్రాణదానంబు సలిపి=బ్రతికించి, తనదు మదిలోన=తన మనస్సులో, మోద సంపదలు=సంతోషాతిశయములను, నించుచునుండన్=నింపగా, ఆ నృపాలుడు=రాముడు, ఇటనిఆత్మనెంచె=ఇట్లు మనస్సులో భావించిన ప్రకారము చెప్పెను. ఈతడు=ఈ హనుమంతుడు, ఘనశౌర్యధైర్య విఖ్యాతిన్=మిక్కిలి పరాక్రమము ధైర్యములతోకూడిన ప్రసిద్ధిచే, మిక్కిలిని వర్తిలుచుండ=అధికముగా ప్రవర్తిల్లుచుండగా, బ్రతుకు మందుల=సంజీవ నౌషధుల, నగమును=పర్వతమును, మానుగ=గొప్పగ, వినివారిత=మిక్కిలి వారింపబడిన, ఊనతాదోష=న్యూనత్వదోషముగల, సత్త్వారూఢిచే= బలసంపదచే, సమానుడగుచు=సమానమైనవాడగుచు (మానసహితుడై) వంశమున కెల్ల=వంశము నంతటికి, కీర్త్య=పొగడదగిన, భావంబు=ప్రవర్తనముచే, మిగులన్= మిక్కిలిగా, తెచ్చెన్=తెచ్చెను, ఈతనిన్=ఈ హనుమంతుని, తల్లి=అంజనాదేవి, తానెట్టివేళన్=తాను ఏ సమయమున, కనియనోయని=ప్రసవించెనోయని, జగతిలోనన్=లోకములో, జనౌఘము=జనసమూహము, ఎల్లన్=సమస్తము, నవగుణాధిపునిగా=మనోహరమైన గుణములచే, అధికునిగా=శ్రేష్టునిగా, ఎన్నకున్నె= లెక్కింపరా?

తాత్పర్యము : అంతట పరాక్రమముతో హనుమంతుడు లక్ష్మణుని బ్రతికించి తన మనస్సులో సంతోషాతిశయమును నింపుచుండగా, రాముడు తాను మనసులో భావించిన మాటలను ఇట్లు ప్రకటించెను. "గొప్పదైన పరాక్రమము ధైర్యములచే మిక్కిలి ప్రసిద్ధి పొంది ప్రవర్తించుచు సంజీవనీ పర్వతమును న్యూనతా భావములేని

బలసంపదచే మాన సహితుడై వంశమునకు పొగడదగిన ప్రవర్తన మిగులునట్లు తెచ్చెను. ఇతని తల్లి తాను ఏ శుభవేళ ప్రసవించెనో యని లోకములోని జన సముదాయమంతయు మనోహర గుణాధికుడని లెక్కింపరా?"

భారత : అంత=అంతటి, లావునన్=బలిమిచే, అనిలజుండు=భీముడు, నిజానుజ=దుశ్శాసనుని యొక్క ప్రాణములు ఖండించి, తనదుమదిలో, అమోద సంపదలు=దుఃఖాతిశయములను, నించుచునుండన్=నింపుచుండగా, ఆ నృపాలుడు=దుర్యోధనుడు, మిగతా సమానము. నివర్తిలుచుండన్=పోవుచుండగా, బ్రతుకు=బ్రతుకుచున్న, మందుల=నిర్భాగ్యులను, నగన్=నవ్వగా, మును=పూర్వము, మానుగ విని=మిక్కిలి విని యుండియు, వారితోనన్=వారితో కూడ, తాన్=తాను, దోష=దోషము యొక్క సత్వ=బలిమి యొక్క, ఆరూఢిని=ప్రసిద్ధిచే, సమానుడగుచున్= సరియైనవాడై, వంశమునకెల్ల, కీర్తి+అభావంబున్=అపకీర్తిని, తెచ్చెన్, ఈతడు=దుర్యోధనుడు, జగతిలో=లోకములో, నను=నన్ను, అవగుణాధికునిగాన్= అవివేకిగా, ఎన్నకున్నె=ఎంచరా?

తాత్పర్యము : అంతైన బలిమిచే భీముడు దుశ్శాసనుని ప్రాణఖండనము చేసి దుర్యోధనుని మనస్సులో దుఃఖాతిశయమును నింపగా దుర్యోధనుడు ఇట్లు ఆత్మలో భావించెను. మిక్కిలి శౌర్య పరాక్రమములు పోవుచుండగా బ్రతుకుచున్న నిర్భాగ్యులను చూచి నవ్వగా నవ్వుదురని మునుపు వినియుండియు వారితో అట్లే తాను దోషము యొక్క బలప్రసిద్ధిచే సమానుడగుచు వంశమునకంతటికి అపకీర్తిని తెచ్చెను. ఈతని తల్లి ఎట్టి శుభవేళలో ఈతని ప్రసవించెను అని లోకములో జనసముదాయము నన్ను అవివేకినిగా లెక్కింపరా?"

ఉ. ఎంతయు నిబ్బరం బయిన యా హనుమద్బల యుక్తిఁజేసి యేఁ
బంతము మీఱఘోర పరిపంథులఁ ద్రుంచుట యెప్పుడింక నా
ర్జింతునొకో సమీరసుతుచేఁతకు నీడుగఁజేసి మేలు దు
స్స్వాంతుఁడు గాఁ డితండను యశస్స్ఫురణంబు జగంబు లోపలన్.

రామా : ఎంతయు నిబ్బరంబయిన=మిక్కిలి ధృఢమైన, ఈ హనుమత్=ఈ హనుమంతుని, బలయుక్తిన్‌జేసి=బలయోగము వలన, ఏన్=నేను (రాముడు) పంతము మీఱన్=పట్టుదల జయించునట్లు, ఘోరపరిపంథులన్=గొప్ప శత్రువులను, త్రుంచుట సంహరించితిని గదా! ఎప్పుడు+ఇంక=ఇకనెప్పుడు? సమీరసుతుచేతకు=హనుమంతుని సహాయమునకు, ఈడుగన్+చేసి=సమానముగా చేసి, దుః+స్వాంతుడు=చెడు స్వభావముగలవాడు, కాదు ఇతండు=ఇతడు కాదు, మేలు+అను=మంచివాడు అనెడి, యశః+స్ఫురణంబు=కీర్తిస్ఫూర్తిని, జగంబులోపలన్=లోకములో, ఆర్జింతునొకో= సంపాదించెదనో గదా!

తాత్పర్యము : మిక్కిలి నిగ్రహముగల ఈ హనుమంతుని బల సంయోగముచే నేను నా పంతము మీరునట్లు ఘోరశత్రువులను సంహరించితిని గదా! ఈ హనుమంతుని ఉపకారమునకు సరియైన ప్రత్యుపకారముచేసి, "ఈ రాముడు చెడు స్వభావము కలవాడు కాదు. మేలు అను కీర్తి సంపదను లోకములో ఇంక ఎప్పుడు సాధించెదను" - అని రాముడు భావించెను.

భారత : ఈహను=కోరికను, మత్+బలయుక్తిన్=నా బలిమిచే, సమీరసుతు= భీముని - మిగతా సమానము.

తాత్పర్యము : ఎంతయు నిండైన కోరికతో నా బలసంపదచే నేను చేసిన పంతము సాధించునట్లు ఈ ఘోరశత్రువులను సంహరించుట ఎప్పుడు? భీముని చేతకు సమానముగా ప్రతిక్రియ చేసి, "ఇతడు దురభిమాని కాదు. మేలైనవాడను యశఃస్ఫూర్తిని లోకములో ఇక ఎప్పుడు సాధించెదను" - అని దుర్యోధనుడు భావించెను.

వ. అని తలపోయుచు రిపుజయ ప్రయతమాన మానసుఁ డయ్యెనంత.

తాత్పర్యము : అని తలంచుచు శత్రుజయమును సాధించవలెననెడి నిశ్చలమనస్కుడై అంత -

సీ. చలపట్టి తనుఁ జంప నముదితోపాయప
ద్ధతి వెదకుచుఁ గని ధర్మరాజు
వెడలఁ ద్రోయఁగ నొండు వెరవులు చాలించి
తనవారినిర్గమోద్ధతి పగఱకు
వెఱఁ గొనర్పఁగ లంక విడిచి బెట్టిదపుబీ
రమ్మునఁ బఱతెంచి రాజరాజు
సయిదోడుసూడుబంటయి మదనుజఘాతి
నిను మున్ను దెగటార్తునని నరవరు
తే. భీముఁదాఁకె నపూర్వసంభృతరణరస
భారు లై యొండొరులఁ దాఁక వారు గదల
బిరుసు నెరప మండలగతిఁ దిరుగగదుమ
నారదున కబ్బె వేర్వేఱ నయనతుష్టి 244

రామా : చలపట్టి=పంతముతో, తనున్ చంప=తనను చంపుటకు, అముదిత+ఉపాయ పద్ధతిన్=సంతోషరహితమైన ఉపాయ రీతిని, వెదకుచున్+కని=వెదికి, ధర్మరాజు=యముడు, వెడలన్ త్రోయగ=గెంటగా, ఒండు వెరవులు=ఇతర ఉపాయములు, చాలించి=వదలి, తనవారి=తన మూకల యొక్క, నిర్గమోద్ధతి=బయలు వెడలిన తీవ్రత, పగఱకు=శత్రువులకు, వెరగు+ఒనర్పగ=భయము కల్పింపగా, లంక విడిచి=లంకను వదలి, బెట్టిదము+బీరమ్మున=మిక్కిలి సంతోషముతో, రాజరాజు సయిదోడు=కుబేరుని తమ్ముడైన రావణుడు, సూడుబంటయి=పగదీర్చుకొనువాడై, పరతెంచి=వచ్చి, మత్+అనుజ ఘాతిన్=నా తమ్ముడైన కుంభకర్ణుని చంపిన, నిన్ను=నిన్ను, మున్ను=ముందుగా, తెగటార్తునని=సంహరించెదనని, భీమున్= భయంకరుడైన, నరవరున్=రాముని, తాకెన్=ఎదిరించెను, అపూర్వ=అరుదైన, సంభృత=నిండిన, రణరసభారులై=యుద్ధతీవ్రతగలవారై, ఒండొరులన్+తాకన్= పరస్పరము ఎదురుపడగా,

వారు=రామరావణులు, కదలన్=చలింపగా, బిరుసు నెరప=శౌర్యము ప్రకటింపగా, మండలగతిన్ తిరుగన్=గుండ్రమైన రీతిలో తిరుగగా, గదుమన్=నొత్తగా, వేర్వేర=వేరువేరుగా, నయనతుష్టి=కనులకు ఇంపు, నారదునకు అబ్బె=నారదునకు కలిగెను.

తాత్పర్యము : పంతముబట్టి రాముని చంపుటకు దుఃఖ కారణమైన ఉపాయ పద్ధతిని వెదకి యముడు గెంటగా ఇతర ఉపాయములు చాలించి తన సేనలు బయలు వెడలుట శత్రువులకు భయము కలిగింపగా లంకను వదలి మిక్కిలి పంతముతో కుబేరుని సోదరుడైన రావణుడు పగదీర్చుకొనువాడై వచ్చి 'నా తమ్ముని చంపిన నిన్ను ముందుగా చంపెదనని' భయంకరుడైన రాముని ఎదిరించెను. వారు పరస్పరము యుద్ధక్రీడా వినోదులై ఎదిరించగా రామరావణులు చలించి శౌర్యము చూపి మండలాకృతిలో తిరిగి నొత్తగా వేరువేరుగా నారదుని కన్నులకింపు గలిగెను.

భారత : చలపట్టి వెదకుచు=పంతముగా వెదకుచు, తనున్ చంపన్=తనను చంపుటకు, ధర్మరాజు=ధర్మనందనుడు, వెడలన్ త్రోయగన్=బయటకు వచ్చునట్లు చేయగా, ఒండు వెరవులు చాలించి, తన=తాను, వారి=నీళ్ళలోనుండి, నిర్గమోద్ధతి= బయటకు వచ్చెడి తీవ్రత, వెఱగొనర్ప=ఆశ్చర్యము కలిగింపగా, కలంక విడిచి=కలతను వీడి, రాజరాజు=దుర్యోధనుడు, సయిదోడుసూడు బంటయి=తమ్ముల పగ తీర్చుకొనువాడై, నరవరున్+భీముని=నరశ్రేష్ఠుడైన భీముని, తాకె=ఎదిరించెను, వారు=భీమ దుర్యోధనులు, గదలన్=గదల యొక్క, మిగతా సమానము.

తాత్పర్యము : పంతముతో తనను వెదకుచు తనను చంపుటకు దుఃఖకారణమైన ఉపాయమును వెదకి ధర్మరాజు బయటకు వచ్చునట్లు తనను పురికొల్పగా, ఇతర ఉపాయములు చాలించి తానున్న నీళ్ళలో నుండి వచ్చెడి వేగము శత్రువులను భయపెట్టగా మనసులో కలతవీడి మిక్కిలి పంతముతో తమ్ముల పగదీర్చుకొనువాడై దుర్యోధనుడు వచ్చెను. "నా తమ్ములను జంపిన నిన్ను ముందుగా చంపెద"నని నరవరుడైన భీముని ఎదిరించెను. వారిరువురు అపూర్వమైన యుద్ధక్రీడను ఉత్సహించి తలపడగా భీమ దుర్యోధనులు గదలను ధరించి శౌర్యముతో మండలాకారములో

తిరుగగా వారి ఒత్తిడి నారదునకు వేరువేరుగా కనువిందు జేసెను.

తే. పొసఁగ నేఁడు గదారణభుక్తి దొరకె
నాకుఁ గను దనియఁగ నని నారదుండు
సమ్మదముఁ జెందఁ దిర మైనయమ్ములపస
నొండొరుల మించి పోరి రయ్యోధవరులు. 245

రామా : నాకు=నాకు, పొసగన్=అందముగా, నేడు గదా=ఈ రోజు గదా, కను+తనియన్=కంటికింపుగా, రణభుక్తి దొరకెన్=యుద్ధ భోజనము లభించెను, అని, నారదుండు, సమ్మదమున్+చెందన్=సంతసింపగా, తిరమైన=స్థిరమైన, అమ్ములపసన్=అస్త్రకౌశలముచే, ఆ+యోధవరులు=ఆ యుద్ధవీరులు, ఒండొరుల మించి=ఒకరినొకరు మించి, పోరిరి=పోరాడిరి.

తాత్పర్యము : నాకు అందముగా ఈనాడు గదా కంటికింపుగా యుద్ధభోజనము లభించెనని నారదుడు సంతోషింపగా అస్త్రకౌశలముచే పరస్పరము ఒకరినొకరుమించి ఆ యుద్ధవీరులు పోరాడిరి.

భారత : నేడు=ఈ రోజు, గదారణభుక్తి=గదాయుద్ధానుభవము, తిరమై=స్థిరమై, నయమ్ములపస=నేర్పుపసచే, ఒండొరులు=భీమదుర్యోధనులు.

తాత్పర్యము : అందముగా ఈనాడు నాకు గదా యుద్ధానుభవము కంటికింపుగా కలిగెనని నారదుడు సంతోషింపగా, స్థిరమైన నేర్పు పసతో పరస్పరము మించి భీమదుర్యోధనులు యుద్ధము చేసిరి.

వ. ఇట్లు గడంగి మహాయుద్ధంబు సేయునంత. 246

తాత్పర్యము : ఇట్లు పూని ఘోర యుద్ధము చేయుచుండగా.

ఉ. అంచితనైపుణిం బరఁగు నంబకఘోరతర ప్రయుక్తిచే
మించుగదానవోద్ధతి సమృద్ధి గనంబడుచుండఁ బోరు సా

గించుచునుండ మానగుణ కీర్తితు రాజులతేనిఁ జూచి శం
కించిరి నమ్మరాదు మనగెల్పనుచున్ హరిముఖ్యు లెంతయున్.

రామా : అంచిత నైపుణిన్+పరగు=మిక్కిలి నైపుణ్యముతో కొనసాగు, అంబక=బాణముల యొక్క ఘోరతర ప్రయుక్తిచే, తీవ్రముగా ప్రయోగించుటచే, మించుగ=అధికముగ, దానవ+ఉద్ధతి సమృద్ధి=రావణుని పరాక్రమ సంపద, కనంబడుచుండన్=కన్పించగా, పోరు సాగించుచు నుండ=యుద్ధము కొనసాగించుచుండగా, మానగుణకీర్తితు=అభిమానగుణముచే కీర్తింపబడు, రాజులతేనిన్=రాముని, చూచి, హరిముఖ్యులు+ఎంతయున్=వానర వీరులెంతయు నమ్మరాదు, మనగెల్పు+అనుచున్=మన విజయమని, శంకించిరి=అనుమానించిరి.

తాత్పర్యము : మిక్కిలి నైపుణ్యముచే నడచు తీవ్రమైన బాణప్రయోగముచే అధికముగా రావణుని పరాక్రమ సంపద కనబడునట్లు యుద్ధము సాగించుచుండగా మానధనకీర్తిగల రాముని జూచి వానరముఖ్యులు ఎంతయు మన గెలుపును నమ్మరాదని శంకించిరి.

భారత : అంబక=నేత్రములకు, ఘోరతరప్రయుక్తిచేన్=తీవ్ర వ్యాపారముచేత, మించు=అతిశయించు, గదా=గదలయొక్క, నవ=వింతయైన, ఉద్ధతి=ప్రహారముల యొక్క, సమృద్ధి=అతిశయము, రాజులతేనిన్=దుర్యోధనుని, చూచి, హరిముఖ్యులు =కృష్ణాదులు – శంకించిరి.

తాత్పర్యము : మిక్కిలి నైపుణ్యముచే నడచుచు నేత్రములకు తీవ్రవ్యాపారముచే నతిశయించు గదల ప్రహారములు వింతయైన అతిశయముతో కనిపించునట్లు యుద్ధము కొనసాగుచుండగా అభిమానధనుడైన దుర్యోధనుని చూచి కృష్ణాదులెంతయు – మన గెలుపు నమ్మరాదని శంకించిరి.

వ. తదనంతరంబ 248

తాత్పర్యము : ఆ తర్వాత

కం. చేవ చెదరి భీమాశుగ
దావహతికృతోరుభంగ తాపజ్జ్వలితుం
డై విమతుఁ డడఁగ జయమున
వైవస్వతసంతతి నృపవర్యుఁడు మించెన్. 249

రామా : చేవచెదరి=సత్తువచెడి, భీమ+ఆశుగ=భయంకరములైన బాణములనెడి, దావ=దవానలము యొక్క, హతి=కాల్పులచే, కృత=చేయబడిన, ఉరు=అధికమైన, భంగ=పరాజయములచేనైన, తాప=తాపముచే, జ్వలితుండై=దహింపబడినవాడై, విమతుడు=రావణుడు, అడగన్=డీలుపడగా, వైవస్వత సంతతినృపుడు=రాముడు జయమున, మించెన్=అతిశయించెను.

తాత్పర్యము : సత్తువచెడి భయంకర బాణములను దవానలము యొక్క కాల్పులచే, అధిక పరాజయములచే కలిగిన తాపముచే దహింపబడినవాడై రావణుడు డీలుపడగా రాముడు జయముతో అతిశయించెను.

భారత : భీమ=భీమునియొక్క, ఆశు=తీవ్రమైన, గదా=గదల యొక్క, అవహతి=మొత్తుటచే, కృత=చేయబడిన, ఊరుభంగతా=తొడలు విరుగుట గలవాడై, ఆపత్=ఆపదలచే, జ్వలితుండై=మండుచున్నవాడై, విమతుడు=దుర్యోధనుడు, అడగగా, వైవస్వత సంతతి=యమపుత్రుడైన, నృపవర్యుడు=ధర్మరాజు, మించెను.

తాత్పర్యము : చేవచెడి భీముని తీవ్రమైన గదా ప్రహారముచే తొడలు విరిగి ఆపదలచే మండిపడు దుర్యోధనుడు డీలుపడగా ధర్మరాజు జయముతో మించెను.

తే. భీష్మ గురుకర్ణశల్యరణోష్మనమర
ఘోర మగు యుద్ధ మతనితో వైరి సలుప
ననుపమప్రౌఢిమం బదిదినము లైదు
రెండు నొండు విఘ్నంబు లేకుండ జరిగె. 250

రామా : భీష్మ=భయంకరమై, గురు=అధికమైన, కర్ణ=చెవులకు,

శల్య=ములుకుల వంటి, రణ=ధ్వని యొక్క, ఊష్మన్=ఉగ్రత్వముచే, అమర=దేవతలకు, ఘోరమగు=భయంకరమైన, యుద్ధము=జగడము, అతనితోన్=రామునితో, వైరి=రావణుడు, చలుప=చేయుగా, అనుపమ=సాటిలేని, ప్రౌఢిమంబు=పటుత్వముగల, అది=యుద్ధము, దినములైదు+రెండును=ఏడు దినములు, ఒండు విఘ్నము లేకుండ=ఒక్క విఘ్నమును లేక, జరిగె=జరిగెను.

తాత్పర్యము : అధికభయంకరమై చెవులకు ములుకులవంటి ధ్వని యొక్క ఉగ్రతచే దేవతలకు భయంకరమైన యుద్ధము రామునితో రావణుడు చేయగా సాటిలేని పటుత్వముగల ఆ యుద్ధము ఒక్క విఘ్నము లేకుండ ఏడు దినములు జరిగెను.

భారత : భీష్మ, గురు, కర్ణ, శల్య=భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుల యొక్క, రణమందుగల=యుద్ధమునందుగల, ఊష్మన్=ప్రతాపముచే, అమరన్=ఒప్పగా, ఘోరమగు యుద్ధము, అతనితోన్=ధర్మరాజుతో, వైరి=దుర్యోధనుడు, పది+ఐదు+రెండు+ఒండు=10+5+2+1=18 రోజులు క్రమముగా భీష్మ ద్రోణ కర్ణ శల్యులు, విఘ్నంబు లేకుండ, జరిగె.

తాత్పర్యము : భీష్మగురుకర్ణ శల్యుల యుద్ధ ప్రతాపముచే నొప్పగా ఘోరమగు యుద్ధము ధర్మజునితో దుర్యోధనుడు వరుస క్రమములో పది, ఐదు, రెండు, ఒక దినములు విఘ్నము లేకుండ చేసెను.

తే. దిగ్వధూజాలధమ్మిల్ల ధృతవిశుద్ధ
కీర్తిగురుసూనుఁ డారాజు కృత్స్న బలని
వేశ మారాత్రి చరగోత్ర విభునిలీలఁ
గలఁచె స్వాపహృతోరువిక్రమతఁ గుంద. 252

రామా : దిక్=వధూజాల=దిక్కులనెడి స్త్రీల సముదాయముయొక్క, ధమ్మిల్ల=కొప్పులందు, ధృత=ధరింపబడిన, విశుద్ధకీర్తి=నిర్మలమైన కీర్తియనెడి, గురు=అధికమైన, సూన=పుష్పములు గలవాడు, ఆ రాజు=రాముడు, కృత్స్న=

సమస్తమైన, బల=బలిమికి, నివేశము=స్థానమైనవాడు, ఆ రాత్రిచరగోత్ర విభునిన్=ఆ రాక్ష సవంశాధీశ్వరుడైన రావణుని, లీలన్=అవలీలగా, స్వ=తనచేత, అపహృత= అపహరించబడిన, ఉరు=అధికమైన, విక్రమతన్=పరాక్రమముతో, కుందన్=తగ్గునట్లు, కలచెన్=చలింపజేసెను.

తాత్పర్యము : దిక్కాంతల సముదాయపు కొప్పులందు ధరింపబడిన నిర్మల కీర్తియనెడి అధిక పుష్పములు గల రాముడు సమస్తమైన బలిమికి స్థానమైనవాడు ఆ రావణుని అవలీలగా అపహరించి అధిక పరాక్రమము తగ్గునట్లు చలింపజేసెను.

భారత : గురుసూనుడు=ద్రోణుని పుత్రుడైన అశ్వత్థామ, ఆ రాజు=ధర్మరాజు యొక్క, బలనివేశము=పాళెము, ఆరాత్రి=దుర్యోధనుడు పడిన ఆ రాత్రియందే, చర=చరించెడి, గోత్రవిభుని=హిమవంతుని యొక్క, లీలన్=రీతిచే, స్వాప=నిద్రచే, హృత=హరింపబడిన, ఉరువిక్రమతన్=గొప్ప పరాక్రమముచే, కుందన్=నిద్రచే బిరుసు చెడియుండగా, కలచెన్=నొప్పించెను.

తాత్పర్యము : దిక్కాంతల సముదాయము యొక్క కొప్పులయందు ధరింపబడిన నిర్మల కీర్తిగల అశ్వత్థామ ధర్మరాజు యొక్క సమస్త గుడారములను ఆ రాత్రియందే హిమవంతునివలె నిద్రచే హరింపబడిన అధిక పరాక్రమముచే బిరుసు చెడియుండగా కలచెను.

సీ. అలఘుదోః ప్రౌఢిమాతులకృతవర్మసా
హాయ్యకంబున నభేద్యాత్ముఁ డగుచు
నప్పు డావీర యోధాగ్రణి యుగ్రంపు
భల్ల వర్షంబునబలిమి నమర
శత్రుమస్తకము లసంఖ్యంబు లై ధర
గుంపులు పడుచుండఁ గొట్టికొట్టి
యంతట సత్యమోఘాస్త్రప్రయోగుఁ డై
యూర్జితబలు నుత్తమోజుఁ గృష్ణ

తే. తనుభవుల సద్వరోదయంబున వెలిఁగెడు
సంగరకృతిధృష్టద్యుమ్ను శాత్రవాసు
పృథుఫణిశిఖండిఁ దెగటార్చి భీమవిజయ
దీప్తమహిమచేతనుదీర్ణ తేజుఁ డయ్యె. 253

రామా : అలఘు=అధికమైన, దోః ప్రౌఢిమ=భుజబలముచే, అతుల=సాటిలేనిదిగా, కృత=చేయబడిన, వర్మ=జోడుయొక్క, సాహాయ్యకంబునన్=సహాయముచే, అభేద్య+ఆత్ముడగుచు=భేదింపరాని ఆత్మగలవాడై, అప్పుడు, ఆ వీర యోధాగ్రణి=రాముడు ఉగ్రభల్లవర్షంబున=తీవ్రమైన బాణవర్షముల, బలిమి=బలిమిచే, అమర శత్రు మస్తకములు=రావణుని తలలు, అసంఖ్యంబులై=మిక్కిలి లెక్కలేనన్ని, ధరన్=భూమిపై గుంపులు పడుచుండ, కొట్టికొట్టి, అంతట, అత్యమోఘాస్త్ర ప్రయోగుడై=మిక్కిలి అమోఘములైన అస్త్రములు కలవాడై, ఊర్జిత బలున్=స్థిరమైన బలము గలవానిని, ఉత్తమ+ఓజున్=గొప్ప తేజస్సు గలవానిని, కృష్ణతనున్=నల్లని దేహముగల వానిని, భవు=ఈశ్వరుని యొక్క, లసత్+వరోదయంబున=గొప్ప వరముల స్ఫూర్తిచే, వెలిగెడు=ప్రకాశించెడు, సంగరకృతి=యుద్ధ క్రీడయందు, ధృష్ట=ధీరమైన ద్యుమ్నున్=శౌర్యముగలవానిని, శాత్రవ=శత్రువుల యొక్క, ఆసు=ప్రాణములనెడి, ఫృదుఫణి=క్రూర సర్పములకు, శిఖండిన్=నెమలి వంటివానిని (రావణుని), భీమ విజయ=గొప్ప విజయమనెడు, దీప్త మహిమచేత=ప్రకాశించు మహిమచే, తెగటార్చి=చంపి, ఉదీర్ణతేజుడయ్యె=ప్రసిద్ధమైన తేజస్సు కలవాడాయెను.

తాత్పర్యము : అధికమైన భుజబలముచే సాటిలేనట్లుగ చేయబడిన జోడు సహాయముచే భేదింపరాని ఆత్మగల ఆ రాముడు అప్పుడు రావణుని తన తీవ్రబాణ వర్షముచే తలలు అసంఖ్యాకముగా గుంపులుగా నేలపై పడునట్లు కొట్టి అంతట మిక్కిలి అమోఘాస్త్రములను ప్రయోగించినవాడై స్థిరమైన బలముగలవానిని ఉత్తమ తేజస్సు గలవానిని, నీలదేహుని ఈశ్వరుని వరప్రభావముచే వెలిగెడి యుద్ధక్రియలయందు ధీరమైన పరాక్రమముగలవానిని శత్రువుల ప్రాణములనెడి క్రూర సర్పములకు నెమలి వంటి వానిని రావణుని మిక్కిలి విజయదీప్తమైన మహిమచే

చంపి ప్రసిద్ధమైన తేజస్సు గలవాడాయెను.

భారత : అలఘుదోః(ప్రౌఢి, మాతుల=మేనమామయైన కృపుని యొక్కయు, కృతవర్మ=కృతవర్మ యొక్కయు, ఆ వీర యోధాగ్రణి=అశ్వత్థామ, బలిమిన్+అమర= బలముచే నమరునట్లు, శత్రు మస్తకములు=శత్రువుల తలలు, ఉత్తమోజున్= ఉత్తమోజుడనువానిని, కృష్ణ=ద్రౌపది యొక్క తనూభవులన్, కుమారులైన ప్రతి వింధ్యాదులను, సంగరకృతి=యుద్ధ సమర్థుడైన, ధృష్టద్యుమ్నున్=ధృష్టద్యుమ్నుని, శాత్రవ=శత్రువుల యొక్క, ఆసు=ప్రాణవాయువులకు, పృధుపణి=ఘనసర్పమైనవానిని, శిఖండిన్=శిఖండిని, తెగటార్చి=చంపి, భీమ విజయదీప్త మహిమచేత=భీమార్జునుల యొక్క ప్రకాశించు మహిమచే, దీర్ణ=పోమొత్తబడిన (చీల్చబడిన)

తాత్పర్యము : మిక్కిలి భుజబలముగల మేనమామయైన కృపుని యొక్కయు, కృతవర్మ యొక్కయు సహాయముచే భేదింపరాని ఆత్మగలవాడగుచు అప్పుడు ఆ అశ్వత్థామ తీవ్రమైన బాణవర్షముచే కలిగిన బలముతో శత్రువుల తలలు అసంఖ్యాకములుగా భూమిపై పడునట్లు పడగొట్టి అంతట మిక్కిలి అమోఘములైన అస్త్రములను ప్రయోగించి అధిక బలుడైన ఉత్తమోజుని, ద్రౌపది కుమారులను మిక్కిలి వరప్రభావముచే యుద్ధ సమర్థుడైన ధృష్టద్యుమ్నుని, శత్రువుల ప్రాణములకు ఘన సర్పమైన శిఖండిని భీమార్జునుల దీప్తమహిమచే చీల్చబడిన తేజస్సు కలవాడాయెను. (తేజస్సు క్షీణించెను).

వ. అంత 254

సీ. క్రీడానరుండైన శ్రీవరుం డిట్లు క్షా
త్రప్రక్రియను విజయప్రశక్తి
నిర్వహించుచు శత్రు నిర్మూలనము సల్పి
సొంపుమైఁ దనకును శుభ పదవిక
లంకాధిరాజ్య విలాసపట్టాభిషే
కము స్వపురస్ఫూర్జితముగ నడప

వసుధ నప్పుడు దానవప్రభుత్వ విశేష
పృథుతరదీప్తి విభీషణుండు
ఆ. తేజరిల్లె ధర్మ రాజితరక్షమా
పాలదుర్లభతర భాగ్యలక్ష్మి
నేఁడుగా ఫలించె నెఱయ నస్మత్పూర్వ
సుకృత మద్భుత మని సుజను లలర. 255

రామా : క్రీడానరుండైన=క్రీడారూపమున మనుష్యుడుగానున్న, శ్రీవరుండు=రాముడు, ఇట్లు, క్షాత్రప్రక్రియను=క్షత్రియునివలె వర్తించుచు, విజయప్రశక్తి=విజయమునందు అధిక సామర్థ్యమును, నిర్వహించుచు=జరుపుచు, శత్రు నిర్మూలనము సలిపి=శత్రునాశనము చేసి, సొంపుమై=అందముగా, తనకున్=విభీషణునకు, శుభపదవిక=శుభమార్గముగల, లంకాధిరాజ్య విలాస పట్టాభిషేకము=లంకా రాజ్యము యొక్క విలాసవంతమైన పట్టాభిషేకము, స్వ=తనకు, పురః=ముందరికిని (ఎప్పటికిని) స్ఫూర్జితముగ=ప్రకాశించునట్లు, నడప=నడపగా, వసుధన్=భూమిపై, అప్పుడు, దానవ ప్రభుత్వ విశేష=రాక్షస ప్రభుత్వ విశేషముచే, పృథుతరదీప్తి=అధికమైన ప్రకాశముకలవాడై, విభీషణుండు, తేజరిల్లె=ప్రకాశించెను, ధర్మరాజిత=సకల ధర్మములచే ప్రకాశించు, రక్షన్=సంరక్షణచే, మాపాలన్=మా యందు, దుర్లభతర=కష్టముగా లభించెడి భాగ్యలక్ష్మి=భాగ్యసంపద, నెఱయన్= ఆలోచింపగా, అస్మత్ పూర్వసుకృత=మా పూర్వపుణ్యము, అద్భుతమని, సుజనులలర=సజ్జనులు ఆనందింపగా, నేడుగా ఫలించె=ఈనాడు ఫలించెను.

తాత్పర్యము : మానవ మాత్రుడుగా నటించు రాముడు ఈ విధముగా క్షత్రియ ప్రవర్తనచే విజయము నొందు అధిక సామర్థ్యమును నిర్వహించుచు శత్రు నాశనము చేసి సొంపుగా విభీషణునకు శుభమార్గముగల లంకాధిరాజ్య విలాస పట్టాభిషేకము తనకు నిరంతరము స్ఫూర్తివంతముగా నడపగా భూమిపై అప్పుడు రాక్షస ప్రభుత్వ విశేష దీప్తిగల విభీషణుడు ప్రకాశించెను. సకల ధర్మములచే కూడిన సంరక్షణచే మాయందు దుర్లభమైన భాగ్యలక్ష్మి పూర్వపుణ్య ఫలముచే అద్భుతముగా

కలిగెనని సజ్జనులు సంతోషింపగా తేజరిల్లెరి.

భారత : క్రీడా నరుండయిన శ్రీవరుండు=మానవ రూపమున నున్న శ్రీకృష్ణుడు, క్షాత్ర ప్రక్రియను=క్షత్రియోచితమైన సారథివలె, విజయ=అర్జునునికి, ప్రశక్తి=అధిక బలమును, శుభపద=శుభప్రదమైన, వికలంక=నిష్కలంకమైన, అభిరాజ్యవిలాస= సామ్రాజ్య విలాసమందుగల, పట్టాభిషేకము, స్వపుర=తన హస్తినానగరమున, తాన్=తాను, నవప్రభుత్వ=నూతన ప్రభుత్వమందుగల, విశేష=వింత రీతిచే, విభీషణుడు=చూడశక్యము గానివాడు, ధర్మరాజు, ఇతరక్షమాపాల=ఇతర రాజులకు, మిగతా సమానము.

తాత్పర్యము : మానవ రూపమున ప్రవర్తించు కృష్ణుడు ఈ విధముగా క్షత్రియ సంబంధమైన సారథివలె అర్జునునకు అధిక బలమును నిర్వహించుచు శత్రు నిర్మూలనము చేసి అందముగా తనకును శుభప్రదమై నిష్కళంకమైన సామ్రాజ్య విలాసముతో పట్టాభిషేకమును తన హస్తినానగరమందు ప్రకాశవంతముగా నడపెను. భూమిపై అప్పుడు తాను నూతన ప్రభుత్వమందుగల వింత రీతిచే గొప్ప దీప్తి చేత చూడ శక్యముగాని ధర్మరాజు తక్కిన రాజులకు మిక్కిలి దుర్లభమైన భాగ్యలక్ష్మి నేడు ఫలించగా తమ పూర్వపుణ్య సుకృతము అద్భుతమని సుజనులు ఆనందింపగా తేజరిల్లెను.

తే. విష్ణు ముఖ్యావతారమై వెలయు విశ్వ
విభుఁడు ననలసహర్షప్రవేశమహిమ
కతనఁ దన చెల్వమతి శుద్ధి గాంచి యమర
వినుతి మిగులఁ జేకొని యేఁగెఁ దనదుపురికి 256

రామా : విష్ణుముఖ్యావతారమై=విష్ణుని ప్రధాన అవతారమై, వెలయు= ప్రకాశించు, విశ్వవిభుడు=రఘునాథుడు, అనల=అగ్నియందు, సహర్ష=సంతోషముతో, ప్రవేశ=ప్రవేశించు, మహిమ కతనన్=మహిమ వలన, తన చెల్వ=తన భార్య అయిన సీతాదేవి యొక్క మతిశుద్ధి గాంచి=హృదయ శుద్ధిని చూచి, అమర వినుతి=బ్రహ్మాది

దేవతల స్తోత్రములను, మిగుల చేకొని=మిక్కిలి స్వీకరించి, తనదుపురికి=తన అయోధ్యా నగరమునకు, ఏగెన్=వెళ్ళెను.

తాత్పర్యము : విష్ణుని ముఖ్య అవతారమైన రాముడు అగ్నియందు సంతోషముగా ప్రవేశించిన మహిమ వలన ప్రకాశించు సీతాదేవి హృదయ శుద్ధిని చూచి బ్రహ్మాది దేవతల స్తోత్రములను మిక్కిలిగా స్వీకరించి అయోధ్యా నగరమునకు వెళ్ళెను.

భారత : విశ్వవిభుడు=శ్రీకృష్ణుడు, అనలస=అల్పముగాని, హర్ష ప్రవేశమహిమ కతన=ఆనందము కలిగిన మహిమచే, తనచెల్వము=తన విలాసము, అతిశుద్ధిగాంచి= మిక్కిలి శుద్ధిని పొంది, అమరన్=అమరగా, వినుతి=ధర్మ రాజాదుల స్తోత్రమును, చేకొని=స్వీకరించి, తనదుపురికి=ద్వారకకు, ఏగెను=వెళ్ళెను.

తాత్పర్యము : విష్ణుని ముఖ్యావతారమై వెలయు శ్రీకృష్ణుడు అనల్పమైన సంతోషము వలన కలిగిన మహిమచేత విలాసము మిక్కిలి శుద్ధి పొంది ప్రకాశింపగా ధర్మరాజాదుల స్తోత్రములను అందుకొని ద్వారకా నగరమునకు వెళ్ళెను.

వ. అట్లేఁగి యుచితభంగి నంగీకృతసకలసామ్రాజ్యభోగలీలా
విశేషుండయ్యె నప్పుడు. 257

కం. శాంతనవోక్తి విలాసా
త్యంత సుశిక్షితసమస్త ధర్మతఁ జేసెన్
శాంతి ఘనుఁడు వైవస్వత
సంతతి నృపశేఖరుఁడు ప్రజాపాలనమున్. 258

రామా : శాంత=శాంతములైన, నవ=మనోహరములైన, ఉక్తివిలాస=అగస్త్యాది మునుల వచోవిలాసములచే, అత్యంత=మిక్కిలి, సుశిక్షిత=లెస్సగా తెలియబడిన, సమస్త=సకలమైన (శత్రుమిత్రుల యొక్క), ధర్మతన్=గుణములు కలవాడై, శాంతి ఘనుడు=గొప్ప శాంతి కలవాడు, వైవస్వతసంతతి=మనువంశమందుగల, నృపశేఖరుడు=రాముడు, ప్రజాపాలనమునన్=ప్రజాపాలనము, చేసెన్=చేసెను.

తాత్పర్యము : శాంతములు మనోహరములునైన అగస్త్యాది మునుల వచో విలాసములచే మిక్కిలి లెస్సగా తెలియబడిన సకల గుణములు గలవాడై శాంతి ఘనుడైన మనువంశ రాజశ్రేష్టుడైన రాముడు ప్రజాపాలనము చేసెను.

భారత : శాంతనవ=భీష్ముని యొక్క, ఉక్తివిలాస=శాంతి, ఆనుశాసనిక పర్వోక్తి=విలాసములచే, వైవస్వత సంతతి=యముని కుమారుడైన, నృప శేఖరుడు=ధర్మరాజు.

తాత్పర్యము : భీష్ముని యొక్క సూక్తి విలాసములచే లెస్సగా తెలియబడిన సకల ధర్మములు గలవాడై గొప్ప శాంత స్వభావముగల ధర్మరాజు ప్రజాపాలనము చేసెను.

వ. ఆ సమయంబునందు 259

ఆ. మౌనిపద విస్పష్టమహితనయోత్పన్న
కుశలవసుసమృద్ధి వశత నొదవు
కొదవలెల్లఁ దీర్చుకొని యవ్విభుండు గా
వించె నశ్వమేధ విధులు వెలయ. 260

రామా : మౌనిపద=వాల్మీకి ఆశ్రమమునందు, విస్పష్ట=విడువబడిన, మహితనయా=సీతయందు, ఉత్పన్న=జన్మించిన, కుశలవ=కుశలవుల, సుసమృద్ధి వశతన్=అధిక ఐశ్వర్య ప్రాప్తిగలవాడై, ఒదవకొదవలెల్ల తీర్చుకొని=కలిగెడి దేవ, ఋషి, పితృ ఋణములు తీర్చుకొని, ఆ+విభుండు=ఆ రాముడు, అశ్వమేధ విధులు=అశ్వమేధాది యాగములు, వెలయన్=ప్రసిద్ధమౌనట్లు, కావించె=చేసెను.

తాత్పర్యము : వాల్మీకి ఆశ్రమము నందు విడువబడిన సీతకు జన్మించిన కుశలవుల వలన అధిక ఐశ్వర్య ప్రాప్తిగలవాడై దేవఋషి పితృ ఋణములు తీర్చుకొని ఆ రాముడు అశ్వమేధాది విధులను ప్రసిద్ధముగా చేసెను.

భారత : మౌని=వేద వ్యాసముని, పద=వాక్యములచే, విస్పష్ట=ఇవ్వబడిన,

మహిత=ప్రసిద్ధమైన, నయ=నీతిచే, ఉత్పన్న=కలిగిన, కుశల=శుభకరమైన, వసు=ద్రవ్యముల యొక్క, సమృద్ధివశతన్=సమృద్ధి కలుగుటచే, అవ్విభుండు=ధర్మరాజు.

తాత్పర్యము : వేదవ్యాసముని వాక్యములచే తెలిసిన ప్రసిద్ధమైన నీతిచే కలిగిన శుభకరమైన ద్రవ్యముల యొక్క సమృద్ధిగలవాడై ధర్మరాజు అశ్వమేధాది సత్కర్మలను చేసెను.

సీ. శ్రీధాన్యకటకమై చెలువొందె రాష్ట్రంబు
నెలమూఁడు వానలు నిండఁ గురిసెఁ
బాడినిఁ బంటలఁ బ్రజలు విజృంభించి
రరిపదవ్యుత్పత్తి యస్తమించె
రోగాపమృత్యువార్తాగంధ మెడలెను
జారచోరాదుల పేరు నుడిగె
వర్ణాశ్రమాచారవర్తనల్ గడు నొప్పె
ధర్మంబు నాల్గుపాదముల నడచె

తే. రామభద్రుండు సన్మార్గరక్షణైక
పరుఁడు దిగవతంసితకీర్తి పాండుసూనుఁ
డుర్విపయిఁ జతురాత్మానుజోపచరిత
చరణుఁ డగుచు సామ్రాజ్యంబు సలుపునపుడు. 261

రామా : దిక్+అవతంసిత=దిక్కులకు అలంకారముగా చేయబడిన, పాండుసూనుడు=తెల్లని పుష్పములుగలవాడు, సత్+మార్గ రక్షణైకపరుడు=ధర్మరక్షణయే ధ్యేయముగా కలవాడు, రామభద్రుండు=రామచంద్రుడు, ఉర్విపయిన్=భూమిపై, చతుర=మనోహరమైన, ఆత్మ=హృదయముగల, అనుజ=తమ్ములచేత, ఉపచరిత=సేవింపబడిన, చరణుడగుచున్=పాదములుగలవాడై, సామ్రాజ్యంబు సలుపు

నపుడు=రాజ్య పరిపాలనము చేయునపుడు, రాష్ట్రంబు=దేశము, శ్రీధాన్యకటకమై=ధాన్యసంపదలకు నెలవై, చెలువొందె=ప్రకాశించెను, నెలమూడువానలు=నెలకు మూడు వానలు, నిండన్‌కురిసె=సంపూర్ణముగా వర్షించెను, ప్రజలు, పాడినన్+పంటలన్=పాడిపంటలతో, విజృంభించిరి=అతిశయించిరి, అరిపద వ్యుత్పత్తి=శత్రువుల పుట్టుక, అస్తమించె=నశించెను, రోగ+అపమృత్యు=రోగములు, అకాల మరణములు అనెడు, వార్తాగంధము=వార్తల వ్యాప్తి, ఎడలెను=నశించెను, జార చోరాదుల పేరు=వ్యభిచారులు, దొంగల ప్రసక్తి, ఉడిగె=లేకపోయెను, వర్ణాశ్రమాచార వర్తనల్=నాలుగు వర్ణములకు సంబంధించిన సదాచార ప్రవర్తనలు, కడునొప్పె=ఉన్నతముగా భాసించెను, ధర్మంబు నాలుగు పాదముల నడచె.

తాత్పర్యము : సన్మార్గమును రక్షించుట యందు దిక్కులకు అలంకారముగా చేయబడిన కీర్తి యనెడు తెల్లని పుష్పములుగల రామభద్రుడు మనోహరమైన హృదయములుగల తమ్ములచే సేవింపబడిన పదములు గలవాడై రాజ్యపాలనము చేయునపుడు భూమిపై ఈ విధముగా సంతోషము నెలకొనెను. దేశము ధ్యానసంపదలకు నెలవాయెను. నెలకు మూడు వానలు నిండుగా కురిసెను. పాడిపంటలచే ప్రజలు విజృంభించిరి. శత్రువులను పదము నశించెను. రోగములు అకాల మరణములు అనువార్తావ్యాప్తి లేదాయెను. జారచోరులను మాట వినిపించదాయెను. వర్ణాశ్రమ ధర్మములు మిక్కిలిగా పాటించిరి. ధర్మము నాలుగు పాదములతో నడచెను.

భారత : రామ=ఒప్పుచున్న, భద్ర=భద్రముగలవాడు, దిగవతంసిత కీర్తి=దిక్కులకు వ్యాపించిన కీర్తిగలవాడు, పాండుసూనుడు=ధర్మరాజు, ఉర్విపయి, చతుః=నలుగురు, ఆత్మానుజులు=తన సోదరులచే, ఉపచరిత=సేవింపబడిన, చరణుడగుచు–మిగతా సమానము.

తాత్పర్యము : భద్రముతో నొప్పి దిక్కులకు వ్యాపించిన కీర్తిగల ధర్మరాజు భూమిపై తన నలుగురు సోదరులు సేవించు పాదములుగలవాడై రాజ్యపాలనము చేయుచుండగా దేశము సుభిక్షముగానుండెను. మిగతా సమానము.

విశేషణము : కావ్యాదిని శ్రీకారము, కావ్యాంత పద్యమున శ్రీకారము కవి శుభప్రదముగా నుంచెను.

శా. దేవాదేవర ప్రేరణంబునన యుద్దీపించువాగ్వైభవ
శ్రీవిస్ఫూర్తిని రామభారతకథాశ్లేష ప్రబంధోత్తమ
వ్యావిర్భావము నిట్లు సెందె నిది భవ్యాభవ్యత ల్చూడకిం
పై వర్తిల్లఁ బరిగ్రహింపుము విరూపాక్షా జగద్రక్షకా! 262

అర్థము : విరూపాక్షా=త్రినేత్రా! జగత్+రక్షకా!=లోకరక్షకా! దేవా=దేవా! దేవర ప్రేరణంబునన=దేవతల యొక్క ప్రేరేపణ యనునట్లు, ఉద్దీపించు=ప్రకాశించు, వాక్+వైభవస్ఫూర్తిని=వాక్కుల యొక్క విభవత్వ స్ఫూర్తిచే, రామభారతకథా=రామాయణ భారతగాధల, శ్లేష=శ్లేషతోగూడిన ప్రబంధోత్తమవ్యావిర్భావము=ఉత్తమ ప్రబంధము యొక్క పుట్టుక, ఇది=ఈ గ్రంధము, ఇట్లు+చెందెన్=ఇట్లు వచ్చెను, భవ్యాభవ్యతల్+చూడక=మంచి చెడులు చూడక, ఇంపై వర్తిల్లన్=ఇంపగునట్లు, పరిగ్రహింపుము=స్వీకరింపుము.

తాత్పర్యము : విరూపాక్షా! జగద్రక్షకా! దేవా! మీ యొక్క ప్రేరణమనునట్లు ప్రకాశించు వాగ్విలాస సంపద స్ఫూర్తితో రామభారత కథలు ఉత్తమ శ్లేష ప్రబంధముగా ఆవిర్భావము చెంది ఈ గ్రంథము ఇట్లు చెందెను. దీని భవ్యాభవ్యతలు చూడక ఇంపగునట్లు స్వీకరింపుము.

శా. క్రీడామాత్రకృత త్రిమూర్తిభరణాంగీకారచూడాపరి
భ్రాడాదిత్యధునీపృషత్పుషితపంపాశైత్య వేధోమరు
ద్రాడారాధితపాద యంఘ్రినఖచంద్రద్యోతసిద్ధ్యత్పరి
వ్రాడాఖండలమండలీ హృదయజీవంజీవసంజీవనా! 263

అర్థము : క్రీడామాత్రకృత=వినోదమాత్రముచే చేయబడిన, త్రిమూర్తి=బ్రహ్మావిష్ణు మహేశ్వరుల యొక్క, భరణ=ధారణము యొక్క, అంగీకార=అంగీకారము

గలవాడా! చూడా=శిఖయందు, పరిభ్రాట్=ఒప్పుచున్న, ఆదిత్యధునీ=దేవనదియొక్క పృషత్=బిందువులచే, పుషిత=పోషింపబడిన, పంపాశైత్య=పంపానదియందలి శీతలత్వముగలవాడా! వేధః=బ్రహ్మచేతను, మరుత్=దేవతలకు, రాట్=రాజైన ఇంద్రునిచే, ఆరాధిత=సేవింపబడిన, పాద=పాదములుగలవాడా!, అంఘ్రిం= పాదములందుగల, నఖచంద్ర=గోళ్లు అనెడి చంద్రుల యొక్క, ద్యోత=ప్రకాశముచే, సిద్ధ్యత్=సిద్ధించుచున్న, పరివ్రాట్= యతీశ్వరులకు, ఆఖండల=ఇంద్రులైన బ్రహ్మర్షుల యొక్క, మండలీ=సమూహము యొక్క, హృదయ=హృదయములనెడి, జీవంజీవ= చకోర పక్షులయొక్క, సంజీవనా=సంజీవనముగలవాడా!

తాత్పర్యము : వినోద మాత్రముగా సృష్టించిన త్రిమూర్తుల ధారణము అంగీకారముగాగలవాడా! శిఖయందు ఒప్పుచున్న దేవనదీ బిందువులచే పోషింపబడిన పంపానదీ శీతలత్వము గలవాడా! బ్రహ్మచే, దేవతాధినాధుడైన ఇంద్రునిచే సేవింపబడిన పాదములు గలవాడా! పాదములందుగల నఖచంద్రుల ప్రకాశముచే సిద్ధించుచున్న యతీశ్వరులకు ఇంద్రులైన బ్రహ్మర్షుల సముదాయ హృదయములనెడి చకోర పక్షులకు జీవము కలిగించువాడా!

కం. కారుణ్య విభవ లక్ష్మీ
తారుణ్య సదోపభోగ ధన్య కటాక్షా
శారీరార్ధ సులాలిత
గౌరీరారజ్యమాన క్రమాపేక్షా! 264

అర్థము : కారుణ్యవిభవ=దయాతిశయము యొక్క, లక్ష్మీ=సంపదయనెడి, తారుణ్య=యౌవనము యొక్క, సదా+ఉపభోగ=నిత్యానుభవముచే, ధన్యకటాక్షా= ధన్యమైన కటాక్షము గలవాడా! శారీర=శరీర సంబంధమైన, అర్ధమందు=అర్ధ శరీరమునందు, సులాలిత=చక్కగా లాలించబడు, గౌరీ=గౌరీ దేవియందు, రారజ్యమాన=మిక్కిలి ఆసక్తి గలవాడవై, క్రమ+అపేక్షా!=మనోజ్ఞమగు అపేక్షగలవాడా!

తాత్పర్యము : దయాతిశయమును, సంపద యౌవనమును నిత్యానుభవముచే

ధన్యమైన కటాక్షముగలవాడా! (కటాక్షమునకు కారుణ్యమే యౌవనమైనవాడా) అర్థ శరీరమునందు చక్కగా లాలింపబడు గౌరీదేవియందు ఆసక్తి గలిగి మనోజ్ఞమగు అపేక్షగలవాడా!

కలహంసవృత్తము :

హిమనగాద్రి తనయేక్షణలక్ష్మీ
స్తిమితపుణ్య ఫల దేహవిలాసా
విమలభక్తిపెద వేంకటధాత్రీ
రమణమానస నిరంతరవాసా! 265

అర్థము : హిమనగాద్రి తనయేక్షణలక్ష్మీ=హిమవత్ పర్వతరాజపుత్రి యొక్క చూపుల సంపదగలవాడా! స్తిమిత పుణ్యఫల=స్థిరమైన పుణ్యఫలములచే, దేహవిలాసా=శరీర సౌందర్యము గలవాడా! విమలభక్తి=స్వచ్ఛమైన భక్తి నిండిన, పెద వేంకటధాత్రీ రమణ=పెద వేంకటరాజు, మానస నిరంతరవాసా! మనస్సునందు నిత్యము నివసించువాడా!

తాత్పర్యము : హిమవత్పర్వతపుత్రి చూపుల సంపదగలవాడా! స్థిరపుణ్య ఫలముల శరీర సౌందర్యముగలవాడా! స్వచ్ఛమైన భక్తి నిండిన పెద వేంకటరాజు మనస్సున నిత్యము నివసించువాడా!

విశేషణము : కలహంస వృత్తమునకు – న – భ – జ – త గణములు. 8వ అక్షరము యతి స్థానము.

గద్యము. ఇది నిఖిల సూరిలోకాంగీకారతరంగిత కవిత్వ వైభవ పింగళి యమరయార్య తనూభవ సౌజన్య జేయ సూరయ నామధేయ ప్రణీతంబైన రాఘవపాండవీయమునందు సర్వంబును జతుర్థాశ్వాసము.

గద్యము. ఇది శ్రీమన్మదన గోపాలకృపాకటాక్ష సంప్రాప్త సారసారస్వత సంపదానంద నందవరకుల క్షీరపారావారారాకాసుధా దామ ముద్దరాజు

గణపయామాత్య పెదరామధీమణి ప్రదర్శితంబైన రాఘవపాండవీయాదర్శంబునందు సర్వంబును జతుర్థాశ్వాసము.

రాఘువ పాండవీయ కృతికి వావిళ్ల మహోదయుల ప్రేరణచే ఆ శ్రీరామచంద్రుని ప్రసాదముచే డా॥ రేవూరు అనంతపద్మనాభరావు సమకూర్చిన టీకా తాత్పర్యము సంపూర్ణము.